TIGHT BINDING BOOK

BROWN BOOK

UNIVERSAL
LIBRARY
OU_204183
UNIVERSAL
LIBRARY

సాహిత్య సమీక్ష

(వ్యాస సంపుటి)

తెలుగు నిఘంటువులు
కావ్యములు; వ్యాఖ్యానములు.

వ్యాసకర్త
దీపాల పిచ్చయ్యశాస్త్రి
నెల్లూరు

ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజార్, హైదరాబాద్

1955

స్వస్వామ్యసంకలితము]

[మూడు రూపాయలు

పండితాభిప్రాయములు

'విద్యారత్న'

శ్రీ నిడదవోలు వేంకటరావుగారు, M. A.

Head of the Telugu Department, University of Madras.

(5-1-56)

"మీరు సాదరపూర్వకముగా నంపిన సాహిత్యసమీక్ష (వ్యాస సంపుటి) గ్రంథము చేరినది. అందున్న వ్యాసము లా యా పత్రికలలోను, సంపుటములలోను ప్రకటింపబడిన నాటినుండియు, నవి యెన్న డైన గ్రంథ రూపమును దాల్చునా, సాహిత్యోపాసకులగు నస్మదాదుల కనవరతము నుపయోగపడునా యని యువ్విళ్లూరుచుంటిని. నేటికి నా యభిలాష సఫలీకృత మైనది. కృతజ్ఞుఁడను.

మీ నిశితవిమర్శనాసామర్థ్యము, నిర్దుష్టపాండిత్యము, నిరుపమాన సాహితీవేత్తృత్వము ప్రతిపుటయందును నీ గ్రంథమున ప్రతిబింబించు చున్నవి. మీ గ్రంథము సమీక్షయే కాదు. భాషావిశేషప్రయోగ కుంజూషి.

"ఆంధ్రభాషారాధనకు ప్రాచీనకావ్యరక్షణ మవశ్యకర్తవ్యము" అను వాక్యమున ప్రత్యక్షరము సత్య మని మీ గ్రంథము బుజువుచేయు చున్నది.

మీరు 'ముక్కోటి'నాడు ప్రకటించుట విశేషమే. ముక్కోటి ఏకాదశి వైష్ణవములో నున్నది. శ. ర.లో లేదు.

"ఏటికివచ్చు తీర్థచయ మేఁబదిలక్షలతోడఁగూడ ము
క్కోటికి నంచుఁ బల్కు మునికోటులు"

అని తాళ్ళపాక పెదతిరుమలయ్య వేంకటేశ్వరాహరణమున నున్నది. మీతో సంప్రతింపవలసిన వెన్నోగలవు. అవకాశము లభించు చుండుట గాక,

కావ్యభావనకు తగిన వ్యాఖ్యారచనము ఎప్పటనో కుంఠితమయింది. భావరసోన్మేషమునకు వలసిన వ్యాఖ్య చూడాలని ఉంటుంది. సమయ సంకేతానికి ఇంకా కేతనములేదు. భావనచేసే భావుకులు లేరనడము అపచారము. భావుకుల భావనకు భావధారలు ఏ ప్రభాతములోనయినా ప్రతిభాతములగునో? అనుకుంటాను.

కోశములు నిఘంటువులు వ్యాఖ్యలున్నూ "వాసాంసిజీర్ణాని విహాయ"— నవ కంచుకాలు ధరించాలని నన్ను అననివ్వండి! భాషా సంగరములో మీరు ఆయుధాలు ధరించారు. మాకు కావలసిన వానిని మీరు అందరూ సాధించండి. మేము శిరఃకంపనము చేస్తాము.

సంస్కృతాంధ్ర కర్ణాట భాషాకోవిదులు, అనంతపురంజిల్లా వజ్రకరూరు హైస్కూలు పండితులు, విద్వాన్, వైద్యవిద్వాన్, కవీశ్వర
శ్రీ ఆలూర్ గొల్లాపిన్ని వాసుదేవశాస్త్రిగారు.

తమ రొసంగిన 'సాహిత్యసమీక్ష'ను పనులతొందరలో నచ్చటచ్చట చూచితిని. అందలి వాదప్రతివాదముల పొంకమును గమనించితిని. మి మ్మెరుంగని యధాజాతులు మిమ్ము నేమన్ననూ అయ్యవి నూర్యముఖాన దుమ్మచల్లినవితంబున నన్నవారిపై వెనుదిరుగునవే. కాన వానిం దడవబనిలేదు. మీ చక్కని సాహిత్యసమీక్ష కాంధ్రవిద్వల్లోకము కృతజ్ఞము.

(1) ఉద్ది - ఇది కన్నడశబ్దము. మా ప్రాంతములో ఉద్దిచేను, ఉద్దిబేడలు అని వాడుకలున్నవి. ఉద్దుచేను - ఇత్యాదులులేవు.

(2) అగ్రపుస్తకములు - అని పక్షిప్రశ్న మొదలగు శాకునశాస్త్ర గ్రంథములకు పేరున్నది. కొందరు రామాయణాదిగ్రంథములనియునూ అందురు.

(3) వైద్యమిచ్చు - ఇదియును మందిచ్చు నను నర్థమున మా సీమలో వాడుకయం గున్న పదమే.

(4) జలపోత, కయ్యముపొడుచు - అను పదములు వాడుకలో లంగినవై ప్రాబంధికరచనలలో మీరు వ్రాసినయర్థములు గలవై యున్నవి.

విద్వత్కవిశేఖరులు,

శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు, బి.యే., బి.యల్.

సాహితీసమితి. (శ్రీ గి ది) రేపల్లె. (18-3-56)

'సాహిత్యసమీక్ష' సమగ్రముగా పరిశీలించినాను. అందులో అడుగడుగునా మీ భాషాపరిశ్రమ వ్యక్తమవుతున్నది. ప్రతివిషయములోను మీ వాదములు యుక్తియుక్తములుగా ఉన్నవి. తెలుగుపుస్తకముల అచ్చుప్రతులు నిర్దుష్టములుగా లేవు. ఎక్కువభాగము మీరు అచ్చుప్రతుల మీదనే ఆధారపడుటచేత, వ్రాతప్రతులలో ఎట్లావున్నది ఇక్కడ, అనే సందేహము మాత్రము మధ్యమధ్య కలుగుతున్నది. వ్రాతప్రతులు పరిశీలించినమీదట, మీ సిద్ధాంతాలు కొన్ని పరాస్తము కావచ్చును. ఏమైనా మీ కృషి బహు శ్లాఘ్యమైనది.

సూర్యరాయాంధ్రనిఘంటు నిర్మాతలును ఇతర గ్రంథకర్తలును మీ విమర్శలు సద్భావముతో గ్రహించి, ముందు ముందు ముద్రణములలో అవసరమైన సవరణలు చేసికోగలరని నా విశ్వాసము. ప్రమాణభూతములుగా ఉండే గ్రంథాలలోని, ఎంత చిన్నలోపాలు ఎంత కటువుగా ప్రదర్శించినా, ఆ గ్రంథనిర్మాతలు సహృదయతతో శిరసావహించవలె! తీవ్రవిమర్శ ఆవిమర్శకునికి ఆగ్రంథమందుగల గౌరవమునే మరొకరూపాన అభివ్యక్తము చేస్తుంది. మీరుచూపిన లోపాలలో చిన్నవే కాక పెద్దవీ ఉన్నవి. మీ విమర్శకూడా, ఎక్కడోకొకని, పరుషాక్షరముగా లేదు.

మీ గ్రంథము పండితులంతా గమనింపవలసినదని నా నిశ్చయము.

ప్రస్తావన

తెలుఁగు నిఘంటువులు

భాషకు సంబంధించిన శబ్దము, అర్థము, భావము, రసము, అలంకారము, ఛందస్సు, వ్యాకరణము మొదలయిన సకలాంశముల సమష్టి జ్ఞానము సాహిత్యము. సాహిత్యమునకు శబ్దము, అర్థము ప్రధానములు. శబ్దస్వరూపమును, దాని యర్థమును సప్రమాణముగను - సమగ్రముగను నిరూపించి చెప్పవలసినవి నిఘంటువులు. కావున నవి నిగుష్టములై యుండవలెను. వానిలో ప్రమాదము లుండరాదు. ఉండెనా, ఆ ప్రమాదములు కాలక్రమమున గ్రంథములలో ప్రవేశించుటయు, తన్మూలమున భాష కలుషిత మగుటయు, ప్రయోక్తలు హాస్యపాత్రము లగుటయు అనివార్యమగును.

తెనుగుభాషకు నిగుష్టము - సమగ్రమునైన నిఘంటువు లేదు. ఉన్నంతలో చెప్పుకోదగిన నిఘంటువులు రెండు. అందు మొదటిది శ్రీ సి. పి. బ్రౌనుదొరగారి బ్రౌణ్యము; రెండవది శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులవారి శబ్దరత్నాకరము.

బ్రౌణ్యము-సకల జనోపయోగార్థము సంతరింపబడిన పెద్ద నిఘంటువు; వ్యావహారిక ప్రధానము.

శబ్దరత్నాకరము - బళ్లియందు చదువుకొను విద్యార్థుల యుపయోగార్థము సంతనచేయబడిన చిన్న నిఘంటువు; గ్రాంథిక ప్రధానము.

శబ్దానుశాసనులకు శ. ర. కంటెను బ్రౌణ్యమే యెక్కువగా నుపకరించుచున్నది. జాతీయములైన తెనుగునుడుల సంప్రదాయార్థములను గుర్తించుటలోను విశదముగా వివరించుటలోను బ్రౌనే సమగ్రుడు.

ఏ విషయమునైనను సుఖముగను - ధారాళముగను తెలుపుటకు వాడుకభాషయే గాని *గ్రాంథికభాష అనువైనదికాదని యాతని మతము. అందువలన నాతడు అరసున్నల నాదరింపలేదు; బండిరాలను పాటింపలేదు;

---

* "In composing this work I have had the approbation of many learned assistants. But some (sastris)

లక్షణమును లక్ష్యముచేయలేదు. తన వివరణమంతయు వాడుకభాషలోనే వ్రాసినాడు.

శబ్దరత్నాకరముకు భ్రాణ్యమే సంచిమొదలు. శ.ర.లోని పదములు చాలవరకు భ్రాణ్యములోనివే. పదములేకాదు; ఒక కొన్ని అర్థవివరణవాక్యములనూ అక్కడివే. ఆచార్యులవారు భ్రాణ్యమునుండియు, మరికొన్ని యితర నిఘంటువులనుండియు పదముల నెత్తివ్రాసికొని, తాము స్వయముగా సేకరముచేసిన పదసముదాయమును వాటితో చేర్చి, అన్నిటికిని అర్థానుస్వారశకటరేఫము లమర్చి - గ్రాంథికపరిచి ఆ నిఘంటువును తయారుచేసినారు. అప్పటినుండియు గ్రాంథికభాషకు, విద్యార్థులకు-విద్వాంసులకుకూడా అదియే ప్రమాణమైనది.

శ.ర. గ్రాంథిక నిఘంటువైనను, శ.ర. కర్త, అర్థవివరణమునను, కొన్ని మూలపదములలోను, తన పీఠికలోను వాడినది అంత నికరమైన గ్రాంథికము కాదు. *అందు దుస్సంధులు; విసంధులు; లక్షణదుష్ట శబ్దములు; వ్యావహారికరూపములు మొదలయినవి కనబడుచున్నవి. మొత్తము మీద ఆ భాష నేటి వ్యావహారికమునకు పూర్వరూప మనదగియున్నది.

---

scholars have disapproved the spelling here exhibited. Instead of that found in poems and used in ordinary life they wish us to practice a pedantic style; which is admired because conceited and far from clear. Such refinements are disregarded by men of real learning, who are therefore considered vulgar by some who are inferior in sound scholarship." (Preface)

* 'నిఘంటువులో యీ దేశభాష'— 'అయినను అందు'— 'విత్తనష్టమును...పాటింపక'— 'నాయఁడు...లేఖరిగానుండి'— 'ఎటువంటి బుద్ధిశాలురకును'— 'జున్ను = పియ్యూషము'— 'ఎక్కలి = ...కమ్ము కొనినయిసుక'— 'లక్షణంబులకు లోపడని'— 'మునిమునిచీఁకటి = ప్రొద్దు క్రుంకీక్రుంకక మునుపు పర్వు...చీఁకటి'— 'నీరుపదును'— ఇత్యాదులు.

బహుజనపల్లి వారు బ్రౌణ్యములోని పదములనూ - అర్థములనూ తీసికొనుటలో చాలాపదములను వదలివేసినారు. అది తప్పుకాదుగాని, తీసికొన్న పదములలో కొన్నిటికి, అర్థములు పూర్తిగా వ్రాసికొనక *ఆరగొరగా వ్రాసికొన్నారు; కొన్నిటికి, బ్రౌణ్యములో సరియైన అర్థమున్నను చక్కగాచూడక తప్పర్థములు చెప్పినారు. అదితప్పు. ఈవిధముగా వారి నిఘంటువులో అసమగ్రార్థములు, అపార్థములు, అపపాఠములు, అపసిద్ధాంతములు, అపశబ్దములుకూడా చేరియున్నవి. అవి పెద్దపెద్ద పండితుల వ్యాఖ్యానములలోను, ఇతర నిఘంటువులలోను ప్రవేశించుటయు జరిగినది.

---

* శ.ర. ఆరగొరగా వ్రాసుకొన్న ఘట్టమును, అందువల్లగలిగిన అనర్థమును తెలుపుట కొక్క ఉదాహరణము.—

'రూక' అను పదమునకు బ్రౌణ్యములో,—"రూక-A silver coin, sometimes equal to two and sometimes to four annas. A two-anna piece.—....చిన్న మెత్తు వెండిబంగారముల నాణెము. చిన్నరూక a single two anna piece పెద్దరూక the coin called a quarter of a Rupee.—రూకలు = ధనము..." అనియు, మరికొన్ని విశేషములును చెప్పబడియున్నవి.

శ.ర. లో, "రూక=1. ధనము; 2. చిన్న మెత్తు వెండిబంగారముల నాణెము" అనిమాత్రమే యున్నది. ఆచార్యులవారు, బేడ; పావలా అన్న అర్థములను వదలివేసినారు.

అందువల్లవచ్చిన అనర్థమేమంటారా! 'విజయ'—'పాండురంగ'ములకు టీకలువ్రాసిన పండితులు శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు, 'లప్పలతోడఁ గ్రొంబెరుగు లక్ష్మణవజ్ఝలయింట రూకకుఁ'-అన్న క్రీ.రా. పద్యములోని 'రూక'కు, రూపాయి అని యర్థముచేసుకొని, "మంచన శర్మ లక్ష్మణవజ్ఝలయింట్లో (పూటకూలి) ఒకరూపాయి యిచ్చి భోంచేసినట్లు శ్రీనాథుడు వర్ణించాడు" అన్నారు. (1944 జూలై, భారతిలో,-'పాడబమంచే పులుసు'అని వ్రాస్తూ). పైపద్యములోని రూక, 'బేడ'గాని రూపాయి కాదు. మరి ఆ పండితు లలా యెందువల్ల అనుకొన్నారు? శ.ర. లో 'రూక=బేడ' అని లేనందువల్లనూ, 'చిన్న మెత్తు వెండినాణెము' అని యున్నందువల్లనున్నూ.

బ్రౌణ్యమున పొరపాటులు లేకపోలేదు. కాని బ్రౌను ఈ దేశము వాడు కాడు; ఈ భాషవాడు కాడు. కావున ఆ దొసగులు కొంతవరకు క్షంతవ్యములు కావచ్చును. కాకపోయినను అంత చిక్కు లేదు. పండితులకు బ్రౌణ్యము ప్రమాణము కాదు. కావున దానిని చూచువారే అరుదు. పలువురు దాని పేరుగూడా వినియుండరు.

ఏది యెట్లున్నను, వ్యావహారికభాషకు బ్రౌణ్యమును, గ్రాంథికభాషకు శబ్దరత్నాకరమును నేడు మన కుపాదేయములై యున్నవి. ఆ రెండు నిఘంటువుల తోడ్పాటే లేకపోతే యీనాడు ఆంధ్రభాషోపాసకుడు అంధకారమున అయోమయస్థితిలో పడియుండవలసినవాడే. కాని ఆ రెండుకొరముల కలయికవల్లనైనను తెనుగుబాసకు గల అక్కర తీరలేదు. సర్వలక్షణసంపన్నమైన సమగ్రనిఘంటువు లేనిలోపము మాత్రం నిలిచియున్నది. ఆ లోపము తీర్చుట కేర్పడినదే,—

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు.

శ్రీ శ్రీ శ్రీ పీఠికాపురాధీశ్వరుల మహౌదార్యమున ప్రవర్తిల్లిన ఆ బృహన్నిఘంటువు తెనుగుతల్లి కొక అనర్ఘభూషణము కాదగినది. ఆ కారముచేతను-గుణముచేతనుగూడా చాలా పెద్దది. ఇప్పటికి వెలువడిన నకారమువరకే 4సంపుటములు;దాదాపు 3850 పుటలు. అది పూర్తియగుచో

రూపాయి చిన్న మెత్తే యుండునో, తులమెత్తే యుండునో, రూపాయీ అన్న అర్థము పైపద్యమున సరిపడునో, సరిపడదో ఆ విచారము వారి కెందుకో? శ.ర. లో 'వెండినాణెము' అని యున్నదిగనుక రూపాయి అనుకొన్నారు. అంతే.

శ.ర. లోని అసమగ్రార్థము, ప్రౌఢకావ్యములకు టీకలువ్రాయు పండితులనే యిట్లు తప్పుదార్లకు లాగినదంటే, ఇక సామాన్యులమాట చెప్పవలెనా?

ఇక్కడ ఇంకొక విశేషము: 'చిన్న' మనగా—నాలుగు గురిగింజల యెత్తు. ఇదియును బులుసు-పండితు లెరుగరు. ఎరిగియేయున్నచో 'చిన్న మెత్తు వెండినాణె' మంటే రూపాయీ అనుకొనుటే పొసగియుండదు గదా!

ఆంధ్రభాషకు పర్యాప్తమైన నిఘంటువు లేదన్నలోపము చాలమట్టుకు తీరిపోవచ్చును.

కాని బహుకాలపరిశ్రమకును, బహుధనవ్యయమునకును, ఫలితమైన ఆగొప్ప నిఘంటువునకును తప్పుల లెక్కలి తప్పలేదు. సూ.ని. పండితులు శ.ర. లోని తప్పర్థములను-తప్పుపాఠములను ఆళ్లే తీసికొన్నారు. కొన్ని యెడల బ్రౌణ్యమును, శ.ర. ను, ఇతరనిఘంటువులను సరిగా చూడకయు, చూచియు సరిగా అర్థముచేసికొనకయు అసమంజసార్థములు వ్రాసినారు.

అంగుకు కారణ మిట్లుండవలెనని నా యూహ.— నిఘంటుకార్యమున పండితులతోపాటు, భాషానుభవముచాలని పెద్దలు కొందరు నియుక్తులై యుందురు; అట్టివారి వ్రాతలను ఆపండితులు వారిమీది సమ్మకముచేతనో-పరిశీలింప పాలుమాలియో ఆళ్లే అంగుకొని గ్రంథమున చేర్చియుంగురు. కాచేని, పూర్వనిఘంటువులలోను ఆయీ పండితుల వ్యాఖ్యానములలోను ప్రమాదపతితములైన అర్థదోషములు - పాఠదోషములున్నూ, పండితపరిష్కృతములుకాని ముద్రితప్రాచీనకృతులలోని తప్పు పాఠములూ-తుదకు అచ్చుతప్పులున్నూ సూ.ని. లోని కేల చేరియుండును? పండితుల కడగంటిచూపు సోకియున్నను ఆతప్పు లప్పుడే ఒప్పులుగా మారియుండవా? నిఘంటువు నిర్దుష్టమై యుండదా?

ఏతద్విమర్శ ప్రసక్తి

సూర్యరాయనిఘంటువును నే నింతగా పరిశీలించుటకును, ఈ విమర్శ ప్రకటించుటకును మూల మేమనగా:—చేమకూర వేంకటకవి సారంగధరచరిత్రకు నేను టీక వ్రాయునప్పుడు, అంతకు మునుపు శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారి పేర ప్రకటితమైయున్న ఒక టీకను పరికించుటలో, పాఠనిర్ణయమునకును - అర్థనిర్ణయమునకును సూ.ని. పలుమారు చూడవలసి వచ్చినది. అప్పుడు సూ.ని.లో పాఠదోషములు - అర్థదోషములుకూడా దాదాపు ఒక యిరువదియైయుదా కాని నాకగపడ్డవి. వాటి నన్నిటిని నేను నా టీకలో ప్రసక్తి ననుసరించి ఉట్టంకించి యున్నాను. వాటిలో కొన్ని వేదంవారివియు కలవు. ఆ సంగతి తెలుపుచూ, నేను నా ('జితకాశి') పీఠికలో,— 'వేదంవారు ప్రసిద్ధపండితులుగావున, వారిమీది విశ్వాసముచేత-

సూ.ని. వారి పాఠములను - అర్థములను అంతగా బరసిచూడక అట్లే గ్రహించినది' అన్నాను.

అది ఆ నిఘంటువుమీద లేని లోపముల నారోపించుటగా నిర్ణయించి, సూ.ని. పండితులలో నొకరైన శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో, ఇట్లొక సమాధానము వ్రాసినారు. (పార్థివనేత్ర-ఆషాఢసంచిక)

"('జితకాశి' వ్యాఖ్యానములో) శబ్దస్వరూపము నిర్ణయించుతఱి శ్రీ పిచ్చయ్యగారు శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువునుగూడఁ బ్రమాణీకరించుచు వచ్చిరి. కాని యచ్చటచ్చట శ్రీ సూ...నిఘంటువుపైఁ గొన్ని లోపము లున్నట్లు వీరారోపించి చూపిరి.— ...సూ.ని.లో గ్రహింపఁబడిన పాఠములు పదపదార్థములు నవిరుద్ధములని పాఠకు లెఱుఁగుదురుగాక. మొదటినుండియు బ్రామాణికులగు పెక్కు-రుపండితు లేకాభిప్రాయముగ నిర్ణయించిన పదపదార్థములనే పూర్వోత్తర విరోధములులేకుండ గ్రహించుట, సూ.ని. పరిపాటి. నాఁటికి నేఁటికి నీనిఘంటు నిర్మాణమున ఆ సరణియే గ్రహింపఁబడుచున్నది. ఇట్లుండ సూ.ని. హృదయము సాకల్యముగ నెఱుఁగకయే దోషముల నారోపించుట శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారి సాహసమాత్రమే యనియు, ఇట్టి యారోపణలు ప్రామాణిక నిఘంటువుపై అనాలోచితముగ ఇతరులు చేయకుండు రనియు నెఱిఁగించుటకే యింతవఱకు సమాధాన మీయవలసి వచ్చినది."

శ్రీ శాస్త్రిగారి సమాధాన వ్యాసములో నా పారపాటులు కొన్ని చూపి, 'కొండఁజేయు'-'ఆనఁబాడుచు' అను పాఠములు సాధువులే ననుమతమకు తోచిన యుపపత్తులను తెలిపినారు.

నేను నా పారపాటుల నొప్పుకొని *పాఠవిషయమున వారు చూపిన యుపపత్తులు శాస్త్రసమ్మతములు కావని (11-3-1946) 'త్రిలిఙ్గ'లో స్పష్టపఱచినాను. వారు బదు లేమియు వ్రాయలేదు.

సత్య మిట్లుండగా, వారు తమ సమాధానములో - వెనుక నేను చూపిన పాఠదోషములన్నియు నిరస్తములైనట్లు, - నన్ను తార్కాణగా

---

* చూ. ఈ సమీక్షలో, పుట 38, 81.

చూపి,-'ఇట్టి యూహాపోహలు.....ఇతరులు చేయకుండురని యెఱిగించుటకే యింతవఱకు సమాధాన మీయవలసి వచ్చినది' అని భావి విమర్శకులను హెచ్చరించుట సరియగునా? సాహస మనిపించుకొనదా?

శ్రీ శాస్త్రిగారి హెచ్చరికవాక్యము చదివిన తరువాత సూ.ని. స్వరూపతత్త్వమును కొంచెము విపులముగా ఆ శాస్త్రి గారికిని - విమర్శక లోకమునకును తెలుపక మిన్నకుండుట శ్రేయము కాదని తోచినది. అందువల్ల "ప్రామాణికులగు పెక్కురుపండితు లేకాభిప్రాయముగ నిర్ణయించిన పదపదార్థముల నే పూర్వోత్తర విరుద్ధములు లేకుండ గ్రహించుట సూ.ని. పరిపాటి" అన్న శాస్త్రిగారివాక్య మెంతవరకు సత్యమో పాఠకులే నిర్ణయింతురుగాక యని,— ఆ నిఘంటువులలోని పూర్వాపరవిరుద్ధసిద్ధాంత ములనూ, శ.ర. నుండియు, వేదంవారి గ్రంథములనుండియు ఆ నిఘంటువు గ్రహించిన తప్పు పాఠములనూ-తప్పర్థములనూ ఒక కొన్నిటి నెత్తిచూపుచూ ఈ విమర్శ వ్రాయవలసివచ్చినది. అంతేగాని, గొప్పపండితుడనన్న అహంతచే గాని, లేనిలోపము లారోపించి ఆ ప్రామాణికనిఘంటువు ప్రతిష్ఠను కొంచె పరుపవలెనన్న దురుద్దేశముతోగాని, యే వ్యక్తియందలి ద్వేషముచేతగాని నే నీ విమర్శకు పూనుకొనలేదు.

ఆసలు, ఇది సాహిత్యసమీక్షగాని కేవలము సూ.ని. సమీక్ష కాదు. ఇందు ప్రౌఢ్యము, శబ్దరత్నాకరము, మొదలగు నితర నిఘంటువులును, మనుచరిత్ర శృంగారనైషధ ప్రభృతికావ్య పాఠవ్యాఖ్యానాదులును విమృష్టములై యున్నవి.

నిఘంటువులలోని తప్పులు కావ్య వ్యాఖ్యానాదులకును, వాటినుండి మరల నిఘంటువులకును, వాటినుండి పిమ్మటి గ్రంథజాలమునకును చేరుచుండుటవలన సాహిత్యమునకు మూడుచున్నముప్పును విప్పి చెప్పుట యీ సమీక్ష ముఖ్యోద్దేశము.

నా ఈ విమర్శలో, సూ.ని.లోని పాఠదోషములు-అర్థదోషములు నూటికిపైగా మాపబడినవి. అందు నాల్గవవంతు వేదంవారికి సంబంధించినవి. ఇది శ్రీ దూ.సూ.నా. శాస్త్రిగారు ముఖ్యముగా గమనింపవలసిన విషయము.

నేను భాషతో ఒకపాటి పరిచయముకలవాడనేగాని పండితుడను కాను గనుక, ఈ పరామర్శలో నా యపరిజ్ఞానమునను - ప్రమాదవశమునను పొసగిన దోసగులను తెలుపవలసినదిగా పండితులను కోరుచూ - వ్యాసమును త్రిలింగపత్రికలో, (1946 సెప్టెంబరులో) ప్రకటింప మొదలిడినాను.

నా వ్యాసము పూర్తికాకముందే కవిరత్న-శ్రీరామ్ వీరబ్రహ్మకవి-అనువారు, 'నా సందేహములు' అను శీర్షికతో, నా పరామర్శలోని ప్రతి యంశమును ఆక్షేపించుచూ వ్యాసమొకటి ప్రచురింప దొడగినారు. అది కొండవీటి చేంతాడయినది.

త్రిలింగ పత్రికాధిపతులు 'విమర్శనమున వాదప్రతివాదము లెఱింగిన గాని సత్యము తేలదను నుత్తమాశయము గలవారు' గావున శ్రీ వీరబ్రహ్మం గారి వ్యాసమునుగూడా తమ పత్రికలోనే ప్రచురించినారు. అంతేకాదు; ఈ సర్చనుగూర్చి యితర పండితులు వ్రాసిన *యు తమవ్యాసముల నన్నిటిని అల్లే ఆదరించినారు. సాహిత్యక్షేమాపేక్షతో, నిష్పక్షపాతముగా భాషాచర్చల కిట్లు సంపూర్ణావకాశమిచ్చు పత్రిక నేటి త్రిలింగ ఒక్కటియే యనుటలో అతిశయోక్తి లేదు.

శ్రీ కవిగారి ఆక్షేపములవలన నా ప్రమాదములు కొన్ని తెలియవచ్చు ననియు, వాటిని సవరించుకొనవచ్చుననియు నే నాసపడితిని గాని నా

---

* వ్యక్తిదూషణ బహుళములుగా నున్నవన్న హేతువున శ్రీ రాళ్లభండి వేంకటసీతారామశాస్త్రిగారి 'సమీక్ష', శ్రీ శంకరప్రసాదుగారి 'తోచిన అభిప్రాయము' మొదలైన కొన్ని వ్యాసములను ప్రకటింపమని పత్రికాధిపతు లిట్లు తెలిపినారు.

"అస్మావధాని శ్రీ బండి వేంకటరామిరెడ్డిగారి ఆఱు వ్యాసములు ప్రకటించితిమి. తిరిగి ఆఱు వ్యాసములు వచ్చినవి. పఠించిచూడగా వీనియంగు భాషావిషయిక మటుండనిచ్చిన వ్యక్తిగతముగ రెండుపక్కము లేర్పడినట్లు స్పష్టమగుచున్నది. ఇప్పటి మనకు కావలసినది భాషావిషయము గాని దూషణభూషణము లెంతమాత్రమును గావు. వ్యక్తిగతములను నిస్సారములగు చర్చలు ప్రకటించుచున్నచో మా పత్రికయేగాదు తెలుగు దేశములో నే పత్రికయు నిలుపలేదు. కావున పైవానిలో శ్రేష్ఠముగ నున్న శ్రీ ఉత్పల వేంకటరంగాచార్యులవారి వ్యాసములను ప్రకటించి మిగిలినవానిని ప్రకటింపమని మనవిచేయుచున్నాము." (30-6-1947)

యాస ఆడియాసయేయైనది. వారి వ్రాతలు నాకు అనవసరమైన శ్రమను కలిగించినవేగాని లవలేశమును ఉపకరింపలేదు.

వారిది మన మామూలుపాండిత్యము కాదు. వారి వ్యాకరణము వేరు; వారి ఛందోజ్ఞానము వేరు; వారి అన్వయపద్ధతి వేరు; వారి వాద సరణియే వేరు. అంతా లోకాతీతము.

మాదిరి కొక కొన్ని వాక్యములు.—

(1) "దంత్యములు తెలుగుశబ్దములలోనేగాని సంస్కృతశబ్దములలో లేవు. కావున తద్భవములయిన చారు.జడలను, చోరు; జోడ-అనగూడదు."

(2) "జటాశబ్దము తత్సమమునను తద్భవమునను 'జడ'యై ఇందలి జ తాలవ్యముగను - దంత్యముగను వ్యవహరింపబడును."

(3) "రాజు + ఆజ్ఞ = రాజాజ్ఞ. ఇందలి జా ఆకారముతో గూడి యున్నను తత్సను మగుటచే తాలవ్యమైనది."

(4) "వలరాజు. —'వల' యనునది తెలుగు. 'రాజు' అనునది మిశ్రమ సమాసము."

(5) "రాజ అనునది విశేషణమై యసంపూర్తిగానుండి యుత్తర పదమును వాంఛించుచుండును. రాజబాట."

(6) "ఉండుట యొక్క భావము ఉనికి."

(7) "పునరుక్తిదోషము తటస్థించి ఛందశ్శాస్త్రరీత్యాగూడా తప్పగుచున్నది."

(8) "ఆటవెలది, వృత్తము."

(9) "గీతపద్యము-అనరాదు; గీతిపద్య మనవలెను."

(10) "*ఉద్దులు-అను పదము, ఎద్దులు; ♦సుద్దులు-అనువానివంటిది. కనుక 'ఉద్ది' అను ఏకవచనరూపము పుట్టదు."

---

* "ఉద్దులకు ఏకవచనరూపము 'ఉద్ది' కావచ్చును. 'ఉద్దు' కావచ్చును"అని శ్రీయే.రా.చయనులుగారి (మధ్వస్థ)తీర్మానము.(7-7-47)

అది సరికాదు. అలా అయితే శ.ర.లోని 'ఉద్ది'ని వదలి నూ.ని. 'ఉద్దు' అనేలే? మద్దులు; సుద్దులు-అనుపదముల యేకవచనము మాటయేమి?

♦ "సుద్దులకు 'సుద్ది' యని యేకవచనరూప మున్నట్లు కవిగా రెఱుంగలేదు" అన్నారు. శ్రీ ఉ. వేం. రంగాచార్యులవారు. (7-7-47)

(11) "రలయోరభేదః - అన్న సూత్రముచేత, నీలాటిశేవు, నీరాట శేవయినది."

(12) "నీర + ఆట = నీరాట, నీరాటము(= స్నానము.) ఇది తత్సమసమాసము.— 'నీరాటవనాటములకు...' - అను ప్రాచీనరచనలు ప్రమాణములు."

(13) "నీర + ఆమని = నీరామని (వర్షఋతువు) ఇదియును తత్సమ సమాసమే."

ఇట్లెన్నని చూపను? వారి వ్రాత అంతా ఇట్టిదే. వారి వ్యాస భాగములు ఈ సమీక్షలో ఆయా విషయములక్రింద నున్నవి. వివరము లందు తెలియగలవు. (గ్రంథము పెరుగునన్న భయముచే వారి వ్యాసములలోని కొన్ని యంశములుమాత్రమే చూపబడినవి.)

శ్రీ కవిగారి వ్రాతలు సరియైనవికావని, శ్రీ వేంకటరామిరెడ్డిగారు, శ్రీ యేలూరిపాటి రామశ్చద్రచయనులుగారు, శ్రీమాన్ ఉత్పల వేంకట రంగాచార్యులవారు, శ్రీ మేడవరపు రామబ్రహ్మశాస్త్రిగారు త్రిలిఙ్గ ముఖముననే తెలిపియున్నారు. వారివారి వ్యాసభాగములున్నూ ఈ సమీక్షలో ఆ యా సందర్భములలో నుదాహృతములై యున్నవి.

'నిఘంటువు నొండు' అనుట సరికాదు; నిఘంటు వొండు – అని గాని, నిఘంటువు నొకటిని - లేదా నిఘంటువు నొకదానిని - అనిగాని అనవలెను-అన్న నా సవరణను ఆక్షేపించుచూ, (11-10-1948 త్రిలిఙ్గలో) శ్రీ శంకరప్రసాద్‌గారు, ('కవి'గారి పక్షమున)–'ఆశ్చర్య మాశ్చర్యము' అని యెలుగింపగా – (25-10-48 త్రిలిఙ్గలో) వ్యాకరణ విద్యాప్రవీణ, తెలుగుభాషాప్రవీణ, శ్రీ తంగిరాల వేంకటసుబ్బయ్యశాస్త్రిగారు 'ఆశ్చర్య నిర్మూలనము' కావించినారు.

ఈ వాదసందర్భమున 'కవి'గారు అపూర్వమైన ఒక ఘనకార్యము చేసినారు. అది యేమనగా : ఇద్దరు పెద్దల* నాశ్రయించి, తమవాదమే

---

* వారి సన్మానసంపాదనముకూడా ఇట్టిదిగానే తెలియుచున్నది.

"ఆ త్తవారింట్లో అల్లుడితోపాటు గిల్లుడికికూడ ఆదరమర్యాదలు జరిగినట్లు, రాణాప్రతాప కావ్యకర్త శతావధాని బ్రాహ్మణ దుర్భాక

సరియైనవైనట్లు—సర్టిఫికేట్లు వ్రాయించుకొన్నారు. వీ రెట్లడిగిరో, మరి వా రెట్లు వ్రాసియిచ్చిరో గాని, యిట్టివారు భాషాచరిత్రలో ఇంతకుముందు లేరు.

సర్టిఫికేట్లు ; వాటి వాలకము

(1) శ్రీ చిట్టూ బాలకృష్ణశాస్త్రిగారు, యం.ఏ. (బందరు)

"బందరు పురనివాసులు సుప్రసిద్ధకవులు...శ్రీరామ్ వీరబ్రహ్మకవి గారు త్రిలింగ పత్రికయందు 'నా సందేహములు' అను శీర్షికక్రింద నేబది యైదు వ్యాసములు ప్రచురించుట భాషామతల్లికి అత్యుత్తమ సేవచేయుట యని...యెంచనగును. వారి పరిశీలనజ్ఞానము,...విమర్శక (?) ధురంధ రత్వము ఆ వ్యాసములయందు గన్పించగలవు....శ్రీ దీ. పి. శాస్త్రిగారు ఏ గ్రంథములను ప్రమాణములుగ దీసుకొనిరో ఆ గ్రంథములనుండి... ఎక్కువగ పరిశ్రమచేసి, ఆన్వేషించి, పదప్రయోగముల విపులీకరించి, సముచితసందర్భముగ కవిత్రయహృదయము గ్రహించి చదువరులకు... సహాయముచేసి కవిగారు పేరెన్నిక గనిరి.

పాయదోలంగు, జిడ్డి, పైడాయగ, కడానిమెఱుంగు, పసిండి పాలకి-ముస్నగు వందలకొలది పదముల అర్థము స్పష్టీకరించుటలో వారికి వారే సాటి..."

ఈ సర్టిఫికేట్లు, ఉందూరివారన్న మొగమోటముచేతను, చుట్టుక చుట్టుక తిరుగుటవలన తప్పించుకోలేకను ఇచ్చినట్లున్నదేగాని, మాయుభయుల వాదములను చదివి, అందు కవిగారి ప్రజ్ఞావిశేషమును గుర్తించి - మెచ్చి యిచ్చినట్లు లేదు. విద్యావివాదములలో, సత్యనిర్ణయావసరములలో ఇట్టి యిచ్చకపువ్రాతలు నిరుపయోగములు. పై పదములకు సంబంధించిన

రాజశేఖరకవిగారితో పాటు, శతకరచయితలగు విశ్వబ్రాహ్మణ వీరబ్రహ్మేంద్రకవిగారికిగూడ నూటపదహార్ల సన్మానము జరిగింది; వదాన్యులు తిక్కవరపు రామిరెడ్డిగారి దయవలన. అంటే, రాజశేఖరుల కవితాప్రభావానికి, వీరబ్రహ్మేంద్రుల ఆశ్రితవాత్సల్యానికి (=ఆశ్రయింపునకు) సన్మాన మని తెనుగు అర్థము" (2-4-48 జమీ-తైతు పత్రిక.)

మరి, వారి బిరుదసంపాదనవిధాన మెట్టిదో!

చర్చ, ఇందు 125, 128 పుటలలో నున్నది. శ్రీ శాస్త్రిగారు పండితులని వినికి. వారిప్పుడైనను ఋజుహృదయముతో, నిదానముగా సరసి, తమకు సత్యమని తోచినమాటను సప్రమాణముగా లోకానికి తెలుపుట లగ్గు. పండితు లభిమానింపవలసినది భాషనుగాని, వ్యక్తులను కాదు.

(2) శ్రీయుత డాక్టరు గిడుగు వేంకటసీతాపతిపంతులు (బి.ఏ.యల్.టి., డి.లిట్.) గారు.

వీరి సర్టిఫికేట్లు చాలా పెద్దది. త్రిలిఙ్గ (13-12-1948) పత్రికలో, కొంచెము తక్కువగా నాలుగు కాలములు. కవిగారు కోరినారు గనుక వ్రాసియిచ్చినారట! అంగువల్ల నేకాబోలు! వారిని పొగడి, నన్ను తెగడి నారు. అంతపొడుగు వ్యాసములోను, ఒట్టుపెట్టినట్లు నన్నుగూర్చిన మంచి మాట ఒకటియును లేదు. పోనిండు; శబ్దార్థచర్చయేమైనా చేసినారా? అదియును లేదు. వ్యాసమంతా నాపై దోషము లాగోపించుటకే సరి పోయినది. నేను (17-1-49) 'పరామర్శలలో పరుషవాక్యములు' అను శీర్షికక్రింద వారి వ్రాతలోని తత్త్వమంతయు విజ్ఞలోకమునకు విశదము చేసియున్నాను. ఇక్కడ వారి వాక్యములు కొన్నిమాత్ర మెత్తి నాకు తోచినమాటలు మనవిచేస్తాను.

I. "విమర్శలలో వ్యక్తిదూషణము కేవల మవివేకమయిన పని."

ఆలాఅయితే, విమర్శకాగ్రేసరులు, శ్రీపంతులుగారి తండ్రిగారు– 'పండితభిషక్కుల భాషాభేషజము' అను విమర్శలో,—'వే. వేం. శాస్త్రిగారు ఆంధ్రకవితాపితామహుని నైతము వివేకములేక ఆక్షేపించినారు'.— 'పురశ్చరణచేస్తే శాస్త్రులవారిని పట్టుకొని పీడించి మతిపోగొట్టి అసంబద్ధ ప్రలాపము లాడించిన వైయాకరణపిశాచము వదలిపోతుంది'.—శాస్త్రులవారు బాలవ్యాకరణము చదువుకోలేదు.—ఇట్టిపండితుల భ్రమప్రమాదాహంకారములవల్ల అపరిమితమైన కీడు గలుగుచున్నది'...'సీతారామాచార్యులవారు తీర్పు వ్రాసినారు. చీ అనేవారు లేరు.'—'ఆ సీతారామాచారికి వివేకము లేదు. ఆతని నిఘంటువు తప్పుల తడక'.—'ఆహూబలునికి ఆంధ్రసారస్వతజ్ఞానము సర్వమంగళము'.—('చిలకమర్తివారు వాడిన) ఆ మాటకు అర్థము తెలిసినవారు రోతపడి ధూత్కారము చేయకమానరు'.— ఇత్యాదిగా, తమవలెనే భాషాకృషికావిస్తూఉన్న తోడిపండితులనూ – పూర్వపండితులనుగూడా పేర్లుపెట్టి అంతతీవ్రముగా నిరసించియున్నారే–

ఆది అవివేకమయినపనే నంటారా! పంతులవారు. వాదమున కంటారేమో! కాని అట్లనరాదు.

వాదప్రతివాదములలో - విమర్శలలో కటువాక్ప్రయోగముండుట స్వభావము. అది సత్యనిశ్చాయకమే గాని వ్యక్తిదూషణము కాదు. మల్లినాథవ్యాఖ్యలోని 'అహో మూలచ్ఛేదీ తవపాండిత్యప్రకర్షః'; 'నాథ వచన మనాథవచన మేవ' అన్న నుడుల తత్త్వమేమి? భారతచంపూ వ్యాఖ్యాత కురవిరామకవి, తత్పూర్వవ్యాఖ్యాతయైన నృసింహపండితుని, 'తస్యానాఘ్రాతవ్యాకరణగంధస్య న చోద్యాయ' అనియు, 'తస్య మూల నిర్మూలకస్య న చోద్యాయ' అనియు,-'అపమూల మనన్విత మతిరుదహం యుభి రత్ర కల్పితాక్ పాఠాక్, అపి విదుషో మోహయితుం వ్యాచఖ్యౌ బత స పండితమ్మన్యః' అనియు నిరసించుటయే కాక, తుద కా నృసింహ మును 'గ్రామసింహ' మనికూడా దూషించినాడు.

కావున 'విమర్శలలో వ్యక్తిదూషణము కేవలము అవివేకమయిన పని' యనుట అంత వివేకమయిన పనికాదు.

II. "శ్రీ దీ.పి. శాస్త్రిగారి 'పరామర్శ'లో నాకు సద్భావము కనబడలేదు."

పంతులుగారు నిజమే సెలవిచ్చినారు. నా పరామర్శలో సద్భావము తమకు కనబడలే దన్నారు. అంతేగాని 'లే' దనలేదు. ఎలా అనగలరు? వారి తండ్రిగారు 'ఓదార్పు' అను నా విమర్శగ్రంథ మొకటి చదివి నా కిట్లు వ్రాసియున్నారు.

"ఓదార్పులోని విషయము భాషకు వేయిమడుగులుగా నాకు ప్రియ మైనది. వేదంవారి పాండిత్యము ఏలాటిదో వారి శిష్యులకు తెలియదు. నేను కొంచెము ఆది నిరూపించినాను. మీరు సందేహానికి ఎడములేకుండా చేసినారు. మీ గ్రంథం మిమ్ములను సుపరిచితులను చేసినది. మీ దర్శ నము చేయవలెనన్న అభిలాషకూడా పుట్టినది....."

(రాజమహేంద్రవరం 2-9-38)

నా విమర్శలో సద్భావము లేకపోతే ఆ మహనీయునికి నన్ను చూడవలెనన్న అభిలాష పుట్టునా? ఆ 'ఓదార్పు'లోని విమర్శ యెట్టిదో నా యీ 'పరామర్శ'యు నట్టిదే. అందున్న సద్భావ మిందును కలదు.

ఉన్నను శ్రీ పంతులుగారికి కనబడకపోవుట యెందువల్లనో పెద్దలే చెప్పుదురుగాక.

III. "పరామర్శలో పెక్కుచోట్ల నాకు పరుషవాక్కులు కనబడినవి."

కనబడుగాక. వాటిజోలి తమకేల? మా చర్చలోని మంచి సెబలను గదా తాము తేల్చి చెప్పవలసినది?—"భాషాచిత్రవధ కాయాసపడి విమర్శకుఁడు విమర్శలోఁ జూపు కటుత్వమును తొలఁగఁజెట్టి పఠితలు విమర్శయొక్క పటుత్వాపటుత్వములనే పరికించుకొనుట మేలు" అన్నారే వేదం పండితులు; శ్రీ పంతులుగారికి ఆ విమర్శకమర్యాదాభిజ్ఞనివాక్యము ప్రమాణము కాదా?

IV. "'అసురద్విషుండొరి' అనేపాఠము సరియైనది కాదని శ్రీ శాస్త్రిగారు చేసిన 'పరామర్శ' అప్రస్తుతము."

పాఠదోషములను చూపుటకే పూనియున్న నేను, పాఠదోషమును చూపుట అప్రస్తుతమైతే, మరి నాకక్కడ ప్రస్తుతమేదో పంతులుగారే సెలవియ్యవలె.

V. "ఇంతకూ ఆ పాఠము సరియైనదే అని శ్రీ కవిగారు సమర్థించినారు."

ఆఁ! నిజముగా సమర్థించినారా? ఆ సమర్థనపు వ్రాతను పంతులుగారు చదువుకొన్నారా? ఆ వ్రాత ఈ గ్రంథమున తొలుదొల్తనే యున్నది. ఒకమారు తిలకించుట మంచిది.

VI. "అతివాసమునుగూర్చి కవిగారు చాలా శ్రమపడి శ్రీ శాస్త్రిగారి అభిప్రాయమును ఖండించినారు."

కవిగారు చాలా శ్రమపడి ఖండించినారు; పంతులుగారు చాలా శ్రమపడి సర్టిఫికేట్లు వ్రాసియిచ్చినారు. మంచిదే; కాని 'అతివాసము'నకు 'శ్రాద్ధమునకు ముందు దినము'అన్న యర్థము చెప్పరాదన్న పట్టుదలతోో, కవిగారు,— బ్రౌణ్యములో - "అతివాసము-శ్రాద్ధమునకుముందు వొక్క పొద్దువుండే దినము" అనియున్నను, దానిని చెప్పక కప్పిపుచ్చినారు. పంతులుగారు గమనించినారా?

'వాసర'మన్నను 'అధివాసర'మన్నను ఒకటే యర్థమట! అందువల్ల, నూ.ని. 'అధివాసరము'ను ప్రత్యేకించి చూపలేదట! పంతులుగా రొప్పుకొన్నారా?

ఆ పక్షమున 'వాస'మన్నను, 'అతివాస'మన్నను అర్థమొకటే యగునుగదా! మరి, నూ.ని. 'అతివాసము'ను చెప్పుటకు కారణమేమో పంతులుగారు, కవిగారి నడిగినారా?

మరియు, ఆ కవిగారు, 'వాసర'మన్నను 'వార'మన్నను 'దిన' మనియే అర్థమనిచెప్పి, అందుకు-"మనసి వించింతయ వారం వారం" అను శ్లోకమునిచ్చి, ఇట 'వారంవారం' అనగా ప్రతిదినమునని యర్థమేగదా! అన్నారు. ఆ యర్థము సరికాదంటూ (13-9-1948) త్రిలింగలో నేనిట్లు తెల్పియున్నాను. "వారంవారమ్— అనగా మాటిమాటికి అని యర్థము. 'వారంవారం శశ్వదర్థే' అని యమరము.— 'వారంవారం as many a time, repeatedly, often' అని ప్రౌఢ్యము. 'వారంవారం వదన మరుతా వేణు మాపూరయంతం' అని కృష్ణకర్ణామృతము."

పంతులుగారీ మాచర్చను చిత్తగించియున్నారా? చిత్తగించియు కవిగారిదే సరియైనప్రాత అనుకొన్నారా? అలా అనుకొనియేఉంటే వారును కవిగారివంటి పండితులే ననుకొనవలసివస్తుంది.

VII. "తరిపాలు, నిలువునీరు, నీరుపదను, చేపట్టుకొంచము మొదలయిన కొన్ని శబ్దములనుగూర్చి శ్రీ శాస్త్రిగారు చెప్పినది సరిగాలేదని ఖండిస్తూ శ్రీ కవిగారు నూ.ని. వ్రాతలను సమర్థించినారు."

ఆ సమర్థన మెట్టిదో, ఈ పుస్తకమున 224, 250, 136, 222 పుటలలో తెలుపబడియున్నది. పాఠకులు చూచి *పంతులుగారికి తెలుపుదురుగాక.

---

* కవిగారి సమర్థనములు నూ.ని. కి అపకారకములు. ఆ కవిగారు నూ.ని. సిద్ధాంతముల నాక్షేపించియు నున్నారు. పంతులుగా రెరుగరు. చూడండి.

(I) నూ. ని. 'నల్లిల్లు' క్రింద, కే. బొ. చ. పద్యమును—'వనమ్ము-నల్లిల్లు' అను పాఠముతో చూపినది. "నల్లిల్లు అనుట తప్పు. 'నట్టింట్లు' అనవలె"నని కవిగారి ఆక్షేపము. (పు. 7)

VIII. "స్తోంగలించు'ను గురించి శ్రీ శాస్త్రిగారి ఆక్షేపము నాకు సరిగా బోధపడలేదు."

ఆక్షేపము బోధపడకముందే అభిప్రాయ మియ్యనలసినంతటి కక్కుర్తి తమకేమి వచ్చినదో శ్రీవారు తెలుపలేను.

IX. "ఇతరపండితులకంటె తాము గొప్పవారమని నూ.ని. పండితులెవ్వరును చెప్పుకోలేదు. ఇక వారిపనిలో ఇతరులకు కనబడిన లోపములు చెక్కులుండవచ్చును. ఎవరికి కనబడిన తప్పులు వారు తెలియజేయుట మంచిది."

నూ.ని. పండితులు గొప్పవారుకాక సామాన్యులే అయితే వారు నిర్మించిన నిఘంటువు ఇతరులకు ప్రమాణమగుట యెట్లు? అది యట్లుండగా,- నూ.ని.లో ప్రమాదము లుండవనియు, దీ.పి. శాస్త్రిగారివలె నికపై నెవ్వరును, ఆ ప్రామాణికనిఘంటువుపై ఆరోపణలు చేయవలదనియు, నూ.ని. పండితులైన శ్రీ దు.నూ.నా. శాస్త్రిగారొకవంక ఘంటాఘోషముగా చెప్పుచూ - విమర్శకులను హెచ్చరించుచుండగా,— శ్రీ పంతులుగారు,— "నూ.ని.లో లోపములు చెక్కులుండవచ్చు" ననుటయు,— "ఎవరికి కనబడిన తప్పులు వారు తెలియజేయుట మంచిదే" ననుటయు నెట్లు సంగతమగును?

(II) నూ. ని. తెరువాటు - అన్నది.
'తెరవాటు' అనవలెనని క. ఆ. (పు. 8)

(III) 'చారులు పిండివంటలు' అని నూ.ని. పొ.—
అవి 'చాఱలు' గాని, చారులు గావని క. ఆ. (పు. 19)

(IV) గ(క)ట్టిపెట్టు = కొయ్యపలకకు రంగుపూయు-అని నూ.ని.
కట్టిపెట్టు=త్రాడుతో కట్టివైచు.అని కవిగారు, (పు. 132)

(V) 'చిరువ(గ)డము = మధురకందము' అని నూ.ని.
'చిరువడము = చిన్నవడ(గారె); చిరుగడము=చిన్నగడ' అని కవిగారు (పు. 203)

ఇట్టి వింకను గలవు. పంతులుగా రేమంటారో!

ఇంకను ఎందుకు విస్తరము. శ్రీ పంతులుగారి ఆ దీర్ఘ వ్యాసములో నిలువగల, విలువగల మాట ఒక్కటియునులేదు. కవిగారి వ్రాతలను పొగడుటద్వారా సూ. ని. సిద్ధాంతములు నిర్దుష్టము లనిపింపవలెనని వారి పూనిక. అది నిరర్థకప్రయత్నము. కవిగారి కథ కడగాచెట్టి తామే స్వయముగా పరిశీలించి నా పరామర్శలోని ప్రమాదములను వెల్లడించుట కర్తవ్యము.

ఒక విశేషము

పాపము! పంతులుగారు తమ సర్టిఫికేట్లు పత్రిక కెక్కునని యెరుగక ఆట్లు వ్రాసియిచ్చినారట! ఆ విషయము-శ్రీ బాచిమంచి శ్రీహరి శాస్త్రిగారు (23-1-1950) త్రిలిఙ్గలో ప్రకటించిన వ్యాసములోని యీక్రింది పంక్తులవలన తెలియుచున్నది.—

"శ్రీ...కవిగారు తమ ప్రశంసాపత్రముల నన్నిటినీ ప్రతికాముఖముగావించిరి. అట్టిపిఠి 'ఆత్మస్తుతి'కి తావొసంగకపోదు. అసలు ప్రశంసాపత్ర ప్రకటన యిట్టి చర్చలయం దప్రస్తుతము కాకపోదు. మొన్న బెజవాడలోజరిగిన శతావధాని బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులవారి పట్టప్రదానోత్సవసభకు వెళ్లినప్పుడు శ్రీగిడుగు వేంకటసీతాపతిగారితో మాట్లాడుట తటస్థించినది. ప్రస్తావవశమున—"మీరు శ్రీ...కవిగారి కేదో 'సర్టిఫికెట్' యిచ్చియున్నారే! దానిని నేను త్రిలిఙ్గముఖమున చూచియున్నాను. తమ యభిప్రాయ మే"మని ప్రశ్నించితిని. అంతట వారు చెదిమవిరిచి- 'ఏదో సర్టిఫికెట్లు యిస్తూయుంటాము. వాటిని పత్రిక కెక్కించు లేమి?' యనిరి."

పత్రికలో ప్రచురించుటకు పనికిరాని సర్టిఫికేట్లు వ్రాసియిచ్చుటలో ఉద్దేశమేమి? అని అడుగువారికి పంతులుగా రేమి బదులు చెపుదురో?

శ్రీ పంతులుగారి సర్టిఫికేట్లును పండితులిట్లు విమర్శించియున్నారు.

(1) శ్రీ యేలూరిపాటి రామభద్ర చయనులుగారు.—

"శ్రీరామ వీరబ్రహ్మముగారు తే 13-12-48 ది త్రిలిఙ్గలో-శ్రీ.గి.వేం. సీతాపతిగారి సర్టిఫికెట్లు నుదహరించిరి. శ్రీ దీ.పి. శాస్త్రిగారి వ్యాసముల వ్యక్తిదూషణ మున్నట్లు శ్రీ సీతాపతిగారు ఆరువాక్యములను నిందాభాజన

ములుగ వ్రాసిరి. ఇట్టిమాటలు నిందలుకావు. లోకమునకు స్పష్టముగ వ్రాయు వ్రాతలను జూచినప్పుడు మనస్సున కలిగిన ఆవేదనాసూచకములగు మాటలవి...విమర్శనమున నట్టి వాక్యములకు దోష మాపాదించుట తగదు. ...కీ.శే.గి.వెం. రామసూర్యపంతులుగారు (శ్రీ సీతాపతిగారికి పితృపాదులు, నాటి రచయిత్రులు) తెలుగుపత్రికలలో పండితభిషక్కుల భాషాదోషజములు- అని వ్రాసిరి. ఇంచు భిషక్ భేషజ శబ్దముల ప్రయోగ మెట్లు సమర్థనీయము? అందలి ప్రమత్త, పండితమన్మన్య మొదలయినవాని మాట యేమి? శ్రీ సీతాపతిగారు 'వేదంవారి పరిపక్వరహితమైన పరిష్కరణము'నే దోషముగ నెంచి శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారిని 'తాముసు'లనుట తగునా? శ్రీరామ వీర బ్రహ్మంగారు శ్రీ శాస్త్రిగారిని భాషాపరిచయములేనివారని వ్రాసినదిమాత్రమే మందలించెద రేమో? సూ.ని.లో దోషములు లేవని ఏవారు నొప్పుకొనుట లేదు. తప్పులను చూపింపుడనియే శ్రీ సీతాపతిగారు కోరుచున్నారు. ప్రస్తుతము నిఘంటువుతో సంబంధముకల శ్రీ సీతాపతిగారు ముఖ్యముగ నిఘంటుపక్షమున సమాధాన మీయవలసియున్నది. కాపున నీ సర్టిఫికెట్లు నిచ్చిరా? లెండమీరాచివర వ్రాసినట్లు శబ్దముల గ్రహించి విమర్శనతోడి ఆదరమునుజూపు వ్యాసముల ప్రకటింపవలసినదిగా శ్రీ సీతాపతిగారిని ప్రార్థించుచున్నాను." (3-1-1949-త్రిలిఙ్గ)

(2) విన్నపు వినివేదనము - మహాకవి శ్రీ కాశీభట్ల కృష్ణరాయ శాస్త్రిగారు.—

"శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారిగ్రంథములు, విమర్శనములు, సమాధానములు మున్నగునవిగొల్ల నగరయుచున్నాను. శ్రీ వీరబ్రహ్మంకవిగారి 'సంజీవములను' జూచితిని. మోక్షయాత్రపత్రముల జూచితిని. శ్రీ చయనులుగారి సమాధానమును గంటిని. అనుగ్రహపూర్వకమే వ్రాయవలసి వచ్చుచున్నది.

శ్రీ గిడుగువారి ఘోరణి యంతా యెరిగినదే. ప్రాచీనభాషారూపము యెరిగినవా రెవ్వరూలేరు; తామూకారు. అన్నింటికి "బే" జనాబు. బ్రహ్మంగారు, శాస్త్రిగారు, సీతాపతిగారు, పుట్టినవారు, పుట్టేవారు, వారేవింటి వీరేవింటి అంతా అజ్ఞమయం. ఆంధ్రభాష నెరిగినవారు లేనే లేరు. ఇంక సర్టిఫికట్లు అడిగేరు కాబట్టి యిచ్చేరు. వారి నేమియూ అనడము యెందుకో? తమకున్న లెస్సగా రాదనియే వ్రాసినారు.

రుచిభేదమే ప్రమాణము

ప్రపిన్నచ్యుశాస్త్రిగారిధోరణిలో పాపపుణ్యము మాధ్వులలిగోచరము గాలేదు. మఱియు బ్రాచ్యపండితమర్యాదకు భంగమగునట్లు వ్రాయుదు. బ్రహ్మంగారి వ్యాసములోని "బొయ్యిమని తిరిగి నా వ్యాసములపయి విఱుచుకొని" అనువాక్య మెంత మృగుపుగ నున్నది. బ్రహ్మంగారికాని బొయ్యన్న గుయ్యన్న నాదమాత్ర మగుట సీతాపతిగారు ప్రకటింపరు. శ్రీ బ్రహ్మంగారి వ్రాతలయందున్నంత పాపపుణ్యము పిన్నచ్యుశాస్త్రిగారి ధోరణిలో గనలేము. తారతమ్యమే పాపపుణ్యభేదముగాని పాపపుణ్య గంధసంబంధములేని యీ విమర్శనమును కనలేరు. వేదంవారు రత్నకవిగారి నెంతగా ననిరో యెఱుంగరాదా? పాపపుణ్యపాపపుణ్యముల నడుమంచి పాఠకులకు సద్భాపాస్వరూప ప్రకాశనమగుచున్నదా లేదా అను విషయమే విచారణీయము.

నేను ప్రియయనులుగారి వాదసుగోనే సేకరించితిని. ఈయభిప్రాయము నాకడనుండిన ప్రెనిడెంటు సీతారామశాస్త్రిగారును, (కొప్పోలు) అనుమతనికి దెలిపితిని. వాదోపవాదములు పూర్తియైనపిమ్మట బ్రహ్మంగారిసంపదలంచి గారణాంతరములచే నిప్పు డీరీతి వ్రాయవలసివచ్చెను.

ప్రసీతాపతిగారినుండి బ్రహ్మంగారుసు, వారిసిలుపు ఉత్తరములనికవి యున్నది. "సాహిత్యసూచకమైన పీఠిక" నుసార్కారప్రతిపూర్వకము. తెలిసిన సందేహమైన తెలిపెల్ల సందేహమని సమ్మగ్రద్రష్టుగా తెలుంగకపోరు. 'కోరినారుగనుక వ్రాస్తున్నాను.' కోరని వ్రాతలగతి నేను చాలమంది గ్రహింపరు. 'శబ్దరత్నాకరమున మూడు వేలకుపైగా తప్పులను గ్రహించినారు.'

1. పరుషవాక్యములతో ఈసడించి చెప్పనక్కఱలేదు. 2. వ్యక్తి దూషణము కేవలము అవివేకమైనపని. (ఆఱు నెలలకు ప్రపిన్నచ్యుగారి వ్యాసములు బొయ్యిమని...) శ్రీ బ్రహ్మంగారి పాండిత్యమేమో? 3 అలివాసకేవల సంస్కృతపదము. 4. తరిపాలు, నిలువునీరు, నీరుపసుపు, చేపట్లు కుంచము- ఇత్యాదిపదములపై సీతాపతిగారి యభిప్రాయమేమో? 5. ఇట్టిదినీ అభినందిస్తున్నాను. (ఏ బాధయూలేదు).

ఇట్టి వాదములలో బ్రహ్మశ్రీ వజ్ఝల చినసీతారామశాస్త్రిగారు, మున్నగు పండితవతంసు లెట్టి యభిప్రాయమిత్తురో? అధికప్రసంగ మనంగతము." (4-4-49 తిలిఖ్ఖ)

ఈ పండితప్రకాండుల విమర్శవలన శ్రీ పంతులుగారిది పక్షపాతపు వ్రాత గాని న్యాయ్యమైనది కాదని స్పష్టమయ్యెగదా. ఇకనైనను శ్రీవారిట్టి ప్రశంసాపత్రములను వ్రాసియిచ్చు నలవాటును తగ్గించుకొందురుగాక. భాషాపరాధకులకు తోడ్పడుదురుగాక.

విమర్శవిధానము లెరిగిన పాఠకులారా, తెలుగు నిఘంటువుల పరామర్శపై నిప్పటికిజరిగిన గ్రంథమంతయు మీ యెదుట పెట్టినాను. ఇక, ఇందలి గుణములను దోషములను నిర్ణయించుభారము మీది.

మానవునికి సర్వజ్ఞత ఉండదు గావునను, ప్రమాదములేకుండదు గావునను నా యీ సమీక్షలో లోటుపాటు లెన్నేని పాటిలి యుండును.

'ఆదరమునఁ దప్పులక్కవిడిచి లద్దయు నొప్పులె చూచి మెచ్చుడీ'

యని నేను మిమ్ములిగికొనుటకుగాని, మీ రట్లు మెచ్చుకొనుటకుగాని యిది విషయము కాదు. ఇం చేర్పదవలసినది సత్యము. ఈ విమర్శగ్రంథము నిరుష్టమైన సాహిత్యలోకమున కొక 'మేలుకొలుపు' కావలెనని నా యాకాంక్ష. కావున తాము దీనిని శాంతముగను, సాంతముగను పరిశీలించి, యిందలి నిజమైన దోషగుణములను వెల్లడింతురేని, ఈసారి ముద్రణమున వాటిని తొలగించి, గ్రంథమును నిర్దోషము కావించుకొందును. నాకృతజ్ఞతను తెలుపుకొందును. నేను చేయుచున్న భాషాసేవ కిట్లు తోడ్పడవలెనని వేడుకోలు.

కావ్యములు ; వ్యాఖ్యానములు

ఇక కావ్యములను - వ్యాఖ్యానములను గురించిన మాట.

నాకు, కవితాప్రౌఢవముబట్టి శ్రీ తిరుపతి వేంకటకవులయందును, వ్యాఖ్యానదక్షతబట్టి శ్రీ వేంకటరాయశాస్త్రిగారియందును *అభిమాన మెక్కువ.

---

* "పాండిత్యంబున కేమి, ప్రౌఢకవితావ్యాపారసందర్భవాక్
శైండీర్యంబున కేమిగాని, రసభావస్వాత్మ్యభావార్థపుక్

కవిత్వాక్షిరుచిచేత వారి గ్రంథములను, సాహిత్యప్రీతిచేత వీరి వ్యాఖ్యానములను-విమర్శలను తరచు చదివెడివాడను.

నేనే గ్రంథమును చదివినను, అందు నా బుద్ధికి విశేషములుగా తోచు గుణములను-దోషములను-తుదకు అచ్చుతప్పులనుకూడా ఆ గ్రంథములోనే-తుదిపుటలో గుర్తుగా వ్రాసియుంచుకొనుట చిన్ననాటినుండియు నలవాటు. అట్లే శ్రీ శాస్త్రిగారి వ్యాఖ్యానాదులనుగూడా గుణదోష పరిశీలనపూర్వకముగనే చదివితిని. చదువను చదువను వారి పరిష్కరణలలో కొన్ని పాఠములు, టీకలలో కొన్ని యర్థములు, శబ్దములు, వాక్యములున్ను తప్పులుగా కనబడసాగినవి. అంతట వారి యనువాదముల నరసితిని. అందును కొన్ని ప్రమాదములు గోచరించినవి. భాషాపరిచితి నలవరుచుకొనగోరువారి కెల్ల నవశ్యపఠనీయములైన గ్రంథములలో తప్పులుండుట శ్రేయముకాదని తోచి, ఆ యా గ్రంథములను పఠించు విద్యార్థుల కొక హెచ్చరికగానుండు నన్న తలపుతోను, సాధుత్వాసాధుత్వములను పండితులు తెలుపుదురన్న ఆశయముతోను ఆ నెగసుల నప్పుడప్పుడు - ఉగాదిసంచిక, భారతి, ఆంధ్ర వారపత్రిక మున్నగువాటిలో ప్రచురించుచు వచ్చితిని. అవియు, ప్రకటితములుకాక నిలిచిపోయిన మరికొన్ని అంశములును ఈ సమీక్షలో సంపుటీకరింపబడినవి.

నా యీ విమర్శకు పూర్వకావ్యములతోనే సంబంధము. ఈనాటి స్వతంత్రరచనలజోలి యిందులేదు. శ్రీ శాస్త్రిగారి సాంతకృతులను నేను స్పృశింపలేదు. ప్రాచీనకృతులను తప్పుగా అనువదించినను, తప్పుగా వ్యాఖ్యానించినను, ఆ యా కవులకు అపచారము చేయుటయు, భాషకు అపకారముచేయుటయు నగునని నా యా వేదనము.

శృంగారనైషధము, ఆముక్తమాల్యద, గౌరనహరిశ్చంద్ర మొదలైనవి ఆంధ్రభాషకు ప్రమాణగ్రంథములగుటచేతను, వాటిని పరిష్కరించి

బండాలంబును విప్పి నీ పగిదిఁ జెప్పంజాలు ధీశాలి యె
క్కండుఁ లేఁడుగదయ్య మాకు నిఁక వేంకట్రాయవిద్వన్మణీ!"
(సుబోధిని)

ఇది శ్రీ శాస్త్రిగారి నిర్యాణమునుగూర్చి నేనువ్రాసిన పద్యములలో నొకటి.

వ్యాఖ్యానించిన శ్రీ శాస్త్రిగారు ప్రామాణికులని పేరువడ్డవారగుటచేతను నేటి పిన్నలు-పెద్దలు సైతము వారి ప్రమాదములను గమనింపక ప్రమాణములుగా గ్రహించుచున్నారు. ఈ రీతిగా భాషకు మోపాది ఆపాదిల్లుచున్నది. శబ్దార్థములు తారుమారైన పిమ్మట ఆది సాహిత్య మనిషించుకొనునా? భాష గ్రాంథికమైనను, వ్యావహారికమైనను శబ్దములు-అర్థములు సరిగా నుండవలెగదా!

ఆంధ్రదేశాభ్యుదయమునకు, ఆంధ్రభాషారాధనము ముఖ్యము. ఆంధ్రభాషారాధనకు ప్రాచీనకావ్యరక్షణ మవశ్యకర్తవ్యము. కావున ఆంధ్రదేశమునకును, ఆంధ్రభాషకును మేలుగోరు పెద్దలు, పరిష్కర్తల-వ్యాఖ్యాతల ప్రమాదములమూలమున రూపుచెడియున్న ప్రాచీనకావ్యములను నిగుష్టములు కావించి, యథారూపముగా నెలకొలిపి తెనుగుభాష సౌభాగ్యమును కాపాడుదురుగాక.

అత్యంత వ్యయప్రయాసములకోర్చి జీవితమంతయు ఆంధ్రభాషారాధనకే ధారవోసిన శాస్త్రిగారియెడ ఆంధ్రులెల్లరును కృతజ్ఞులైయుండుట ధర్మము. కాని, వారి గ్రంథములు పునఃపరిశీలనమును కోరుచున్నవి. శాస్త్రిగారు మనకు భూయిష్ఠులైనను వారి ప్రమాదములు త్యాజ్యములు. కావున భాషాభిమానులు భారమనుకొనక, శ్రీ శాస్త్రిగారియెల్ల గ్రంథములను తత్వనిర్ణయదృష్టితో పరికించి అవసరములగు సవరణలను చిన్నచిన్న పుస్తకములుగానైన ప్రకటించుట అత్యవసరమనియు, అట్టి ప్రకటనము, శ్రీ శాస్త్రిగారుచేసిన భాషాసేవకు మెరుగుపెట్టుట, సాహిత్యోపాసకులకు మహోపకారము చేయుట అగుననియు నా మనవి.

నా యీ మనవిని శ్రీ శాస్త్రిగారి మనుమలు, విద్యాధికులును - బుద్ధిమంతులునైన చిరంజీవి వేంకటరాయశాస్త్రిగారు సౌహార్దముతో మన్నింతురని నా విశ్వాసము.

ఇట్లు
సాహిత్య సాధకుడు

దీపాల పిచ్చయ్యశాస్త్రి.

నెల్లూరు,
మన్మథ - 'ముక్కోటి'
25—12—55

కృతజ్ఞత

—:o:—

ఈ వ్యాసములను అవిచ్ఛిన్నముగా ప్రకటించి, నా సారస్వత సేవకు దోహదమిచ్చిన భాషోద్ధారకులు త్రిలింగ పత్రికాధిపతులకును, భారతి-ఆంధ్రపత్రిక అధిపతులకును, నా విమర్శకత్వమును అవ్యాజాదరముతో లోకమునకు తెలియజేసిన పండితవరేణ్యులకును కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంథముద్రణమునకు అర్థసాహాయ్యము చేసి, నా చిరకాలపరిశ్రమము వ్యర్థముకాకుండ కాపాడిన భాషాభిమానులు – వరకవిపుంగవ మిత్రమండలివారికి ప్రత్యేకముగా నా కృతజ్ఞతను తెలుపుకొనుచున్నాను.

ముద్రణకార్యమున నెక్కువ శ్రద్ధవహించి, నాకు తోడ్పడి, గ్రంథము నిట్లు చక్కగా తీర్చియిచ్చిన కోకిల ప్రెస్ అధికారులకు నా అభినందనములు.

దీ. పి. శాస్త్రి

~~~:o:~~~
~~~

విషయసూచిక

తెలుఁగు నిఘంటువులు

పాఠపరామర్శ

౧. అసురద్విషుండు	1	౨౦. జానువడు; అనిలుఁడు	33
౨. నోరుమాయు	2	౨౧. ఉక్కుఁదాయము	36
౩. నట్టింట్లు	3	౨౨. తేటఁబొసంగ	37
౪. నడువఁదెరవాటు	7	౨౩. కొండఁజేయు	38
౫. తెరవాటు	8	1. లెక్కసేయు	44
౬. నిడుపుటూఁబడ్డ ఆవుపెయ్య	11	2. ఘనముచేయు	45
		3. పటాపంచలుసేయు	,,
౭. ఆఁబెయ్య గతి, దెస	14	4. కోపముచేయు	,,
		5. ఎట్టిచేయు	,,
౮. కొఁడయి; కొఁడుగ	16	6. తెనుఁగుచేయు	46
౯. చ్రోరు; చేరు	17	7. పెండ్లిసేయు	47
౧౦. నల్లఁజారు చాఁదుబొగున	21	8. చీకటితప్పుచేయు	48
		9. తలఁపుసేయు	49
౧౧. చేరు; చేరుద్రావుట	23	10. ఆలిసేయు	,,
౧౨. కలువడము; కలవడము	24	11. నడదివియలుచేయు	50
౧౩. మర్థ; మూర్ధ	25	12. మాయచేయు	,,
౧౪. తారి; దారి	26	13. కట్టడచేయు	51
౧౫. తప్పఁజేసి; తప్పసేసి	28	14. అంతసేయు; ఇంతసేయు	52
౧౬. చేతప్పఁగొను	29	15. ఐదుపదిసేయు	,,
౧౭. జుంజము; జుంజుము	30	16. బుద్ధిసేయు	,,
౧౮. నీరుచిచ్చుఁగొను	31	17. గజిబిజిసేయు	53
౧౯. చెఱంగు; తెఱంగు	33	18. కరుణగలుగు	,,

19. కనుఁగొను; కనుగొను 55
20. నోరుచేయు 56
21. ్రకాకాన్కసేయు ,,
22. చేఁబలుపట్టు ,,
23. కయ్యముపాడుచు 57
24. చీరికిఁగొను ,,
25. మరులుకొను ,,
26. కొంకుకొసరు చేతప్పి
గొను ,,
౨౩ (A) పండ్లుకొఱుకు 58
1. పీఁటపెట్టు 59
2. పిండిపెట్టు 60
3. వెలిపెట్టు ,,
4. గట్టిపెట్టు 61
5. త్రాడువెట్టు 64
6. వెన్నుదన్ను ,,
7. కాలుదన్ను 65
8. ముసుఁగుదన్ను 66
9. మిన్నుదన్ను ,,
10. తలదన్ను 67
11. వెన్నుచూపు 68
12. నిజముపట్టు 69
13. కొండయెక్కు ,,
14. పాడెక్కు ,,
15. కొండవట్టు 70
16. చెట్లువట్టు; తిప్పలువట్టు ,,
17. అగ్నియిచ్చు 71
18. వైద్యమిచ్చు ,,
19. పూజయిచ్చు ,,
20. అవసరమిచ్చు 71
21. చెఱయిచ్చు ,,
22. చెయ్యిచ్చు 72
23. మొలయిచ్చు ,,
24. దశమిచ్చు 73
25. పడుకయిచ్చు 74
26. తఱిద్రొక్కు 75
27. కన్నువొందు ,,
౨౪. చెఱఁబట్టు 76
౨౫. ఆఁకపెట్టు 77
౨౬. చేయూఁక; సరకుగొనక 79
౨౭. సుడివడు; అడుగుపట్టు 80
1. వెండ్రుకపట్టు 81
2. కొమ్ములుసూపు ,,
౨౮. ఆనఁబోడుచు ,,
1. తడుకువొడుచు 94
2. అప్పుపొడుచు 95
3. పన్నిదమువొడుచు ,,
4. చిఱలువొడుచు ,,
5. పులపొడుచు ,,
6. నిక్కువొడుచు 96
౨౯. నులివడు 97
బలఁబడ్డ
౩౦. ఊలుకొక్కు 98
౩౧. కోపధారి 99
౩౨. రాచవాఁడు 100
౩౩. దొరవాఁడు 104
౩౪. పసులత్రొక్కుడు 106
౩౫. తిగిచి ,,

౩౬. పీట	107	౫౦. గోవుకోడె	124
౩౭. ఉద్ది; ఉద్దు	,,	౫౧. జిడ్డి	125
౩౮. అక్కలి	110	పాయదొలంగు	
౩౯. పాగరు	111	మనసరలక్	
౪౦. అంబు; అంబుజో	112	౫౪. తీఱు	133
౪౧. బుజ్జోయిడు	113	౫౩. ఓర్చు లెఱుంగక	,,
౪౪. నీలాటిరేవు	,,	౫౪. కొలెనుపోతులు	,,
౪౩. చెంద్రికవెట్టి	115	౫౫. విన్నగన్నగ జోద్యము	,,
౪౪. పాసెము	117	౫౬. అలవెనయంగజారుల	134
౪౫. ఇనువింతలు	118	౫౭. ఆధన్యుడు	,,
౪౬. ఎత్తుచు	121	౫౮. అతనిక్	135
౪౭. చీకుబండ	122	౫౯. కరచరణాదుల కొజ్జ	,,
౪౮. గగ్గులకొండ్రు	123	౬౦. సారంగధరుడు	,,
౪౯. చెంచుమల	,,		

అర్థపరామర్శ

1. నీరుపదును	136	14. దావలచేయి	160
2. నీరుకొవి	139	15. అంగీకరించు	164
3. చాఅపప్పు	142	16. కుట్టిమము	166
4. గుజ్జెనగూడు	143	17. నేర్పరి	168
5. నారికుఱుపు; నాడీవ్రణము	145	18. నట్టు	170
6. తలమాటు	147	19. నీరువట్టు	171
7. చన్ను	148	20. తిమిరము	173
8. కంపరము	149	21. చూర్ణకుంతలము	179
9. అంటుపేను; అంటుపోగులు	151	22. చూర్ణము	197
10. ఈరుపెన; చిక్కంటి	153	23. కిన్నరకంఠి	199
11. గుణితము	154	24. చిరువడము	202
12. కలాపము	155	25. చేపెలుఁగు	204
13. చనవరి	156	26. నడదివియ	205

27. నడకొలఁకు 207
28. నడగోట 209
29. నిలక 212
30. కుటిలము 213
31. నడనిచ్చు 214
32. కొలుదివియ 215
33. ఇను 219
34. చేపట్టుకుంచము 222
35. తరిపాలు 224
36. దేవాయుధము 227
37. కపిల 230
38. అతివాసము 232
39. పాఱెడునీళ్లకుగట్టవేయుట 235
40. తెరువుపెసర 236
41. చేతడియాఱు 237
42. గీయు 238
43. చేవంతుఁడు 240
44. చాఁదుసేయు 241
45. చీములుగట్టు 242
46. ముట్టు; ముట్టుఁబొలు ,,
47. చూఱకొరుఁడు 244
48. చేటపెయ్య 249
49. నిలువునీరు 250
వీ.బ్ర. గారి విపరీతపాండిత్యము 251
50. నీరుకొలఁది తామర 255
51. కమ్మపంజు 256
52. ఖండించు 262
53. ఉల్ల 263
54. తేనెతల 264
55. పాగరు 266

శబ్దపరామర్శ

౧. తూట్లకమ్మలు 269
౨. దుగ్గుకమ్మలు 270
౩. చేయూర ,,
౪. నాసికము ,,
౫. చెరపెట్టుకొను 271
౬. ధర్మకొహళి పట్టించు ,,
౭. తెరువుపెట్టు 272
౮. అచ్చుపోయు ,,
౯. అచ్చువేయు 273
౧౦. నెపమార్చు ,,
౧౧. దంపతి ,,
౧౨. ఉపదర్శనము 274
౧౩. నిలువుఁబతిమ 274
౧౪. దిశ ,,
౧౫. తపమువడు ,,
౧౬. అండజంబుపాన్పు 275
౧౭. ఉల్లాభము ,,
౧౮. ఆపేక్ష ,,
౧౯. దునియు ,,
౨౦. అవ్వలించు; అవ్వలికించు 276
౨౧. ఓడఁగట్టిన దూలము ,,
౨౨. గోలి 277
౨౩. కల్లచ్చు ,,

కావ్యములు ; వ్యాఖ్యానములు

మేఘసందేశము

౧. మేఘహంసమైత్రి 280 | ౨. ప్రతీప్తములు 292

గౌ. హరిశ్చంద్ర ; టిప్పణము

౧. బందిపోటు	303	౯. గుత్త	311
౨. ఇంగితము	304	౧౦. ముట్టడిమిక్కి	,,
౩. బడుగు	305	౧౧. అట్టాడు	312
౪. ఎరియు	306	౧౨. వెరవేఁకి	,,
౫. అదరంట	,,	౧౩. తఱిలక	313
౬. కంటగించు	308	౧౪. తన	314
౭. చిదుగు	309	౧౫. పడఁగఱచు	,,
౮. అసిఁబోవు	310	౧౬. కడపు	315

శృంగార నైషధము

పాఠవిచారణ

౧. ఆనందంబునఁబొందు 316

అర్థవిచారణ

౧. మృదుమధుర చిత్ర విస్తరములు	318	౬. చేపట్టు	328
౨. అంగుళీము	320	౭. ఘూంకారితము	330
౩. మడవక	322	౮. జ్యోత్స్న	331
౪. నెఱులు	325	౯. ఊరి	332
౫. బడుగు-చిదిపి	326	౧౦. కోపాగ్ని	333
		౧౧. మరుకీర్తి	,,

శబ్దవిచారణ

౧. ఎడఁబాపు	334	6. ఉప్పరలు	339
౨. తోఁటమాలియ	335	(1) కూర్చి	,,
1. దెప్పరము	,,	(2) కరకా	340
2. మనికితము	336	౩. నాలిగింటిని	341
3. పురణించు	337	౪. ఊరిఁబోసికొనుట	342
4. కరుళ్లు	,,	ఓండ్రరచించు	343
5. దొమ్మరిది	338		

అలంకారవిచారణ

౧. విరోధాభాసము	344	౩. విశేషోక్తి	345
౨. యథాసంఖ్యము	,,		

ఆముక్తమాల్యద ; వ్యాఖ్యానములు

పాఠవిచారణ

౧. స్రగ్ధరాయతి	348	2. జీర్ణోద్యానము	356
౨. చేఁగొను	353	3. కిమంగ	357
3. నున్నమెత్తుట	354	౪. పాటిపాటి	358
1. కొమరయ్య	355		

అర్థవిచారణ

౧. ఒకఁడుచెప్పక	358	౭. తనుయాత్ర	364
౨. పనసపండ్లు దిగినపరిగ	359	౯. తొడిఁబడి; విషయా	
౩. కసీసము	360	తు రు	366
౪. చట్టలు	361	౧౦. జపయజ్ఞశీలురు	368
౫. చెల్క-	362	౧౧. చేవెలుఁగు	370
౬. అంతలు-ఇంతలు	,,	౧౨. పచ్చికస్తూరి	,,
౭. అక్క-వాడ	363	౧౩. అశ్లీలము	372

౧౪. ఖురాసానిపుచ్చలు	374	౧౬. భల్లాతకి	379
౧౫. నాభి; నిర్విషము	376	౧౭. పాడబము	380

శబ్దవిచారణ

౧. ఊష్మోదనము	384	3. అడుకొయ్య	386
౨. కరటము	385		

అలంకారవిచారణ

౧. ఉపమ 388

కూర్పులు ; మార్పులు 389

సవరణలు

—:o:—

పుట	బంతి	ఒప్పు
5	25	దీర్ఘికలు
7	21	విరుద్ధ
46	7	నల్లగా
104	10	భవద్భి
127	19	శ. ర. కర్త
128	17	వైచుట
190	3	నఖాంకాంకుశ
191	6	చూర్ణ
198	23	మల్లి
201	8	కమనీయ:
303	7	లేని
352	18	ఆతడు
379	24	తినదగినది
381	6	ఉపాహారము

ఇట్టి అక్షరప్రమాదము లింకను కొన్ని యుండవచ్చును. వానిని చదువరులు సరిపరచుకోవలెనని మనవి.

సాహిత్య సమీక్ష

తెలుఁగు నిఘంటువులు

పాఠపరామర్శ

౧. 'అసుర ద్విషుండు'

సూర్యారాయాంధ్రనిఘంటువులో 'నోరుమూయు' అను పదము క్రింద, నృసింహపురాణపద్యము, వావిళ్లవారి ప్రతిలో నున్నప్రకారము,—

"అనిన నాడుగఱచి యసుగద్విషుం డోరి
పడుచ నాకుఁ బుట్టి చెడుగ వైతి,
పేర్చి నోరుమూయు పెడతల వాపోయె.
దిట్టి వదర గలఁడె యెచటనైన" (౪. 3౭)

అని యుదాహృతమై యున్నది.

పై వాక్యములు ప్రహ్లాదునిగూర్చి హిరణ్యకశిపు డన్నవి. హిరణ్యకశిపుడు అసురులకు ప్రభువుగాని, ద్విషుఁడు (= విరోధి) కాడు. కావున *'అసుర ద్విషుం' డన్న పాఠము తప్పు.

---

* "'అసురద్విషుండోరి' అను పాఠమే సరియైనది. అసురద్విషుం డన్న పదము హిరణ్యకశిపునికి చెందినది కాదు. ఆది ప్రహ్లాదునికే అన్వయించును. 'అసురద్విషుండోరి' యనఁగా,—ఓరీ, నీవు అసురద్విషుండవు-

'అమర ద్విషుండోరి' అని సరియైన పాఠము. 'ఆ సురద్విషుండోరి' అని పాఠాంతరము.

'అమర' అను పదము, అచ్చులో 'అసుర'గా మారినది. అది ప్రమాదము. సూ.ని. ఆ ప్రమాదము నశ్లే తీసికొన్నది.

ఎ. 'నోరు మూయు'

(A)

'నోరుమూయు పెడతల' అను పాఠముగూడ తప్పే.

"నోరుమూయఁ బెడతల వాపోయెదు"

అని సరియైనపాఠము. (శ.ర. లో 'వదర' క్రింద నున్నది.)

నోరుమూయఁ = (మాటలాడవలదని) నోటిని మూయఁగా, పెడతలఁ = పెడతల (= అవటువు) తో, వాపోయెదు, అని యర్థము.

'నోరుమూస్తే పెడతల వాపోతాడు' అని లోకో క్తి. 'మొండివాడు' అని భావము. శ్లేర్చి నోరు మూయు(ము) అనుటలో అర్థములేదు.

కొబట్టి, శ.ర. పాఠ మొప్పు; సూ.ని. పాఠము తప్పు.

అని యర్థము. ద్విషుండవు అను పదములోని 'వు' లోపించి 'ద్విషుండ' అను రూప మేర్పడి పిమ్మట, ద్విషుండ + ఓరి = ద్విషుండోరి అయినది. నీవు అసురద్విషుండోరి పడుచ అంట్లే, ఓరి పడుచా, నీవు అసురద్విషుండవు అని సమన్వయము. ఎత్తితివి + ఏని వకారము లోపింపగా ఎత్తితేని అయినశ్లే.—ఇచట పాఠకుల కొక సందియము గలుగవచ్చును.

పైని గనబఱచినది క్రియాపదము గదా! అశ్లే విశేష్యములందును వకారము లోపము గలుగునాఁ? యని. దీనికి ప్రయోగములు గలవు.

పడఁతికి గన్యాధర్మం
బెడలినఁ గొఱయగునె వెండి యెవ్వరికైనఁ
గడివోయిన పువ్వులు మఱి
ముడుచునెఁ? రసికుఁ డగువాఁ డమోఘ విచారా.

(B)

ఆది యట్లుండగా, 'నోరు మూయు(ము)' అన్నప్పు డది వాక్య మగునుగాని, ఏకపదము కాదు. నిఘంటువు, 'నోరుమూయుము'; 'తలుపు వేయుము'; 'జాబు వ్రాయుము' అను వాక్యములను గ్రహించుటయు, అర్థములు చెప్పుటయు సంప్రదాయము కాదు.

3. 'నట్టిండ్లు'

శ.ర. కర్త, 'నట్టిల్లు'అను పదమునకు (1) గృహమధ్యము, (2) గర్భ గృహము అని రెండర్థములుచెప్పి, రెండవ యర్థమునకు భీమఖండపద్యమును (అచ్చుప్రతిలోనున్న ప్రకారము)—

ఇట, రసికుఁడవు + అగువాఁడవు + అమోఘ విచారా! అని పద విచ్ఛేద మయి వకారము లోపించుటచేత — రసికుఁడ + అగువాడ + అమోఘ విచారా = రసికుఁ డగువా డమోఘ విచారా అని యేర్పడినది. కావున నిందలి 'రసికుఁడవు' — 'అగువాడవు' అను నీ రెండు పదములును విశేష్యములే గదా!" అని 'కవిరత్న వీరబ్రహ్మకవి'గారి దొక సిద్ధాంతము.

ఈ సిద్ధాంతము శ్రీ వారి వ్యాకరణపాండిత్యము, అర్థగ్రహణ కౌశలము, వ్యాఖ్యానవైఖరి, విమర్శపద్ధతి మొదలగు నెల్ల యంశములకును మచ్చు తునక.

ఆటవెలఁది 'వృత్త' మనియు, 'గీత మనఁగా సంగీతమగునేఁగాని పద్యము కా'దనియు, 'గీతిపద్య' మనవలెననియు వారి దొక ప్రసంగము.

ఈ ప్రసంగము వారి ఛందశ్శాస్త్రపారీణతకు తార్కాణ.

"మలిపించె *బంగారముల దేవగృహములు
కూర్పించె నట్టింట్లు కుందనమున" (ఏ. ఆ.)

అను పాఠముతో నుదాహరించినాఁడు.

'నట్టింట్లు' అను పాఠము సరియైనది కాదు. ఆ పాఠముతోపాటు శ.ర. కర్త ఊహించిన అర్థముకూడ తప్పే. ఎందువల్లననఁగా 'దేవగృహ' మనగా దేవాలయమే. దేవుఁడుండు గర్భాలయమునకే దేవాలయమని పేరు. అదే దేవగృహము. కాబట్టి 'దేవగృహములు మలిపించె' నని చెప్పినపిమ్మట, మరల, నట్టింట్లు (= గర్భగృహములు = దేవగృహములు) కూర్పించె నని చెప్పుట అనవసరము. అది పునరుక్తియను దోష మగును. కావున ఆ యర్థము పొసఁగదు.

పాఠము, కూర్పించె 'నల్లిండ్లు' అని యుండుట యొప్పు. 'నల్లిం' డ్లనగా, బ్రాహ్మణగృహములు. (= అగ్రహారము)

"అగ్రహారము = బ్రాహ్మణుల యిండ్లవరుస. నల్లిండ్లు" (శ.ర)

"అగ్రహారము A street or village inhabited by Brahmins" (బ్రౌ)

"అగ్రహారః. విప్రగ్రామే" (శబ్దార్థ కల్పతరువు.)

"రత్నాకరాం తోర్వ్యా విహారుండోట నగ్రహారము లసంఖ్యముగఁ జేసె" (విజ. 1.21)

'అగ్రహారములు = ఉత్తమమైన ముత్తెపుంబేరులను, బ్రాహ్మణుల ఇండ్లవరుసలను' అని వేదంవారి టీక.

---

* లోహవాచకమైన 'బంగారము' నిత్యైకవచనాంతము. అయినను మహాకవి శ్రీనాథుఁడు బహువచనమున వాడినాఁడు. తిక్కన ధాన్యవాచకమైన 'బియ్యము'ను— "బియ్యములు, నేయు" (ఉద్యో.1.93)అని బ.వ.గా వాడియున్నాడు. బియ్యముకూడా నిత్యైకవచనాంతమే. అయిననేమి? మహాకవులు నిరంకుశులు గదా!

ఆ మహాకవి 'కనకము' లనియు ప్రయోగించినాఁడు.—

"కనకములు మణులు...అనేకములు వేడ్క నొసఁగె" (ఆము. 5. 470)

అగ్రహారప్రతిష్ఠ = నల్లిండ్లు నిలుపుట సప్తసంతానములలో నొకటి. అందుకీ క్రింది గ్రంథములు ప్రమాణము :

(1) "నందనుఁడు వనమ్ము 'నల్లిల్లు' నిధి సుగ
గృహము చెఱువు మేలుకృతి యనంగ
జగతి వెలయు సప్తసంతానములు" (కేయూర. ౧.౪)

(2) "చలిపందిరులును సత్తరు
వులు నూతులు బావులుం బువుందోఁటలుఁ జె
ర్వులు 'నల్లిండ్లు' నిలిపె" (యయాతి. ౧.౩౪)

(3) "కొమరారఁ జెఱువులు గుళ్లు ప్రతిష్ఠించి
లోకసంభావ్యంబులుగ నొనర్చె,
నిధులు 'నల్లిండ్లు' నిలిపె." (హరి. పూ. ౧.౧౯)

(4) "అనఘుఁడై యెనుబదియెనిమిది వేవురు
బ్రాహ్మణప్రవరుల బ్రహ్మవిదుల
వెలయఁగ 'నల్లిండ్లఁ' నిలిపి." (భా. సభా. ౨.౧౨౧)

దేవాలయాది ప్రతిష్ఠలను చెప్పుపట్టున 'దేహగృహము'లతోపాటు చెప్ప దగినవి 'నల్లిండ్లు' గాని 'నట్టిండ్లు' కావు అనుట కుదాహృతగ్రంథ ప్రమాణము చాలదా!

భీమఖండపద్యము, ఇంద్రుడు దాక్షారామమున గావించిన ప్రతిష్ఠలను తెలుపునదే. చూడండి తిక్కన పద్యభాగము—

"కట్టించెఁ బట్టనశ్రీవిభాగము పైడిఁ
గల్పించె వప్రంబు కాంచనమున
నిర్మించెఁ *ప్రాసాదనివహంబు కనకానఁ
బాటించె గవతులు హాటకమున
రచియించెఁ గారస్వరమున గోపురములు
కీలించెఁ గేళీది కలు భూరి

---

* "ఈ ప్రాసాదనివహంబు — ఇంద్రుడు భోగమువాండ్లకొఱకు కట్టించినది" అని వీ. బ్రు. గారి వ్రాత.

నాఁటె మందారతరువులు తోఁటలందు
వలఁతి సురభులఁ గీలారములకు నిచ్చెఁ
బోసె సిద్ధరసంబును బుక్కరిణులఁ
గణఁక నింద్రుండు దక్షిణకాశియందు."

ఇంద్రుడు దేవగృహములతోపాటు 'నల్లింట్లు' నిలిపె ననుట సముచితముగాని నట్టింట్లు కట్టించె ననుట సముచితముకాదని పద్యార్థము భావింపగల ప్రాజ్ఞులు గ్రహింపగలరు.

శ.ర. కర్త గ్రహించిన 'కూర్పించె నట్టింట్లు' అను పాఠము తప్పనియు, 'కూర్పించె - నల్లింట్లు' అని యుండదగుననియు సారాంశము.

సూ.ని. ఈ విషయమును గమనింపక, 'కూర్పించు' అను పదము క్రింద, పై 'భీమ' పద్యమును, 'కూర్పించె నట్టింట్లు' అను పాఠముతోనే ఉదాహరించినది. పొరపాటు.

ఇక్కడ చెప్పవలసిన విశేష మొకటి యున్నది. ఏమనగా: సూ.ని. 'నట్టిల్లు'కు 'గృహమధ్యభాగ' మన్న యర్థమును చెప్పినదేగాని, శ.ర. చెప్పిన 'గర్భగృహము' (గర్భగుడి) యన్న యర్థమును చెప్పలేదు.

అంతేకాదు; కేయూరబాహుచరిత్రపద్యము— అచ్చుప్రతిలో— 'నట్టిల్లు' అను పాఠముతోనుండగా 'నల్లిల్లు' అని సవరించి 'నల్లిల్లు' అను పదముక్రింద నుదాహరించియు నున్నది.

ఆ వ్రాతకు సంస్కృతభాషాపరిచయములేమి మూలము. ప్రాసాద శబ్దమునకు దేవగృహ మనియు, రాజగృహ మనియు రెండర్థము లున్నవి. అంతేగాని సాని యిల్లను నర్థము లేదు.

1. 'హర్మ్యదిర్ధనినాంవాసః, ప్రాసాదోదేవభూభుజామ్' (అమరము)

2. 'ప్రాసాదము = (1) దేవళము, (2) నగరు.' (శ.ర.)

3. 'ప్రాసాదము A temple, A palace, దేవతాగృహము, రాజగృహము.' (బ్రౌను)

కొబట్టి *'కూర్పించె నట్టిండ్లు' అను పాఠము సూ.ని. దృష్టిలోనూ తప్పే. మఱి ఆ తప్పు నడియేల కైకొన్న దనగా అది ప్రమాదము. ఆ ప్రమాద మిట్లు జరిగి యుండును.

'కూర్పించు' అను పదమున కర్థము వ్రాసినవారు 'నల్లిల్లు' నెఱిగినవారు కారు. అందువల్ల వా రా యచ్చుప్రతిలోని 'నట్టిండ్లు' నట్లే యెత్తి వ్రాసికొన్నారు. 'నల్లిల్లు' కర్థము వ్రాసినవారు దాని తత్త్వ మెఱిగినవారు; కావున అచ్చుతప్పు నొప్పుగా సవరించి కైకొన్నారు.

ఆట్లు కాదని సూ.ని. ముదలకించుచో 'నట్టిల్లు'కు 'గర్భగుడి' యన్న అర్థము చెప్పకపోవుట, 'కేయూర' అచ్చుప్రతిలోని 'నటిల్లు'ను 'నల్లిల్లు'గా మార్చుట—యను రెండు తప్పులుచేసిన వ్రేల్పడును.

౪. 'నడువఁ దెరవాటు'

కళాపూర్ణోదయము ('వావిళ్ల'వారి ప్రతి)లో—

"నాకుఁ జేఁ దలంచు లోకోత్తరపు వీణెఁ
దనకు నొనఁగఁజేసికొనియె నార!
వరునిప్రేమ నడువఁ దెరవాటుగొట్టె, ని
ట్లుండవలదె జగతి నువిదయైన." (౭. ౨౩౨)

అని యున్నది. 'నడువఁ దెరవాటు' అనుటలో రెండు తప్పు లున్నవి. (1) 'నడువ' అను పాఠము తప్పు. (2) 'తెరవాటు' అను శబ్దము తప్పు.

---

* 'నట్టిండ్లు' అను పాఠమే ఒప్పనీ, 'నల్లిండ్లు'అను పాఠము తప్పనీ వీ.బ్ర. గారు బోలెడు వ్రాసినారు.

అది యంతయు పనికిమాలిన దండుగ వ్రాత. సూ.ని. కిని విరుద మయిన వ్రాత.

*'నడుమఁ దెరువాటు' అని యుండుట యొప్పు.

సూ.ని. 'తెరువాటు గొట్టు' అను పదము క్రింద, పై పద్యమును "నడువఁ దెరువాటు గొట్టె" అను సవరణతో చూపినది. 'తెరవాటు'ను 'తెరువాటు'గా సవరించుట సరేగాని 'నడువ' నట్లే యుంచుట సరికాదు. ఆ పాఠములోని దోషమును సూ.ని. గమనింపలేదు.

తెరువాటు గొట్టినది 'నడుమఁ'గాని, 'నడువఁ' గాదు.

'మల్లాది'వారి ప్రతిలోను, ప్రౌఢవ్యాకరణములో, క్రియా. ఎ. సూ. క్రిందను 'నడుమఁదెరువాటుగొట్టె' అను పాఠమే యున్నది. ఎందుకుండదూ?

౫. 'తెరవాటు'

'తెరువాటు' అనవలెను. 'తెరవాటు' అనరాదు. ఆ పదములోని రేఫము ఉత్వసహితముగాని, అత్వసహితము కాదు. ఈ సంగతి పలువు రెఱుఁగరు. సామాన్యులమాట యేల? ఆంధ్రమల్లినాథులు వేదం వేంకట రాయశాస్త్రిగారే 'ఆముక్త' వ్యాఖ్యానము—(6-40)లో'—

---

* 'నడువఁ దెరవాటు గొట్టె' నను పాఠమే సాధువనీయము, వరుని ప్రేమ-నడువఁ—అనగా అతని ప్రేమ తనపై నిరాటంకముగా నడచుటకు, తెర - వాటు గొట్టె = నేర్పు లేక వలపు అను తెరను గప్పి, యతని యధీనమున నున్న వీణెను సంగ్రహించె నని యర్థ మనియు 'కవిరత్న'గారి తీర్మానము.

ప్రేమను దొంగిలించినదని చెప్పవలసినచోట వీణియను దొంగిలించి నట్లు చెప్పుటయు, తెరవాటు గొట్టె—నను క్రియకు, తెరను గప్పి దొంగి లించినదని అర్థము చెప్పుటయు ననుచిత మని అష్టావధాని శ్రీ బండి వేంకట రామరెడ్డిగారి మందలింపు. (చూ. 14-4-1947 త్రిలిఙ్గ)

"తెరవాటులు = దారిదోఁపుల్లను కొట్టికొట్టి"; "తెరవాటు కొట్టి = తెరవాటుగా కొట్టి"; *"తెరవు + ఆటు" (శ.ర.) "తెరవు + వాటు (వెచుట = కొట్టుట) అని నేఁ దలంచెద" అని అత్వ్యయుత రోషముతోడి రూపమునే పలుమాఱు లిఖించియున్నారు. ప్రమాదము.

'తెరువు' లోనిది 'రు' గాని 'ర' కాదనుటకు శ.ర. కర్త—"ఇట్లు పన్నగారి నగారి పారువు తెరువునం జను నప్పుడు" (ఉ. హరి. ౬ ఆ.) అను శబ్దాలంకార నిబద్ధ ప్రయోగమును చూపియున్నాడు.

పాతకవినోదమున కట్టివే మఱికొన్ని :—

(1) "గురుపాతకముల గురువులు
పురుషులు నరకములు చేరఁబోయెడి తెరువుల్
పరిభవము ననుఁగుఁ బొరువులు
తరుణుల మైసిరుల యురులు, తగు నచ్చెరువుల్." (విక్ర. 3.27)

(2) "తెరువులం దెరువు లయి విరువులుఁ బూచి మురువు లలరు కదంబ తరువులును." (రాజ. విలా. ౨. ఆ.)

(3) "తరువాటులను జేరి తెరువాటు గొట్టించు
పరువాటి బల్లెంబు పాలుచేసి." (రాజ. విజ. 2.76)

(4) "పరువులు వెట్టుచుం జిలుకఁబట్టుచుఁ బుప్పొడితిన్నెఁ దొట్టుచుం
దరువులు చుట్టుచుం బుజముత్తట్టుచుఁ బూఁబొదరింట్లఁ దెట్టుచుం
దరువులు మట్టుచుఁ విరులదండలుగట్టుచు గేలికొట్టుచుం
దెరువులు మెట్టుచుఁ ననలఁదేనియ యొట్టుచుఁగూర్మిఁదిట్టుచుఁ."
(బహులా. ౨. ఆ.)

---

* శ.ర. లో 'తెరువు + ఆటు' అనియే యున్నది. శాస్త్రిగారు సరిగా గమనింపక 'తెరవు + ఆటు' అని యున్నదన్నారు.

(5) "గురువులు తమకును లోఁబడు
తెరువులు చెప్పెదరు విష్ణుదివ్యపదవికిం
*దెరువులు చెప్పరు చీఁకటిఁ
బరువులు పెట్టంగనేల బాలకులారా." (భాగ. 7. 246)

ఇక్కడ చెప్పవలసిన విశేష మొకటి కలదు. 'తెరువాటు' అను రూపమును గ్రహించి, అర్థము చెప్పటయే కాక, 'తెరువాటు కాఁడు' అను పదముక్రింద, రామలింగ శతక పద్యమును—

"తెరువాటు కాఁడు చింతించునే కట్టిన
బట్ట డుల్చిన మానభంగ మనుచు" (30)

అని సాధుపాఠముతో సరించియున్న సూ.ని., 'డుల్చు' క్రింద ఆ పద్యమునే 'తెరవాటు కాఁడు' అని తప్పుపాఠముతో చూపియున్నది.

అది యెందువల్లనయ్యా? అని నేనడుగగా, సూ.ని. పత్రమున ప్రాజ్ఞులు శ్రీ గిడుగు సీతాపతిగారు— ♦"తెరవాటు అను పదము వచ్చే వరకును, సూ.ని. పండితులకు ఆ పదములోని రేఫము ఉత్వసహితమన్న సంగతి తెలియ'దని సమాధానము చెప్పినారు. కాని, అది సమంజస మైన సమాధానము కాదు. నిఘంటునిర్మాతల భాషాభిజ్ఞతను కాపాడు సమాధానము కాదు. సత్యమును కాదు.

ఆ తప్పు జరిగినవిధ మిట్లు: 'డుల్చు'న కర్థము వ్రాసినవారికి 'తెరు వాటు' రూపము సరిగా తెలియదు. అందువల్ల అచ్చుపుస్తకములోని

---

* 'తెరువు' అనుట తప్పు; 'తెరవు' అనుటయే ఒప్పు అని వీ. బ్రా. గారి దొక సిద్ధాంతము. అది నిరాకరము.

♦ "డులుచు-అను పదము మూడవ సంపుటము లోనిది. అప్పటికి తెరువాటు శబ్దవిచారము కలుగలేదు. అది ప్రకటితమైనతర్వాత నాల్గవ సంపుటములో ఉండవలసిన తెరువాటు పదము పరిశీలించవలసివచ్చినప్పుడు పై పద్యభాగమే (చూ. పు. 31) ఉదాహరించి తెరవాటుకాడు అని సవరించుకొన్నారు." గి. వెం. సీతాపతి. (13-12-48 త్రిలిఙ్గ)

'తెరవాటు కాని' నచ్చే నిఘంటువున కెక్కించినారు. 'తెరువాటు కాఁడు' అను మాట కర్థముప్రాసినవారు దాని తత్త్వము నెఱిఁగినవారు; కావున సరియైన పాఠముతోనే యుదాహరించినారు. ఈ విధముగా దొరలిన ప్రమాదములు సూ.ని.లో చాల గలవు. (చూ. ౬ మొదలు ౧౬ వరకును)

౬. 'నిడుపు టాఁబడ్డ'

శ.ర. లో 'క్లేశ్లుదాఁటు' క్రింద,—

(a) "అడ్డంపు నిడుపు టాఁబడ్డలగతి మన్నుఁ
బిళ్లు డొంకలనుండి క్లేశ్లుదాఁట" (స్వా. ఉ. అ)

అని యున్నది.

సూ.ని. లో 'ఆఁబడ్డ' క్రింద,—

(b) "అడ్డంబు నిడుపు టాఁబడ్డలగతి....."

అని యున్నది.

బ్రౌను ౧౮౩౧ లో ముద్రించిన ప్రతిలో,—

(c) "అడ్డంబు నిడుపు నాపడ్డలగతి....."

అను పాఠమున్నూ "అడ్డంబు - నిడుపు = అడ్డమున్ను - పొడుగున్ను, ఆపడ్డలగతి = ఆవుపెయ్యలవలెనే, *మనుబిళ్లు = మనుబోతులు" అను టీకయున్ను ఉన్నవి, (టీకాకర్త - జూలూరి అప్పయ్యశాస్త్రిగారు.)

'వాబిళ్ల' వారి ప్రతిలోను—

(d) "అడ్డంబు, నిడుపు నాపడ్డలగతి....."

అను పాఠమూ, "అడ్డంబు నిడుపును (గల) ఆపడ్డలగతిక = ఆవు పెయ్యలవలె" అను టీకా యున్నవి.

---

* 'పిడి' యనగా ఆడుమృగము. కావున 'మనుబిళ్లు=మనుబోతులు' అనుట పొరపాటు.

(e) ఆనందవారి ప్రతిలోను—"అడ్డంబు నిడుపు నాపడ్డలగతి" అనియే యున్నది.

ఇంతకును— 'అడ్డంపు నిడుపు టూఁబడ్డలగతి'
'అడ్డంబు నిడుపు టూఁబడ్డలగతి'
'అడ్డంబు నిడుపు నాఁబడ్డలగతి'
'అడ్డంబు నిడుపు నాపడ్డలగతి'

అను నీ పాఠములలో ఏది సరియైనది? కొంచెము విచారింతాము.

(a) అడ్డంబు (= అడ్డము) అను విశేష్యము విశేషణమైనప్పుడు వృత్తియందు వర్ణలోపమును చెంది 'అడ్డ' యగునేగాని 'అడ్డంపు' అను రూపమును పొందిన ట్లెందును కనబడుటలేదు.

అనగా అడ్డకట్ట; అడ్డకత్తి; అడ్డగోడ అన్న రూపములేగాని అడ్డపుఁగట్ట; అడ్డపుఁగత్తి; అడ్డపుగోడ అను రూపములు లేవన్నమాట. అదియునుగాక, 'అడ్డపు ఆవు' నిడుపు ఆవు అను వ్యవహారముకూడ లేదు. కాఁబట్టి, 'అడ్డంపు నిడుపు' అను పాఠము సరిగా దనవలసి వచ్చుచున్నది.

(b) 'అడ్డంబు నిడుపు టూఁబడ్డ' లన్నపు డర్థ మేమి?

అడ్డంబు = విశేష్యము, నిడుపు (= నిడుపైన) విశేషణము. ఆ రెంటిని ఆఁబడ్డల కన్వయించు టెట్లు? అది పొసఁగదు. కావున ఆ పాఠమును సాధువు కాదు.

'అడ్డంబు నిడుపు నా(ఁబ)పడ్డ' లన్నప్పుడో!

అర్థము జూ. అప్పయ్యశాస్త్రిగారు చెప్పియే యున్నారుగదా! వావిళ్ల రామస్వామిశాస్త్రిగారును 'అడ్డంబు, నిడుపును (గల) ఆ పడ్డల గతిఁ = ఆవు పెయ్యలవలె' అని అర్థము వ్రాసిరి.

కాబట్టి (a) శ.ర. పాఠము, (b) నూ.ని. పాఠము సరియైనవి కావు. బ్రౌనుప్రతిలోను, వావిళ్ల ఆనందవారి ప్రతులలోను ఉన్న పాఠమే సరియైనది. ఇది నా యభిప్రాయము. పెద్దలింకను విచారించి నిర్ణయింతురుగాక.

*చేఁద + త్రాడు = చేత్రాడు – అయినట్లే, ఆవు + పడ్డ = ఆపడ్డ కావచ్చునేమో!

ఒక మాట—

'ఆఁబడ్డ' యను పదము క్రింద "...టూఁబడ్డలగతి" అన్న సూ.ని.యే 'అడ్డము' అను పదముక్రింద "...నాఁబడ్డలగతి" యన్నది. మళ్ళీ ఆ సూ.ని. యే 'నిడుపు' అను పదముక్రింద "...నాపడ్డలగతి" యన్నది.

ఇట్లూ నిఘంటువు ఒక పద్యమునే ఒక చోట 'టూఁబడ్డ'లనీ, మఱి యొకచోట 'నాఁబడ్డ'లనీ, ఇంకొకచోట 'నాపడ్డ'లనీ భిన్నభిన్న పాఠములతో నుదాహరించుట సరియగునా? అట్లు జరుగుటకు కారణ మేమి? ఇంతకును ఆ పాఠములలో ఏది సాధువో జిజ్ఞాసువులు నిర్ణయించుకొను టెట్లు?

(పాలువిడిచిన ఆవుపెయ్య)

ఆఁబడ్డ యను పదానికి సూ.ని. 'పాలువిడిచిన ఆవుపెయ్య' యని యర్థము చెప్పినది. అదియును సరికాదు. 'పడ్డ'యనగా పాలువిడిచినదూడ కాదు. ఈడేరి కట్టుటకుతగిన వయసులోనున్న పశువు.

శ.ర.లో, "పడ్డ = తొలిచూలియావు (లేక) గేదె" అని యున్నది. బ్రౌణ్యములో, "పడ్డ. A female buffalo or cow, fit for breeding" అని చెప్పబడి యున్నది.

---

* "క్రొత్త మొదలగు కొన్నిటి లుప్తశేషసుసకుఁ గొన్నిశబ్దములు పరమగునపుడు నకారము కానరాదు. చేఁద, చేత్రాడు."—

(ఆం.భా.శా. సంధి. సూ. ౫౮)

'చేఁత్రాడు' అని శ.ర. కర్త అరసున్న పెట్టి ద్రుతకార్యములేని రూపమునే చూపినాడు. ఆ భాగ్యమున కరసున్న పెట్ట నేల?

మనుచరిత్రలో క్రేళ్లుదాటిన మనుఁబిళ్లును యౌవనమువచ్చిన ఆవు పెయ్యలను పోలి యుండెననుట యుచితముగాని, అప్పుడప్పుడే *పాలు విడిచిన ఆవుదూడలవలె నుండెననుట ప్రకరణోచితము కాదు.

౭. 'ఆఁబెయ్య'

సూ. ని. లో 'క్రుమ్మలాడు' క్రింద,—

"కొసర కొఁబోతు నాఁబోతుఁ గ్రుమ్మలాడ
నడిమి యాఁబెయ్యగతివచ్చె నాకు నిపుడు." (కాశీ. ౩-౧౦౪)

అని యున్నది.

'ఆబోతు లాబోతులు కుమ్మలాడి లేగలకాళ్లు విరుగదొక్కినట్లు' అని లోకోక్తి. ఈ లోకోక్తియే ప్రౌఢ్యమున నిట్లున్నది.

"ఆవులావులు పోట్లాడి(తే) లేగలకాళ్లు విరుగుతవి'. **When the great fall out the poor suffer."**

ఆవులుగాని, ఆబోతులుగాని కుమ్మలాడితే ఆతొక్కిడిలో నలిగి విరుగునవి 'లేగల' కాళ్లు. లేగ అనగా లేతదూడలు. ఈ యర్థము వచ్చు

---

* "క్రేళ్లురుకు పడ్డలు పాలతోపాటు శైశవదశనువీడి, యవ్వనారంభములోనుండునవియే క్రేళ్లురుకును. క్రేళ్లురుకుట యన చెంగుచెంగున గంతులువేయుట గదా? అట్టి గంతులు యవ్వనారంభములోనున్న దూడలు గంతులువేయును. గాని యెదయయి మేతనీళ్లు మాని కోడెకొఱకు దిరుగు పడ్డలు క్రేళ్లురకవు." అంటారు వీ.బ్ర. గారు.

పడ్డలు, పాలతోపాటు శైశవదశను వీడునట! శైశవమును వీడుట వాటి యిష్టమే కాబోలు!! పాలు విడిచినంతనే ఆ దూడలకు యవ్వనారంభమగునట. ఏమి జ్ఞానమండీ! పాలుమానిన పసిబిడ్డ లందరూ యువతులూ, యువకులే నన్నమాట!!!

ఆది యట్లుండనిండు:- 'క్రేళ్లురుకుపడ్డలు క్రేళ్లురుకును' అట్టి గంతులు దూడలు గంతులువేయును' అనగా అర్థ మేమి?
వాక్యమయినను సరిగా వ్రాయలేనివారికి సాహిత్యచర్చల బ్రోలి యెందుకో!

నట్లే శ్రీనాథుఁడును కవిత్వము చెప్పియుండును. కాని, సూ.ని. పాఠమును బట్టి (ఆఁబెయ్య =) ఆవుదూడ' వచ్చునేగాని, 'లేఁగదూడ' రాదు.

'లేఁబెయ్య' అనియే సరియైన పాఠము.

1916 లో ముద్రితమైన 'వావిళ్ల' వారి ప్రతిలోను, శ.ర. లో 'క్రుమ్మలాడు' - 'దెస' అను రెండుపదములక్రింద ను 'లేఁబెయ్య' అను పాఠమే యున్నది.

మరి విశేష మేమనగా:— సూ.ని. 'దెస' అను పదముక్రింద 'లేఁబెయ్య' పాఠమునే చూపినది. కాబట్టి అచ్చుప్రతిలోను, శ.ర. లో రెండు తావులలోను, సూ.ని. లోను గూడా ఉండుటనుబట్టిగాను, లోకో కి కనుగుణమై యుండుటవల్లను *'లేఁబెయ్య' పాఠమే సాధువు. ఆఁబెయ్య పాఠ మసాధువు.

సూ.ని. ఆ యసాధుపాఠము నెక్కడ సంపాదించినదో చెప్పదు. 'క్రుమ్మలాడు' క్రింద 'ఆఁబెయ్య' అనీ, 'దెస' క్రింద 'లేఁబెయ్య' యనీ భిన్నపాఠములను చూపుటకు కారణమేమో మన కంతుపట్టదు.

(గతి, దెస)

వావిళ్లవారి అచ్చుప్రతిలో "నడిమి లేఁబెయ్య గతి వచ్చె" అని యున్నది. శ.ర. లో రెండు తావులలోను "నడిమి లేఁబెయ్య దెస" అని యున్నది.

---

* "లేగ - అన్నను 'పెయ్య' అన్నను నప్పుడు పుట్టిన వత్సమునకే పేరు కావున పెయ్యను లేత పెయ్య అనుటలో సారస్యము లేదు"—అని వీ. బ్రు. గారి వ్రాత.

పెయ్య యనగా సామాన్యముగా 'దూడ'; అందును ఆడుది యగును. అంతేగాని, లేగ కాదు.

ఆం. భా. లో— 'తనరు లేగ యనంగఁ దగ్గకంబు'; 'కోడె

సూ.ని. 'దెస' క్రింద ''నడిమి లేఁబెయ్యదెస వచ్చె'' అను పాఠమును చూపి....."ఇది, శ.ర. పాఠము; లేఁబెయ్య గతి వచ్చె - అని ముద్రిత ప్రతిపాఠము" అని సూచించినది. ఆ ముద్రితప్రతి యెక్కడిదో చెప్పదు.

ముద్రితప్రతిలో 'లేఁబెయ్యగతి' అని యుండగా, మరి తాను 'క్రొమ్మలాడు' క్రింద 'ఆఁబెయ్యగతి' యని ముద్రించు టేల?

పాఠవిషయమున సూ.ని. తగినంత శ్రద్ధ వహింపలేదు.

ఁ. 'కాఁడయి'; 'కాఁడుగ'

సూ.ని. లో 'అబ్బకాఁడు' క్రింద, వేంకటకవి పంచతంత్రములోని పద్య మిట్లుదాహరింపబడినది :

క. "అని చిందరేఁగి యట్ల
చ్చెనటి.....
ఘనజఘనం బాసి యబ్బకాఁడయి పోయెఁ" ర. ఁ-౩

(ఇది చిన్నయసూరి నిఘంటువు పాఠమట)

యనఁగఁ బెయ్య యనఁగ గోప్రభృతిపుంస్త్ర్యపత్యముల్'—అని చెప్పబడి యున్నది. ఆ ప్లే, శ.ర. లోను—''పెయ్య = 1 పాలువిడిచిన ఆఁడుదూడ; 2 దూడ. లేగ = క్రొత్తగాఁ గలిగినచూడ, తర్ణకము'' అని యున్నది.

కావున వీ.బ్ర. గారి వ్రాత సరియైనది కాదు.

''ఈ పెయ్యలలో మగవానికంటె 'ఆఁబెయ్యలే' దుర్బలములు గనుక ''ఆఁబోతు నాఁబోతు గ్రుమ్మలాడునపుడు కొళ్లను విరుగఁగొట్టు కొనువి 'ఆఁబెయ్య' లనుటయే సరసము గాదా''అని వారిదే మఱియొక వ్రాత.

మగవానికంటె ఆఁబెయ్యలే అనుటలో అర్థమేమొ వారే చెప్పవలె. ఆఁబెయ్యలు (తామే) కొళ్లను విరుగగొట్టుకొనునట! నిజమేనా? ఎందుకు విస్తరము:. వారి వ్రాతలు అర్థశూన్యములు.

సూ. ని. యీ పద్యమునే మరల 'చిందరేఁగు' క్రింద—

"ఆని.....యబ్బ కొఁడుగఁ జనియెఁ"

అను పాఠముతో చూపినది. ఈ పాఠ మే ప్రతిలోనిదో సూ.ని. చెప్పలేదు. తొలిపాఠమును వదలి యీ పాఠమును గ్రహించుటకు హేతువేమో తెలుప లేదు.

వావిళ్ల వారి ప్రతిలోను, 'అబ్బ కొఁడు' క్రింద, శ.ర. లోను—

"అని చిందరేఁగిన ట్ల, చ్చెనటి...యబ్బ కొఁడుగఁ బోయెఁ"

అని యున్నది. సరియైన పాఠ మేదో?

౯. 'చొరు' ; 'చేరు'

శ.ర. కర్త "చొరు = మిరియములోనగు సంభారములను చేర్చి కొఁచిన చింతపంటిరసము" అనిచెప్పి— "ఈ యర్థమం దిది యిట్లు దంత్యాదిగా నొకచోట ప్రయోగింపబడి యున్నది. అయినను వాడుక యందు తాలవ్యాదిగా కనబడుటవలన అది (?) యుక్తముగా తోఁచదు." అన్నాడు. అంతేకాక 'చేరు'నుకూడా మూలపదములలో చేర్చి 'చొరు'కు చెప్పిన యర్థమునే చెప్పినాడు. కాని, యీ రూపమునకును ప్రయోగము నియ్యలేదు.

వే.వే. శాస్త్రిగారు సెల్లూరు పురమందిరమున ఆంధ్రసాహిత్య పరిషదష్టమ వార్షికసభ కధ్యక్షు లైనప్పుడు "విమర్శల విషయమున రసమును (అనఁగా చేరును) రుచి చూచి ఈ రసమెవరిది (అనఁగా నీ చారు నెవరు కొఁచినారు) అని యడుగవలయును. అట్లడిగినదే రసము" అన్నారు.

వారి దృష్టిలోను 'చారు' అపశబ్దము, 'చేరు' సుశబ్దము. సూ.ని., శ.ర. వనుపరించి 'చొ' క్రింద 'చొరు', 'చే' క్రింద 'చేరు' పఠించి,

శ.ర. లోని యర్థమునే యనువదించినది. కాని, చింతపండురసమును 'చేరు' అనుట సరికాదు. చారు (ఱు) అనియే అనవలెను. 'చారు' సంస్కృత 'సార' శబ్దమునకు వికృతి.

సారము = చారు అనుటకు ప్రమాణము.

"సారం భోజనసారం, సారం సారంగలోచ నాధరతః
పిబ ఖలు వారంవారం, నోచే న్మృధాభవతి సంసారః.
ఆన్లికౌషధసంభూతం, సారం వాతవినాశనమ్
పిత్తశ్లేష్మకరం కించిత్, సురుచ్యం వహ్నిబోధకమ్."

యోగరత్నాకరము. (పు. ౧౩౪)

సారమే కన్నడమున 'సారు', తెనుగున 'చాఱు' అయినది. కన్నడమున 'చాఱు' అనియును కలదు.

"చాఱు = సాఱు. Sap, juice, broth. See పులిచాఱు"

"పులిచాఱు = A broth or sauce made of tamarind, salt etc." (కన్నడ నిఘంటువు)

నూ.ని. 'చాఱు'కు, 'చేరు'కు కూడ ప్రాచీనరచనలను చూపినది. కాని 'చేరు'కు చూపినవి ప్రమాణములు కావు. ఎందువల్లననగా అవి మార్వరాని యతిస్థానప్రయోగములు కావు.

"శబ్దస్వరూపమును నిర్ణయించుటకు శబ్దస్వరూపము మార్చినచో ఛందోభంగమగునట్టి ప్రయోగములు ... పరమప్రమాణములు" అని ఆ నిఘంటువే 'గ్రంథనిర్మాణపద్ధతి'లో వక్కాణించి యున్నది.

నూ.ని. 'చాఱు'కు చూపిన వన్నియు, (*చారులు పిండివంటలును

---

* 'చాఱులు' అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారి పాఠము :—

"ఆ తెలుగుపదములందే యుండును. 'చాఱులు' తెలుగుపదమగుచో

శర్కఁయుక్త (హర. ఆ.3౧) మొదలయినవి) యతిస్థాన ప్రయోగములు. కావున అవియన్నియు గ్రహింపదగినవి. 'చాఁ' సాధురూపము.

'చాఁఱు'కు అట్టివే మరికొన్ని ప్రయోగములు :

"చాఁఱులేకాదు బజ్జి పచ్చళ్లతీరు" (పాంచా. 4.53)

"చాఁదుబాగున నల్ల చారుగాఁచి" (హర. 2.121)

"జాఁఱుటయనఁగ బజాఁఱు హ
జాఁఱము మొగసాల మఱియుఁ జాఁఱులు" (స.సా.సం. 3.185)

"పులిచారు వంచె నొక్కఁతె
పులిచాఁఱలచీర గట్టి భోక్తల కేకా
వళిచారు చంచరీకా
వళిచారు చలత్కచాళి వహి మహి పాగడఁక. (బహులా. ఆ. 4)

చింతపండురసమును 'చేరు' అనుట తప్పనియూ, 'చాఁఱు' అనుట ఒప్పనియూ, 'చాఁఱు' తత్వము నెఱుగని సంస్కర్తలు ప్రాచీన రచనల లోని 'చాఁఱు'ను 'చేరు'గా మార్చి ముద్రణమున వెలయించిరనియూ సారాంశము.

'చాఁఱులు' గావలసియుండునుగదా! 'సారం' అను సంస్కృతశబ్దమునుండి వచ్చినదగుటచేత 'చాఁఱు' తెనుగు గాదు. అందువలన అందలి 'చా' దంత్య ముగ నుండజాలదు. కావున (హరవిలాస పద్యములోనివి) చారులును కాదు; చాఁఱులును కాదు. మూలగ్రంథము చూచితిని. అందు 'చాఁఱులు' అని యున్నది. శ్రీనాథుడు వండించినది 'చాఁఱులు'. చాఁఱులనగా, చాఁఱ = మత్స్యవిశేషము, చాఁఱకంద, చాఁఱపప్పు... అని శబ్దార్థచంద్రిక". అని వీరబ్రహ్మంగారి ఆక్షేపము.

ఈ యాక్షేపమునకు సమాధానము చెప్పవలసినవారు నూని. పండితులేనని నా సమాధానము.

చంగలించు; చాఁయు; జడ; జాణ మొదలగు దంత్యాదులను, చెఱు; చెమట; చేప; చేట మొదలగు తాలవ్యాదులనుకూడ— చంగలించు; చారు; జడ; జాణ; చర; చమట; చాప; చాట అని తొలి చకారజకారములతోనే ఉచ్చరించు వాడుక లోకవ్యవహారమున నున్నది. ఆ వాడుక క్రమక్రమముగా వ్రాతలోనికిని, అందుండి అచ్చులోనికిని ప్రవేశించినది.

రాయసగాండ్లు, అచ్చువారుగూడా ఇది దంత్యము (రెండవ చకారము; రెండవ జకారము) అని తెలియుట కాచ-జల మీద నుంచవలసిన '_' (రెండు) గుర్తు నుంచమానినారు. అందువలన సామాన్యుల మాట యటుండ ప్రాజ్ఞులుకూడా ఒక్కొక్కయెడ తప్పున కర్గమగుట తటస్థించుచున్నది.

ఒక్క యుదాహరణము :—

గొరన హరిశ్చంద్రలోని "చిడుముగోఁకుచుఁ జెఱఁ జిక్కినట్లుండి" అన్న నక్షత్రకుని వచనము, వ్రాతలో—

"చిడుముగోకుచు జరఁ జిక్కినట్లుండి"

అని మారినది. 'చెఱు' వ్రాతలో 'జర'గా మారినసంగతి గమనింపక కీ. శే. వెంకటరాయశాస్త్రిగారు 'జర' గానే గ్రహించి

"జరక్ = ముసలితనముచేత"

అని టీక వ్రాసినారు. చెఱఁ జిక్కినట్లు = చెఱలలోఁ బడ్డట్లు-అని చెప్పుట ప్రకరణమున సుచితము. 'ముసలితనముచేత చిక్కినట్లు' అని చెప్పుట యసుచితము.

ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నున్న వ్రాత ప్రతిలో— 'చిడుముగోకుచు = తీటపక్కలు గిల్లుకొంటున్న, చెఱజిక్కినట్లుండి = బందెఖానాలో పడినట్లుగా నుండి' అని టీక వ్రాసియున్నది.

కాబట్టి, శాస్త్రిగారు 'చెఱు'ను 'జర'గా (ముసలితనముగా) గ్రహించుట పొరపాటు. ఇట్లే వారు 'జలగ'లోని 'జ' కారము దంత్యమని గణు

నిరపేక్ష తెనుగున 'జ' ఉండరాదన్న భావమున 'జెలగ'గా సవరించినారు. 'గిడుగు' వారు ప్రామాణికప్రయోగములను జూపి శాస్త్రిగారి సవరణ తప్పని నిరూపించినారు. (చూ. ఆ. పం. భా. భేషజము)

'చెఱు' - 'జెలగ' అను పదములు వ్రాయసగాండ్ర అజ్ఞానమునను, సంస్కర్తల ఆపరిశీలకతత్పరతలనను 'చర' - 'జెలగ' అయిన ట్లే, 'చాఱు' 'చారై' - 'చేరు' అయినది. ఆ 'చేరు'ను నిఘంటువు లట్లే గ్రహించినవి.

ఇక్కడ నొక మాట :— 'చెమట'ను 'చమట' యనుట వ్యవహారమున నేకొకాక,—

"కన్నీరు గ్రమ్మించుఁ గంపించు గుబ్బ
చన్నులపై జాఱుఁ జమట మైఁ దొరుఁగ"

అని, (మద్రాసు యూనివర్సిటీవారు ముద్రించిన) నవనాథచరిత్ర (పుట. 145)లో మార్చ వీలుపడని యతిస్థానమునను గనబడుచున్నది.

అచ్చులో నుంటయే ప్రమాణముగా 'చేరు'ను తీసికొన్న సూ.ని., అచ్చులోను యతిస్థానమునను కూడా ఉన్న 'చమట'ను తీసికొనలేదు! హేతు వేమో?

నవనాథచరిత్రను నేను చూడలేదని సూ.ని. యనుట పొసగదుగదా!

౧౦. 'నల్లఁజారు'

సూ.ని. 'చాఁదు' క్రింద హరవిలాసపద్యమును—

"*మూల్గు మెమ్మలతోడ ముదుక గాకుండఁగఁ
జాఁదుసేసిన నల్లఁ జారుగాఁచి" (హర. ౨-౧౨౧)

---

* శ.ర. లోను, బ్రౌణ్యమునను కూడా, 'మూలగ' అనురూపమే

అని యుదాహరించినది. లోకవ్యవహారమున, 'గుమ్మడికాయ కూరచేసితిని, వంకాయ పప్పులో వేసితిని, కాకరకాయ తాలింపుపెట్టినాను. బెండకాయ పులుసు చేసినాను' అనురీతి వాడుక కలదుగాని,— 'గుమ్మడికాయఁ గూరచేసితిని, వంకాయఁ బప్పులో వేసితిని, కాకరకాయఁ దాలింపు పెట్టినాను, బెండకాయఁ బులుసుచేసినాను' అనురీతి వాడుకలేదు.

తెనుగు మాతృభాషకానివారు, వ్యాకరణ సహాయమున తెనుగు నలవరుచుకొన్నవారు, అందును 'ద్వితీయకుం బ్రథమయగు' నన్నసూత్ర మెరుగనివారు అలా అంటే అందురేమోగాని, శ్రీనాథునివంటి తెనుగుకవి 'నల్లఁ జారుగాఁచి' అని, అనియుండడు.

వావిళ్లవారి ప్రతిలోను, శ్రీ వే. ప్ర. శాస్త్రిగారు పరిష్కరించిన ప్రతిలోనుగూడా 'నల్ల చారుగాఁచి' అనియే యున్నది.

ఈ 'ఁజారు' పాఠమును, సూ.ని. యెక్కడ సంపాదించినదో!

ఇక్కడ నొక విశేషము—శ్రీ 'వేటూరి'వారి ప్రతిలో, పాఠము

'చాఁదుబాగున'

అని యున్నది. 'నల్ల = నెత్తురు, చాఁదుబాగునట్ = చాదువలె - చిక్కగా, చారుగాఁచి' అని ఆపాఠమున కర్థము. కావున అదియే సాధుపాఠముగా నున్నది. సూ.ని. ఆపాఠమును తీసికొనకపోవుటకు కారణ మేమో? ఆపాఠము తనకు సమ్మతముకానిచో పాఠాంతరముగానైనను చూపవలదా? చూపలేదే! సూ.ని. ఆప్రతిని చూడనేలేదేమో!

ఇంతేకాకును, సూ.ని. తీసికొన్న "చాదునేసిననల్లక్" అను పాఠని కర్థమేమో?

గాని 'మూలుగు' అనుగూపము లేదు. 'మూలగ' అనియే లోకమున వాడుక. ఐతే— పండుగు, పండగ, దండుగు, దండగ అన్నట్లు మూలుగు, మూలగ అని రెండు రూపములు నుండవచ్చునేమో!

౧౧. 'చేరు'; 'చేరుద్రావుట'

చేరు అనగా పశువుల మగగుఱి. చేరుమాద (= చేరువాచుట) = పశువులకు వచ్చు ఒక వ్యాధి.

'చేరు' పశుముష్క-మునందును వర్తించును. ముష్క-మర్దనమును *'చేర్లుకొట్టుట' యందురు.

కన్నడభాషలో 'చేరు'కు పశుముష్క-మనియే అర్థము.

కన్నడ నిఘంటువులో — "చేరు - Testicles swollen from venereal disease" అని చెప్పబడి యున్నది.

కొన్ని పశువులు లింగమును చుంబించుకొనును; - కొన్ని తమ మూత్రమును పానము చేయును. ఆట్టి దుర్భ్యాసమును —

'చేరుద్రావుట'

యందురు. ఈ పదమును, అప్పకవి, — "చేరుద్రావుట, చూరి చిన్నకత్తి" (2-196) యని రేఫాంత్య సీసపూర్వికలో చేర్చినియున్నాడు.

ఈ 'చేరుద్రావుట'లోని 'చేరు'ను చింతపండు 'చూఱు'గా భావించిన సంస్కర్త లెవరో 'చేరు' అపశబ్దమనుకొని, 'చారు'గా మార్చి, యతిరక్షణార్థము, 'చూరి చిన్నకత్తి' యను పూర్వపాఠమును — 'చిన్నచూరి కత్తి' యని తారుమారుచేసి, — "చారుద్రావుట చిన్నిచూరి కత్తి" అని, అప్పకవి రచనను అమాంతముగా మార్చివేసినాడు. 'చూరి = చిన్నకత్తి' యని అప్పకవిరచనలో అర్థము. 'చిన్నచూరి కత్తి' యన్న సవరణ అర్థశూన్యము. అది, 'చేరు' అను పదమున కర్థమునూ, 'చేరుద్రావుట' అను జాతీయమునూ ఎఱుగని సాహసపు సవరణ.

---

* ముష్క-మర్దనమును 'కొలుపట్టుట' యనియు నందురు. శ.ర. కర్త చెప్పలేదు. సూ.ని. లో లేదు.

ఈ యెల్లవిషయములను గమనించి 'గిడుగు' పండితులు, అప్పకవీయములో- ''చేరుద్రావుట చూరి చిన్నకత్తి'' అని సాధుపాఠమునే మరల నెలకొలిపినారు.

౧౨. 'కలువడము' ; 'కలవడము'

సూ.ని. లో 'చానపి' క్రింద —

''సీ. *కలువడంబు, కలాఁపి, కలయంపి, చానపి. (ఆం.భా. ౨.౨౩)

అని యున్నది.

కలయంపి యను నర్థమునిచ్చు పదము 'కలవడము' కాని 'కలువడము' కాదు. కలువడము అనగా, (కలువ)పూలదండ. ''కలువడము = కలువ పూలదండ, ప్రాలంబమాలిక'' యనియు, ''కలవడము = గోముఖము; అలుకుట'' యనియు సూ.ని. లోనే యున్నది.

అది యట్లుండగా ఆ సూ.ని. లోనే కలయంపి, కలవడము అను రెండు పదములక్రిందను, పై పద్యమే 'కలవడంబు' అను పాఠముతో చూపబడి యున్నది. మరియు నా పాఠము 'బ్రౌ., వ్రాతప్రతి పా.' అనియు తెలుపబడి యున్నది.

'కలవడము' క్రింద ''కలవడంబు కలాఁపి'' అను పాఠమును చూపి, ''ఇది బ్రౌను, వ్రాతప్రతుల పాఠము'' అని చెప్పిన సూ.ని. మళ్లీ, 'చానపి' క్రింద ''కలువడంబు, కలాఁపి'' అను భిన్నపాఠమును చూపుట యెందుకు? ఆ పాఠ మే ప్రతిలోనిదో చెప్పకపోవు టేల?

---

* శ.గ. లో 'కలవడము' లేదు. శ.ర. కర్త 'కలాపి' క్రింద ''సీ. కలాపి కలయంపి చానపి యన గోముఖాఖ్యయై యలరుచుండు. ఆం.భా. ద్వి.'' అను పద్యము నుదాహరించియు, ఆ పద్యపాదమున ప్రారంభమునసే యున్న 'కలవడంబు' అను పదమును గ్రహింపలేదు. పద్యపాదము నుదాహరించుటలోను ఆ పదము నుజ్జగించినాడు. ప్రమాదము.

సూ.ని. చెప్పలేదు గాని, ఆ 'కలువడంబు' పాఠము 'వావిళ్ల'వారి ప్రతిలోనిది. ఆ ప్రతిలో 'ల'కు బదులు 'లు' పడినది. అది అచ్చుతప్పు. సూ.ని. ఆ యచ్చుతప్పు నక్లే తీసికొన్నది.

౧౩. 'మర్ధ' ; 'మూర్ధ'

సూ ని. లో 'గొరగ' క్రింద—

"వీరమైలారుదేవర వీరభటులు
గొండ్లియాడుచునున్నారు గొరగపడుచు
నాడుచున్నది చూడు మర్ధాభినయము
తాను సెట్టికసీలంతగాని లేదు" (క్రీడా. ౧౪౩)

ఆనియు, 'సెట్టికసీల' క్రింద—

"... ... ...
... ... గొరగపడుచు
నాడుచున్నది చూడు మూర్ధాభినయము
తాను సెట్టికసీలంతగాని లేదు"

ఆనియు భిన్నపాఠము లున్నవి. ఆ పాఠము లెక్కడివో, తా నట్లొక చోట నొకపాఠమును, ఇంకొకచోట నింకొకపాఠమును చూపుటకు కారణ మేమో సూ.ని. చెప్పలేదు.

నేఁడు ప్రచారములోనున్న క్రీడాభిరామము ప్రతులు రెండు :
(1) శ్రీ మానవల్లి రామకృష్ణకవి గారిది.
(2) శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారిది. (సుపరిష్కృతము)

కవిగారిప్రతిలో పాఠ మిట్లున్నది:—

"వీరమైలారుదేవర వీరభటులు
గొండ్లియాడించుచున్నారు గొరిగెపడుచు
నాడుచున్నది చూడు మర్ధాభినయము
తాను సెట్టిగసీలంతగాని లేదు"

శాస్త్రిగారి పాఠ మిట్లున్నది—

"వీరు మైలారుదేవర వీరభటులు
గొండ్లి యాడించుచున్నారు గొరగపడుచు
నాడుచున్నది చూడు మూర్ధాభినయము
తాను నెట్టికసీలంతగాని లేదు".

ఈ పరిశీలనమువలన, సూ.ని. 'నెట్టికసీల' క్రిందచూపిన 'మూర్ధాభినయ' పాఠము శాస్త్రిగారిప్రతిలోని దని యేర్పడినది; కాని, 'గొరగ' క్రింది 'మర్ధాభినయ' పాఠ మే ప్రతిలోనిదో యేర్పడుట లేదు.

కవిగారిప్రతిలో 'మర్ధాభినయ' మున్నది; కాని, 'గొండ్లియాడుచు నున్నారు' అని లేదు; 'ఆడించుచున్నారు' అని యున్నది. 'గొరగ' అని లేదు; 'గొరిగె' అని యున్నది. 'నెట్టికసీల' అని లేదు; 'నెట్టిగసీల' అని యున్నది.

కాబట్టి సూ.ని. పాఠ మెక్కడిదో సంకరపాఠముగాని సరియైన పాఠము కాదు అనిపించుచున్నది.

సుపరిష్కృతమైన శ్రీ శాస్త్రిగారి పాఠ ముండగా సూ.ని. అట్టి తప్పు పాఠ మేల కైకొనెనో!

౧౪. 'తారి'; 'దారి'

సూ.ని. తకారాదిపదములక్రింద, "తారి = ఆట ఆడించెడు సూత్రధారుఁడు" అనిచెప్పి, "సీ...తారి నాఁగను సూత్రధారకుండు." అని, ఆంధ్రభాషార్ణవ పద్యము (౨-౨౨౭) నుదాహరించినది.

మళ్లీ, దకారాదిపదములక్రింద, "దారి = సూత్రధారుఁడు" అని యర్థముచెప్పి, ఆ (ఆం. భా.) పద్యమునే-"దారినాఁదగు సూత్రధార కుండు" అను పాఠముతో చూపినది.

"తారినాఁగను" - "దారినాఁదగు" అను రెండు పాఠములలో, ఆం. భా. కర్త పాఠ మేదో ఒకటి యగునేగాని రెండును అతనిపాఠములే యగుట అసంభవముగదా! అతని పాఠ మేదో నిర్ధారణగా తెలిసికొనిగదా నిఘంటువు తీసికొనవలసినది?

'తా' క్రింద 'తారి' యని, 'దా' క్రింద 'దారి' యని ముద్రించుటయు, తదనుగుణము గా కవిపాఠమునకును వైవిధ్యము కల్పించుటయు ప్రమాదము కాదా?

ఆ ప్రమాద మిట్లు జరిగియుండునని నా తలంపు.
ఆం. భా. (1912. 'వావిళ్ల'వారి ప్రతి)లో, పాఠము,

"నటుఁడొప్పు నట్టిన నట్టువుం డనఁగను,
దారి నాఁదగు సూత్రధారకుండు"

అని యున్నది. ("దారినాఁగను" అను పాఠముగల ప్రతి వేరొకటి యున్నదికాబోలు.) సూ. ని. పండితులలో తకారాదిపదములను సంత రించినవారు, ఆ 'దారి'లోని 'దా'ను, ఆద్యేశసరళముగా గ్రహించి, "తారినాఁగను" అను పాఠమును తీసికొన్నారు.

దకారాదిపదములవాఁడు, ఆ 'దారి' సరళాదియే యనుకొని, "దారినాఁదగు" అను మాటల నట్లే వ్రాసికొన్నారు. ఎవరి 'దారి' వారిదే. ఒకరిసంగతి, ఒకరికి తెలియదు. అందువల్ల, అటు వారి 'తారి' ఇటు వీరి 'దారి' రెండు అచ్చెకూర్చున్నవి. పరిశీలన సరిగా జరుగలేదన్నమాట.

ఇంతకును 'తారి' సాధువా? 'దారి' సాధువా? అంటే; శ. ర. కర్త, బ్రౌనుకూడా తకారాదిరూపము ('తారి')నే తీసికొన్నారు.

"తారి = ఆటూడించెడి సూత్రధారి" (శ. ర.)

"తారి=The principal actor or manager of a Company. సూత్రధారుడు ఆం. భా. మేళనాయకుడు." (బ్రౌ)

ఆంధ్రపద పారిజాతములోను, 'తారి = సూత్రధారకుడు' అనియే యున్నది. కాబట్టి, 'తారి' అనునదే సాధురూపమని యేర్పడుచున్నది. పండితు లింకను పరిశోధింతురుగాక.

౧౫. 'తప్పఁజేసి'; 'తప్పుసేసి'

సూ. ని. 'చేసి' అను పదముక్రింద,—"చేసి. అవ్య. తృతీయా విభక్త్యర్థకము. (*ఇది 'చేత' విభక్త్యర్థక ప్రత్యయములకును, 'వలన' వర్జకమునకును తఱుచుగ ననుప్రయుక్తమగును)" అనిచెప్పి, అందు కుదాహరణముగా,

"వెలివెట్టిరే బాడబులు పరాశరుఁబట్టి
దాశకన్యకేళి తప్పఁజేసి." (మను. ౨-౬౩)

అను పద్యము నిచ్చినది.

ఆందువల్ల, పై పద్యములోని 'తప్పఁజేసి' అనుమాటకు, సూ. ని. 'తప్పుచేత' అని యర్థముచేసికొన్నదనియు, ఆ యర్థమున 'తప్పు + చేసి' అని విభాగమనియు నేర్పడుచున్నదిగదా.

మళ్లీ, ఆ సూ.ని యే, 'తప్పు' అను విశేష్యమునకు 'చేయు' అను క్రియ అనుప్రయుక్తమై, యేకపద (శబ్దపల్లవ) ధాతువైనట్లు నిర్ణయించి "తప్పుచే (సే)యు" అను క్రియను, మూలపదములలో పఠించి "తప్పుగా నేంచు" అని యర్థముచెప్పి, ఆ యర్థమునకు ఉదాహరణగా, మళ్లీ ఆ మనుచరిత్రపద్యమునే,—

"దాశకన్యకేళిఁ దప్పుసేసి"

అను పాఠముతో చూపినదే! అది యెలాగండీ!!

తొలిపాఠమున 'కేళి' కళ; 'తప్పు' గ్రుతప్రకృతికము.

మలిపాఠమున 'కేళి' ద్రు. ప్ర. 'తప్పు' కళ.

తప్పేదిరా? ఒప్పేదిరా? అసలు కవిపాఠ మేదిరా? పరస్పరవిరుద్ధపాఠములా నిఘంటువులలో చేరినదారి యేదిరా?

---

* ఈ వివరణము, ఉదాహరణపద్యము ప్రౌఢవ్యాకరణమునుండి గ్రహింపబడినవి. (సూ. కారక. ౪)

సీతారామాచార్యులవారు, * పొ. వ్యా. లోను, 'వెలిపెట్టు' అను పదముక్రింద శ.ర. లోను, 'తప్పుఁజేసి' అను పాఠమునే చూపియున్నారు.

కాని, దాశకన్యాకేళి, తప్పుచేసి (= తప్పుగానెంచి) అను పాఠమే యుచితమైనది. తప్పుగా నెంచి వెలిపెట్టిరేఁ? అనఁగా, తప్పుగా నెంచలేదనియు – అందువల్లనే వెలిఁవేయలేదనియు భావము.

'తప్పుచేత వెలిపెట్టిరేఁ?' అనుచో, దాశకన్యాకేళి తప్పేయనియు, అయినను ఆ తప్పుచేత వెలిపెట్టలేదుగదా యనియు నర్థమగును.

'కేళి' తప్పని, వరూధిని ఒప్పుకొన్నట్లు చెప్పుటకంటే, తప్పుకాదని నిరూపించినట్లు చెప్పుట యుచితతరము కాదా?

"తప్పుజేసి = నేరముగా నెంచి" అనియే జూలూరివారి టీక. ('తప్పుచేసి' అను క్రియయే 'తప్పుజేసి' అని వాడబడినది. అది ఆనాటి సంప్రదాయము.)

వావిళ్లవారి ప్రతిలోను,—'తప్పనేసి' అనియే పాఠము.

'దాశకన్యాకేళిఁ = ...మత్స్యగంధియొక్క కలయికను, తప్పనేసి = తప్పుగాఁగొని' అని వారి టీక.

౧౬. 'చేతప్పుఁగొను'

'కొను' అను పదముక్రింద, "౫. కొను = పొందు, స్థాపించు. (ఇది పెక్కు-పట్ల విశేష్యముల కనుప్రయుక్తమై ఈయర్థముతో శబ్దపల్లవక్రియగా ఏర్పడుచున్నది. ఉదా:— తెవులుగొను; భయముగొను; మరులుకొను" అనిచెప్పి అందుకు ప్రమాణముగా,— 'గీ. కొంకుకొసరును జేతప్పుగొనకయుండు' (పాండు. ౧.౭౧) అను పద్యమునుచూపిన సూ.ని. యే, మళ్లీ 'చేతప్పు' అను పదముక్రింద ఆ పద్యమునే,—

---

* పొ. వ్యా. మునకు వ్యాఖ్యానము వ్రాసిన 'బులుసు' వారు, "తప్పుఁజేసి అనగా తప్పుచేత" అని యర్థము వ్రాసినారేగాని, పాఠమును గూర్చి ఒక మాటయైనను అనలేదు.

"చేతప్పఁగొనకయుండు"

అనుపాఠముతో ('గొ'కుముం దరసున్న పెట్టి) ముద్రించినది.

అట్టి పాఠ మచ్చులోనున్న డేమోనని చూచితిని; కాని అచ్చుప్రతి లోను అరసున్న లేదు.

ఇదియంతయు నొకరిచేతిమీదుగనే జరిగియుండునా? చేతప్పుగొను = 'శబ్దపల్లవక్రియ' యని వ్రాసిన చేయియే మరల 'చేతప్పఁగొను' అని స్పష్టపదముగా వ్రాసియుండునా? ఎన్నటికిని వ్రాయదు.

౧౭. 'జుంజము'; 'జుంజుము'

సూ.ని.—

*"జుంజురుదుందురు సురుడు దివ్వెనకోల
యనఁ గాష్ఠదీపి కాహ్వయము చెలఁగు" (2-165)

అను ఆంధ్రభాషార్ణవపద్యమును, 'దివ్వియకోల' క్రింద,

"జుంజుము దుందురు సురుడు దివ్వియకోల....."

అనిచూపి, (ప్రాఁతప్రతి పా. దివ్వెనకోల. చి.ని. బ్రా. వ్రాఁత ప్రతుల పా)" అన్నది.

ఆ పద్యమునే, అంతకుముందు, 'జుంజము' క్రింద,

"జుంజము దుందురు...దివ్వెనకోల..."

అను పాఠముతో ఉదాహరించి ("వ్రాఁత, ప్రాఁతప్రతుల పాఠము") అనియున్నది.

మళ్లీ, ఆ పద్యమునే, 'దుంజము' క్రింద,

"జుంజము దుందుము...దివ్వియకోల..."

అను పాఠముతో చూపి, ("ప్రాఁతప్రతి పా.") అన్నది.

ఎన్ని వ్రాతప్రతులు! ఎన్ని ప్రాతప్రతులు!! ఎన్ని భిన్నపాఠములు!!

---

* ఇది 'వావిళ్ల'వారిప్రతి పాఠము. బ్రౌణ్యపాఠమున్నూ యిదే. (చూ. సురుడు, క్రింద)

1. జుంజము - క్రింద, 'జుంజము'గా నున్న పాఠము 'దివ్వియకోల' క్రింద 'జుంజుము'గా మారినది.

2. వావిళ్లవారి ప్రతిలోను, బ్రౌణ్యమునను ఉన్న 'జుంజుము' పాఠమునలే అదృశ్యమైనది.

3. జుంజము - క్రిందను, దివ్వియకోల క్రిందను నున్న 'దుందురు', 'దుందుము' క్రింద హఠాత్తుగా 'దుంగుము'గా మారిపోయినది.

4. జుంజము - క్రింపనున్న 'దివ్వెనకోల'—దివ్వియకోల క్రిందను, దుంగుము - క్రిందనుగూడా 'దివ్వియకోల' అయిపోయినది.

పరికించారా, సూ. ని. పాఠమును గ్రహించుపద్ధతి; ఆ పద్ధతిలో పద్యములు పడుపాట్లు!

ఇన్ని పాఠభేదములుగల ఆ ప్రాఁతప్రతు లెక్కడివి? ఆ వ్రాఁతప్రతు లెక్కడివి?

ఒక పద్యమునే, ఒకచోట 'జుంజను' అను పాఠముతోను, ఇంకొక చోట 'జుంజుము' అను పాఠముతోను, ఒకచోట 'దుంగుగు' పాఠముతోను, ఇంకొకచోట 'దుంగుము' పాఠముతోను, ఒకచోట 'దివ్వెనకోల' పాఠముతోను, మరియొకచోట 'దివ్వియకోల' పాఠముతోను, నిరుకులేని మార్పులతో ఉదాహరించుట ప్రమాదవశమునా? ఉద్దేశపూర్వకముగానేనా? ఉద్దేశపూర్వకముగానే యగుచో ఆ యుద్దేశ మేమి?

౧౮. 'నీరుచిచ్చుఁగొను'

సూ.ని. లో, నీరుచిచ్చుక్రింద,—"సలిలములు దొట్టి నీరుచిచ్చుఁ గొని" (చంద్రా. ౫.౬3) అని యున్నది.

'నీరుచిచ్చుగొను' ఏకపదక్రియ. నీరుచిచ్చు అను వ్యాధి కలదియగు అని యర్థము.

బలుపుగొను, కురుగుకొను, తెవులుగొను, ఒరగొను, మెత్తగాలుగొను, ఊంగిడిగొను, తెక్కలిగొను, చేతప్పగొను అను క్రియ లెట్టివో నీరుచిచ్చుగొను అను క్రియయు నట్టిదే.

కావున, అం దరసున్న పెట్టుట గిట్టదు.

ఒకమాట:— 'ఒరగొను' అను క్రియ, సూ.ని లో. 'ఒరకొను' అని యున్నది. వౌర్ణ్యమునను, శ.ర. లోను, 'బసవపురాణములోను, ('అచ్చుల నొరగొను నగసాలి యుండు'—పు. ౧౧౭) 'ఒరగొను' అని *సరళాదేశ రూపమునసే యున్నది.

ఒరగట్టు (ఒర + కట్టు), ఒరగడుగు (ఒర + కడుగు), ఒరగల్లు (ఒర + కల్లు) అను పలుకుబడులవలెనే (ఒర + కొను =) ఒరగొను అనియే యుండునని నా యూహ.

---

* కకారమునకు ఆదేశముగా వచ్చిన గకారమును సరళమనగూడదని, వీ.బ్ర. గారి ఆక్షేపము.

ఆ యాక్షేపపు వ్రాత యిట్లున్నది:— "శ్రుతకార్యముగాక, పరుషాక్షరమునకై 'యాగమం'బైన గ సడద వలలోని 'గ'ను జూచి, యీ 'గ' సరళరూపమున నున్నదనిరి. అది తప్పు. ఏమనగ అది పరుషమునకు బదులుగ వచ్చు సరళమే యగుచో దానివెనుక శ్రుతమున్నదై యయ్యది అరసున్నయో నిండుసున్నయో కావలయుగదా?"

ఆహా! ఎంత చక్కని యాక్షేపము!!!

ఆ 'గ' పరుషమునకు బదులుగా వచ్చినది కాదట! మరి దేనికి బదులుగా వచ్చినదో! వారు తెలుపలేదు.

పరుషమునకు బదులుగా వచ్చిన సరళమగుచో, దానివెనుక శ్రుతముండి తీరవలెనట! అట్లు వారు చదివిన వ్యాకరణశాస్త్రమున నున్నది కాబోలు!

గ సడద వల లోని 'గ', పరుషాక్షరమునకై యాగమం బైనదట! పాపము! ఆ వైయాకరణశిరోమణికి ఆగమ మనసేమో, ఆదేశ మనసేమో తెలియదు.

౧౯. 'చెఱంగు' ; 'తెఱంగు'

శ.ర. లో, 'గరువు' - 'చెందిరిక' అను రెండు పదములక్రిందను, మనుచరిత్రపద్యము,—

"గరువునకొ త్తఁ జెంగలువకచ్చుఘటించిన మోఁకి జుట్టెఁ జెం
దిరికచెఱంగునఁ బసిఁడితీఁగలునించిన జిల్లుపాగ" (5.58)

అను పాఠముతో ఉదాహృతమై యున్నది.

బ్రౌనుప్రతిలోను, వావిళ్ల వారి ఆనందవారి ప్రతులలోను, 'చెందిరిక చెఱంగునఁ' అను పాఠమున్నూ, "చెందిరిక తెఱంగునఁ" అను పాఠాంతరమున్నూ,— "చెందిరిక తెఱంగునఁ = కమ్మఁపై దుద్దువిధమున" అనే వివరణమున్నూ ఉన్నవి.

నూ.ని. 'గరువు' క్రింద, "చెఱంగునఁ" అను పాఠముతో ఉదాహరించినదేగాని పాఠాంతరమును చూపలేదు. మరల ఆ పద్యమునే 'చెందిరిక' క్రింద, 'తెఱంగునఁ' అను పాఠముతో చూపి 'ఇది శ.ర. పాఠ' మన్నది.

శ.ర. లో 'గరువు' క్రిందగూడా 'తెఱంగునఁ' అను పాఠమే యుండెగదా; నూ.ని. అక్కడ ఆ 'తెఱంగు'ను వదలి 'చెఱంగు'నే పట్టుకొను టేల? తా నేదో ఒక పాఠమును నిర్ణయించి - గ్రహించి, పాఠాంతరమును చూపవలెగాని - ఒక పద్యము నే భిన్నస్థలములలో - భిన్నపాఠములతో చూపుట యెట్లుచితమగును?

'చెఱంగునఁ' అను పాఠమున అర్థము సరిగా ఏర్పడదు. 'తెఱంగునఁ' అను పాఠమే గ్రాహ్యము.

౨౦. 'జానువడు' ; 'అనిలుఁడు'

నూ.ని. "జానువడు. అ.క్రి. (జాను + పడు) స్పష్టపడు" అని చెప్పి, అందు కుదాహరణగా,—

ఉ. "న, న్నీనలినాప్తుఁ డీయనిలుఁ డీమృగలాంఛనుఁ డీసుగోత్రములో
జానువడంగ నీక్షణమ చంపరె కోపపరీత-చిత్తులై."

(భార. ఆర. ౨-౨౧౪)

అను సద్యమునిచ్చి, "ఇది శ.ర. పాఠము. *'జానుసెడంగ' అని ముద్రితప్రతిపాఠము" అని సూచించినది.

చూడబోగా సూ.ని. పాఠమునకును, శ.ర. పాఠమునకును సంబంధమే లేదు. శ.ర. లో 'జానువడు' అను క్రియయేలేదు సరిగదా, పైపెచ్చు - 'జానువు'అను పదముక్రింద "జానువు. జే.వి. జానుయొక్క రూపాంతరము. ఉ. 'నన్నీనలినాప్తుఁ డియ్యనలుఁ డీ మృగలాంఛనుఁ డీసుగోత్రముల్, జానువడంగ నీక్షణమ చంపరె కోపపరీతచిత్తులై.' (ఇక్కడ జానుపడంగ అని వ్యుత్పత్తిచెప్పుట సరికాదు.)" అని యున్నది.

దాని యర్థమేమి? శ.ర. పాఠము, 'జానువు + అడంగ' అని గాని, 'జాను + పడంగ' అని కాదనియేకదా?

మరి, సూ.ని. 'జానువడు' అను క్రియక్రింద, ఆ పద్యమును చూపి, "ఇది శ.ర. పాఠము" అనుట పొరపాటుకాదా?

(జానువు + అడంగ =) 'జానువడంగ' అను, శ.ర. పాఠమూ, ♦'జానుసెడంగ' అను, ముద్రితప్రతిపాఠమూ అర్థమున నొకటే యగు

---

* వ్యయ - చైత్ర భారతిలో - శ్రీనండూరి రామకృష్ణమాచార్యుల వారు "శబ్దరత్నాకరములో 'జానుసెడంగ' ముద్రితమని సూ.రా. నిఘంటువే సూచించినది" అన్నారు. పొరపాటు.

♦ 'అట్టిదైనఁ (= నేను నీయెడ సెగ్గుదలంచినయెడల) నన్నీనలినాప్తుడు; ఈ యనలుఁడు; ఈ మృగలాంఛనుడు - జానుసెడంగఁజంపరే' -

చున్నవి. 'జానువడు' అనుక్రియ యొకటి యున్నచో సూ.ని. ఊహించిన అర్థమునను విప్రతిపత్తి యుండదు. మఱి అట్టిక్రియ లేదే!

అది యట్లుండగా శ.ర. పాఠమునను, ముద్రితప్రతి పాఠమునను గూడా, 'నలినాప్తు'ని వెంటనున్న 'అనలుఁడు' సూ.ని. పాఠమున, 'అనిలుఁడు'గా మారి కూర్చున్నాడు; ఆ తమాషా చూచారా? అది సూ.ని. సొంతముగా చేసిన మార్పేగాని అచ్చుతప్పు కాదుసుమండీ!

'జానుపడంగఁ' అని క్రియగాచెప్పుట సరికాదని, శ.ర. చెప్పు చుండగా తాను 'జానువడంగఁ' అని క్రియగాచెప్పి, యిది శ.ర. పాఠమనుటయు, శ.ర. పాఠములోని *'అనలు'ని - 'అనిలు'నిగా మార్చి యిది శ.ర. పాఠమనుటయు సూ.ని. వంటి నిఘంటువుకు ధర్మమేనా?

అను రచనకు, ''జానుసెడంగఁ = నేను జానుసెడిన—అనగా నా నిసర్గతను, నా స్వభావమును వీడినయెడల చంపరే'' అని యర్థముచెప్పవలె ననున్నారు శ్రీ 'సందూరి'వారు. అది సరియైన మార్గము కాదు.

* ''సూ.ని. అనలుని - 'అనిలు'నిగా సవరించుట ఒప్పే''నని సమర్థించుచూ అనవసరముగా బోలెడువ్రాసి, వీ.బ్ర. గారు, — ''దీ. శాస్త్రి గారు, నలినాప్తునివెంటనున్న 'అనలుఁడు' సూ.ని. పాఠమున 'అనిలుఁడు'గా మారి కూర్చున్నాడు అని యాక్షేపింపవచ్చునా?'' అన్నారు.

నే నాక్షేపించినది సవరణనుకాదు; ''ఇది శ.ర. పాఠము'' అనుటను. ఆక్షేపమును సరిగా అర్థముచేసికోలేని 'అన్నయ్యలు' విమర్శలకు దిగుటయు, అనవసరపుప్రాతలు వ్రాయుటయు తప్పు.

''జానువు + అడంగఁ - అని విభాగముచేసి చూపిన శ.ర. పాఠమే తప్పని నా నిశ్చయము. జానుశబ్దము సంస్కృతమైనప్పుడే కాని, అచ్చు తెనుగైన జానుశబ్దము 'జానువు'గా రూపాంతరముచెందదు. సంస్కృతమున ఆగంతుకముగవచ్చిన విభక్తిప్రత్యయమైన 'వు' లోపించియు, లోపించకయు నున్నట్లు తెలుగుశబ్దముల కట్లాగంతుకముగ 'వు' ప్రత్యయముకాదు.

౨౧. 'ఉక్కు-దాయము'

సూ.ని. 'దాయము' అను పదముక్రింద, గౌ.హరి. లోని,—

"వడినుక్కు-దాయము వచ్చుచో ధైర్య్య, ముడిగిన ధైన్యంబు నొందిన నగరె" (ఉ. ౨౯౫)

అను ద్విపదనుచూపి, అక్కడ "(ఉక్కు-దాయము = గొప్పయిడుమ, అని. టీక)" అని తెలిపినది.

పైపాఠము, టీకకూడా, 'వేదం'వారివి. 'ఉక్కు' అన్న పదానికి 'గొప్ప' అన్నయర్థమును, వేదం-పండితులు చెప్పినారని, సూ. ని. — కుండలీకరణములోచెప్పుట కర్థమేమో నాకు తెలియలేదు. అది గ్రాహ్య మనియా? అగ్రాహ్యమనియా?

సూ.ని. దృష్టిలో ఆ యర్థము గ్రాహ్యమే అగుచో - 'ఉక్కు' అను పదముక్రిందగదా చూపియుండవలసినది? చూప లేదేమి? అగ్రాహ్యమగుచో

గనుక ఉన్నది లోపించుటగాని లేనిది వచ్చుటగాని కలుగదు.— చెఱువు; దొరువు 'వు' లోపించి, చెఱు; దొరు కొజాలవు". అని ఆ బ్రహ్మంగారి దొక అపూర్వసిద్ధాంతము.

'వు' లోపించియు - లోపింపకయు నుండు శబ్దములు తెనుగున నెన్నో యున్నవి. ఉదా :— రట్టువు; రట్టు. చట్టువు; చట్టు. కొలఁకువు; కొలఁకు. పుట్టువు; పుట్టు. కావున బ్రహ్మంగారిది భాషాతత్త్వజ్ఞానము లేని అపసిద్ధాంతము.

'జానువు' అను రూపము సరికాదని సూ.ని. భావించియున్నచో 'జానుసెడంగ' అన్న ముద్రితప్రతిపాఠమునే గ్రహించి యుండవచ్చు నే. జానువు + అడంగక అన్న శ.ర. పాఠమును గ్రహించుట యెందుకు? దానిని 'జాను + పడంగక'—అని మార్చుట యెందుకు? ఇది శ.ర. పాఠమనుట యెందుకు?

'దాయము' అన్న పదముప్రక్క-మాత్రము చూపబలసిన అక్కర యేమి? చూపి ప్రయోజన మేమి?

అసలు, అది సరియైనపాఠము కాదేమోనని నా కొక సందేహము. ఎందువల్లననగా.—

"గొప్పయిడుమవచ్చుచో ధైర్యముడిగి - దైన్యమునొందుట తగదు" అనగా అర్థమేమి? కొద్దియిడుమవచ్చుచో...తగును; అనియేకదా? ఈ యర్థముచితముగానున్నదా? ఇట్టి విపరీతార్థస్ఫురణగల రచనను, గౌరన వంటి ప్రౌఢకవి, చేసియుండునా?

"ఒక యిక్కట్టువచ్చినపుడు ధైర్యపడుట తగ"దని లోకములో వాడుకగా అనుకొనుటకలదు; ఎల్లరెరిగినమాటయే. "ఒక *యిమ్ముదప్పు వచ్చినపుడు వెనుఁబడరాదు. వెనుఁబడితిమిపో దానిచేత సాధ్యమేమి?" అని, చిన్నయసూరి - మిత్రభేదములోను ఉన్నది. ఈ యర్థమునే, గౌరన - "దాయంబుతలనిట్టి దైన్యంబుతగునె" (పుట 130) అని, 'ఉక్కు-దాయము' నకు ముందే, అనియున్నాడు.

కాబట్టి, గౌరన-పాఠము 'ఒక్క-దాయము' అయ్యుండునుగాని 'ఉక్కు-దాయ'మై యుండదని నా నమ్మకము. ప్రాతప్రతులను చూచిన గాని నిజముతేలదు. అట్టి పరిశోధనకు తగిన పరికరములగల పండితులు పరామర్శించి నిర్ణయింతురుగాక.

౨౨. 'తేటఁబొసంగ'

వేదం-వారి శృం.నై. (8. 170) లో, "దేవి, తమో మషీ రసము తేటఁబొసంగఁగ గట్టివెట్టి" అని యున్నది.

---

* "ఇమ్ముదప్పు. (ఇమ్ము + తప్పు) ఇక్కట్టు, సంకటము" అని శ.ర. లో నున్నది. నూ.ని. లో లేదు. కారణమేమో?

*'తేటఁబొసంగఁగ' అనుట సరికాదు. 'తేటపొసంగఁగ' అని సరియైన పాఠము. వారి టీకలో,— "తేట పొసంగఁగ = పిమ్మట వ్రాసెడి యక్షరములు స్ఫుటముగా కనఁబడుటకై, గట్టివెట్టి = గట్టించి" అనియే చెప్పబడియున్నది. అదియును గమనింపక, సూ.ని. 'గట్టి', 'తావడము' అను రెండు పదములక్రిందను,—'తేటఁ బొసంగఁగ' అను పాఠమునే ఉదాహరించి, ఇది వేదం. పా. అన్నది.

ఎవరి పాఠమయిన నేమి? తాను స్వయముగా నదివి, అర్థముచేసి కొనిగదా గ్రహించవలసినది! టీకనైనను చూడకూడదా?

23. 'కొండఁజేయు'

వేదం.వారు,— "గట్టి చిన్నవ చేతముట్టి చూచెద నన్నఁ, జెలి యది యొక కొండఁజేసికొనెను" అని, 'సారం' (2–224) లోను,— "ఒకని నా ముందట నొక కొండఁజేసి" అని, గొ. హరిశ్చంద్ర (పుట 15) లోను, ముద్రించినారు.

'వావిళ్ల'వారి 'విక్రమార్క' (2. 15)లో గూడా,— "ఈ కొండ మణికాంచనాకారుచిఁ గాంచెఁ, గొండ లెల్లను దనుఁ ♦గొండఁజేయ" అనియే ముద్రితమై యున్నది.

సూ.ని. 'విక్ర' పద్యమును 'కొండఁజేయ' అను పాఠముతోనే గ్రహించి "కొండఁజేయు = పెద్దచేయు" అని అర్థము వ్రాసినది.

'పెద్దచేయు' అను నర్థమున 'కొండఁజేయు' అనుట తప్పు. 'కొండ చేయు' అనుట ఒప్పు. కొండఁ జేయుట యనగా, కొండను చేయుట

---

* వావిళ్ల వారి ప్రతిలోను, ఈ పాఠమే యున్నది.

♦ వావిళ్ల నిఘంటువు, ఈ పాఠము తప్పనిచెప్పి, 'కొండచేయ' అను పాఠముతోనే గ్రహించి, 'కొండచేయు' అను క్రియకు ప్రమాణముగా చూపినది.

యగునేగాని, గొప్పచేయుట కాదు. 'పెద్దచేయు' అను పలుకుబడి యెట్టిదో 'కొండచేయు' అనునదియు నట్టిదే. 'కొండచేయు' శబ్దప్రల్లవ క్రియ. శబ్దప్రల్లవము లన్నియు ఏకపదక్రియలు. ఆంగువల్ల ఆ క్రియల లోని ధాతునామావ్యయములను వేరుచేసి, గ్రుతాంతములుగాను ఆయా క్రియలకు కర్మలుగాను అర్థము చెప్పగూడదు.

పెద్దచేయుట యనగా పెద్దగాచేయుట. (పెద్ద = గొప్పవాడు). కొండచేయుట యనగా కొండగాచేయుట = గొప్పచేయుట.

కొండ = గొప్ప అనుట కీ క్రింది రచనలు ప్రమాణము.

(1) "కొండఁ బెకలించి యెత్తుట, కొండొక పనిగాక యొక్క-కొండాతలఁపఁ" (భాగ. 10. పూ. 914) ఒక్క-కొండా = ఒక ఘన కార్యమా? అని యర్థము.

(2) "గురు వనీపకుల కాదరమొప్పఁ గొండని, యొసఁగియుఁ 'గొం'డని యొసఁగకుండు" (నరసభూ. పీఠిక. 72.)

కొండు + అని = కైకొనుఁడని, ఒసఁగియు, (ఆయిచ్చినది) కొండని (కొండ + అని) ఆది యొక గొప్ప యీవి అన్న భావముతో, ఒసఁగకుండు నని యర్థము.

(3) "రండలకొడుకులు యాచక
తండంబుల కేమి త్రవ్వి తల కెత్తేరా?
రెండాకు లొక్క-పోఁకయుఁ
గొండసుమీ దానశర్వ, కోమటిగుర్వా" (చాటువు)

కొండసుమీ = గొప్పసుమా.

భాషాతత్త్వవిదులయిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించిన ఉ. హరివంశములో,— "కొడుకులం గని తమవారు కొండసేయ" అనియే పాఠము.

పెద్దచేయు అను నర్థమున 'కొండలుచేయు' అనియును కలదు. 'భర్తృహరి'లోని,— "పర్గుణ పరమాణూక్ పర్వతీకృత్య నిత్యఖ్" అన్న (పరోపకార 70.) సంస్కృతమును, ఏనుగు లక్ష్మణకవి,—

"వదలక సాధుసద్గుణలవంబులు కొండలుచేసి మెచ్చుచుక్" అని తెనిగించినాడు. ('పర్వతీకృత్య' సంస్కృతమున శ.ప. క్రియ). పర్వతీకృత్య = మహత్తరాక్ కృత్వా — అని వ్యాఖ్య.— పర్వతీకృత్య = కొండలుగాచేసి అని టీక. అణువులవంటి సద్గుణములనైనను కొండంతలుగా భావించి— అని తాత్పర్యము. కాబట్టి, కొండ(లు) చేసి అను క్రియను— 'కొండఁజేసి' — 'కొండలఁజేసి' అని సవరించగూడదు. "చేయు అను క్రియకు 'కొండ' కర్మ" అని వాదించగూడదు.

*"కొండఁజేయు, కొండచేయు లెట్లున్నను, ఇందలి కర్మపదమగు 'కొండ' జడవాచకమగుటచేఁ బ్రథమయుఁ గావచ్చును. ద్వితీయయుఁ గానగును. ఇందు తప్పేమి?"— అని నిఘంటు పండితులలో నొకరైన శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారి వాదము. అది శ.ప. క్రియా తత్త్వమును గమనింపని వాదము.

"గట్టి చన్గవ చేత ముట్టిచూచెద నన్నఁ, జెలి యది యొక కొండ చేసికొనెదు" అన్నచోట,— చెలీ, నీ చనుగవను గొప్పగా భావించుకొని, నను ముట్టనీయక దాచుకొనుచున్నావని నిష్ఠుగోక్తి. చనులు కొండలవలె నున్నవని చమత్కారము. 'కొండఁ జేసికొనెదు' అన్నచో, ఆ నిష్ఠుగోక్తి, చమత్కారము కూడా నశించును. కాబట్టి 'కొండ'ను ద్వితీయగా చెప్పుట తప్పేనని నా సమాధానము.

"'కొండఁజేసి' అను పాఠమే బాగున్నది. అప్పుడు 'ఒక'కు కొండతోనే సంబంధము. ఒక పదమును పృథక్కుగా స్వీకరించిన పిచ్చయ్యశాస్త్రిగారి మతమున అభేదసంబంధముచే నేకదేశాన్వయము సంభ

---

* చూ. పార్థివదైత్ర – ఆషాఢముల (1944–45) ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

వించును. కొండఱ అనునది పృథక్పద మనినయెడల దోషము కనుపట్టదు. పెక్కు గుణము లున్నవి" అని, ఆ శాస్త్రిగారిదే మరియొక వాదము.

అది పదార్థమును సరిగా గమనింపనివాదము. ఎందువల్లననగా— చన్నవఱ = రెండు చన్నులను, ఒక కొండఱ చేసికొనెదు = ఒక్క కొండను చేసికొనెదవు— అని యర్థము చెప్పుట హాస్యహేతువగును. కావున, "ఒకకు కొండతోనే సంబంధ" మనుట సరికాదు.

'ఒక'ను 'కొండ'తో ముడిపెట్టి, ఏకదేశాన్వయదోష మున్న దనుట పొరపాటు. ఒక కొండచేసికొనెదు; ఒక సరకునేయక—అను పలుకుబడులలో 'ఒక' సంఖ్యావాచకము కాదు. దానికి ప్రత్యేకమయిన అర్థము లేదు. అది ఆ పలుకుబడియందలి భావమునకు బలము (force) నిచ్చు, జాతీయమైన ఊతపదము.

కాబట్టి, 'ఒకకొండ = ఒక్కకొండను చేసికొనెదు'; ఒకసరకు = ఒక్కసరకును చేయక అని యర్థము చేయగూడదు. 'ఒక కొండచేసికొనెదు', అను పలుకుబడికి 'ఏమో మహాభాగ్యముగా భావించుకొనుచున్నావు' అనియు, (వాణి) 'ఒక సరకుచేయక' అనుమాటకు 'బొత్తిగా లక్ష్యపెట్టక' అనియు, సంప్రదాయజ్ఞు లర్థముచేయుదురు.

'ఒక'కు ఆయా సందర్భములనుబట్టి అనేకార్థములు :—

1. "ఏ మొకకొండఱము మహాగ్రామవనాంతరము లెల్ల గడచి"
(విక్ర. 5-201)

అన్నచోట 'ఒక' అల్పార్థకము.

2. "ఒక మున్నూఱు కదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షుచాపంబు."
(భాగ. 9-262)

అన్నచోట 'ఒక' అధికార్థకము*

---

* ప్రౌ. వ్యా. కర్త 'అల్పార్థక' మన్నాడు. (నూ. శబ్ద. 84.) పొరపాటు. అది మహాభారమైన ధనువనియు, పలువురు తెచ్చిరనియు చెప్పలేదు, అచట, ఉచితము.

3. "భండనమందు నాకు నొక పాండవు లెంతటివారుఁ?"
(పాండవవిజయము.)

అన్నచోట అల్పార్థకమును కాదు; అధికార్థకమును కాదు. నిర్లక్ష్యతాసూచకము.

4. "ఏ నొక దిక్కు లేక యిటి యేడ్చుచుఁ జీరుచునున్నదాన."
(భాస్క. ఆర. 108)

అన్నచోట, ఒక దిక్కు లేక-అంటే, ఏవిధమైన రక్షణలేక, అని యర్థము. అంతేగాని దిక్కు-ఒక్కటి (మాత్రమే) లేక' అని యర్థము కాదు.

5. "నాకు కాదీ, త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెఱుకఁ" (భా.ఆది. 5-239)

ఇక్కడ, 'ఒక'కు, ఒకానొక అని యర్థము.

ఒక్కొక్కచోట ఈ 'ఒక' యొక్క తత్త్వ మనిర్వాచ్యమై కేవల హృదయైక గమ్యమై యుండును. చూడండి.—

6. 'వాడు *ఒకప్రొద్దుకడ లేచిపోయినాడు' అన్నప్పుడు 'ఒక' కర్థమేమి? ఆ 'ఒక'కు దానితో సంబంధమునీ? 'ప్రొద్దు'తోనా? 'కడ'తోనా? 'ప్రొద్దుకడ'తోనా? 'లేచిపోవుట'తోనా? శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారె చెట్లన్నయింతురో!

---

* 'ఆముక్త' (7.8) లో, "ఒక ప్రొద్దుకడఁ - లేచిపోవంగ" అన్నచోట సంజీవనైకర్తలు - 'ఒకప్రొద్దుకడఁ = ఒక సమయవిశేషమున' అని టీకవ్రాసినారు. తాత్పర్యములోను 'రాత్రి యొకానొక సమయాన లేచి' అనియే వ్రాసినారు. ఆ 'ఒక' తత్త్వము వారికిని గుర్తుపడలేదు. 'ఒక ప్రొద్దుకడఁ' అనగా, 'చాలారాత్రి యుండగనే' అని ప్రకరణార్థము. 'లేచి ప్రయాణముచేయదగిన కాలము కాకముందే నన్నమాట. ఈయర్థము 'ఒక'కు దానితో అన్వయముఁ? అని తర్కించువారికి దుర్లభము.

ఇందును, 'ఏకదేశాన్వయదోషము సంభవించు'నందులేదో? అన గూడదు. అట్టిదోష మింగు లేదు. 'ఒక కొండచేనికొ నెగు' అను పలుకు బడిలోను లేదు. ఉన్నదనుకొనుట పొరపాటు.

ఒకవేళ ఉండుగాక. వారిదృష్టిలో అదియొక మహాదోషము కాబోలు! "సిద్ధసమాస మధ్యగతపదముతో తద్భిన్నపదమున కన్వయము కలుగజెప్పి నను దోషము కా"దని భూషావిదులు చెప్పుచుండగా (మా. ప్రౌ. వ్యా. సమా. 35) 'ఏకదేశాన్వయము - మహాదోష'మనుట యేటిచదువు? నిఘంటు కార్యార్థ మనేక కావ్యముల నవలోడించి యుందురుగదా; వారికి - ఏతాదృశ రచన లెందును పొడకట్టియుండవా? ఈ క్రింది పద్యమును చిత్తగించండి.

"నిండుమనంబునం దన మనీషితమెల్ల ఘటింపవచ్చు నా
ఖండలు రాక చారణముఖంబున మన్న యెఱింగి చేది భూ
మండలభర్త గాంచె నతిమాత్రముదం బది యెందుఁ జిత్రమే?
కొండలు పిండిసేయు శతకోటియుతుండు హితుండుగల్గినన్"
(వసు. 5-55)

ఆ శాస్త్రిగారు భావించిన మహాదోషము, ఈ పద్యములోని "కొండలు.....యుతుండు" అను రచనకు పట్టదా? పట్టుచో, వారు - 'ఇది తప్పు' అని ఆక్షేపింతురా? లేక దిద్దిసరిచేయుదురా?

ఏకదేశాన్వయాదులు మహాకవుల రచనలలోను క్వాచిత్కముగా నుండును. సహృదయులు వాని నొప్పరికించి - అందలి రసమును - చమత్కారమును మాత్రమే గ్రహించి ఆనందింతురు. ఇది విషయాంతరము.

"సాగరాధరపద్యమున తక్కినపాదములందలి 'గగనంబుచేయు', 'బంగారుచేయు' మున్నగున *వేకక్రియలనఁ జెల్లునా? అని, ఆ శాస్త్రిగారిదే ఒక ప్రశ్న.

గగనంబు, బంగారు అను విశేష్యములు - 'చేయు' అను క్రియాయోగముచే ఏకపదత్వమును పొంది, శబ్దపల్లవములై, విలక్షణార్థము నిచ్చు

* ఏకపదక్రియ లనవలెను.

చున్నవి గావున ఏకపదక్రియ లనజెల్లు నని నా సమాధానము.

గగనము, బంగారు, ఘనము అను పదములను లక్షణార్థమున వాడు వాడుక భాషాలోకమున నున్నది.

(1) "అరిది, కడిది, గగనము, బంగారు, గహనము, ఘనము, బ్రౌతి దుర్ల భార్థకములు." (ఆంధ్రవాచస్పత్యము)

(2) "గగనము = అబ్బురము." (ఆం, ప. పారి.)

(3) "అదేమి గగనము, What great marvel is this."

(బ్రౌణ్యం)

(4) "గగనఘంటాపథక్రమణశీలున కెంత, గగనమయ్యె లతాంగి కానుచదలు" (వసు. 3-99) 'ఎంత గగనమయ్యెన్ = ఎంత దుర్లభ మాయెను' అని టీక.

(5) "కంధి దాటుట యెంత గగనంబు నాకు." (రంగ. రా. యు.)

N.B:— గగనము = దుర్లభము; కొండ = గొప్ప - అని సూ.ని. లోను ఉన్నది. ఆక్షేపకు లెరుగరేమో!

లెక్క-సేయు, సరకుసేయు అను పలుకుబళ్లెట్టివో, కొండసేయు, గగనముసేయు, బంగారుసేయు అనునవియును నట్టివే. వానిలో అరసున్నలు పెట్టుట తప్పు. ఈ పలుకుబళ్లు—అనగా శబ్దప్రయోగక్రియలు భాషలో లెక్కకు మిక్కిలిగా నున్నవి. వాని తత్త్వమును సరిగా పరిశీలింపని పరిష్కరణములవల్ల ఆక్రియ లనేకము ప్రాచీనకావ్యముల (అచ్చుప్రతుల)లో మారురూపుపడి యున్నవి. వానిలో కొన్ని ఆల్లే నిఘంటువులలో ప్రవేశించినవి. వ్యాఖ్యాతలేకాక, నిఘంటుకర్తలుగూడా వాటి కర్థము చెప్పుటలో ప్రమాదపడుటయు జరిగినది. గ్రంథవిస్తరభీతిచే ఒక కొన్నిటిని మాత్రమే యిక్కడ పేర్కొనుచున్నాను.

(1) లెక్క-సేయు = 1. లక్ష్యపెట్టు, 2. లెక్క-యేర్పరచు.

(ఉత్తరహరివంశమున డిఘికసాత్యకుల యుద్ధవర్ణనము)— "అటమటపుఁ గోమటులనుంబోలె లెక్క_సేయక." (4-256)

యుద్ధవీరుల పట్టుమున 'లెక్క_సేయక'—(శ. స. క్రియ) = ఒకరి నొకరు లక్ష్యముసేయక అనియు,—అటమటపు కోమటుల పట్టుమున లెక్క_(ద్వితీయార్థమున ప్రథమ) = జమాఖర్చులెక్కను, చేయక = సరిగా తేల్చి చెప్పక యనియు శ్లేషచేత రెండర్థములు.

లెక్క_ఁజేయక - అనుచో 'లక్ష్యముసేయక' అను నర్థము సిద్ధింపదు.

(2) ఘనముచేయు = గొప్పగా భావించు.— "నెఱిగొప్ప కొనగోర నివిరిచూచెదనన్న చెలి నీవది ఘనంబుచేసికొనెదు" (సారంగ. 2-226).

ఘనముచేయు అన్న యర్థమునన్నే, 'ఘనంపఱుచు' అను క్రియయును కలదు.

"అని నెనరుమట్టం బూనిన కుసుమాయుధు పూనికి వజ్రాయుధుండు ఘనంపఱిచి" (నన్నె. కు. సం. 4-403)

ఘనముచేయు, ఘనంపఱుచు—అను క్రియలు సూ.ని. లో లేవు.

(3) పటాపంచ(లు)సేయు = నాశముచేయు.— "పాపపూరుషుఁ బటాపంచచేసి" (పాండు. 2-8)

పటాపంచఁజేసి అని సవరించరాదు.

(4) కోపముచేయు = కోపించు. చేయు - క్రియ; కోపము - కర్మ, అనుకొని 'కోపముఁజేయు' అనగూడదు.

సూ.ని. 'గడీ' క్రింద,— "పరాసువారు కోపంబుఁజేసి" అని ముద్రించినది. సరికాదు.

(5) ఎఱ్ఱచేయు— "చేడియలమీఁద గ్రుడ్లెఱ్ఱ సేయరాకు కోయిలా" (పేరా. 3-25)

గ్రుడ్లెఱ్ఱ సేయరాకు = కోపపడకుము. అచ్చుపుస్తకములలో పలు తావులలో,— "ఎడపఁ కెప్పుడుఁ గన్ను లెఱ్ఱఁజేయుబలంబు" (రసిక. 4-87.)

ఇత్యాదిగా 'ఎట్లఁజేయు' అనియే కనబడుచున్నది. అది తప్పు. ఎట్లు చేయుట - అనగా, ఎట్లగా చేయుటగాని 'ఎట్లను' చేయుట కాదు.

"చిలుక మో మెట్లగాఁ జేసికొనియెఁ." (విక్ర. 4-156)

కాబట్టి 'ఎట్లఁజేయు' అనుట సరికాదు. ఇట్టిచో, 'నల్ల సేయు' అను క్రియయును.

"నా వాలంబు నల్ల సేసితిరేని" (భా. ఆది. 2-34)

నల్ల సేసితిరేని = నల్లగా చేసితిరేని - అని యర్థము. ఈ యర్థమున తిక్కనయే చెప్పినాడు.

"తోఁక నల్లగాఁ జేయరయ్య" (ఆను. 1-193)

"నల్లగాఁ జేయువార మే మెల్లభంగి, నా తురంగమపతివాలము" (,,-199)

(6) తెనుఁగుచేయు = తెనిగించు.—

"కాశికాఖండమను మహాగ్రంథమేను,
తెనుఁగుచేసెద" (కాశి. 1-7)

"ఇల నుకొరాంతపదములఁ దెలుఁగుసేయఁ
గడ వుకొరంబునుండు, డుకొరముండు."
(కొవ్వా. చూ. ఉల్లా. 9)

కాశిఖండము, అచ్చుప్రతిలో,— 'తెనుఁగుఁజేసెద' అని యున్నది. తెనిగించు అను అగ్రమున 'తెనుఁగుసేయు' ఏకపదక్రియ. తెనుఁగు + చేయు = తెనుఁగుఁజేయు అని చెప్పుచో, తెనుగు అను భాషను చేయుట యగునేగాని, తెనిగించుట కానేరదు. తెనిగించుట యనగా, తెనుగుగా చేయుటగాని, తెనుగును చేయుట కాదు. భీమఖండమున శ్రీనాథుఁడే "శివపురాణంబు తెనుఁగుగాఁ జేయు మొకటి" అని వాడియున్నాడు.

"వెలయు బుకారాంత పదా
ధులఁ దెనుఁగుగఁ జేయుచోట" అని,
కావ్యా. చూ. ప్రయోగము. (ఉల్లా. 9)

తెనుఁగుచేయు అన్న యర్థమున 'తెనుఁగుపఱుచు' అనియును కలదు.

"తనర విశ్వనాథుఁ డన నకారాంతశ
బ్దములఁ దెనుఁగుపఱుచు భంగులయ్యె."
"భూభుగ్వీరాడ్ప (?) దంబులు
శోభితముగఁ దెనుఁగుపఱుచు చో" (కావ్యా. చూ, ఉల్లా. 9)

పోతన భాగవతములో,— "ఒనరఁ నన్నయతిక్కనాదికవు లీ యుర్విం బురాణావళుల్, తెనుఁగుంజేయుచు మత్పురాకృతశుభోదక్యంబు దా నెట్టిదో, తెనుగుంజేయరు" అని యున్నది.

కవిపాతము, "తెనుఁగుల్ చేయుచు... తెనుగుల్ చేయరు" అని యుండుమని నా యభిప్రాయము.

(7) పెండ్లిసేయు.— "మా తండ్రి తా, నన్నుం బెండిలిసేయ వేడ్కపడి నానా బంధుసంప్రీతితోఁ." "ధనమిత్రుం డను సెట్టికి, ననువాగ్దత్తంబు సేసినఁ" (దశ. 5-77)

నన్నుం బెండిలిసేయ వేడ్కపడి - అనగా, నాకు పెండ్లిచేయఁగోరి అని యర్థము.

ఆథర్వణుని,— "క్వచి ద్విభక్తివైచిత్ర్యం దృశ్యతే కవిభాషితే" అను కారికక్రింద ఇట్లు వివరింపబడియున్నది :

"ఒకానొకచో విభక్తివైచిత్ర్యము చూడఁబడుచున్నది. ఉదా:— నిన్నుఁ దానిఁ బెండ్లిచేసెదఁ, నీకు దానికిం బెండ్లిచేసెదఁ. ఇద్దఱకుఁ బెండ్లియగు ఇత్యాదులు.

'ఇద్దఱకుఁ బెండ్లియగు' అన్నపుడు, ఇద్దరికిని వివాహము జరుగును అని వ్యస్తముగా అన్వయము.

'పెండ్లియగు', శ.ప. క్రియయైనస్సుడు, పెండ్లియాడు - అని యర్థము.

"ఏవురుఁ, బెండ్లియగుఁడు కృష్ణఁ బ్రీతితోడ" (భా. ఆది. 7-282)

రాముఁడు సీతను పెండ్లియయ్యెను, ఉద్వాహమయ్యెను, వివాహమయ్యెను--ఇత్యాదు లుదాహరణములు :

పెండ్లిచేసెను, పెండ్లియయ్యెను, పెండ్లియాడెను--అను క్రియలను పెండ్లిఁజేసెను - పెండ్లినయ్యెను - పెండ్లినాడెను ఇత్యాదిగా వాడగూడదని యిక్కడ హెచ్చరిక.

శ.ర. కర్త 'పెండ్లిసేయు' అను క్రియకు, 'పెండ్లాడు' అని యర్థము చెప్పి, ఆ యర్థమున కీ క్రిందిపద్యమును చూపినాడు.

"మమ్ముఁ బెండ్లిసేయు, మా ప్రాణవల్లభ
ప్రాణమిచ్చి కావు భక్తవరద
నీవు సేయుపెండ్లి నిత్యంబు భద్రంబు
పిన్ననాఁటిపెండ్లి పెండ్లికాదు." (భాగ. ౧౦. స్క-౦. పూ.)

ఈ పద్యము, కాళియమర్దన ఘట్టములోనిది. కాళియుని భార్యలు, "'వైధవ్య దుష్టాలంకారము పొంద నోడెదము.' మా ప్రాణవల్లభుని బ్రతికించి, మాకు పెండ్లిచేయుము. మా పిన్ననాటిపెండ్లి పెండ్లికాదు. నీ విపుడు చేయుపెండ్లే నిత్యమును భద్రము నగు" నని శ్రీకృష్ణుని ప్రార్థించి నారు గాని, 'నీవు మమ్ము పెండ్లాడు' మని కోరలేదు. ("మా ప్రాణవల్లభు ప్రాణమిచ్చి కావు" అని, వావిళ్లవారి ప్రతిలో పాఠము) కావున శ.ర. కర్త చెప్పిన యర్థము ఆ పద్యమున సరిపడదు.

(8) చీకటితప్పుచేయు— "అమరవల్లభుఁడు గౌతము కూర్మి *యిల్లాలిఁ జీఁకటితప్పుచేసిన విధంబు" (శృ.నై. 7-151) వేదంవారి పా.

---

* 'యిల్లాలిఁ జీఁకటితప్పుసేసిన' అని 'వావిళ్ల'వారి పా.
'యిల్లాలుఁ జీకటితప్పుఁ జేసిన' అని శ్రీ వే. ప్ర. శాస్త్రిగారి పాఠము. (క్రీడా. పీఠిక. పుట 24)

"చీకటితప్పుచేసిన సరోరుహనేత్ర
గూబయై చరియించుఁ గోటరమున." (కాశీ. 2-80)

చీకటితప్పుచేసిన = వ్యభిచరించిన.

'నల్ల మేఁక తప్పుచేయు' అను క్రియయును నట్టిదే.—

"బలభేది గౌతముభార్య నహల్యఁ గా
మించి చేయుఁడె నల్ల మేఁకతప్పు" (ప్రబోధచం. 1-50)

'తప్పుఁజేసిన, తప్పుఁజేయుఁడె అని, అరసున్నలుపెట్టి ద్రుతకార్యములు చేయరా దన్నది యిక్కడ ముఖ్యాంశము.

(9) తలఁపుసేయు = ధ్యానించు. (సూ.ని.)

"ఆత్మమూర్త్యంతరంబైన యగ్నిదేవు, నర్చనముచేసి నియతి నయ్యష్టమూర్తి, బహుతపోవ్రతనియమైక ఫలవిధాత, *తలఁపుచేసెను మది నొక్కతలఁపు జేసి" (హర. 3-38)

ఒక్కతలఁపు జేసి = ఒకొనొక తలఁపుతో, తలఁపుచేసెఁ = ధ్యానించెను అని యర్థము. తలఁపుచేయు - అను క్రియ, అరసున్నవలన వేరొకయర్థము నిచ్చుట యిందు గమనింపవలసిన యంశము.

(10) ఆలిసేయు = చెఱచు.—

"శూలిసేసిన తపమెల్ల నాలిచేసి
అతని దేహంబునందు సామాలిఁజేసి
కామకింకరుఁ జేసి నా కడిమి నెఱపఁ
గంటి, నీ ప్రస్తవముఁ దీర్పఁగంటి నెలమి." (కు. సం. 4-47)

---

* 'తలఁపుఁజేసెను' అని వావిళ్లప్రతి పాఠము. ఆది శ.ప. క్రియ గావున అందు అరసున్న పెట్టరాదని, సూ.ని. సవరణ. 'తపముఁజేసెను' అని, శ్రీ వే. ప్ర. శాస్త్రిగారి పాఠము. 'తపముచేసె' ననుట యొప్పు.

ఆలిచేయుట = చెఱచుట; ఆలించేయుట = ఆలినిచేయుట. ఈ యర్థభేదమునకు కారణ మేమి? అరసున్నయే. కాబట్టి, 'ఇంచు తప్పేమి?' అని, ఏకపదక్రియలలో అరసున్నలు పెట్టగూడదు.

(11) నడదివియలుచేయు.— "నడదివియలుసేసె నగరికి మాణిక్య మకుటముల్ ఘనిన మనుజపతుల." (భా. విరా. 5-320)

నడవిదియలుసేసెఁ = నడచునట్టి దీపములుగా చేసెను అని యర్థము. నగరమున నడిపించెనని భావము. (చూ. అర్థపరామర్శలో 'నడదివియ')

(12) మాయచేయు = మోసగించు.— "ఆకాశవాణి, చెప్పె నంచును మాయచేసిరి గాని, యొప్ప రీమాటకు నుర్వీతలేంద్ర" (శం. సా. 3-91)

"మాయఁజేసిరి' అని, సూ.ని. పాఠము. (చూ. 'అయిపు') తప్పు.

'మాయచేయు' ఏకపదము. (శ.ప. క్రియ)

1. "శ్రీరామలక్ష్మణుల నా, మారీచుఁడు మాయచేసి" (శ్రీవేలూరి శివరామశాస్త్రిగారి బాలరామాయణము. ఆంధ్రజ్యోతి, సర్వధారి ఉగాది సంచిక. పు. 29)

2. "మాయల్ సేయఁగరాదు పో నగవులే మాతోడి పోరాటముల్" (భాగ. 8-351)

3. "మాయావి = మాయచేయువాఁడు" (శ.ర.)

'మాయముచేయు' అని మరియొక శ.ప. క్రియ కలదు. 'అదృశ్యము కావించు' అని దాని యర్థము.

1. "అర్కబింబంబు మాయంబుసేయ" (కాశీ. 5-105)

2. "చివురుజొంపపుమావి జీబు మాయముసేసి
పసిఁడియుప్పరిగ దాఁ బ్రబలుచేమి?" (విజ. 1-140)

3. "కొంచెన్న కూడఁబెట్టఁగ
మంచన మాయంబుచేసె" (రుక్మాం. 4-1(5)

'మాయఁజేయు' ప్రేరణక్రియ. (మాయ్ + చేయు) నశింపఁజేయు అని ఆక్రియ కర్థము.

1. "మా, యూరామంబుఁగలంచి జంతుతతి* మాయంజేసినా వేమిరా?"
(హరిశ్చంద్ర. 2-147)

2. "అనుపమహేతిదీధితు లహర్పతితేజము మాయఁజేయ"
(భాగ. 10. ఉ. 381)

కొబట్టి, మోసగించు - అను నర్థమున, 'మాయఁజేసిరి' అనుట తప్పు. వేదం-వారి, 'సారంగ' ప్రతిలో 'మాయ్థచేసిరి' అని పాఠము సరిగానే యున్నది. ఆ పాఠమును, సూ.ని. 'మాయఁజేసిరి' అని మార్చుట సరికాదు.

(13) కట్టడచేయు = నియమించు; ఆజ్ఞాపించు; ఏర్పఱుచు —
"సురనాథుఁడు దక్షిణకాశి భీమలిం,గంబున కేకభోగముఁగఁ
గట్టడచేసె వసుంధరాస్థలిఁ (భీమ. 5-76)

ఈ పద్యమును సూ ని. (ద్వి.సం. అనుబంధములో, 'ఏకభోగ' మను పదముక్రింద) 'కట్టడఁజేసె' అని పఠించినది. తప్పు. 'కట్టడచేసె' అనియే అచ్చుప్రతిపాఠము. కట్టడ + చేయు. శ.ప. క్రియ.

---

* "ఇట 'మాయంజేసి' అనగా దొమ్మరివాడు బుట్టలోని మామిడి చెట్టును మాయముచేసినట్లు కనబడకుండ జేసి యనియె యర్థముకాని, మాయఁ (= నశించునట్లు) చేసియని కాదు. కావున నిది (మాయంజేసి) శబ్దప్రయోగక్రియయే" అన్నారు. వీ.బ్ర. గారు (చూ. 3 ఫిబ్రవరి 1947-త్రిలిఙ్గ)

మాయఁజేయు; మాయముచేయు; మాయచేయు అను క్రియల అర్థ భేదమును బ్రహ్మంగా రిప్పుడైనను, పండితులను శుశ్రూషించి తెలిసి కొందురుగాక.

(14) అంతసేయు; ఇంతసేయు.—

1. "మొన్న మేరుగిరిపాటి నిశాచరి నంతసేసె, నేఁ, డీపున గట్టుబండి నిదె యిందఱుఁజూడఁగ నింతసేసె" (వి. పు. 2-౧౨౦)

2. "న న్నేల యింతసేసితి" (వి. పు. 2-౪3)

3. "అంతలుసేసి పోనడిచి" (భా. ఉ. 3-101)

అంతఁజేసె; ఇంతఁజేసె; అంతలఁజేసి; ఇంతలఁజేసి—అని మార్చ గూడదు.

(15) ఐదుపదిసేయు=1. నమస్కరించు. 2. యుద్ధమున వెనుకంజ వేయు. (అర్థవివరణమునకు, చూ. నూ.ని.)

ఐదుఁబదిఁజేయు అన్నచో ఆ యర్థములు రావు.

(16) బుద్ధిసేయు = తలఁచు, స్మరించు.

1. "మాత్స్యపురమున దైన్యపడుట, బుద్ధిసేయకు" (భా. అశ్వ 1-116)

బుద్ధిఁజేయకుము - అన్నచో అర్థశూన్యపువాక్యగును.

2. "ఏటికి నొండొకబుద్ధిసేసె దే, నవ్వుచుఁబల్కఁగ ధరణినాథ యసత్యముగల్గనేర్చునే?" (భా. ద్రోణ. 1-391)

ఒండొకబుద్ధిసేయుట - యనగా, అన్యథాభావించుట.

3. "సా, వీరకులప్రసూతులము వీరుల మే మితరక్షితీశసాధారణ బుద్ధిసేయకు ముదాత్తచరిత్రులమైన మా యెడఁ" (భా.ఆర. 6-182)

ఇక్కడ, మాయెడఁ - ఇతరక్షితీశసాధారణబుద్ధిసేయకుము = మమ్ములను సాధారణులైన యితరక్షితీశులవలె భావింపకుము. అని భావప్రధానముగా నన్వయము చెప్పికోవలెను. అంతేగాని, 'ఇతర...బుద్ధిఁ, మా యెడఁ, చేయకుము' అని యన్వయించుట కుదురదు.

(17) గజిబిజి సేయు = కలఁత పెట్టు.—

"గజదైత్యుఁ డివ్విధంబున, గజిబిజి సేయంగ" (కాశీ. 6-176)

గజిబిజి సేయు - అన్న యర్థమున 'గసిమసి సేయు' అను క్రియ బసవపురాణమున నిట్లు ప్రయుక్తమై యున్నది.

"ఎసఁగ లలాటవహ్నిఁ గుసుమేషు దహించిన కాలరుద్ర! ముఁ
*గసిమసిచేసి దక్షునిమఖంబు హరించిన వీరభద్ర!"

ఈ క్రియలలో అరసున్నలు పెట్టి, గజిబిజిఁజేయుఁగ; అనియు,— 'గసిమసిఁ జేసి' అనియు వాడఁగూడదు.

(18) కరుణగలుగు = కరుణగలవాఁడగు; కరుణగలదియగు.

కరుణ = కరుణను, కలుగు = పొందు, అని యర్థము చెప్పుటయు, 'కరుణఁగలుగు' అని, అరసున్న పెట్టి వాడుటయు సరికాదు.

♦శ.ర. కర్త "కలుగు. (స. క్రి) = పొందు", అని యర్థము చెప్పి, అంటుకు 'కరుణగలుగుమమ్మకమలనేత్ర' అను ప్రయోగమును చూపిశాడు.

---

* 'గసిమసిఁజేసి' అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారి పాఠము. 'గసిమసి చేసి' అని, శ్రీ బండారు తమ్మయ్యగారి సవరణ. (చూ.ఆం.సా.ప. పత్రిక. పార్థివచైత్ర - ఆషాఢములు.)

బసవపురాణము పీఠిక (పుట. ౧౧౨)లో, ప్రభాకరశాస్త్రిగారు, "కసిమసి = గజిబిజి (గసియు మసియు)" అన్నారు. కాని, నిఘంటువులలో,— 'గజిబిజి'కి రూపాం. 'గసిబిసి' అని యున్నదిగాని 'కసిమసి' అని లేదు. ఊన్నము, 'కసి'యను మాటకు 'గసి'యను అర్థమువచ్చుమార్గము లేదు.

శ.ర.లో, 'కసిమసి = తొట్రుపాటు' అని యున్నది. సూ.ని. లో అదియును లేదు.

♦ గుప్తార్థప్రకాశికలోను, 'కలుగు = పొందు' అనియే అర్థము చెప్పబడినది. ఆ యర్థమునకు శ.ర. కర్త చూపిన ప్రయోగమే చూపబడినది. (చూ.క్రియా.సూ. 104 క్రింద)

అట్లుచెప్పుట సరికాదంటూ వేదం. వేంకటరాయశాస్త్రిగారు, శృం.నై.లో, 'పరిజనంబులమోదఁ గరుణగలుగు' (7-9) అన్నచోట, ఇట్లు వివరించినారు.

" 'కరుణగలుగు' - కలుగు ధాతువునకు 'పొందు' అను నర్థ మనియు ఆ యర్థమున నది సకర్మక మనియు తెలిపి సీతారామాచార్యుల వారు 'కరుణగలుగుము' అని యుదాహరణ మొసంగినారు. అది 'కరుణగలిగి యుండుము' అనుటకే శబ్దప్లవ కల్పప్రయోగవిశేష మనియు ధాతువు సకర్మకము కాదనియు మదీయాభిప్రాయము; వారు ఈ యర్థమునకు వ్యతిరేకమునందు చూపిన ప్రయోగము 'లేమె' యనునది అస్వర్థకమునకు బాలవ్యాకరణమున చెప్పినట్టిదే; సకర్మకమునుచో— 'వాఁడు నలువురు పుత్రులను గలిగెను',— 'వానిచే ధనధాన్యములు కలుగఁబడినవి' అని యిట్టి యనిష్టప్రయోగపరంపరను సాధువుగా నంగీకరింపవలసివచ్చును. అదియు నిష్టాపత్తియయేని, 'సుఖంబుండు'— 'నిండారగంబుండు'— 'కొలువుండు' ఇత్యాదులంబట్టి 'ఉండు' ధాతువును 'పొందు' - 'చేయు' అను నర్థంబులతో సకర్మకంబుచేసి,— 'ఆతండు నలువురు పుత్రుల నుండెను'.— 'వానిచే నలువురుపుత్రులు ఉండఁబడిరి. ఇత్యాది ప్రయోగములను సయితము అంగీకరింపవలసివచ్చును. వీనియందు,— 'సుఖముగా',— 'నిలగంబుగా',— 'కొలువుగా' అని యర్థమేని ప్రకృతివాక్యమునను 'కరుణగా' (కలుగుము= ఉండుము) అనియే యర్థము కావచ్చును. కావున సకర్మకత్వమతము సమ్మతము కాదు."

సూ.ని.లోను, "కలుగు = కలదియగు, కలవాఁడగు" అనియే చెప్పబడినది.

కావున శ.ర.కర్తృత్వోక్తి-నక్తోక్తోవ సరియైనది కాదు.

(1) "నీవు నతిభక్తిగలుగుము గోవులందు" (భా.ఆను. 3-87)

(2) "వర్ణంబులు నాలుగింటిమోదను మేదినీశ్వరుండు దయగలుగ వలయును" (శాంతి. 2-177)

(3) "ఈ వాక్యంబులం దాత్పర్యంబుగలుగుము" (శాంతి. 2-309)

మొదలగు నెల్లతావులలోను 'కలుగు'ను,— వే. వే. శాస్త్రిగారు చెప్పినట్లు— శబ్దపల్లవముగా గ్రహింపనగు నేగాని, శ.ర. కర్త చెప్పినట్లు,— సంక్షి. గా గ్రహింపదగదు.

(భక్తి చెడు)

'కలుగు' అను క్రియవలెనే 'చెడు' అను క్రియయును శబ్దపల్లవముగా ప్రయుక్తమై యున్నది.

1. "భేషజం బెబ్బాని భేదింపఁజాలదు, లంఘనంబున నెగ్గి లావుచెడదు" (కాశి. ౧-౧౧౧)

లావుచెడదు = తగ్గిపోదు.

2. " "అప్పురంధ్రీరత్నంబు,— ఇట్టుల మద్భక్తిపుట్టియును ని, జేసుచెడ భక్తిచెడదు" (ఆము క. 4-50) "భక్తిచెడదు = భక్తిని వదలదు. 'చెడదు', సకర్మకముఁవోలె ప్రయుక్తము. 'కరుణగలుగుమమ్మకమలనయన' అన్నట్లు" అని సంజీవనీవ్యాఖ్య.

నిద్రపోవు; వివాహమాడు అనుక్రియ లెట్టివో 'కరుణగలుగు'; 'భక్తిచెడు' అను క్రియలును నట్టివే.

(19) కనుఁగొను; కనుగొను.— ఈ క్రియలు రెండును శబ్దపల్లవములే. భిన్నార్థకములు. అనుస్వారమే ఆ రెంటిని భేదించునది.

కనుఁగొను (కనుంగొను) = చూచు.
కనుగొను = కన్నగలవాఁడగు.

రెండర్థములకును, ఈ క్రింది ప్రయోగమే ప్రమాణము.—

"ఈతటినిం, గనుఁగొనుపుణ్యుఁడు
మిక్కిలికనుగొనునెన్నుదుట" (దశా. ౧-౧౨౩)

కనుఁగొనుపుణ్యుఁడు = చూచు పుణ్యాత్ముఁడు, నెన్నుదుట మిక్కిలి కనుగొనుట = నొసట నెక్కువకన్నగలవాఁడగును - అని యర్థము. ఫాల నేత్రుఁడగును = ఈశ్వరుఁడగు నని భావము.

'కమంగొను(= చూచు) అను క్రియలోని ద్రుతము ద్వితీయార్థమున వచ్చినదికాదు. భాషాసంప్రదాయమునుబట్టి వచ్చినది.— డిల్లంబోవు; వెలవెలంబోవు - అను క్రియలలోని ద్రుత మెట్టిదో ఆదియు నట్టిదే.— "కేచిచ్ఛబ్దవిశేషాస్సుయాః క్రియాయోగే ద్రుతాన్వితాః" అని యధర్వణుడు. (చూ.క్రియా.సూ. 33)

ఈ శ.ప. క్రియల ప్రయోగములూ, అన్వయములూ చిత్రవిచిత్రములుగా నున్నవి. మచ్చున కొకకొన్ని.—

(20) నోరుచేయు.— "కూడనిత్తునె మాటుకొని మోఅయెల్తిన, గదిమెద నోరింతకంటెఁజేయ." (బహు. 2-61)

'ఇంతకంటె - నోరుచేయఁ - గదిమెదఁ' అని యన్వయము. ఇంతకంటె నెక్కువ మాటలాడినయెడల గదిమెద నని యర్థము. 'నోరు చేయు' అనునది క్రియ. క్రియలోని నోరు, చేయు అను పదము లెడపడియున్నను, పదసమన్వయమున 'నోరుచేయఁ' అని యేకపదముగా గ్రహించి చెప్పవలెఁగాని,— నోరు = నోటిని, ఇంతకంటె = ఇంత కెక్కువగా, చేయఁ = చేసినయెడల, అని యర్థము చెప్పగూడదు.

నోరుచేయఁ అనుటకు మారుగా 'నోటిఁజేయఁ' అని యనగూడదు.

(21) కైకొన్కసేయు = కొనుకగాఇచ్చు.— "గుండ్లపేరును గైకొన్క- కోరి నేతు" (హంస. 3-38)

కోరి, *కైకొన్కనేతు - నని యన్వయము.

(22) చెఱలుపట్టు.— "ఆ సురవైరి పట్టెఁజెఱ లడ్డములేక మృగాయతాక్షులఁ" (నిర్వ. 5-98)

---

* సూ.ని. 'కైకొనుక' క్రింద, శుకసప్తతిపద్యమును, 'కైకొన్కఁ జెసెద' (3-అర్వ) అను పాఠముతో చూపినది తప్పు. 'కైకొన్కసేయు' శబ్దప్రయోగక్రియ. (చూ. 'అర్థపరామర్శ'లో 'నడకొలఁకు'.)

పద్యమున 'పట్టెఁజెఱలు' అని ప్రయుక్తమై యున్నను, చెఱలు పట్టెక్ - అనియే మన మర్థముఁజెప్పికొనవలెను. చెఱలు = చెఱలను, పట్టెక్ = పట్టుకొనెను - అని చెప్పగూడదు.

(23) కయ్యముపొడుచు.— "పొడుతు నెట్లుఁ బాండు పుత్రులతోఁ గయ్య మేను". (భా.శల్య. ౧-౬౯)

ఇందు, 'కయ్యముపొడుచు' అను క్రియలోని పదములు వెనుకముం దగుటయు, ఎడపడుటయు గూడా జరిగినది. ఏమయినను, అది యేకపద క్రియయే. 'కయ్యముఁబొడుతు' నసగూడదు.

"అధిప నీతనయుండు గయ్యంబుపొడుచు" (భా.భీష్మ. ౧-౧౪౨)

కయ్యముపొడుచు అను నర్థమున 'కలనుపొడుచు' అనియు కలదు.—

"చిక్కిఁ బోటుబంటు, కలనుపొడువ" (కుమా. 2-112)

(24) చీరికిఁగొను.— "కొనండు ద్రుపదాత్మజుఁ డగ్గురుఁబోరఁ జీరికిన్" (భా.ద్రో. 3-298)

ద్రుపదాత్మజుఁడు - అగ్గురున్ - చీరకింగొనఁడు - అని అన్వయము. (ఇదియును పై ప్రయోగమువంటిదే)

(25) మరులుకొను.— "నీ, కొన్నమరుల్ జగజ్జనులు కొందురె" (కు.సం. ౨-౧౬౯)

'జగజ్జనులు=లోకములోనివారెపగ్గైనను, నీకొన్నమరుల్ కొందురె?= ఇట్లు నీవలె మరులుకొందురా?' అని భావము.

ఇందు, 'మరులుకొను' అను క్రియ విభక్తమగుటయేకాక వికృతము కూడ నైయుండుట గమనింపవలసిన యంశము.

(26) కొంకుకొసరు - చేతప్పుగొను.— "కొంకుకొసరును - చేతప్పు గొనకయుండు" (పాండు. ౧-౭౧)

కొంకు కొసగుగొనక యుండును; చేతప్పుగొనక యుండును - అని అన్వయము. కవి రెండు క్రియలను జోడించి చమత్కరించినాడు. కొంకు కొసరును - అనుచోట 'ను' సముచ్చయము.

'కొంకుకొసరు' (జాతీయము) = సంకోచము.

(1) "తొడలపై నిద్రనోయెడు దుష్టసూకరము
గొంకుకొసరింతయునులేక కూలద్రోవు." (విక్ర. 3-97)

(2) "సింహబలుఁడత్యుదగ్రతఁ జిగురుఁబోఁడి
పజ్జఁగడువడిఁదగిలి కోపంబుగదుర
నొడిసి తలపట్టి లిగిచి మహోగ్రవృత్తిఁ
గొంకుకొసరించుకయులేక కూలఁదాఁచె" (విరా. 2-128)

(27) జంగలుగొను.— లయ॥ "చవుకట్టులమెఱుంగు బలుచుక్కల పయింగినిసి - జంగల్, చెంగునఁగొనఁ" (రా.వి. ఆ. ఆ.)

చెంగునఁ, జంగల్‌గొనఁ - అని యన్వయము. (చూ. శ.ర.లో, 'జంగగొను' క్రింద)

జంగల్ = జంగలను, కొనుఁ = కొనును, అని యర్థము చెప్పగూడదు.

23. 'పండ్లుకొఱుకు'

*పండ్లకొఱుకు = కోపముచే పండ్లు పటపటలాడించు. (చూ. సూ.ని. 'కొఱుకు.')

---

* పండ్లుకొఱుకుట అసూయాలక్షణమని, దు.సూ.నా. శాస్త్రిగారి వాదము. వారి వాదము, సూ.ని. కే విరుద్ధము. (చూ. 'కొఱుకు'.)

పండ్లుకొఱుకుట కోపలక్షణముగాని అసూయాలక్షణము కాదు.

'కళా'లో, తుంబురుడు తన్ను బిలువకయే విష్ణుసభకేగి పాటకచేరీ చేసి బహుమతి పొంది వచ్చుట తన్నవమానించుటగా భావించి, నారదుడు

"నేటుకొని పండ్లుకొఱుకుచుఁ, జీటికిమాటికిని గసరు
చిలుకం జిలుకొ, బోటుల నలయించెదు." (నీలా. 3-26)

పండ్లు కొఱుకుచుఁ = ఫలములను కొఱికి తినుచూ అని యర్థము. కోపమును ప్రకటించుచూ అని యర్థాంతరము.

ఆరసున్నను చేర్చి,— 'పండ్లఁగొఱుకుచు' అని మార్చినచో ఆ పలుకుబడి అనర్థమే యగును.

కాబట్టి 'ఇందు తప్పేమి' అని, ఱొరక ఆరసున్నలు పెట్టగూడదు. ఆరసున్నలు పెట్టగూడని మరికొన్ని పలుకుబడులను గూడ, మనవి చేస్తాను.—

(1) పీఁటపెట్టు = కదలక మెదలక కూర్చుండు, తపస్సు చేసికొని యుండు.—

కోపము నాపుకొనలేక, 'పండ్లుకొఱికినా' డట! నారదుఁడే స్వయముగా చెప్పుచున్నాడు. వినండి—

"బాపు! తుంబురుఁడా యంచుఁ బండ్లగొఱుకు
కొంచు, లోలోన నుడికితిఁ గొంతతడవు." (2-85)

ప్రతాపరుద్రీయములో,— "శత్రుకృతాపచారేణ మనః ప్రజ్వలనం క్రోధః; కంఠగర్జన దంతఘట్టనా ద్యనుభావః' అని తెలుపబడియున్నది.

పండ్లుకొఱుకుట ప్రాచీన కావ్యములలో సర్వత్ర కోపప్రకటనమునఁ గనబడుచున్నది. ఒక కొన్ని యుదాహరణములు:

1. "కోపముదయింపఁగాఁ బండ్లుకొఱుకొనుచు"(ప్రబోధ. 2-14)

(ఈ పద్యము, సూ.ని.లో 'ఇస్సిస్సి'అను పదముక్రింద ఉదాహృతమై యున్నది.)

2. "కుంభోదరుండు భూకిటి ఫాలమునఁ బూనెఁ,
గోకిలాక్షుఁడు పండ్లుగొఱికికొనియెఁ,
... ...
రాజశేఖరుండు దుర్వాసుమీఁద
నలుగు మెఱుఁగి తదీయరోషానుపృత్తి" (కాశి. 7-31)

1. "బెండువడియును జొరనీరు పీటపెట్టి
మాపులనె యేర్చుఁ బ్రజ నొక్క– నూకరంబు"
(మను. 4-69) బ్రౌ. ప్ర.

'పీటవెట్టి = మోహరించుకొని కూర్చుండి' అని జూలూరివారి టీక.

2. "పీటవెట్టిన ప్రాను పెల్లగిల్ల" (మను 4-16)

'పీటవెట్టినప్రాను = స్థిరముగా పాతుకొనియుండే చెట్టు' అని జూ. టీక. 'పీటఁబెట్టి' అని సవరించరాదు.

(2) పిండిపెట్టు = మెత్తగా నలుపు.– 'వాడిబుగ్గలు పిండిపెట్టాడు' అని వ్యవహారము. బుగ్గలు మెత్తగా నలిపివేశాడని యర్థము.

పిండిపెట్టు = పిండియిడు.

"ఒండొకఁడవైన నిపుడు నీ పిండియిడమె" (మను. 4-128)

'నీ పిండియిడమె = నీ పిండిపెట్టమా అనగా నిన్నుకొట్టి నలిపి పిండి ముద్దగా జేయమా' అనుట. (జూ. టీక.)

పిండినిబెట్టు; పిండినిడు —అని దిద్దగూడదు.

(3) వెలిపెట్టు = బహిష్కరించు.— శ.ర. క్ర "వెలిపెట్టు = వెలివేయు' అని యర్థముచెప్పి, ఆ క్రియకు, "వెలిపెట్టిరేబాడబులు" అను

---

3. "కనుఁగొని కోపవేగమునఁ గన్నుల నిప్పులురాల నంగముల్
దనరఁగ సాంద్రఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంతదంతపీ
డనరటదాస్యరంగ వికట భ్రుకుటీచటుల ప్రవృత్త న
గ్గనఘటనా ప్రకారభయదస్ఫురణా పరిణద్ధమూర్తియై"
(భా. విరా. 2-133)

4. దశావతారచరిత్ర.—
"నాఁటికోప మీశ్వరుఁ డెఱుఁగుఁ."
"జటివరుఁ డిటువలెఁ గనలుచు,...
తటతటకటతటులదగఁగ,
గిటగిటమని రదనపటలి గీటుచుఁ బలికెఁ" (6-84)

పండ్లుకొఱుకుట అసూయాలక్షణ మనువాదము, బహుకావ్యపరిచయముగల పండితులు శ్రీ సూ.నా. శాస్త్రిగారు చేయదగినది కాదు.

మనుచరిత్ర ప్రయోగమును చూపియున్నాడు. ఆ పద్యమే ఆయనగారి ప్రౌ. వ్యా. లో, కొరక, ర. క్రింద, (1915 సం॥ ప్రతిలో) 'వెలిఁబెట్టిరే' అను పాఠమతో నచ్చెనది. *అది ప్రమాదము. వెలిపెట్టు; బహిఃపెట్టు అను క్రియలు శబ్దప్రల్లవములు. 'వెలింబెట్టు' - 'బహింబెట్టు' అను రూపములు శాస్త్రమునకును, శ.ర. కును విరుద్ధములు.

(4) గట్టిపెట్టు = రంగు మొదలయినవి - పూయు.—

పూర్వకాలమున వర్తకులు జమాఖ్ఖుల్చిలెక్కలు నల్లగుడ్డపుస్తకముల లోను, కొయ్యపలకలమీదను, తెల్లని బలపములతో వ్రాసెడివారు. (బళ్లలో పిల్లకాయలుగూడ కొయ్యపలకలమీదనే వ్రాసికొనెడివారు.) అక్షరములు చక్కగా కనబడుటకు, వారు, ఆ పుస్తకపు పుటలమీదను, ఆ పలకల మీదను - బొగ్గుపొడికలిపిన ఆకుపసరు పూసెడివారు. అట్టి పసరపూయుటను, 'గట్టిపెట్టుట'; 'గట్టియిడుట'; 'గట్టించుట' అందురు.

ఈ పలుకుబళ్లు కావ్యములలోని కెక్కియున్నవి.—

(గట్టిపెట్టు)

1. "దేవి, తమోమషీరసము తేటపాసంఁగఁ 'గట్టిపెట్టి' యం
కావళి వ్రాయఁగాఁ దొడఁగె, నంబర సంపుటికొంతరంబునఁ
బూవిలుకాని శౌర్యగుణముల్ హరిణాంకుఁడు" (శృం.నై. 8-170)

2. "ఎంత పాపాత్ములరా లని యిటుల నింక
బ్రహ్మ నిజఫాలఫల కొక్కరములు 'గట్టి
పెట్టు' నన్నట్లు కస్తూరి పట్టువెట్టి" (సారంగధర. 2-155)

3. "అనువుగ మిన్ననుం గడితపాశె(?) తమంబున ♦గట్టిపెట్టి" (హంస. 1-42)

---

* 'బులుసు' వారు పరిష్కరించిన (1952 సం॥) ప్రతిలోను, ఆ ప్రమాద మట్లే యున్నది.

♦ 'గట్టిపెట్టు' అని నూ.ని.పా. (చూ. ద్వి.సం. అనుబంధమున 'గట్టి'). అర్థమేమో!

(గట్టియిడు)

"*నేఁ, డక్కఁడితంబు 'గట్టియిడి' నట్టులయున్నది కప్పుఁజేయుచుఁ" (పాండు. 4-80)

(గట్టించు)

"గట్టించు to rub out what is written on a plank which is used in Hindu Schools like a slate" (బ్రౌ)

'గట్టించు'కు ప్రకృతి ఘట్టించు. గట్టించు – అను నర్థమునఁనే 'ఘట్టించు' – అను క్రియయును ప్రయుక్తమై యున్నది.

"చిత్ర సాధనంబులు గొని పలక ఘట్టించి మెఱుంగిడి త్రివటించి తిట్టంబు కొలఁదికిం దెచ్చి" (నన్నె. కు.సం. 5-597)

పలక ఘట్టించి - యనఁగా, చిత్తరువు వ్రాయుట కనువైన రంగును పలకకు పట్టించి అనియే యర్థము.

శ.ర.లో 'గట్టిపెట్టు' మున్నగు పలుకుబళ్లలో నొక్కటియును లేదు. శ.ర., సూ.ని.కూడా 'కడితము' క్రింద, 'నేఁ డిక్కడితంబు గట్టియిడి నట్టుల యున్నది' అను పద్యము నుదాహరించియు, అందున్న 'గట్టియిడు' అను క్రియను గ్రహించలేదు.

శ.ర. కర్త, బ్రౌణ్యములోని పదములను తీసికొనుటలో, 'గట్టించు' అను పదమును జారవిడిచినాడు.

సూ.ని. 'గట్టి' యను పదముక్రింద,— "ప్రాఁతప్రతుల పాఠమును బట్టియు కట్టించు అను గుంటూరుమండలము వాడుకనుబట్టియు 'కట్టిపెట్టు'గా గ్రహించి కట్టించు అను నర్థము చెప్పుట మంచిదని తోఁచెడిని" అని చెప్పి 'గట్టించు' అను క్రియ నుజ్జగించినది.

---

* 'నేఁ, డక్కఁడితంబుఁ గట్టియిడినట్టుల' అని వా.ని.పా. (చూ.'కడితము')

గుంటూరుమండలములో 'కట్టించు' అను వాడుక యున్నమాట నిజమేగాని, అంతమాత్రమున 'గట్టించు' అను పదమును చెప్పరానిది కాదు. 'గట్టించు' అను రూపమును చూపి 'కట్టించు' అని గుంటూరు మండలమున వాడుక – అని చెప్పుట మంచిది.

శృం. సై. టీకలో 'వేదం'వారు,— "గట్టివెట్టి - బ్రూనిపలకమీఁద పాఠములు వ్రాసికొనుబాలురు ఆ పలకలకు ముందుగా బొగ్గుపొడుము దొండాకుపసరు లోనగువానిని కలిపి గట్టిగా పూసి ఆ పూత బిగిసికొనిన తర్వాత వానిపై తెల్లఁగా బలపములతో వ్రాసికొందురు. ఆ పూయుటకు గట్టించుట యనియు గట్టన యనియు పేరులు. ఆ గట్టనయే యర్థముగా నిట 'గట్టి' యని శ్రీనాథుఁడు ప్రయోగించినాఁడు" అని వివరించి యున్నారు.

"గందంపుఁబొడి వైచి గట్టించి యందుపై, నెలతాలఁ గట్టిన నెలవు లందు." (యయా. ౫-౯౨)

గందపుపొడి వేసి గట్టించుట యెట్టిదో బొగ్గుపొడివేసి గట్టించుటయు నట్టిదే. కాబట్టి 'గట్టించు' అనునదే,— బ్రౌను, వేదం పండితులు చెప్పినదే—సాధురూపము.

'కట్టించు' అను వాడుకనుబట్టి, కట్టన, కట్టి పెట్టు, కట్టియిడు అను రూపములు కల్పించుట సరికాదు.

సూ.ని. 'త్రివటించు' అను పదముక్రింద, 'పలక ఘట్టించి' అను కు. సం. వచనము నుదాహరించియు, సంగున్న 'ఘట్టించు' అను క్రియను గ్రహించలేదు.

సూ.ని. 'గట్టి' యను పదానికి "బాలురు వ్రాసికొను బ్రూనిపలకల మీఁద బొగ్గుపొడి పసరు కలిపి పూయు పూత" అని యర్థమునెప్పి, ఆ యర్థమునకు,— "...తేటఁ బొసంగఁగ గట్టిపెట్టి" అను శృం. సై. పద్యమును చూపినది. ఆ యుదాహరణము 'గట్టిపెట్టు' అను క్రియకు చూపదగినదిగాని 'గట్టి'కి చూపదగినది కాదు.

'గట్టి' యనునది గట్టించుటకును, పూయుటకును, పనికివచ్చు పదార్థముగాని, 'పూయుపూత' కాదు. సూ.ని. 'గట్టి' యను విశేష్యమునకు,

'కట్టించు' అను క్రియకుగూడా, 'పూయుపూఁత' అనియే అర్థము చెప్పినది. అట్లు చెప్పుట యొప్పదు.

'గట్టిపెట్టు' అను క్రియ ఒక్క- వ్రాసినపలకకు పూతపూయుటయందే కాదు. ఒంటికి నలుగుపిండి పట్టించుటయందును వ రించును.

"నలుఁగులు నలుచు నర్మిలి గట్టిపెట్టి" (బసవ. పుట. ౬౭)

కావున, 'గట్టి'కి నూ.ని. చెప్పిన యర్థము సరియైనదికాదు.

'గట్టిపెట్టు' అను శ.ప. క్రియలోని 'గట్టి'ని విడదీసి, అర్థము చెప్పుటయే తప్పు. గట్టిపెట్టు - ఏకపదము; రూఢము. రూఢములైన-తల పెట్టు (= ఉద్యమించు), బలిపెట్టు (= చంపు), బహిష్కరించు (= వెలివేయు), పొడపెట్టు (= పొర్లు), పెనవెట్టు (= మెలివేయు) మొదలగు క్రియలలోని తల(ఁపు), బలి, బహి, పొడ, పెన—అను పదములను వేరుచేసి యర్థము చెప్పరాదు. అట్లు చెప్పుచో వాటికిగల ధాతుత్వము పోయి కేవల విశేష్యత్వమే మిగులును.

(5) త్రాడువెట్టు = త్రాడుకట్టు.—

"మిండండు బసవని మెడఁ ద్రాడువెట్టి" (బస. పుట. ౧౫౬) బసవని మెడఁ ద్రాడువెట్టి - అనగా, గొఱ్ఱె మెడకు త్రాడుగట్టి లాగఁగా - అని ఆ ఘట్టమున నర్థము.

త్రాడువోయు = త్రాడువెట్టు.—

"నడిమివాని మెడఁ ద్రాడువోసి యమ్మెద" (హరి.పూ. 2-40)

మెడకి = మెడయందు, త్రాడుఁబెట్టి = త్రాడును బెట్టగా; త్రాడుఁబోసి = త్రాడునుపోసి, అని యరసున్నలు పెట్టి యర్థములు చెప్పగూడదు.

(6) వెన్నుదన్ను - ఈ క్రియకు ఆయా సందర్భమునుబట్టి అర్థముల నేకము.

1. *"చిన్ని వెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధి
బొడమిన చెలువ తోఁబుట్టు మాకు" (మను. 2-43)

---

* "ధారాధరము వెన్నుఁదన్ని పుట్టిన చాయ" (విజయ. 2-106) అని 'వేదం'వారి పాఠము. తప్పు. 'బులుసు'చారి సంస్కరణమునను ఈ తప్పు తొలగిపోలేదు.

వెన్నుఁదన్ని — అన్నప్పుడు — వెన్ను నుతన్నుటయే యగును గాని విలక్షణార్థ మేర్పడదు.

చిన్ని... వెన్నుదన్ని - ఆనఁగా, చంద్రునివెనుక, ఆతనితోపాటు, - అని యర్థము.

2. "ధర్మనందనుండు వెన్నుదన్ని యదల్చినఁ" (భా.భీష్మ. 2-295)
"ఇట్టి జెట్టి వెన్నుదన్ని చూడఁగలవాఁడు" (ఉద్యో. 2-244)
"దొరలు వెన్నుదన్ని పురికొల్ప" (నిర్వ.రా. 4-60)

ఇత్యాదిస్థలములలో, వెన్నుదన్ని = వెనుకనిలిచి, వెంటనుండి, అని యర్థము.

3. "వీరభద్రేశుఁ డీయద్రి *వెన్నుదన్ని
గౌతమీవారిఁ దరవారిఁ గడిగినాఁడు" (కాశీ. 3-30)

ఈ యద్రి వెన్నుదన్ని = ఈ కొండపై నిలిచి - అని యర్థము.

4. "వెన్నడుముల విన్ను వెన్నుదన్ని" (మను. 101)

ఇది స్త్రీవర్ణనము. ఆ స్త్రీలు తమ వెన్నడుములచేత, 'విన్ను వెన్ను' దన్నినారట! ఆకాశమునకు వెన్నేమి? దానిని స్త్రీలు నడుములతో తన్నుటేమి? వెన్ను-తన్ని అని యర్థము చెప్పఁగూడదు. వెన్నడుములచేత, విన్ను = ఆకాశమును, వెన్నుదన్ని = తిరస్కరించి అని యర్థము చెప్పవలెను. ఆ స్త్రీల నడుములు, ఆకాశమువలె కలదు-లేదు అన్నట్లున్నవని భావము.

(7) కాలుదన్ను = స్థిమితముగా నిలిచియుండు—

"అచటికి వేగంబయరుగక యిచటఁగా, ల్దన్నియుండెడునట్టి ధైర్య మెందుఁ, గలదు" (భా.మౌ. 97)

'ప్రథమయుఁ గావచ్చును, ద్వితీయయుఁ గానగు'నని,-'కాలిదన్ని' అని ప్రయోగింపదగదు.

---

* 'వెన్నుఁదన్ని' అని 'వావిళ్ల'ప్రతి పాఠము.

(8) ముసుఁగుదన్ను.— ముసుఁగుదన్నుట యనఁగా ముసుగుగా నేర్పఁడుట, క్రమ్మఁట, ఆవరించుట, వ్యాపించుట.

"కడలేని వీడ్యంబుఁ గప్పు *చందురకావి
మోవి పల్లొత్తుల ముసుఁగుదన్న" (పాండు. 3-10)

వీడ్యపు కప్పు యొక్క - ♦చందురకావి = సిందూరవర్ణము, మోవి పల్లొత్తులఁ - ముసుఁగుదన్నఁ = మోవియందలి పలుసొక్కుల పై వ్యాపింపఁగా - అని యర్థము.

ముసుఁగును, తన్నఁ = తొలగింపఁగా - అని యర్థము చెప్పుట పొసఁగదు. 'ముసుఁగుదన్ను' వంటిదే 'వేరుదన్ను' (= వేరుపాఱు) వేరుఁదన్ను — అనరాదు.

(9) మిన్నుదన్ను = అత్యున్నతమగు - అని యర్థము.

సూ.ని. "తన్ను = తాఁకు, అంటు, స్పృశించు (బరయు. శ.ర.)" అని చెప్పి, ఆ యర్థమునకు, 'మెలఁతలు మిన్నుదన్ను తెలిమేడలఁ గ్రీడలు సల్పుచుండి' (రామా. ౧-౧౩౫) అను ప్రయోగమును చూపి, "మిన్నుఁదన్ను = అత్యున్నతమగు - అని తాత్పర్యము" అన్నది.

మిన్నుఁ - తన్ను - అని విభాగించి అర్థము చెప్పుట సరికాదు.

---

* 'చందుర్తుకావి' అని బులుసువారి పాఠము. తప్పు. ఈ తప్పు పూర్వ ముద్రణమునుండి వచ్చినది. పూ.టీ. లో 'చందుగ్గకావి' అని సరిగనే యున్నది. 'బులుసు'వారు గమనించలేదు.

♦ 'తాంబూలమువల్ల కలిగిన - కప్పు = గారగల, చందుర్తుకావి మోవి = సిందూరపురంగుగల పెదవి, పల్లొత్తుల = దంతక్షతములచేత, ముసుఁగుదన్నఁ = ఆవరింపఁబడఁగా' - అని బులుసువారి టీక.

'గార' పండ్లకుపట్టునుగాని, మోవికిపట్టదు.—పల్లొత్తుల = దంత... చేత — అనుటయు, 'ముసుఁగుదన్నఁ = ఆవరింపఁబడఁగా' — అనుటయు సరికాదు.— పూర్వటీకలో, 'సిందూరవర్ణముగల పెదవి - దంతక్షతములచే - మఱుఁగుపడఁగా' అనీ యున్నది.

1. "మిందన్ని వే,ఘుననీలాంగుఁడు గాంచె" (ఆము. ౪. ౧౦౫)

ఈ పద్యమున, మేఘుమునకును, వామనావతారమునకును శ్లేష.

మిందన్ని (=మినుదన్ని) = మింటనిలిచి - అని మేఘుపక్షమునను,— మిఁతన్ని = మింటికి పాదము చాచి - అని వామనపక్షమునను అర్థములు.

'మిందన్ని = ఆకాశమందు నిలిచి' అని వావిళ్ల్లవారి టీక.

'మిఁ = ఆకాశమును, తన్ని = అధఃకరించి' అని వేదంవారి టీక.

'మిఁదన్ని' (మినుదన్ని) అని శ. ప. క్రియగా నుండినఁనేగాని, 'అధఃకరించి' అను నర్థ మేర్పడదు. వట్టి 'తన్ను' అను క్రియకు 'అధఃకరించు' అను నర్థములేదు. కావున వావిళ్ల్లవారి టీకయే కొంత మేలు.

2. "దానఁ గకుత్థ్సుఁ డెఱ్ఱజిగిదన్నిన కన్నరచూపుచూడ"
(కకుత్. ౫. ౧౩౮)

ఎఱ్ఱజిగిదన్నిన = ఎఱ్ఱవాతిన - అని యర్థము. ఎఱ్ఱజిగిఁతన్నిన - అని చెప్పుట కుదురదు.

3. "మెడదన్ను పునుకల నిడుపేరు లొండొంటిఁ
బొరిఁబొరిఁదాఁకి బొగ్గొబ్బణుగు రనఁగ" (హర. ౫. ౧౬)

మెడదన్ను = మెడ (నిండ) నున్న - అని యర్థము. మెడఁదన్ను అనగూడదు.

(10) తలదన్ను.— సూ.ని. 'తలఁదన్ను = అధఃకరించు, మించు, మీఱు' అని యర్థముచెప్పి, అందు కీ క్రింది పద్యములను చూపినది.

1. "పుట్టినప్పుడె జవ్వనంబును సమస్త
భూమినీకోటిఁ దలఁదన్నుపాటి చెలువు
గలిగె దీనికి." (కువల. 3. ౬౭)

2. "చెలియ పెన్నెఱిగుంపు చీకటిఁ దలఁదన్నె" (బిల్హ. ౨-౧౨౦)

తలయు, తన్నుటయు నున్నప్పుడే, తలఁదన్నెఁ = తలనుతన్నెను - అను నర్థము సరిపడునుగాని, అవి లేనిచోట ఆ యర్థము సరిపడదు. పై పద్యములలో 'తల'యును లేదు; 'తన్నుట'యును లేదు. కావున అట్టి యర్థము కుదురదు.

తలఁదన్ను - అన్నప్పుడు, 'తన్ను' క్రియ, 'తల' కర్మ - యగునేగాని, అందు అధఃకరించు - అన్న యర్థ మేర్పడదు.

భూమిసీకోటిఁ - తలఁ - తన్నెఁ = భూమిసీకోటినీ, తలనూ తన్నెను. చీకటిఁ - తలఁ - తన్నెఁ = చీకటినీ, తలనూ తన్నెను. అనుటలో అర్థము లేదు.

'తలదన్ను' శ.ప.క్రియ. (ఏకపదము) అధఃకరించు, అని రూఢ్యర్థము. కావున, 'తలదన్ను' అను క్రియలో అరసున్న పెట్టుట యొప్పదు.

తలకడచు, తలద్రొక్కు, తలకొను, తలగాచు, తలయంటు, అను క్రియ లెట్టివో 'తలదన్ను' అను క్రియయు నట్టిదే.

సూ.ని. 'తలఁదన్ను - ఔపమ్యద్యోతక'మనిచెప్పి, - 'అతఁడు విద్య లలో నందఱను తలఁదన్నినాఁడు అని వ్యవహార' మన్నది.

వ్యవహారమునగాని, మరియొకచోటగాని, తలనుతన్ని తే - ఎవడైన నూరకుండునా? తిరుగమల్లి చావగొట్టడా?

(11) వెన్నుచూపు = 1. యుద్ధమున నోడి పాఱిపోవు; 2. వరి పైరు వెన్నుతీయు.

రెండర్థములును, ఈ క్రింది పద్యములలో పొందుపరుపబడియున్నవి.

1. "కలమగర్భంబు లింతి జంఘలకు నోడి
వేగ తృణమూని తలవంచె *వెన్నుచూపి" (రుక్మి. ౪. ఆ.)

---

* 'వెన్నుఁజూపి' అని శ.ర.పా. తప్పు.

వెన్నుఁజూపుట - యనగా, వెన్నును చూపించుటయగునేగాని, పరా

2. "కలమగర్భంబులో మహోత్పలదళాక్షి
పిక్క_లకు నోడి తద్దయుఁ బీఁకెవాతి
వెన్నుఁ జూపి తృణంబుని యెన్నరాని
నానఁ దలవంచుచుండె నవారతంబు" (రసిక. ఎ. ౧౦౧)

(12) నిజముపట్టు.— "ఆగమముల్ పురాణముల్, ప్రత్యయ మయ్యెనే ♦నిజముపట్టెద, రంతియకాక యేమి?" (కాశీ. 6. 287)

నిజము పట్టుట = నిజముగా గ్రహించుట.— వాడి మాట నేను నిజము పట్టుకొన్నాను అని వ్యవహారము.

(13) కొండయెక్కు_ = బిగువుచేయు.—

"కొండయెక్కెదు బతిమాలుకొనిన కొలది
.....సింహాద్రి నారసింహ" (సిం.నా.శ. 17)

నరసింహస్వామి కొండమీద నున్నాడని స్వభావార్థము. బతిమాలిన కొద్దీ బిగువుచేస్తున్నాఁడని విశేషార్థము. 'కొండనెక్కెదు' అంటే విశేషార్థము సిద్ధింపదు.

(14) పాఁడెక్కు_ = నివాస మేర్పరుచుకొను.—

"ఆశితులు కాశికాపురి కస్మదీయ
*శీశ, పల్లేరుమడిచి పాఁడెక్కి_నాము" (కాశీ. 6-155)
పాడునెక్కు_ - అన నొప్పదు.

జితుఁడై పాఱిపోవుట కాదు; పైపై వెన్నుతీయుటయును కాదు.— వెన్నిచ్చు; వెన్నుచూపు - అను క్రియలు రెండును ఒక యర్థము నిచ్చునవే. రెండును శ.ప. క్రియలే.—

వెన్ను నిచ్చెను; వెన్నును జూపెను - అనుచో నవి శ.ప. క్రియలు కావు.

♦ 'నిజముఁబట్టెద'రని అచ్చుప్రతి పా. సరికాదు. సూ.ని. 'నిజము పట్టు' అను క్రియను గ్రహించనేలేదు.

* 'లీక! .....పాఁటెక్కి_నాము' అని వా.ప్ర.పా.

(15) కొండవట్టు = కొండ(ల)కు పాతిపోవు.—

"గద్దియడిగ్గి కాశ్యపునిగాదిలిసూనుఁడు కొండవట్టినన్" (కాశీ. 6-21)

ఇక్కడు ఒక చిన్న విశేషము.—సూ.ని. 'కొండఁజేయు = పెద్ద చేయు' అని వ్రాసి, ఆ పంక్తిక్రిందనే 'కొండవట్టు = పర్వతములకుఁ బాతిపోవు' అని వ్రాసినది.

"గద్దియ డిగ్గి కశ్యపుని గాదిలిసూనుఁడు గొండవట్టినన్"

అను పద్యమునుగూడా ఉదాహరించినది. 'కొండఁజేయు' అన్నట్లు 'కొండఁబట్టినన్' అనక, 'కొండవట్టినన్' అనుటకు కారణమేమో? కొండన్ - పట్టినన్, అంటే - పర్వతమును పట్టుకొనగా, అనే యర్థము వచ్చునేగాని, 'పర్వతములకు పాతిపోగా' అనే యర్థము రాదని తెలిసికొని అలా వ్రాసియుండునా? లేదు; లేదు. ముద్రితప్రతిలో 'వట్టినన్' అని యున్నదిగనుక, తానును 'వట్టినన్' అన్నది. అంతేకాని అర్థవిచారణచేసి కాదు. అట్టి విచారణచేయుపరిపాటియే యున్నచో - 'కొండఁజేయ' అని యేల ముద్రించియుండును? 'కొండచేయ' అని యేల సవరించి యుండదు?

(16) చెట్లువట్టు; తిప్పలువట్టు.—

కొండవట్టు - అను పలుకుబడివంటివే, చెట్లువట్టు; తిప్పలువట్టు - అను పలుకుబళ్లును.—

"ఎవ్వఁడు నీని సప్తాంగములు నీకు నిచ్చి చెట్లు
వట్టి, పెనురాల తిప్పలువట్టి తిరుగు" (ఆము. 3. 37)

*చెట్లువట్టి = చెట్లపాలై, తిప్పలువట్టి=తిప్పలపాలై - అని యర్థము,

---

* "చెట్లు = వృక్ష సమూహములను - వట్టి = శూన్యములయిన, పెనురాలతిప్పలు=పెద్ద శిలల కొండలను, పట్టి=ఆశ్రయించి" అని సంజీవనీ టీక. గ్రాహ్యముకాదు.

'ఇచ్చు' అను క్రియతోఁగూడి యేర్పడు శ.ప. క్రియలును ఇట్టివే.—

(17) అగ్నియిచ్చు = అగ్నిసంస్కారముచేయు.—

1. "పురపురఁ బొక్కుచు బకపతి
కరంకముం దేరఁబనిచి గారవమున నె
య్యురుఁ దాను నగ్నియిచ్చి" (భా. శాంతి. 3-512)

2. "చెలి యగుట నితనిడొక్కకు
నలఘుమతిఁ బగ్నియిచ్చి తది మేలకదా" (,,-515)

(18) వైద్యమిచ్చు = చికిత్సచేయు.— "మహోరగంబు గఱచెం దద్వేదనాలీఢుఁడై, తామూర్ఛిల్లినవాఁడు, వీఁడె విషవైద్యంబిచ్చి రక్షింపరే" (దశకు. 5-93)

విషవైద్యంబిచ్చి = విషవైద్యముచేసి.

(19) పూజయిచ్చు = పూజించు.— "వాసుదేవుఁడఁ జడునకుఁ బూజయిమ్మని విచార విదూరుఁడు భీష్ముఁ డెంతయుఁ, వెడగుఁదనంబునం బనిచె" (భా. సభా. 2-9)

పూజయిమ్మని = పూజచేయుమని, పూజింపుమని. పూజనిమ్మని - అన్నచో ఆ యర్థము రాదు.

(20) అవసరమిచ్చు = దర్శనమిచ్చు.— "అవసరం బిచ్చి శివుఁడు బ్రహ్మచ్యుతాది, దేవతల గారవించె" (కాశీ. 7-222)

(21) చెఱయిచ్చు = స్త్రీని (చెఱగా) మరియొకని కిచ్చు.

"మురమున నోడి దానవులతోడివిరోధము వీడి భక్తితో
సురపతివచ్చి నా శరణుసొచ్చి తగం దొలిచిచ్చియున్న నే
గరుణయ పుట్టి తమ్ముఁ ♦బొడకట్టి రమించినయట్టినాకుఁ బా
నిరవుగఁ బూని మాఱొకనియెనేని సహింతునె వాని నెల్లెడన్"
(నన్నె. కు. సం. 10-139)

♦ 'బొడగట్టి' అని 'వావిళ్ల'ప్రతి పాఠము. సరికాదు.

చెఱలిచ్చియు = స్త్రీలను నాకర్పించియు—అని యర్థము.

ఈ యర్థమును ఈ క్రింది ప్రయోగములు బలపరుచుచున్నవి :—

1. "దండుగ లిచ్చి వేలగొని దానిపయిం జెఱలిచ్చి కన్న నిం
గుండఁగనిచ్చేఁ గాక దనుజోత్తముఁ డల్లినఁ జంపఁబెద్దయే"
(నన్నె.—10-163)

2. "పరుల చెఱలు వృత్తులు నర్థంబులు మగుడ నిచ్చి నిజవృత్తి యంద
వర్తింపు పరమేశ్వరునందనుం గని విధేయుండవై నిర్వహించు డుచితంబు"
(,,—10-193)

పరులచెఱలు = ఇంతకుముందు నీకు చెఱగా అర్పింపబడిన పర స్త్రీలను, మగుడ నిచ్చివేయుము—అని, తారకునికి శుక్రుడు చేసిన యుపదేశము.

(22) చెయ్యిచ్చు = సాయపడు.—

"ఇంటివారిని లేపి యీవల దొంగ
బంటుకు* చెయ్యిచ్చు పాపాత్ములార" (గౌర.హరిశ్చ. పు. 168)

ఇటు ఇంటివారిని లేపి, అటు దొంగకు సాయపడు పాపాత్ములారా- అని యర్థము.

(23) మొలయిచ్చు = చీలదించి బిగించు. (మొల = ఇనుపచీల)

"పులక లొండుఱుల మేనుల నుచ్చిపోయి డ
గ్గఱ మొలలిచ్చిన కరణిగాఁగ,
... ...
గీఱి మేనుమేను దూర గాఢాలింగ
నంబునేసి రంగనయుఁ బ్రియుండు." (నన్నె.కు.సం. 9-148)

---

* ఇది పూర్వముద్రణ పాఠము.— 'బంటుకు' అనుట 'నఃక్తా' సూత్రము ప్రకారము తప్పని 'వేటం' వారు, 'బంటుచేతికి నిచ్చు' అని దిద్ది ముద్రించినారు. ఆ గ్రంథమున వారిట్లు దిద్దినతావులు చాల గలవు. వారికి ఆగ్రముకంటె వ్యాకరణమే ముఖ్యము.

మొల = (ఇనుప) చీల - అనుటకు, —

"అర్హపెకంబును జేయని
హరివాసరమునకు నై నిజాత్మజుఁ గనుమఁ
గరవాలు చేతఁబూనిన
కరణి, *యినుప మొలకు మేడఁ గాల్చుటసున్మీ" (రుక్మాం. 5-143)

(24) దళమిచ్చు = (దళము వేయు) మందము కావించు, —

"తనుమధ్య లోపరీస్తనభారమని విధి
దలమిచ్చెనాఁ గృశోదరము లెసఁగెఁ" (నచ్నె. కు.సం. 10-38)

తనుమధ్యలు = సన్నని నడుములుగల యీ స్త్రీలు, స్తనభారము - పీపరని, విధి, (వారి నడుములకు) దలమిచ్చెనాఁ = దళము వేసినాడో యన్నట్లు, కృశోదరములు = ఆ స్త్రీల సన్ననినడుములు, ఎసఁగెఁ = బలిసెను—అని యర్థము. గర్భనుయ్యెనని భావము.

దళమిచ్చుట (= దళము వేయుట) యనగా, పలుచనివస్తువునకు, దానికి తగిన మరికొంతవస్తువును చేర్చి దళసరికావించుట.

మిద్దె లురియకుండుటకు మందముగా వేయు గారకు 'దళ'మనిపేరు. 'దళముపేయు' అను పదము నెల్లూరుమండలమున ప్రసిద్ధము. దళముపేయు - అన్న యర్థమునే, సన్నెచోడకవి, దల(ళ) మిచ్చు - అను క్రియను వాడినాడు. † (దళమిచ్చు = దళముచేయు)

---

* 'మొల'కు 'చీల' అనియే లోకమున వాడుకలోనున్న యర్థము. శ.ర. కర్తయు, ఆ యర్థమునే చెప్పి, అందుకు ప్రమాణముగా ఈ పద్యమునే సూచించియున్నాడు.

† శ్రీ నిడదవోలు వెంకటరావుగారు, — 'ఇనుపమొల' యనగా 'ఇనుపకచ్చడ' మనియు, ఇనుపకచ్చడ మనగా, యోగులు ఆసనస్థైర్యమునకు మొలత్రాట జేర్చి ధరించు—'ఇనుపబద్ది' యనియు అర్థముచెప్పి, అందు కీపద్యమునే యిచ్చి—అర్థమిట్లు వివరించినారు :—

సూ.ని. 'దలము' అను పదానికి 'ఆధిక్యము, గొప్పతనము' అని యర్థమునెప్పి, ఆ యర్థమునకు పై పద్యమునే చూపినది. కాని 'దలము'ను విడిగా - విశేష్యముగా (సూ.ని. ప్రకారము) తీసికొన్నచో,— విధి, (ఆస్త్రీలనడుములకు) దలము = ఆధిక్యమును, గొప్పతనమును, ఇచ్చెక - అని యర్థమగునేగాని, 'దళసరికావించెను' అని యర్థముకాదు.

కవి, 'దలమిచ్చె' నాక - అని, శ.ప. క్రియగా వాడినాడు గాని, 'దలమును' - 'ఇచ్చెనాక' - అన్న యర్థమున వాడలేదు, సూ.ని. 'దలమిచ్చు' క్రియగాచెప్పి, ఆ క్రియ కాపద్యమును చూపియుండవలసినది.

దళము = మందము - అనుటకొక ప్రయోగము. —

"దళమెక్కు— నాలుక తడంబమ్మాటల." (శుక. 3-119)

'మెఱుఁగిచ్చు' అను క్రియవంటిది 'దళమిచ్చు' అను క్రియ.— మెఱుఁగిచ్చుట యనగా మెఱుగుపెట్టుట.—

"గొనకొనిసామగానమునకుక మెఱుఁగిచ్చుచతు(?)స్వనంబులక" (నన్నె. కు.సం. 3-82)

(25) పడుకయిచ్చు = భోగించు.—

"అందరికి నన్నిగూపంబులంది పొంద
దత్తుండయ్యును నొక వినోదంబుగాఁగ

"ఇది (ఈ పద్యము) ప్రత్యేకముగా నా యినుపబద్దెలను తయారు చేయించెడివారని తెలుపుచున్నది. ఇనుమును నిప్పులో కాల్చినగాని సాగదు. ఇనుపబద్ద చేయుటకు తగుమాత్రము నిప్పున్న చాలును. కాని విశేషముగా నవసరము లేదు. ఆ విషయమే ఇందు చెప్పబడినది. — ఏ మాత్రమును విలువలేని హరివాసరముకొఱకు (ఇవి మోహిని మాటలు) కన్నకుమారుని బంపుటకై కతియెత్తుట— యినుపకచ్చడము చేయుటకు ఒక పెద్దమేడ కాల్చునంతటి నిప్పు నుపయోగించుట వంటిది— అని తాత్పర్యము" (చూ. వివరములకు, జయ - కౌశీక భారతిలో, 'పెద్దన మనుచరిత్ర')

నిరువురకు మువ్వురకు మఱి యేవురకును
బడుకయిచ్చుచుఁ బెనఁగి గోపాలుఁ డపుడు." (దశా. చ. 8-94)

పడుకనిచ్చుచు అని సవరించగూడదు.

(26) తఱిద్రొక్కు- = కాలము సమీపించు.—

"*తఱిద్రొక్కి-యున్న యీ తల్లిదండ్రులఁ జూల
పఱచవై సంతోషపఱచవైతి" (పాండు. 3-36)

తఱిద్రొక్కి-యున్న = మరణకాలము సమీపించియున్న— అని యర్థము.

(26) కన్నుపొందు = కన్ను మూతపడు, నిద్రపట్టు.

"కడుపునిండఁ గుడుచఁగానమి చేయల్లఁ
గన్నుపొందకున్నఁ గరముడిస్సి,
యున్నవాఁడ." (భా. ఆది. 6-289)

కన్నుపొందకున్నఁ = నిద్రపట్టకపోవుటచేత, అని యర్థము.

శ.ర. కర్త, 'పొందు' క్రింద,— "పొందు = (కన్ను) వాలు" అని యర్థముచెప్పి, ఆ యర్థమున కీ పద్యమునే చూపినాడు. కాని, 'కన్ను వాలకపోవుటచేత' అనుట సంప్రదాయము కాదు. వాలునది 'రెప్ప' గాని 'కన్ను' కాదు.

---

* పూ. ము. లో 'తఱిద్రొక్కి-యున్న' అని పాఠమూ, 'తఱిద్రొక్కి- = (చావు) సమయమును సమీపించి' అని అర్థమూ ఉన్నవి.

'బులుసు' వారు, 'ద్రొక్కి-' అనుట తప్పని చెప్పి, 'దక్కి-' అని సవరించినారు.

'తఱిక్, దక్కి-యున్న = (మరణ) సమయమునకు వశమైయున్న' అని వారి టీక. తఱిక్ = (మరణ) సమయమునకు—అనుట సరికాదు. వారి సవరణ, అర్థము రెండును తప్పులే.

'తఱిద్రొక్కు' ఏకపదక్రియ. (చూ. సూ.ని.)

శ.ప. మైన 'కన్నువొందు' అను క్రియలోని 'పొందు'ను వేరుచేసి అర్థముచెప్పటయే తప్పు. 'పొందు = వాలు' అని చెప్పటమరియును తప్పు.

'కన్నువొందు' అను పలుకుబడి రూఢము. ఈ పలుకుబడిని,—

"సౌఖ్యమెదవ నాకుఁ గన్నువొందకుండు"

అని, ఈదురుపల్లి భవానీశకవి ధర్మాంగదచరిత్రమున 1-237 లో ప్రయోగించియున్నాడని శ్రీ నిడదవోలు వెంకటరావుగారు తెలుపుచున్నారు.*

౨౪. 'చెఱఁబట్టు'

సూ ని. లో, 'దేవేరి' క్రింద,— "చెఱఁబట్టెను దశముఖుఁ డే, డ్డాటనిచ్చటఁ బందహామదేవేరుల నం, దఱనన" (రామా. ౬.౧౪౪) అనియున్నది.

భాషలో, 'చెఱఁబెట్టుట' కలదు; 'చెఱపట్టుట' కలదు. అంతేగాని 'చెఱఁబట్టుట' లేదు.

(చెఱఁబెట్టుట = చెఱలోఁబెట్టుట)

ఎ.గీ. "ఇట్టి కడలేని దుఃఖాబ్ధిఁ బెట్టి ముంపఁ
దలఁచియో కాక పోనీక బలిమి నాదు
ప్రాణ మొడలిలో నాకాశవాణి చెచ్చి
మగుడఁ జెఱఁబెట్టె ననిరతి ♦మఱుఁగుచుండె

(వసు.కు.సం. 5-101)

(చెఱపట్టుట = చెఱగొనపట్టుట, నిర్బంధించుట)

"శతమన్యుఁ జెఱపట్టఁజాలిరే పగవార
లని తపోలోకంబు మునులు చెగడ" (ఉ.రా. 5-6)

---

* చూ. 'పరిశోధన' పత్రిక. ఏప్రిల్ 1954 (పు. 26)

♦ 'మఱుఁగుచుండె' అని, వావిళ్లవారి ప్రతి.

చెఱఁబట్టు – అను క్రియ సూ. ని. లోను లేదు. 'వావిళ్ల'వారి రామాభ్యుదయములో, పాఠము, 'చెఱఁబెట్టెను' అనియే యున్నది. సూ.ని. తీసికొన్నపాఠ మెక్కడిదో? ఎక్కడిదైననేమి? ఆ పాఠము తప్పు.

౨౫. 'ఆఁకపెట్టు'

ఆఁకపెట్టు = అడ్డగించు.—

(1) "మంత్రులు తా, గెద్దియును బలుక కుండిరి
పెద్దతడవు వింజమాఁకపెట్టినభంగిఁ." (భా.రా.యు.కాం.)

(2) "అడుగైన నడనీక యాఁకపెట్టిన సిగ్గు
సంపూర్ణమదధార సరణిఁ బొదల." (కకుత్. 4–10)

ఆఁకఁబెట్టు – అని వ్యస్తపదములుగా వాడినచో, ఆఁక(= చెఱ) యందుపెట్టు, అను నర్థమిచ్చునేగాని, 'అడ్డగించు' అను నర్థము నియ్యవు.

"ఆఁకం బెట్టించఁ గింకరావళిచేతఁ" (భాగ. 9 స్క్రం. 434)

ఆఁకయిడు; ఆఁకిడు; ఆఁకపడు – అను క్రియలును, అడ్డగించు – అను నర్థము నిచ్చునవే.—

(ఆఁకయిడు = ఆఁకిడు)

(1) "ఆ కొలువువారు కర మ్ముచ
లాకృతి నొకపలుకులేక యందఱు విఁజం
బాఁకిడిన కరణి" (భా. ఉద్యో. 3. ౨౫౫)

(2) "వింధ్యమాఁకిడి నట్లుండె ఒశ్వసభయు" (కాశీ. ౭–౫౫)

(ఆఁకపడు)

"ఇలఁ బాతాళమున నభ
స్థలి నంబుధి నాఁకపడక చరియింపఁగ" (భా.రా. కిష్కిం.)

ఆఁకపడక = అడ్డములేక, ఎట్టి యాటంకమునులేక, అని యర్థము.

(అట్టాఁకయిడు)

"ఆఁకొని యలచెడిఁ బ్రేవులు
నేకటమో నములవలయు నీ మాంసము న
ట్టాఁకయిడి యివ్విధంబునఁ
దేఁకువచెడి పల్కఁదగునె ధేనువ నాతోఁ." (భోజరా. ౪-౨౧౨)

అట్టాఁకయిడి = ఆటంకముపెట్టి - అని యర్థము.

*అట్టాకంబెట్టు; అట్టాకలంబెట్టు; పిర్వీకులంబెట్టు; జిలుగులఁబెట్టు మొదలగు క్రియలలోని ద్వితీయ, సప్తమ్యర్థమున వచ్చినదిగాని కర్తృార్థమున వచ్చినది కాదనియు, శ.ప. క్రియలలో ద్వితీయాదివిభక్తు లుండవనియు నెఱుగునది.

(కత్తిపెట్టు)

కొ. ఆనంతాచార్యులవారిచే పరిష్కరింపబడి, 1901 లో ముద్రింప బడిన హరివంశములో, పాఠము,—

ఎ. గీ॥ "ముట్టికందములఁ వడి గత్తిపెట్టిపెట్టి
వీఁపు లడిచియుఁ దోఁకలు వీఁకఁ దాఁచి."—

అని యున్నది. ఈ యెత్తు గీతియే, ప్రౌ. వ్యా. లో,— "ఒక్కొకచో జడంబు సప్తమికిం బ్రథమ యగు" అన్న (కౌర. నూ. ౧౯) చోట,— "ముట్టికందములఁ వడిఁ గత్తిపెట్టిపెట్టి" అని యుదాహృతమై యున్నది.

'బులుసు'వారు,— "కందములఁ = కందములయందు, వడిఁగత్తి పెట్టిపెట్టి" అని యర్థము వ్రాసినారు; కాని, కందములయందు కత్తి పెట్టుట —అనగా అర్థమేమో చెప్పలేదు.

ఈ గీతపాదమే, వా. ని. లో, 'కందము' క్రింద,— "కందములను గత్తిపెట్టు పెట్టి" అను పాఠముతో చూపబడినది.

---

* "అట్టాఁకంబెట్టు నని యేకపదమయి శబ్దప్రవృత్తిక్రియ యగుచున్నది. అట్లయ్యును నిందు సున్న గలదు. కావున, శ.ప. క్రియలలో సున్నలను బెట్టరాదనుట యొప్పుగాదు. మాయచేయు - అను క్రియను 'మాయఁజేసి' అని, సూ.ని. ముద్రించుటను 'తప్పు' అనుట తప్పు" అని, 'కవిరత్న - కవి'గారి ప్రసంగము. (చూ. 17 ఫిబ్రవరి 1947)

నాకుఁజూడ అదే సాధుపాఠముగా నున్నది. ఎందువల్లననగా : 'కందములను నటికి' - అని అక్కడ ఏర్పడవలసిన యర్థము. ఆ యర్థము, కందములయందు - 'కత్తి(ని) పెట్టిపెట్టి' అంటే యేర్పడదు. 'నటుకు' అను నర్థమున 'కత్తిపెట్టు' అను శ.ప. క్రియ యున్నచో, - కత్తిపెట్టిపెట్టి = నటికినటికి, అని యర్థము చెప్పవచ్చునుగాని, అట్టిక్రియ లేదు. ఉన్నచో, కందముల్ అను ప్రథమకు, కందములను - అని ద్వితీయార్థము చెప్పవలెగాని, కందములయందు - అని సప్తమ్యర్థము చెప్పుట పొసగదు. అప్పుడా సూత్రముక్రింద ఆ ప్రయోగము నిచ్చుటే తప్పగును.

కందములయందు - కత్తిపెట్టు పెట్టి - అన్నచో, — కందములను కత్తితోనటికి, అని యర్థమగును. క్రొవున వా.ని. పాఠమే సాధువు. కాని 'కందములను' అనుటమాత్రము సరికాదు. అది సూత్రవిరుద్ధము.

కవిపాఠము, "కందముల్ వడిఁ గత్తిపెట్టు పెట్టి" అని యుండునని నా యూహ.

౨౬. 'చేయాక'; 'సరకుగొనక'

(ఉ. హరి. యుద్ధవర్ణనము.) "విరక్త విటులునుంబోలెఁ జేయాక."
(4-256)

చేయాక = పట్టు దొరకనీక—అని యుద్ధభటుల పక్షమునను, అనుకూలింపక—అని విరక్తవిటుల పక్షమునను అగ్రములు.

రెండర్థములయందును 'చేయాక' శ.ప. క్రియయే. క్రొవున చేసీక అనగూడదు.

'చేయాక'కు మరి రెండు ప్రయోగములు :—

(1) "జఘనంబుఁ బైకొన సమకట్టు, సమకట్టి
చేయాక తారినఁ *జిన్నఁబోవు" (సాంబో. 1-70)
చేయాక = అవకాశమియ్యక.

(2) "బిట్టు బెదరి చెదరి చేయాక పఱచిన" (హర. 1-3)
చేయాక = చేతికందక.

---

* 'చిన్నపోవు' వా.ని. పా.

(సరకుగొనక)

"తనిసిన తఱువరులనుంబోలె సరకుగొనక"

సరకుగొనక = ఒకరినొకరు లక్ష్యముసేయక—అని, యు. భ. పత్ర మునను, సరకును కొనక—అని తఱువరుల పక్షమునను అర్థములు. (తఱువరి= తఱుగుబేరగాడు, దలారి)

తొలి యర్థమున - 'సరకుగొనక' శ.ప. క్రియ; మలియర్థమున-సరకు - కొనక - వ్యస్తపదములు. సరకు ద్వితీయార్థకప్రథమ.

*సరకుంగొనక - అంటే - సరకునుకొనక అను నర్థము వచ్చునేగాని - లక్ష్యముసేయక - అను అర్థము రాదు.

28. 'సుడివడు'; 'అడుగుపట్టు'

"లేమగళమున కుద్దగాలేక యోడి
సుడివడుచు, లోన బిగిచెడి యడుగుపట్టి
దరము దరమూని మొఱసేయ దాని కిపుడు
దర మనెడుపేరు విడువక తవిలియుండె" (రసిక. 2-92)

దరము (=శంఖము), సుడివడుట (=సుళ్లు తిరిగియుండుట) సహజము. ప్రకృతమున, గళమునకోడి - కలతపడినదనియు, సుడిగుండమున దుమికినదనియు చమత్కారము.

'సుడిఁబడుచు' అన్నచో-సుడిగుండములో పడుచు - అన్న యర్థమే గాని, 'సుళ్లుతిరుగు' అన్న యర్థ మేర్పడదు. కావున 'సుడివడుచు' అనియే అనవలెను.

సుడివడు - శ.ప. క్రియ. (=సుడికలదియగు)

సుడిఁబడు - వ్యస్తపదములు (సుడిఁ = సుడియందు, పడు)

శంఖము, అడుగుపట్టుట = నీటియడుగున నుండుట- సహజము. ప్రకృతమున అధఃపతితమైనదనియు, ఓడిపోయి—అడుగులు (= కాళ్లు) పట్టుకొన్నదనియు చమత్కారము.

---

* 'రుక్మాంగద'లో,—"నన్ను సరకుంగొనమిఁ" (3-222) అని యున్నది. పాఠము 'సరకుగఁ గొనమిఁ' అని యుండునేమో?

'అడుగుఁబట్టి' యన్నచో— అడుగులను పట్టుట యగునేగాని నీటి యడుగునకు పోవుట—యను స్వభావార్థము కుదురదు. కావున 'అడుగుఁ బట్టి' యనగూడదు.

అడుగువట్టు—శ.ప. క్రియ.

అడుగుఁబట్టు—వ్యస్తపదములు. (అడుగు—కర్మ; పట్టు—క్రియ.)

(1) 'వెండ్రుకపట్టు'

"మరుఁడు వెండ్రుకపట్టెడుతూపు లేర్చి (సారంగ. 2-169)

వెండ్రుకపట్టెడుతూపు-లనగా, వెండ్రుకను తెంచునంతటి పదునుగల బాణము లని యర్థము; వెండ్రుకలు ధరించునవి పుష్పములు కావున, 'పుష్పబాణము' లని యర్థాంతరము.

తొలియర్థమున 'వెండ్రుక' ద్వితీయార్థకప్రథమ. మలియర్థమున ప్రథమ. కావున 'వెండ్రుకఁబట్టెడుతూపులు అనుట సరిపడదు.

(2) 'కొమ్మలుసూపు'

"కుంభోదకమువోసి యంభోజముఖివెంపఁ
జూతంబు కొమ్మలుసూపఁదొడఁగె" (విక్ర. 1-156)

కొమ్మలుసూపఁదొడఁగె = కొమ్మలు వేయుచున్నది-అని యర్థము; పూడువ వచ్చుచున్నదని చమత్కారము.

కొమ్మలఁజూపఁదొడఁగె-అంటే, అర్థమూ చమత్కారమూ అంతర్గాన మవుతవి.

3వ. 'ఆనఁబొడుచు'

సూ.ని., కళాపూర్ణోదయ పద్యమును 'ఆనపొడుచు' క్రింద—

'దొంగ లానఁబొడిచినఁ గోకల్ విడుతురె?" (3-139) అని యుదాహరించినది.

'ఆజ్ఞాపించు'; 'ఒట్టుపెట్టు', అను నర్థములలో 'ఆనపొడుము'; 'ఆనపొడుచు' అనియేగాని, 'ఆనఁబొడుచు' అను రూపము కావ్యభాషలో కనబడదు. పైపద్యమును శ.ర. 'పొడుచు' క్రింద 'ఆనవొడిచిన' అనియే పఠించి 'ఆనవొడుచు = ఆనపెట్టు' అని యర్థముకూడ చెప్పినది. నేను ఈ యెల్లవివరమును తెలిపి, "సూ.ని. 'ఆనఁబొడిచిన' అని ముద్రించుట ప్రమాదము" అని నా 'జితకాశి' వ్యాఖ్యానము (పు. ౪౧౧)లో వ్రాసినాను. అంగకవి నిఘంటుపండితులలో నొకరైన శ్రీ రు. సూర్యనారాయణశాస్త్రిగారల్లు బదులువ్రాసినారు.

"ఈ విషయము సూక్ష్మముగా పరికింపవలసినది. ఆనపొడుచు అను పదమునకు ఆజ్ఞాపించు, అను నర్థమునే కవుల ప్రయోగము లున్నవి. ఇది శబ్దప్రయోగము. ఇదియు సూ.ని. యందుఁ జూపఁబడినది. ఇఁక సూ.ని.లో 'ఆన' అను పదానికిఁ గళాపూర్ణోదయపద్య మిచ్చిన *4-వ యర్థము, ఆజ్ఞాముద్ర, అని వ్రాయబడినది. అట 'ఆనఁబొడుచు' అనియే పాఠము. ఇదే ప్రమాదమని విమర్శకుల యభిప్రాయము. ఇట ఆన, పొడుచు, అనునవి వ్యస్తపదములుగా గ్రహించినప్పుడే ప్రకృతపదార్థము ప్రకరణానుకూల్యము నందును. అట్లుగాక యేకపదమనుకొని 'ఆజ్ఞాపించు' అను నర్థమున - గతార్థము చేసినచో, ఆజ్ఞాపించుట వాగ్రూపకమైనదిగాన ఆ యూన దొంగిలించుటయం దప్రయోజకము. అట్టి యాజ్ఞ యున్నను లేకున్నను దొంగకు తెలియునదికాదు. ఇఁక ముద్రారూపకాజ్ఞ యున్నచో సజాతీయుల కది గ్రహించుటలో నివర్తకముగా నుండును ♦ప్రకృత మది యున్నను దొంగిలించువానికి బాధకముకానేరదను నభిప్రాయమీ ప్రకరణమున కనుగుణము. దానిని స్ఫురింపఁజేయుటకే, సూ.ని. 'కళా'పద్యములోని దానిని పదద్వయముగా నిశ్చయించి 'ఆన'లోఁ జూపినది. కళాపూర్ణోదయపద్యమునందలి ప్రకరణమును బరిశీలించుచో నిది యెట్టులున్న నచటి సందర్భము సరిపడునో తెలియఁగలదు."

---

* సూ.ని.లో 'ఆజ్ఞాముద్ర' 2-వ యర్థముగాని '4-వ యర్థము కాదు.

♦ ఈ వాక్యము నా కర్థము కాలేదు.

నా సమాధానము.

నిజముగా ఇది సూక్ష్మముగా పరిశీలింపవలసిన విషయమే. సూ.ని. అట్లు పరిశీలింపకపోవుటచేతనే 'ఆనఁబొడుచు' అను వక్ర్యనిధాతువు అన్యాయముగా రెండు తుండెములై మరల నొక అరసున్నయనుగ్రహమున నెట్లో అతుకుపడి 'ఆనఁబొడుచు' అను వికృతరూపమును పొందవలసిన దురవస్థకు పాలైనది.

"దొంగ లానవొడిచినఁ గోకల్ విడుతురె" యన్న లోకోక్తి యే యర్థమున వాడబడినదో వారికి ఆకళింపుకాలేదు. అందువల్ల ఆ యుక్తి లోని కోకలకు 'ఆన'ను బొడువకున్నచో అర్థము కుదురదనియు, వట్టి 'ఆన'యైనచో పొడుచుట కనువుపడదనియు, అందువల్ల 'ఆన' యను పదమునకు 'ఆజ్ఞాముద్ర' అని యర్థము చెప్పవలెననియు, 'ఆనవొడిచిన'యెడల అది వాగ్రూపకమైన ఆజ్ఞయై దొంగిలించుటయం దప్రయోజకమగుననియు, 'ఆన'ను 'బొడిచిన' యెడల, అది ముద్రారూపకాజ్ఞయై సప్రయోజకమగు ననియు, అందుకు ఆన-పొడుచు, అను పదములను వ్యస్తముగా గ్రహింప వలెననియు, అట్లు గ్రహింపనిచో పద్యార్థము ప్రకరణానుకూల్యము నంద దనియు వ్యాఖ్యానము చేసినారు.

(ఆజ్ఞాముద్ర)

లోకములో, కోకలమీదనే కాదు; కొయ్యలమీదను, బూబుల మీదను, దస్తావేజులమీదను, ధాన్యపురాసులనీదను, ఆసోసులసిపగుల మీదను, ఇంకను ఎన్నో చోట్ల ముద్రలువేయు ఆచారమున్నది; కాని ఆ క్రియను 'ఆనఁబొడుచు' అను నాచారము లేదు. ఎందువల్లననగా; 'ముద్ర'-'ముద్రణము' అను నర్థమునిచ్చు తెనుగుపదము 'అచ్చు'గాని 'ఆన' కాదు. అందువల్ల, ముద్రకుసంబంధించిన యర్థమున, కావ్యములలో-అచ్చుపొడుచు; అచ్చువెట్టు; అచ్చుపోయు; అచ్చువేయు; అచ్చొత్తు; అచ్చుపడు; అచ్చు కొట్టు; అచ్చగు; అచ్చునఁబెట్టు; అచ్చుబెల్లము; అచ్చుబెద్ద; అచ్చు పుస్తకము అను పదములేగాని, ఆనఁబొడుచు; ఆనఁబోయు; ఆనవొత్తు; ఆనఁబడు; ఆనఁగొట్టు; ఆనయగు; ఆనబెల్లము; ఆనయెద్దు; ఆనపుస్తకము అను పదములు ప్రయుక్తములు కాలేదు. ప్రాచీనకవులు, ముద్రవేయు—

అను నర్థమున, 'అచ్చువొడుచు' - 'అచ్చుపెట్టు' - 'అచ్చొత్తు' అను క్రియలను వాడిన విధము చూడుము.

(1) "దానిఁ జతురంశములుచేసి దానధర్మ
ములకు నొకపాలు గైకొని మూఁడుపాళ్లు
వెచ్చమునకును రానీక యచ్చువొడించి
డాఁపవలయు విభుండు భండారమునను" (పి. శకుం. 4-175)

(2) "పోరఁదన కోడి పాఱు నీహారగోచిఁ
బట్టుకొనిపోయి దానవప్రభుఁడు పిఱికి
వారికెల్లను నోగులవానిఁ గాఁగ
నురముపై జీడి నిష్టియచ్చొత్తి విడిచె" (నన్నె. కు.సం. 4-16)

(3) అమరారి తనపేరియచ్చులు పెట్టించి
సురధేనుసమితిఁ గీలరముచేసె." (,,-4-11)

'తనపేరి అచ్చులుపెట్టించి' అంటే, తన నామాక్షరముల ముద్ర వేయించి అని యర్థము.

(4) "జినసమయులు వచ్చి శివభక్తితతి
ముందటి వెసఁజాఁగి మ్రొక్కఁగఁబడిన
యందఱిమొగములయం దచ్చులొత్తి
యారిచి పెడబొబ్బ లందందయిడుచు" (బస. పు. పుట. 192)

జైనుల మొగములయందు, అచ్చులొత్తి = శైవముద్రలువేసి అని ప్రకరణార్థము.

కోకలమీద ముద్రవేయుటను ఈ క్రిందిరచన తెలుపుచున్నది.

(5) "కాలంబుపేరి సుంకరి యంబరంబునఁ
బొడిచినట్టి యరుణముద్ర యనఁగఁ,...
దోఁచె, నెత్తమ్మివిరివిందు తూర్పునందు" (రా. వి. 3-30)

ఇందును కవి, 'అంబరంబునఁ బొడిచినముద్ర' అన్నాడు, గాని 'పొడిచిన (ఆజ్ఞ) ఆన' అనలేదు.

(6) "అచ్చుపొడిచిన యాఁబోతులు = స్వేచ్ఛగా (హద్దులేక) తిరుగు వాండ్రు. 'రాజభటుల నచ్చుబొడిచిన యాఁబోతుల రీతిని విచ్చలవిడిగా విడనాడినచో' (ధర్మరాజు రాజసూయము)" ఆం. వా.

'ముద్రవేయు' అను నర్థమునిచ్చు క్రియ 'అచ్చువొడుచు'గాని 'ఆనఁ బొడుచు కొ'దనియు, అచ్చులుపెట్టు; అచ్చువొడుచు, అను క్రియలు నన్నెచోడుని, కొ. సం. రచననాటినుండియు ప్రచారమున నున్నవనియు, ఈ యుదాహృతగ్రంథమువలన స్పష్టమగుచున్నదిగదా! సూ.ని. పండితులు ఆ సూర్యనారాయణశాస్త్రిగారి యెఱుగరుగా! సూ.ని. లో 'అచ్చు' అను పదముక్రిందనున్న అచ్చువొడుచు; అచ్చులుపెట్టు—అను క్రియలను—వాని యర్థములను, ప్రయోగములను తిలకించియుండరా!

విస్తరమెందుకు : ముద్ర(వేయు) అను నర్థమున కవులెల్లరును, ముద్ర; అచ్చు-అను పదములను వాడిరేగాని 'ఆన' యను పదమునువాడినట్లు కనబడదు.

"మిను కళ్లము, తారలు చి
క్కినగింజలు, పూర్ణతుహినకిరణుఁడు తూర్పె
త్తినకొలుచురాశి గా లాం
ఛనము మషీరచితముద్రచందము దాల్చెఁ" (వరాహ. 4-148)

ఈ పద్యమునను ముద్రయే కలదు. 'ఆన' లేదు.

సూరనార్యుడు, 'అచ్చువొడుచు' అను క్రియనెరుగక — 'ముద్ర వేయు' అను నర్థమున — 'ఆనఁబొడిచె' ననెనాఁ? లేదు. లేదు.

ఆతఁడు తన పద్యములోని కోకలమీద 'ఆజ్ఞా-ముద్రలు' వేయింప దలఁపలేదు. కావునచే 'అచ్చువొడిచిన' అని యనలేదు.

(ప్రకరణానుగుణము)

ఇక, "కోకలమీద-ఆజ్ఞా—ముద్రలు పొడువకున్నచో ప్రకరణాను గుణమయిన అర్థ మేర్పడ"దన్న వాచము నించుక పరామర్శింతాము.

అక్కడ ప్రకరణ మేమనగా.— దొంగరంభ (= కలభాషిణి) మాయానలకూబరు (మణికంధరు)నితో కూడియుండగా, అసలురంభ

అక్కడికి వచ్చినది. అప్పుడా రంభల కిద్దరికిని, ఆ నలకూబరుని విషయమున జగడము జరిగినది. ఆ జగడమున అసలురంభ, దొంగరంభతో,—

"మగఁ డాపట్టెంబునఁ దల
తెగఁగొట్టినఁ గొట్టుఁగాక తెకతేరగ నీ
కెగవిడిచి పోయెదనె ప్రా
ణగ నా కొణాచియైన వలపులపంటన్." (3-191)

"వెడఁగుపు లిచటఁ జెల్లవు
పుడమి సహహ దొంగ లానవొడిచినఁ గోకల్
విడుతురె? గణింతునే యె
క్కడి గతిమాలిన పిశాచికవో నీ పాటల్" (,,-193)

అన్నది. అనగా నర్థమేమి?—

"గతిహీనురాలా, మోసగించి నా వల్లభు నపహరించిన ఓసి దొంగముండా నీ ప్రగల్భపుమాటలకే పెదురుకొని నామగనిని నీకు ధారవోసిపోదునా?—(దొంగిలించిన కోకలతోసహా పట్టుబడిన) దొంగలు, ఆనవొడిచినట్ = "మేము దొంగలము కాము; ఈ కోకలు మావే కాని మీవి కావు. మా యమ్మతోడు; మా యబ్బతోడు" అని బొట్టులు పెట్టుకొందురుగాక; నూరు ప్రమాణములు చేయుగుసుగాక; ఆ యొట్టులకును, ఆ ప్రమాణములకును జేలుపోయి, సోకల్ విడుతురె (= సొంతదారులు) ఆ కోకలను ఆ దొంగలకు విడిచిపెట్టిపోదురా? నా మగనిని నేను లాగుకొనిపోదునుగాని నీ కర్పించి పోనుసుమా" అని యన్నపన్న మాట.

ఈ యర్థము, సూ.ని. ప్రమాణముగా గ్రహించిన 'వావిళ్ల' ప్రతిలోను, శ్రీ సుబ్బయ్యశాస్త్రిగారి ప్రతిలోను ఉన్న పాఠమునుబట్టి యేర్పడుచున్నది. *'మల్లాది'వారి ప్రతిలో 'దొంగ లానవొడిచినఁ గోకల్ విడుతురె' అని (కలభాషిణి =) దొంగరంభ - అన్నట్లు ఉన్నది.

---

* ఆ పాఠమున నేర్పడు అర్థ మిట్లు:—

• "ఎక్కడిగతిమాలిన పిశాచివే నీవు? నా వల్లభు నాచికొనిపోవుటకై యెత్తువేనివచ్చితివి! నీ మాయచారికూత లిక్కడ సాగవు. మోసముచేసి,

ఆ రెండు తెరగుల అగ్రములలోను 'ఆనవొడుచు' వలసినది - దొంగలే. సొంతదారులు కారు. ఆ ఆనపాడుచుట, వాఁగ్రూపకమేగాని ఆఁగా ముద్రారూపకము కాదు. అనగా కోకలమీద ముద్రలువేయుట కాదు. కోకలు వదలుకొనవలసినవాఁ సొంతదారులు. దొంగలు కారు. 'ఆన వొడుచుట'తోఁగాని, 'ఆనఁబొడుచుట'తోఁగాని సొంతదారుల కెట్టి సంబంధమును లేదు.

సారాంశము

'ఆన' యను పదమునకు 'ఆఁగాముద్ర' అను నర్థము భాషలో లేదు కావునను,— 'ఆనఁబొడుచు' అను పదమునకు 'ఆఁగాముద్రవేయు' అనే యర్థము సిద్ధింపదు కావునను, పద్యములోని కోకలమీద - ఆఁగాముద్రలు పొడువవలసిన అక్కరయే లేదు కావునను, దొంగలుచేయవలసిన 'ప్రమాణము' లను కోకలమీద పొడువవలసిన ముద్రలుగా చెప్పుట ప్రకరణవిరుద్ధము కావునను, ఆ పద్యమునకు మూ.ని. పండితు లంతగాశ్రమపడి చెప్పిన అర్థ మంతయు స్వకల్పనీయము, ఆ వ్యాఖ్యానము వట్టి ఆకాశపుంచాంగమేగాని తత్త్వమెరిగిచెప్పినది కాదనీయము, అందువలన అది ప్రకరణానుగుణము కాదనీయము సారాంశము.

(వ్యస్తపదభ్రాంతి)

'ఆనవొడుచు' అని యేకపదక్రియగా వాడినయెడల, అది వాఁగ్రూప కాఁజ్ఞ యగునునీయము, 'ముద్రారూపకాఁజ్ఞ' అని స్ఫురింపజేయుటకు, ఆఁగా-పొడుచు, అని వ్యస్తపదములుగా వాడవలె ననియు, ఆ శాస్త్రిగారి దొక వాదము. అది భ్రాంతిమూలకము. శబ్దప్రల్లవధాతువుల స్వరూపస్వభావ ములను సరిగా పరిశీలింపమి ఆ భ్రాంతికి మూలము.

ఆయీ వస్తువుల నపహరింపవచ్చు చోరకోలుసన్నాసులు (= దొంగలు)— 'ఈ కోకలు వహివి' అని పేచీపెట్టి, (తామేమో సత్యవారు లైనట్లు), ఆనవొడిచినఁ = ఒట్లుపెట్టుకొన్నంతమాత్రమున— లేక, ప్రమాణములు చేసినంతమాత్రమున, (సొంతదారులు), కోకల్ విడుతురె = వస్త్రములను ఆ దొంగల కర్పింతురా? చాలు - చాలు, పోవే."

'ఆనవొడుచుట' యనగా విధిరూపమనగాని, నిషేధరూపమనగాని 'ఆజ్ఞ నేయుట'. అది వాగ్రూపకము కావచ్చును; ముద్రారూపకము కావచ్చును; లేదా యేదేని వస్తురూపకమును కావచ్చును. అడవిజాతుల వారి ఆజ్ఞలు – కట్టపుల్లతోను, నూలుదారముతోను, చెల్లుబడి యవు చుండునట.—

"ఆభీరబిల్లాది, కంపకోల నూల నాజ్ఞ చెల్లు." (ఆముక్త. 4-206)

ఎయ్యల – యేనాది కులములలో – 'కులతప్పు' సందర్భములలో, పుల్ల విరిచి – ఆనపెట్టు, ఆచార మిప్పటికిని కలదు.

ఆన వాగ్రూపకమగుచో, 'ఆనఁబలికె' ననియు, ఆన ముద్రారూపక మగుచో, 'ఆనఁబూడిచె' ననియు, ఆన వస్తురూపక మగుచో, చేతికి 'ఆన నిచ్చె' ననియు, ననవలె ననుకొనుట పొరపాటు.

ఆజ్ఞారూప మేదయినను అది 'ఆనవొడుచుట'యే యగును. ప్రకరణ మునుబట్టి ఆ ధాతువే ఆయా యర్థముల నిచ్చుచుండును. ఆ యర్థములను పండితులు మెలకువతో – సులభముగ నే గ్రహించుచుందురు.

అగ్గము మారినను శబ్దప్రవృత్తిధాతువురూపము మారదు. మారినచో అందలి పదములు – ఏకపదత్వమును, ధాతుత్వమును, విలక్షణార్థాభిధాయి శక్తిని కోలుపోయి, వ్యస్తములై అవయవార్థమును మాత్రమే యియ్యగలవి యగును. కావున శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారి మతముప్రకారము, 'ఆన = ఆజ్ఞాముద్ర' – యైనను, 'ఆనఁబొడుము' అన్నరూపమున ఆ వ్యస్త పదములు వారర్థించిన యర్థము నియ్యజాలవు. అనగా (కోకలమీద) 'ఆజ్ఞాముద్రలువేసినను' – అన్న యర్థము నియ్యజాలవు. 'ఆన' ద్వితీయాంత మైనందున 'పొడుచు' అను క్రియకు కర్మయగుచున్నది. అందువల్ల (పుల్లయో – పుడకయో తీసికొని) 'ఆన'ను, పొడిచినను అన్న యర్థమును మాత్రమే యిచ్చును.

కాబట్టి, శ్రీశాస్త్రిగారు "ఆన-పొడుచు, అనునవి వ్యస్తపదములుగా గ్రహించినప్పుడే ప్రకృతిపదార్థము ప్రకరణానుకూల్యము నందును" అనుట కేవలము పొరపాటని నా మనవి.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి 'అచ్చుఁబొడిచి' అనక 'అచ్చువొడిచి' అనుటలో గల రహస్య మేమో శ్రీ శాస్త్రిగారు నిలకడమీద విచారించి తెలిసికొందురుగాక.

మరచినాను. ఇక్కడ ప్రస్తావింపవలసిన యంశ మొకటి యున్నది.- ఇంతకుముందు కొండచేయు; కొండఁజేయు, అను పదములనుగూర్చిన చర్చలో శ్రీ సూర్యనారాయణశాస్త్రిగా రేమన్నారంటే :—

"కొండఁజేయు; కొండచేయు, లెట్లున్నను, ఇందలి కర్మపదమగు 'కొండ' జడవాచకమగుటచేఁ బ్రథమయుఁ గావచ్చును, ద్వితీయయుఁగా నగును. ఇందు తప్పేమి" అన్నారు.

మరి ప్రకృతమైన వారి 'ఆనఁబొడుచు'లోనూ, పొడుచు-అనుక్రియకు (వారి మతముప్రకారము) ఆన, కర్మయే కదా? జడవాచకమే కదా? ప్రథమయుఁ గావచ్చును. ద్వితీయయుఁగా నగును గదా? ఇందును-తప్పేమో యుండదుగదా? అట్లయితే లో వారు 'ఆనఁ' అని ద్వితీయగా ముద్రింపవలసిన యవసర మేమి? ప్రథమగా ముద్రింపకపోవుటకు హేతు వేమి? 'అది వ్యస్తము, ద్వితీయయే' యని అంతగా పెనగవలసిన నిమిత్త మేమి? ఈ వ్రాత, పూర్వవిరుద్ధము కాదా? *ఇది నిశ్చయదృష్టిలేనివ్రాత కాదా?

ఇది గట్టిగాపట్టి చూడవలసిన యంశము కావున విమర్శకుల జ్ఞప్తి కెలయించినాను.

(పాఠ పరిశీలనము)

" 'ఆనఁబొడుచు' అనియే పాఠము. కావున ఆన, పొడుచు, అనునవి వ్యస్తపదములుగా గ్రహించుటే సాధుమార్గము" అని సూ.నా. శాస్త్రిగారి వాదము. ఆ వాదమునకుగల బలమేమో పరిశీలింతము.

---

* ఆ శాస్త్రిగారు నావ్రాతను, 'నిశ్చయదృష్టిలేక తొడర్తొక్కిడిగా వ్రాసిన వ్రాత'యనియు, 'పూర్వాపరవిరోధముగలది' యనియు, ఆక్షేపించి యున్నారు.

ఆనఁబొడుచు - అనియే పాఠమా? ఎక్కడి దాపాఠము? ముద్రిత ప్రతిలోనిదేకదా? నేటి ముద్రణములు సుపరిష్కృతములు కావన్నది పండితు లెరిగిన విషయమేకదా! అట్టి ప్రతులలోని పాఠములను పరిశీలింపక అల్లే ప్రమాణముగా గొనుచో ఆనిఘంటువు నిర్దుష్టమగునా? అట్లు గ్రహించుటవల్లనేగదా యిపు డింత పొసగినది? 'పాంచరంగ' ముద్రిత ప్రతిలో—

"ఏదొర కేటికిందొరకు నీవు విపాగ్నుల నానఁబెట్టుటల్." (2-198)

అని యున్నదే; దానినిబట్టి, సూ.ని. 'ఆనఁబెట్టు' అనియు ననవచ్చునని ఆ రూపమునుగూడా గ్రహించి యుండవలసినదే. ఏల గ్రహించలేదు?

ఎందుకు గ్రంథవిస్తరము? 'ఆనఁబొడుచు' అను పాఠము తప్పు. 'ఆనవొడుచు' అనుట ఒప్పు. నీమాటకు ప్రమాణ మేమంటారా?

నా మాటకు ప్రత్యంతరపాఠములు ప్రమాణము. నిఘంటువులు ప్రమాణము. ప్రాచీనకవిప్రయోగములు ప్రమాణము. వ్యాకరణశాస్త్రము ప్రమాణము.

1. సూ.ని. ప్రకటితమైన పిమ్మటనే శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు - ఆంధ్రభాషానుశాసనకర్తలు - అభినవవాగనుశాసనబిరుదవిరాజితులు, కళాప్రపూర్ణోదయమును, పెక్కు ప్రతులతో సరిచూచి సవరించి ప్రకటించినారు. ఆ ప్రతిలో 'ఆనవొడిచిన' అనియే పాఠము. 'ఆనఁబొడిచిన' అన్న సూ.ని. పాఠము గ్రహింపబడలేదు.

2. అటుపిమ్మట శ్రీ కాశీభట్లసుబ్బయ్యశాస్త్రిగారు సాహిత్యవిశారదులు కావించిన పరిష్కరణముతో ఆ గ్రంథము మరల ముద్రితమైనది. అందును పాఠము 'ఆనవొడిచిన' అనియే. సరసములగు పాఠములను సూ.ని. నుండి తాము కైకొన్నట్లు శ్రీ సుబ్బయశాస్త్రిగారు గ్రంథపీఠికలో వ్రాసి యున్నారు. వారును 'ఆనఁబొడుచు' పాఠమును గ్రహించలేదు. పైగా, కఠినపదార్థవివరణమున 'ఆనవొడుచు = ఆనపెట్టు' అని వివరించియున్నారు.

3. శ.ర. కర్త, 'ఆనవొడిచిన' అన్న పాఠమును 'పొడుచు' అను పదముక్రింద ఉదాహరించి యున్నాడు.

4. ఆంధ్రపదపారిజాతములో,— 'దొంగ లానవొడిచిన' అను పాఠమూ, 'ఆనవొడిచిన = ఆనపెట్టుట' అను అర్థమూ ఉన్నవి.

5. ఆంధ్రవాచస్పత్యము, శ.ర. పాఠమునే గ్రహించినది. (సూ.ని. పాఠమును గ్రహించలేదు.)

6. "పోకుండ నా యానవొడిచి" అని గౌరనకవి ప్రయోగము. (హరిశ్చ.ఉ. 1612)

7. 'ఆనవొడుచు' శబ్దప్రల్లవధాతువు; ఏకపదము; కావున 'ఆనఁబొడుచు' అని వ్యస్తరూపకల్పనముచేయుట శాస్త్రవిరుద్ధము.

నా మాటకు ఆయీ ఇతరప్రమాణములకంటెను, సూ. ని. పండితుల వాదమే ప్రబలప్రమాణము. అది యెలాగంటే—

"'ఆన' యను పదమునకు 'ఆజ్ఞాముద్ర' అన్నయర్థము చెప్పవలసిన అక్కరపడితేనే 'ఆన' - 'పొడుచు', వ్యస్తపదములు. అట్టి అక్కరలేనిచో 'ఆనవొడుచు' ఏకపదమే", అనికదా వారివాదము?

ప్రకృతపద్యార్థమున ఆజ్ఞాముద్రలతో పనిలేదు కావున 'ఆన'కు 'ఆజ్ఞాముద్ర' అన్నయర్థమును చెప్పవలసిన అక్కర లేదని సిద్ధాంతమై పోయినది. అందువలన 'ఆనఁబొడుచు' అన్న వ్యస్తపదపాఠముతో పని లేదనియు, 'ఆనవొడుచు' అన్న యేకపదపాఠమే చాలుననియు - ఆ పండితులు చెప్పక చెప్పినట్లే కదా?

ఇంతకంటెను నా మాటకు ప్రమాణము వేరే యేమికావలెను?

(పరియోగాంతరము)

"మా వాదమునకు బలముగా 'శాసనపద్యమంజరి'లో 'ఆనఁబొడుచు' అనువ్యస్తపదప్రయోగ మొకటి యున్నది. చూచుకోండి" అని సూ.ని. సూచించినది. చూడబోగా ఆ పద్య మిట్లున్నది.—

*క॥ ఇనుపాదము లర్చింపఁగఁ
జనుచోఁ జని అర్ఘ్యమంత్ర జలపాత్రలు దా
వినువీది నాఁగఁబంచెను
ఘనముగఁ దనయానవొడిచి కరికాలుఁ డిలకున్.

---

* మాతృక యిట్లున్నది:—
"ఇనుపాదము లర్చింపంగం
జనుచో (ం) జని అర్ఘ్యమంత్ర జలపాత్రలు దా

ఈ పద్యములో 'ఆనఁబొడుచు' అను రూపమూ లేదు. 'ఆజ్ఞాముద్ర' అన్న యర్థమూ లేదు. చిత్తగించితిరా? ఈ సందర్భమున సూ.ని. అసత్యమును లిఖించినదనుటకంటే, ప్రమాదపడిన దనుట సమంజసమేమో!

ఇక్కడ చెప్పవలసిన గొప్ప విశేష మొకటి యున్నది. ఏమనగా, ఆ 'కళా' పద్యమునే, సూ.ని., 'గడించు' అను పదముక్రింద,—

''దొంగలానపొడిచిన''

అను పాఠముతోనే ఉదాహరించియున్నది. (నే నిటీవల చూచినాను) కాబట్టి, 'దుర్వ్యూరి'వారి వాదము దుర్బలము; విచారవిదూరము; వ్యర్థము.

'ఆన'కు 'ఆజ్ఞాముద్ర' అని యర్థము చెప్పుటయు, 'ఆనవొడిచిన' అను ప్రాచీనరచనను 'ఆనఁబొడిచిన' అని మార్చుటయు, 'అట్లుండిన నేగాని అక్కడ అర్థము సరిపడ'దని వాదించుటయు తప్పు.

తొలుత ఆ తప్పు జరిగినవిధ మిట్లుండును: 'ఆన'కు అర్థములు వ్రాసినవారు (శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారే నేమో?) 'ఆనవొడుచు' అను శ.ప. క్రియాతత్త్వము నెరిగినవారు కారు. అందువలన 'ఆనఁబొడిచిన' అని మార్పుచేసినారు. 'గడించు' అను పదమున కర్థమువ్రాసినవారు ఆ క్రియాతత్త్వము నెరిగినవారు; కావున ప్రాచీనపాఠమునే గ్రహించినారు. నిజమింతే. శ్రీ శాస్త్రిగారేమంటారో!

ఆనవెట్టు; ఆనపొడుచు—అను క్రియలనేకార్థములలో వాడబడియున్నవి. అన్ని యర్థములలోను, అవి శబ్దపల్లవములే. 'ఆనంబెట్టు', 'ఆనఁబొడుచు' అని వ్యస్తముగా కనబడవు.

ఒక కొన్ని యుదాహరణములు:—

'ఆనవెట్టు'

1. ''వేడం జనుదేర నానవెట్టితి.'' (సారం. 8-77)

వేడుకొనుటకురాగా, ఆనపెట్టితి = దగ్గరికే రావలదని ఆజ్ఞచేసితివి అని యర్థము.

వినువీది నాంగంబంచ్చెను
ఘనముగం దనయానవొడిచి కరికోలుం డిలను.'' (1 భా. 74 పు. 6 ప.)

2. "త్రిమ్మరివచ్చిన నొట్టటంచు, వా
క్రువ్వఁగరాని యానలిడి." (పాంచా. 5-30)

వాక్రు...యానలిడి = నోట వచింపరాని ఒట్టులుపెట్టి అని యర్థము. (ఆనలిడి = ఆనలుపెట్టి.)

3. "పంటనొక్క నటంచు బాసచేసినఁగాని
తేనెలూరెడి మోవి నానసీను,
... ...
అగడుసేయ నటంచు నానవెట్టినఁగాని
హాళితో రతికేళిఁ దేలసీను." (దశా. 7-134)

అగడుచేయనని, ఆనవెట్టినఁగాని = మాట (హామీ) యిస్తేతప్ప, అని యిక్కడ అర్థము.

'ఆనవొడుచు'

1. "ఎవచటి, కేఁగి పీనుఁగుఁ గాటికెవ్వరేఁ దెచ్చి
కైకొని తమయిచ్చుగాఁ గాల్చి మరలి
పోకుండ నా యానవొడిచి." (గౌ. హరి. ఉ. 1612)

ఇక్కడ, నా-ఆనపొడిచి-ఆంచే, నా యాజ్ఞనుచెప్పి-అని యర్థము. అంతేగాని, నా యాజ్ఞాముద్రనుపొడిచి, అనికాదు. 'నా-ఆజ్ఞాపించి' అనియును కాదు.— (ఆనవొడిచి = ఆనపెట్టి అని వే. వే. శా. టీక.)

2. "బంధురమైయున్న పరివార మాన
బొడవంగ దనకేల." (పల్నా. II.)

'ఈ స్థలములో ఆనబొడుచుట యనగా— వొట్టుపెట్టుట' అని బ్రౌనుపండితుడు.

3. "కవిసెనేనిఁ గతోరకంతహుంకారంబు
వొనరించి మీ యానవొడుచువాఁడ,
నానయును ద్రోచివచ్చెనే నాగ్రహమున
దానిపండ్లన్ని రాలంగఁ దన్నువాఁడ." (కాశీ. 4-37)

'ఆనవైచు' అను పలుకుబడియును కలదు.—

"ఆనవైచినట్లు, పూని మంత్రప్రయో
గంబు చేసినట్లు, కట్టినట్లు
నిట్టవొడిచి యెదురఁదొట్టినవాహిని
యివుర జలము వాటె నిసుక దోఁప." (భోజ. 3-18)

ఆనవైచినట్లు = ఒట్టువేసినట్లు. (సూ.ని. లో, ఆనవైచు; ఒట్టువేయు అను పలుకుబడులు రెండును లేవు.)

'ఆనవోవు' అను క్రియయు నున్నది.—

"కాఁబోలునని విన్న కన్నవా రెన్న నే
ర్పునఁగని యానలువోయి వోయి." (నిరంకు. 2-17)

ఇంకను విస్తరమెందుకు? పెట్టు; పొడుచు మొదలగు క్రియలు మరికొన్ని ధాత్వాదులతోకూడి, ఏకపదత్వమునుపొంది, విలక్షణార్థములను పెక్కింటి నిచ్చుచుండును. సూ.ని. గమనించినట్లు లేదు.— 'పొడుచు' అను క్రియ 'ఆన'తో కూడినట్లే, ఎన్ని యితరపదములతోకూడి, యెన్ని యర్థముల నిచ్చుచున్నదో చూడండి.—

(1) 'తడుకువొడుచు' = తడికెపరుచు.—

సూ.ని., తడుకువొడుచు=వెలుగునాటు, కంచెవేయు అని యర్థము చెప్పి, అందు కీ క్రింది పంక్తులుదాహరించినది.

"మట్ట లెత్తుకొని యొత్తుగల పొదరుటడవులు చొరంబాఱు పిడికడితికదుపు నురవడికి విఱిగిపడిన విటపివిటపంబులం దడుకువొడిచినగతి నొందు నెడలును" (మను. ౪-౩౭)

వావిళ్ళవారి టీకలో,— 'విఱిగి నేలపైఁ బడిపోయిన చెట్టుకొమ్మలచే, తడుకువొడిచినగతిక = కంచెవేసినరీతిని' అనియే యున్నది.

కాని, అది సరియైన అర్థముకాదు. విరిగి నేలపై చెల్లాచెదరుగా పడిపోయియున్న కొమ్మలు—తడికె పరిచిన ట్లుండునుగాని, వెలుగునాటిన ట్లుండవు.

"తడుక బొడిచినగతి = తడికెలు పరిచినట్లుగా నున్నటువంటి, ఎడలును = ప్రదేశములును" అని జూలూరివారి టీక.

అదే సరియైన అర్థము. కాబట్టి, 'తడుకుపొడుచు' అను క్రియకు— 'తడికెపరుచు' అన్న యర్థముకూడా ఉన్నదని చెప్పవలెను.

(2) అప్పుపొడుచు = అప్పుచేయు.—

"పొందుపట్టుల నప్పులు పొడిచిపొడిచి" (పాండు. 3-18)

అప్పుపొడుచు (= అప్పులుపొడుచు) అను క్రియ, 'కయ్యము వొడుచు'; *'మేడమువొడుచు' అను క్రియలవంటిది.—

సూ.ని. 'తడుకువొడుచు' అను క్రియను చెప్పినచో, 'కయ్యము వొడుచు';—'అప్పువొడుచు' అను క్రియలను చెప్పియుండవలసినది.

(3) పన్నిదమువొడుచు = పందెమువేయు.—

"ఎత్తినపూవులు ముడుచుచుఁ
బొత్తిచ్చిన పన్నిదములు వొడుచుచు నత్యు
ద్భృత్తగతి వీథిలో సుభ
టోత్తము లంగళ్ల మెఱయుచుండుదు రెలమిన్"

(నన్నె. కు. సం. 7-122)

(4) చిఱులుగొడుచు = పశువులు చెలరేగి గంతులుపెట్టు.—

"చిఱుపెండ వెట్టుచుఁ జిఱులుగొడ్చుచును" (బసవ. పు. 160)

(5) పులపొడుచు = కన్ను తటాలునమూసి తెరచు.—

"చప్పుళ్లకుఁ బులపొడుచుచు" (భల్లా. 3. ఆ.)

శ.ర. లో,- 'పులపొడుచు = తెప్పవేయకమాఁచు' అని యున్నది. సరికాదు. చప్పుడైనప్పుడు తటాలున కన్నుమూయుట స్వభావముగాని తెప్పవేయకమాఁచుట స్వభావము కాదు.

'ఆముక్త'లో, "తడి తలడిగ్గి నుంప, జడతం దుదతెప్పలఁ గన్ను వీడి, పులొ్వాడుచుచు' (ర-గగగ) అన్నచోట, వే. వే. శాస్త్రిగారును, 'పులొ్వాడుచుచు = తెప్పవేయకమాఁచుచు' అనియే టీక వ్రాసినారు. కాని అక్కడను, రెప్ప తాకమూరెత్తి మరల మూసికొనుచు— అనియే

---

* 'మేడమువొడుచు' (శ. ర. పా.) 'పిడుపర్తి' బస. పు. ముద్రిత ప్రతిలో 'వేడెముబోతుఁ' అని యున్నది. (చూ. 6-24) ద్వి. బస. పు. 172 పుటలో 'ఓడితి నన్నను మేడెముఁబడువఁ బాడియె' అని యున్నది.

అర్థము. వర్షపునీరు కన్నులలోనికి డిగగా, పశువులు, రెప్పల నప్పళించినవని యక్కడ వర్ణనము. కావున 'రెప్పవేయకచూచుచు' అని యర్థము చెప్పుట యొప్పదు.

(6) నిక్కవొడుచు = నిక్కు.—

సూ.ని., - "నిక్కవొడుచు (నిక్కు + అ + పొడుచు) = నిక్కున నిలుచు — (వ్యవ)మేన వెండ్రుకలు నిక్కవొడిచెను. (శ.ర.)" - అని చెప్పియు, మరల తానే 'నిలువఁబడు' అను పదముక్రింద,—

"నిక్కు,నిక్కఁబొడుచు" అని లిఖించినది.

'నిక్కంబొడుచు' అను రూపము సూ.ని. ప్రకారమే తప్పు.

'విజ' (1-99) లో, వే.వే. శాస్త్రిగారును,- ♦'నిక్కఁబొడుచుకొని' అనియే అన్నారు. పొరపాటు.

ఇట్టి పొరపాటు లెన్నని చెప్పను? నిఘంటువులలోను, వ్యాఖ్యానములలోను నూరులస్థానమును మీరియున్నవి.

ఇంతకును నేను చెప్పవచ్చిన దేమనగా.— 'పెట్టు; పొడుచు; చేయు; తన్ను మొదలగు క్రియలు ఇతరధాతువులకును, విశేష్యాదులకును అనుప్రయుక్తములై, ఏకపదత్వమును-రూఢత్వమును నెనసి, విలక్షణములైన యనేకార్థముల నిచ్చుచు - శబ్దపల్లవధాతువులన నొప్పుచుండు ననియు, ఏ యర్థమునగాని, ఆ ధాతువులలోని క్రియను వేరుపరచి-దాని ముందరిపదమును కర్మగా భావించి, — ద్వితీయాంతమునుచేసి, ఆనఁబెట్టు; ఆనఁబొడుచు; పులఁబొడుచు; *తడుకుఁబొడుచు; సరకుఁజేయు; కొండఁజేయు; తలఁదన్ను; వెన్నుఁదన్ను; నిక్కఁబొడుచు ఇత్యాదిగా రూపములు కల్పించుటయు,- ఆననుబెట్టెను; ఆననుబొడిచెను; కొండనుజేసెను; తలనుదన్నెను, ఇత్యాదిగా ప్రతిపదార్థములు చెప్పుటయు, సరికాదనియు, ఈ సందర్భమున సూ.ని. చాల తావులలో పొరపడినదనియును. అంతే.

♦ 'బులుసు' వారును అట్లే అన్నారు.

* వే.వే. శాస్త్రిగారు 'ఆముక్త' పీఠికలో 'తడుకుఁబొడిపించి' అనియే ముద్రించినారు. (చూ. పుట. 9)

౨౯. 'నులివడు'

సూ.ని. "నులిపడు, నులివడు, ఆ.క్రి. (√ నులి) ం దోఁపుడువడు" అనిచెప్పి, అందుకుప్రమాణముగా, "దోఁపుపోయె ననుట దోఁచు నులిపడె న,నంగ" అను (ఆ.భా. 3.౧౧౬) పద్యము నిచ్చినది.

'నులి' (= దోఁపుడు) అను విశేష్యముండిననే కదా, 'నులి + పడు = నులివడు' అనుక్రియ యేర్పడుట. మరి సూ.ని. లో 'నులి = దోఁపుడు' అని మూలపదములలో లేదే! సూ. ని. లోనేకాదు, 'దోఁపుడు' అన్న యర్థముతో 'నులి'యను పదము శ.ర. లోను లేదు; ప్రౌఢ్యమునను లేదు. 'నులి' యను పదమే లేనప్పుడు - 'నులివడు' అనుక్రియ యేర్పడుట యెట్లు?

అసలుకథ యేమనగా: ఆంధ్రభాషాగ్రంథపద్యములలో, "దోఁపుపోయె ననుట దోఁచు నొలిపడె ననంగ"— అనుటకు మారుగా "...దోఁచ నులిపడె ననంగ" అని అచ్చైనది. 'నొ', 'ను', అగుట, వ్రాయసగాని తప్పో, అచ్చువారితప్పో అయ్యుండుంది. ఆ తప్పును, సూ.ని. అల్లే వ్రాసికొన్నది.

'తోఁచు నొలిపడెననంగ' అన్నచోట, 'తోఁచు - ఒలిపడె' అని విభాగము. కొబ్బట్టి అది 'ఒలి'గాని 'నులి'కాదు.— "ఒలి = ఒలుపు, దోఁపుడు, అపహరణము. 'ఒలిచిన నొలి వాడెదరు.' (శ్రీ.భా. ౧.౬౩" అని, శ.ర. లోను, సూ.ని. లోనుకూడా ఉన్నది.

'ఒలివడు' అను క్రియ సూ.ని. లో లేదుగాని, శ.ర. లో— "ఒలివడు = (ఒలి + పడు) దోఁపుడువోవు. 'సి. *ఒలివడ్డనెవసుసఁ గలలేని సిరిచెప్పి, చుట్టలపై దాడిపెట్టువారు.—(ఆము. ౬.ఆ)" అని ఉదాహరణతో గూడా ఉన్నది. (శ.ర. లో ఉన్నపదమును సూ. ని. చెప్పక పదలుటకు హేతువేమో?)

ప్రౌఢ్యమునను, "ఒలివడుట To be plundered or robbed దోపుడుపోవుట" అనియున్నది.

---

* 'ఒలఁబడ్డ', అని 'వేదం'వారి పా. అసాధువు. ఆ యసాధు పాఠమునే సూ.ని. 'ఒలుచు' క్రింద చేర్చినది.

కొబట్టి సూ.ని. ఆం.భా. అచ్చుప్రతినిబట్టి గ్రహించిన 'నులివడు' అనుగూడుము తప్పు. ఆం.భా. అచ్చుప్రతిలో - "తోఁచు నొలిపడెనఁగ" అను సాధుపాఠ మున్నను, సూ.ని. 'నొలివడు' అనియే గ్రహించియుండును గాని 'ఒలివడు'గా గ్రహించియుండరు. పదస్వరూపము తెలియనప్పుడు జరుగుప్రమాదము లిట్టివే గదా!

శ.గ.లో లేనుగాని, 'ఒలివోవు' అను క్రియ యొకటి యున్నది.

"ఒలివోయి యీలోక మొకపూఁట పెట్టెము తామరచెలిపట్టిఁ దడవ నేల" (యయా. 1-29)

30. 'ఉలుకు-'

శ.ర.లో "ఉలుకు- = ఆశ్వగతివిశేషము. సీ. చనునులుక్కఁగ నీచగతిఁ బోయ. ఆం.భా." అని యున్నది.

సూ.ని. ఆ మాటల నట్లే యెత్తి వ్రాసికొన్నది. శ.ర. 'ఉలుకు-' అన్నందున సూ.ని. 'ఉలుకు-' అన్నది. కాని, నిజానికది 'లుకు-' గాని 'ఉలుకు-' కాదు.

♦"అడ్డవేడెముల్, లుక్కుదువాళి" అని, సారంగధర (1-82) ప్రయోగము. గుఱ్ఱము 'లుకులుక్కున బోతున్నది' అని లోక వ్యవహారము.

'లుకు-' శ.ర.లో 'ఉలుకు-' అయినవిధ మెట్టిదనగా.- 'చనులుకు- - అనఁగ' అని విభాగించుటకు బదులుగా, శ.ర. కర్త 'చనుఁ - ఉలుకు- - అనఁగ' అని పదవిభాగముచేసినాడు. అది ప్రమాదము.

* సూ.ని. ఆ ప్రమాదము నట్లే యనువదించినది.

♦ 'అడ్డవేడెము లుక్కుదువాళి (= డుక్కుదువాళి = మఱుఁగుపడి నట్టి దవుడు)' అని, 'వేదం'వారి పాఠమూ- అర్థమున్నూ; తప్పు. వివరములకు, చూ. సారంగధర - 'జితకాశి' పుట. ౯౦.

* వా.ని. లోను 'ఉలుకు-' అనియే యున్నది.

౩౧. 'కోపధారి'

నూ.ని. లో 'కత్తులబోను' క్రింద, చెన్నబసవపురాణపద్యము అచ్చు ప్రతి ప్రకారము,—

"బావ ప్రతికూలుఁడు, నాఁగుఁడు కోపధారి"(4-277)అనియున్నది.

'కోపధారి' యను సంస్కృతశబ్దమున్నదేమో! సూత్రధారి, సూత్రధారుఁడు అన్నట్లు, కోపధారి; కోపధారుఁడు—అనియు సనవచ్చునేమోగాని, 'కోపదారి' యను జానుతెనుగుపదముమాత్రము వాఁడుకలో ప్రసిద్ధముగా నున్నది.

ఆది, మాయదారి టక్కుదారి తెగువగారి ఇచ్చకదారి వంటిది.

మాయము + దారి = మాయదారి అయినట్లే, కోపము + దారి = కోపదారి యైనది. తత్సమపదములమీద తెనుగుప్రత్యయముపచ్చట కలదు. ఉదా:—1 హాస్యగాఁడు; 2 విటకాఁడు; 3 విటకత్తె; 4 కోపగాఁడు; (5 కోపకత్తె; 6 అభిమానకత్తె).— చూ. ఆం. భా. శా. తద్ధిత. ౧౧. (4, 5, 6 నూ.ని. గ్రహించియున్నది.)

'కోపదారి' యను రూపము తప్పనుకొని, 'చె. బ.' పరిష్కర్త—'కోపధారి' యని సవరించినాఁడు. ఆది జానుతెనుగు పలుకుబడి యెరుఁగని సవరణ. నూ.ని. ఆ సవరణ నట్లే కైకొనుట సరికాదు.

చె. బ. పురాణకర్త 'కోపదారి' యను 'జానుతెనుగు' పదమును వదలి 'కోపధారి' యను అప్రసిద్ధపదమును వాడినట్లు భావించుట భావ్యముకాదు.

'కోపధారి' యనుట సరికాదని తెలిసికొని, వా.ని. *'కోపదారి' యను రూపమునే గ్రహించి, అందుకా 'చె. బ' పద్యమునే ప్రమాణముగా చూపినది.

నూ.ని. లో, 'కోపదారి' లేదు; 'కోపధారి'యును లేదు.

---

* "...ఇట్టి సమాసములు వాడుకలో గలదందురు. లోకవ్యవహారమే శాస్త్రీయమైనచో—దురలవాటు, బహుమంది, శుద్ధతప్పులుగూడ సాధువులే యగునుగదా! గ్రామ్యమైనను వాడవచ్చునుగాని శాస్త్రదుష్టములైన వాక్యములు వాడనగునా?" అని 'కవిరత్న-కవి'గారి ప్రసంగము.

అది శాస్త్రమున నేమో, దుష్టమన నేమో యెరుఁగని ప్రసంగము. కావున నిరస్తము.

3_వ. 'రాచవాఁడు'

సూ.ని.లో 'కనువెచ్చ' – 'కరఁగు' అను పదములక్రింద,—

'వలరాచరాచవాఁ డలికొత్తు కనువెచ్చఁ
గరఁగిన యల కనికరపుఁ జూటు" (మను. 3-ద)

అని యుదాహృతమై యున్నది.

మనుచరిత్ర అచ్చుప్రతులన్నిటిలోను సూ.ని.లో ఉన్నట్లే, 'వలరాచ రాచవాఁడు' అనియే యున్నది. కాని, అది సాధుపాఠము కాదు.

'వలరాచ – రాచవారు'

అనుట సాధువు. ఎందువల్లనఁగా:– భాషలో రెండు లెఱఁగుల 'రాచవా' రున్నారు.

(I) రాచవారు=క్షత్రియులు. ఇది 'రాచవాఁడు' (=క్షత్రియుఁడు) అను, ఏకవచనమునకు బహువచనరూపము. ("రాచవాఁడనఁగను రాజన క్షత్రియుఁ డొప్పు." ఆం. భా. 2-182)

(II) 'రాచవారు'–ఇది క్షత్రియు లను నర్థమునిచ్చు పదము కాదు. నిత్యబహువచనాంతము. అయ్యవారు; దొరవారు అను పదములవంటిది. ఏకవచనమునను 'రాచవారు' అనియే రూపము. ప్రభువు అని సంప్రదాయార్థము. ఏ జాతివాఁడైనను 'రాచవారు' కావచ్చును. భాషామర్యాద నెఱిగిన ప్రాచీను లందరునూ, ఈ రాచవారిని సముచితముగనే మన్నించినారు. ఆ మర్యాద నెఱుగని యిటీవలివారు కొందరు 'రాచవారి'ని 'రాచవాని'గా మార్చి కొంచెపరచినారు. క్రమముగా మనవిచేస్తాను.

(1) *పేషణిహనుమంత బిరుదాంకులగు రాచ
వారికి నెయ్యంపు వరసుతుండు" (శృ.నై. పీఠిక.32)

---

* "పేషణియనఁగా సన్నెకల్లు – హనుమంతుఁడు సన్నెకంటిమీఁద పచ్చడినూఱిన నెట్లు నూఱునో శత్రువులను అట్లు నూఱెడువాఁడు – అని బిరుదార్థము" అని వే.వే. శాస్త్రిగారి వ్యాఖ్య.

హనుమంతుడు సన్నెకంటిమీద పచ్చడినూఱటలో మొనగాడు కాబోలు! అందుకు ప్రమాణ మేమో?

ఈ పద్యములోని 'రాచవారు' క్షత్రియులు కారు; నియోగి బ్రాహ్మణులు. బహుజనము కాదు; ఒక్కఁడే.

'బిరుదాంకులు' - పూర్వార్ధమున బహువచనము. బిరుదాంకులును, రాచవారును పలువురగుచో, పలువుర కొక్కఁడే 'వరసుతుఁడు' కావలసి వచ్చును. అది అసంభవముగదా!

హేషణిహనుమంత బిరుదుగల - దొరవారికి - వరసుతుఁడు; అని ఆ పద్యపాదమున కర్థము.

'బిరుదాంకుఁడగు' అని ప్రాచీనపాఠము. 'బిరుదాంకులగు' అని శాస్త్రిగారి సవరణ.

(2) "రాజసంబున వలరాచరాచవారు
తేటిబెక్కలగతియమ్మఁ దీడుకొనఁగ" (శృ. నై. 6-65)

అని వ్రాతప్రతిలోనుండగా 'రాచవారు' అనుట తప్పనుకొని వ్యాఖ్యాతలు 'రాచవాని' అని దిద్దినారు.

(3) "పావకలోమఁజూచి వెనుబొటు మొగంబునఁ దోఁపఁగంకో
పావిలచిత్తుసన్నలు మెలపారఁగ నిట్లను రాచవారలుఁ
దేవులు నింతనివ్వచనుఁజెందు టెఱుంగరు". (భోజ. 5-37)

రాచవారలుఁ = రాజయిన మీ తండ్రిగారును, *దేవులుఁ = రాణియైన మీ తల్లిగారును అని యర్థము.

---

* 'నారాయణీ యగూంధ్రవ్యాకరణము' లో, 'గాణపత్యసూత్రవివరణము'న— "ఈ పద్యమున దేవులనఁగా ప్రభువులని యర్థము. స్వర్గవాచి కాదుగావున బహువచనము నిరర్థకము" అని యున్నది. (పు. ౧౫౧)

ఆ వివరణము సరియైనది కాదు. పద్యములోని 'దేవులు'—'దేవి'కి బహువచనము గాని 'దేవ' శబ్దమునకు బహువచనరూపము కాదు. కావున "దేవులు = ప్రభువులు" అను అర్థ మనుచితము.

"రాజును దేవులుం దెలులు" (నాసి. 2-144)
"నీ దేవుల యొప్పుజూచి" (భార. ఆర. 5-350)
"రాజును, దేవులనుగని సుముఖుఁడగుచు" (భార. ఆను. 2-308)

(4) "భద్రమా నీకు నీ బాహాభృతక్షితి
ప్రజలకు; లెస్సలా రాచవారు" (మను. 5-4)

'లెస్సలా రాచవారు' అంటే, రాజబంధువులందరూ బాగున్నారా? అన్నమాట. అంతేగాని క్షత్రియులందరును బాగున్నారా? అని కాదు.

(5) "స్యందనముం దురంగములు శౌరివెపో బలరాముచెల్లె లీ
యిందునిభాస్య యీమె నెటకెత్తుకపోయెదు రాకుమార యే
మందురుయాదవుల్ వినిన! హా! యిటువంటివె రాచవారితో
బొందులు." (విజ. 3-147)

రాచవారితో పొందులు—అంటే, ప్రభువులతోగూడిన వ్యవహారము లని భావము.

(6) "వడ్డకుగుబ్బలిరాచవారి మూర్ధం బెక్కి—" (కాశీ. 5-286)

(7) "వణ్ణకుగుబ్బలిరాచవారి కూరిమికన్య" (భీమ. 3-185)

వడ్డకుగుబ్బలిరాచవారు అనగా, మంచుకొండదొరవారు అన్నమాట.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించిన ఉత్తరహరివంశమున,—

(8) "ఒకనపలాక్షి లేఁజిగురుటూయెలఁ గోయిలరాచవారి నిక్కకు నెలయింప" (5-54) అని యున్నది.

*'కోయిలరాచవా' రనగా, కోయిలదొరవా రనియే యర్థము.

శ్రీ వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రులవారి పరిష్కరణముతోను, వారి వీకతోను వావిళ్ల వారు ప్రకటించిన 'బాలసరస్వతీయము'లో, సంజ్ఞా. సూ. 33 క్రింద,—

(9) "నిక్కఁదనము లోకబయ వైభవము వల
రాదవాఁ వడసి రాచరించి
చెలువ నధికన్య సేవించువారి కే
జాడ్యమైనఁ గన నసాధ్యమెద్ది?"

---

* 'కోయిలరాచవాఁ' అను సమాసము 'అన్నదమ్ములు' అను సమాసమువంటిదేనని, అన్నదమ్ములను సమాసములో అన్న యేకవచనమున నున్నను 'అన్నలు' అని బహువచనార్థము నిచ్చునట్లే, 'కోయిల' యేక

అని యున్నది. పద్యములోని 'రాచవారి'ని శ్రీ శాస్త్రులవారు 'రాచవాని'గా మార్చలేదు.

శ్రీ నిడదవోలు వెంకట్రావుపంతులు (యమ్. యే.) గారు, తమ 'మించుపల్లె - తెలుఁగుపాలుపు' అను గ్రంథములో,—

(10) "వలరాచవారి ధనుశ్శర,ములకల్లెనలకును"

అని 'వలరాచవారి'ని వాడి యున్నారు.

(11) "...అజముఖ్యులైన వేల్పు
రాచవారలు నాకతీ గోవాఅ
నితఁడనఁగ నెంతే" (నిం్రా. 3-93)

అజముఖ్యులైన - 'వేల్పు రాచవారలు' క్షత్రియులుకారు. దేవతా ప్రభువులు.

తిక్కనసోమయాజి మహాభారతమున 'రాచవారి'ని వాడి యున్నాఁడు. చూడండి.—

(12) "(యుద్ధిష్ఠిరుఁడు) విదురసంజయుల నాలోకించి మీర లనుదినంబును సవధానంబుగలిగి - రాచవారి - యోగక్షేమంబు లేనెట్లు నిర్వహింపవలయుఁ బురజనంబుల భూజనంబులకర్జంబులు-రానివారి-కెఱిగించి పంచినట్లు నడపంగలవారలని యప్పగించి." (శాంతి. 1-378)

ఈ రచనలోని 'రాచవా' రెవరు? ధృతరాష్ట్రుఁడు. ఒక్కఁడే. ఒక్కఁడైనను - రాచవారే. బొరవారని యర్థము. అంతేగాని క్షత్రియులని కాదు.

వచనమున నున్నను పెక్కుకోయిలలనియే అర్థము నిచ్చుననీ—వీరబ్రహ్మంగారి దొక ప్రసంగము. ఆ ప్రసంగములో,— "సహస్రములయందు పూర్వపదము బహుళమైనను నేకవచనమునసే యుండును" అని యొక సిద్ధాంతము.

"కోయిలరాచవారు; అన్నదమ్ములు—ఆను సహస్రములు రెండును ఒక లెక్కకు చెందిన వనుట తప్పు. పూర్వపదము 'బహువచనమైనను' అని

*

తిక్కన రచనకు మూల మిది:—

"ధృతరాష్ట్రో మహారాజ, పితా మే చైవతం పరమ్
శాసనేస్థ్రప్రియేచైవ, నేయం మత్ప్రియకాంక్షిభిః
ఏతదర్థంహి జీవామి, కృత్వాష్టిజాతివధం మహత్.
అస్య ప్రక్రూషణం కార్యం, మయా నిత్య మతంద్రితా
యదిచాహం మనుగ్రాహ్యో, భవతాం సుహృదాం తథా
ధృతరాష్ట్రో యథాపూర్వం, వృత్తిం వర్తిత మర్హతి.
ఏష నాథోపి జగతో, భవతాంచ మయాసహ
ఆస్థేవ పృథివీ కృత్స్నా, పాండవా స్సర్వఏవచ
ఏత స్మననికర్తవ్యం, భవద్భి ర్వచనం మమ."

వలరాచ - రాచవారు అనగా 'వలరాచ దొరవారు' అని యర్థము కావున 'వలరాచ - రాచవాడు' అనుట సరికాదు.

33. 'దొరవాడు'

సూ.ని. 'దొర' క్రింద,—'దొరవాడు = రాజసంబంధి' అని చెప్పి, అందుకు, నన్నె. కు. సం. లోని పద్యమును,—

"వాలిన దాయవారి దొరవారి నసేకులఁ గూర్చుకొన్నఁగా
కేల జయింపవచ్చు" (౧౧. ౯౧)

అన్నంతవరకే చూపినది.

పద్యము పూర్తిగా నుండినచోగాని సరియైన అర్థ మేమో యేర్పడదు. కావున, తిక్కన భాగమునుకూడా, ఉదాహరించుచున్నాను.

"నని యేర్పడ నీకని మాఱువన్నెనో
నా, లలితామితోరునయవ్రజతారకసంయుతాంగుఁడై
క్రొలు సహస్రలోచనుఁడు, కాశికుఁ డీతఁడు తారకాహ్వయా."

యనవలసినచోట 'బహుళమైనను' అనుట అంతకంటెను తప్పు. ఈ వ్రాతలు వీ. బ్రు. గారికి వ్యాకరణపరిచయము బొత్తిగా లేదనుటకు మంచి తార్కాణములు" అని శ్రీ వెంకటరామిరెడ్డిగారి విమర్శ.

(చూ. వివరములకు, 9-6.1947 త్రిలిఙ్గ)

దొరవారు - ఁనుమాటకు 'దొరకు సంబంధించినవారు' అని యర్థము చేసికొని, 'వారి'కి ఏకవచనరూపము 'వాఁడు' గనుక దొరవారికి ఏకవచన రూపము 'దొరవాఁడు' అనుకొన్నది నూ.ని. - అట్లనుకొనుట పొరపాటు.

దొరవారు - అను పదానికి 'దొరయొక్క - వారు' అని యర్థముచేయుట తప్పు. దొరయొక్క - పురుషుని - 'దొరవాఁడు' అనుటయు, దొరయొక్క - పురుషులను - 'దొరవారు; దొరవాండ్రు' అనుటయు, దొరయొక్క - స్త్రీని 'దొరది' యనుటయు భాషాసంప్రదాయము కాదు. అదియట్లుండఁగా, దాయవారి దొరవారు - అన్న రనసకు, పగవారియొక్క - దొరయొక్క - వారు అని యర్థముచెప్పుటయు సుచితము కాదు.

దొరవారు - అనఁగా దొరలే. 'వారు' స్వార్థమున ననుప్రయుక్తమైన పదము. కవలు; కవలవారు - అనుట వంటిది. దాయలు 'దాయవా' రయినట్లే, దొరలు 'దొరవా' రయినారు. దొరలనఁగా శూరులని ప్రకరణార్థము. ('The దొరలు answer to squires, or knights.' బ్రౌను.)

'దొరవారిక్ (= దొరలను = శూరవరులను), అనేకులను గూర్చుకొన్నఁగాక, వాలిన దాయవారిక్ (= అతిశయించిన శత్రువులను), ఎట్లు జయింప వీలగును? అనియెంచి, యింద్రుఁడు, తారకునిమీదికి అనేక తారక సముదయముతో వచ్చినట్లు - పద్యమున కల్పన.

అమితతారకసంయుతుఁడు - అన్నప్పుడు, (యోధులైన) అనేక తారకులతో కూడినవాఁడనియు, సహస్రాక్షుఁడు గావున - అనేక కనీనికలు కలవాఁడనియు రెండర్థములు. (తారకశబ్దముచేత శ్లేషదమత్కృతి.)

కావున ''దొరవాఁడు = దొరకు సంబంధించినవాఁడు'' అని నూ.ని. భావించినయర్థము సరిపడదు.

'అమితోరునయనవ్రజతారకసంయుతాంగుఁడై' అన్న వాక్యముండిననే గాని, 'దొరవారి ననేకులఁ గూర్చుకొనపలసిన అక్కరయేమో, పాఠకునికి బోధపడదు. కావున, నూ.ని., పద్యమును పూర్తిగా నుదాహరింపక - ప్రారంభమాత్రము చూపివదలుట ప్రమాదము.

దేవరవారు - దొరవారు - అను పదములకు, ఏకవచనరూపములు 'దేవర' - 'దొర' అనియేగాని, 'దేవరవాఁడు' - 'దొరవాఁడు' అని కావు.

కావునసే అట్టి యేకవచనరూపములుగాని, దేవరవాండ్రు - దొరవాండ్రు– అను, బ. వ. రూపములుగాని భాషలో లేవు.

''దేవరవారు (రలు) = దేవర'' అని సూ.ని. లోనే యున్నది. (చూ. దేవర.)

౩౪. 'పసులత్రొక్కుడు'

సూ.ని. లో 'తలకుమాయు' క్రింద,– శ్రీనాథుని చాటువు,— "వోసెడుకొంపలోఁ బసులత్రొక్కుడు" అని యున్నది.

'పసులత్రొక్కిడి' అని చాటుపద్యమణిమంజరి పాఠము.

'త్రొక్కిడి' శ.ర.లో లేకుగాని లోకమున నున్నది. గుంటూరు, నెల్లూరు మండలములలో సర్వజనవిదితము. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు, జయ : గ్రీష్మ 'పరిశోధన' పత్రికలో అల్లసానివారి అల్లిక జిగిబిగి అను వ్యాసములో,— "తండ్రోపతండములుగా వచ్చు జనములతో నహోబలమున త్రొక్కిడి యెక్కువై" అన్నారు. కావున దత్తమండలములలోసు 'త్రొక్కిడి' అను వాడుక కలదు. శ్రీ 'దువ్వూరి'వారే నా వ్యాసమును విమర్శించుచూ,— 'నిశ్చయదృష్టిలేక తొడత్రొక్కిడిగా వ్రాయించిన' అని, 'త్రొక్కిడి'ని వాడియున్నారు. కాబట్టి ఆ పదము గోదావరిమండలమునను కలదన్న మాట. వారిపీరిమాట లెందుకు? సూ.ని. లో 'తొక్కిడి' లేకుగాని, "త్రొక్కిళ్లు = బాలక్రీడావిశేషము" అని యున్నది. 'త్రొక్కిడి' ఉన్న నేగదా 'త్రొక్కిళ్లు' యేర్పడుట?

ఎందుకు విస్తరము : సూ. ని. శ్రీనాథునిరచనను హర్షించుటయు, 'త్రొక్కిడి' అను పదమును చెప్పకపోవుటయు ఘోరపాటు.

రాపుడు, రాపిడి; దోపుడు, దోపిడి–అని యున్నట్లే, త్రొక్కుడు, త్రొక్కిడి– అని రెండు రూపములు నుండవచ్చు.

౩౫. 'తిగిచి'

సూ.ని. 'చాఁగఅగొను' క్రింద, ఉ.హరి. పద్యమును,— "నాఁగలి సాఁచుచుం దిగిచి నాగరథాశ్వభటావలిం గదక జాఁగఅగొన్నఁ జక్రుగ... (ఉ.హరి)" అని యుదాహరించి, ఇది శ.ర. పాఠ మన్నది.

శ.ర.లో 'దిగిచి' అని లేదు. 'దిగుచు' అని యున్నది. (వే.ప్ర. శాస్త్రిగారి ప్రతిలోను 'దిగుచు' అనియే పాఠము). శ.ర. లోని 'దిగుచు'ను, తాను 'దిగిచి'గా మార్చి, ఇది శ.ర. పాఠమనుట తగునా?

(జక్కుల)

"చాఁగరగొన్న జక్కుల" - అని శాస్త్రిగారి పాఠము. సూ.ని. ఆ పాఠమును చూపలేదు. మాపియుండవలసినది.

3౬. 'పీఁట'

సూ.ని. లో 'చాఁగఅగొను'; 'దొర' అను రెండుపదములక్రింద,—

"పెరిగినపొట్టతోడ నొక పీఁటపయిం దొరవోలె నెవ్వరిఁ, సరకు గొనండు" అనియున్నది. (ఉ. హరి. ర.ర౬)

పీఁటమీఁదదొరయేమి? ఎవ్వరినీ సరకుగొనకుండు టేమి? లోకములో 'పీఁటమీఁది దొర' అని యొక డున్నాడా? పోలె - అని యుపమించుటకు?

'ఒక పేఁటపయిం దొరవోలె' అని శాస్త్రిగారి పాఠము. ఆ పాఠమే సరియైనది. ఒక పట్టణమునకు అధికారియైనవాని (ప్రభువు) వలె ఎవరిని లెక్కచేయకున్నా డని యర్థము.

సూ.ని., శాస్త్రిగారిచే పరిష్కృతమైన ఉ. హరి. ప్రతిని చూచినట్లే లేదు.

32. 'ఉద్ది'; 'ఉద్దు'

శ.ర. 'ఉద్ది' క్రింద,— "ఉద్ది = సస్యవిశేషము. బహువచన మగుచో ధాన్యవిశేషము. విశేషణ మగునపుడు ఏకవచనముతో సమానము" అని చెప్పినది.

అట్లుచెప్పిన, శ.ర. 'వేఁపుడు' అను పదముక్రింద, పాంచాలీపరిణయ పద్యమును,— "పాడిబెల్లము చల్లి యుద్దుపాడి రాలిచి" (ర. ఆ.) అను పాఠముతో నుదాహరించినది. అచ్చుప్రతిలో పాఠము 'ఉద్దుపాడి' అనియే యున్నది. ఉండుగాక, శ.ర. తొలుత చెప్పినప్రకారము, 'ఉద్దులు'

ధాన్యమైనపుడు, ఆ ఉద్దుల-పొడి, ఉద్దిపొడి కావలెగాని, ఉద్దుపొడి అగు లెట్లు.* విశేషణమున (ఏకవచనరూపమయిన) 'ఉద్ది' యే కదా రావలసినది. కందులపప్పు కందిపప్ప; మెంతులపొడి మెంతిపొడి, అగుట యెట్టిదో— ఉద్దులపొడి 'ఉద్దపొడి' యగుటయు నట్టిదే. శ.ర. కర్త యీ విషయమును గమనించినట్లులేదు. గమనించియే యున్నచో, 'ఉద్దు పొడి'ని— 'ఉద్దిపొడి'గా సవరించియుండవలదా? సవరింపకపోవుట ప్రమాదము కావచ్చును గాని, సస్యవాచకమైన ఏకవచనరూపము 'ఉద్ది' అని శ.ర. చెప్పుటలో పొరపాటులేదు.

శ.ర. కర్త అట్లుండగా,— సూ.ని. "ఉద్దు (క. ఉద్దు) మినుము. (బ) మినుములు. ఉద్దుపొడి = మినుపపొడి. 'ఉద్దుపొడిరాలిచి' (పాంచా. ర.ర౭) ఉద్దుపప్పు = మినుపపప్పు (వ్యవ)" అని వ్రాసినది.

సూ.ని. మతమున 'ఉద్దు' ఏకవచనము; సస్యవాచకము. అగుగాక. తాను, శ.ర లోని 'ఉద్ది'ని చూచెనా? లేదా? చూచియే యున్నచో— శ.ర. లో 'ఉద్ది' అని యున్నది. అది సరియైనరూపము కాదు-అని చెప్పవలదా? చెప్పకపోవుటేల? తాను 'ఉద్ది'నివదలి 'ఉద్దు'ను గ్రహించుట కాధార మేమి? ఏమియుచెప్పక, ప్రామాణికుడైన ఒక నిఘంటుకర్త గ్రహించిన రూపమును, ఊరక త్రోసిరాజనుట సంప్రదాయమగునా?

---

* "కొన్ని శబ్దములకు ఏకవచనము లేదు. ఉదా॥ వడ్లు, పెసలు, అని స్పష్టముగ కం.వీ. సంగ్రహవ్యాకరణమున వక్కాణింపబడియున్నది. ఈ యేకవచన బహువచనరూపములు తెలుగు చదువుకొనువారికి ప్రారంభ విద్యార్థిదశయందే నేర్పబడుచున్నదిగదా! కావున శ్రీ దీ.పి. శాస్త్రిగారి మాత్రపు వ్యాకరణధర్మము నెఱుగకుందురా? ఉద్దులు అను పదమున కేకవచనము గలదనుటయు, అది 'ఉద్ది'కాని, 'ఉద్దు' కాదనుటయు సరికాదు" అని వీ.బ్ర. గారి దొక ప్రసంగము,

అది వ్యాకరణజ్ఞానము, గ్రంథపరిశోధనమునులేని, యెక్కువప్రసంగము.

ప్రౌఢ. వ్యా.లో,— "నిత్యబహువచనాంతమయిన శబ్దము వృత్తియం దేకవచనాంతంబయగు. ఉ. అదరిపట్టిరి." అని స్పష్టముగా చెప్పబడి యున్నది.

ఎందుకు విస్తరము. 'ఉద్ది'యే యేకవచనరూపము. తిరువళ్లూరు మిషన్ హైస్కూలు పండితులు, ఉభయభాషాప్రవీణ శ్రీ ఉత్పల వేంకట రంగాచార్యులవారు, "విశేషమైనప్పుడు 'ఉద్ది' యను శబ్దమే (ఉద్దిచేను, ఉద్దిపప్పు) గాని ఉద్దుశబ్దము (ఉద్దుచేను, ఉద్దుపప్పు) నెవ్వాడును పలుకుట లేదు" అని స్పష్టముగా చెప్పుచున్నారు. (చూ. 7 జూలై, 1947 - త్రిలిఙ్గ)

మఱియు, కర్నూలు మునిసిపల్ హైస్కూలు పండితులు శ్రీ మేడవరపు రామబ్రహ్మశాస్త్రిగారు ఇట్లు వ్రాయుచున్నారు :

"...సమాసమునఁ బ్రాతిపదికమాత్రమై 'ఉద్ది'యని వినిపించుటయు, ('ఉద్దులు' అని) ధాన్యవాచకమైనపదప తప్పనిసరిగా సస్యవాచకముఁజై, మినుపపైరు 'మినుము' వినట్లు, ఉద్దిపైరు 'ఉద్ది' అని యేకవచనరూపమున సాధువగుటయు నుపపన్నమగును. అపుడు శబ్దరత్నాకరవివరణము సమంజసమగుటయు, పాంచాలీపరిణయమునందలి 'ఉద్దుపాడిరాలిచి' అను నుదాహరణములోని 'ఉద్దు' అను రూపము అచ్చుపొరపాటుమాత్రమై, యీ ప్రయోగముపై నాధారపడు సూర్యరాయనిఘంటువివరణము నిరాధారమగుటయుఁ దెల్లము." (వివరములకు చూ. 12 డిసంబరు 1949 త్రిలిఙ్గ)

శ.ర.లో,— "సనగ (= సెనగ) సస్యవిశేషము. సనగలు (అని బహువచనాంతమైనపుడు) ధాన్యవిశేషము. వృత్తియందు 'అదరుట్టి' అన్నట్లే సనగపప్పు; సెనగపిండి అని యేకవచనాంత మగును" అనియు చెప్పబడియున్నది.

"కంది; ఇది యేకవచనరూపము కాదు. 'విశేషణ'రూపము. విశేషణములకు లింగవచనవిభక్తులుండవుగదా" అని వీ.బ్ర.గారిది యింకొక ప్రసంగము. ఇదియు పై ప్రసంగమువంటిదే.

"విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగవిభక్తివచనంబులగు" నని బాలవ్యాకరణము. (కారక. సూ. ౧౯)

(1) "కటుకులు గాని మానములు" (శృం.నై. 8-42)

(2) "నానాతీర్థసతతసు, స్నానంబులఁ బల్లలైన జడలును"
(భార. ఆను. 5-25)

(3) "ఉప్పి గొప్పలుగాఁజేసి యావించిన కుడుములు"(కాశ.3.ఆ.)

3వ. 'అక్కలి'

శ.ర. లో "అక్కలి = అల, తరంగము. వ॥ కడలిమొగయక్కలిం దగులువడిన బోగునుం బోలె నెదురునడవ మఱలంబఱవ లేక చీకాకుపడి." (కాశీ. ౨. ఆ.) అని యున్నది. మఱియు, "మొగ = అప్రాణివస్తుముఖము. మొగయక్కలి" అనియు నున్నది.

నూ.ని. యును, అల్లే— "అక్కలి = తరంగము, ఆల" అని చెప్పి, అందుకు,—

"తగులువడి యపుడు వడిసెడి
గగనమణిరథంబు దోరగలువడి నిలిచెఁ
బొగరు మొగకడలి యక్కలిఁ
దగిలి నిలువఁబడిన ఘనవితతియుం బోలెఁ"

అను, కాశీఖండ (౧-౧౩౩) రచనచే చూపినది. ఆ గ్రంథము ముద్రిత ప్రతిలో పై వచనము - పద్యముకూడా 'అక్కలి' యను పాఠముతోనే యున్నవి. కాని,

'అక్కలి = అల'

అన్న యర్థ మా రెండుస్థలములలోను సరిపడుటలేదు. ఏమందురా.—

బోగు (= పడవ) కాని, ఘనవితతి (= మబ్బులమొత్తము) కాని 'అల'లో తగులుకొని— "ఎదురునడవ మఱలంబఱవ లేక చీకాకుపడి"

కందు-కందులు అయినట్లే, ఉద్ది బహువచనమున 'ఉద్దులు' అగును - అని నేననగా బ్రహ్మంగారి ట్లాక్షేపము తెల్పినారు,—

"కందులకు ఉద్దులకును నేమైన బోలికగలదాఁ కందులలో ఒక సున్నయుండి దకారము ఏకాక్షరహల్లుగా నున్నది. మఱి ఉద్దులలో ఆ సున్న లేదు. దకారము ద్విత్వముగా నున్నది. కావున ఉద్దులు, కందులు వంటిది కాదు."

పాపము ఆయనగారికి వ్యాకరణజ్ఞానము మట్టసము.—కంది, ఉద్ది - అను పదములు రెండును ఇదంతములు. బాల. తత్స. నూ. 45 ప్రకారము, రెండును బహువచనమున ఉత్వమునుపొందునవే. తండ్రి-తండ్రులు; తల్లి-తల్లులు-అను పదములస్వరూపమైనను ఆయనకు తెలియదు గదా!

యుండుట స్వభావముకాదు. కావున, ఆ రెండుస్థలములలోను నుండ దగినది - 'అక్కలి' కాదు. అది - 'అల'యును కాదు.

అక్కడ నుండదగినపదము— 'ఎక్కలి'. 'ఎక్కలి' యనగా, ప్రవాహవేగమున కొట్టుకొనివచ్చి మిట్టగా నేర్పడు ఇసుక(=ఇసుక దిబ్బ). "ఎక్కలి = ప్రవాహముచే కొట్టుకొనివచ్చి కమ్ముకొనిన యిసుక" అని శ.ర. లోనే యున్నది.

సముద్రముఖద్వారములందు, ఒక్కొక్కప్పుడు ఇసుక మేటవెట్టుటయు, పడవ లా యిసుకలో కూరుకొనిపోయి కదలమెదలలేక నిలిచిపోవుటయు కలదు. అట్లే, సముద్రముపై బడ్వెడు మబ్బులుసైతము— ఇసుకతిన్నె లడ్డగించినప్పుడు గుట్టపడి యుండుటయు సహజమే.

కాబట్టి, కవిపాఠము 'ఎక్కలి'యే యనియు, ఆ యెక్కలి వ్రాతలో 'అక్కలి'గా మారి, అక్కడనుండి అచ్చునకు, అచ్చునుండి నిఘంటువులకు నెక్కినదనియు నా యభిప్రాయము.

3ఓ. 'పొగరు'

'పొగరుమొగ' యన్నచోట 'పొగరు' కర్థమేమో తెలియుటలేదు.

శ.ర. లో,-"పొగరు=1 గర్వము; 2 ధైర్యము; 3 తీక్ష్ణగంధము" అనిమాత్రమే యున్నది.

నెల్లూరుమండలమున సముద్రతీరగ్రామములలో సముద్రపుపోటును, పోటువలన ముఖద్వారములయం దేర్పడు - ఇసుకదిబ్బను 'పొగరు' అనుట కలదు.

'పొగరు' హరివంశమున నిట్లు ప్రయోగింపబడియున్నది :

"అంబరశ్యామి (మ?)క యంబుధి పొగరుగా
బ్రమసి యెక్కెనొకాక బాడబాగ్ని,...
... ... అని యఖిలజనులు
బహువిధానుమానారంభపరతఁజూడ
నరుగుదెంచెఁ బక్షీప్రభుఁ డభ్రవీథి." (ఉ. ఏ. ఆ.)

అంబుధిపొగ రన నర్థమేమో తద్జ్ఞులు తెల్పుదురుగాక.

౪౦. 'అంబు'; 'అంబుజ'

శ.ర. కర్త, "అంబు. వై. అమ్ము, బాణము" అనిచెప్పి, "(చూ. బుజ.)" అన్నాడు.

'బుజ' తీసిచూడగా, అక్కడ– "బుజ.యు.జే.వి. కుండలీకరణము. వై.భుజము. 'బిసవల్లి సముద్భవ సౌకుమార్యకందళముల కంబుజల్ బుజలు. చమ. ౧. ఆ." అని యున్నది.

. శ.ర. కర్త, అంబు విషయమున 'బుజ' చూపు మనుటలో భావ మేమో నాకు బోధపడలేదు. అక్కడి యుదాహరణంలో నున్నది, 'అంబుజ' గాని, 'అంబు' కాదు; 'అమ్ము'అను నర్థముతో నక్కడ ప్రసక్తియునులేదు.

'అంబుజ(లు)' అన నేమో నా కర్థము కాలేదు. ఆ పదము, శ.ర.లో లేదు; బ్రౌణ్యములో లేదు; సూ.ని.లోను లేదు.

శ.ర. కర్త 'బుజ = భుజము' అని చెప్పి, పై ప్రయోగము చూపి నాడు. అందువలన "బిసవల్లి సముద్భవ సౌకుమార్య కందళములకు, అంబుజలు, బుజలు = భుజ ములు" అని యర్థ మేర్పడుచున్నది.

ఆ యర్థము నా బుద్ధికి సరిపడలేదు. అసలు "బిసవల్లి సముద్భవ సౌకుమార్య కందళము" లంటే యేమో నాకు గోచరము కాలేదు.

'బుజలు = కుండలీకరణములు' అను నర్థముకూడా, పై రచనకు పొసగదు. కాబట్టి శ.ర. వ్రాతయంతయు, అయోమయముగా నున్నది.

ఆ వ్రాతను సూ.ని. యెట్లర్థముచేసికొన్నదో యేమోగాని 'అంబు' క్రింద,– శ.గ. 'బుజ = భుజము' అనుట కుదాహరించిన, "బిసవల్లి..... కంబుజల్ బుజలు' అను రచననే 'కంబుజల్ బుజలు' అని తాలవ్యజకార

ములతో నుదాహరించినది. ఆ జకారముల నట్లు మార్చుటకు కారణమేమో చెప్పలేదు.

ఏమయినను, సూ. ని., శ. ర. వ్రాతల నెత్తి వ్రాసికొనుటేగాని, తాను స్వయముగా విచారించుట చాల తక్కువ.

౪౧. 'బుజయిడు'

శ.ర. 'బుజ్జ' క్రింద,— "కా నొక్కటె దబ్బఱి, యని బుజ్జయిడు పగిది నాభి యంగన కలరుఁ" (చంద్ర) అను ప్రయోగము నిచ్చినది. ఆ ప్రయోగము 'బుజ్జయిడు' అను క్రియకు ఉపపత్తి కలసినదిగాని 'బుజ్జ' యను విశేష్యమునకు చూపవలసినది కాదు. 'బుజ్జ'ను ప్రత్యేకించి విశేష్యముగా తీసికొన్నచో, బుజ్జనిడు-అనియు ననవచ్చును; కాని అపుడది క్రియయును కాదు; కుండలీకరించు-అన్న యర్థమును ఇయ్యదు. 'బుజ్జయిడు' శ. ప. క్రియ. కావున ఆ క్రియలోని 'బుజ'ను వేరుపరిచి యర్థము చెప్పరాదు.

బుజ్జయిడు-అన్న యర్థమునసే, 'బుజ్జవైచు'; 'బుజ్జలువైచు' అన్న పలుకుబళ్లును కలవు.—

(1) "కవిలె నిచ్చినయప్పు జవిలి వ్రాయఁగఁ బోయి
బుజ్జవైచె వేనూళ్ల (?) పూటలెక్క" (బహులా. 5 ఆ.)

(2) విశ్వంభరాభోగవివిధమూర్త్యంతర
స్ఫురితానుభావంబు బుజలువైచి" (పాండు. 2-11)

బుజ్జనువైచె; బుజలవైచి-అని వాడఁగూడదు.

౪౨. 'నీలాటిరేవు'

శుకసప్తతి ముద్రితప్రతిలో,—

"సాత్కొత్కరించిన జలదేవత యనంగ
నీలాటిరేవున నీటుచూపు" (శు. ౪౧౦)

అని యున్నది. సూ.ని. 'నీలాటిరేవు' అను పదమును గ్రహింపలేదు; సరిగదా, మూలపదములలో 'నీగాటిరేవు' క్రింద పై పద్యమును 'నీరాట రేవున' ను పాఠముతో పఠించి— "నీలాటిరేవు అని అపముద్రితము" అని ఆక్షేపమును తెలిపినది. పొరపాటు.

'నీలాటిరేవు' అను వ్యవహారము సుప్రసిద్ధము. శ్రీనాథుడా పదమును,—

*"నీలాటిరేవులోపల
మేలిమిలోఁ దీర్చినట్లు మెఱసి నిలుచుచుక్
బాలినిని వాలుఁజూపుల
బాలాసుణి గుట్టు పైటపడఁగాఁ జూచెన్" (చాటు. మంజరి.)

అని ప్రాసస్థానమున వాడినాడు.

లోకవ్యవహారమును, మహాకవుల రచనలలోనుగల—'నీలాటిరేవును' సూ.ని. గ్రహింపకపోవుటయే కాక, పైపెచ్చు ఆక్షేపించుట ధర్మమేనా?

---

* "ప్రాసయిబ్బంది కొఱకై శ్రీనాథుడు వాడిన వాడెగాక ఆతడు వాడినాడని... ఎల్లవారును 'నీలాటిరేవు' అనగూడదు. ఆ పదము నాతడొక్కడే వాడవచ్చును. ఇతరులువాడితే తప్పే. శుకసప్తతిలో 'నీలాటి రేవున నీటుఁజూపు' అన్నచోట, యతిప్రాసాది నిర్బంధము లేదుగనుక తప్పే. అపముద్రితమే. అందువలననే, సూ.ని. 'నీలాటిరేవు' అను పదమును జేకొనలేదు. అపశబ్దము నిఘంటువులం దెట్లుండును"-అని వీ.బ్ర. గారి ప్రసంగము.

ఎంతచక్కని ప్రసంగము! ఆహా!! మహాకవి శ్రీనాథుడు ప్రాసయిబ్బందికొఱకు - 'నీరాటిరేవును'—నీలాటిరేవు - అన్నాడట! సిగ్గు! సిగ్గు! నీలాటిరేవు అనియే పద్యప్రారంభముగదా? మరి ప్రాసయిబ్బంది యెక్కడ? ఏమో, ఆరహస్యము 'కవిరత్న...కవి' బిరుదాంకులైన ఆ బ్రహ్మంగారికే యెఱుక. ఆ పదమును శ్రీనాథుడొక్కడే వాడవచ్చునట! ఇతరులు వాడరాదట! ఎందువల్లనో? శుకసప్తతిలో అది అపముద్రితమేనట! అపశబ్దమేనట! అందువల్లనే సూ.ని. చేకొనలేదట!

సూ.ని. పొరపాటులను సమర్థించుట కిట్టి మహావిద్వత్కవి దాపరించుట ఆ నిఘంటువుయొక్క మహాభాగ్యముగదా!

౮౩. 'చెంద్రికవెట్టి'

సూ.ని. లో, 'చెంద్రిక' క్రింద,—

"ఇంద్రజురాక ధర్మజున కేర్పడఁగా శుభలేఖవ్రాసి, వే
చెంద్రికవెట్టి" (విజ. 3-130) అని యున్నది.

పూర్వతరముద్రణమునను, 'చెంద్రిక' అను పదముక్రింద, శ.ర. లోను, 'చెంద్రిక-చుట్టి' అని యున్నది. 'చెంద్రిక-వెట్టి' అనునది 'వేదం' వారి పాఠము. సూ.ని. తీసికొన్నది ఆ పాఠమునే. అది సరియైనపాఠము కాదు. 'చుట్టి' అనునదే సాధుపాఠము.

శ.ర. యు, ఆ ప్లే సూ.ని. యు,— "చెంద్రిక = కమ్మపెగుద్దు, తాటియాకుజాబు మొదలగువానిమీఁది వలయము."—"ద్దుద్దు = తాటాకు జాబుమీఁది చెంద్రిక" అనడమేగాని, అది పెట్టఁబడునదో, చుట్టఁబడునదో చెప్పలేదు.

చెంద్రిక 'చుట్టఁ' బడునది. *'పెట్టఁ' బడునది కాదు.

తాటాకుమీఁద జాబువ్రాసి, దానిని గుండ్రముగా చుట్టచుట్టి, ఆ చుట్ట వీడిపోకుండా మరియొకఆకుతో సంధిస్థానమున చుట్టి ఓగింతురు. ఆ

---

* " 'బులుసు'వారు 'పెట్టి' అను పాఠమునే తీసికొని,- "చెంద్రిక పెట్టి = ఎఱ్ఱనిరంగుపెట్టి. శుభమును తెల్పు జాబులపై పసుపుతోఁగాని, కుంకుమతోఁగాని, నడుమను చివఅను గుర్తులుంచుట సంప్రదాయము" అని టీక వ్రాసినారు.

జాబువ్రాసి, కవరులోపెట్టి, అందున్నది శుభలేఖ యని తెలియుటకు కవరుమీఁద పసుపుతోనో - కుంకుమముతోనో గుర్తులుంచుట సంప్రదాయము. బులుసువారు పెట్టించిన గుర్తులో, కవరుక్రింద —(అనగా ఆ జాబుకు చుట్టు నట్టి 'చెంద్రికవన్నియసాలు' క్రింద) పడిపోవుచున్నవి. కవరులోని జాబు మీఁద ఏ గుర్తులుంచినను అవి చూచువారికి కనబడు టెట్లు? కనబడనప్పుడు అది శుభలేఖ యని తెలియు టెట్లు? వారిటీక సరియైనది కాదు.

వారు గమనింపలేదుగాని, ఆ జాబుమీఁద, ఎఱుపురంగువస్త్రము చుట్టుట, అందున్నది శుభ లేఖ యని తెలియుటకే.

బిగింపునకే 'చెంద్రిక' యని పేరు. అదే 'దుద్దు'. కావున 'చెంద్రిక' చుట్టబడ్డ నదిగాని పెట్టబడునది కాదు.

ఈ క్రింది పద్యమున 'చెంద్రిక'కును తలపాగకును పోలిక చెప్పబడినది.

"గరవు గొత్తఁ జెంగలువకచ్చుఘటించినచూళిఁ జుట్టఁ జెం
దిరిక తెఱంగునం బసిఁడితీగలునించిన జిల్గుపాగ" (మను. 5-58)

చూళిక, పాగ = తలగుడ్డను, చెందిరిక తెఱంగున = కమ్మపై దుద్దువిధమున, చుట్టెక = చుట్టుకొనెను - అని యర్థము.

చెంద్రిక చుట్టబడునదిగాని పెట్టబడునది కాదని యీ పద్యమువలన ఏర్పడుటలేదా?

'చెంద్రికవన్నియసాలుచుట్టి' అన్న మాటకు, 'వేదం' వారు వ్రాసిన అర్థము.— "చెంద్రిక = *చంద్రకావి" అనిమాత్రమే. అందువలన, సూ. ని. 'చెంద్రికవన్నియ' ప్రస్తావమే యెత్తలేదు. ఆ 'సాలుచుట్టుట' యొక్క వృత్తాంత మేమనగా.—

తాటాకుకమ్మవ్రాసి, చుట్టగాచుట్టి, దానిని 'చెంద్రిక'తో బిగించి, ఆ మొత్తమున కొక యెఱ్ఱనిగుడ్డ చుట్టుదురు. అదే సాలుచుట్టుట. అదే ఆ జాబుకు 'కవరు'.

ఈ విషయమును బ్రౌను, 'చెంద్రిక' అను పదముక్రింద,—"The reddish envelope of a letter written on palm leaves. చంద్రిక చీరలు. A. 4" అని వివరముగా చెప్పియున్నాడు.

చెంద్రిక వన్నియసాలు (= ఎఱ్ఱనిగుడ్డ) చుట్టిన తాటాకు జాబు చుట్టకు 'కమ్మచుట్ట' యని పేరు. విజయవిలాసకర్త, సూర్యమండలమును 'కమ్మచుట్ట'తో పోల్చినాడు; చూడండి.

"తనయునిపెండ్లి కేగవలె ధాత్రికి, దిక్కులవారినెల్లఁ దో
డ్కొని చనుదెమ్ము నీవని కడుంగుతిచేసి సురాధినాథుఁ డ
వ్వనపతి కంపినట్టి శుభవార్తలబంగరుకమ్మచుట్ట నా
దినకరమండలం బపరదిగ్గిరికూటముఁజేరె నయ్యెడన్" (3-92)

---

* 'చెంద్రకావి' అనవలెను.

౪౪. 'పాసెము'

'వేదం'వారి శృం. సై. లో,—

"అనుగుగ నఫు డొకొక్కకయెడ
మరకతమణిపాత్ర గగనమండల మయ్యెక్
జిరువడముల పాసెము శశ
ధరుఁడయ్యెక్ జుక్కలయ్యె ద్రాక్షఫలంబుల్" (౨-౧౨౩)

అని యున్నది. నూ.ని. 'చిరుపడము' క్రింద ఆ పాఠమునే యుదాహరించినది.

'పాసెము' అనుపాఠము తప్పు. 'పాకము' అని సరియైనపాఠము. శ.ర. లో 'చిరువడము' క్రిందనే యున్నది. 'వేదం'వారు చూడలేదు; నూ.ని. యును చూచినట్లులేదు.

'పాసెము' పుట్టినవిధ మెట్టిదనగా.— ద్రాతప్రతిలోని 'పాకము' అచ్చులో 'పాశము'గా మారినది. వేదం-వారికి దొరికిన ప్రతులలో 'పాశము' అని యున్నట్లు వారే తెలిపియున్నారు. వారా పాశము, పాసెము (పరమాన్నము) అనుకొని, తెనుగుపదమున 'శ' ఉండరాదు గనుక 'సె'గా సవరించినారు, పొరపాటు.

ఆది 'పాక' మేగాని, 'పాసెము' కాదు. 'చిరువడముల పాక' మనగా— గెనుసుగడ్డలతో చేసిన భక్ష్యవిశేషము. అది సాజ్జెఅప్పములె తెల్లగను - గుండ్రముగను ఉండును. అందువల్లనే చంద్రునితో పోలిక.

గెనుసుగడ్డభక్ష్యము చంద్రుడయ్యెను. దానిపాంత ఉంచబడిన ద్రాక్షపండ్లు చుక్క లయ్యెను - అని పైపద్యమున అర్థము.

ద్రాతలోను - అచ్చులోనుగూడా 'క' - 'శ' అను వర్ణములు రెండును తారుమారగుట తఱుచుగా జరుగుచుండును.

'పంచకరపాట్లు' అనుపదము 'పిఱుపర్తి' బసవపురాణము (౫-35)లో,-

"పంచశరుపాట్లుపడిరి విరించిముఖులు"

అని అచ్చైనది. అందు క-కారము శ-వర్ణముగా మారినదిగదా?

'వేదం'వారి ఆస్థానౌషధములోనే, 'లోకేశకుటుంబిని' - లోక్షైక కుటుంబినిగా మారియున్నది. ఆ మారినవిధము చూడండి :

"ఆశాశ్వమ్ములైన యనే
కాశీంవ్వదంబు లాసగి యఖిలేశ్వరి లో
కేశకుటుంబిని"

అని ఆసలుపాఠము. తాటాకులప్రాతలో, 'లోకేశ' అను పదములోని 'శ' - 'క' వలె కనబడుటచేత, 'లోక్షైక' అయ్యుండునునుకొని పరిష్కర్తలు (క కారమును 'శ'గా సవరించుటకు మారుగా, 'కేశకు విత్వమిచ్చి) 'క్షై'గా సవరించినారు.—

ఇట్లూ పదములోని *'శ' - 'క'గా మారిపోయినది. ప్రాసముతప్పిన సంగతియు పరిష్కర్తలు గమనించినారుకాదు, అది ప్రమాదము.

ఏతావతా చెప్పవచ్చినది యేమనగా :— చిరువడముల - 'పాశము' లోని 'శ'ను 'క'గా సవరించుటకు బదులు వ్యాఖ్యాతలు 'సె'గా సవరించి అపాథ్య కల్పనముచేసినారనీ; ఆ పాఠమును సూ.ని. గ్రహించుట తప్పనీ.—

౪౫. 'భసువింటలు'

సూ.ని. 'భను' క్రింద,— శై. సై. (ఆ. ౬౧) పద్యమును

"భూపాల మెఱుఁగుఁబోఁడుల
మంపులకుం డాయు నీసుసాబ గట్లగుటఁ
బహుమిన్నగి యినువింటల
మంపుల నఱగంటి వెఱచుచు న్నినుఁ జూచుఁ"

అను పాఠముతో నిచ్చినది.

---

* "'క', శ-అయినదని డీ.వి. శాస్త్రిగారు చెప్పినారు" అని కీ.బ్ర. గారి ఆక్షేపము. (24-2-1947 త్రిలిఙ్గ)

ఆయనగారికి తెలియకపోవచ్చును; నేనిచ్చినది తెలిసికోలేకపోలేను. నేను చెప్పినది సత్యమో, సత్యమో పెయ్యుదాఁ-చరణంలవలన స్పష్టమగుటలేదా? ఆయనగారి (18-11-1946 త్రిలిఙ్గ) వ్యాసములోనే, 'ప్రతికూలుఁడు' అనుపదము 'ప్రతిశూలుఁడు'గా మారియున్నది.

'ఇనువింతల' అనునది వేదం-వారి పాఠము. సరికాదు. 'ఇసిఱింతల' అని సరియైనపాఠము, శ.ర. లో 'ఇసిఱింతల' క్రింద నున్నది.

వేదం-వారికి దొరకిన ముద్రణములో 'యినువింతల' అని యుండగా, వారా పదమును 'యినువింతల' అని సొంతముగా సవరించినారు "ఇనువింతల = రెట్టి యాశ్చర్యముతోడి" అని టీకకూడా వ్రాసినారు.

ఇనువింతలు - అను వాడుక లోకములో లేదు. కావ్యములలోను కనబడదు. వ్యాకరణమర్యాదనుబట్టి (రెట్టి అను నర్థమున) ఆ పదము పుట్టుటకు పూర్వమును లేదు.

అంతేకాక, ఆ పద్యములో 'ఇనువింతల - చూపులతో' అక్కర యును లేదు. పైపెచ్చు - అట్టి చూపు లక్కడ పనికిరావుకూడాను. చూడండి.

కాంతాజనుల చూపులు అంబకమైన ఆ కలునితనువునకు *ఆంటుకొని పోవునట, ఆ ట్లంటుకొనిపోకుండుటకై, దనుజాంతి — ఇసిఱింతల (= చంచలములైన, నిలుకడలేని) చూపులతో మాచినదట. అదీ, అక్కడి యర్థము.

ఇనువింతలతో (= రెట్టి ఆశ్చర్యముతో) చూచువాఁడు-నిశ్చలదృష్టితో-రెప్పార్పకచూతురు గాని, చంచలదృక్కులతో చూడరు. ("కనుఱెప్ప వేయ కక్కొంత మహీశులాపఁ దడకొపడి మాఁదె గుమారశేఖరుఁ" సారంగ. 2-37) అట్లు, నిశ్చలదృష్టితో మాచినయెడల, ఆ చూపులు -

---

* చూపులు తనువున కంటుకొనునని చెప్పుట కవిసమయము.
ఈ క్రింది ప్రాచీనరచన లంటుకు ప్రమాణము,

(1) "వనితాజనుల చూపు లను తూపులకుఁ దన
ప్రన్నని మేను లె(ల)ప్పంబుగాఁగ" (దశ. 1-60)

(2) "మీ పుష్పగంధి నెయ్యపుఁ
జూపులకును లెప్పమైన సుకుమార వపు
శ్రీపెంపునఁ దనరిన వసు
ధాపతిసుతు సఖుఁడ నింద్రదత్తాహ్వయుఁడఁ-"
(భోజ. 3-240)

తనువున కంటుకొనిపోవుట తథ్యము. కావున 'ఇనువింతలచూపులు' ప్రకరణవిరుద్ధములు.

*'ఇసిఱింతల చూపులు' ప్రకరణోచితములు. కావ్యములలో, చూపులకు - 'ఇసిఱింతలు' చెప్పుట కలదుగాని 'ఇనువింతలు' చెప్పుట కానరాదు.

(1) "ఏ పువ్వుబోడుల యిసిఱింతచూపుల
బుసుల గట్టిమనంబు లిగురువెట్టు" (కాశి. 3-౧౬౯)

(2) "మన తరలాక్షి సిగ్గు తెరమాటుననుండక దాటి దూటి పా
ఱిన గదియంగబట్టి యిసిఱింతలచూపులఁ దన్నుఁ జూడఁగా"
(పి. శకుం. 3-౫౨)

'ఇనువింతల - చూపులు' ఒక్క- వేదం-వారి నైషధములోతప్ప నా కెందును కనబడలేదు. సూ.ని. కిని కనబడినట్లులేదు. ఎందైనను కలవేమో పెద్దలు తెలుపవలెను.

అవి కనబడుపరకును, శ.ర.లోని 'ఇసిఱింతచూపుల'పాఠమే సాధువు. మా.ని. ఆ పాఠమునువదలి 'ఇనువింతల చూపుల' పాఠమును గ్రహించుట పొరపాటు.

ఇక్కడ ఒక విశేషము. —

'మెఱుఁగుబోడులచూపులకుఁ దాయు నీసుసొబగు' అన్నచోట, వేదం-వారు,— "చూపులకుఁ = నేత్రములకు, దాయుఁ = అంటుకొని పోవును. (కన్ను నీకంటుకొనిపోవునని) వెఱచుచుఁ, నిను జూచును" అని టీకవ్రాసినారు.

అక్కడ 'చూపు' లనగా దృష్టులుగాని కన్నులుకావు. కావున ఆ టీకయును ప్రమాదమూలకమే.

---

* వా.ని., 'యిసిఱింతల' పాఠమునే గ్రహించి,— "యినువింతల- యుత్పాతము. 'ఇనుఱింతల' వేదం. పా. ఇతర ప్రయోగముల ననుసరించి యిసిఱింతల యనుచే గ్రాహ్యము" అన్నది.— (చూ. ఇసిఱింతల క్రింద)

సూ.ని. ఆ మాత్రము విచారింపకపోయెగదా!

౪౬. 'ఎత్తుచు'

నూ.ని.లో,- 'చోఁగు' క్రింద.—

"సీ. ముంగాళ్లఁ జాఁగి పై మ్రుచ్చుచూపులుపర్వ
బొమిక లెత్తుచుఁ బొలిపోవుశునుల" (ఆము. ౬.౧౨)

కావ్యములలోను, లోకవ్యవహారమునను గూడా,— ఎత్తుకొను; చేసికొను; తీసికొను; పుచ్చుకొను; నాటుకొను; కట్టుకొను; తప్పించుకొను మొదలగు క్రియలయొక్క క్త్వార్థకరూపములు.—

ఎత్తుకొని; ఎత్తుక.	చేసికొని; చేసుక.
తీసికొని; తీసుక.	పుచ్చుకొని; పుచ్చుక.
నాటుకొని; నాటుక.	కట్టుకొని; కట్టుక.
తప్పించుకొని; తప్పించుక.	

అనురీతిగా నున్నవే గాని, ఎత్తుచు; చేయుచు; తీయుచు అనురీతిగా లేవు.

అనగా, 'రావణుఁడు సీత నెత్తుకొనిపోయినా' డన్న యర్థమున 'రావణుడు సీత నెత్తుచుఁ బోయినా' డనియు, 'వాడు పెండ్లిచేసికొని పోయినా' డనుటకు మారుగా — 'వాడు పెండ్లిచేయుచుఁ బోయినా' డనియు లోకమున నెవ్వరును అనరు.

(1) "లక్షపరిమాణముగల క్రిమిగుండమందు నాటుకయుండుట" (భాగ. 5 స్క.ం. 147)

అనుచోట, 'నాటుచునుండుట' అంటే ఏర్పడే యర్థమేమో అక్షరాస్యులకు చెప్పనక్కరలేదు గదా!

(2) 'తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు'.—

అనుటకు బదులుగా, 'తప్పించుచుఁ దిరుగువాఁడు ధన్యుఁడు' అని, యేమాత్రపు భాషాజ్ఞానముకలవాఁడును అనడు గదా!

మఱి మహాకవియైన శ్రీకృష్ణరాయడు,— "బొమిక లెత్తుచు... పోవుశునుల" అని యేల యనెను?

నిజానికి ఆ మహాకవి యట్లనలేదు.— "బొమిక లెత్తుక... పోవు శునుల" అని సరిగానే అన్నాడు. శ.ర.లో 'బొమిక' అను పదముక్రింద, బొమికలెత్తుక' అను పాఠమే చూపబడి యున్నది.

మరి సూ.ని. 'బొమికలెత్తుచు' అనుటకు కారణ మేమంటారా? 'వేదం'వారు 'ఎత్తుక' అను రూపము వ్యాకరణవిరుద్ధమని 'ఎత్తుచు' అని సవరించి, వారి ప్రతిలో ముద్రించినారు. వారి ప్రతిలో నున్న ప్రకారమే సూ.ని. ముద్రించినది.

వేదం-వారు "కొంగవాల్నఱుకు లంగుళులఁబట్టుక" (ఆము. 6-21) అన్నచోటగూడా 'బట్టుచు' అని దిద్దివేసినారు. ప్రాచీనకవుల ప్రయోగములను మార్చివేయుట ఆకవులకూ-భాషకుకూడా మహాపకారముచేయుట యగును —

'ఎత్తుక' - 'పట్టుక'-అను రూపము లసాధువులుకావు.— బాల, వ్యా. క్రి. సూ. 53 క్రింద, గుస్తాఫ్ప్రకాశికాకర్తలు, "చేసికొని, చదువుకొని - ఇత్యాది క్త్వాంతంబులకు బదులుగా 'చేసుక' - 'చదువుక' ఇత్యాది క్త్వాప్రత్యయాంతసంగ్రహ రూపంబు లనంతామాత్యతిమ్మకవ్యప్పకవ్యాది లాక్షణికులచేఁ దమ గ్రంథములయందు వాడఁబడినవి" అని చెప్పి ఒక యిరవైయేడు ప్రయోగము లిచ్చియున్నారు.

'ఎత్తుక' అను పాఠము శ.ర.లో నున్నను గ్రహింపకపోవుట, ఆ పాఠమును సూచింపకపోవుట, *'ఎత్తుచు' అను అసాధుపాఠమును గ్రహించుట, సూ.ని. చేసిన పొరపాటులు.

౪౭. 'చీకుబండ'

సూ.ని. 'జీరుకుబండ' క్రింద,—

"చ. అలకలు నాసికామణియు.....హస్తము లూఁది జీర్కుబం,
డల దిగజాఱి రొండొరుకడం దరలాతురులు" (పారి. శ.౨౯)

---

* ఎత్తుకొని-అను నర్థమున 'ఎత్తుచు' అనవచ్చుననియు, 'తప్పించుక తిరుగువాఁడు' అన్నను, 'తప్పించుచుఁ దిరుగువాఁడు' అన్నను అర్థ మొకటే ననియు - 'ఎత్తుక' అనుట తప్పనియు, వీ.బ్ర.గారి దొక పెద్ద రాద్ధాంతము. (చూ. 17 మార్చి 1947 త్రిలిఙ్గ) ఆది యర్థవంతముగాని-కావ్యపరిచయములేని అనవసరపుగొడవ.

ఎత్తుక; పుచ్చుక-అనుట తప్పుకాదని బాలకవిశరణ్యము ఘంటాఘోషముగా చెప్పుచున్నది. వీరబ్రహ్మంగారి రిప్పడైనను చదువుకొనుట మంచిది.

అను పద్యమునుఁజూపి, ఇది శ.ర. పాఠ మన్నది. అక్కడనే "జిర్ఱు-బండ-అని కాళిందీకన్యాపరిణయమున అపముద్రిత" మని యొక మాట వ్రాసినది.

అట్లు సూచించుట మంచిదే; కాని, వేదం-వారి 'పారి' ప్రతిలో

'చీకుబండల దిగజాఱి"

అని యున్నదే: అది తప్పా? ఒప్పా? తప్పేయైనచో, తప్పనిచెప్పకపోవు టేల? ఒప్పేయైనచో గ్రహింపకపోవు టేల?

ఆం. భా. (1-143)లో, "జీరుకునాఁగను జీరుకుపాటునా... స్ఖలన సమాఖ్యయై వెలయుచుండు" అని యున్నది. కాబట్టి 'వేదం'వారి పాఠము తప్పు.

౪౮. 'గగ్గులకొండ్రు'

సూ.ని. 'గగ్గులకొండు' క్రింద, 'పారిజాత' పద్యమును,—

"సీ. తలలువీడంగ విద్యాధరు ల్పఱచిరి,
గగ్గులకొండ్రి ఖచరవరులు" (ఎ.38)

అను పాఠముతో చూపినది.

పండితులచే సరిచూడబడి, పి.వి. రామయ్య అండ్ బ్రదర్సు వారిచే ప్రకటింపబడిన ప్రతిలోను, వేదం-వారిచే పరిష్కృతమై - ముద్రితమైన ప్రతిలోనుగూడా,—

"గగ్గుల-కొండ్రిరి"

అని యున్నది. 'కొండ్రిరి' యనుట ముమ్మాటికిని తప్పే. అయినప్పుడు, "వేదం-వారి ప్రతిలో 'కొండ్రిరి' యని, అపముద్రితము" అని సూ.ని. తెలిపియుండవలసినదే గదా? ఏల తెలుపలేదు? వేదం-వారిదే సరియైన పాఠమనుకొని తప్పుత్రోవత్రొక్కు-వారి గతి యేమి?

౪౯. 'చెంచుముల'

సూ.ని. "చెంచుముల మూఁకొరుఁడు = చెంచుదుర్గమును కొల్ల గొట్టినవాఁడు - బిరుదవిశేషము" అనిచెప్పి, అందుకు,—

క. "చెంచుమలచూఱకొరున
కంచితకరుణాతరంగితాపాంగునకున్"

అను, (నైషధ. 1-42) పద్యము నిచ్చి, ఆ ప్రక్కనే— "చెంచిమల ఆని వేదం-వారి పాఠము" అని సూచించినది. కొని, 'చెంచిమల' 'అనియే కాదు; కాశీఖండములో,— 'చెంచూమలచూరకొర' యనియు నున్నది.

"అభ్యంచిత దయూధురంధర
చెంచూమలచూరకొర చిరపుణ్యనిధీ" (3-247)

మరియు, హరివంశములో - 'చెంజిమలచూరకొర' అని యున్నది.

"చెంజిమలచూరకొర ధ
నంజయసమసత్త్వ" (పూర్వ. 7. ఆ.)

సూ.ని. యెరుగునా? యెరుగదా? ఎరుగకపోవుటగాని, ఎరిగి యున్నచో ఆ రూపములను చూపకపోవుటగాని తగునా?

మరి, 'చెంచుదుర్గ'మని సూ.ని. చెప్పిన యర్థము చెంచిమల; చెంచూమల; చెంజిమల-అను రూపములయందును సిద్ధించునా?

౫౦. 'గోవుకోడె'

సూ.ని. 'కోడె' యను పదముక్రింద, వరాహపురాణములోని సీస పాదమును,—

"ఆదిశాక్వరము విహారంబుసలుపు నీ
కొండచెంపల గోవుకోడెవోలె" (౬.౨౭)

అని యుదాహరించినది.

'గోవుకోడె' అనుట తప్పు. 'గోవకోడె' అనవలెను. 'గోవ' అనగా మనిషిమచ్చికలేని అడవిపసరము (= అసాధువు) అని యర్థము. నెల్లూరుమండలమున సముద్రపుటొడ్డున ముత్తుకూరుప్రాంతపు టడవులలో, అడవియావు లున్నవి. వాటిని గోవావులు (గోవ+ఆవులు) అందురు. ఆవి మనుష్యుల కలవికావు. ఎట్లో పట్టితెచ్చినను మచ్చికపడవు. గోవ = పొగరుబోతు అని, సూ.ని. లోనే యున్నది.

౫౧. 'జిడ్డి'

శ.ర. లో, 'పాలకి' క్రింద, శృం. నై. పద్యము. (౭-౧౪౫)

"పాయు తొలంగుమం చుభయపార్శ్వములక్ బగళంబుసేయుచుక్
దోయజలోచనల్ గొలిచి తోఁజనుదేరఁగఁ బెండ్లికూఁతు ర
త్నాయతవైభవస్ఫురణ నంతిపురంబున కేగుదెంచెఁ బె
డ్డాయఁగ దిద్దివైచిన కడానిముసుంగు పసిండిపాలకిక్"

అని యున్నది.—

వే. వే. శాస్త్రిగారు,— 'దిద్దివైచిన కడానిముసుంగు' అను శ.ర. పాఠమును గ్రహింపక,- 'జిడ్డివైచిన కడానిమెఱుంగు' అను పూర్వముద్రణ పాఠమును గ్రహించి,—శ.ర. ను చూచుకొని, 'జిడ్డి = మోటువస్త్రము'— అని యర్థము వ్రాసినారు.

సూ.ని. 'జిడ్డి' క్రింద, శాస్త్రిగారిపాఠమునే యిచ్చి,— 'జిడ్డి = మోటువస్త్రము' అనియే అర్థము చెప్పినది. చక్రవర్తిగారి పెండ్లికూఁతురు వచ్చు 'కడానిమెఱుంగు పసిండిపాలకి' మీద నేమి! మోటుగుడ్డ వైచుట యేమి! అని యాలోచించనైనను లేదు.

(ముసుంగు; మెఱుంగు)

ఆది యట్లుండఁగా.— శాస్త్రిగారి పాఠమున అర్థము సరసముగా లేదు. ఏమనగా:— కడాని = మేల్మిబంగారపు, మెఱుంగు = మెఱుఁగగల, పసిండిపాలకిక్ = బంగారుపాలకియందు - అని వారి పాఠమున నర్థము. ఆ యర్థమున 'బంగారము' రెండుమార్లు వచ్చుటచేత *పునరుక్తి

---

* వీ.బ్ర. గారు,— పల్లకీ సామాన్యపుబంగారుతో చేయబడిన దనియు, దానికి కడాని (= మేలిమిబంగారపు) మెఱుగు పెట్టబడినదనియు అర్థము చెప్పినారు.

బంగారుపనివిషయమున వారిమాటకు విలువయియ్యవలసినదే; కాని, బంగారును అట్లు రెండుమార్లు చెప్పుటకంటే, పసిడిపాలకిమీద, కడాని (= బంగారు సరిగెఁగల) ముసుగు వేసినట్లుచెప్పుట సరసమనియు, మేల్మి బంగారు మెఱుగుగల పసిఁడిపాలకిమీద - 'మోటుగుడ్డ' కప్పినట్లు చెప్పుట అనుచితమనియు, అందువలన 'కడాని ముసుంగు' పాఠమే గ్రాహ్యమనియు నా యభిప్రాయము.

యేర్పడుచున్నది. మహాకవి శ్రీనాథుడట్లు నీరసపుగచనచేసియుండు ననుకొనుట భావ్యముకాదు.

'కడాని ముసుంగు' పాఠమున ప్రసక్తిదోషము తొలగును. కావున ఆపాఠమే గ్రాహ్యము.

(దిడ్డి ; జిడ్డి)

'దిడ్డివెచిన' - 'జిడ్డివెచిన' అను పాఠములు రెండును సరియైనవి కావు.— 'దిడ్డివెచిన' అని సరియైనపాఠము.

'దిడ్డి' యనగా, పాలకి మొదలగు వాహనములవాకిటికి అమర్చి యుండు పరదా.

"దిడ్డి - A little door, as of a palankeen" (బ్రౌను.)

శ.ర. లో, 'దిడ్డి' క్రింద, ఈ పద్య మున్నది.—

"నునుఁబెడి కొవిచెఱఁగులఁ
బనుపడియెడి దిడ్డితోడిపల్లకి కదలెఁ" (య. శ. ఆ.)

'దిడివెచు' అనునది జానుతెనుగు పలుకుబడి. శబ్దపల్లవము. దాని నల్లే వాడవలెను. ప్రాచీను లల్లే వాడియున్నారు. పాలికి మొదలగువాని వాకిలికి పరదా అమర్చుట - అని ఆ పలుకుబడి యర్థము.

(1) "పెడిపాలకీ, నప్పువుఁబోఁడినుంచి మెఱుఁగారెడు బంగరుప్రాత పచ్చడం బొప్పుగ దిడ్డివెచికొని యుబ్బుమెయిం గొనిపోయెఁ నింటికిఁ" (పరమ. తి-కై)

బంగరుప్రాతపచ్చడంబు - దిడివెచికొని, అనుటవలన పల్లకివాకిటి కడ్డముగా సమర్పబడునది *వస్త్రమని యేర్పడుటలేదా?

---

* "దీ. పి. శాస్త్రిగారు 'జిడ్డి'ని - దిడ్డిగా' మార్చుటయును, 'పరదాగుడ్డ' యని లేనియర్థమును కల్పించుటయును, ఆకల్పనతో సూ. ని. నాక్షేపించుటయును 'దప్పు' గాదందురా? 'దిడ్డి'కి 'పరదాగుడ్డ' అని యర్థమునుజెప్పుట తప్పు" - అని పి. బ్ర. గారి ప్రసంగము.

ఆ ప్రసంగ మజ్ఞానమూలకము. అది యట్లుండగా, వారు, 'జిడ్డి' యనగా— ఏనుగులు, గుఱ్ఱములు, పల్లకీలు మొదలగువానిపై - నుత్సవ

(2) "తగు వాహనముల నంతఃపుర కాంతల
నిడి దిడ్డులపైంచు హొగ్గడులును." (కళా. ఆ-ఆర్)

సూ.ని. ఈ రెండుపద్యములను 'దిడ్డి' క్రింద ఉదాహరించినదేగాని, 'దిడ్డి' యొక్క అర్థమును సరిగా తెలిసికొనినూ లేదు; 'దిడ్డిపైచు" అనునది రూఢమైన పలుకుబడి - యని గ్రహించనూ లేదు. "దిడ్డి = పాలకి మొదలగువాని ద్వారము" అనిమాత్రమే వ్రాసినది.

పై పద్యములురెండును 'దిడ్డిపైచు' అను క్రియకు చూపబలసినవిగాని, 'దిడ్డి'కి చూపబలసినవి కావు.

(3) "తొట్టుకొని సంజకెం ప
ప్పట్టున రవిఁబాసి సితగభస్తి నెదురుకో
నట్టె సిరివచ్చుటకునై
పట్టిన కెంబట్టుదిడ్డిపాలకిఁ బోలెఁ-" (రామా. 2-92)

కెంబట్టుదిడ్డిపాలకి, అంటే, ఎఱ్ఱ పట్టుపరదాగల పాలకి - యని యర్థము. అంతేగాని, ఎఱ్ఱని పట్టువాకిలిగల పాలకీ-అనికాదు.

సమయములలో - కప్పను, "ముఖముల్ - లేక పట్టువస్త్రములపై జరీబుటేదారిపనిగల దళసరివస్త్రము" అన్నారు. దానినే సటు, శ.ర. 'మోటువస్త్ర' మన్నది.

ముఖముల్ వస్త్రమును, జరీపనిగల పట్టువస్త్రమును 'మోటువస్త్ర' మని యెవడైనా, 'మోటువా' డనవలసినదేగాని, శ.ర. యనునా?

వీ.బ్ర. గారు, "పట్టువస్త్రములపై జరీబుటేదారిపనిగల దళసరి వస్త్రము" అన్నారే! 'పట్టువస్త్రములపై...దళసరివస్త్రము' అంటే అర్థ మేమో?

మరియు వారు, — "పైడాయఁగ జిడ్డిపైచిన. పై అనగా పల్లకీపై నని యర్థము" అన్నారు. వే. వే. శా స్త్రిగారు, — "డాయఁగఁ = దగ్గఱఁగా" అన్నారు.

'పల్లకీపైఁ - దగ్గఱఁగా - మోటువస్త్రము వైచుట' యనసేమో బ్రహ్మాండగారే సెలవియ్యవలె.

కొబట్టి శ.ర. యును, అచ్చే సూ.ని. యును - 'దిడ్డి' పాలకి మొదలగు వాని వాకిలి - అనుట సరికాదు.

మనకు ప్రకృతమైన శృం. నై. పద్యమున,— *"డాయఁగ దిడ్డి వైచిన కడానిముసుంగు పసిండిపాలకిఁ" అను పాఠమున,- 'డాయఁగఁ - దిడ్డివైచిన = వాకిటికి కొంచెము అడ్డముగా పరదావేసినదియు, కడాని ముసుంగు = బంగారు జరీపనిగల అవగుంఠనము కలదియు - నైన, పసిండి పాలకిఁ' అని యర్థము.

'దిడ్డివైచు' అను పలుకుబడితోడి ప్రాచీనరచనలను చదువుకొనియు, సూ.ని. ప్రాచీను లెవ్వరును వాడనిదియు, అనుచితార్థము నిచ్చునదియు నైన- 'జిడ్డివైచిన' అను అసాధుపాఠమును కైకొనుట పొరపాటు.

('పాయదొలంగుఁడు')

'పాయు తొలంగు మంచు' అన్న శ.ర. పా. సరికాదనిచెప్పి, వేదంవారు,— పాయదొలంగుఁ డంచు' అను పాఠమును తీసికొని,— ''పాయ = పాయలుగా, తొలంగుఁడు'' అని టీకవ్రాసినారు.

'పాయదొలఁగు' అని యేకపదక్రియగా తీసికొన్నప్పుడు, 'పాయ = పాయలుగా, తొలఁగుఁడు' అని యర్థముచెప్పుట సంప్రదాయము కాదు.

---

* డాయఁగవైచు యనగా దగ్గరికి వేయుట (కొంచెముగా మూయుట) - 'తలుపుదగ్గరికివెయ్యి' అను వ్యవహారము సర్వజనవిదితము.

''తలుపు దగ్గఱమూయఁ దడవయ్యె'' అని, నవనాథచరిత్ర ప్రయోగము. (పుట. 155)

'దగ్గర' అనగూడదని నన్నాక్షేపించుచూ, వీ.బ్ర. గారు నోరు ఎక్కువగా పోగొట్టుకొన్నారు. (చూ. 12-12-49) త్రిలిఙ్గ)

'దగ్గర' అను వాడుకయు కలదనిచెప్పి, అందుకు ప్రామాణ్యమును ప్రమాణముగా చూపినాను. వారు మరల నోరెత్తలేదు.

తెనుగుమాటలుకూడ సరిగా నెరుగనివారు సాహిత్యవిమర్శకులగుట - భాషాదౌర్భాగ్యముగదా!

'పాయు తొలంగుమంచు' అన్న, శ.ర. పాఠమే సరియైనది. ఆ పాఠమున 'పాయు' ; 'తొలఁగు' వేర్వేరుపదములు. ఆ క్రియల నట్లు వేరు వేరుగావాడుట శ్రీనాథమహాకవికి పరిపాటి. ఆ పరిపాటి తిక్కన-నాచన సోమనాథాదులనాటికే యున్నది. వరుసగా ఉదాహరిస్తాను.

(1) "బెరసి భద్రమహాకాళిభృంగిరిటులు
పాయు బగళాంబు తొలఁగు విచ్చేయుఁడనుచుఁ
బార్శ్వములయందు మిగుల నార్భటము సేయ" (భీమ. ౫-౭౫)

(2) "వేత్రహస్తులు, తలండు పాయుండు దొలంగుం డనుచు సండడి నెడఁగలుగఁజేయ" (హర. 4-92)

(3) "పాయు తొలంగు మంచు బెట్టాడెడుమాట లుప్పతిలె"
(ఉ. హరి. 1-123)

(4) "పాయు తొలంగుమం చాయతవేత్రహ
స్తులమొత్త మేలొకో తోడరాదు" (భార.విరా. 1-186)

ఇట్లు భారతరచనాకాలమునుండి శ్రీనాథునివరకును,— పాయు, తొలంగు,—అని వ్యస్తముగా వ్యవహృతమైన పలుకుబడిని 'పాయతొలంగు' అని, యేకపదక్రియగామార్చుట ప్రమాదముకాదా?

మరియొక విశేషము : నూ.ని. నైషధపద్యము నుదాహరించుటలో-ఈ ప్రారంభచరణమును వదలివేసినది. భాషకు, ముందుకాలమున-పరమ ప్రమాణము కావలసిన పెద్దనిఘంటువు, అట్లు చేయవచ్చునా? ఆ చరణ మును సైతము గ్రహించి, 'ఇందులో పాఠభేదమున్నది. ఇది, శ.ర. పాఠము; ఇది, వేదంవారి పాఠము; ఇది ఒప్పు; ఇది తప్పు' అని సప్రమాణముగా నిర్ణయింపవలెగాని, అట్లు నిర్ణయించుటకు పాలుమాలి—ఆ చరణమునే మాటుపరిచి, దాటిపోవచ్చునా?

నూ.ని. అట్టిపని మరియొకతావునగూడా చేసినది. చూడండి. 'జమా ఖరుచులు', 'దినవహి' అను పదాలకు 'హంసవింశతి'నుండి ఉదాహరణ చూపవలసివచ్చినది : ఆ ఉదాహరణపద్యము అచ్చుప్రతిలో ఇట్లున్నది.

"అనుపుగ మిన్ననుం గడితెపాలితమందిర గట్టిపెట్టి శో
భనగతి నంప్రదీప్తులసం కి జుమూపుమణించి యిం
పనుగొని కొలసాగ నయ్యెడ దప్పుము లీల్ప లిఖించినట్లి యూ
దినవసి లేఖవ్రాలనడగి చెల్విగ జుక్క-లుపర్వె నత్తెఱిన్"
(1-142)

ఈ పద్యమున,— 'మిన్ననుం గడితెపాలి' అనుటలో అర్థ మేమో సరిగా నేర్పడుటలేదు*

అంగర్లు, సూని. ఆ పాదమును చిల్లగా తొలగ్రోసి, ఆ రెండు పదములఁ జెందను,— "ని...శో, భ్రగతల.....న ర్హఱిన్" అని, తక్కిన మూడుపాదములను సూత్రమే ఉదాహరించి చూపుకొన్నది. మరియు, ర్వ్. ఏం. ఆనుబంధములో 'గట్టి' ఁ జెంద గూడా,—

---

* ఆ పాదమున కర్థము సరిగా నేర్పడుటలేదు.—అని నే నన్నందుకు నా యుపాండిత్యమును దెలియఁజేయుమని, 'కవిరత్న-కవి-పీరబ్రహ్మం'గారు, తమ పాండిత్యము నిట్లు చెల్లడించుకొన్నారు.

"పద్యము సరిగానే యున్నది. వారి కేల యర్థము కాలేదో? అందులకు నిఘంటువు లేమి చేయుగలదు? పద్యములకు నిఘంటువులు ప్రతి పదార్థములను బ్రాయవుగదా? అయినను, వీ.పి. శాస్త్రిగారి కర్థము కాలేదన్న యీ పద్యమును దిలకింపుము.—

"అనుపుగ మిన్ననుం గడితెపాలితమందిర గట్టిపెట్టి"—

ఈ పద్యమున 'పాలి' అనుచోట నాయొద్దనగల ముద్రితప్రతిలో 'పాలి' అని యచ్చుపడితే పొల్లుకు-టిమాత్ర మెయున్నది. మిగిలినభాగమంతయు సరిగానే యున్నది.— ఇక దీని యర్థమును చిలగింపుము.

అనుపుగ = చక్కగా, మిన్ను + అను = ఆకాశమనియెడి,— ద్రుతముమీద దిగి కొన్నియెడల 'న' కారము వచ్చుననుటను బట్టియు, ద్రుతసూచకు బదులైన పరుషములకు సరళములు రాగా సందలి ద్రుతము అనగింపుగా పూర్ణబిందువో యనుస్వారమో వచ్చుటను సూత్రమునుబట్టియు "మిన్ననుం గడితెము"గా నైనది. దీని పదవిచ్ఛేద మిట్లుండును.

"చ...తమంబున గట్టిపెట్టుఁగో, భవతీర... నత్తెఱిఁ"

అనియే యుదాహరించినది. ఆక్కడను తొలిపాదమును పూర్తిగా నియ్యలేదు. ఎందువల్లనో పాఠము సరిగా లేనందువల్లనే.

సందేహాస్పదములగు పాఠములలోనికి పోక చాలుపేయువాఁడుక నూ.ని. కి ఉన్నది. ఇంకొక్క యుదాహరణము.—

వేదంవారి 'సారంగ' ప్రతిలో (౧-౪౭) పాఠము.—

"క...మీ రాయి త్తపడి వెసఁ రండనుచుఁ
జనవరులఁ జనవరులఁ
మన సరలఁ దొరల ననిపి మహిపతి చానుఁ,"

అని యున్నది.

'మనసరలఁ' అంటే అర్థమేమో నాకు తెలియలేదు. అందువల్ల ఆ పాఠము సరియైనదికాదని తోచి, నూ.ని. లో, సరియైనపాఠము నిర్ణయింప బడియుండు ననుకొని, ఆదరబాదర ఆ గ్రంథమునెత్తి 'ఆయి త్తపడు' క్రింద చూతుగదా యేమున్నది? 'క...మీ రాయి త్తపడి వెసఁ రండనుమిఁ'

మిన్ను + ఆను + న్ + కడితము = మిన్ననుంగడితము. కడితపు + ఆళి = నీలపు పుటలుగల లెక్కలపుస్తక మనుదాయమును, తెనుంబుడఁ = చీకటిచేత, కట్టిపెట్టి = కట్టివెచ్చి...అని యర్థము. అన్యదేశపదములలోనుండినను సలక్షణముగానున్న యీ వర్ణన దీ. పి. శాస్త్రిగారి కర్ణముగాకపోతే నూ.ని. యేమి చేయగలదు? వీరి కర్ణము గాలేదని నిఘంటువులు ప్రతిపదార్థములను వ్రాయవుగదా?"—

వారి వ్రాతఅంతయు తప్పులకుప్ప. అనాత్మజ్ఞులైప్రయు క్తులెక్క, వీ. బ్ర. గారి వీరాలాపముల సంచయించి, వారి వ్రాతలోని గోపములను మాత్రము సంగ్రహముగా మనవిచేస్తాను.

ధాతుజవిశేషణమైన 'అను' లోని 'ను' ద్రుతమనుట మొదటితప్పు. ఆ ద్రుతముమీద మఱియొక నకారము వచ్చునుటయు, ద్రుతకార్యాది ప్రసంగముచేయుటయు రెండవతప్పు.

N.B.:— వారు చదివిన వ్యాకరణములో 'అను' లోని 'ను' ద్రుతమే. అందువల్లనే, వారు తమ వ్యాసములలో,— 'అను భూతార్థకపి

అన్నంతవఱకే యున్నది. నా కెక్కడ సందేహమో, ఆ నిఘంటువుకు అక్కడనే ఆనుమానము. అందువల్ల పద్యములోని ఆ భాగముజోలికిపోక, అవతలిది అవతలనే సర్దుకొన్నది. ఇట్టి వింకను గలవు. మచ్చు కొకటిరెండు చూపినాను.

అడిగినంత అర్థము; కావలసినంత గ్రంథసామగ్రి; అఖండమైన పాండిత్యము; దిగ్దంతులవంటి విద్వత్పరికొండులతోడ్పాటు కలిగి, భ్రాంతిక భాషాగతశబ్దీకృతో — పాఠనిర్ణయము; శబ్దనిర్ణయము; అర్థనిర్ణయము — చేయుటకే పూనుకొన్న నూ.ని. వంటి బృహన్నిఘంటువు చేయదగినపనేనా? అది. గట్టిగా పరిశీలింపవలసినపట్టులలో తొలగదోసికొనిపోవు నిఘంటువులవలన లోకమున కేమి యుపయోగము?

ప్రయోగంబున'; - 'మిశ్రమ (?) సమాసమును బేర'; - అను బ్రశ్నకు' అని ద్రుతకార్యముచేసి వ్రాసియున్నారు.

'పుస్తకసముదాయమును చీకటిచేత కట్టివెచి' యనుట అర్థశూన్య ప్రసంగము. అది మూడవ తప్పు.

పుస్తకము తెరచియున్నచో అందలి యక్షరములు కనబడునుగాని మూసి-కట్టివేసినచో కనబడవు. ఈ చిన్న సంగతి తెలిసికొనుటకు 'కామన్ సెన్స్' చాలును; పాండిత్య మక్కరలేదు. 'కవిరత్న-కవి' బిరుదాంకితులును, మహాపండితులును అయినవారు ఇంతమాత్రము నాలోచింపక, 'లెక్కలపుస్తక సముదాయమును కట్టివెచి' యని యర్థము చెప్పుట నాల్గవ తప్పు.

'గట్టిపెట్టు'అను క్రియాస్వరూపము నెరుగక 'కట్టిపెట్టు'గా భావించి, అసందర్భపు అర్థముచెప్పుట అయిదవ తప్పు.

తమకు పరమప్రమాణమైన నూ.ని. 'గట్టిపెట్టు' అన్న పాఠమును గ్రహించియుండగా, తద్విరుద్ధముగా, 'కట్టి - పెట్టి' అనుట ఆరవతప్పు.

'మూడు మాటలు — ఆరు తప్పులు' అన్న సామెతకు తార్కాణగా నున్న యీపాటి పాండిత్యముతో, విమర్శలకు దిగుటయు ఇతరులను వెక్కిరించుటయు ఏడవతప్పు.

※౨. 'తీఱు'

ఈ క్రిందివి, 'వేదం'వారి 'సారంగధర'నుండి సూ.ని. కెక్కిన యపపాఠములు.

సూ. ని. 'గీఁటు' క్రింద,— *"ముచ్చటఁదీఱునట్లుగా" (సారంగ. ౧-౧౧)అనియు, 'నిఱుపేమ' క్రింద,-"కాంక్షలుదీఱ" (౧-౧౩౦)అనియు ముద్రించినది.

కాంక్షలుతీరు; ముచ్చటతీఱు - అనునప్పుడు 'తీఱు' అను క్రియలోని రేఫము లఘువు. సూ. ని. లో 'తీఱు' క్రింద లఘురేఫముతోనే చూపబడి యున్నది.

వేదంవారి ప్రతిలో గురురేఫముతో నున్నందున, సూ.ని. అపరిశీలితముగా ఆపాఠముల నట్లే కైకొన్నది.

※౩. 'ఓర్చు మెఱుంగక'

'ఆర్చు' క్రింద,— "ఓర్చు మెఱుంగకంటి" (౨-౧౨౫) అని యున్నది.

"ఓర్చుమెఱుంగకంటి" అని యుండవలెను.

※౪. 'కాఁలెనుపోతులు'

సూ. ని. 'దోఱు' క్రింద,— "మడిసెక్కఁగాఁలెనుపోతులు" అని యచ్చువేసినది తప్పు.

'కాఁలెనుపోతులు' అని యుండవలెను. సూ.ని. లో కకారము క్రింద 'కారుదున్న'; - 'కాఁలెనుము'; - 'కారుపోతు' అని లఘురేఫముతోనే యున్నది.

※౫. 'విన్నఁగన్నఁ జోద్యము'

సూ.ని.— 'డబ్బు' క్రింద,—

---

* 'దీ'కు ముందు అరసున్న యుండరాదు. శాస్త్రిగారి ప్రతిలో లేదు.

"ఎంతసేసినది సేఁడిది విన్నఁ గన్నఁ జో
ద్యముగాదె మఱి దబ్బుదబ్బిన నిటు
వలె నుండవలె" (3-వం)

అన్నది సరికాదు.

"ఇది విన్న కన్న చోద్యముకాదు" అని సరియైన పాఠము.

ఈ చోద్య మెన్నఁడును విన్నదీకాదు; కన్నదీకాదు.-అని కవ్యుద్దిష్టార్థము. లోకోక్తి కనుసరణము.

ఈ పలుకుబడికి ప్రయోగాంతరములు.—

(1) "తత్తనూ, విలసనమెన్నఁ గన్నదియు విన్నదిగా దిలలోన"
(విజయ. 1-186)

(2) "వెనుక నెచ్చోటనెవ్వారు విన్నదియును
గన్నయదియునుగాక లోకములెల్ల
నతిశయించిన సచ్చరితాద్భుతమున
కాకరంబైన దీ యిగురాకుఁబోఁడి" (నాసికే. 2-149)

(3) "ఆగఱుపతనంబులాగు లేగరితలందును మున్నుకన్న విన్నవియె? దీని కఱుకు లెంత యరుగులు" (ప్రభా. 3-52)

౫౬. 'అలవెనయంగజారుల'

'నగ్గుసేయు'— అను పదముక్రింద,— "అలవెనయంగజారుల" (ఁ. ఁ-ఁ) అని సూ.ని. పాఠము.

'అలవెలయంగ'— అని సరియైన పాఠము.— (చూ. వివరములకు, 'వితకాశ', పుట. ఁఁవ)

౫౭. 'ఆధన్యుఁడు'

'చొప్పదు' క్రింద,—

"ఆధన్యుఁడు కాడన్యుఁ డ
సాధారణుఁ డతఁడు సైపసన్నిధి నతనిఁ
శోధనచేసినఁగాక, య
శోధన యొండొకటి దలఁపఁజొప్పడ దింకఁ" (3-శ)

అని, నూ.ని. పాఠము.

'బోధన్యుఁడు'; - 'దైవసన్నిధినివగఁ' అని సరియైన పాఠము.
(చూ. 'జితకాశి' పుట. 38౭)

౫౮. 'అతనిఁ'

'తోఁచు' క్రింద,— "దప్పి నివారించి యలంతఁదీర్చి యతనిం బెంపొందఁగాఁ జేయుచుఁ" (3-౧౯౪) అని, నూ.ని. పాఠము.

"అసువుల్ పెంపొందఁగాఁ జేయుచుఁ" అని సాధుసాఠము.

౫౯. 'కరచరణాదులకొజ్జ'

'ఆజ్ఞ' క్రింద,— "ఆయ్యజ్ఞుని కరచరణాగుల కొజ్జ" (3-౩౧) అని, నూ.ని. పాఠము.

ఆజ్ఞ (= నఱుకవలసినదన్న యుత్తరువు) సారంగధరుని, కరచరణములకే - గాని, ఆసులకు (= నడుము, కంఠము మొదలగువానికి) కాదు. కావున నూ.ని. పాఠము తప్పు.

"ఆ,య్యజ్ఞుని కనిఁ గరచరణం, బొజ్జ"
అని సరియైన పాఠము. (చూ. 'జితకాశి' పుట. 3౮౧)

౬౦. 'సారంగధరుఁడు'

'నుసులు' అను పదముక్రింద, నూ.ని.,—

"మధుఁడు సారంగధరుఁడు మన్మగఁడు శిఖుఁడు
వసులపాఁతరలై వీరు నుసులనీయ
నెటుల నిటు తాళఁగలదని యెఱుఁగవైతి" (అ. ౧౭౫౫)

అను పాఠముతో ముద్రించినది.

'సారంగధరుఁడు'; 'ఎటులనిఁక' అని సరియైన పాఠము. (చూ. వివరములకు 'జితకాశి' పు. 3౪౫)

ఇది పాఠ పరామర్శ.

సాహిత్య సమీక్ష

— తెలుగు నిఘంటువులు —

అర్థపరామర్శ

పూర్వప్రకరణమున తెలుగు నిఘంటువులలోని పాఠ ప్రమాదములు కొన్ని చూపబడినవి. ఇందు, అర్థప్రమాద ములు కొన్ని చూపబడుచున్నవి.

1. నీరుపదును

శ.ర. లో, "నీరుపదును = కొంచెపు పదును. సీ. ఘుమఘుమాధిక రుతాకుంఠితాంభోరాశి, నిజసాయకమునకు నీరుపదును. చంద్రా. ౧. ఆ."— అని యున్నది.

నూ.ని. "నీరుపదను = కొంచెపు బదను. ఘుమఘుమా...నీరు పదను. చంద్రా. ౧-౨౧" అన్నది.

'పదును'ను 'పదను'గా మార్చడము; 'కొంచెపుపదును'ను 'కొంచెపు బదను' అని సంస్కరించడము; ఆ సీసపద్యమునకు సంఖ్యను చేర్చడము తప్ప 'నీరుపదును' విషయమున, శ.ర. కంటెను, నూ.ని. చెప్పిన విశేష మేమీ లేదు.

'కొంచెపుపదును' అన్ననూ, 'కొంచెపుబదను' అన్ననూ మొత్తము మీద అర్థమొకటే. ఆసలా యర్థము తప్పు.

అంభోరాశి; నిజసాయకమునకు, నీరుపదును = కొంచెపుపదును - అనుటలో అర్థములేదు. సముద్రము, బాణమునకు పదు నెన్నటికిని కాదు.

శ.ర. కర్త, నూ.ని. కర్తలుగూడా పద్యమును పూర్తిగా చదివి, అర్థము వాలోచించినట్లు లేదు.

పద్య మిది:—

"పెళపెళ రవభగ్న భీమకోదండంబు భృగురాము వింటికిఁ బిలుపుదీము
ఘుమఘుమాధికరుతాకుంఠితాంభోరాశి నిజసాయకమునకు నీరుపదును
కిలకిలధ్వని విశృంఖల రావణశిరోధి యాత్మబాహా ప్రతాపాగ్ని కరణి
కహకహోత్త సుబాహుఘనశిరఃఖండంబు కరలాఘవమునకు బిరుదుఘంట."

ఈ పద్యమున, భీమకోదండము - పిలుపుదీముగను, అంభోరాశి - నీరు పదునుగను, రావణశిరోధి - అరణిగను, సుబాహుశిరఃఖండము - బిరుదు ఘంటగను రూపింపబడి యున్నవి. మరి, ఆ రూపకములలో నొకటియైన 'నీరుపదును'కు, 'కొంచెపుపదును' అని యర్థముచెప్పుట యెట్లు సరిపడును? సరిపడనే సరిపడదు.

కాబట్టి 'శ్రీరాముడు-తన సాయకమునకు, నీరుపదును పెట్టుటకుగా వాడిన, *ఉప్పునీటిగుంట - అంభోరాశి' అని అక్కడ అర్థము చెప్పవలెను.

---

* ఉక్కుతో చేయబడు కత్తులు, కటారులు మొదలగు ఆయుధములను కొలిమిలో కాచి వాదరలను చక్కగా చరిచి, వేడిమీదనే నీటిలో ముంచుదురు. (అందుకుగాను, కొలిమియొద్దనే చిన్న గుంటత్రవ్వి నీటితో నింపియుంతురు) అట్లు ముంచుటను 'నీరుతాపుట' అందురు. నీరుతాపుటచేత వాదరకు గట్టిదనము, పదును వచ్చును. నీరులో ముంచినట్లే, చమురులో ముంచియు, పదునుపెట్టుట కలదు. వేడివాదరమీద పొట్టేటికొమ్మును రాచి - దాని చమురుచేతే పదునెక్కించు పద్ధతియు కలదు.

ఆయుధమునకు పదును (Temper) ఎక్కించుటను సంస్కృతమున "పాయనసంస్కార" మంటారు.- అది మూడువిధములు :

సుశ్రుత శల్యతంత్రములో, శస్త్రపాయనములు - (Tempering) వాటి ప్రయోజనములు—అను (40) ప్రకరణమున ఇట్లు చెప్పబడియున్నది:—

"తేషాం పాయనా త్రివిధా క్షౌరోదక తైలేషు." (వ్యా.-పాయన మనగా త్రాగించుట. ఇది క్షౌరజలతైలము లనువానిచే 3 విధములు.)

నీరుపదునులోను, మంచినీటిపదునుకంటే, ఉప్పునీటిపదును శ్రేష్ఠమట.

ఆయుధములను కొంచి నీటముంచి పదును పెట్టుట కలదనుటకు,—

*"సరగ మిన్ననుకమ్మరి సంజకొలిమి
పెట్టుగాఁ గాఁచి ♦బంగారుచుట్టువాలు
పదను పెట్టఁగఁ గొనిపోయి పట్టలేక
విడిచెనఁ బ్రొద్దు పడమటికడలి మునిఁగె" (యయాతి. అ-శ.)

శ.ర. కర్త 'నీరుపదును' అనుపదము 'నీరెండ'వంటి దనుకొన్నాడు, అందువల్లనే 'కొంచెపుపదును' అని యపగ్రము చెప్పినాడు. కాని, నీరెండ= ఈరెండ, అని యున్నట్లు నీరుపదును = ఈరుపదును, అని లేదు. కావున శ.ర. చెప్పినయర్థము తప్పు.

'కొంచెపుఁబదను' అనకక్కరలేదు. ఆగమశాస్త్ర మనిత్యము కావున 'కొంచెపుపదను' అన్నను తప్పుకాదు.

మరియు, 'పదును' అను పదమును 'పదను' అని మార్చవలసిన అక్కరయు లేదు. ఎందువల్లననగా—మిక్కుటము, మిక్కుటము; నిలకడ, నిలుకడ; నడమ, నడుము; చెఱుచు, చెఱుచు; పఱచు, పఱుచు; అదరు,

---

* ఈ పద్యము, సూ.ని. లో 'కమ్మరి' క్రింద నున్నది.

♦ "చుట్టువాలు-అనగా, ఆయుధము. యయాతిగ్రంథకర్త ఆయుధమును బంగారుదిగా చెప్పుట తప్పు. మిశ్రమ(?)లోహమైన 'ఉక్కు'ను గాచి నీటిలో ముంచిన పదునుగలుగునుగాని, సహజలోహమైన బంగారుకు పదును రాదు. మెత్తదనమే వచ్చును." అని వీ.బ్ర. గారి ఆక్షేపము.

ఈ యాక్షేపము 'కమ్మరి' చేయదగినదిగాని 'కవి' చేయదగినది కాదు. కవిదృష్టి వేఱు; కళాసృష్టి వేఱు. ఏని కవితావాసనలేని కమ్మరులకు, కంసాలులకు అంతుపట్టునది కాదు. వీ.బ్ర. గారు, 'చుట్టువాలు = ఆయుధ' మన్నారు. తప్పు. 'చుట్టువాలనగా - చక్రముగాని — ఆయుధము కాదు.

రామాయణమునను, చంద్రికాపరిణయమునను బంగారుబాణములు కలవనియు, కవులు మదనుని పూవుటమ్ములకును పదును పట్టింతురనియు, కాబట్టి బ్రహ్మంగారి యాక్షేపము సరియైనది కాదనియు, శ్రీ యేలూరి పాటి రామభద్రకవియనులుగారి మందలింపు. (చూ. 7-7-1947 త్రిలిఙ్గ)

అదురు - అని, యనేకశబ్దములకు రెండు రూపములు కనబడుచున్నవి. నేడు వ్యవహారమునన్న రూపము 'పదును'గాని 'పదను' కాదు. ఇట్లే 'అదను' వ్యవహారమున 'అదునుఁ'గా మారియున్నది. అంతేకాదు. పిడుక, పిడుచ, పిడుత-వంటి కొన్ని ఉకారమధ్యరూపములు 'పిడక, పిడచ, పిడత—అని ఆకారమధ్యములుగా' పరిణామమును పొందియున్నవి. నిఘంటువు తన కాలమున వ్యవహారసిద్ధములైయున్న రూపములను గ్రహించుట ధర్మము; మర్యాద. ఆ మర్యాద నెరిగినవాడు కావుననే శ.ర. కర్త 'పదును' 'పదను' అన్న రెండు రూపములను గ్రహించినాడు.

ప్రామాణికుడైన ఆ నిఘంటునిర్మాత చూపిన త్రోవనుబోక, వేరు త్రోవ త్రొక్కుటలో గుణ మేమి?

'కొంచెపుపదును'ను, కొంచెపుఁబదను - అని దిద్దిన సూ. ని. 'నీరు పదను'ను - 'నీరుఁబదను' అని దిద్దకపోవు టేల?

2. నీరుకావి

శ.ర. లో "నీరుకావి = కొంచెమెఱుపు" అని యున్నది. అంతే కాదు; "నీరు = అల్పము (నీరుకావి. మెు.)" అనియు నున్నది.

'నీరుపదును'లో జరిగిన పొరపాటే, ఈ నీరుకావిలోను జరిగినది.

శ.ర. లో జరిగిన పొరపాటును, సూ.ని. యథాక్షరము వ్రాసికొన్నది. ప్రమాదము.

కావి-యనగా ఎఱ్ఱరంగు; ఎఱ్ఱనిగుడ్డ. అది, నీరుకావి; చెంగావి; చంద్రకావి; చందనకావి; పట్టెడకావి; కదంబకావి-అని పలుతెరంగులు.-

"వ—చందనకావులును పట్టెడకావులును జెంగావులును గదంబ కావులును...అను పేళ్లుగల పుట్టంబులుగట్టుకొని" (ద్వ్యాశ్రయ. 3-206)

ఆ కావులలో, చెంగావి మొదలయినవి అద్దకపురంగులు. (చెంగావి లోను పాలచెంగావి; చిలువేరుచెంగావి అని దినుసుభేద మున్నది.)

'నీరుకావి' అద్దకపురంగు కాదు; చలినీట పలుచారు తడుపుటచేత, తెల్లనివస్త్రమునకు సహజముగనే యేర్పడు ఎఱ్ఱదనము. మనుచరిత్ర (3-71)లో,—

"బెడఁగారు నీర్కావిపింజతోడ"

అన్నచోట, కొ. అనంతాచార్యులవారు "నీర్కావి=నీళ్లలో నానఁ బెట్టి యుండుటచేతఁ గొంచె మెఱ్ఱదారుగల దోవతియొక్క" అని టీక వ్రాసియున్నారు.

శ్రీనాథమహాకవి, యీ 'నీరుకావి'నే, 'సలిలకాషాయ' మన్నాడు.

1. "నిర్మాల్భిలముగా నెఱి వీఁగు బొజ్జపై
సలిలకాషాయవస్త్రము ధరించి" (కాశీ. 7-186)
2. "కసటులోఁ దెలినీటఁ గడిగి యీటార్చిన
సలిలకాషాయవల్కలము గట్టి" (హర. 7-111)
3. "గన్నేరుఁ *బూచాయఁ గనుపట్టు జిలుఁగైన
సలిలకాషాయవస్త్రంబు గట్టి" (శృం. నై. 8-103)

"సలిల కాషాయవస్త్రంబు = నీర్కావిదోవతి" అని యర్థముచెప్పి, వే. వే. శాస్త్రిగారు, 'నీరుకావిని' గురించి యిట్లు వ్రాసినారు.

'నీరు = అల్పము—నీరుకావి' అని సీతారామాచార్యులవారు వ్రాసినారు. 'నీరెండ' అను వ్యవహారముబట్టి వారట్లు తలఁచియుందురుగావలయు. ఈ ప్రయోగముం జూడఁగా నీర్కావి శబ్దమునందును ♦నీరు-అనగా జలమనియే శ్రీనాథుని అభిప్రాయముగాఁ గానిపించుచున్నది. వస్త్రములకు నీటిచేతనే కావింబట్టించుట ప్రసిద్ధము. కావున నిట అల్పార్థకల్పన మనావశ్యకము." శృం. నై. సర్వంకషావ్యాఖ్య.

పై పద్యమును, నూని. 'గన్నేరు' అను పదముక్రింద చూపినది. శృం. నై. నుండి పద్యపాదము నెత్తి వ్రాసికొన్నదేగాని వ్యాఖ్యానమువంక కన్నెత్తి చూడలేదు. అందువల్ల నీరుకావిత త్త్వము తెలియలేదు.

---

* ఇది వేదం-వారి పాఠము. ఈ పద్యపాదమునే శ్రీ ప్రభాకర శాస్త్రిగారు, క్రీడా.పీఠిక. (పు. 18)లో, 'రబూఁజాయ' అను పాఠముతో ఉదాహరించియున్నారు.

♦ "సర్వత్ర నీరును జలమయముగా జెప్పరాదు" అని వీ. బ్ర. గారి దొక వ్రాత, (12 మే 1947 త్రిలిఙ్గ)
ఆది యర్థము తెలియని వ్రాత. నీరు జలమేగాని జలమయము కాదు.

సూ.ని.కి యేల తెలియలేదోగాని 'నీరుకావి' యను పదము తెనుగు దేశమున అబాలగోపాలవిదితము.

కం. వీరేశలింగంపంతులుగారి 'సంధి'లో, బ్రాహ్మణు డొకడు 'నీరు కావిదోవతి' పఱుచుకొని ఆ పంచెమోఁద శయనించును. అక్కడ 'నీరు కావి' అను మాటకు S.S.L C. (1949) Notes వ్రాసిన ముగ్గురుపండితులు:-

"నీరుకావి = తడిపిరడిపి నీడలో నాఱవైచుచుండుటచే గలుగు సెఱ్ఱరంగు" అనియు, ఐగుగురు పండితులు, "సంతతము నీటియందు ముంచుట చేత ఎఱ్ఱరంగుదాల్చిన వస్త్రము" అనియు అర్థము వ్రాసియున్నారు.

మరియొక విశేషము.—మడికి, ఆచారమునకు, నీరుకావి దోవతులే గాని, చెంగావి మొదలగు ఉద్దకపు రంగుగుడ్డలు యోగ్యములుకావు. అది వైదిక సంప్రదాయము. అందువల్లనే, కం.వీ. పంతులుగారు ఆ బ్రాహ్మణార్థపు బ్రాహ్మణుని పంచె 'నీరుకావిపంచె'గా చెప్పినారు.

ప్రాచీన కవులెల్లరును ఈ యాచారమును గమనించినవారే.—

(1) "కన్నె చెంగల్వ పూ వన్నె మించిన నీరు
కావిదోవతికట్టు కటిఁ దలిర్ప." (విక్ర. 7-143)

(2) "*కటిఁ బ్రాంతమునుకనీరాఁ-విదోవతిపంచె
భ్రూమధ్యమున నూర్ధ్వపుండ్రకంబు" (జై.భా. 7-191)

(3) "గన్నేరుఁబూఁజాయ కరమొప్ప నీరాఁ-వి
మడుఁగుదోవతి పిండెవిడిచికట్టి" (క్రీడా. పు. 14)

(4) "నిద్దమైన మడుంగునీరాఁ-విదోవతి
కనకమేఖలతోడఁ గటి ఘటించి." (కాశీ. 1-39)

నిరంకుశోపాఖ్యానమున, వైదికుఁడైన నిరంకుశుడు కామురుఁడై శృంగారవేషమును ధరించు ఘట్టమున.—

(5) "వదులునీరాఁ-విదోవతులు కట్టుటమాని,
వలిపెంపుఁజల్వ దోవతులుగట్టు" (2-16)

---

* ఇది వావిళ్ల వారిప్రతి పాఠము. "కటిమధ్యమున నీరుకావి" అని చి.ని. పాఠమట. సూ.ని. ఆ పాఠమును గ్రహించినది. కాని, వా.ప్ర. పాఠమే ఉచితతరము.

(6) "నీరుకావులుగట్టి నిక్షు దర్భలచేత
సవ్యాప సవ్యములు చల్లువాఁ"(రామ స్తవరాజము 2-74)

మనుచరిత్రలో,- 'బెడఁగారు నీర్కావిపింజె' తోడనున్న బ్రాహ్మణుఁను వైదికియే.

(7) "గడితంపు నీర్కావిమడుఁగు దోవికటి
రస్సురత్పీతాంబరంబుగ ఁగ" (పరాహ. ౯-౪౬)

ఈ 'నీర్కావిమడుగు గోవతి' కట్టిన యతఁడును వైదికియే.

అడిదము సూగకవి వైదికులను వర్ణించుచు,—

(8) "ప్రాత నీరుంగావి పంచెలు ముప్కాముల్
కనుపింపఁగా డొల్లుకచ్చగట్టి" (చాటువు)—అన్నాడు.

కాబట్టి ఆచారపరులైన వైదికులు ధరించు నీరుకావి దోవతులు రంగువేసినవి కావు.

ఒకమాట.—

సూ.ని. సూగకవి చాటువును 'డొల్లు' అను పదముక్రింద నుదాహరించియు,- 'నీరుంగావి' అను రూపమును గ్రహించలేదు. కారణమేమో?

శ.ర.లో, 'చేపట్టుకుంచె' మని యుండఁగా ఆ రూపము తప్పని, 'చేపట్టుఁగుంచము'గా దిద్దిన, సూ.ని. 'నీరుకావి'ని - 'నీరుఁగావి'గా దిద్ద కుండుట సరికాదుగదా! (చూ. చేపట్టుకుంచము)

3. చాఱపప్పు

శ.ర. లో "చాఱపప్పు = జీడిమామిడి గింజలోనిపప్పు" అని యున్నది. దానినిబట్టియే కాబోలు, శ్రీ కొమాండూరు అనంతాచార్యులవారు మనుచరిత్ర (4-14) టీకలో *"చాఱపప్పుక = జీడిమామిడిపప్పును" అని వ్రాసినారు. తప్పు.

---

* వావిళ్లవారి 'మను' టీకలోను,- "చాఱపప్పుక = ముంతమామిడి పప్పును" అనియే యున్నది. అక్కడ కుండలీకరణమున— 'అరణ్యముల యందు చాఱచెట్టునది గలదు. దాని కాయలనుండి దీయుపప్పు జీడిపప్పుకంటె బిన్నదిగను రుచ్యముగా నుండును. జీడిపప్పుగాఁ జెప్పుటకుఁ గారణము మృగ్యము' అనియు నున్నది.

(ప్రామాణిక గ్రంథములలోని ప్రమాదములు, పెద్దపెద్ద పండితులను గూడా పెడత్రోవలకు తాకుచున్నవిగదా!)

చూఅపప్పు; జీడిమామిడిపప్పు; పర్యాయపదములు.—

"వ. సెనగపప్పు బొబ్బరుపప్పు పారపప్పు జీడిపప్పు బాదంగిపలుకులు" (హంస. 1-105)

"చూఅపప్పు The pulp or inside of a sort of small filberts. జీడిమామిడిపప్పు = ముంతమామిడిపప్పు. Cushoonuts." (బౌద్ధ్యము)

శ.ర. కర్త, బౌద్ధ్యమును సరిగా మాచియున్నచో, ఈ తప్పు జరిగియుండెడిది కాదుగదా? సూ.ని., శ.ర. నిరూప ఆధారపడక స్వయముగా విచారించి "చూఅపప్పు = ప్రియాలపుబప్పు" అని సరియైన యర్థమును వ్రాసినది. సంతసింపదగిన సంగతి.

4. గుజ్జెనగూడు

"గుజ్జెనగూళ్లు. (గుజ్జు + ఎన + కూళ్లు) 1. బాలక్రీడావిశేషము. 2. బాలిక లాడుకొనునప్పుడు గురుగులతో వండిన వంటకము" అని, శ.ర.

సూ.ని. యును, శ.ర. చెప్పిన యర్థములనే చెప్పి, అందు కుదాహరణలనుకూడా చూపినది. కాని 'గుజ్జెనగూటి'ని గూర్చి తానేమీ స్వయముగా ఆలోచించలేదు.

అసలు గుజ్జెనగూడు, 'కూడు' గాని ఆటకాదు. నెలలపిల్లలు తినుట కనువగునట్లు గుజ్జబలె మెత్తగా తయారుచేయు కూటికి గుజ్జెనగూడని పేరు. పొగపాముని ఎస రెక్కలవే అన్నము కొంచెము మెత్తనెయెడల 'ఏమి యీవేళ గుజ్జెనగూడు చేశారు' అనడం మిప్పటికిని వాడుకలో నున్నది.

ముందటిదినములలో, తల్లులు పసిపిల్లలకు ఉప్పు, వాము వేసి గుజ్జు బలె అన్నము మెత్తగా (= గుజ్జెనగూడు) వండి, పెట్టెడివారు.

ఆ కృత్యమునే (తాము తల్లులైనట్లును - బొమ్మలు తమ పిల్లలైనట్లును, ఆ పిల్లలకు తాము గుజ్జెనగూళ్లు వండిపెట్టినట్లును) అనుకరించి బాలిక లాడుకొందురు. ఆ యాటకే 'గుజ్జెనగూళ్లు' అని పేరు.

బొమ్మలుపెట్టి ఆడుకొనునపుడు, గుజ్జెనగూళ్లను బాలికలు వండినను, వండిన ట్లభినయించినను, అది క్రీడయే. 'గుజ్జెనగూళ్లు' అను క్రీడావిశేష మదే. తద్భిన్నమయినది మరియొకటి లేదు.

కొబట్టి, శ.ర. సూ.ని. కూడా, బాలక్రీడావిశేష మొక యర్థము గాను, బొమ్మలతో ఆడుకొను బాలికలు వండుచేయుట - ఆ వంటకము, మరి యొక అర్థముగాను చెప్పుట పొరపాటు. గుజ్జెనగూడు. 1. (ఏ. వ.) నెలల పిల్లలు తినుటకు తగినట్లు గుజ్జువలె మెత్తగావండెడి యన్నము. 2. (బ. వ.) తాము తల్లులైనట్లును, బిడ్డలకు గుజ్జెనగూళ్లు వండి పెట్టుచున్నట్లును బాలిక లాడుకొను ఆట.' అని, నిఘంటువు స్పష్టముగా వ్రాయవలెను.

శ.ర. కర్త గుజ్జెనగూళ్లు, ఏరకపు బాలక్రీడయో వివరింపనందున, గూళ్లు = (పిట్ట)గూండ్లు అనుకొని ఆది, 'గుజ్జెనగూళ్లను కట్టుట' యను క్రీడగా కవిత్వము చెప్పుటయు నేడు జరుగుచున్నది.

పసిబిడ్డలకు గుజ్జెనగూళ్లు పెట్టు-అలవాటు పూర్వము కలదనుటను ఈ క్రింది రచన చక్కగా తెలుపుచున్నది.

రగడ. "చిరుదేంట్లకొసఁగె, గుజ్జెనగూళ్లు గొజ్జంగ" (మను. 3-84)

ఈ క్రింది రచనలు 'గుజ్జెనగూళ్లు' ఆటలను దెలుపునవి.

1. "పేర్వేర బొమ్మల పెండ్లిండ్లుసేయుచు
నబలలతోడ వియ్యంబు లందు,
గుజ్జెనగూళ్లను గొమరొప్ప వండించి
చెలులకుఁ బెట్టించుఁ జెలువు మెరసి."
(భాగ. 10. పూ. 1688)

2. "మఱి యాడియాడి తామరకెంపుఁ బీఁటపై
నోమనగుంటల నుజ్జగించి,
పాఁపమేపరిపచ్చ పన్నారుఁబోవులఁ
గలుకు గుజ్జనగూళ్లు గుడుచు టుడిగి." (యయా. 3-151)

బాలికలు వియ్యములందుట యెట్టి క్రీడావిశేషమో, గుజ్జెనగూళ్లు వండుట, వండించుట, చెలులకు పెట్టించుట, తాము తినుటయు నట్టి క్రీడా విశేషమే. బాలక్రీడలలో మూడువంతు లిట్టి యనుకరణములే.

'గుజ్జన' అనుటయు కలదు.—

"గుజ్జన Infantile, childish గుజ్జనగూడు. Doll's dinners. Children playing at cookery" (బ్రౌను.)

5. నారికుఱుపు ; నాడీవ్రణము

శ.ర. లో, "నారికుఱుపు = సెలపుండు, నాడీవ్రణము" అనియు, "నాడి = నారికుఱుపు" అనియు నున్నది.

నూ. ని. లో,— "నారికుఱుపు = నాడీవ్రణము, నరముమీఁద వేసెడి కుఱుపు" అనియు,— "నాడి = నారికుఱుపు" అనియు నున్నది.

శ.ర. నారికుఱుపును, నాడీవ్రణమనుట పొరపాటు.

నూ.ని. ఆ పొరపాటు నశ్లే గ్రహించుట ప్రమాదము.

ఆది యట్లుండఁగా, శ.ర. 'నారికుఱు పంటే - సెలపుండు' అని చెప్పుచున్నను నూ.ని. "నరముమీదవేసెడి కుఱుపు" అనుట తప్పు.

నూ.ని. నాడీవ్రణము - సెరుగదు సరేగదా! నారికుఱుపునుగూడా యెరుగదన్నమాట!!

నారికుఱుపు, సెలపుండు - అవునుగాని, నాడీవ్రణము కాదు. నారికుఱుపు, నాడీవ్రణము - అనునవి భిన్నజాతివ్రణములు.

'నా రి కు ఱు పు'

'నారికుఱుపు' అను పదానికి 'నారిగలకుఱుపు' అని యర్థముగాని, 'నరముమీద వేసెడి కుఱుపు' అని కాదు. నారికుఱుపులో, నరమువలెఁ సన్నవై - ఇంచుమించు గజము పొడువుగల పదార్థమొకటి యుండును. అది-వింటి 'నారి'వలె, సన్నగను - పొడుగుగను ఉండుటవల్ల కాబోలు, దానిపేరు 'నారి' అన్నారు. ఆ నారి పూర్తిగా బయటపడువరకును కుఱుపుమానదు. అది-దినములపేరట-తిన్నతిన్నగా-కొంచెము కొంచెముగా ఇవతలికి వచ్చునే గాని, ఒక్కమారుగా బయటపడదు. మనము లాగి తీయగూడదు. ఏ కారణముచేతనైనను 'నారి' నడుమతెగినా, కుఱుపు సెలవేసి, భరింపరాని బాధను కలిగించును. ఈ వ్రణమువలన అంగవైకల్యము కలుగుటయు కలదు.

ఇంగ్లీషువైద్యులు, ఆయుర్వేదవైద్యులుకూడా, ఆ 'నారి'ని ఒక పురుగుగా నిర్ణయించినారు. ఇంగ్లీషులో నారిని, 'Guinea worm' అంటారు.

బ్రౌను,- "తంతికురుపు or నారిపుండు. The disease of having a worm in the leg అని" తెలిపి, నారికురుపునుగూర్చి యిట్లు వ్రాసియున్నాడు.

"నారికురుపు The guinea worm that breeds in the flesh of the leg, and is not extracted without great difficulty and danger"

నారికురుపును సంస్కృతములో 'స్నాయుకము' అంటారు. (శ.ర. లో లేదు.) స్నాయుకమునుగూర్చి 'యోగరత్నాకరము'లో, ఇట్లు చెప్పబడియున్నది.

"శాఖాసు కుపితోదోషశ్శోథంకృత్వా విసర్పవత్,
భినత్తి తత్తత్కలే తత్రసోస్రా స్నాయుం విశోష్యచ.
కుర్యాత్తంతు నిభంజీవం వృత్తం శ్వేతద్యుతిం బహిః,
శనైశ్శనైశ్చలతాద్యాతి ఛేదాత్కోప ముపైతి సః.
తత్పాతా చ్ఛోఫశాంతి స్నాస్యత్, పున స్తానాంతరే భవేత్,
స స్నాయుకేతి విఖ్యాతః క్రియోక్తాతు విసర్పవత్.
బాహ్యోర్వ్యది ప్రమాదేన జంఘయో స్ఫుట్యతి క్వచిత్,
సంకోచం ఖంజతాంచైవ చిన్నతంతుః కరోత్యసౌ"

'నాడీవ్రణము'

నాడి, అనగా-గొట్టము. లోలోపలనే వ్యాపించి, శరీరమును నాడివలె చేయునది నాడీవ్రణము.

"యశ్శోథ మామ మతిపక్వముపైతి తేజ్ఞో
యోవావ్రణం ప్రచురపూయ మసాధు వృత్తం,
అభ్యంతరం ప్రవిశతి ప్రవిదార్య తస్య
స్థానాని పూర్వ విహితానితతః సపూయం
తస్యాతి మాత్ర గమనాద్గతి రిష్యతే తు
నాడీవ యద్వహతి తేన మతాతు నాడీ."—యోగరత్నాకరము.

"నాడిఃవ్రణఃవ్రణఃవ్రణ

7. చన్ను

సూ.ని. "చన్ను = స్తన్యము, (ఇది లక్షణచే వచ్చిన యర్థము)" అన్నది. సరికాదు.

(పసిబిడ్డకు) - చన్నిచ్చు (= పాలిచ్చు) అన్న పలుకుబడిలోనే కాని విడిగా 'చన్ను'కు స్తన్యము (=చనుబాలు) అన్నయర్థము లేదు.

(1) "చెట్టుపల్ నెఅయని చిలుకబోదలఁ బట్టితెచ్చి బిడ్డలుగఁ జన్నిచ్చి యిచ్చి." (నిర్వ. 8-35)

ఇందు, బిడ్డలను చెప్పుటచేత, చన్నిచ్చి = స్తన్యమిచ్చి, అని ప్రకరణమునుబట్టి యర్థము.

(2) "వనితా ముట్టకుమమ్మ, చన్నుగుడుపక వల్దమ్మ నీచన్ను మా తనయుం డొల్లఁడు" (భాగ. 10 పూ. 223)

ఇందును తనయసంబంధముచేతనే, 'నీచన్ను' అంటే, 'నీ స్తన్యము' అని యర్థము.

(3) "ఆవులు చన్నియ్యవయ్యెఁ గ్రేపులకు." (రం. రా. అయో.)

అంటే, ఆవులు దూడలను పాలుత్రాగనియ్యలేదని యర్థము. క్రేపులను చెప్పుటంబట్టియే - చన్నియ్యవయ్యె-నన్న క్రియ కా యర్థము సిద్ధించినది.

ఆవు క్రేపుకు చన్నియ్యలే-దని యున్నదిగదా, యని - (ఆవు నాకు పాలియ్యలేదనడానికి మారుగా)— 'ఆవు నాకు చన్నియ్యలేదు' అనగూడదు. ఆముదములో చనుబాలు వేసి రంగరించు; నేపాళములు చనుబాలతో శుద్ధి చేయవలెను - అనవలసినచోట్ల, చనుబాలకుబదులు 'చన్ను' వాడవచ్చునా? వాడగూడదు. ఎందువల్ల? 'చన్ను'కు - 'చనుబాలు' అను అర్థము లేనందువల్లనే.

కంటిలోకి కొంచెము చనుబాలు కావలె ననడానికి మారుగా 'కంటిలోకి...చన్ను కావలె ననవచ్చునా? అంటే, వెంటనే దవడశుద్ధి అవుతుంది. ఆదియైనపిమ్మట - ఆమ్మా నేనా పదాన్ని (నూ.ని. ప్రకారము) లక్షణార్థమున వాడినా-నని చెప్పికొన్నను ప్రయోజనము సున్నగదా?

ఎందుకు విస్తరము. "చన్ను = స్తన్యము" అనుట తప్పు. అట్టి యర్థము, శ.ర.లోను లేదు; ప్రాణ్యమునను లేదు. చెప్పవలసిన విధ మేమంటే;

చన్నిచ్చు-అను పలుకుబడిని మూలపదములలోఁ చూపి, ఇది శబ్దపల్లవ ధాతువనిచెప్పి, యీ ధాతువున, చన్ను = స్తన్యము, ఇది లక్షణచేతవచ్చిన యర్థము అని వివరించవలె. అంతేగాని, ఊరక 'చన్ను = స్తన్యము' అని వ్రాయఁగూడదు.

8. కంపరము

శ.ర లో-"కంపరము = పాడె, ఖాటి" అని యున్నది. అందువల్ల, 'గౌరన హరిశ్చంద్ర'లో, కాలకాశికుని పెండ్లామ రూపురేఖలు వర్ణించు ఘట్టమున,—

"మెదుకపట్టిన తల మెడ గండమాల
బుఱ్ఱముక్కు-ను లొట్టపోయిన కన్ను
వెఱ్ఱిచూపును దెగి వ్రేలాడు చెవులు
మిడిపంట్లు చెక్కు-టిమీఁది పుల్పిరియుఁ
బడివ్రేలుచన్నులు బడబాకినోరు
[1]రోటువోయినచేయి, రొమ్ముకంపరము" (పుట. 172)

అన్నచోట, వే.వే. శాస్త్రిగారు, (శ.ర. ప్రకారము),

"కంపరము = శవవాహనము"

అని, లఘుటీక వ్రాసినారు. పొరపాటు. 'రొమ్ము శవవాహనము' అంటే అర్థమేమిరో? ఉత్తమకవియైన గౌరన,—

'రొమ్ము శవవాహనము'-'రొమ్ము పాడె'

అను నర్థముతో రచన చేసియుండునని, ఆంధ్రమల్లినాథు లెట్లనుకొనిరో! ఎట్లో అనుకొన్నారు; ఆచర్చ మనకెందుకు? మొత్తముమీద [2]ఆటీక తప్పు.

---

1. శ.ర. కర్త 'రోటువోవు' అను పదముక్రింద ఈ ద్విపద నుదాహరించియు 'కంపరము' క్రింద చూపడు. కారణ మేమనుకొందాము?

2. ఇట్టితప్పు లా లఘుటీకలో చాలాఉన్నవి. (చూడండి: 'గౌరన హరిశ్చంద్ర - లఘుటిప్పణము.')

ఆ ప్రకరణమున 'కంపరము'నకు వణకు అని యర్థము. 'కంపము' అన్న యర్థమునకే, *'కంపరము' గుంటూరు - నెల్లూరు, మండలములలో నున్నది. "పామును చూడగానే వొళ్లు కంపరమెత్తినది" ఇత్యాదిగ వ్యవహారము. కొలకాశికుని యిల్లాలికి, అన్ని యవలక్షణములతోపాటు(ఒక) రొమ్ముకు వణకుగోగ మున్నట్లు వర్ణించినాడు, గౌరనమహాకవి : చతురతర రచన. ఆ రచనాచాతుర్యము నర్థముచేసికొనక, ఆ యింతి రొమ్ముకు విడ్డూరముగా నొకపెద్ద 'శవవాహనము' నంటగట్టి, రసాభాసము చేసినారు, ♦లక్షణటీకాకర్తలు.

శ.ర.కర్త, గౌరనరచనలోని 'కంపరము' నెరిగియు, తన గ్రంథమున చూపకపోవుట, గొప్ప పొరపాటన్నది యిక్కడ ప్రధానాంశము.

ఆ పొరపాటు సూ.ని. లోనైనా సరిచేయబడెనా? లేదు. సూ.ని. ఆ శ.గ. లోని 'పాడె-ఖాటి'లనే మంగునెనుకలుచేసి, "ఖాటి-పాడె" అని యెత్తి వ్రాసికొన్నది. మరి విశేషమేమనగా 'పాడె'కు అర్థము తెలియని వారికొరకు కాబోలు ఒక 'శవవాహనము'నుకూడా అక్కడ చేర్చినది.

అంతేగాని, సూ.ని.లో 'కంపరము' నకు 'వణకు' అను అర్థమూ లేదు; అంగకు గౌ. హరి. ప్రయోగమునూ లేదు. ఆ సూ.ని. గౌ.హరి.ను కడుగంటనైనను చూచి యుండదు. శబ్దములను అర్థములను, ఆ యీ నిఘంటువులనుండి యెత్తి వ్రాసికొనుటేగాని, గ్రంథములను స్వయముగా చదివి, సంతరించు అలవాటు సూ.ని. కి చాలా తక్కువయని యింతకు మంచె నేను తెలిపియున్నానుగదా!

---

* ఆంధ్ర వారపత్రిక (1948 ఫిబ్ర. 18)లో,—'దేవుడు వరమిస్తే' అను కథానికలో, ఈరంకి వెంకటరావుగారు,— "ఆమె తన మరణానంతరం అనుభవించే బాధ తలుచుకుంటే ఆతనికి కంపరమెత్తింది" అన్నారు.

ఆంగీరస కార్తికభారతిలో 'వన్‌సుమోరు' అనుకథలో,— "ఆతని శరీరం నఖశిఖపర్యంతం కంపరంపుచ్చుకుంది" అని యున్నది.

♦ ఆ టీక వేంకటరాయ శాస్త్రిగారి సొంతము కాదని నా యభిప్రాయము.

ఆ యెత్తివాసికొనడములోను సమగ్రతలేదు సుమండీ; ఉన్న రెండు మూడు నిఘంటువులనైనను ఒక్కమాటు విప్పిచూచు ఓపికయును లేదు. చూడండి, ఆంధ్రవాచస్పత్యములో,—

"కంపరము = పడఁకునది, వేపఘువు"

అనియున్నది. తనకంటే ముందు పుట్టినదీ : చక్కగా ప్రచారములో నున్నదీకదా ఆ కోశము; దానిని తాను తిలకింపకపోవు లేలా? ఒక విశేషము:—

కంపరము, 'పాఁడె'యను నర్థమున, శ.ర. లో దోష్యమని యున్నది. వేపఘువు, అనునర్థమున ఆం. వా. లో, తత్సమము, అని యున్నది. సంస్కృతనిఘంటువులలో 'కంపర' శబ్దము కనబడదు. కాని తత్సమ చంద్రికలో,— 'కంప్రము'నకు రూపాంతరము 'కంపరము' అని యున్నది. (చూ. పుట. ౪౨౧)

9. అంటుపేను ; అంటుపోగులు

శ.ర. లో "అంటుపేను = ఒక దినుసుపేను" అని యున్నది.

దానిక్రిందనే, "అంటుపోగులు = చెవినంటియుండెడి పురుషుల కర్ణభూషణము" అని యున్నది.

సూ.ని. ఆ రెండుపదములను ఆవసలోనే గ్రహించి, అర్థమును వివరించుటలోమాత్రము - ఎందువల్లనో, ఇట్లు వినిమయము కావించినది.

"అంటుపేను = తలనంటియుండు చిన్న పేను,— అంటుపోగులు = చెవులకుపెట్టుకొను ఒక విధమగు పోగులు."

సూ.ని. చేసిన యీ కుండమార్పు సరియైనదికాదు. ఏమంటారా.

డొల్లుపోగులు; అంటుపోగులు, అని పోగులు రెండువిధాలు. అంటు పోగులు, చెవికంటుకొని యుండును. "అంటుపోగులు - Earrings that fit close." (బ్రౌను) డొల్లుపోగులు, ఆకృతిచేత పెద్దవై - చెవి కంటుకొని యుండక వ్రేలాడుచుండును. ఈ భేదము తెలియుటకే, పోగులకు 'అంటు' 'డొల్లు' అను విశేషణము లేర్పడినవి.

డొల్లుపోగులు కావ్యములలోను, ఉన్నవి.—

"అలవడు చల్వదోవలి యొయారపు గందపుఁబూత, డొల్లుపో
గులు" (హంస. ౧-౨౩౨)

అంటుపోగులన్న యర్థమునసే 'తమ్మంట్లు'అనుపద మొకటి యున్నది (తమ్మి + అంట్లు) తమ్మంట్లు = చెవితమ్మెల కంటుకొని యుండునవి అనియే యర్థాగికార్థము.

"పునుక తమ్మంటులఁ బొలుచువీనులవారు
నొసలమిక్కిలిచూపు లెసఁగువారు"(పాండు. 1-165)

అంటుపోగులను (= తమ్మంటులను) ఊరక 'అంటుజోడు' అనికూడా అంటారు. అన్నియు, చెవికి అంటుకొని యుండుటనుబట్టి పుట్టినపదములే.

కాబట్టి, అంటుపోగులకు శ.ర. చెప్పినదే సరియైన అర్థము. దానిని సూ.ని. మార్చుట తప్పు.

ఇక 'అంటుపేను'సంగతి :

'అంటు'; 'పేను' భిన్నపదములు. పేనురూపమున మూడు-అవస్థలు.

1. ఈరు (గ్రుడ్డు)

2. అంటు (పిల్ల) ఇది తలకంటుకొనియె యుండును. అందు వల్లనే దానికా పేరువచ్చినది.

3. పేను (పెద్దది)

"ఎలయుసీత్కారములతోడ నీళ్లు గ్రుక్కి- *యంటుసంటులుపరికించి యంట్లఁబొడిచె, గోరుముక్కులదిగదువ్వి తూరుపెత్తి, నెఱులఁగలిగిన పేల ననింటిఁ దిగిచె." (పాండు. 3-30)

'అంటు' అనుపదమును శ.ర. గుర్తించలేదు. అందువల్లనే 'అంటు పేను' అనుట. అంటుపేను; ఈరుపేను, అన నక్కరలేదనియు. అంటు; ఈరు; అనవచ్చుననియు పై పద్యమువలన స్పష్టపడుచుండలేదా!

"చెలఁగి యీ పేను మశకంబు చీమ నల్లి,
యల్పమనుబుద్ధి హింస నేయంగఁదగదు" (కాశీ. 6-89)

అన్నచోట, ఈరు; పేను, అని చేపను.

---

* 'అంట్లుసంట్లునుబరికించి యంట్లఁబొడిచి' అని శ.ర. పాఠము. 'అంటుసొంటులు' అని, సూ.ని. సవరణ.

పేలలో, అంటియుండు పేలు; అంటుకొనక-ప్రక్కలాడుచుండు పేలు, అని యిరు తెరగులు లేవు. కనుక నిఘంటువు 'అంటుపేను' అను పదమును గ్రహించుటయు, 'తలనంటియుండు పేను' అని యర్థముచెప్పుటయు సరి కాదు. ఒకదినుసు పేను అనుటయును సరికాదు.

10. ఈరుపెన ; చిక్కంటి

ఈ రెండును చాలా విచిత్రమైన శబ్దములు. వీటి చరిత్రను నూ.ని. విచారించి తెలుపవలసినది; తెలుపలేదు. పైగా ఆపోహలు చేసినది. ఎలాగంటే,—

"ఈరుపెన = ఈళ్లనీర్చెడి దువ్వెన"

అని యర్థముచెప్పి, ఈరుపెన ఈరునుండిపుట్టిన పదమని సూచించినది.

ఆట్లే, "చిక్కంటి (= చిక్కంటు = చిక్కంటె) = తలచిక్కు తీసికొనెడి దువ్వెన" అని యర్థముచెప్పి, ఆ పదమునకు 'చిక్కు' మూలపదమని తెలిపినది.

ఈరుపెనకు 'ఈరు'; చిక్కంటుకు 'చిక్కు' జనకపదములు కావు. అవి ప్రత్యేకపదములు.

ఈరుపెన, ఈళ్లనే కాదు పేలనుగూడా లాగివేస్తుంది. "ఈరుపెన or ఈర్పెన. A comb, for extracting the nits or lice" (బ్రౌను)

'చిక్కంట' చిక్కునే కాదు; అంటునుగూడా తీసివేస్తుంది. కాబట్టి, నూ.ని. చెప్పిన అర్థమూ - వ్యుత్పత్తికూడా సరియైనవి కావు.

తత్త్వ మేమంటే - *ఈరుపెన యొక్క మొదటిరూపము, 'ఈరు పేను'. (ఈరు + పేను) ఈరు, పేను, తీయునట్టి సాధనమని భావము. ఈరుపేను కాలక్రమమున 'ఈరుపెన; ఈర్పెన' అయినది. ఆట్లే, 'చిక్కంటి' యొక్క మొదటిరూపము 'చిక్కంట'. (చిక్కు + అంట) చిక్కును, అంటను తీసివేయు సాధనమని భావము. అంట = అడ.

---

* పాళి. వ్యా. లో 'ఈర్పెన; ఉప్పెన; కంఘెన; దువ్వెన; వడ్డెన; కృదంతము' అని యున్నది.

చిక్కంట కాలక్రమమున చిక్కంటు; చిక్కంటె; చిక్కంటి; చిక్కట్టు అయి, చిక్కోల కూడా అయినది.

చిక్కంటుకు మూడు నాలుగు పండ్లకంటే యెక్కువ ఉండవు. (అది యినుముతోను, ఇత్తడితోనుగూడా చేయబడును) అందువల్లనే ఒక కవి దానిని త్రిశూలముతో పోల్చినాడు.

"తనకు జలంధరాంధకహరిబాహురిం
ఖత్రిశూలంబు చిక్కంటుగాఁగ" (చమ, మం. 2-31)

సూ.ని. లో. చిక్కట్టు; చిక్కోల, అను రూపములు లేవు. ఆ రెండు రూపములనుగూడా చూపుచూ, బ్రౌను, చిక్కంటురూపము నిట్లు వివరించినాడు.

"A large comb with only three or four teeth and often made of iron: also called చిక్కట్టు and చిక్కోల."

ఈరు, పేను, చిక్కు, అంట—అను పదములకు జన్యజనకభావము లేదనియు, అవి స్వతంత్రశబ్దములుగా నుండియు అట్లు ఏకపదత్వమును పొందిన విచిత్రశబ్దములనియు ఫలితార్థము.

11. గుణితము

శ.ర. లో "గుణితము సం. వి. ఆ. న. హల్లులతో అచ్చులను హల్లులను జేర్చిచెప్పుట. విణ. గుణింపఁబడినది" అని యున్నది.

సూ.ని. లో—"గుణితము. సం. విణ. (అ. ఆ. అ.) ౧. హెచ్చు వేయబడినది. (సంఖ్య). ౨. హెచ్చింపఁబడినది. అధికముగాఁ జేయఁ బడినది" అనిమాత్రమే యున్నది.

శ.ర. చెప్పిన విశేష్యార్థమును, సూ.ని. చెప్పక వదలివేయుటకు కారణమేమో తెలియదు. అట్లు గుణితమును విశేష్యముగా గ్రహించుటయు, ఆ యర్థము చెప్పటయు తప్పని సూ.ని. తలచెను కాబోలు! మరి సూచనగా నైనను తెలుపకపోవు టేల?

అంత సులభముగా త్రోసివేయుటకు శ.ర. వ్రాత నిరాధారపువ్రాత కాదే.

1. 'గిడుగు'వారు పరిష్కరించిన అప్పకవీయము (వావిళ్ల-వారి ప్రతి)లో "క్రకారముతోడ నచ్చులుగూర్చి గుణించెడి విధము"ను చెప్పఁ బట్టున (పుట. 51) "ఇది స్వరగుణితము" అని చెప్పబడియున్నది.

2. వే. వే. శాస్త్రిగారు, పారిజాతాపహరణములో,—

"శరధిక్రోడనివేశ, శార్ఙ్గధర, శిష్టధ్యేయ శీతాంశుభా
స్కరనేత్రద్వయ, శుభ్రపంకరుహ భాస్వన్నాభ, భూరాన్వయా."
(2-56)

అను పద్యములో—"గుణితక్రమమున్న" దన్నారు.

3. బాల్యములో, "గుణింతము. గుణితము. Multiplication, Spelling." అని యున్నది.

4. ఇటీవల శ్రీ వేదము-సూర్యనారాయణశాస్త్రిగారు వ్రాసిన, శ్రీ వావిళ్ల-వారు ప్రకటించిన - సంస్కృతవ్యాకరణము పీఠికలో,—"అక్షర గుణితము దెలిసిన ప్రతి బాలుఁడును...అగ్రము చేసికొనునట్లు...వ్రాయఁబడియున్నది." అని, 'గుణితము', గుణింతమను నర్థమున ప్రయుక్తమైయున్నది.

5. సర్వజిత్ పుష్య భాగవతిలో, శ్రీ కాశిభట్ల కృష్ణరాయశాస్త్రిగారు-"ఈ వడిశబ్దము గుణితస్వీకృతాక్షరాకృతులకు నామకరణ మయ్యెను" అన్నారు.

ఇట్లు ప్రామాణికులైన పూర్వనిఘంటుకర్తలు చెప్పినట్టియు, ప్రాచీనార్వాచీన లాక్షణికవిద్వద్వర్ణ్య లంగీకరించినట్టియు శబ్దార్థములను, సూ.ని. త్రోసిరాజనుట తగునా?

12. కలాపము

'కలాప' శబ్దమునకు, శ. ర. లో, 1. ఇరువదియైదు పేటలుగల స్త్రీల యొడ్డాణము. 2. నెమలిపురి. 3. అమ్ములపొది. 4. భూషణము. 5. సమూహము. అను నర్థములున్నవి.

సూ.ని.లో ౧. సమూహము. ౨. మయూరపింఛము. 3.భూషణము, ౪. తూణము. ౫. వ్యాకరణభేదము. ౬. మొలనూలు-అనే యర్థములున్నవి.

కాని, సారంగధరచరిత్రలో, "అయ్యిలాపతి కర్ణకలాపంబులుగా గొన్ని దురాలాపంబులువల్కి-న." (3-162) అన్నచోటి 'కలాపంబు'లకు ఆ రెండు నిఘంటువులు చెప్పిన అర్థములలో ఒక్కటియు సరిపడదు. జిజ్ఞాసువుగతి యేమి?

కర్ణకలాపంబులుగా, అంటే, చెవులకు ములుకులుగా, అనియర్థము. ఆప్టె-నిఘంటువులో "కలాపః. An arrow" అనియున్నది. (విరవములకు, చూ. 'జితకాశి' పుట, ౪౬౭)

నూ. ని. సారంగధరచరిత్రను, ఆప్టెనిఘంటువును గూడా సరిగా చూడలేదన్నమాట.

13. చనవరి

శ.ర. లో ఉన్నప్రకారమే, నూ. ని. యును, "చనవరి = చనవు గలవాడు." (ఆప్తుడు) అని, వ్రాసినది.

కాని, ఆ పదమునకు - 'చనవు + అరి = చనవుకలవాడు' అనే యీగికార్థమును, ఒక పెద్ద నిఘంటువుచెప్ప నక్కరలేదు. ఆ యర్థమును తెలిసికొనుటకు మార్గాంతరము లున్నవి. పైగా - నూ.ని. చెప్పిన యర్థము ఈ క్రిందిరచనలలో సరిపోదు.

1. భారతములో, విరాటుడు-తనయొద్దికి కొలువుకోరివచ్చిన భీమునితో,-

"నీ, కనుగుణమైన యానమును, నాసనమున్ రుచిరాతపత్రముం
జనవరికొల్వు నిచ్చెద." (విరాట. 1-220)

నన్నాడట. ఆ 'చనవరికొల్వున' కర్థమేమి? నూ. ని. మాట నమ్మి 'చనవుగలవానికొల్వు' అని చెప్పవచ్చునా?

2. గౌరన హరిశ్చంద్రలో, చంద్రమతిని అమ్మి ఘట్టమున,-

"చతురశ్రైనుతికెక్కు సన్మంత్రులార,
చనవరులార, యో సామంతులార,...
కోమలి నమ్మెదఁ; గొనరయ్యమీరు" (2-389)

అని యున్నది.

మరి, హరిశ్చంద్రుడు—'ఓ చనవరులారా = చనవుగలవారలారా,- ఆప్తులారా, నా కోమలిని కొనండి' అనియే అనెనా?

3. "చలపట్టి దొరతోడ సరిపడ దనరాదు
చనవరితోఁ గంటు *కనఁగరాదు" (చాటు.మంజరి.పు. 166)

ఇక్కడ, చనవరితో = ఆప్తునితో - అని చెప్ప నొప్పునా?

విస్తరమెందుకు? చనవరి, అనుపదముకు, రాజుదగ్గర - ఖుద్దున - నుండుసేవకుడు (= కొసావాడు) అని రూఢ్యర్థము. ఈ యర్థమును బ్రౌను, తన నిఘంటువులో,—"చనవరి-A courtier, a favourite, a pet" అని చక్కగా చెప్పియున్నాడు.

శ.రా. మీదనే ఆధారపడి వేదం వెంకట్రాయశాస్త్రిగారు,—

4. "జనవరులక్ జనవరులక్
మనసరులక్ దొరల ననిపి" (సారంగ. ౧-౭౭)

అన్నచోట, 'చనవరులక్ = స్నేహితులను' అనియే వ్రాసినారు. అక్కడను, చనవరులు - రాజకీయోద్యోగులేగాని - వట్టి స్నేహితులుగారు. (చూ. వివరములకు 'జితకాశి' పుట. ౯.౨)

'చనవరుల'కు రాజుల పరిజనములోనే పరిగణనము:—

5. "నాయకుల్ గాయకుల్, చనవర్లుక్ గణికాజనంబులను
బల్ సామంతులుక్ మంత్రులుక్." (చంద్ర. విలా. 8-11)

6. "నగరంబుపాలించు నరనాయకుండు
తగవరి ధర్మశాస్త్రముదెల్పువాఁడు,
చనవరియుఁ దలారి సారెదుర్గములఁ
దనకలినుంచు నాతఁడు ననం బరఁగు
వారల తెఱఁగు సర్వంబు నానాఁట
నేరుపాటుగవిందెఁ యేకతంబునను" (రం. రా. ఆ. కాం.)

---

* 'కొనఁగ' అని యుండనోపును.

7. "కవులు గాయకులు మాగధులు వేశ్యలు నటుల్
పరిహాసకులుమోల బలసికొలువ,
... ...
దొరలు ప్రెగడలు చనవరుల్ తోడరాగ
... ...
హాళిపైవార నపుడు వాహ్యాళివెడలె" (రసి. మనో. 1-85)

8. "చనునే ప్రాప్యాంశమునకుఁ
జనవరి వటుపలుకఁ బ్రాప్యసంపదయొల్ల
మునుమున్నగఁ దలపోపునఁ
గొనిచనవా మమ్మునడిగి కొనివచ్చితివా?" (కకుత్. 3-28)

(చనవరివి = నిరంతర సంబంధము కలవాడవు.)

చనవరి-అను పదమును ఏయేకవు లేయే యర్థములలో వాడిరో పరిశీలించి తెలిసికొనకపోవుట యటుండ, నూ.ని. బ్రౌనునిఘంటువైన చూడక, శ.ర. లోని యర్థమునెత్తి వ్రాసికొనుటతోనే సరిపెట్టుకొన్నది.
ఒక విశేషము:—

సీ. "విడెముచొక్కున నొక్కవేళఁ జొక్కినదన చేలచెఱంగునఁ జెమటఁదుడుచుఁ
గొలువునసుండి డిగ్గునడిగునంతలో దండకై చేరి కైదండయొసఁగుఁ
'జనవరి'యై వడి జాతెఱఁగత్న భూషణము లప్పటికప్పు చక్కఁదెట్టుఁ
బేర్కొని తనుఁ జేరఁబిలిచిన స్వామి యేమానతియిచ్చెదరంచు నిల్చుఁ

జూచి వలదన్నమానక సురఁటివిసరు
నేమిమాటాడినను నుతియించుమిగులఁ
జిటికెలిడు జృంభణంబునఁ జేరి దివిజ
వైరి కగదారి, యిచ్చకదారియగుచు." (దశా. 2-131)

అను పద్యమును చదువుకొనియు, నూ.ని. చనవరి = 'ఆప్తుఁడు' అని వ్రాసినది!

మహాప్రభువుల కాప్తులైనవారు, తమ యుత్తరీయపుచెరగుతో-చెమట తుడుచుట; రా జాబలించినపుడు చిటికెలువేయుట మున్నగుపనులు చేయు

దురాఁ? ఆవులింతకు చిటికెలువేయుట సేవకకృత్యముగాని, ఆప్తకృత్యము కాదు.

1. "సాంగభంగంబైన యావులింతకువేల్పు లంగుళిస్ఫోటంబు లాచరింప
సౌఖశాయనికులై సంవర్తభృగ్వాదిమునులు హస్తాంభోజములు మొగుడ్పఁ
... ...
నిదుర మేల్కాంచి కూర్చుండె నుదధినడుమ
విష్ణుఁడఖిలేశ్వరుఁడు శరద్వ్యోమయంబు" — కాశీ. 3-22

ఆఖిలేశ్వరుడైన విష్ణునకు - వేల్పులు, సేవకులగుదురాఁ? ఆప్తులగుదురాఁ?

2. "కమలినీ జృంభికలకు దిక్కాంతలెల్ల
హస్తతాళంబు లొనరించిరనఁగఁజెలఁగి
లలిత కాసారకులకులాయచలిత
శకునపక్షిజ పటపటస్వనము లధిప" (పారి. 2-67)

ఇందును, కమలిని యజమానురాలుగను, దిక్కాంతలు దాసీజన ముగను ఉత్ప్రేక్ష.

3. "నెటికలుదిస్సి చేవిసికి నిక్కియొకించుక యావులించినఁ
జిటికెలువేసి...వాసిగసు...పాత్తులతొత్తులకేడ సత్తెముల్"
— బహులా. 5. ఆ.

ఇట్టి యుదాహరణ లెన్నియేని ఇయ్యవచ్చును. ఎందుకు విస్తరము: చనవరి-యను పదానికి చనవుగలవాడు - అనునది యౌగికార్థము; రాజ కీయోద్యోగి - అనునది రూఢ్యర్థము. నిఘంటువు ముఖ్యముగా చెప్ప వలసినది రూఢ్యర్థమునే. అట్టి యర్థమును, శ.ర., నూ.ని. చెప్పకపోవుట లోపము.

ఆవులింతకు చిటికెవేయుట ఆప్తకృత్యమని నూ.ని. భావించుట పొరపాటు.

చనవరి = రాజపురుషుడు, అనుట కింకొక్క యుదాహరణము.—
"గుత్త, చేలు గ్రామాంశములు నాధినేలలెల్లఁ, జనవరుల కమ్మఁజూపు"
(పాండు. 3-16)

"చనవరులకుఁ = అధికారులకు" అని టీక.

14. దావలచేయి

సూ. ని. "దావలచేయి. వి. బౌ. (దా + వలను + చేయి = దాపటి వలని యందున్న చేయి) ఎడమచేయి, వామహస్తము" అని వివరించి అందుకు,

"ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మినవిడ్చి వెండ్రుకల్
దావలచేతఁ బూని" (ఉద్యో. 8-118)

ఆను భారతప్రయోగము నిచ్చినది.

మరియు, తిక్కన 'దావలచేతక' అన్నమాటను 'ఎడమచేతక' అన్న యర్థమునసే వాడినా డనుటకు సాక్ష్యముగా,— "కేశపక్షం వరాహోహా - గృహ్యావామేన పాణినా" అన్న మూలమునుగూడా ఉదాహరించినది.

కాని, దావలచేయి - యను పలుకుబడియు, దానికి, ఎడమచేయి - యను అర్థమున్నూ భాషావిదు లంగీకరించినవి కావేమో నని నా సందేహము. ఎందువల్లనగా,—

(1) దావల = ఎడమ - అని యే నిఘంటువులోనూ లేదు.

(2) ఆదియునుగాక, ప్రక్క-, వైపు - అను నర్థమునిచ్చు 'వలను' అను విశేష్యము, ఆ-ఈలతో సమసించునప్పుడు ఆ + వలను = ఆవల; ఈ + వలను = ఈవల-అను 'ను' లోపరూపమును పొంది, పిమ్మట విశేషణదశలో- (బౌపవిభక్తికము కావున) ఆవలి; ఈవలి - యని ఇత్వసహిత మగుచున్నది.

అట్లే, దా (శలి) + వలను = 'దావల'యై, పిమ్మట (విణ) 'దావలి' అయితీరవలె. అప్పుడు ఎడమవైపుచెయ్యి 'దావలిచెయ్యి' యగునేగాని 'దావల' చెయ్యి కానేరదు. కావున "దా + వలను + చెయ్యి = దావల చెయ్యి" అనుట పొసగదు.

భాషలో 'దావలచెయ్యి' లేదుగాని *'వలచెయ్యి' యున్నది. ఐతే, అది కుడిచెయ్యి. (ప్రక్క-చెయ్యికాదు.) కవుల ప్రయోగములు చిత్తగించండి.

---

* వలను = కుడి. వృత్తియందు వలనుశబ్దమునకు మీఁదివర్ణము లోపింపఁగా మిగిలిన రూపము 'వల'. (చూ. శ.ర.)

(1) "అరుదుగా వలచేత నక్షమాలికయు" (గం. రా. ఆర.)
(2) "వలకేల్ తలక్రిందఁ జేర్చుకొని" (పం. 1-252)
(3) "వలకేల మ్రొక్కి" (సారంగ. 1-89)
(4) "వలకేల బంగారు జలపోసనముతోడఁ
బ్రన్నని పట్టుతోరము ధరించి" (క్రీడా. పుట. 14)
(5) "వెన్నుని వలకన్ను వేడిపేలుపు" (ఆం. సం.)
(6) "చెప్పిన వెట్టిబోయ వలచే యటు సొన్పుడు" (కేయూ. 4.75)
(7) "వలను = కుడి. వలనొ హస్తంబునఁ" (భద్రా. ౧. ఆ. శ.ర.)

వలకన్ను, వలకేలు, వలచెవి, వలమూఁపు, వలమాల, వలవంక మొదలగు సుదులలోని 'వల'కు 'కుడి' యనియే యర్థము. (ప్రక్క యని కాదు.) కొబట్టి, 'వలచేయి' అను పదములో 'కుడి' యను నర్థమునిచ్చు విశేషణమైన 'వల'కు - మల్లీ, 'ఎడమ' అను నర్థమునిచ్చు 'దా' యను విశేషణమును చేర్చుట చెల్లదు. చేర్చినచో 'ఎడమకుడిచేయి' యను విపరీతార్థ మేర్పడి ఆరచన హాస్యభాజనమగును. కావున తిక్కన ఆట్టిరచన చేసెననుట యుచితము కాదు.

అక్కడ, 'వెండ్రుకల్ - తా(క్) - వలచేతఁబూని' అని సుఖమైన యన్వయము కనబడుచుండఁగా:—

'దావల-చేత'

అని పదవిభాగముచేయవలసిన యక్కర్రయేమి? మూలములో 'హామేనపాణినా' అని యున్నదనియా? ఉండుగాక; తిక్కన ఆ మాట నల్లే తెనుగించి నాడు - అని నమ్మకమేమి? ఆత డేమి మక్కికిమక్కి యనువాదకుడా? కాడుగదా? ఆయనయనువాదములో జరిగిన మార్పులకు - కూర్పులకు లెక్కయున్నదా?

మూలములో బృహన్నలకట్టుకొన్న *'శుక్లవసనము', తిక్కనరచనలో

---

* "త మన్వధావ ద్ధావంతం, రాజపుత్రం ధనంజయః,
దీర్ఘాం వేణీం విధున్వానః, సాధుశుక్లేచ వాససీ" (మూలము)
"అంబకేశభారుండును నాందోళితరక్తాంబరయుగళాంచలుండును నగుచు నతనివెనుకం బఱచు సమయంబున" (అనువాదము)

రక్తాంబరము'గా మారిపోయినది. 'వామపాణి'—'వలచెయ్యి' (= కుడిచెయ్యి)గా మారుటొక యబ్బురమా?

ద్రౌపది తన తలవెండ్రుకలను కృష్ణునికి ఎడమచేతబట్టుకొని చూపిన దనుటకంటే 'కుడిచేత బట్టుకొని చూపినదనుటయే యుచిత' మని కవిబ్రహ్మ భావించెనేమో? 'ఆయనగా దనుసరించిన మూలప్రతి యెక్కడిదో! అందలి పాఠ మెట్లుండెనో!' యన్నవాద ముండనే యున్నదిగదా?

ఏమయినను 'దావలచేయి' యనుటమాత్రము పొసగదు. వావిళ్ల-వారి ముద్రణమునను, ఆనంద-వారి ముద్రణమునను గూడా—

'తాఁ – వలచేత'

అను సర్థ మేర్పడునట్లే, ఆ రెండుపదములును ఎడపడియే యున్నవి.

అది యట్లుండగా, ఉద్యోగపర్వమునకు టీకాతాత్పర్యములువ్రాసిన శ్రీ.శే., కొ. పార్థసారథిఅయ్యంగారు,—

''తాఁ – వలచేతఁ = కుడిచేతియందు-పూని''

అని టీకలోను, ''వెండ్రుకలను కుడిచేతఁబట్టుకొని'' యని తాత్పర్యములోనూ వ్రాసియున్నారు.

కావున, 'దావల చేతఁ'- అని విభజించుటయు, 'ఎడమచేతఁ' అని యర్థముచెప్పుటయు సరికాదు.

ఒక చిన్న మనవి:—

ఇంతకును నూని. 'దా' క్రింద చెప్పదలచినది,— చెప్పవలసినది 'దావల'నా? 'దావలచేయి'నా? 'చే' క్రింద "చేయి = చే.వి.బొ. హస్తము" అని చెప్పియే యుండెనుగదా; మరల 'దా' క్రింద 'చేయి'ని చెప్పనేల?

ఆ పద్యములో 'దావలచేయి' యని యున్నందువల్ల నంటారా? అలా అయితే, ఇంకొక పద్యములో 'దావలకేలు' అనియు, వేరొకపద్యములో, 'దావలకాలు'అనియు, మరియొకపద్యములో 'దావలముక్కు' అనియు నున్న దనుకొనుడు. మరి వరుసపెట్టి, దావలచేయి. దావలకేలు. దావలకాలు. దావలముక్కు— అని పదములు వ్రాసుకొంటూ పోవడమేనా? నిఘంటువు పదములను తీసికొనవలసినపద్ధతి యదేనా? ఎన్నటికినికాదు.

'దావల' (= ఎడమప్రక్కనున్న) యను విశేషణమొకటి యున్న యెడల, దానిని, మూలపదములలో చేర్చి, అర్థము చెప్పి ఆ యర్థనిరూపణ కొరకు, ఆ 'దావల'తో కూడి ప్రయుక్తమెయున్న 'చేతి'నో, 'మూతి'నో ఉదాహరింపవలె. అంతేగాని, 'దావల'తోపాటు చేతిని, మూతిని మూల పదములలోని కెక్కింపరాదు.

'తా,(క్ర)వలచేత' అను తిక్కనరచనను సూ. ని. 'దావలచేత'గా భావించుటయు, 'ఎడమచేత' అని యర్థకల్పనముచేయుటయు, 'చేయి'ని 'దా' క్రింద చూపుటయు సరికాదని సారాంశము.

ఇక్కడ ఒక విశేషము. ఏమనగా :

'దావలచేతక్ = ఎడమచేతితో అనుటయే యుచిత'మని సమర్థింప బూని, వీ. బ్ర. గారు "పద్యములో కర్తృపదము 'ద్రోవది' యుండగా కవిబ్రహ్మ - తిక్కనసోమయాజి మరల 'తాక్' అను పదమును వాడునా? అట్లువాడుచో పునరుక్తిదోషము కాదా? అట్టిదోషము నా మహాకవి కంట గట్టుట తప్పుకాదా" అని *యూహ్యదోషము తెలిపినారు.

పాపము యూహ్యదోషకులు భారతమును చదివినవారు కారు. అందు వలన 'తా' ప్రయోగసాగస్యమునెరుగక అట్టివ్రాత వ్రాసినారు.

కవిబ్రహ్మ 'తా' ప్రయోగము చెన్నితావుల చెల్లెట్లు చేసియున్నాడో ఆయన కేమెఱుక?

(1) "ఈ చెలఁతఁ గన్న మన్మగుఁ
డైనఁ జిగురుగొడుగుఁ బువ్వుటమ్ములపాదులుక్
లోనుగ ♦సజ్జలు సేయం
'దా' నియమింపండె విరహతాపముఁ బేర్మిక్" (విరా. 2-28)

---

* చూడండి. 9 జూలై 1947 త్రిలిఙ్గ.

ఆ దోషము సరియైనదికాదని 7 జూలై 1947 త్రిలిఙ్గలో, శ్రీ ఉత్పల వేంకటరంగాచార్యులుగారును, 5 జనవరి 1948 త్రిలిఙ్గలో, శ్రీ యేలూరి పాటి రామభద్రచయనులుగారును సప్రమాణముగా మందలించి యున్నారు.

♦ 'సజ్జలు సేయక్' అని శ.ర. పాఠము.

(2) "దీని వసించుటఁ 'దా' నొప్పి పెంపున
నేపారు మందిరం బెద్దియొక్కో" (విరా. 2-30)

(3) " 'తా' నుపలాలించుచుఁ బవ
మానుం డనుతూలమ్మగుగమనమునఁ బొలసెఁ"(భీష్మ. 1-121)

(4) వ. "నుసవారుఁ 'గా' మోపినభంగిం బెనంగుదురు" (,,-3-32)

(5) "వాఁ, డనితరపథ్యకాయుఁడగు నాయనఁ 'దా'ఁబడనేయు"
(,,-3-311)

(6) " 'తా' వినిపించెం ఓత్పదే
వావలి నత్రి నిజవంశుఁడగు నిమికిఁ దగఁ" (ఆను. 3-191)

ఇ క్లెన్నని చూపనుఁ? 'తా' ప్రయోగముల తావులు తిక్కనరచన లోనే కాదు; ఎట్టాప్రెగ్గడ నన్నయ రచనలలో గూడా వందలకొలదిగ నున్నవి. అవియన్నియు పునఃపునఃపరిశీలనంగురు కాబోలు. వీఁబ్ర. గారు! అనకేమిఁ? 'కవిరత్న-కవి' గదా!!

15. అంగీకరించు

'అంగీకరించు' అను క్రియకు, శ.ర. లో— "సమ్మతించు; ఇయ్యకొను" అనియు, సూ.ని. లో— "ఒప్పుకొను; సమ్మతించు; స్వీకరించు" అనియు, అర్థములు చెప్పబడియున్నవి.

కాని, ఆ క్రియకు, 'పొందు' (= కలది యగు) అన్న యర్థముకూడా ఉన్నట్లు కావ్యములలో కనబడుచున్నది.

1. "మృదంగధిమిధిమి ధ్వానంబులకు నాదు యంత్రపాలికాసముద యంబు విమలమణి విమానమండలంబుననుండి గొండ్లిఁ బరిభవించు తెఱగంటి తెఱవల తెఱంగు నంగీకరింప." (వసు. 6-9)

"తెఱగంటి ..... అంగీకరింపఁ = దేవతాస్త్రీలయొక్క రీతిని బొందుచుండఁగాను." అని టీక.

2. "తాను గోదండంబుభంగి నంగీకరించి" (కాశి. 2-42)

3. "నిసర్గకాతరంబులగుకటాక్షవీక్షణంబులుపుష్పాంజలివిక్షేపభంగి నంగీకరింప." (కాశి. 5-169)

4. "ఖండపరశు కంఠమూల కఠోర కాలకూటవిషమషీకలంకపంక చ్ఛాయాచ్ఛటాపటలంబుభంగి నంగీకరించుచు." (హర. 2-21)

5. "అయ్యష్టమూ ర్తి...మదనధ్వజంబునిగుడించి...నక్షత్రమండలం బను ముత్యాలగొడుగునకుం బసిఁడికామభంగి నంగీకరింపఁజేసి."

(హర. పంచమాశ్వాసాంత్యభాగము.)

6. "అజాండకరండంబు వెండి *జలపోఁత గావించిన తెఱంగు నంగీకరించె" (పారి. 2-52) శ.ర. పాఠము.

'జలపోఁతగావించిన తెఱంగు నంగీకరించె' సనఁగా, జలపోత గావించిన విధమయ్యెను - అని సంప్రదాయార్థము.

7. "తారకలగుంపు జగజంపుగా శరపత్రశత్రుం డాతపత్రత యంగీకరింప" (ఆము. 7-66)

"ఆతపత్రత యంగీకరింపక = గొడుగుకొఁగా" అని, సంజీవని టీక.

ఈ క్రింది ప్రయోగములలో, అంగీకరింప = పొందు - అని యర్థము.—

8. "కాశియందు నిధనంబునొందు మానవుండు పావల్యధనలాభంబు లంగీకరించు" (కాశి. 5-26)

9. "అంగీకరించు మనుజుఁడు
సాంగోపాంగాధ్వరక్రియాఫలము వియ
ద్గంగాపులినంబున శివ
లింగార్చన మాచరించి లెస్సగశౌరీ. (,,-5-42)

10. "సప్తగోదావర జలతరంగాగారోహ
కేళీసుఖంబు లంగీకరించి" (భీమ. 1-98)

---

* 'జలపూఁత' అని వేదం-వారి పా. కావ్యములలో 'జలపోఁత'; 'జలపోసనము' అను పలుకుబడులేగాని 'జలపూఁత' అని యున్నట్లు కనబడదు.

'దూసి' వారి ప్రతిలో "జలపూఁతగావించిన తెఱంగున నంగీకరించె" అని పాఠమున్నూ, "బ్రహ్మాండమను బరిణెను - వెండిమొలాము, కావించిన తెఱంగునక = చేసిన విధమున, అంగీకరించెక = సమ్మతించెను" అని టీకయున్నూ ఉన్నవి.

11. "కాలోచితకృత్యంబు లాచరించి, యొక్కసారథి నంగీకరించి, యరదంబు పూన్పించి" (భా. ఉద్యో. 4-340)

ఇక్కడ, 'సారథి నంగీకరించి' యనగా– సారథి నేర్పాటుచేసికొని యని యర్థము.

(సంపాదించు)

సంపాదించు - అను క్రియకును ఇట్టి యుపచారికార్థము కలదు.

వ. "ఆరంభోరువు.....శుశ్రూషాతాత్పర్యంబునం బతి డెందంబున కానందంబు సంపాదించుచుండం బెద్దకాలం బరిగిన" (కాశీ. 3-213)

వ. "అధరబింబఫలారుణమరీచిమాలికలు రదనకుంద కుట్మలంబుల కనురాగంబు సంపాదింప."

ఈ రెండు తావులలోను, సంపాదించు = కలిగించు - అని యర్థము.

16. కుట్టిమము

శ.ర. లో—'కుట్టిమము = తాతికట్టనపు నేల, నెలకట్టు' అనియు, 'నెలకట్టు = తాతికట్టనపు నేల, కుట్టిమము' అనియు నున్నది.

'కుట్టిమము'నకు ప్రయోగము లేదు. 'నెలకట్టు'న కీ క్రిందిప్రయోగము చూపబడినది.

"అడుగుల నునుఁగాంతి నయ్యెడ పద్మరా
గంబుల నెలకట్టు కరణినొప్ప" (భా. విరా. ర. ఆ.)

సూ.ని. యును, అట్లే - కుట్టిమము = శిలారత్నాది నిబద్ధభూమి, నెలకట్టు' అన్నది. కుట్టిమమునకు కవిప్రయోగము నియ్యలేదు. 'నెలకట్టు= శిలారత్నాది నిబద్ధభూమి, కుట్టిమము' అని వ్రాసి 'అడుగులనునుఁగాంతి' అనే పద్యమునేకాక అదే యర్థము నిచ్చు మరిరెండు పద్యములనుకూడా ఉదాహరించినది.

శ.ర. తేట తెనుగుమాటలతో చెప్పిన యర్థమును, సూ.ని. సంస్కృతపదనిబద్ధ సమాసముతో చెప్పినది. అంతేకాని, కుట్టిమము, నెలకట్టు - అను పదములకు సరియైన, సమగ్రమైన అర్థమేమో వివరింపలేదు.

ఆ రెండు పదములకునూ, రాళ్లుపఱచిన - లేక రత్నాలుచెక్కిన-నేల (= భూమి, Land) అని, నిర్ధారణగా చెప్పుట సరికాదు. నేలయే కాదు, అట్టి సంస్కారమును (Pavement) పొందిన యే ప్రదేశమయినను, కుట్టిమమే (= నెలకట్టే). అది మేడఅడుగునేల కావచ్చును. ఏడంతస్తుల మహమేడీమీది ప్రదేశము కావచ్చును; నడిమి అంతస్తులోని నడవ కావచ్చును; తుదకు—పడవలు, బండ్లు, విమానములు మొదలగువానిలోని స్థలమైనను కావచ్చును. ఈ క్రింది రచనల నరయునది.—

1. "హరిహయ చూడుమా తెలియు టబ్రముడగ్గలోమాచికాని, యీం
గిరసునికైన నల్లయది కెంపుల మేడలతోడి విస్తర
న్మరకత కుట్టిమస్థలమొ మవ్వపులేఁజిగురాకుకెంపుము
మ్మరమునఁ దేజరిల్లు నెఱమామిడిమ్రాఁకులతోడి తోఁటయో"
(ప్ర. ప్ర. 1-62)

ఇందలి కుట్టిమము మేడమీది ప్రదేశము.

2. "ఎడనెడ జాలకంబుల జడిగొన్నఁ బొడకట్టు వెన్నెలచేత నట్టువడి
మునికుట్టిమంబులు తుడిచి." (ఉ. హరి. 5-136)

ఇందలి కుట్టిమములు మేడలోపలిభాగములు.

3. "ఒక్కనాఁడు భవాని యుబుసుపోకకుఁ బ్రేడి
జలపోసనము కసీసంపుఁబట్టు
బంతిఁ గుట్టిమభూమిఁ బాణిపల్లవమున
నాస్ఫాలనముచేయు చాడుమండ" (కాశీ. 6-161)

ఇందలి కుట్టిమభూమి - ఆటలాడుకొను చోటు. (Play Ground)

4. "కర్పూరరజమునఁ గలయఁ గుట్టిమములు
దీపింప ముగ్గులు దీర్చువారు." (నాసి. 2-163)

ఇందలి కుట్టిమములు, మేడల ముంగిళ్లు.

5. "ఉద్దామకేకారవానుమీయమాన మరకత కుట్టిమస్థిత శిఖండి మండలమ్." (కాదం. పూ.)

ఇందలి కుట్టిమము సౌధముఖభాగము.

6. "పటికంపు సెలకట్టుపై సెక్క బెగడొందు
నింతి యిచ్చట గుట్ట లెట్లుదాఁటె" —కంచి శరభకవి - హరిశ్చంద్ర.

ఇక్కడ, సెలకట్టు = కుట్టిమము, సౌధోపరిభాగము.

7. "అంబుగ్రహణాగతోరుపథికాక్రాంతస్ఫుర త్కుట్టిమం
బు...ఆబావి యొప్పుంగడుఁ" (హంస. 1-185)

ఇందలి కుట్టిమము బావిచుట్టును బండలుపరిచిన చోటు.

8. "దేహాంతంబున దివ్యయానగతుఁడై దివ్యార్క చంద్రద్యుతి
వ్యూహోద్భాసియు సర్వకామగము వజ్రోద్యద్ధవాక్షోగ్ర ని
ర్వ్యూహంబుఁ మణిబద్ధకుట్టిమమునై యొప్పారు యానంబునఁ
బూహాత్మ్యంబెసఁగఁ జరించుసుఖియై మానాతిగాబ్దావలుల్."
—హరి. ఉ. ఆ. ౧౦. పుట. ౨౯౧.

ఈ పద్యమున విమానములో (మణులుపరిచిన ప్రదేశము =) కుట్టిమము-ఉన్నట్లు చెప్పబడినది. గమనించారా?

మరి కుట్టిమము (= సెలకట్టు) అంటే, "ప్రాతికట్టనపు నేల" అని, శ. ర. యును, "శిలారత్నాది నిబద్ధభూమి" అని, సూ. ని. యును, వ్రాయుట సరియగునా? సమగ్రమైన అర్థమగునా? ఆ నిఘంటువుల మీదనే ఆధారపడువారు, ఆ పదము - రాళ్లుపరచిన 'నేల'యందేగాని, ఇతరత్ర చెల్లదనియే అనుకొందురుగదా? అట్టి నిశ్చయముతో తప్పుచేయుటయు తటస్థించునుగదా? 'కచా'! అనుకొనుటయేల? ఆంధ్రమల్లినాథులంతవారు అట్టి యర్థమునే చేసికొని, కొండంతతప్పున కర్తలైనారు. (వివరములకు, మా. 'జితకాశి' పీఠిక. పుట. 26) ఇక సామాన్యులసంగతి చెప్పవలెనా?

17. నేర్పరి

సూ.ని. 'నేపప(ర్ప)రి = నేర్పుకలవాఁడు, చతురుఁడు' అనిచెప్పి, ఆ యర్థమును తెలుపు రెండు ప్రయోగములుకూడా, యిచ్చినది.

అయితే, "ఎంత నేర్పరివమ్మ యింతిరోనీవు". (బాణాసురయుద్ధము)

ఇత్యాది ప్రాచీనరచనలలో, 'నేర్పరి' యనుపదము - నేరుపుగల స్త్రీయందును ప్రయుక్తమైయున్నదే; ఆయర్థమును నూ.ని. చెప్పకపోవుటకు కారణ మేమి?

అట్లు నుహతీవాచకమున ఆ పదమును ప్రయోగించిన పూర్వరచనలను నూ. ని. చూడలేదుకాబోలు - ననవచ్చునా? అట్లనుటకు వీలులేదు. ఏమంటారా!

"చెలువకు బిడ్డకుట్లు విలసిల్లఁగ భిల్లపురంధ్రు లంతలోఁ
బిలువరెమంత్రసానిఁ దలపెట్టరె కాయముఁగూర్ప లేమకున్
జలకముగాఁపరే కొలనుచయ్యనఁద్రవ్వరె మందగామినిన్
నిలువఁగనీకురే, యనుచు నేర్పరులై కడుసంభ్రమించుచున్"

— కాళ. 3-౭౬.

అను పద్యమును 'కాయము' అను పదముక్రింద ఉదాహరించి యున్నది. పద్యములోనున్న - నేర్పరులైన (భిల్లపురంధ్రులు) స్త్రీలేనని, పురుషులు కారని, తెలిసికొని యుండదా? తెలిసికొనియే యుండును. తెలిసికొనియు నేల చెప్పలేదందురా?

శ. ర. లో 'నేరుపరి (=నేర్పరి) - సామర్థ్యముకలవాఁడు, సమర్థుఁడు' అనిమాత్రమే యున్నది. అందువల్ల, అంతమాత్రమే - నూ. ని. చెప్పినది. అందులో, 'సామర్థ్యముగల స్త్రీ' అన్నయర్థము లేదుగనుక నూ.ని. చెప్పలేదు. తత్త్వమింతే.

శ.ర. కర్త ఆయర్థమును చెప్పకపోవు టేల? అంటారా? అది పొరపాటు. ఆయనగారు 'సిగ్గరి' అన్న పదమునకు - లజ్జగలవాడు; లజ్జగలది-అని యర్థము చెప్పియే యున్నారు.

నూ. ని. యైనను, నేర్పరి - అను పదమునకు — అర్థమును తాను స్వయముగా యోచించి ప్రాసియున్నచో ఈ పొరపాటు జరిగియుండదు. చూడండి :—

తెగువరి-అను పదమునకు, "౧. వాడిగలది. ౨. దానశీలము; దాత. ౩. సాహసికుఁడు; సాహసికురాలు"—

అని వ్రాసియున్నది. తెగువరి-అను పదము, శ.ర.లో లేదు. సూ.ని. సొంతము. అందువల్లనే స్వయముగా యోచించి అర్థమును సమగ్రముగా వ్రాసినది.

నేర్పరి = నేర్పుగల స్త్రీ-అని, నిఘంటువు చెప్పకపోవుట ఒక గొప్ప తప్పా? అంటే, తప్పు కొడేమోగాని, లోపముమాత్ర మగును. నిఘంటువు చెప్పకున్నచో - నేర్పుగల స్త్రీ-అన్న యర్థమున 'నేర్పరి' అను పదమును వాడవచ్చునో, వాడరాదో, జిజ్ఞాసువునకు తెలియు నెట్లు?

శ.ర.కర్త 'నేర్పరి'ని మహద్వాచకముగామాత్రమే పఠించి యూర కొన్నందున మహతీవాచకముగా ఆ రూపమును వాడకూడదు కాబోలు ననుకొని, శ్రీ వేదం వేంకట్రాయశాస్త్రిగారంతటి పండితులు "రాజకన్య నేర్పరురా లాయెను" అన్నారు. (చూ. 'జితకాశి'పీఠిక. పు. 29) కాబట్టి సూ.ని. 'నేరుపరి = నేర్పుకలవాడు; నేర్పుకలది' అని చెప్పక పోవుట లోపమే. ప్రమాదహేతువుకూడాను.

18. నట్టు

సూ.ని. 'నట్టు' అను పదమున కర్థము నిట్లు వివరించినది:

"నట్టు = తృణవిశేషము. దూర్వ, గతికగడ్డి. ఉ. కుందురు నట్టు, గతికనట్టు" (బ్రౌ.)

సూ.ని. 'నట్టు' అను తెనుగుపదమున కర్థము నెరుగకపోవుటే వింత. అది యట్లుండగా, బ్రౌనుచెప్పిన యర్థమునైనను సరిగా తెలిసికొనకపోవుట అంతకంటెను వింత.

'నట్టు'కు - ఇల్లు; ప్రదేశము-అని రెండర్థములు. "నట్టునా గేహ తద్దేశనామ మెసఁగు" (ఆం. భా. 3-45)

కుందురునట్టు-అంటే, కుందురు ఎక్కువగా మొలచుచోటు. గరికె నట్టు-అంటే, గరికె ఎక్కువగా మొలచుచోటు.

ఇల్లే, గుయ్యనట్టు; దంతె(= దంతి)నట్టు మొదలయినవియును. కాబట్టి "నట్టు = తృణవిశేషము. దూర్వ, గతికగడ్డి" అనుట సరికాదు. నట్టు-అను పదము, లక్షణచేత, ఒత్తుగా పెరిగిన గడ్డి-గాదము మొదలగు

మొక్క-ల మొ త్తమునందును (ప్రస్తావమునుబట్టి) వ ర్తించును. నట్టులలో, కుందురునట్టు, గరికెనట్టు బలీయములు. అవి బలిసినచోట మరి పైరు పట్టదు. అవి ఒకమాత్రన చావవు. అయిదారు చాళ్లు దున్నినగాని నశింపవు.

ఈ యెల్లవివరమును, తెనుగుసెరుగని వారికొరకు, బ్రౌనుపండితు డెంత చక్క-గా వ్రాసియున్నాడో చూడండి.

"నట్టు - A spot of ground, Place, abode....A platform of earth, a terrace. The bent grass, that infests corn-fields.— "It is undescribed and of peculiar character : having widely-spreading perennial roots, or underground stems. There are two species : one species కుందురునట్టు in the చేఁడ or black soil : and గరకనట్టు in the *mudub* or mixed soil. The largest species called పడవనట్టు requires (for its eradication) the large plough with twelve bullocks : the smaller is గంపనట్టు. It furnishes excellent food for cattle : and, could it be raised on the poorer lands alone, it would be extremely valuable."

నూ ని. బ్రౌణ్యమునైనను సరిగా చూడక 'నట్టు'కు తప్పర్థము చెప్పినది.

19. నీరువట్టు

"నీరువట్టు (నీరు + పట్టు) = దప్పిగొను. దప్పి, పిపాస" అన్నది నూ.ని.—దప్పి యనగా నీరుపట్టుట-కాదు; నీరువట్టుట, =(గొంతులోని, నాలుక మొదలు) తడియారిపోవుట.

"వట్టుట or వట్టిపోవుట To dry, become dry, be drained నీరయింకుట, నీరు యెండిపోవుట, తీరిపోవుట." (బ్రౌను)

"పదనుదివిసినకస్తూరి ప్రాచియలరు
పాయఁబాఱినకూడు నీర్వట్టుమడుఁగు
గళితమణియగుసామ్మునై కానఁబడియె
దుర్విదగ్ధుండు గౌరవదూరుఁడగుచు." (పాండు, 3-22)

నీర్వట్టుమడుగు - అనగా, నీరెండిపోయిన మడుగు.—నోట తడిలేక పోవుటయే, దప్పియగుట.—

గీ. "పెదవిపేలెత్తు నాలుక పిడుచగట్టు
గొంతుతడిదీయు నక్కొండు గొంతదడవు
దాహమున కుదకములేక తడసెనేని." (దశా. 2-138)

ఆ. "రాత్రి జాగరణభర్భ్రాంతులై వారు
నిద్రవొందియుండ నీరువట్టి
ధారుణీశ్వరుండు తన్మంత్రకలశోద
కంబులెల్లద్రావె గడుపునిండ." (భార. ఆర. 3-202)

నీరువట్టి = కుత్తుకయెండి = దప్పియైయని యర్థము.

గీ. "తపసిగనుగొని శోషితతాలుడగుచు
నెండి తడిలేక కుత్తుక నెలుగు డింద
మందభాషలనిట్లను మనుజవిభుడు.

క. తోయములుదెమ్మహాకు...ఘనచేతోయుత—
డప్పిజనించెను." (భాగ. 1-459)

క. "భూకాంత నీరువట్టుకుఁ
గాక వదన*మిలకరింపఁ గాన్పించిన పం
డ్లోకాకన వెలిపుచ్చలు
లోకములోఁగానిపెట్లు లోబడెజనముల్." (వరా. ౧౦. 3౦)

ద్వి. "మునినాథ నేఁబోయి ముదమొప్ప జలము
గొనివచ్చు నీలోన గుత్తుకమిడికి
మునికుమారుఁడు దాహమునఁ జచ్చెనేని."

—గౌ. హరి. పూ. 1810

కుత్తుకమిడికి, అంటే గొంతెండి, అని యర్థము.

---

* 'మిలుకరింప' అని సూ.ని. పా. ఇలకరచు, అనుక్రియకు 'ఈల, కరచు' 'ఇలకరించు' అనునవి రూపాంతరములు. కావున 'ఇలుకరించు' అనుట సరికాదు. 'ఇలకరించు' శ.ర. లో లేదు. బ్రౌను, ఇట్లు వివరించినాడు. 'ఇలకరించుట' ఈలకర్చుకొని వుండుట. అతనికి పండ్లు యిలకరించినవి. his jaws were set.

నీరుపట్టుట

'నీరుపట్టుట' యనఁగా ఉన్ననీటికితోడు ఎక్కువ నీ రేర్పడుట. లేక నీరులేనిచోట, నీ రేర్పడుట.

వాడు నీరుపట్టినాడు, అంటే, క్రొ త్తర క్తము పెట్టి ఆరోగ్యముగా నున్నాడనియు,- కురుపు నీరుపట్టినది, అంటే, చీముపోసినదనియు అర్థములు.

నీరుపట్టు = నీరుపోయు = ర క్తము పెట్టు.

1. "ఇవ్విధంబున మెలఁగు నయ్యింతి యొంటి
తిండికతమున నినుమడికండపట్టి
నీరుపోసిన మేనితో నిలుపరాని
మనసుచే జారభోగ మేమఱుక తిరుగు" (ఋక. 3-351)

2. "అనువొందనీరుపట్టినమేని తళతళల్
దిలకింపఁ దొలుచూలు తలిరుఁబోండ్లు" (దశా. ౪-23)

నీరువట్టు; నీరుపట్టు, పరస్పరవిరుద్ధార్థక క్రియలు. కాబట్టి, 'నీరు + పట్టు = నీరువట్టు' అనుట తప్పు.

సూ.ని. దప్పి, యనఁగా, గొంతు-ఎండుట, అన్నవిషయమునుగూడా, ఎఱుగదాఁ? ఎఱుగకేమిగాని, (గొంతు) - 'ఎండు' అను నర్థమునిచ్చు పదము 'వట్టు' - 'పట్టు' - యెఱుగదు. అంతే.

20. తిమిరము

శ.ర. లో,— "తిమిరము. 1. చీకటి. 2. నేత్రరోగవిశేషము" అని యున్నది.

సూ.ని., తిమిరము = సం. వి. అ. పుం. ౧ చీకటి. ౨ అంధత్వము, నేత్రరోగవిశేషము.—అని చెప్పి, రెండవ యర్థమునకు,— "తిమిరంపు వయసుగుబ్బల, కొమరాలవు." — (మనుచ. ౪.౨3) అనుపద్యము నిచ్చి,— 'తిమిరంపువయసు, కన్నుగానని వయస్సు, ఉత్కటమగు యౌవనము-అని భావము' అని వివరించినది. ఆక్కడనే 'తిమిరము = మదము-అని చిన్నయ సూరినిఘంటువు' అనియును తెలిపినది.

'తిమిరంపువయసు' అనుమాటకు, సూని చెప్పినయర్థము సరియైనది కాదు.—

తిమిరము - విశేష్యమైనప్పుడు, తిమిరపు - వయసు = తిమిరము యొక్క వయసు అగునేగాని, 'కన్నుగాననివయసు' కాదు.

తిమిరపు = నేత్రరోగముచేత కన్నుగానని-అని యర్థముచెప్పుటకు శాస్త్రము మొప్పదు.

అది యట్లుండనిండు: 'కన్నుగానని' అను జాతీయమునకు నేత్రరోగముచే - అంధమైన = గ్రుడ్డియైన-అనియే నా అర్థము? అసలు, కనుటకును, కానకపోవుటకును వయసేమి కన్నులుగల ప్రాణియా? కాదు. కనుక కన్నుగానమిని, వయసుగలవ్యక్తికి చెప్పదగునుగాని వయసుకు చెప్పదగదు.

ఆ వ్యక్తి కన్నుగానకపోవుటకు, ఆ వయస్సు (ఉత్కటయౌవనము) వలన గలుగు పొగరు (మదము) కారణమవుతుంది.

ధనము, వయసు, విద్య, ప్రభుత్వము మొదలగునవి మదహేతువులు.

(1) ''లోకేశ మానినాం మూర్ధ్న్యా ద్ధరిష్యే శ్రీమదం తమః''
భా. 10 స్కం 25 అధ్యా.

(2) ధన మదంబును వేదవిద్యా మదంబు
మోహలక్ష్మీ మదంబును ముదిరికొనె'' (కాశి. 7-155)

(3) ''అల్పరాజ్యలక్ష్మీలలనాంధబుద్ధికి'' (భా. సభా. 2-22)

(4) అతఁడుక్తనృప,శ్రీల రమించె హేమమయ చిత్రితహర్మ్యములం
బ్రియాకటా,శ్రీలసమందహాససురతామృతపానమదాంధబుద్ధియై.''
(వాసిష్ఠరామా. 4-104)

(5) ''యౌవనదర్పంబున విఱ్ఱవీఁగుచు'' (భల్లా. 3. ఆ.)

మదము, గర్వము మొదలగువానివలన కన్నుగానకపోవుట యనగా-మంచిచెడ్డల విచారముచేయకపోవుట; బొగాముల సరయకపోవుట. అంతేగాని, నేత్రరోగముచేత దృష్టిచెడుట కాదు; గ్రుడ్డితనమును కాదు. అరయమిని 'కన్నుగానమి'గా చెప్పుట అలంకారికమర్యాద. ఆ కన్నుగానమిని దృష్టిదోషముగాను, అందుకు మూలమయిన కామము, క్రోధము మున్నగు

గుణములను అంధకారముగాను, నేత్రరోగముగాను కవులు రూపించు చుందురు.

ఒకకొన్ని యుదాహరణములు :—

1. "అతను దర్పాంధకార మంతంత గవియఁ గన్నుగానక" (రామా. 5-70)

2. "అతిగాఢమైన క్రోధాంధకారంబునఁ
గన్నుల నంధుండుగాని వాఁడు." (కాశి. 4-263)

3. "ప్రియయన యతిగర్వతిమిరాంధు నన్నుఁ, గరుణఁ దప్పులు సైచి కావవేయనుచు" (బసవ. పు. ౧౧౪)

అంధకారముగా రూపకముచేయుకయు చెప్పట కలదు.—

4. "మానసారుండు రాజ్యగర్వంబునఁ గన్నుగానక" (దశ. కు. 2-4)

5. "వజ్రనాభుండు ప్రాభవాభిమానంబునఁ గన్నుగానమిఁ దన్నుఁ దా నెఱుంగకున్న వాఁడు." (ప్ర. ప్ర. 1-117)

6. "కటకట పుండ్రనందనుండుకన్నులఁగానకవచ్చి" (ఉ.హరి. 3.89)

కన్నులఁగానకవచ్చి, అంటే, బలగర్వమున ఎదిరిని తన్ను తెలిసికొనక వచ్చి-అని యర్థము.

7. "కండకావరమునఁ గానరు మరణంబు" (వేమ. 8-147)
కానరు = తెలిసికొనజేరరు.

8. "పాపాత్ముండు మదాంధుఁడాతులువ" (భా. ఉద్యో. 3-45)

9. "తమియు మత్సరము డెందమున నంతంతకుఁ
బొడమికొనఁడు ప్రొద్దుపొడుపుఁగ్రుంకు" (పి. శకుం. 4-164)

10. "త, త్సంపన్నాంధున కంజనంబు వినుమీ దారిద్ర్య మూహిం పఁగ." (భాగ. 10 పూ. 894)

ఇందు దారిద్ర్యమును అంజనముగా చెప్పుటచేత, ఆ యంధత్వము సంపన్నతయను నేత్రరోగమువలన కలిగినదని భావము.

11. "అజ్ఞానతిమిరాంధస్య, జ్ఞానాంజనశలాకయా
చక్షురున్మీలితంయేన, తస్మై శ్రీగురవేనమః"

ఇంగు, 'అజ్ఞానము,' 'తిమిరముగా = నేత్రరోగముగా - రూపకము చేయబడినది. ఎంగువల్ల? మంచిచెడ్డల నరయజాలమి (కొనమి) అజ్ఞాన మూలకముగనుక, ఆ కొనమిని దృగ్ వ్యాపారముగాచేసి, దానికి మూల మయిన అజ్ఞానమును నేత్రరోగ మన్నాడు; కవి. అంతేగాని, నేత్రరోగ మయిన 'తిమిరము'ను అజ్ఞానమునకే అంటించి,— తిమిరంపు టజ్ఞానము(= కన్నుగానని అజ్ఞానము) అనలేదు. కన్నుగానని ప్రాభవము; కన్నుగానని విద్య; కన్నుగానని సంపద, అనుట సంప్రదాయముకాదు. కనుకనే ఆ కవి, కన్నుగానని యజ్ఞానము - అనలేదన్నమాట.

మనకు ప్రకృతమైన 'తిమిరంపు వయసు'లోనో, నూ.ని. తిమిరమును వయసునకే అంటగట్టినది.

'తిమిరంపు వయసుగుబ్బల - కొమరాలవు' అన్నచోట, ఏర్పడ వలసినది 'గుబ్బలపాగరు'గాని, మంచిచెడ్డల నరయజాలమి కాదు; అంధత్వ మును కాదు. కాబట్టి, తిమిరము= నేత్రరోగము, అంధత్వము-అన్న యర్థ మక్కడ అనువుపడదు.

ఆ యర్థ మనువుపడదు గనుకను, అక్కడ అనువుపడునట్టి 'పాగరు' అను నర్థము సంస్కృత 'తిమిరము'నకు లేదుగనుకను, తిమిరవయస్సు-అను సిద్ధసమాసరచన కనబడదు గనుకను, ఆ 'తిమిరము' దేశ్యముగాని, తత్సమము కాదని నా మనవి.

'తిమిరంపు వయసుగుబ్బలు' అన్న మాటకు, జూలూరి–అప్పయ్య శాస్త్రిగారు, "తిమిరంపు = పాగరుగలిగిన, వయసుగుబ్బల = ప్రాయపు చన్నులుగల" అనియే టీక వ్రాసినారు. వారా పదమును తత్సమముగా గ్రహించియున్నచో 'పాగరు' అన్న యర్థముపచ్చుటకు మార్గ మేది?

మరియు, కౌణ్యమున ఇట్లున్నది:— "తిమిరంపు adj. of or belonging to the quality of darkness. Blooming proud, arrogant, చీకటిసంబంధమైన, నవయౌవనముగల, గర్వముగల N. 9-324 *తిమిరంపునిండు ప్రాయపు మోహనాంగుల గెరలించు నుపరతిక్రీడనముల. Swa. 4-121. తిమిరంపు వయసుగుబ్బల కొమరాలవు. టీ. పాగరుగలిగిన."

---

* 'తిమిరంబునిండు ప్రాయము'-అని సరియైన పాఠము. (దశా.చ. 8-94)

చిన్నయసూరి నిఘంటువులో-"తిమిరము=మదము" అని యున్నదని, నూ.ని, యే చెప్పుచున్నది.

'సారంగ'లో, 'కాయములు, కొమఱుదిమిరపుఁబ్రాయములు' అన్న చోట, శ్రీ 'వేదం'వారి టీకలోను,-"తిమిరపుఁబ్రాయములుఁ = మదము గల వయస్సులను" అనియే యున్నది.

అంతేకాక, వారు శృం.నై. (6-66)లో, 'ఒక్కఁగుబ్బల కొమరాలు చక్కఁవచ్చి' అన్నచోట,—"'గుబ్బల' కొమరా లనుటచేతనే గుబ్బలు తెలియుచుండఁగా గుబ్బలంజెప్పుట తత్ప్రాశస్త్యదోషతార్థము. ఒకపాటి జవ్వనమున వానియుదుటు చెప్పరానిదిగా నుండును.— 'తిమిరంపువయసు గుబ్బల - కొమరాలవు' అని మనుచరిత్రలోని వర్ణనయు నిట్టిదే." అని వ్రాసియున్నారు.

ఈ 'తిమిరపు వయసుగుబ్బల'నే, ముక్కుతిమ్మనార్యుడు,- "మబ్బుకొను వయసుగుబ్బలు" (పారి. 2-52) అన్నాడు. ఆమాటకు, 'వసి'వారు "మదించిన ప్రాయపు స్తనము" అనియు శ.గ. కర్త-"మబ్బుకొను = మంపుకొను" అనియు, నర్థము చెప్పినారు.

మబ్బు, మంపు, మదము, పొగరు, నిక్కు - సమానార్థకములే. గుబ్బలకు పొగరును, ఉగుటును చెప్పుట ఉచితము; పరిపాటియున్నది.—

(1) "చనుఁగవపొగరు నీ జంటగెక యొఱుంగు" (కలు. శ. 175)

(2) "...గుబ్బలపొగరునఁ, బెట్టెడురవికెలు పిగిలెనమ్మ" (కలు.శ. 101)

(3) "ఉదుటు గుబ్బలుగల తల్పు టురమునూచి" (ఆము. 2-10)

(4) "ఉదుటుఁజన్నులపయి నుఱుకు నగ్గలికల
మనసాగ్గనీయని మూగ్ధ్యములను." (విప్ర. 3-87)

(5) "చన్నులనిక్కు..." (జాహ్నా. 4-55)

(6) "నిద్దంపుఁజనుదోయి నిక్కుదోఁప." (కువల. 2-80)

(7) "అతివ కుచంబులుఁ, మెఱుఁగుటారును, వేనలియుఁ,...
నిక్కెడు, నీల్గెడు, విఱ్ఱవీఁగెడుఁ" (విజ. 1-99)

కుచములునిక్కుట - పొగరువలననే.—

పూర్వ టీకాకర్తలును, పూర్వ నిఘంటుకర్తలును, ఇటీవలి పండితులలో 'ఆంధ్రమల్లినాథు' డనిపించుకొన్న శ్రీ వెంకట్రాయశాస్త్రిగారు

కూడా - తిమిరంపువయసు = 'పాగరుగలిగిన' వయసు అని స్పష్టముగా వ్రాసియుండగా, నూ.ని. ఆది గమనింపక,—"తిమిరంపు వయసు = కన్ను గానని వయస్సు" అనుట యుచితమగునా?

నా ముఖ్యమయిన మనవి యేమనగా.—

తిమిరము - అను పదము సంస్కృతమున నున్నట్లే తెనుగునగూడా ఉన్నది. అరి, అంగి, కరము, తమి, తెరి, దరి, మనువు, మాత్ర మొదలగు పదములవలెనే—అటు సంస్కృతమునను, ఇటు తెనుగునను ఒక్క రూపమునే యుండి భిన్నార్థము నిచ్చుచున్నది. కొబట్టి నిఘంటువులు 'తిమిరము'ను జ్యేష్ఠముగా గ్రహించి— మదము, పాగరు అని యర్థముచెప్పి, అందుకు ఉదాహరణగా, 'తిమిరంపు వయసుగుబ్బల-కొమరాలు' పద్యమునే చూపుట యుచితము.

కీ. శే. త్రిపురాన వేంకటసూర్యప్రసాదరావు దొరవారు, తమ మొయిలురాయబారములో, (ఉద్దామాని యౌవనాని = "గాఢతిమిరంపు కైలజవ్వనముల పెంపు" అన్నారు.

'తిమిరము' విశేషణముగా సంస్కృతమునను ఉన్నదేమో!

(తిమిరవిచారము)

తిమిర మనగా నేత్రరోగమనీ, ఆరోగము 'అంధత్వ'మనీ నూ.ని. చెప్పినది. కాని, తిమిరము కేవల మంధత్వము కాదు. అది యొక తెరగ దృష్టిదోషము. ఆ దోషము కంటియొక్క నాల్గవపటలము నాక్రమించినపుడు 'తిమిర' మనబడును.

ఆ దోషము సంభవించినపుడు కన్నులకు చీకటి క్రమ్మినట్లుండును. కాని, సూర్యచంద్రులు, నక్షత్రములు, మెఱుపులు, నిర్మలమగు తేజస్సుగల మణులు మున్నగు వస్తువులును కనపడుచునే యుండును. తిమిరము ముదిరినయెడల 'కాచము'; 'నీలిక' అనబడును. లింగనాశమనియు చెప్పబడును. లింగనాశమనగా, నేత్రేంద్రియనాశ మని అర్థము.

"తిమిరాఖ్యస్య వై దోషశ్చతుర్థపటలంగతః,
రుణద్ధి సర్వతోదృష్టిం లింగనాశ మతఃపరమ్.
అస్మిన్నపి తమోభూతే నాతిరూఢే మహాగదే,

చంద్రాదిత్యసనక్షత్రావంతరిక్షే చ విద్యుతః,
నిర్మలాని చ తేజాంసి భ్రాజిష్ణూ న్యథపశ్యతి."
—మాధవ నిదానము.

కాబట్టి, "తిమిరము = అంధత్వము" అనుట సరికాదు. నిఘంటువు ఆ పదమునకు సరియైనయర్థమును - వివరింపదలచుకొన్నచో,—

'తిమిరము = కంటిలోని నాల్గవ పటలమునకు గలుగు దృష్టిదోషము.' అని వ్రాయవలెను; లేదా అంతపని మనకెందుకనుకొన్నచో (శ.ర. వలెనే) 'నేత్రరోగము' అని చాటిపోవలెను.

అంతేగాని అనుచితార్థమును, అస్పష్టార్థమును, వ్రాయగూడదు.

నానార్థరత్నమాలలో, "ధ్వాన్తేఽక్షిరోగే తిమిరమ్" అని మాత్రమే యున్నది.

21. చూర్ణకుంతలము

శ.ర. లో "చూర్ణకుంతలము = అలకము, నెఱికురులు(= చుట్ట వెండ్రుకలు, వక్రకేశములు)" అని యున్నది.

నూ.ని. లో—"చూర్ణకుంతలము-సిందూరాది చూర్ణమును ధరించు కురులు - అలకలు, నెఱికురులు" అని యున్నది.

*నూ.ని. పద్ధతిప్రకారము 'Hyphen' లోనిది యోగికార్థము; పిమ్మటిది రూఢ్యర్థమును కావలె. మరి, యోగికార్థములో, సిందూరాది చూర్ణమును ధరించిన కురులు, రూఢ్యర్థమున, 'నెఱి (=వంకరయైన, కుటిలమైన) కురు' లగుట యెట్లు?

యోగికార్థములోని 'పండెపుగుఱ్ఱము' రూఢ్యర్థములో - 'కుంటిగుఱ్ఱ' మగుటయు నుండునా?

---

* 'Hyphen'లో చెప్పబడునది యోగికార్థమని, నూ.ని. పండితులలో నొకరైన దు. నూ. నా. శాస్త్రిగారు తెల్పియున్నారు. (చూ. ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక. పార్థివ చైత్ర-ఆషాఢములు. పుట. 30)

'చూడ్గకురులు' అయితే-సిందూరాదిచూడ్గమును ధరించుకురులు కావలె; కాకపోతే-నెలికురులు కావలె. అంతేగాని, రెండును అగునా? ఆ రెండును భిన్నార్థములగుచో, ఆ రెండర్థములను ఏ. బి. అని అంకెలువేసి వేరువేరుగా చెప్పవలెగాని, ఒకటి యౌగికార్థముగా, రెండవది-రూఢ్యర్థముగా చెప్పుట యెట్లు?

అసలు, యౌగికార్థములో ఇవి 'కురు' లనీ, ఇవి 'గిరు' లనీ యేర్పడునా? ఏర్పడదే. చూడండి.—

*'వజ్రి' అను పదానికి 'వజ్రము (అను ఆయుధము) కలవాడు' అని యౌగికార్థము; 'ఇంద్రు'డని రూఢ్యర్థము. అంతేగాని-వజ్రముగల యింద్రుడని యర్థముకాదు. అట్లే మదావళి శిఖావళి శబ్దములకు - మదముకలది; శిఖకలది యని యౌగికార్థములు. ఏనుగనీ-నెమలియనీ రూఢ్యర్థములు. రెండర్థములను కలిపి, మదముగల యేనుగు; శిఖగల నెమలి—అని చెప్పగూడదు.

కాబట్టి చెప్పవలసివస్తే—'సిందూరాదిచూడ్గమును ధరించునవి' అని యౌగికార్థమునూ, 'కురులు' అని రూఢ్యర్థమునూ చెప్పవలె. అంతేగాని-రెండర్థములను జోడించి, 'సిందూరాదిచూడ్గమును ధరించుకురులు' అని చెప్పి, ఇది యౌగికార్థమనుట తప్పు. సిందూరాదిచూడ్గమును ధరించుకురులంటే - నెలికురులనుట అంతకంటెను తప్పు.

శ.ర.కర్త చెప్పలేదుగాని, రూఢియౌగికముల తత్త్వమును, బొత్తిను పండితు డిట్లు తెలిపియున్నాడు.

"యౌగిక Customary, usual, common, proper, regular (as the sense of words depending upon their derivation or construction) సాధారణమైన, శబ్దవ్యుత్పత్తినిపట్టిన.—రూఢి or రూఢి

---

* వే. వే. శాస్త్రిగారు, గౌ. హరి. లఘుటిప్పణములో (పుట. 41) "వజ్రివి = వజ్రాయుధముగల యింద్రుడవు" అనియు, 'సారంగధర' లఘుటీకలో (పుట. 151) "మదావళి = మదపుటేనుగు" అనియు వ్రాసియున్నారు.

యైన. Certain, notorious, usual, or customary. Peculiar (as opposed to యౌగిక, that is, etymological or radical) the రూఢ్యర్థము or usual meaning of పంకజము is a lotus but the యౌగికార్థము or literal sense is mud-born. నిశ్చయమైన, ప్రసిద్ధమైన, అనన్యసాధారణమైన, లోకరూఢిఅయిన, universally known."

ఇక,—సింగారాదిచూర్ణమును ధరించు కొంతలములను - చూర్ణకుంతలము లనుట కలదేమో విచారింతము.

లోకములో, స్త్రీలు కొంతలములందు పుప్పొడి మొదలగు సుగంధ చూర్ణములను ధరించుటకలదు. అందుకు ప్రమాణముగా, —

(1) "పరువంపుపుప్పొడి బాగుగాఁదీర్చిన
యలకలపైఁ బొలుపార నలికి" (హరి. ఉ. పు. 106)

(2) "సీమంతపథమునఁ జిగురొత్తునప్పుడు
రమణీయసింగార రజముసొబగు." (కాశి. 7-75)

(3) "కుసులలోఁ గదియంగఁ గ్రొత్తపుప్పొడిఁ జెల్చి
మేదించినించెను మెలఁతయొకతె" (యయా. 5-101)

(4) "చుంబనా దలకచూర్ణధూషితం శంకరోపి నయనం లలాటజమ్."
(కు. సం. 8-19)

ఇత్యాదిరచనలును కలవు. అయితే—కొంతలములందు చూర్ణమును ధరించు ఆచారమునుబట్టి, చూర్ణకుంతలశబ్దము పుట్టియుండునాఁ? అలా అయితే, చూర్ణమునుధరించుటమాట యెట్లయినను, కుంతలము (=కురు) లందు కుసుమములను ధరించుట సహజముగదా.

చూర్ణమును ధరించుటచేత - చూర్ణకుంతలము లైనప్పుడు, కుసుమములను ధరించుటచేత-కుసుమకుంతలములను కావలసినదేగదా! అయినవాఁ? ఎందును కనబడవే!

మరియు, మగువలు కొంతలములందు పలుతెరగుల భూషణములను ధరించుట జగద్విదితముగదా; మరి 'భూషణకుంతలము'లనియు ననవచ్చునే. అ ట్లెవరైనా అన్నారా? అనకపోవు టేలఁ?

భూప్రపంచములో 'చూర్ణకుంతలములు'మాత్రమే యుండుటేల? కుసుమకుంతలములు; భూషణకుంతలములు లేకపోవుటేల?

అది యట్లుండఁగా, స్త్రీలు, సిందూరాదిచూర్ణమును కురులయందు వలెనే - కుచములయందును అలదుకొందురు. ఆ యంశమును స్పష్టము చేయుచున్నవి యీ క్రిందిరచనలు.

1. "కదాచిత్ కుచచందనచూర్ణ ధవళితోర్మిమాలం.....సావరోధ బనో జలక్రీడయా గృహదీర్ఘి కాణా మంభశ్చ కార." (కాదంబరి. పు. 57)

2. "క్వచి న్మృగ్గోద్గారీ క్వచి దపిచ సాలక్తకపదః,... స్త్రీయో నానావస్థం ప్రథయతిరతం ప్రచ్ఛదపటః" (అమరు.౬౫) (పైశ్లోకములోనిచూర్ణము కుచములమీదిదే - చూ. వ్యాఖ్య.)

3. "పద్మా పయోధరతటీ పరిరంభలగ్న కాశ్మీరముద్రితమురో మధు సూదనస్య" (కృ. క.)

4. "గోపీజనస్య కుచకుంకుమముద్రితాంగం గోవింద మిందువదనం శరణంభజామః"

5. "కుచకుంభములమీఁది కుంకుముతోరాయు హారంబు లరుణంబులగుచు మెఱయ" (భాగ. 10 ఉ. 228)

6. "అలరుగుత్తులనిండ నలరు పుప్పొడిగుబ్బ కవలపైనలఁదు గందవొడిఁ బోల." (చంద్రి. 2-73)

7. "చోళేంద్రత, స్వీరాజత్కుచపాళి *కుంకుమముకంటెఁ వన్నె గావించెఁగా, వేరీతోయము కృష్ణరాయఁ డహితోర్వీనాథ రక్త ప్రభఁ." (పారి. పీఠిక. 18)

స్త్రీలు, సిందూరాదిచూర్ణమును కుంతలములందు ధరించుట యెట్టి పరిపాటియో, కుచములయందు ధరించుటయు నట్టి పరిపాటియేయనుట కీ చూపిన గ్రంథోదాహరణము చాలుగదా!

---

* 'మంజులకంటెఁ' అని వేదం-వారి పాఠము. 'కుంకుమము కంటెఁ' అని వావిళ్ల-వారి పాఠము. ఉచితతరము.

శ్రీ 'నూసి'వారు వేదంవారిపాఠమునే తీసికొన్నారు.

చూర్ణమునుధరించు కుంతలములు - చూర్ణకుంతలము లైనట్లే-చూర్ణమును ధరించు కుచములు - 'చూర్ణకుచములు' కావచ్చునుగదా! కాకపోవుటకు కారణమేమి?

ఏమియునులేదు; 'చూర్ణకుంతలములు (సిందూరాది) చూర్ణమును ధరించుటవల్ల అయినవి కావు. కుసుమములనుధరించు కుంతలములు - 'కుసుమకుంతలములు'; భూషణములు ధరించునవి - 'భూషణకుంతలములు'; చూర్ణమును ధరించు కుచములు - 'చూర్ణకుచములు' కాకపోవుటే అందుకు సాక్ష్యము.

చూర్ణకుంతలములలో (సిందూరాది)చూర్ణమున్నదనుకొనుట పొరపాటు. చూర్ణకుంతలములు - వట్టి కురులేగాని, చూర్ణముతో ఏలాటి సంబంధముకలవియును కావు. చూడండి.

కాళిదాసమహాకవి, కు. సం. (5-55)లో,—

1. 'లలాటికాచందన భూసరాలకా" అన్నాడు. (లలాటికా తిలకః తస్యాశ్చందనేన భూసరాః భూసరవర్ణా అలకాః చూర్ణకుంతలాః యస్యాస్సా" అని, మల్లి. వ్యాఖ్య.)

అట్లే, తెనాలిరామకృష్ణకవి, ఉద్భటారాధ్యచరిత్రలో,—

2. "రాలుపుప్పొడి భూసరములైన చూర్ణాలకంబులు కొనగోళ్గఁగలయదువ్వి." (1-101) అన్నాడు.

చూర్ణకుంతలములు (సిందూరాది)చూర్ణమును ధరించినవేయైనయెడల ఆ చూర్ణముచేతనే, భూసరములో - భూమ్రములో అయ్యుండును గదా? అట్లయ్యేయున్నయెడల, మరల, 'లలాటికాచందనము' చేతను, 'రాలుపుప్పొడి'చేతను భూసరములైనట్లుచెప్పుట తప్పుకాదా? అట్టితప్పును కాళిదాసమహాకవి - రామకృష్ణకవి చేసినట్లు భావించుట సాహసముకాదా?

3. "పృథాసుతా సేపి రథాధిరూఢా ద్విధా విచాల్యైవ పురాన్నిరీయుఃశైర్విధాతుం ద్విషతోపి చూర్ణాం స్తత్సభ్రువామప్యలకా నచూర్ణాన్" (భా. చం. 2-136)

"తే పృథాసుతా అపి రథేష్వధిరూఢాస్సంతః శైర్ద్విషతఃశత్రూన్ దుర్యోధనాదీన్ చూర్ణాన్ లవచ్ఛిన్నా నిత్యర్థఃతేషాం ద్విషతాం సంబంధి

నీనాం సుభ్రువాం స్త్రీణా మలకౌ॓ చూర్ణకుంతలాఁ॓ అచూర్ణానపి వైధవ్యేన కుంకుమాదిచూర్ణరహితాంశ్చ విధాతుమ్" (వ్యాఖ్య)

పాండవులు తమ శత్రువుల భార్యల 'చూర్ణకుంతలము' లను - చూర్ణరహితములు చేయుటకు—అనగా వాండ్లను విధవలను చేయుటకు బయలు దేరినారట. సధవలు, చూర్ణకుంతలములందు చూర్ణమును ధరింతురు; విధవలు ధరింపరు-అనుటవల్ల ఏమి యేర్పడుచున్నది?

సధవలకువలెనే విధవలకును చూర్ణకుంతలము లుండునని యు, అవి స్వభావసిద్ధము లని యు, ఆ చూర్ణకుంతలములయందు చూర్ణమును ధరించుట యు, ధరింపకపోవుట యు ఇచ్ఛాధీనమని యు, చూర్ణమును ధరించినను-ధరింపకపోయినను అవి 'చూర్ణకుంతలము'లే ననియు, ఏర్పడుట లేదా?

కీచకుడు గాసివెట్టినప్పుడు ద్రౌపదియొక్క చూర్ణకుంతలములు చెల్లాచెదరైనవట.—

4. "విలులిత చూర్ణకుంతలతయా చక్రవాకాకులీకృతవాలపూలికా చమరీమృగీవ,.....యాఁ॓ష్టసేనీ మంచం మందం తదేవభవన మభిజగామ." (భా. చం. 6-47)

ఆప్పుడు, సైరంధ్రిగానున్న ద్రౌపది, కురులందు సిందూరాదిచూర్ణము నలంకరించుకొను దశలో నున్నదా? లేదుగదా! మరి, ఆమె కుంతలములు - చూర్ణకుంతలము లెట్లయ్యెను? చూర్ణమును ధరింపని యా కురులను - కవి, చూర్ణకుంతలము లని యెట్లనెను?

5. "భయోత్సృష్ట విభూషణాం తేన కేరళయోషితాఁ॓,
అలకేషు చమూరేణు శ్చూర్ణ ప్రతినిధీకృతః." (రఘు. 4-54)

"...భయేన పరిహృతభూషణానాం, కేరళయోషితాం, అలకేషు చమూరేణుః - సేనారజః చూర్ణప్రతినిధీకృతః-చూర్ణస్యకుంకుమాది రజసః ప్రతినిధీకృతః..." (వ్యాఖ్య)

కేరళదేశకాంతలు రఘువులని భయముచేత, అలకలయందు సిందూర చూర్ణాదిభూషణములను ధరింప మానినారు. రఘువుసేనల కాలిత్రొక్కిడికి రేగినదుమ్మే వారి యలకలకు (= చూర్ణకుంతలములకు) సిందూరాదిచూర్ణ మయినది.

చూర్ణమును ధరింపకపోయినను ఆ కాంతల అలకలు - చూర్ణకుంతలములే; ('అలకా శ్చూర్ణకుంతలాఃగదా); మరి యపు డగ్గ మేమిఁ?

6. "క్రియా ప్రబంధా దయ మధ్వరాణా
మజస్ర మూహూత సహస్రనేత్రః,
శచ్యాశ్చిరం పాండు కపోల లంబా
న్మందారశూన్యా నల కాంశ్చకార." (రఘు. 6-23)

పోషితభర్తృకయై యున్న కారణమున శచీదేవి కేశసంస్కారమును చేసికొనుటలేదు. కుసుమములను - సుగంధచూర్ణములను ధరింపకున్నను- ఆమెకురులు 'అలక'లే- అనగా - చూర్ణకుంతలములే. అది యెలాగండీ!

ఎందు కింకను విస్తరము; చూర్ణకుంతలశబ్దము - చూర్ణమును ధరించుటనుబట్టి యేర్పడ్డదికాదు. ఆశబ్దములోని చూర్ణము సిందూరాదిచూర్ణమున్నూ కాదు. అసలా చూర్ణము - విశేషణముగాని, విశేష్యము కాదు.

చూర్ణము = వక్రము

చూర్ణకుంతలము - విశేషణ పూర్వపదకర్మధారయము.

గురుబాలప్రబోధికలో,— 'అలకా శ్చూర్ణకుంతలాఃʼ అన్నచోట- "చూర్ణాకుటిలాఃకుంతలాఃచూర్ణకుంతలాఃʼ, కుటిలములైన వెండ్రుకలు. చూర్ణక్షోదేచ కుటిలే-అని రభసుఁడు" అని చెప్పబడియే యున్నది.

అంతేకాదు, క్షీరస్వామి (అమరకోశోద్ఘాటన) టీకయందును, "అల్యంతే భూష్యంతేఽలకాఃచూర్ణకాఖ్యాఃకేశాఃచూర్ణకుంతలాఃచర్చరాఖ్యాఃకురలాశ్చ." - అని యున్నది.

శబ్దకల్పద్రుమములో, "కురలఃచూర్ణకుంతలఃʼʼ అనియు, ఆప్టినిఘంటువులో, "కురలఃA curl, a lock of hair; చర్చరీకా - చర్చరీ---Curled hair; చర్చరీకఃDecoration or curling of the hairʼʼ అనియు నున్నది.

ఇక్కడ ఒక విశేషము :—

నూ.ని. లో, చర్చర కురల శబ్దములు లేవుగాని "చర్చరి = అరాళకేశములు, నెఱికురులు; చర్చరీకము = కురులను నెఱులుగా దీర్చుట" అని యున్నది.

అందువలన - చూర్ణకుంతలములు, 'చర్చరము' లైనను, 'చర్చరు' లైనను, అరాళకేశములేగాని - సిందూరాదిచూర్ణమును ధరించు కురులు కావని, సూ.ని. వ్రాతనుబట్టియే యేర్పడుచున్నది.

అది యట్లుండగా, విశేష్యమయిన 'చూర్ణము'నకు పర్యాయములైన క్షోదము, క్షోదితము, వాసయోగము, పిష్టాతకము, ధూళి మొదలగు సంస్కృతపదములతోగాని, చూర్ణార్థకములైన, గందవొడి, బుక్కాము, నుగ్గు, నుఱుము, దుమ్ము, దూళి మొదలగు తెనుగుపదములతోగాని కూడిన కుంతలములు, కురులు కావ్యములలో కానరావు.

అనగా—క్షోదకుంతలములు, పిష్టాతక కుంతలములు; గందవొడి కురులు, దుమ్ముకురులు, దూళికురులు అనురీతి ప్రయోగములు లేవన్నమాట.

కాని, విశేషణమైన 'చూర్ణము'నకు పర్యాయములైన వక్రము, కుటిలము, అరాళము - అను సంస్కృతపదములతో గూడిన కుంతలములూ, అలకలూ - కావలసినన్ని యున్నవి. చూడండి :—

(1) "వక్రాలకంబుల్ మనోహరలోలాక్షులు చూప కవ్వలిమొగం బైనంత నేమాయె." (రామలింగనిచాటువు)

(2) "కుటిలాలక యొడమకన్ను కుడికన్నాయెఁ." (చాటు-రత్నా.)

(3) "కుటిలవృత్తివహించెఁ గుంతలములు." (ఆము. 5-7)

(4) "బాలిక రచిత ప్రణామ ముకుళీకృతపాణి పయోరుహాలిమా లిక కుటిలాలకాలిక." (ఉ. హరి. 5-169)

(5) "అరాళ కుంతలాచసా జటాభిరేష భీషణః" (విశ్వ. 538)

(6) "రక్తపీతకపిశాఃపయోముచాంకోటయఃకుటిలకేశి, భ్రాంత్యమూః" (కు. సం. 8-45)

(7) "చూర్ణాలకంబుల క్రుక్కుఁ జక్కఁగఁ దీర్చి." (శృం. నై. 7-172)

(8) "భ్రూచాపేనిహితఃకటాక్షవిశిఖోనిర్మాతు మర్మవ్యథాం భ్యామూత్మాకుటిలఃకరోతు కబరీ భారోపి మారోద్యమం మోహం తావదయంచ తన్వి తనుతాం బింబాధరో రాగవాక్ సద్వృత్తస్తనమండలస్తవ కథం ప్రాణైర్మమక్రీడతి. (గీతగో. 3 స. 7-6)

చూర్ణకుంతలములనే, తెనుగున,—నెఱికురులు, ఉంగరపుకురులు, ఉంగరపు వెండ్రుకలు - అంటారు.—

(1) "నెఱికురులుఁ బిలోలసిత నేత్రయుగంబును." (భా.ఆది. 7-74)

(2) "నెఱులై యొప్పు వినీలకేశములు." (హరి.పూ. 5-119)

(3) "మరునికొ, లాయస చక్రపరంపర
లో యన నుంగరపుఁగురులు యువతికి నమరుఁ." (ఆము. 5-9)

(4) "తొకతొక మాటలుఁ నొసలఁ దుంపెసలాడెడు నుంగరంపు వెండ్రుకలు." (కవిరా. 2-47)

(5). "ముంగురు లుంగరాలు, చనుమొగ్గలు బంగరుబొంగరాలు"
(చాటు - రత్నా)

(6) "కుంతలాంచదరాళకుంత లాగరుగంధి
కుంతలామోదము ల్కొల్లలాడి." (శశాం. 2-28)

కుంతలదోషములోని - అరాళకుంతలలు - అగరుగంధి కుంతలములు కలవారట.

నెఱికురులనే, కుటిలాలకములు; అరాళకేశములు; చూర్ణకుంతలములు—అనుచుందురనియు, చూర్ణకుంతలశబ్దములోని 'చూర్ణము' వ్యక్తార్థకమైన 'విశేషణము'గాని, సిందూరాది చూర్ణార్థకమైన - 'విశేష్యము'కాదనియు, అందువల్ల, నూ.ని. Hyphen లో చెప్పినయర్థము సరియైనది కాదనియు, ఉదాహృత గ్రంథసామగ్రివలన నిస్సంశయముగా నిర్ణయమైనట్లేకదా!

నూ.ని. బ్రాణ్యము నెందుకు చూడలేదోగాని, అందులో,—"చూర్ణకుంతలములు - Curls, ringlets" అనియు,—. "అలకలు - Ringlets, curls - చూర్ణకుంతలము"అనియు కలదు.

అంతేకాదు; ఆప్టె - నిఘంటువులోగూడా,—"చూర్ణకుంతలః - a curl, curly hair" అనే యర్థమున్నూ, 'సమంకేరళకాంతానాం చూర్ణకుంతలవల్లిభిః' (విక్రమాంక. 4-2) అనే ప్రయోగమున్నూ ఉన్నవి.

మరియు, క్షీరస్వామిటీకాసహిత నామలింగాను శాసనములోను, ఇంగ్లీషు అర్థములతో వావిళ్లవారు ప్రచురించిన అమరకోశములోనుకూడా,-

"చూర్ణకుంతలాఃCurls" అని యున్నది. నూ. ని. తిలకించితేగా! శ.ర. లోని యర్థమునెత్తి వ్రాసికొని, చల్లగా సాగిపోతే సరిపోయేది. ఎక్కువపనిపెట్టుకొని, సూ.ని. చిక్కుపడ్డది.

కుంతలములకు వక్రతయే అందము. (ఆ వక్రత సహజముగా లేని వారు సంస్కారవిశేషములచేత కలిగించుకొనుటయును కలదు.) అందువల్లనే కవులు కుంతలములను వర్ణించునప్పుడు కుటిలతను తప్పక చెప్పుచుందురు.

ఒక కొన్ని యుదాహరణములు:—

1. "స్వభావవక్రాణ్యలకాని తాసామ్." (రఘు.)
2. "యస్యాధిజ్యధనుఃసవిధం ప్రథమం సమేత్య,
తిష్ఠన్కురూద్వహసుతో యుధి సాహ్యమర్థీ;
రేజే పరీక్షితు మివోత్సుకతాం దధాన
స్తత్కుంతలే నిజమనస్యపి వక్రిమాణమ్." (భా. చం. 8-10)

"దుర్యోధనః నిజేమనసి, తస్య శైశేకుంతలే కచేపి ద్వయోఃవక్రిమాణం కౌటిల్యం తత్తారతమ్యమితియావత్ పరీక్షితు ముత్సుకతాం దధాన ఇవే త్యుత్ప్రేక్షా." (వ్యాఖ్య.)

శ్రీకృష్ణుని శిరోజములూ దుర్యోధనుని మనస్సూ, సహజవక్రము లన్నమాట.

3. "కమలలోచనకుంతలములు వక్రములని
తనువల్లికకుం జక్కదన మొసంగె." (విక్ర. 4-17)
4. "కాంతాలకములంద కౌటిల్యసంచార
మతివల నడపుల యంద జడిమ,
రామచంద్రుడుపాలించు రాజ్యమందు" (భాగ. 9-335)
5. "కుంతలాధిపుచిక్కు కుటిలత్వమెడలించె
సింధురాడ్భంగంబు క్షితికిదెల్పె,
... ... రాజవాహనుండు." (రాజ. విజ. 2-75)
6. "అళినీల కుటిల కుంతలముల కాంతియు
...తలఁచి తలఁచి...ముదితయందుఁ
దనదు హృదయంబు నిలుపుటఁజేసి." (భార. ఆది. 3-27)

7. "వక్రాలకంబుల వలుఁదపిఱుందుల
దర్పగద్దదభాషితములఁ జేసి,
జనుల చిత్తములకు సంక్షోభమొనరించు
కామినీజనము కలిగి." (భా. ఆది. 8-74)

8. "మందోదరీ కుటిల కోమలకేశభార
మందారదామ మకరందరసం పిబంతః" (ప్రసన్న. రా. 1-61)

9. "కురులఁ గుటిలతఁగావించెఁ, గుచములందుఁ
గఠినతవిధించె, సారసగర్భుఁడెలమి." (బిల్వా. 2-119)

10. "జలదేవతాహస్త చామరానిలములు
కుటిలాలకములకు గొండ్లిగఱప" (కాశీ. 5-5)

11. "ఏతాః కరోత్పీడిత వారిధారా దర్పా త్సఖీభి ర్వదనేషు సిక్తాః
వక్రేతరాగై ర్వలకై స్తరుణ్య శ్చూర్ణారుణాక్ వారివాక్ వమంతి"
(రఘు. 16-66)

"ఏతాః తరుణ్యః వక్రేతరాగైః జలసేకాత్ బుజ్వగైః అలకైః కరణైః చూర్ణైః కుంకుమాదిభిః అరుణాక్ వారివాక్ వమంతి వమ్నంతి"
(వ్యాఖ్య.)

తడియుటచేత అలకలు వక్రేతరాగ్రము లైనవంటే, తడియకముందు వక్రాగ్రము లనియేగదా అర్థము?

12. "కుసుమోత్థచితా స్వళీభృత శ్చలయక్ భృంగరుచ స్తవాలకాక్,
కరభోరు, కరోతి మారుత స్తవ దుపావర్తనశంకి మే మనః."
(రఘు. 8-53)

"కుసుమైః ఉత్థచితాక్ గ్రథితాక్ వళీభృతః భంగీయుక్తాక్ కుటిలా నిత్యర్థః. భృంగరుచః నీలాక్ తవ అలకాక్ - చూర్ణకుంతలాక్, "అలకా శ్చూర్ణకుంతలా." ఇత్యమరః. (మల్లి. వ్యాఖ్య.)

అలక లనగా - చూర్ణకుంతలములే ననియు, అవి కుటిలములై యుండుట స్వభావమనియు, పై కాళిదాసరచనవల్లను, మల్లినాథవ్యాఖ్య వల్లను తెల్లమగుచుండలేదా?

ఇన్నిమాట లెందుకు; అలకలను వక్రములుగానే చెప్పవలెనని కవి కల్పలతా శాసనము. (అనగా అది కవిసమయమన్న మాట.) చూడండి.

"వక్రాణ్యలక ఫాల భ్రూనఖాం కోంకుశ కుంచికాఃఁ."

శిరోజములు మెత్తనై కుటిలములై యుండుట శుభలక్షణమట.—

"స్నిగ్ధ నీల మృదు కుంచితైకజా
మూర్ధజా స్సుఖకరా స్సుశిరఃఁ" (వరాహమిహిరుడు)

ఇ క్లెక్కడపట్టినను కుంతలములకు కుటిలతను చెప్పుటయు-చెప్పవలె ననుటయు, కనబడుచున్నదిగాని, సిందూరచూర్ణధారణమును స్వభావముగా చెప్పుటయు - చెప్పవలె ననుటయు, నెందును కనబడదు. చూర్ణమును ధరించుట, పువ్వులను - భూషణములను ధరించుటవంటి ఒక సంస్కార విశేషమేగాని, అది కుంతలములకు సహజలక్షణము కాదు. కుసుమములను ధరించుటయున్నను 'కుసుమకుంతలము' లనుటలేదు గావునను, భూషణములను ధరించుటయున్నను 'భూషణకుంతలము' లనుటలేదు గావునను, చూర్ణమును ధరించుటనుబట్టి 'చూర్ణకుంతలము' లనుట అనువుపడదనియు - చూర్ణకుంతల శబ్దమునకు - కుటిలకుంతలము లని యర్థముచెప్పుటే యుచితమనియు ఇక్కడ గమనింపవలసిన యంశము.

అరాళము, కుటిలము, వక్రము అను విశేషణములతో కేశములను చెప్పుట పరిపాటియని నూ.ని. గమనింపలేదు. గమనించియున్నచో ఆయా పదములక్రింద నూచించి యుండవలసినది. అది నిఘంటుమర్యాద.

ఆప్టె-పండితుడు 'అరాళ' శబ్దముక్రింద "అరాళకేశి- a woman with curled hair - భిత్వానిరాక్రోమదరాళకేశ్యాఃఁ— రఘు. 6-81" అని వివరించియున్నాడు.

బ్రౌను-పండితుడు— "అరాళము - Bent, curved, crooked. కుటిలమైన, వంకరయైన, రా. 5-297. అరాళంబులైన కుంతలజాలంబులను." "కుటిలము - Curled as hair - కుటిలాలకములు, Curly tresses. కుటిలకుంతలి or కుటిలాలకి, a girl with curly locks." అనియు చక్కగా చెప్పియున్నాడు. నూ.ని. చెప్పకపోవుటకు కారణమేమిో ఏమియును లేదు. శ.ర. చెప్పలేదుగనుక తానును చెప్పలేదు.

కర్మధారయము

ఇక్కడ ఒక్క మనవి :— ఆలకశబ్దమునకు, కుటిలకుంతలములని యర్థము. కుటిలతలేని సామాన్య-కుంతలములందును, ఆ శబ్దమునకు వాడుక కలదు. అంతేగాని, సింధూరాదిచూర్ణమును ధరించు కురు లన్నయర్థమున 'అలక'కు వాడుకలేదు. అనువలన, అలకశబ్దార్థమును బోధించు - చూర్ణ కుంతలములకు - సింధూరాది చూర్ణమును ధరించు కురులని యర్థముచెప్పుట యొప్పదు; గాని, చూర్ణమునుధరించు కుంతలములను నర్థమునసే కల్పింప బడిన - చూర్ణకుంతలశబ్దమున కా యర్థముచెప్పుటలో తప్పులేదు. ఆ యర్థ మున నది మధ్యమపదలోపి కర్మధారయసమాసము.

శబ్దకల్పద్రుమములో—"చూర్ణం వాసయోగ స్తద్యుక్తః కుంతలః చూర్ణకుంతలః, శాకపార్థివాదివ త్సమాసః" అని యుండనే యున్నది. బహుశః - దానిని బట్టియే నూ.ని. ఆ యర్థమును గ్రహించియుండవచ్చును. గ్రహించుటలో తప్పులేదుగాని-అది నెఱికురులనెడి యర్థమునిచ్చు 'చూర్ణ కుంతల'శబ్దమునకు - యాగికార్థమనుటమాత్రము సరికాదు; తప్పేయగును.

అలకా ఖ్యాచూర్ణకుంతలాః-అన్నచోట, అలక లనగా - చూర్ణమును ధరించు కురులు, అని కొంద ర్థముచేసికొన్నారు. కాని, యది గ్రహింప దగిన యర్థము కాదు.

అందువల్లనే, శబ్దకల్పద్రుమకర్త, అలకశబ్దమునకు,—

"అలతిభూషయతిముఖ మలకః - భంగీయుతః కేశః"

అని తా నర్థముచెప్పి, అందు కుపబలకముగా,—

"అలతి భూషయతి ముఖమిత్యలకం - ఇతిభరతః; కుటిలకుంతలః ఇతి సుధాతిః; (సారసుందరీ), తత్పర్యాయః చూర్ణకుంతలః - ఇత్యమరః" అని, భరతసుధాత్యమరకారుల యభిప్రాయముల నుదాహరించి,—

కర్పూరాదేః క్షోదశ్చూర్ణం తస్యకుంతలాః—చూర్ణకుంతలాః తద్ధి తత్రన్యస్యతే - ఇత్యన్యే" అని సూచించి వదలినాడు.

ఇతరనిఘంటుకర్తలు, బ్రౌను; సీతారామాచార్యులు; ఆప్టెకూడా ఆ యర్థమును గ్రహింపకపోవుటయు నందువల్లనే.

చూర్ణపర్యాయములైన క్షోద పిష్టాతకాది శబ్దములతోగూడి క్షోద కుంతలములు - పిష్టాతక కుంతలములు-అను, మధ్యమపదలోపి కర్మధారయ ములు భాషలో కనబడకపోవుటయే, అది సమంజసమైన యర్థము కొదనుటకు ప్రబలనిదర్శనముకదా.

ఏతావతా, చూర్ణకుంతలశబ్దములోని 'చూర్ణము' ఈ యలజడికంతకును మూలము. అది విశేష్యమనీ - సింధూరాది చూర్ణమనీ కొందరు పెద్దలు భావించినారు. పొరపాటు. వారి వీరి మాట యెందుకు; ఆంధ్రమల్లినాథులును ఆ పొరపాటుకు లోనైనారు. చూడండి: శృం.నై.లో,-

1. "ఒక్కవరవర్ణిని చూర్ణాలకంబులను నీల కజ్జలంబులకు దీపజ్వాలం బుగా మనశ్శిలా చిత్రకంబు నొసలన్ వ్రాసెదన్." (6-44)

అన్నచోట, "చూర్ణ అలకంబులు = పరిమళద్రవ్యచూర్ణమును వహించెడి ముంగురులు" అని టీకవ్రాసినారు.

వారు చూర్ణశబ్దమునుగూర్చి విచారింపకపోయినను, శ్రీనాథరచనకు మూలమైన శ్రీహర్షరచననైనను సవిమర్శముగా తిలకించియున్నచో అట్లు వ్రాసియుండరు.

"లలాటికాసీమని చూర్ణకుంతలా బభుఃస్ఫుటం భీమనరేంద్రజన్మనః,
మనశ్శిలా చిత్రక దీపసంభవా భ్రమిం భృతఃకజ్జల ధూమవల్లయః." (15-33)

అని మూలము.- "భైమ్యాః చూర్ణకుంతలా వక్రమండలీ భూతాః కేశాః" అని వ్యాఖ్య.

2. "ఫాలభాగంబుపైఁ బఱతెంచునప్పుడు
కమనీయ చూర్ణాలకములువోలె,
... ...
హోమధూమంబు బాలపై నొయ్యఁబోలసి." (6-103)

అన్నచోటగూడా, వారు కమనీయ చూర్ణాలకములను 'చూర్ణకమనీ యాలకములు'గా తారుమారుచేసి "చూర్ణ = గందవొడిదాల్చెడి, (కమనీయ =) అందంపు, అలకములన్ = ముంగురులను" అని టీకవ్రాసినారు.

కాని, మూలము, వ్యాఖ్యానము ఇట్లున్నవి:

"తయా ప్రతీచ్ఛాహుతి ధూమపద్ధతి
ర్గతా కపోలే మృగనాభిశోభితాం
యయాదృశో రంజనతాంశ్రుతేశ్రితా
తమాలలీలా మలికేల కాయితా." (16-41)

"తతో ఫూర్వ్యోత్తరం గచ్ఛన్తీ అలికే లలాటే అలకాయితా చూర్ణ కుంతలవ దాచరితా తత్తుల్యాజాతేత్యర్థః." (వ్యాఖ్య)

హోమధూమము చుట్టలుతిరిగి నొసటిపై వ్యాపించినప్పుడు - అలకల వలె (= ఉంగరములు తిరిగిన ముంగురులవలె) నున్నదని ప్రకరణోచితమయిన అర్థము. అంతేగాని 'గందవొడిదాల్చెడి-ముంగురుల'వలె నున్నదని యర్థము కాదు.

ధూమమునకును కేశములకును సామ్యము కవిసమయసిద్ధము. కొన్ని యుదాహరణములు :—

1. "భర్మహర్మ్య శ్రీల ఖేలా సంభ్రమో చ్ఛ్వసిత విశరారు కేశబంధం బులో యనంగ బంధురంబులగు మంథరగంధవహ విహరణ విసృమర కాలా గురు ధూపధూమంబులును." (కళా. 2-9)

2. "అగరుధూపపుఁబొగల్ పొగరారు కురులుగా
నవగవాక్షము లీక్షణములు గాఁగ." (రామా. 6-103)

3. "నెఱి మిగులఁగలిగి నలుపై
తఱచై మదనప్రతాప దావాగ్నిశిఖల్
మెఱయు నవధూమ మనఁగాఁ
దెఱవకుఁ గచభరమువచ్చె జేవుని కరుణన్." (కాశ. మా. 1-53)

4. "ఆవర్తధూమచికుర ధు
రావహముఁ శ్రుతిమనోహరస్వరము శుభాం
గా విష్కృతంబునై భా
మావేషము దాల్చె నపుడు మఖవాటి తగన్." (రామా. 3-18)

5. ప్రాసాద కాలాగురు ధూమరాజి స్తస్యాః పురోవాయువశేన భిన్నా
వనాన్నివృత్తేన రఘూద్వహేన ముక్తా స్వయంవేణి రివాబభాసే."
(రఘు. 14-12)

కుంతలములకు భూమసామ్యము, వాటికి సహజమైన నీలిమచేతను చూర్ణత (=వక్రత)చేతనేగాని -(సింహారాది) చూర్ణమును ధరించుటచేత కాదు.

కేశభూమసామ్యమును ఆంధ్రమల్లినాగు లెరుగరా? ఎరుగుదురు. నైషధములో,— "ఒక్క యలివేణి పెన్నెత్తివేణిపై నెగయుచున్న ధూపధూమాంకురంబుఁ గనుంగొని కుటిలకచచ్ఛటా భ్రాంతిం గొనగోళ్ల దువ్వంబోయినఁ జెలులునవ్విరి" (6-44) అన్నచోట—"కుటిల...తి=వంకరవెండ్రుక సమూహమనెడి భ్రమచేత, [ధూమము ఉంగరము లుంగరములుగా నుంటుటంజేసి *కుటిలకుంతలభ్రమ]" అని వ్రాసియేయున్నారు.

వచ్చినచిక్కల్లా, 'చూర్ణకుంతల'శబ్దములోని 'చూర్ణము' విశేష్యమనుకొనుటలోనే.

ఐతే, "చూర్ణాలకములు = పరిమళద్రవ్యచూర్ణమును వహించెడి ముంగురులు, గందపొడిదాల్చెడి ముంగురులు" అని ఒకటికి రెండుతావులలో వ్రాసిన ఆ శాస్త్రిగారే,—

"చూర్ణాలకంబుల స్రుక్కుఁజక్కఁగఁదీర్చి." (శృం.నై. 7-172)

అన్నచోట,—"చూర్ణఅలకంబుల = ముంగురులయొక్క, ('అలకాశ్చూర్ణకుంతలాఃా' ఆమ.) ♦స్రుక్కు = ముడుతను" అని వట్టి ముంగురు లనియే వ్రాసినారు. ఎందువల్లనో?

---

* నెలులు, ధూపధూమమును 'కుటిలకుంతలములు'గా భ్రమించిరే గాని 'సింహారాదిచూర్ణమునుదాల్చిన కుంతలములు'గా భ్రమింపలేదన్న విషయమిక్కడ ముఖ్యముగా గమనింపవలసినది.

♦ స్రుక్కు = చిక్కు-అనుట యుచితము. శ.ర. లో 'స్రుక్కు=చిక్కు'అనియే యున్నది. కురులు, ముంగురులు-చిక్కువడుట స్వభావము. ఆ చిక్కును 'ముడుత' అనుట జాతీయముకాదు.

1. "చికురజాలంబులు సిక్కువడఁగ" (భాగ. 8-393)
2. "కుంతలేశ్వరుఁడు చిక్కుపడంగ" (పారి. 1-13)
3. "చిక్కువడు ముంగురులు దీర్చి" (దశా. 4-67)

ఒక విశేషము:—

'సిందూరచూర్ణాదులను ధరించునవి' యన్న వ్యుత్పత్త్యర్థము గలది, 'అలక' శబ్దముకాని, 'చూర్ణకుంతల' శబ్దము కాదు.

"అలకా శ్చూర్ణకుంతలాశ్చ" అన్నచోట, గు. బా. ప్రబోధికలో,— "అల్యంతే భూష్యంత ఇత్యలకాశ్చ. అల భూషణే. అలంకరింపఁబడునవి. "అలకా యత్ఖనగరే2_లకోఽస్త్రీ చూర్ణకుంతలే." అని గత్నమాలిక. 'స్వభావవక్రాణ్యలకాని యోషితాం' అని ప్రయోగంబును" అని తెలియ జెప్పియున్నది.

నగలు, పూలు, సింధూరాదులను - భూషణములనియే పరిగణనము.

కచధార్యము; దేహధార్యము; పరిధేయము; విలేపనము—అని స్త్రీభూషణములు నాలుగువిధములు. అంగు, పూలు-పుప్పొడి-మొదలయినవి కచధార్యములు.

అలకశబ్దమునకు - (సిందూరచూర్ణాది) 'భూషణములను ధరించునవి' యని వ్యుత్పత్త్యర్థము; చూర్ణకుంతలములు(=నెఱికురులు) అని రూఢ్యర్థము. ఈ యర్థమును, నూ.ని. తారుమారు చేసినది.

'చూర్ణకుంతలములు = వక్రకేశములు' అని యర్థముచెప్పిన ప్రాచీన నిఘంటుకర్తలు, 'చూర్ణము = వక్రము' అని చెప్పకపోవుట, ఆ తారుమారునకు మూలము.

చూర్ణకుంతలము శబ్దమనియు, దానికి 'సిందూరాదిచూర్ణమును ధరించుకురులు' అని యౌగికార్థమనియు, 'అలకలు, నెఱికురులు' అని రూఢ్యర్థమనియు వ్రాయుట సరికాదు.

సిందూరాదిచూర్ణమును ధరించుకురులు-అను నర్థమున 'చూర్ణకుంతలము' మధ్యమపదలోపి కర్మధారయమును, 'కుటిల కేశములు' అను నర్థమున,

---

4. "నీ నెఱికురుల్ చెలియ యే మలినుండు చిక్కుపఱిచె" (ఉ. రా. 4-227)

5. "కురులు చిక్కుడలించి తలయంటి" (యయా. 4-89)

6. "చేరఁగరార నీ కురుల చి క్కుడలించెద" (శశా. 2-84)

విశేషణ పూర్వపదకర్మధారయమును కదా! మరి, నిఘంటువులు, పుత్ర శోకము; జవ్వాజిసెట్టి; వంటలరంగమ్మ-వంటి—(మధ్య. కర్మ.) సమాసములను, కొటిలకుంతలములు, స్వల్పనిగుఱ్ఱము వంటి, (వి. పూ. కర్మ.) సమాసములనుగూడా మూలపదములలో చేర్చి అర్థమ్రాయుపద్ధతి కలదా? అట్టి పనికి పూనుకొన్నచో ఆ నిఘంటువు పూర్తియగుట యెన్ని యుగాలకు? అట్టి పనివలన ప్రయోజన మేమి?

"లేదులేదు, 'చూర్ణకుంతల' శబ్దమును, అమరుడు—'అలకాః చూర్ణకుంతలాః' అని తన నిఘంటువులో పఠించినాడు. అందువల్ల ఇతర నిఘంటుకర్తలును ఆశబ్దమును గ్రహించినారు" అంటారా!

అమరుడు— 'అలక' లనగా - చూర్ణకుంతలములు అని యర్థము చెప్పినాడు. అంతేగాని అదియొక శబ్దముగా చెప్పలేదు. ఒకపదమును చెప్పి, దానికి వ్యస్తపదములతోగాని, సమస్తపదముతోగాని, అర్థమును వివరించుట అమరకారుని పద్ధతి.

చూడండి :—

"దవో వనహుతాశనః"—దవః-శబ్దము; వనహుతాశనః - అన్నది యర్థము.

"కటాక్షోఽపాంగదర్శనే",-కటాక్షశబ్దమునకు, అపాంగదర్శనే- అన్నది అర్థము.

"చూచుకంతు కుచాగ్రంస్యాత్"— చూచుకశబ్దమునకు-కుచాగ్ర మని యర్థము. (నూ.ని. 'కుచాగ్రము' నొక ప్రత్యేకశబ్దముగా చెప్పినది. అట్లుచెప్పుట సరికాదు.)

"ధమ్మిల్ల స్సంయతాఃకచాఃా"— ధమ్మిల్లశబ్దమునకు - సంయతాఃకచాఃా-అన్నది అర్థవివరణము.

అట్లే, "అలకాఃా చూర్ణకుంతలాఃా" అన్నచోటను,— అలకాఃా - శబ్దము; చూర్ణకుంతలాఃా - అన్నది యర్థము.

అమరుడు, 'అలక' లనగా 'చూర్ణకుంతలము' లని యర్థముచెప్పి, "తే లలాటే భ్రమరకాఃా" (తే అలకాఃా లలాటోపరి పతితాశ్చేత్ భ్రమరకా ఇత్యుచ్యంతే) అనియు చెప్పినాడు.

అనగా—ఆ యలకలే నొసటిపైబడినప్పుడు భ్రమరకము లనబడు నన్నాడు.

కొబట్టి, అతఁడు 'చూర్ణకుంతల' శబ్దమును ప్రత్యేకశబ్దముగా పఠించినాడనుట పొసగదు.

'చూర్ణకుంతలము' కుటిలకుంతలమువంటి సమాసము గనుక, నిఘంటువు మూలపదముగా తీసికొనఁగూడదు. 'చూర్ణము (విశేషణము)=వక్రము, కుటిలము' అనిచెప్పి, అందుక్రింద - చూర్ణకుంతలశబ్దమును చూపవలెను.

ఆప్టిపండితుఁడు, 'చూర్ణ' శబ్దమును మూలపదముగా చూపి, దాని కుండు అర్థములుచెప్పి, పిమ్మట Compound Words క్రింద—1. చూర్ణ కారః. 2. చూర్ణకుంతలః. 3. చూర్ణఖండః. 4. చూర్ణపదం. 5. చూర్ణ పారదః. 6. చూర్ణముష్టిః. 7. చూర్ణయోగః - అను పదములను చూపి యున్నాడు. (సూ.ని. లో—4, 6, 7 పదములు లేవు.)

సారాంశము: —

అలకలు, చూర్ణకుంతలములు-అను పదములకు, నెఱికురులు (=వక్ర కేశములు) అని యర్థమేగాని, 'సిందూరాదిచూర్ణమును ధరించు కురులు' అనికాదు.

సిందూరాదిచూర్ణమును ధరించుకురులనుగూడా—'చూర్ణకుంతలము' లనవచ్చునుగాని, అ ట్లెవరును అన్నట్లు కనబడదు. అనియున్నచో అది సమాసముగాని, అలకపర్యాయపదము కాదు. నిఘంటువు మూలపదములలో గ్రహింపదగినది కాదు.

గ్రహించినను, 'చూర్ణకుంతలములు. ౧. నెఱికురులు. ౨. సిందూరాదిచూర్ణమును ధరించుకురులు' - అని భిన్నార్థములు చెప్పవలెనేగాని—ఒకటి యేగికార్థముగా - ఇంకొకటి రూఢ్యర్థముగా చెప్పరాదు.

22. చూర్ణము

సూ.ని. "చూర్ణము = గంధపొడి; స్త్రీలు అలకలయందు పెట్టుకొను కుంకుమాదికము." అన్నది.

'గందవొడి' అని చెప్పితేచాలు. స్త్రీలు అలకలయందు పెట్టుకొను నదియు ఆగందవొడే. అది భిన్నవస్తువు కాదు. కావున 'స్త్రీలు అలకల యంగు పెట్టుకొను కుంకుమాదికము" అని ప్రత్యేకముగా వివరింప నక్కర లేదు.

అది గందవొడియొక్క ఉపయోగమును తెలుపుట యనుకొందమా? అది బొత్తిగా పొసగనిమాట. ఎందువల్లనంటే, అలా తెలుపదలచు కొన్నచో, ఆ గందవొడిని స్త్రీలు కుచములయందును పెట్టుకొందురు. కావున, "స్త్రీలు కుచములయందు పెట్టుకొను కుంకుమాదికము" అని కూడా చెప్పవలెను. సూ.ని. చెప్పలేదు.

మరియు నా గందవొడిని, పెండ్లిండ్లలో, డేగాటసమయమున, వధూ వరులు, ఒండొరులపై చల్లుకొందురు. ఆ గందవొడిని 'బుక్కా'మందురు.

"అబ్జవైరికి నిసికఁ బెండ్లినచోట
బంసతులకైన డేగాట సమయమందు
భూమిపైఁబడినట్టి బుక్కానుపగఁ
గొలుపువహియించఁ జక్కఁదగాఁ బూర్వసంధ్య"
(బుద్ధచరిత్ర. 3-౧౦౨)

కాబట్టి, గందవొడి యుపయోగమున ఈ యంశమునుగూడా చెప్ప వలసి యుండెను.

మరియు,—లజ్జాభూషలయిన స్త్రీలు, ఆచూర్ణమును - రత్నదీపముల నార్పివేయుటకు నల్లుచుగద!

"ఆర్చిస్తుంగా నభేముఖమిసి ప్రాప్యరత్న ప్రదీపా
శ్రేయోమూఢానాం భవతి విఫలప్రేరణా చూర్ణముష్టిఃి"
(మే. సం. 2-7)

'చూర్ణస్య కుంకుమాదేః ముష్టిఃి' (మల్ల. వ్యాఖ్య.)

మరి, 'స్త్రీలు రత్నదీపముల నార్పుటకుగాను, తెలివితక్కువగా నల్లు కుంకుమాదికము' అనికూడా నిఘంటువు చెప్పవలసినదేకదా! సూ.ని. యీ విషయముల నేల చెప్పలేదు?

ఎందుకు గ్రంథవిస్తరము. శబ్దముయొక్క- యర్థమునేగాని, ఆయీ వస్తువుల యుపయోగమును చెప్పుట నిఘంటుకృత్యముకాదు. (అసాధారణ విషయములలో తప్ప.)

'చూర్ణము'నకు 'పొడి'యనునది సామాన్యార్థము. 'పరిమళద్రవ్య చూర్ణము (=గందపొడి)' యనునది విశేషార్థము. నిఘంటువు చెప్పవలసినది ఆ రెండర్థములనే. 'పొడి'యొక్క- ఉపయోగమునుగాని, గందపొడి యొక్క- ఉపయోగమునుగాని చెప్ప నక్కరలేదు. చూడండి. శ. ర. "చూర్ణము = గందపొడి, పొడి" అనిమాత్రమే చెప్పినది.

ఆప్టే - పండితుడును, "చూర్ణ - ర్ణమ్. Powder, Flour, Dust. Aromatic powder, pounded sandal, camphor etc" అన్నాడేగాని, ఆయా వస్తువుల ఉపయోగాలు చెప్పలేదు. కాబట్టి సూ.ని. త్రోక్క-నత్రోవ సరియైనదికాదు.

23. కిన్నరకంఠి

శృం.నై. (6-30) వ్యాఖ్యలో, ఆంధ్రమల్లినాథులు,- "కిన్నరకంఠి = కిన్నరుల కంఠమువంటి కంఠము గలది" అన్నారు.

'కంఠము గలది' యని చెప్పుట యొప్పుదనికాబోలు, సూ.ని., "కిన్నరకంఠి = కిన్నరుల కంఠస్వరమువంటి కంఠస్వరము గలది. మధుర కంఠముగల స్త్రీ; స్త్రీ" అన్నది.

'కంఠ'మన్నను 'కంఠస్వర'మని యర్థమగును. కావున సవరింప నక్కరలేదుగాని, ఆట్లు సవరించి- అర్థము స్పష్టపరుచుట మంచిదే. కాని బహుకంఠ(స్వర)ములతో ఒక కంఠ(స్వర)మును పోల్చుట యుచితము కాదు.

మల్లినాథుఁడు,- 'కిమిదం కిన్నరకంఠి సుప్యతే' (రఘు. స. ౬౪) అన్నచోట,— "కిన్నరస్యేవకంఠోయస్యాస్సా కిన్నరకంఠీ" యని, ఒక కిన్నరుని కంఠ(స్వర)ముతోడి పోలికనే, చెప్పినాడు.

కాని, స్త్రీకంఠమును, కిన్నరుని (=పురుషుని) కంఠముతో పోల్చుటయు నుచితముకాదు. కావున, కిన్నర (స్వరము)వంటి కంఠ(స్వర)ము కలది, యని చెప్పనొప్పును.

'కిన్నర'— ఒక తెరగువీణ. వీణాస్వరముతో స్త్రీకంఠస్వరమునకు పోలిక చెప్పుట కలదు,

శ్రీ చూసి రామమూర్తిశాస్త్రిగారు, 'పారిజాత' (2-89) టీకలో,- "కిన్నరకంఠి=వీణాస్వరముంబోలు స్వరముగలదానా" అనియే వ్రాసినారు.

శ్రీ. వె. సదాశివశాస్త్రులవారు, చం. ప. (3-90) టీకలో,— "*కిన్నరకంఠి = కిన్నెరవంటి కంఠముగలదానా" అనియే వ్రాసియున్నారు. స్త్రీకంఠమును వీణాస్వరముతో పోల్చుట కలదనుటకు, ఒకకొన్ని ప్రాచీన రచనలు, —

(1) పుష్పబాణవిలాసము.—

"తన్వీ సా యదిగాయతి శ్రుతికటు క్వీణాధ్వని ర్జాయతే" (౨౧)

"గాయంత్యాస్తస్యాశ్చ కంఠస్వరే శ్రూయమాణే వీణాధ్వనిః శ్రావ్యతాం బధ్నాతీత్యర్థః. వీణాస్వనమ ప్యతిశేతే తదీయకంఠస్వర ఇతిభావః" అని వ్యాఖ్య.

---

* వా.ని.—"కిన్నరకంఠి = కిన్నరధ్వనివంటి మధురకంఠధ్వనికల స్త్రీ; స్త్రీ." అనిచెప్పినది. సూ. ని. చెప్పిన యర్థముసరిగాదని సంస్కరించినదని వేఱుగాచెప్ప నక్కరలేదుగదా!

"వీణ ఒకేస్వరముపలుకక యేడుస్వరములుపలుకును. అందు ప్రధాన శ్రుతు లేడైనను ఇరువదిరెండు శ్రుతులు పలికింపబడును. అట్లు అనేక స్వరములు పలుకు వీణాస్వరముతో స్త్రీ కంఠస్వరమును బోల్చుట యనుచితము; హాస్యాస్పదము" అని వీ.బ్ర. గారి ఆక్షేపము.

వీణ యనేకస్వరముల నొక్కమారేపలుకు ననుకొనుట అవివేకము. కామినీకంఠస్వరమును వీణానినాదముతో పోల్చుటలోగల సారస్యము సాహిత్యజ్ఞానము, లోకజ్ఞానము కలవారికిగాని గోచరింపదు. ప్రాచీన రచనల నెరుగనివారికి, కావ్యమర్మజ్ఞత లేరుకపడవు- అని నా సమాధానము.

(చూ. 3-1-49 త్రిలిఙ్గ)

(2) బిల్హణీయము.—

"దూరేతిష్ఠతు వల్లకీకలరవః ప్రస్తావనాచేద్గిరామ్"

'యామినీపూర్ణయొక్క... వాక్కు వీణానినాదమును... అతిశయించుచున్నదని తాత్పర్యము" అని వేదం. పండితుల వ్యాఖ్యానము.

(3) చంద్రాలోకము.—

"అకారణా తార్కార్యజన్మ, చతుర్థీ స్యా ద్విభావనా
శంఖా ద్వీణా నినాదోయ, ముదేతి మహా దద్భుతమ్"

"అత్ర శంఖత్వేన కామనీయః కామినీకంఠ స్తంత్రీ నినాదత్వేన తద్గీతం చాధ్యవసీయతే ఇత్యకారణా తార్కార్యజన్మ" (కువలయానందము)

(4) మనుచరిత్ర (బ్రౌనుప్రతి).—

"కలమధురపీణా నిక్వాణంబులరాణం ద్రాణఁజెరచు విన్నాణంబుల గొల్పు లెలుంగుల వేల్పుగాణలువాడు లక్ష్మీనారాయణుల కళ్యాణంపు పాటలు" (౫. ౯౬)

"కిన్నరీ నిక్వాణంబులరాణ=కిన్నరీవీణెలయొక్క మ్రోతవై ఖరిని" అని, జూలూరివారి టీక.— "కిన్నరీ=కిన్నెరలనెడి వీణెలయొక్క" అని అనంతాచార్యులవారి టీక.

(5) వసుచరిత్ర:—

"కిన్న, రీనినా దానుకొరి శారీశుకాది
ఘోష ఘుమఘుమితంబైన కోనఁగనియె" (౨.౨౪)

'కిన్నరీ = తంతెకట్టువాద్యభేదములలో నొకటైన కిన్నెరయొక్క' అని టీక.

(6) పారిజాతాపహరణము:—

"తలిరాకుఁబోఁడి యొక్కతి
జలకమునకు వేయనుచు శౌరికి వీణా
కలకలములఁ గలకల నగు
పలుపలమెల పాలయ విన్నపముగావించెఁ" (2-5)

'కిన్నరి' యన్నను వీణే:—

"తతవాదకసమీరహత కిన్నరీరుతుల్
కిన్నరీరుతులు నేకీభవించె" (వసు. ౧-౧౪౯)

24. చిరువడము

శ. ర. లో— "చిరువడము = (చిరుగడము) తియ్యకంద" అని యున్నది.

అచ్చే, సూ.ని. యును, "చిరువ(గ)డము = ఒకజాతిదుంప, మధుర కందము" అన్నది. అంతేగాని, అసలు వస్తువేదో గుర్తించలేదు.

'చిరుగడము' అంటే, గెనుసుగడ్డ. చిరగడదుంప; చిలగడదుంప- అనియును వాడుక. కీ. శే. వేదం వేంకటాచలయ్యరుగారు, ఈ దుంపను గురించి యిట్లు వ్రాసియున్నారు:

"మోహనదుంపలు:— వీటికి ఇంగ్లీషులో 'Sweet potatoes', అనగా 'తీపుగల ఊరళగడ్డ' అని చెప్పుదురు. ఆంధ్రదేశమున ఒక్కొక్క భాగమున ఒక్కొక్క పేరుగలదు. కందమూలాలు, చిరగడదుంపలు, మోహనదుంపలు, గనుసుగడ్డలు"— (వివరములకు, చూ. ప్రజోత్పత్తి ఆషాఢ భారతి.)

వేంకట్రాయశాస్త్రిగారు, శృం. నై. (౬-౧౩౭)లో,—"చిరువడ ములు = చిరువడము లనెడి భక్ష్యవిశేషము" లన్నారు. ఆ యర్థమునకు వారి యూహయే ఆధారము.

ఆం. భా. (౨-౭౨)లో-"చిరుగడంబనఁగను జెలఁగు మధురకందంబు" అని యున్నది. అందువల్ల నేకొంపోలు, శ. ర. "చిరుగడము (=చిరు వడము) = తియ్యకంద" అన్నది. కాని అట్లనుట సరికాదు. తియ్యకంద; దురదకంద - అనునవి మరియొక దినుసు దుంపలు. అవి 'నూరణ' జాతికి చెందినవి. కావున, చిరుగడము = మధురకందము, గెనుసుగడ్డ— అని చెప్పవలెను. గెనుసుగడ్డను సంస్కృతమున 'ఆలువు' అందురు. (చూ. శ.ర.) భార్గవ్యములో,- "చిరుగడము. A sort of edible root; the same as గెనుసు. వకజాతిదుంప" అని చెప్పబడినది.

చిరుగడము - గెనుసుగడ్డయేగాని, భక్ష్యవిశేషము కాదన్నది మనకు ప్రకృతము. అందుకే క్రింది గ్రంథమంతయును ప్రమాణము.

(1) "రాజనలతోడ శృంగబేరములతోడఁ
*జిరుగడపుఁ బెండలముతోడఁ జేమతోడ
నొప్పు నాలుగు పొలములం దుపవనములు" (భీమ. 2-56)

'చిరగడము' (= గెనుసు) పెండలము జాతిలోనిది. అందువలన - 'చిరగడపుపెండల'మనియు వ్యవహరింపబడును.

(2) "చముర కొవళ్లు రాజనపు బియ్యంబులు
చెఱకు కోలలు కంద చిరుగడములు,...
గసగసలు చారపప్పు ద్రాక్షాఫలములు
గొనుచుఁ బ్రజలేగి రవనీశు కొలువునకును" (రుక్మాంగద. 3-6)

అడవిజాతులవారు రాజుకు కానుకగా - చిరుగడములు తీసికొనివెళ్లిరట. ఆ చిరుగడములు - భక్ష్యవిశేషములేనని - ప్రాజ్ఞులు భావింతురా!

(3) శాలిగ్రామ నిఘంటుభూషణమును హిందీసంస్కృతకోశములో- "పిండాలు, స్వాదుకందః. హిం. శకర్‌కంద్. తెలుగు. చిరగడ" అని యున్నది.

(4) వస్తుగుణదీపిక - యను వైద్యనిఘంటువులో,- "గెనుసుగడ్డలు- చిరగడము, చిరగడదుంపలు. (ఎఱుపురంగు గలవి) Dioscorea Purpura.

---

* 'చిరువడము, చిరుగడముయొక్క- రూపాంతరము' అన్న శ. ర. కర్త వ్రాత తప్పనీ, ఆవి భిన్నపదార్థములనీ, చిరుపడము = చిన్నవడ, చిటి గారె యనీ, చిరుగడము = చిన్నగడ, బొంగు; దొమ్మరిసాని యాడునది యీ 'గడము'మీద నే - ఆనీ,-- వీ.బ్ర. గారిదొక వాదము.

ఆది తెనుగుమాటల ముక్కు--మొగ మెరుగని విపరీతవాదమనీ, వడ; గడ అను పదములను 'వడము' - 'గడము' అనుటయు, లఘురేఫయుత్తమైన 'చిరు' శబ్దమునకు 'చిన్న' అని యర్థముచెప్పుటయు--అందుకు తార్కాణమనీ నా సమాధానము. (చూ. 15-11-1948 త్రిలింగ)

ఆ బ్రహ్మంగారు చదివిన చగువులో— కలవడము, కలుఁగడము అనునవికూడా, (వడములే=) వడలే, గారెలే కాబోలును!

కలవడము = కలలోవచ్చే గారె; కలువడము = కల్లుతోచేసిన గారె- అని అంటారేమో-వారు. ఏమయినా అంటారు. వారిని కాదనువా రెవరు?

సం. రక్తపిండాలు, రక్తాలు, హిం. పిండాల్. వీనిని మాదీఫలపు దుంప లనియు, గెనుసుగడ్డలనియు నందురు. చిరగడదుంపలు (తెలుపురంగు గలవి) The white or country Potato" అని వివరింపబడియున్నది.

(5) ఆంధ్రదీపికలో— "గెనుసుదుంప = చిరగడపు దుంపలలో భేదము" అని తెలుపబడియున్నది.

(6) ఆంధ్రపదపారిజాతములో,—"చిరగడము = ఒకజాతిదుంప, గెనుసుదుంప = చిరగడపు దుంపలలో భేదము" అని యున్నది.

కొబట్టి, వేదంవారు, "చిరువడములు = చిరువడములనెడి భక్ష్య విశేషములు" అనుట తప్పు. సూ. ని. ఆతప్పును, లోకమునకు తెలుపక పోవుట తప్పు. ఒప్పుగా భావించియే యున్నచో, తా నా యర్థమును గ్రహింపక విడుచుట తప్పు.

25. చేవెలుఁగు

శ.ర.లో, "చేవెలుఁగు = దివటీ. దివటీ = కరదీపిక" అనియున్నది.

సూ.ని. "చేవెలుఁగు. ఁ ఎనుటివస్తువుబాగుగా కనఁబడుటకై చేతితో కంటికికొవించెడి అడ్డు, హస్తావరణము:— క. 'దీవించి యతని వదనముఁ జేవెలుఁగిడిచూచి' (హర. ౨-౪౯)—చ. 'చే, వెలుఁగునఁజూచు మాపుగల వృద్ధమహీసురుఁడు,' (విక్ర. ౨-౧౫౫.)"— అనిచెప్పి,— ౨. కరదీపము, కొగడా, దివ్వటీ (శ.ర.)" అన్నది.

'చేవెలుఁగు'నకు, సూ.ని. చెప్పిన మొదటి యర్థమే సరియైనదిగాని, శ.ర. నుండి తీసికొన్న రెండవయర్థము సరియైనది కాదు.

చేవెలుఁగు తత్త్వమును పరిశీలింపక, శ.ర. కర్త 'వెలుగు'నకు, 'దివియ' అని యర్థముచేసికొని, 'చేవెలుఁగు' = చేదివియ = కరదీపిక = దివటీ', అని, అంచెలమీద అర్థము నూహించినట్లున్నది. కొని, వెలుఁగునకు, దివియ, దీపము అను నర్థములులేవు. అందువల్లనే కరదివియ; చేదివియ; కొలుదివియ; కోలదివియ; నడదివియ, అన్న పలుకుబడులేగాని, ఆయర్థమున,—కరవెలుఁగు; కొలువెలుఁగు; కోలవెలుఁగు; నడవెలుఁగు, అన్న పలుకుబడులు లేవు.

చేవెలుఁగు = దివటీ, అనుటకు, శ.గ. వ్రాలయేగాని, మరి ఆధారము లేదు. అట్టి నిరాధారపువ్రాతను పరిగ్రహించు మెట్లు? శ.ర. ప్రామాణికుడు కావున, ఆయనగారివ్రాతను తోసివేయజాలక తీసికొన్నామంటారా?

అలాఅయితే శ.ర. లో,—

'చాఅపప్పు = జీడిమామిడిగింజలోని పప్పు.'— 'తఅపి = తరుణము అనియుండగా, ఆ వ్రాతను బొత్తిగాత్రోసివేసి, నూ.ని.— "చాఅపప్పు = ప్రియాలపుఁ బప్పు" "తఅపి = మురుకు"—అనుట యేల?

ఇంకొకమాట: మనకు శ.ర. కర్త యెట్టి ప్రామాణికుడో, 'ఆంధ్ర మల్లినాథులు'ను అట్టి ప్రామాణికులేకదా! వారు, ఆముక్తమాల్యదా సంజీవనీ వ్యాఖ్యలో, (౪-౭) - "చేవెలుఁగు = (చేవ + ఎలుంగు) పటిమగల కంఠస్వరము; (పాఠాం. చేయెలుంగిడి - చేతితో కూడుకొన్న యెలుఁగు కావించి - చేయెత్తి కూకవేసి)" అని సెలవిచ్చి యున్నారే. ఆ వ్రాతను గ్రహింపక, నూ.ని. నిరాదరించు టేల?

ఎందుకు పెక్కు-మాటలు? ఎంతటి పెద్దలకును ప్రమాదముతప్పదు. ఆ పెద్దలయందు మనకెంత అభిమానము - గౌరవము ఉన్నను వారి ప్రమాదములను, ప్రమాణముగా గ్రహించుట తగదు. అది శ్రేయము కాదు.

26. నడదివియ

శ.ర. "నడదివియ = దివటీ" అనిచెప్పి,-

"నడదివియలు సేసె నగరికి మాణిక్య
మకుటముల్ పూనిన మనుజపతుల" (భార.విరా. ౫. ఆ.)

అను ప్రయోగమును చూపినది.

నూ. ని. "నడది (దీ) వియ (నడ + దివియ) కరదీపిక, దివటీ, కాఁగడా" అనిచెప్పి, —

"నడదివియలు... ... పతుల" (భార. విరా. ౫-౭౧)

వ. "నడదివియలై మకుటారవిందరాగంబులు వెలుంగ నలుగడల సామంతసంఘాతంబు క్రమ్ముకొన"...(మనుచ. ౫-౩౨౦)

వ. "ముందఱంజను మూర్ధాభిషిక్తుల మణిగణంబులను నడదీవియలం గూడి. నైష. ౬-౯౦." అను ప్రయోగములను చూపినది.

శ.ర.కర్త–'నడదివియ'ను సరిగా గమనించక 'దివటీ' అన్నాడు. ప్రమాదము.

(ధర్మరాజు) మాణిక్యమకుటములు పూనిన మనుజపతులను, (తన) నగరికి, నడదివియలు చేసెక = నడవనేర్చిన దీపములుగా చేసెను. (అనగా వీగులవెంట నడిపించెను) అని భారతరచన కర్థము.

కవి, ధగధగమెరయు మణికిరీటములతోడి మనుజపతులకును, చక్కగా వెలుగు దివియలకును పోలిక చెప్పినాడు. దివియలవలె వెలుగుటయే కాక, మనుజపతులు - నడచుటయును కలదు గావున, నడదివియలతో పోలిక. లోకములోలేని 'నడదివియల'తో ఉపమించుటచేత-అభూతోపమ. ఏతావతా తేలిన సారమేమి?

శ.ర.కర్త "నడదివియ = దివటీ" అనుట పొరపాటు. ఆ పొరపాటును గమనింపక, సూ.ని. ఆశ.ర. వ్రాత నక్లేయెత్తి వ్రాసికొన్నది.

'నడదివియ'కు, శ.ర. యిచ్చిన భారతప్రయోగము చాలదని కాబోలు, సూ.ని. మనుచరిత్రనుండి, సైషధమునుండి, మరిరెండు ప్రయోగములనిచ్చినది! అసలర్థము నెరుగక, యెన్ని ప్రయోగములిచ్చి యేమి ప్రయోజనము?

వెంకట్రాయశాస్త్రిగారి టీకలును, శ.ర.మీద ఆధారపడి యుండునవే కావున వాటిమాట అటుంచుగాక. మనుచరిత్రకు, మహానుభావుడు చాన్ వ్రాయించిన దివ్యమైన టీకయున్నదే! సూ.ని. ఆటీక చదివికొని 'నడదివియ' యర్థమును తెలిసికొనియుండగూడదా?

చూడండి. ఆటీక యెంత చక్కగా నున్నదో;-

*"నడదివియలై = నడకగల దివిటీలో అన్నట్లుగానే, కిరీటముల యందలి పద్మరాగమణులు ప్రకాశించగా...రాజసమూహము సందడి చేయుచుండగా."--

---

* వావిళ్లవారి టీకలోను,- "నడదివియలై = గమనముచేయుచున్న దీపము" లై అని సరియైన అర్థమే యున్నది.

ఇక్కడ నింకొక్కవిశేషము :—

ఆ మనుచరిత్ర వచనములో 'చేదివియలు (=దివిటీలు)' వేరుగా చెప్పబడి యున్నవి. చూడండి.—

"నడదివియలై ... క్రమ్ముకొన, ... అందంద గ్రందుగా మండు చేదివియలు, చెందొవలునుం గా ... నృపతిపథయమునాహ్వయంబు" (౧౫-౨౯) (బ్రౌను, ౧౮౫౧ లో అచ్చువేయించిన ప్రతి.)

సూ.ని. ఆవచనమును సమగ్రముగా చదువనైనను లేదుగదా!

ఇక, శృం. నై. లోని 'నడదివియల'ను చూతాము.— "ముందఱుం జను మూర్ధాభిషిక్తుల మణికిరీటంబులను నడదివియలతోడం గూడి గంధ తైలధారాభిషేక ప్రదీపితంబులగు కరదీపికా సహస్రంబులు ... సంధ్యాంధ కారంబు దూరంబునేయ." (౬-౨౦)

"మూర్ధాభిషిక్తుల = రాజన్యులయొక్క ... నడదివియలతోఁ, కర దీపికాసహస్రంబులు = చేతిదీపముల (దివ్వటీల) వేలు." (సర్వంకషావ్యాఖ్య)

ఆంధ్రమల్లినాథుల - సర్వంకషావ్యాఖ్యలోను, నడదివియల రూపము స్పష్టముగాలేదు. కాకపోయినను - నడదివియ లనగా నడచుదీపము లని సరిగానే తెలుపబడినది.

సూ.ని. నైషధవచనమునుగూడా సమగ్రముగా చదువలేదు. చదివి యున్నచో - నడదివియలు; కరదీపికలు వేరుగా చెప్పబడియున్న సంగతి గ్రహించియుండదా? అవి భిన్నవస్తువులని తెలిసికొనియుండదా?

ఇంతకును, సూ.ని. నడదివియ = కరదీపిక, దివిటీ, కాగడా, అనుట తప్పు.

'నడదివియ = నడచునట్టి దివ్వె' అనుట ఒప్పు-అని ఫలితాంశము.

27. నడకొలఁకు.

సూ.ని. "నడకొలఁకు=నడబావి. (నడ + కొలకు) దిగుడుబావి." అని యర్థముచెప్పి, అందు కీ క్రింది పద్యమును ఉదాహరించినది.

"ఒడికపుఁ దన సొబగున కె
క్కుడుచెన్నులు గలుగఁజూచి కొల నా యన్నల్
నడకొలఁకు లంచు వారికిఁ
గడువేడుకఁ దమ్మితావి కొనుకఁజేసెన్" (య. 3-౫౪)

ఆ యన్నలు, నడకొలఁకులంచుఁ = దిగుడుబావులని, కొలను (కర్త) ఆ యన్నలకు, తమ్మితావిని - కొనుకచేసినటట! ఇది, నూ. ని. ఊహించిన యర్థము. సరిగా నున్నదా?

ఆ స్త్రీలు దిగుడుబావులైతే - కొలను ఆ దిగుడుబావులకు కొనుక చేయవలసినపనియేమి?

ఆసలు, 'నడకొలఁకు=నడబావి', 'దిగుడుబావి' అనుటయే తప్పు. నడకొలకు-అనగా, నడువనేర్చిన కొలకు-గాని, నడబావికాదు; దిగుడుబావి కాదు.

ఆయన్నలు కొలనుకంటెను మిన్నగా చెన్నులు కలిగియున్నారనియు ఇటునటు తిరుగుచున్నందున - నడువ నేర్చిన కొలకులో - అన్నట్లున్నారనియును - ఊహ్యోక్తి.

కొలను, తాను నడువనేరనిది; కావున, నడువనేర్చిన ఆ కొలకులను పెద్దచేసి, కొనుక లర్పించినదని భావము.

నూ.ని.కి పదార్థమే తెలియలేదు. ఇక పద్యార్థము తెలియుటెట్లు? భావము తెలియుటెట్లు?

నూ.ని. కొలను అంటే, బావి అనుకొనుట వింతగాలేదా? లోకములో, చేదుబావులు; దిగుడుబావులు అని బావులు రెండువిధములు. దిగుడుబావులనే నడబావులంటారు.

"చేదుబావి—a draw well, in which the bucket is raised by the hand. నడబావి. "A well with steps down into it" (బ్రౌను)

మరి, కొలకులలోకూడా, నడకొలకులు; చేదుడుకొలకులు- అని రెండువిధము లున్నవా? లేవే! నూ.ని. నడకొలకును-నడబావిగా భ్రమించుటకు కారణ మేమి?

'కొలఁకు'నకు సరసి-యని, యర్థముచెప్పి,— "కొలను కొలఁకు నాఁగ సరసి వెలయు"నన్న ఆం. భా. (1-63) పద్యమును కూడా ఇచ్చియున్నదే!

అది యట్లుండఁగా, 'ఒడికపు=ఒడికమైన, తన=తనయొక్క, సాబగు' అన్నచోట—'ఒడికపుఁదనసాబగు' అని సుగాగమ సంధికార్యమును జరిపిన దేమిటికి? ఆ 'తన' త్వార్థప్రత్యయము కాదే? తన ఒడికపుసాబగు-అనిగదా అక్కడ అన్వయము?

ఇంతవిచారణ పెట్టుకొన్నవా రెవరో? అచ్చుపుస్తకములో 'పుఁదన' అని యున్నది. సూ.ని. ఆట్లే కాపీవ్రాసికొన్నది. అదేమిో? అంటే 'పుఁదన' అనియే పాఠమంటుంది?

మరియొక మాట:—

అచ్చులో ఉన్నప్రకారము, సూ.ని. "కొనుకఁజేసెఁ" అన్నదిగాని అట్లనుటయును తప్పే. 'కొనుకచేసెఁ' అనిగాని, 'కొనుకనేసెఁ' అని గాని అనుట ఒప్పు.

'కొనుకచేసెఁ' అనునది ఏకపదక్రియ. కొనుకగా చేసెను—అని యర్థము. కొనుకను + చేసెను, అని వ్యస్తముగా భావించుట పొరపాటు.

ఆ సూ.ని. యే, 'కొనుక' క్రింద, "రాజమార్గచిరత్నరత్నసౌధ శ్రీలు, గడురక్తిఁ గుంకుమ కొనక్కసేయ" (ఉ. రా. ౧-౨౩౫) అని పఠించి యున్నది. కాని, మళ్లీ 'కైకొనుక' క్రింద,—"నీకుఁ గైకొనక్కఁజేసెద నేడుదాని" (శుక. ౨-౨౮౯) అనియే ముద్రించినది. అది తప్పు.

"కైకొనక్కచేసెద"

అనుట సాధువు. శ.ర.లో, 'కొనక్క' క్రింద,-"గుములుగాఁ బొలుచు పూగములఁ జెన్నొందు పూగములఁ గొన్నింటిఁ గైకొనక్కచేసి" (చంద్ర.) అనియేయున్నది.

28. నడగోట

సూ.ని.—"నడగోట = నడకకల కోట" అని యర్థముచెప్పి, ఆ యర్థమున కీ క్రిందిపద్యమును చూపించినది.

సీ. రంగదుత్తుంగతరంగ సంఘాతంబు
నడగోటల తెఱంగు నడపుచుండ. (ప్రభా. ౧-౬౪)

అంతేకాదు; నడగొండ; నడతాడి; నడదీఁగె; నడపీనుఁగు; నడ మామిడి-అను పదములుగూడా మూలపదములలో పఠించి, నడకగలకొండ; నడకగల తాటిచెట్టు; నడకగల తీఁగె; నడచునట్టి శవము; నడకగలమామిడి చెట్టు; అని యర్థములుకూడా వ్రాసినది.

నిజానికి, నడిచేకోటలు, నడిచేకొండలు, నడిచేచెట్లు, నడిచేశవాలు, లోకములో ఉన్నవా? లేవుగదా. మరి లోకములోనే లేనివాటినిగూర్చి యింతగా తడవనేల? ఎరుగని అమాయికపుప్రజలు నడిచే-శవాలు, చెట్లు, కొండలు, కోటలుగూడా ఉంటవికాబోలు ననుకొనరా! ప్రమాదహేతువు కాదా!

శ.ర. 'నడదివియ'ను గ్రహించలేదా? అట్లే, సూ.ని. 'నడగోట' వగైరాలను గ్రహించినది. తప్పేమి, అంటారా?

నడదివియ-అనగా, నడచునట్టి దివియ-అని, శ.ర. గుర్తించలేదు. అది, ఒకరకమైన కొగడా-అనుకొన్నది. అందువల్ల ఆ పదమును గ్రహించినది. అంతేగాని, నడచుదివిటీ-అని తెలిసికొనియుంటే గ్రహించి యుండదు.

నడ (=నడచు) అను విశేషణముతోకూడిన 'నడగొండ' మొదలగు పదములు కైకొనదగినవి కావన్న భావముతోనే శ.ర. వదలినది. అంతేగాని ఆ శబ్దములను సూ.ని. యెరిగినమాత్ర మెరుగకకాదు.

నడగోట; నడగొండ ప్రభృతులు, కవులు చమత్కారముకొరకు కల్పించుకొన్న శబ్దములుగాని సహజములుకావు. వాని యర్థమూ-అందలి చమత్కారమూ, వివరించుపని, ఆయా రచనలకు వ్యాఖ్యానములువ్రాయు పండితులదిగాని, నిఘంటుకర్తలది కాదు.

ఆ పదములు గ్రంథస్థములైయున్నవి కావున, నిఘంటువుగ్రహించి అర్థము చెప్పినది. తప్పేమి అంటారేమో?

అలా అయితే, సూ.ని. గ్రహించిన 'నడగోట'కు, మీదా క్రిందా,-'జంగమోద్యాన' మొకటీ; 'చరసౌధ' మొకటీ, ఉన్నవి. చిత్తగించండి:

1. "ఆలోలశైవాలజాల లాలిత్యంబు
జంగమోద్యానవేషము వహింప,
డిండీరమండలాఖండ సౌభాగ్యంబు
చరసౌధచయవిలాసము భజింప."

నూ.ని. ఆ రెండు పదములను గ్రహించి,— జంగమోద్యానము = నడకగల తోఁట.— చరసౌధము = నడకగల మేడ;— అని యేల అర్థము వ్రాయలేదు?

అంతేకాదు.— ఆ విరాటపర్వపద్యములోనే 'నడదివియల' క్రింద 'సచేతన త్యాగధ్వజము' లున్నవి. చూడండి.—

2. "ప్రీతార్థిజనుల సచేతనత్యాగధ్వ
జములుగా నన్ని దేశములఁ బఱచె."

మరి, నిఘంటువు 'సచేతనత్యాగధ్వజము' అను పదమునుగూడా మూలపదముగా గ్రహింపవలసినదేనా? (నూ.ని. సకారముక్రింద గ్రహించునుకాబోలు!)

3. ధనాభిరామములో,—

"నడపాడ నేర్చిన నవకంపులత లనఁ బొలుపొందు వెన్నెల బొమ్మ లనఁగ" (౨-౨౩)

అని యున్నదట. (నూ.ని. యే 'నడపాడు' క్రింద చెప్పినది.)

వకార మింకను రాలేదు గనుక 'వెన్నెలబొమ్మల'మాట పోనిండు. నూ.ని. 'నడపాడ నేర్చినలతలు = నడవ నేర్చిన తీగెలు' అని నకారముక్రింద చెప్పకపోవు లేల?

4. "జంగమరోహణాద్రి సదృశంబులు తత్పురిఁగల్గు భద్రసా
రంగవరేణ్యముల్" (చంద్రి. పరి.)

5. "జంగమవల్లులో, యమృతసాగరపీచులో" (భాస్క. రా.)

ఇత్యాదిరచనలను నూ.ని. యెరుగదా? "జంగమరోహణాద్రి = చరించురోహణపర్వతము; జంగమవల్లి = చరించుతీవె" అని, జకారము క్రింద, వ్రాయక వదలు లేల?

6. కళాపూర్ణోదయములో,—"చరన్మహాద్రినాఁ, బట్టగుచుఁ గడుఁ మెఱయు పట్టపుటేనుఁగునెక్కి" (8-77) అని యున్నదిగదా.

'చరన్మహాద్రి = నడచుచున్న పెద్దకొండ' అని సూ. ని. వ్రాయక పోవుటేల?

7. "ఇటులుండ వద్దెమో, చక్కెరబొమ్మ యంచు సరస ప్రతిభాషల నిచ్చగింపుచుఁ." (హంస. 1-84)

అన్న పద్యమును సూ ని. చూచియుండలేదు కాబోలు! చూచియే యున్నచో—'చక్కెరబొమ్మ = పంచదారతో చేసినబొమ్మ' అని వ్రాసి యుండెడిదేకదా!

ఇంకొక్క మనవి:—

మాఘకావ్యములో, 'పతత్పతంగ ప్రతిమస్తపోనిధిః' (౧-౧౭) అని యున్నదిగదా. మరి, గ్రంథస్థమైయున్నదని 'పతత్పతంగ' శబ్దమును పుచ్చుకొని, నిఘంటువు, 'పడుచున్ననూర్యుఁడు' అని యర్థము వ్రాయవలసినదేనా? ఏ నిఘంటువైనా వ్రాసినదానా? సూ.ని. ప్రకారముక్రింద వ్రాయునా?

ఎందు కింకను విస్తరము.—కవులు చమత్కారప్రియులు. వారు తమ చమత్కృతినిర్వహణార్థము సృజించుకొను శబ్దములు చిత్రవిచిత్రములు. వాటితత్త్వము వేరు; వాటియర్థము వేరు; వాటి ప్రయోజనము వేరు. సామాన్యశబ్దములవలె వాటిని నిఘంటువు తీసికొని ముక్కకు ముక్కగా అర్థముచెప్పుట ప్రమాదము.

"శ్రీ చన్గొండలు రెండు నండగొని" అని యున్నదిగదా యని—నిఘంటువు,— 'చన్గొండలు = చన్నులనెడి కొండలు' అని యర్థము వ్రాయవచ్చునా? వ్రాయగూడదు. అట్లే నడగోట; నడమామిడి: మొదలగు పదములనుగూడా-నిఘంటువు గ్రహించగూడదు. అర్థములు వ్రాయకూడదు.

29. నిలక

సూ.ని. 'నిలక' అనుపదానికి 'నిలుపు' అనియర్థముచెప్పి ఆ ప్రక్కన (చి.ని., శ.ర, బ్రౌ.) అని సూచనచేసి పోయినది. అంతేగాని - ఆపదము

నకు సమగ్రమైన అర్థమేమో, ఆ పదమును లోకము వాడుచున్న విధ మెట్టిదో తెలుపలేదు.

చి.ని. (చిన్నయసూరి నిఘంటువు) నాకు లభించలేదు. శ.ర.లో "నిలక = నిలుపు. (ఇదినాకు నిలకయియ్యలేదు.") అనియున్నది. ఇది యనసేమో తెలిసికొనదగిన మార్గ మందులేదు. కాని బ్రౌణ్యములో,— "నిలక Standing. యీయేరు నిలకయివ్వదు. I cannot keep my footing in the current" అని చక్కగా చెప్పబడియున్నది.

చూచారా, బ్రౌణ్యమును మూచేవరకూ-'నిలక' తత్త్వము తెలియలేదు. ఎంతో డబ్బుపెట్టి, సూ.ని.వంటి పెద్దనిఘంటువు కొనియు, సామాన్య శబ్దార్థములకును, ఇతరనిఘంటువుల నాశ్రయింపవలసివచ్చుట శోచనీయమైన విషయముకాదా?

బ్రౌణ్యములో చక్కగానున్న వివరణము, శ.ర.లో అరగొర యగుటయు, ఆ యరగొరయు, సూ.ని.లో అదృశ్యమగుటయు ఎందువల్ల?

నిఘంటువు, ముఖ్యముగా - మూలపదములలోనే - చెప్పవలసినది. 'నిలకయిచ్చు' అనుక్రియను. అది శబ్దపల్లవక్రియ. దాని స్వరూపముతెరుగని పెద్దలు-గు.సూ.నా.శా. వంటివారు—ఇచ్చు, క్రియ; నిలక, కర్మ. కావున-'నిలకనిచ్చు' అనవలెనని వాదింతురు. అట్టివాదమున కవకాశములేకుండునట్లు నిఘంటువు, నిలకయిచ్చు - అను క్రియనే చూపవలెను.

ప్రవాహవేగము కాలానసీయకపోవుటను తెలుపు సందర్భమునసే (సామాన్యముగా) ఈ క్రియకు వాడుక. బ్రౌనుదొర, శ.ర కర్త, వారి ధర్మమాయని, ఆ వాడుకను ఉదాహరణ వాక్యములోనైనను తెలిపినారు. సూ.ని. ఆమాత్రమును తెలుపకపోయెగదా!

30. కుటిలము

కుటిలము - అనుపదమునకు, లోకవ్యవహారమున 'జబ్బు' అనే యర్థమున్నది. ఆ యర్థమును గ్రహించి బ్రౌను, కుటిలము-అను పదముక్రింద,— "యింకా దేహములో కుటిలమున్నది. the illness is not yet entirely

cured" అని ఉదాహరణతోగూడా చెప్పినాడు. నూ.ని. యీ యర్థమును చెప్పలేదు. కారణ మేమి?

లోకవ్యవహారమునను-ఒకనిఘంటువులోనుగూడా, ఉన్నయర్థమును గ్రహింపకపోవుట పొరపాటుకాదా?

'పొరపాటో,గ్రహపాటో-ఆయర్థమును శ.ర.చెప్పలేదు;కనుక నేనును చెప్పలేదు' అంటుందికొబోలు! నూ.ని.—ఒప్పుకోదగిన సమాధానమగునా?

31. నడనిచ్చు

నూ.ని. 'నడచు' అను పదము క్రింద, "నడనిచ్చు = నడువనిచ్చు" అని యర్థము చెప్పి,—

"అడ్డుగాని నడనీక యాఁకవెట్టినసిగ్గు
సంపూర్ణమదధార సరణిఁబొదల." (కకుత్. ౪-౧౦)

అను పద్యము నిచ్చినది.

అచ్చుపుస్తకములో, పాఠము 'నడనీక' అని యున్నది. కనుక నూ.ని.యు, 'నడనీక' అనియే అన్నది. అయితే, ఇంతకును ఆ పదము, పడనీక; చెడనీక; పడనిచ్చు; చెడనిచ్చు, వంటి క్రియయే అగునా? అగుచో నిఘంటువు, అదియొక పదముగా గ్రహించి, అర్థము చెప్పనేల?

అట్టిక్రియకాక, దారియిచ్చు; తెరువిచ్చు; నడకయిచ్చు; నిలకయిచ్చు వంటి శబ్దపల్లవక్రియ యగునా? అలా అయినచో 'నడనిచ్చు' అనగూడదు. 'నడయిచ్చు' అనవలెను. అప్పుడు, పాఠము 'నడయీక' అని యుండవలెను. నడయిచ్చు - అను క్రియ, 'నడయాడు' వంటిదగును. అప్పుడు 'నడ' విశేష్యముగాని, క్రియకాదు. అందువలన ఆ క్రియను 'నడ' క్రింద చూపవలెగాని 'నడమ' క్రింద చూపగూడదు.

బ్రౌణ్యములో "నడ - Trip or journey. పడవ మూడు నడలు వచ్చినది the boat made three trips. అని చెప్పబడియున్నది.

"నడ = నడచెడి త్రోవ" (ఆంధ్రదీపిక)
"నడ = నడక, గమనము" (శ.ర.)
"జడధు లెల్లను కాలినడలుచేసె" (వసు. 1-46)

ఈ ప్రమాణములనుబట్టి,— నడయీక = ప్రయాణము సాగనీక, (కదలనీక) అని యర్థము చెప్పదగునని యేర్పడుచున్నది; 'నడ' విశేష్య మనియు స్పష్టమగుచున్నది.

నడ, యనగా- 'నడక'యే. ఏరు నడకయియ్యలేదు - అను వాడుక ఆబాలగోపాల విదితము.

"ఎగువ వేదగిరి - దిగువ జొన్నవాడ - నడుమ పెన్నాదేవి-నడకియ్య వమ్మ" అను రీతి (గేయ) రచనలునూ కలవు.

32. కొలుదివియ

బ్రౌనుదొరగారు, "కొలుదివిటి - a burning torch" అన్నారు. తప్పు.

ఆచార్యులవారు, శ.ర.లో "కొలుదివియ = కొఁగడా" అన్నారు. అదియును సరికాదు. దివియయే, కొఁగడా అయ్యుండగా- మరి 'కొలు' అనుట యెందుకు?

సూ.ని. "కొలుదివియ = నడచువారికి దారిచూపుటకై యుపయోగించు కొఁగడా; కొఁగడా" అని రెండర్థములు చెప్పి, యీ క్రింది పద్యమును చూపినది.—

"వారు సంభ్రమించి వడిఁగాలుదివియలు గొనుచు....నృత్తశాలఁ జొచ్చిరి. భార. విరా. 3-శ. (ప్రాఁతప్రతి. చి.ని.పా.)"

కొలుదివియ తత్త్వము, సూ.ని. కిని తెలియలేదు. నడచువారికి దారి చూపుట కుపయోగించు కొగడా, కొగడా, భిన్నము లనుకొనుట పొరపాటు. కొగడా, దారిచూపుట కుపయోగించదా? దారిచూపుటకు కొలుదివియనే ఉపయోగింపవలెనా?

గొడవ యెందుకు. 'కొలుదివియ' (=కొలుదివిటి) రాచమర్యాదకు చెందినది. ప్రభువులు నడచునప్పుడు, దివిటీలు పట్టినవాండ్లు నిటూన నిలుచుండి నడవక, వంగి, దివిటీలను నడచువారి మోకొళ్లక్రింది కుండునట్లు వంచి, ముందుపోవుచుందురు. అట్లు పట్టెడుదివిటీకి 'కొలిదివిటి' యని వ్యవహారము.

కొలిదివిటీ మర్యాద, గద్వాలాదిసంస్థానములలో ఇప్పటికిని కలదు.

వెనుకటికి, వేములవాడ భీమకవిపెట్టిన శాపముచేత రాజ్యమును కోలుపోయిన రాజకళింగగంగు, దరిద్రుడై భిక్షమెత్తుకొనుచు - ఒకనాటి రాత్రి కటికిచీకటిలో దారికొనక ఒకగోతిలో పడి "ఛీ! కొలిదివిటీలేని బ్రదుకేమి బ్రదుకురా" అని విసుగుకొన్నాడట. (వివరములకు, చూ. చాటు. మంజరి. పుట. 76)

సూ.ని. యీ కథనైనను వినలేదు కాబోలు! చాటుపద్య మణిమంజరి వంటి ప్రసిద్ధ గ్రంథమునుగూడా, సూ.ని. యెరుగకుండుట వింత కాదా?

కొలుదివిటీని గ్రహించిన శ.ర. 'పగలుదివిటీ' నేల గ్రహింపలేదో? అదియు కొలుదివిటీ వంటిదే.

పగలు దివిటీ, కావ్యములలో నున్నది.—

1. "ధ్వజవాతహతి నార వైద్యుతాగ్నుల జూడి
*పగలుదీవెలవారు పంజులెత్త" (మను. 5-52. బొ). ప్ర.)

2. "అల విరివింటిదంట ముదమారగ నీ వెను వెంటరా ధరా
స్థలివడిజేరి యామని యుదారతపఃక్రమమెల్ల మాన్చి యు
జ్జ్వలగతివచ్చు నీకుఁ జెలువా యొనగూర్తు వహింప నీ సురా
బలులు శిరోనతిం బవలుపంజులు చెంద్రికపావడల్ రహిన్"
(చంద్రికాపరి. 2-52)

---

* ఈ పద్యమును, సూ.ని. 'దీవెలవాఁడు' అను పదమున కుదాహరణముగా చూపినది. పొరపాటు.

పద్యమున నున్నది 'పగలుదీవెలవారు' గాని, వట్టి 'దీవెలవారు' కారు. "పగలు దివియలవారు=పగలు దివిటీలుపట్టేవాండ్లు" అని, అక్కడ జూలూరివారి టీక. "పగలు దివ్వెలవారు = దినవేళను కాఁగడాలు పట్టువారు" అని వావిళ్లవారి టీక.

అది యట్లుండగా — 'దీవెలవారు' అను, బహువచనరూపమునకు, ఏకవచనరూపముగా, సూ.ని. "దీవెలవాఁడు" అనుట తప్పు. దివ్వెలు -

'కొలుదివియ' (=కొళ్లకు ముందు పట్టు దివిటీ). 'పగలుదివియ' (=పగటి దీవిటీ) అనునవి-మర్యాదాచిహ్నములుగాని, దివిటీ దినుసు భేదము కాదనియు, సూ.ని. వ్రాసినయర్థము తప్పనియు సారాంశము.

కొల్దివియ త త్త్వము తెలియనందునఁనే, సూ. ని. భారతపద్యమును గ్రహించుటలోను-తప్పుచేసినది.

వావిళ్ల-వారిప్రతిలోను, ఆనంద-వారిప్రతిలోనుకూడా,—
"వారు సంభ్రమించి వడిఁ గోలదివియలు గొనుచు"

అను సాధుపాఠ మగపడుచుండఁగా-సూ.ని. దానిని తోసివేసి, ఎక్కడనో-పాతప్రతిలోనున్న "కొలుదివియలు" అను అసాధుపాఠమును తీసికొన్నది. చిన్నయసూరి నిఘంటువులోను-'కొలుదివియలు' అనుపాఠమే యున్నదట. ఉండుగాక. అది సరియైనపాఠమగునో కాదో పరిశీలించిగదా పరిగ్రహింప వలసినది.

*పై పద్యములో 'దివియలు' గొనుచుపోయినవారు కొవలివారు. కొవలివాండ్రుపయోగించునవి 'కోలదివియలు'గాని 'కొలుదివియలు' కావు. (కొలుదివియలత త్త్వము చెప్పితినిగదా.)

'కోలదివియ' యనగా-(కొప్ప దీపిక=) దివిటీకిమారుగా కొల్చి పట్టుకొనెడు వెలుతురుకఱ్ఱెల కట్ట. (చూ. శ.ర.)-వెలుతురుపుల్ల గాలిలో గనగన మండును. వెలుతురుచెట్టునే 'కొరిమిపాల' అంటారు.—

"కొరిమిపాల-The torchwood tree, used for torches. దివిటీకఱ్ర" (బ్రౌణ్యము.)

అనేకమైనప్పుడు వాటిని పట్టువాడు ఒక్కడగుట యెట్లు? అట్లనుట సరికాదు.

దివిటీడు; దివిటీవాఁడు-అన్నచ్లే, 'దీవె (=దివ్వె)వాఁడు' అన వలెను. (సూ.ని. 'దివ్వటీలవాఁడు = దివ్వెలవాఁడు' అనికూడా-అని యున్నది. తప్పు)

అడపసువాడు; కొరాంజివాడు; జారివాడు; గొడుగువాడు; గుఱ్ఱపు వాడు అన్న పదములెట్టివో—దివిటీవాడు అనునదియు నట్టిదే.

కొవలివాండ్రు 'కోలదివియల'నే వాడుదు రనుటకు :

1. "కోలదివియలవెలుఁగు దిక్కులకునిగిడి
తొడరి పురపీథిఁజీకటిఁ దొలఁగఁదోలఁ
బటురయంబునఁ దలవరిబలముశాక
చూచి యొక్కింతచిత్త సంక్షోభమెసఁగ" (దశకు. 5-90)

2. "తలవరులు, కోలదివ్వెలవారిఁ గొంచు నవ్వీథిఁ
బదపదఁడిదె దొంగపదపంక్తి చొప్పు,
వదలకుండనిరాఁగ." (గౌ. హరి. ఉ. 2319)

3. "ఆలీలఁ గొరవిదయ్యంబుల దివ్వె
గోలలవారిఁగాఁ గొని గస్తుదిరిగి." (గౌ. హరి. ఉ. 1668)

కోలదివియ, యనగా - కట్టదివిటీ. కోలదివియ (= కోలదివ్వె)నే, దివ్వియకోల, దివ్వెకోల, అంటారు. దివ్వెకోల = దివిటీకట్ట. దివ్వియ కోలను, ఆం. భా. కర్త, 'దివ్వెనకోల' అన్నాడు.

"జుంజురు దుందురు సురుడు దివ్వెనకోల,
యనఁ గాష్ఠదీపి కొహ్వాయము చెలఁగు." (2-165)

భారత-పద్యములోని కొవలివారు పట్టినవి 'కోలదివియలే = కట్ట దివిటీలే.'

ఇంతయెందుకు. శ. ర. కర్త "కోలదివియ = వెలుతురుకట్టెల దివిటీ" అని యర్థముచెప్పి, అందు కుదాహరణగా పై భారతపద్యమునే— "కోలదివియలుగొనుచు" అను పాఠముతో చూపియున్నాడు. అంతేకాదు ఆ పద్యమునకు మూలమైన,— "సహ్యైవ సమాజగ్మ్ర రాదాయోల్కా-స్సహాస్రశ"-అను శ్లోకమునుగూడా ఇచ్చియున్నాడు.

ఊల్క- లనగా - మండెడుపుల్లలు = కోలదివ్వె లన్నమాట.

కాబట్టి, 'కొలుదివియల' పాఠము తప్పు. నూ.ని. 'కొలుదివియ'కు చెప్పిన యర్థమున్నూ తప్పే.

నడచుట 'కాలి' పనిగనుక, నడచువారికి దారిచూపుటకు 'కొలు దివియ' తప్ప మరియొకదివియ పనికిరాదనుకొన్నది నూ.ని.; దారి కన

బడుటకు వెలుతురు ప్రధానము. "ఎలుకను పట్టుట కే పిల్లి అయితేయేమి" అన్నట్లు, వెలుతురిచ్చుటకు ఏ దివియయైన నేమి? కాలిపనికి - చేతిదివియ పనికిరాదా?

ఎందుకు పనికిరాదూ? దొంగను పట్టుకొనుటకై బయలుదేరిన తలవరులు, 'శంకర. హరిశ్చంద్ర'లో - చేదివియలతోనే బయలుదేరినారు. సూ. ని. చూచియుండదు.

"ఆప్వీటితలవరు లత్యుగ్రకరవాల
హస్తులై పదపదం డనుచు నిగిడి
చేదివియలుపూని చెచ్చెరనేతేర," (5-115)

మరియు, నక్షత్రకుని బుజాన నెక్కించుకొని కటికిచీకటిలో కారడవిలో నడచిపోవుచున్న హరిశ్చంద్రునికి, ఆతనిచేతి ఖడ్గమే 'కరదివ్వె'యై త్రోవచూపినదట. వినండి, గౌరనకవి పల్కులు :—

"కరమునఁబూనిన ఖడ్గప్రకాశ
మరుదుగాఁ గరదివ్వెయై త్రోవఁజూప" (ఉ. 1856)

ఈ ద్విపదను సూ.ని. యెరుగదా? 'కరదివ్వె' క్రింద ఉదాహరించుకొనే యున్నదే, దారి నడచువారికి-చేదివ్వెలు(=కరదివ్వెలు)ను పనికివచ్చునని యేల గ్రహింపలేదో!

ఒక విశేషము: కాలిదివిటీ, ఒకనికి మరియొకడు పట్టవలసినదేగాని ఎవనికి వాడు పట్టుకొనుట పొసగదు. కావున కావలివారు కాలిదివిటీలతో పోయినట్లు చెప్పుపాఠము తప్పు.

33. ఇను

సూ.ని.—*"ఇను = రెట్టి, ద్విగుణితము, అధికము" అని యర్థము చెప్పి, అందుకు, వేదం-వారి శృం.సై. లోని, 'ఇనువింతలచూపుల' (ఉ.౬౧)

---

* వా.ని. 'ఇను' క్రింద, సూ.ని. చెప్పినట్లే అర్థముచెప్పి, అందుకా శృం.సై. పద్యమునే చూపి, 'ఇసితొంత' క్రింద 'ఇనువింతల' పాఠము సరియైనది కాదన్నది. ఆది సరియైనపాఠము కాదని యెరిగియు, 'ఇను' క్రింద చూపనేల?

పద్యమును చూపినది. ఆ పాఠము తప్పు. (చూ. 'పాఠపరామర్శ'లో, ౪౫)

'ఇను'కు సూ. ని. చెప్పినయర్థము లేదు; రాదు.— 'రెట్టి'యను అర్థము రావలెనంటే, 'ఇనుమడి' (=ఇమ్మడి = ఇబ్బడి) అనవలెను.—

(1) "ద్విగుణమున కభీష్యులగు నిబ్బ డిమ్మడి
జంట దంట దుగయు జమిలి రెట్టి,
ఇనుమడి యన," (ఆం. సం. మాన. 42)

(2) "ఇనుమడి యేండ్లు లిద్ధరణి యేలునుపాయము నేయువాఁడ"
(విక్ర. 4-45)

(3) "బంటి, తిండికతమున నినుమడి కండపట్టి." (శుక. 3-351)

(4) "అఖిలజనులు...ఉత్సవోన్మత్తభావ, మిమ్మడియై
ప్రమోదమ్మునం దేలిరి" (భా. అశ్వ. 3-౧౧౯)

(5) "మహార్ణవంబుల విష్కంభంబులు గ్రమంబున నొకటి కొకటి రెట్టియై యుండు;...ద్వీపంబుల విష్కంభంబులును...ఒకటికొకటి యిను మడియై యుండు." (భా. భీష్మ. 1-27)

ఈ వచనమున 'రెట్టియై' యనియు, ఆ యర్థమునే 'ఇనుమడియై' యనియు ప్రయోగింపబడియుండుట గమనించునది.

(6) "అనిన గృపాచార్యుం డీ
యినుమడిదివసములఁదీర్ప నేనోపుదు." (,,-ఉద్యో. 4-414)

ఇనుమడిదివసములకు-అనగా, రెట్టింపుదినములలో-నని యర్థము.

(7) "దీనికి నినుమడుంగగుం బ్రతిబలముం, గనినప్పుడు నా
రూపంబు" (భా. ఆర. ౭-౩౪౫)

ఇనుమడుంగగుట = రెండింతలగునని యర్థము.

ఇట్లు, రెట్టి (ద్విగుణము) అన్న యర్థమున, గ్రంథములలో సర్వత్ర-'ఇనుమడి' (=ఇమ్మడి, ఇనుమడుఁగు) కనబడుచున్న దేగాని, వట్టి 'ఇను' నాకెందును కనబడలేదు. సూ.ని. కిని కనబడినట్లు లేదు. కనబడియున్నచో ఉదాహరించి యుండదా?

మరియు, 'ఇను' - వృత్తియందు 'రెంటి' కాదేశముగా వచ్చునేగాని 'రెట్టి'కి రాదు. (చూ. బా. వ్యా. ఆచ్చి. ౨౪). ఆదియును - మడుగు, మాఱు, నూఱు-అను పదములకేగాని, అన్ని పదములకును రాదు.

శ.ర.—"ఇను వృత్తియందు హల్లుపరమగుచో రెంటి కాదేశముగా వచ్చునది. (ఇనుమడి, ఇనుమాఱు మొ.)" - అనియే చెప్పినది.

కవులప్రయోగములును ఆట్లే కనబడుచున్నవి.—

(1) "కర్ణుం, డినుమా ఱొకశరముదొడుగునే పరులు నగఁ"
(భా. కర్ణ. 3-3౧౭)

(2) "ఇనుము విఱిగినేని, నినుమాఱు ముమ్మాఱు
కాఁచి యతుకనేర్చుఁ గమ్మరీఁడు" (వేమన)

ఇనుమాఱు, ఇనుమడుఁగు-అనుపదములకు, రెండుమాఱులు, రెండు మడుఁగులు-అని యర్థము. కావున 'ఇనువింతలు' అంటే, రెండువింతలగునేగాని, 'రెట్టివింతలు' కాదు.

'రెండువింత'లన్న యర్థమునైనను, 'ఇనువింత' లనగూడదు. ఇను మాటలు, ఇనుగుఱ్ఱములు, ఇనుచెట్లు-అన్నవా రిప్పటికి లేరు.

అది యట్లుండగా—'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు' (సమా. ౧౮) నన్న సూత్రముప్రకారము,—ఇనుమాఱు, ఇనుమడుగు - ఆయినట్లే, (ఇను + వింతలు) ఇనువింత-అని యేకవచనాంతము కావలసినదే గాని, ఇనువింతలు-అని బహువచనాంతముగా నుండరాదు.

కాబట్టి, ఇనువింతలు-అను రూపమే తప్పు. ఆ రూపమునకు, 'రెట్టివింత'లని యర్థముచెప్పుటయును తప్పే.

వేదంవారు, శ.ర. లో నున్నపాఠము నెరుగక, "స్థితస్య గతిశ్చింత నీయా" అన్నట్లు, ఆక్కరకు కల్పించుకొన్న అసంగతపాఠముపై నాధారపడి,— సూ. ని. 'ఇను' అనుపదమునకే, రెండు, - రెట్టి-అని రెండర్థములు చెప్పుటయు, 'ఇను'కు 'ఇనుమడి'కికూడా 'రెట్టి' యని ఒక యర్థమునే చెప్పుటయు సరికాదు.

34. చేపట్టుకుంచము

శ.ర.—"చేపట్టుకుంచము = ఎవ్వరేది కోరినను దానిని సెఱవేర్చువాఁడు" అని యర్థముచెప్పి,—"చేపట్టుకుంచ మక్షీణరంగదభంగ శృంగార శాస్త్ర ప్రసంగలోలుఁడు, డమ్మహారాజదేవేంద్రుఁడు" (శుక. ౧. ఆ) అను పద్యమును చూపినది.

సూ.ని.—"చేపట్టుఁగుంచము = చేతిలోని కుంచమువంటివాడు. ఎవరేదికోరిన అది యిచ్చువాఁడు" అని యర్థముచెప్పి,—"చేపట్టుఁగుంచ... దేవేంద్రుఁడు" (శుక.) "చేపట్టుంగుంచమైన చెలువు నొకనిఁజేపట్టి" (శుక.) అను పద్యములను చూపినది.

చేతిలోనికుంచము ఎవరేదికోరిన అది యిచ్చునది కాదు. అట్టిచ్చు గుణము దానికి లేదు. కావున సూ.ని. చెప్పిన వ్యుత్పత్త్యర్థము సరియైనది కాదు.

చేపట్టుకుంచము, అను నుడికి—చేత పట్టుకొనుట కనువైన (=చేతిలో నిముడునట్టి) కుంచము; అని అవయవార్థము. ప్రాభవాదులచేత మహోన్నతుడయ్యును - సుఖుడైనవాడు అని ఆయర్థమునుబట్టి యేర్పడు భావము.

అది యెలాగంటే: కుంచము ఆకారముచేత చాలా పెద్దది. అద్ద శేరువలె, శేరువలె చేతికరపునది కాదు. అంతేకాక, ధనముగాని ధాన్యముగాని విస్తారముగా పట్టునది. *(14 శేర్లు = 1 కుంచము) కావున మిక్కిలి బరువుకూడాను. అందువల్ల, ఆకారవిపులతచేతను, ద్రవ్యభారముచేతను కూడా, కుంచము చేపట్టునకందుట అసంభవము. అందెసేని ఆశ్చర్యజనకమును, ఆనందదాయకమును నగు విశేషము.

---

* "కుంచమునకు 8 సేర్లే. దీ. పి. శాస్త్రిగారి కుంచమునకు 14 సేర్లుగా నైనది. వారి 14 సేర్లకుంచ మెందలిదో? ఎంతగొప్పదో" అని వీ.బ్ర. గారి యూహింపము.

నాది నెల్లూరుజిల్లా కుంచము. 14 సేర్లదే. అది యెంతగొప్పదో, వారువచ్చి - కనులార చూచి తెలిసికొందురుగాక-అని నా సమాధానము.

ఆశ్లే, ప్రాభవాదులచేత నున్నతుఁడైనవాఁడు, ఆశ్రితులకు సులభుఁడగుట అరుదు. సులభుఁడయ్యే నేని అది గొప్ప విశేషము.

మహారాజైనవాఁడు-ఆశ్రితసులభుఁడగుట, కుంచము చేపట్టున నిముడుట వంటిదని సారాంశము.

ఆశ్రితసులభుఁడైన మహారాజునకు - చేపట్టుకుంచముతో పోలిక. కాబట్టి, నూ.ని. చెప్పిన అవయవార్థము, భావముకూడా తప్పే. 'చేపట్టు కుంచము—చేతిపట్టున ఇముఁడు కుంచము - (ఔపమ్యవాచకము.) ఆశ్రిత సులభుఁడని భావము' అనిచెప్పుట ఒప్పు.

సంపన్నుఁడును, ఉదారుఁడును నగువాఁడు సులభుఁడగునేని ఆశ్రితుల కోరికలు తీరుటలో ఆశ్చర్య మేమున్నది?

"చేపట్టుంగుంచమైన చెలువు నొకనిఁజేపట్టి" అన్న పద్యమున,— చేపట్టుకుంచమైన-అంటే, చెప్పినట్లు వినువాఁడైన, లోబడియుండువాఁడైన- అని యర్థము.

ఆ శుకసప్తతిలోనే,— "చేపట్టుకుంచమగుచు, వాఁడు వర్తింప" (2-204) అనియు నున్నది.

చేపట్టుకుంచమగుచు-అంటే, *వశవర్తియై - అనియే అర్థము.

"దాత నెఱిజాణ, స్నేహింపఁదగువాఁడు చేపట్టుకుంచంబు ధనరాశి వాఁడు వేదలకుదిక్కు, మనపాలిదేవుఁ డితఁడు విడకు మని కూఁతు నదలించి విటుగుఱించి." (బహు. 5. ఆ.)

ఈ పద్యములో,-దాత, చేపట్టుకుంచము-అను విశేషణములు రెండును వాడబడినవి. చేపట్టుకుంచము - అను పదానికే, 'మహాదాత' యని యర్థ మగునేని, మరల 'దాత' యని వేరుగా చెప్పనేల? అది పునరుక్తికాదా?

ఎందు కింకను చర్చ. చేపట్టుకుంచమునకు, 'ఎవ్వరేదికోరిన అది యిచ్చువాఁడు, దాత' యని యర్థముచెప్పుట యుచితము కాదు. సులభుఁడు,

---

* వా.ని. "చేపట్టుఁగుంచము = వశుఁడు, సులభుఁడు" అని చెప్పి, అందు కీపద్యమునే యుదాహరించినది.

వశుఁడు, లోబడినవాఁడు - అని చెప్పుటయే యుచితము. అందు కింకొక్క మంచి యుదాహరణము :—

శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు 'దివ్యజీవన' మను గ్రంథములో,— 'చేకొద్దికుంచము' అను నానుడిని వాడియున్నారు. కథాసందర్భ మేమనగా— 'మాదలేను' అనునత డొక మేయరు. 'జేవరు' అనునతడు పోలీసుఇన్‌స్పెక్టరు (మేయరుక్రింది ఉద్యోగి.) మాదలే నొక కేసులో చిక్కుకొనును. జేవరు, మాదలేనును బండిచేయుటకు వచ్చి, ద్వారముకడ నిలిచియుండును. అప్పుడు మాదలేను లేచి, ఆతనిని చూచి,—'నే నిఁక మీ చేకొద్దికుంచమను' అనును. అనగా నే నింతకుముందు నీ కధికారి నైనను ఇపుడు నీ చేతిలో చిక్కినాను. ఇక నీ యిష్టమువచ్చినట్లు చేయ వచ్చును - అని ఆ మాట కర్థము. అంతేగాని,-'నీ వేదికోరిన అది యిచ్చు వాడ' నని కాదు.

కొబట్టి సూ.ని. చెప్పిన యర్థ మొప్పదు.

చేపట్టుకుంచమన్నను, చేకొద్దికుంచమన్నను అర్థ మొక్కఁ టే. చేకొద్ది కుంచము సూ.ని. లో లేదుగాని, కావ్యములలో నున్నది.—

"కరతలామలకంబు కైవల్యసంపద,
యింటఁ జేరినపంట యీప్సితంబు,
ఓడఁగట్టినదూల మీడులేనిశుభంబు,
చేకొద్దికుంచ మశేషభూతి." (చంద్రా. 1-57)

'నీరుంగావిపంచెలు'; 'చేపట్టుంగుంచము' అను ప్రయోగములు క్వాచిత్కముగా నున్నను, నీరుకావి; చేపట్టుకుంచము - అనుటలో తప్పు లేదు. మార్చివ్రాయ నక్కరలేదు. (వివరములకు, చూ. 'ఆంధ్రభాషాను శాసనము. సంధి. 43)

చేపట్టుకుంచము - అను పదమును చెప్పి, 'చేపట్టుఁగుంచ' మనుటయు కలదని చెప్పిన చాలును.

35. తరిపాలు

'తరి' అను పదముక్రింద, సూ.ని. "తరిపాలు = (తరుచుటవలనఁ గలుగునది వెన్న) తరిగలపాలు - మిక్కిలి వెన్నగలపాలు" అని వివరించి,

ఆందుకు "చిక్క్‌ని తరిపాలు దానపుడు కంఠముమోవఁగఁ ద్రావఁజేయ" అను 'సారంగధర' (3-౧౯౫) పద్యమును చూపినది.

పద్యములోని పాలు 'మీగడపాలు'గాని 'వెన్న(గల)పాలు' కాదు. కాచినపాలతోడను, పెరుగుతోడను, కూడియుండునది 'మీగడ'కాని వెన్న కాదు. పసిబిడ్డలు సైత మెరిగినసంగతే. గ్రంథప్రమాణ మనవసరము. అయినను పాఠకవినోదమున కొక కొన్నిరచనలు.-

1. "...కొండకవ్వంబు గుత్తి జిఱుజిఱుందిరుగు వేగంబున..... మిసిమి గల మీఁది మీఁగడపాలతేట నిగ్గుఁ దుంపరల పరంపరలవలన" (భాగ. 8-208)

2. "పాలమున్నీటిలోపలి మీఁదిమీఁగడ
మిసిమి జిడ్డునఁజేసి మేనువడసి" (,,-,,- 266)

3. "తొలఁకి మింటికిఁబొంగు దుగ్ధపాథోరాశి
కరడులమీఁది మీఁగడల మెఱుఁగు" (మను. 5-44)

4. "ఆరంగాఁగిన పాలమీఁగడలు, హస్తాబ్జంబులంచేవి, లీ
లారమ్యంబుగఁ దోడిబాలురకు నెల్లం బెట్టి తానుంగొనెన్" (హరి. పూ. ఆ. ౫)

5. "మీఁదిమీఁగడ మాత్రమే గ్రహించిన దధి
యంటి వైచిన కలవంటకములు." (పాంచా. 4-59)

6. "నెఱజాతి పాలమున్నీటి మీఁగడనిగ్గు
దేలువార్వము చౌపుటాలు ద్రొక్క" (ఉ. హరిశ్చ. 3-131)

'సారంగధర'లో, గొల్లవాడు, సిద్ధునకు తెచ్చియిచ్చినవియును-మీగడ పాలే,—

7. "కనలునిప్పులమీఁద కమ్మనిపాక
మొదవి మీఁగడగట్ట నొయ్యనఁగాఁచి ... మార్తాండు
డుదయించువేళను యోగినుఖ్యునకు
ముదమార నిడి" (నవనాథ. పు. 32)

8. "కలశాబ్ధిమీఁగడల జిడ్డొఱిఁగించెడు కమ్మగాడ్పు" (ఆము. 4-10)

మీఁగడపాలు త్రాగుటకు కమ్మగానుండును. మీఁగడలేనిపాలు చప్పగానుండును. త్రాగుట కింపుగానుండవు.

'గొడగూచి'యను నొక పసిబిడ్డ, యీశ్వరునిముందు పాలుంచి 'ఆరగించవయ్యా' అన్నది. ఆయన ఆరగించలేదు. అపుడాబిడ్డ పలికినపలుకు లివ్వి:

9. "పాలేల యూరగింపవు లింగమూర్తి
కాఁచుటచాలదో కమ్మవల్వమినో...
మీఁదుపోయినవనో, మీఁగడలేదో" (బసవ. పు. 70)

మధురపదార్థములలో పాలమీఁగడయేగాని, పాలవెన్న చేరదు. —

10. "పాలమీఁగడ శర్కరపానకంబు
పూవుఁదేనియ యైన నీ మోవియందుఁ
దనరు మాధుర్యమునకు దీటనఁగారాదు" (ఇందు. పరి. 6-139)

లోకవ్యవహారమునను, కావ్యములలోనుగూడా, 'మీఁగడపాలు' 'మీఁగడ పెరుగు'కలవుగాని, వెన్న పాలు; వెన్న పెరుగు-అనుపలుకుబడి యెందునులేదు.

(1) "మీఁగడ పెరుగు = మీఁగడతోడి పెరుగు, శ్లేషనము." (శ. ర.)

(2) "వేవిన నిద్రమేలుకని వేఱొకబానకు నేర్పుతోడఁ బై
మీవడఁబుచ్చి, కవ్వమిడి, మిట్టచనుంగవ రాయిడింప మే
దీవ నటింప వెన్నడుము దీలుపడం, గటిగుల్కఁగాచముల్
*జోవలఁబాడఁ జల్లఁ దరుచుఁ వడి ధర్షణి రజ్జుపాణియై."
—పంచ. వేం. ౧౫౯౦.

'మీఁగడపాలు' అనియేగాని 'వెన్నపాలు' అని వ్యవహారములేదు గనుకను, పాలతోనుండునది మీఁగడగాని, వెన్న కాదు గనుకను, "తరిపాలు= వెన్న(గల)పాలు" అనుట సరికాదు.

పాలతోనుండునది మీఁగడ యగునుగాక. ఆ మీఁగడలో వెన్న యుండలేదా! మరి 'వెన్నపాలు' అనడానికి ఆక్షేప మేమి? అంటారా?

---

* "జోవలువాడ...వడిఁదర్షణి" అని, శ.ర. పాం. (చూ. 'జోవ') 'జోవడఁబాడ' అని, నూ.ని. పా.

ఆక్షేపమేమీ లేదు; ఆ వెన్న లో - నెయ్యి ఉంటుందికదా? మరి, నేతిపాలు; నేతిపెరుగు, అనకపోవడ మేల? అను ప్రశ్నకు సమాధానము చెప్పవలసియుంటుంది.

మరొక్క సంగతి:—సూ.ని. ‘‘తరి = వెన్న, తరిపాలు = వెన్నగల పాలు’’ అన్నదిగదా, మరి, శుకసప్తతి (2-334)లో,—

‘‘సంకటి తరివెన్నమజ్జిగలు, కంకటిపై బవలింటి నిద్రలుఁ’’

అని యున్నదే. అక్కడి, తరివెన్న; తరిమజ్జిగ అను పదముల కర్థమేమి? (సూ.ని. శుకసప్తతిని చూడలేదా? చూచియున్నచో ఆ పదములను తీసికొనకపోవు లేల?) సూ.ని. పద్ధతిప్రకారము - తరిమజ్జిగ = వెన్నమజ్జిగ; తరివెన్న = వెన్న వెన్నయే కదా కావలసినది? అట్లగునా? ఎన్నటికిని కాదు.

తరిమజ్జిగ-యనగా, కవ్వము మొదటి మజ్జిగ. (=చిలుకుచుండగానే తీసికొను మజ్జిగ.) అది తియ్యగా ఉండును. బ్రౌనును ‘‘తరిచల్ల. Sweet butter milk’’ అని చెప్పియేయున్నాడు. అట్లే, తరివెన్న-అంటే, అప్పుడు చిలికి యెత్తినవెన్న. అదే నవనీతము.

అలాగే, *తరిపాలు-అంటే, మీగడతోగూడి తియ్యగానుండుపాలు అని సంప్రదాయార్థము.

36. దేవాయుధము

సూ.ని.— ‘‘దేవాయుధము = దేవతల ఆయుధము’’ అని అర్థము చెప్పినది. ఎందుకండీ! ఆ యర్థము నొక పెద్దనిఘంటువు చెప్పవలెనా?

---

* తరిపాలనగా తరిపిపాలనీ,- తరిపిపాలనగా పశుపినిన నెలదిన ముల లోపలిపాలనీ,- తరిపియనగా నెలలోపలి దూడయనీ—వీ. బ్ర.గారి వ్రాత.

దూడను ‘తరిపి’ యనుట తప్పనీ, ‘తఱిపి’ యనవలెననీ, ‘తఱిపి’ యనగా, ఆరునెలలు దాటిన ముదురుదూడగాని నెలలోపలిదూడ కాదనీ,- బ్రహ్మంగారు, తెనుగెరుగని తెనుగు పండితులనీ, బ్రౌణ్యములో,—‘‘తరిపి or తరిపిదూడ A sucking calf, a calf a year old.’’ అని యున్నది చూచుకోవలసినదనీ—నా సమాధానము. (చూ. 6-12-1948 త్రిలిఙ్గ)

దేవాయుధశబ్దము కొంచెము చరిత్రకలది. సంగ్రహముగానే మనవిచేస్తాను.

ఆశబ్దము - ఆముక్తమాల్యదలో ఇట్లు ప్రయుక్తమై యున్నది.

"పసలేదు నిలరోరి పాతకులారని
దేవాయుధంబులు మూవువారు" (7-13) వేదం. ప్రతి.

బ్రౌనుదొర-, "దేవాయుధములు - A. 6. 100. Stones and cudgels అనగా రాళ్లున్ను దుడ్డుకర్రలున్ను; దేవశబ్దమునకు యజ్ఞము అర్థముచేసి యజ్ఞమందు ఆయుధములు, రాళ్లు - దుడ్లు మొదలైనవి గలవు గనుక ఆ సంబంధమునుబట్టి యీ పదము ప్రయోగించినారు" అన్నాడు.

శ.ర.కర్త 'మూవు' క్రింద పైపద్యపాదము నుదాహరించియు దేవాయుధశబ్దమును గ్రహించనే లేదు. (ఇట్టి ప్రమాదములు శ.ర. లో ఎన్నో యున్నవి.)

వావిళ్లవారిటీకలోను, "దేవాయుధంబులు = పాషాణములు దుంటకట్టెలును, (ఇక్కడ దేవశబ్దమునకు యజ్ఞమని యర్థముచేసి దాని యాయుధములు దారుమయములుగాను పాషాణమయములుగాను నుండును గనుక తాలును దుంటకట్టెలు ననవచ్చును") అనియేయున్నది.

సంజీవనీ వ్యాఖ్యానమునకు పూనుకొన్న - ఆంధ్రమల్లినాథులుకూడా వావిళ్లవారి (కాదా, బ్రౌనుదొరగారి) నుడుగులనే యందుకొని,—

"(ఆ దొంగలమీఁదికి) దేవాయుధంబులు - దేవ = యజ్ఞమందు ఉపయోగింపఁబడు - ఆయుధంబులు = పోటుముట్లను (అనఁగా *కొయ్య గొణత-రాయి - రప్ప - ఇట్టివానిని)" అనియే సెలవిచ్చినారు.

అయితే ఒక విశేషము: వారి వ్యాఖ్యానము ప్రకటితమైనపిమ్మట, దేవాయుధతత్త్వము నెరిగిన వే.ప్ర. శాస్త్రిగారు వారినిదర్శించి 'ఆయ్యా, దేవాయుధమనగా శాపము, తిట్టు; గాని, రాయి-రప్ప కాదు. దేవతలు-ఋషులును, శాపాయుధులు; 'దేవాయుధంబులుమూవువారు=తిట్టువారు' అని సముచిత

* "దేవాయుధంబులు - మనుష్యులుచేసినట్టి కత్తికటారి లోనగునవి కావు; మఱి దేవుఁడుచేసిన రాలుకట్టెలు లోనగునవి" అని- సంజీవనీకర్తల పదప్రయోజన వివరణము. సరియైనది కాదు.

మైన అర్థము''అని మనవిచేయఁగా, వారా మనవి నొకపాటిగా-అంగీకరించి,-''దేవాయుధంబులు='శాపములు' అని కొందఱు. దేవతలు గీర్వాణులు గదా'' అనియొక చిన్న సవరణముక్క గ్రంథముఖభాగమున - కొన్ని ప్రతులలో-అంటించి ఆ శాస్త్రిగారిని తృప్తిపరచినారు. అంతేగాని, వారి మతమున 'దేవాయుధము'లంటే రాళ్లు-రప్పలేగాని, శాపములు, తిట్లు, కావు. అందువల్లనేగదా-''దేవాయుధములు = శాపములు-అని కొందఱు" అని తేలబలుకుటయు - తాము చెప్పినయర్థము తప్పని యొప్పుకొనక పోవుటయును?

యజ్ఞములయందు ఆయుధము లుపయోగింతురనియు, ఆ యాయుధములు రాళ్లు-రప్పలు-తుంటకట్టెలనియు ఆంధ్రమల్లినాగులును భావించుట చిత్రముకాదా!

ఇట్లు దేవాయుధ శబ్దమునుగూర్చి యింతగొడవ నడిచియుండగా, 'రాళ్లు-రప్ప'లని కొందరును - 'తిట్లు-శాపనారము'లని మరికొందరును-పెద్దలగ్రములు చెప్పియుండగా, ఏదీయెరుగక, ఏకోశమునూ చూడక, ఏ వ్యాఖ్యానమును చదువక, ఏ విమర్శను పరికింపక, సూ.ని. ముక్కకు ముక్కగా,— ''దేవాయుధము = దేవతల ఆయుధము" అని యర్థము వ్రాసి యూరకొన్నదే ధర్మమేనా? నిఘంటువు చేయదగినపనియేనా?

దేవాయుధము = దేవతల ఆయుధము; రాక్షసాయుధము = రాక్షసుల ఆయుధము; యక్షాయుధము = యక్షుల ఆయుధము; నరాయుధము= నరుల ఆయుధము.—అని ప్రతిపదటీకలు నిఘంటువులు వ్రాయవలెనా? అట్లు వ్రాయుట కలదా? అట్లు వ్రాయబూనుకొన్నచో తెమలు కెన్నటికి? ఆ వ్రాతవలన ప్రయోజనమేమి?

దేవాయుధశబ్దమును తా నెక్కడనుండి తీసికొన్నదో - అక్కడ ఏ యర్థమున ప్రయుక్తమైయున్నదో సూ.ని. చెప్పవలదా?

నిజానికి, దేవాయుధములు - శాపములేగాని, రాళ్లు-రప్పలు కావు.- ''గీర్వాణాః = దేవతలు. శాపరూపమైన వాక్కు బాణముగా కలవారు" అని అమరము.

కొబట్టి, నిఘంటువు,—దేవాయుధము = శాపము, తిట్టు-అనిచెప్పి, ప్రమాణము చూపవలెను.

సూ.ని. కి, దేవాయుధశబ్దమున కర్థమూ తెలియదు. 'ఆముక్త' ప్రయోగమూ తెలియదు. తెలిసియున్నచో - ఏల చెప్పదు?

37. కపిల

"కపిలము = పింగళవర్ణముగల వృషభము, పుల్లయెద్దు" అనియు,- "కపిల = కపిలగోవు, పుల్లావు" అనియు వ్రాసిన సూ. ని. యే,— "కఱి యావు = నల్లావు, కపిలధేనువు" అని వ్రాసినది. కఱియావు - కపిలధేను వగుట యెట్లు? లక్ష్మీనారాయణీయములో "కఱియావు = నీలధేనువు" అని యున్నది.

శ.ర. లో, కపిల = పుల్లావు-అనియే యున్నది.

సూ.ని. లో నైనను, "కఱి = నల్లనిది"; "కపిలము = పింగళవర్ణము కలది" అని యున్నదే కాని, "కఱి = కపిలము" - "కపిలము = నల్లనిది" అనిలేదే!

'ఆముక్త'లో— "కపిలగవిసర్పిం బృహదీపకళికదీర్ఘి" (5-92) అన్న చోట సంజీవనీకర్తలు "కపిలగవి = పుల్లావుయొక్క—" అనియేఅన్నారు.

కపిలవర్ణము (=పుల్లవన్నె) 'ఎఱుపు'లో చేరునేగాని 'నలుపు'లో చేరదు. రఘువంశములో (వరిష్ఠయైన) నందిని, ఎఱ్ఱనిదిగానే వర్ణింపబడినది.

"లలాటోదయ మాభుగ్నం పల్లవస్నిగ్ధపాటలా
బిభ్రతీ శ్వేతరోమాంకం సంధ్యేవ శశినం నవమ్." (1-83)

శబ్దకల్పద్రుమములో,—

"కపిలా - గోవిశేషః ఇతి హేమచంద్రః—
సా తు స్వర్ణవర్ణా ఇతి పురాణమ్..." అనియు,—

ఆప్టె నిఘంటువులో,—

"కపిల Tawny, reddish కపిలా a brown cow" అనియు నున్నది.

ఇన్ని మాటలెందుకు? భార. ఆను. లో, ఇట్లున్నది.—

''సమానవత్సాం కపిలాం ధేనుం దత్వా పయస్వినీమ్,
సుత్రతాం వస్త్రసంవీతాం బ్రహ్మలోకే మహీయతే.'' (౨౦-౯)
''సమానవత్సాం కృష్ణాంతు ధేనుందత్వా పయస్వినీమ్,
సుత్రతాం వస్త్రసంవీతా మగ్నిలోకే మహీయతే.'' (౨౦-౧౩)

కపిలధేనువును దానముచేస్తే బ్రహ్మలోకము, కృష్ణ (నల్ల) ధేనువును దానముచేస్తే అగ్నిలోకము, ప్రాప్తించును-అనడమువల్ల-కపిల కృష్ణవర్ణములు భిన్నములని స్పష్టపడుటలేదా?

ఐతే ఒకమాట:—

కపిలగోవంటే నల్లావని కొందరనుట కలదు. అంతేగాక, బ్రౌణ్యములో-''కపిలము-Dun, dark in hue, tawny, brass colour'' అనియు నున్నది. దానినిబట్టి, సూ.ని. కపిలాశబ్దము, పుల్లావునందును నల్లావునందునుగూడా చెల్లుబడియగునని భావించెనేమో! అలా అయితే, కపిలము-క్రింద, పుల్లయెద్దు ప్రక్క నొక నల్లయెద్దును, కపిల-క్రింద, పుల్లావువెంట నొక నల్లావునుచేర్చి యుండవలెగదా! చేర్చలేదే! 'కపిలము= పింగళవర్ణము; నలుపు' అనియును వ్రాసియుండవలసినదే! వ్రాయలేదే!

ఏమయినను, ''కపిల = పుల్లావు, నల్లావు'' అనుట యుచితముకాదు. ఎందువల్లనంటే; కపిల, అయితే - పుల్లావు కావచ్చును; కాకపోతే - నల్లావు కావచ్చును-అనేపక్షమున,—

''మొదవులలోనెల్ల *గపిలమొదవు వరిష్ఠంబు'' (ఆను. 3-19) అన్న భారతవచనమున కర్థమేమి?

బాలవ్యాకరణములో-నిర్ధారణషష్ఠికి ఉదాహరణముగా,—''గోవుల లోపల కపిల బహుక్షీర'' (కార. 16) అన్నచోట, నిర్ధారణం బేమని?

ఎటుచూచినను కపి=(నల్ల)యావును, కపిలధేను వనుట కాధారము కనబడలేదు. పెద్దలు పరిశీలింతురుగాక.

---

* ఈ సమాసమును-అనింద్యగ్రామ్యముగా గ్రహింపవలెనా? లేక, 'కపిలమొదవు' అని మార్చవలెనా?

38. అతివాసము

శ.ర. లో 'అధివాసరము' ప్రకృతియనియు, 'అతివాసము' వికృతి యనియు, రెండుపదములకును - 'శ్రాద్ధదినమునకు ముందుదినము' అని యర్థమనియు నున్నది.

సూ.ని. లో, 'అధివాసరము' లేనేలేదు; సరిగదా 'అతివాసము' అ. పుం.అనియు 'శ్రాద్ధదినమునకు పూర్వదినమునందుచేయు ఉపవాస'మని యర్థమనియు నున్నది.

శ.ర. వ్రాత అంతా తప్పేనా? సూ.ని. వ్రాత అంతా ఒప్పేనా? 'శ్రాద్ధదినమునకు ముందుదినము'; 'ముందుదినముచేయు ఉపవాసము; అను రెండర్థములలోను, మదరాసుప్రాంతమున 'అధివాసరము' వాడుకలో నున్నదని తద్జ్ఞులవలన వినికి. (ఆ వాడుకనుబట్టియే శ.ర. కర్త ఆ పదమును గ్రహించెననుట స్పష్టము) తెనుగుదేశమున 'అతివాసము' చాల తావులలో నున్నది. 'అతివాస' మపశబ్దమనుకొను పెద్దలు 'అధివాస' మనుటయును కలదు.

'అతివాసము' వ్యాకరణమునకు లొంగనిదని కొబోలు, శ.ర. కర్త దానిని 'వికృతి' యనుట.—శాస్త్రము ననుసరింపని పదములనూ, సంస్కృతమునలేని యర్థమును తెనుగుననిచ్చు పదములనూ పండితులు వైకృతములక్రిందను, దేశ్యములక్రిందను చేర్చుట పరిపాటి. (చూ. 'అనుమానము'. శ.ర)

కాని, అది సరియైనమార్గము కాదు. ఏమయినను అవి సంస్కృతశబ్దములే.

'ఆప్టె' పండితుడు,—"అతివాసः Fast on the day preceding a Sraddha" అన్నాడు.

'కిట్టెల్' కన్నడనిఘంటువులో,—"అతివాస (సం) Fast on the day before performing the Sraddha" అని చెప్పి, "అతివాసర (= అతివాస) మైసూరుప్రాంతమున వాడుక" అని తెలిపినాడు.

మోనియర్ విలియమ్సును,—"అతివాసము. The fast observed on the day preceding the ceremony in which oblations are presented to the manes of departed ancestors" అనిచెప్పి,-"శ్రాద్ధమునకుముందు వొక్కప్రొద్దువుండేదినము" అనికూడా చెప్పినాడు.

ఇట్లు, అధివాసరము; అతివాసరము; అధివాసము; అతివాసము— అను నాలుగు పదములును దేశమున వాడుకలో నున్నవి. నాలుగును సాధు శబ్దములే. నాలుగును పూర్వోక్తములయిన రెండర్థములలోను వాడబడు చున్నవి. ఆ రెండర్థములును వైదికసంప్రదాయమునుబట్టి యేర్పడినవి; అనగా, రూఢము లన్నమాట.

ఉదా.— (1) తద్దినము = శ్రాద్ధము.

(2) బ్రాహ్మణార్థము=శ్రాద్ధభోజనము (పితృకార్యములయందు భోజనమునకుఁ బోవుట. శ.ర.)

శ్రాద్ధాదిపదములూ - వాటి అర్థములూ యెట్టివో, అట్టివే-'అతివా' సాది పదములునూ - వాటి యర్థములునూ.

సూ.ని. యెరుగదుగాని, అస్థిసంచయనమును 'చిన్నదిన' మనుటయు, ఉత్తరక్రియలను 'పెద్దదినము'; 'దినము' అనుటయు వ్యవహారమున నున్నది. 'దినవారాలు' — 'దివసా' లనుటయును కలదు.

బ్రౌను, ''దినవారములు Funeral ceremonies. దివసవారం - ఉత్తరక్రియలు or కర్మాంతరము" అని తెలిపియున్నాడు.

శ్రీ పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, తమ 'ఉపయుక్త వాచకము' (పు. 83)లో,— ''మృతినొందినవాఁడు వైతరణీనదినిదాటు నిమిత్తము 'దినవార'కర్మములో గోదానముఁ జేతురు'' అని వ్రాసియున్నారు.

కాబట్టి, 'అతివాసము'; 'దినవారము' - మున్నగు శబ్దములన్నియు తెనుగున రూఢ్యర్థకములు. అవయవార్థము కుదురదన్న హేతువుచేతగాని, ఆయా యర్థములను సంస్కృత నిఘంటువులు చెప్పలేదన్న కారణముచేత గాని, తెనుగునిఘంటువు లా పదములను త్రోసివేయుట తగదు.

చూడండి :—(1) క్రియ; (2) గతి - అను పదములు తెనుగులో 'విధము' అను నర్థమున ప్రయుక్తములగుచున్నవి. వాటి కాయర్థము

---

(1) 'జతుకాష్ఠక్రియ నొప్పు సంస్కృతపు శ్లేషలో' (శ్రీనివాస విలాసము. (2) 'తద్గతి కావ్య మెల్లనగునేనోహోయనం జేయదే?'(రా.పాం.)

సంస్కృతనిఘంటువులలో నుండదు. అట్లని ఆ పదములను విడనాడవలసిన దేనాఁ?

*అర్థవిపరిణామమును పొందిన సంస్కృతశబ్దములు,— అవసరము; ఫలహారము; ఆలయము; మధుపర్కము-వంటివి తెనుగులో అనేక మున్నవి. వాని నన్నిటిని, తెనుగునిఘంటువు శిరసావహింపవలెగాని త్రోపాడరాదు. ఆ యర్థములు సంస్కృతనిఘంటువులలో లేకపోయినను మనకు పరిగ్రాహ్యములేగాని - పరిత్యాజ్యములు కావు.

"తెలుగులో చేరినతర్వాత తెలుగువారి వాడుకనుబట్టే వాటిఅర్థము, ప్రయోగము నిర్ణయించవలెను; గాని, సంస్కృతభాషాలక్షణమునుబట్టి నిర్ణయించ వల్లకాదు." (చూ. భాషాభేషజము. పు. ౧౬౭)

అతివాసమువంటి శబ్దములు తెనుగులో నసేకమున్నవి.—

'గోముఖము' అనగా కలాపి (=పేడనీళ్లు) అట. "కలాపి కలయంపి చానపి యన గోముఖాఖ్యలై యలరుచుండు" (ఆం. భా. 2-23)

ఆ పదమున కాయర్థ మెట్లు సిద్ధించినదో కొంచెము విచారించండి.

ఒక చిన్న మనవి:—

దక్షిణదేశమున 'జానువాసము' అను పద మొకటి శిష్టవ్యవహారములో సుప్రసిద్ధముగా నున్నదట. ఆ పదానికి వివాహమునకు ముందుజరుగు, 'వర పూజ' అని యర్థమట! ఆ పదానికి ఆ యర్థ మేలా సిద్ధించినదో యెవ్వరైనను చెప్పగలరాఁ?

ఆ ట్లే, ఆ దేశమునసే, మధ్యమునకు 'గంగాసాగరము'అను వ్యవహార మొకటి యున్నది. ఆ పదమును, శ్రీత్యాగరాజస్వామి,—

---

* చూ. శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారి 'అర్థవిపరిణామ పద్ధతి". ('గిడుగు'వారి వ్యాససంపుటి. పుట. ౨౭౯)

"చక్కని రాజమార్గము ఉండగా,
సందులుదూఁ జేలనె మనసా;
చిక్కనిపాలు మీగడ యుండగ,
చీయను 'గంగాసాగర' మేలా?"

అని తనకృతిలో ప్రయోగించియున్నాడు.

*"గంగాపాయీ జహ్నుఃి,
సాగరపాయీతు కుంభసంభూతఃి,
గంగాసాగరపాయీ
గంగాధరసోమయాజీ" (అని యొక చాటువు)

విద్వాంసులారా, గోముఖము - 'పేడనీళ్లు' అయ్యుండగా 'గంగాసాగరము' మద్య మయ్యుండగా, 'జానువాసము' వరపూజ అయ్యుండగా, 'అతివాసము' (=అతివాసరము) శ్రాద్ధదినమునకు పూర్వదినమగుటలో వింత యేమి? విప్రతిపత్తి యేమి?

లోకవ్యవహారసిద్ధములయిన యెల్లపదములనూ ఎల్ల యర్థములనూ సంతరించి జిజ్ఞాసువులకు తెలియజెప్పవలసిన బృహన్నిఘంటువు, (సూ.ని.) శబరత్నాకరము, వాచస్పత్యమువంటి ప్రసిద్ధ నిఘంటువులు చెప్పిన పదములనూ అర్థములనూ గూడ చెప్పక, తోసివేయుట ఒప్పగునా!

'అతివాసము'ను వికృతియన నక్కరలేదు. ఆ పదానికి శ్రాద్ధదిన మునకు ముందటి దినము' అని యర్థము చెప్పటలో తప్పులేదు. సూ.ని. 'అధివాసరము'; 'అతివాసరము'అను పదములను పరిత్యజించుట భావ్యముకాదు.

39. పాఱెడునీళ్లకుఁ గట్టవేయుట

సూ.ని. 'నీరు' క్రింద,-"పాఱెడునీళ్లకుఁ గట్టవేయుట=అసాధ్యమగు పని చేయఁబూనుట" అని యర్థముచెప్పి, అందు కీ క్రిందిపద్యము నుదాహరించినది.

---

* ఈ శ్లోకమును మిత్రులు బ్రా॥ శ్రీ కల్లూరి వీరభద్రశాస్త్రిగారు నాకు దయచేసినారు.

"భూపతిమందరాద్రిఁ బువుఁబోఁడివరిం చిట తేకమున్నె యే
రూపునఁ బల్కినందగు; వరుండు బ్రియాంగనఁ బెండ్లియాడి కా
మోప నవీనభోగములఁ బొందెడువో (?) సతులార మీర లీ
పాపపుమాటలాడుదురె పాఱెడునీళ్లకుఁ గట్టవేతురే."

—రుక్మాం. ౪-౨౪.

'భూపతి, ఆపువుబోడినివరించి యిక్కడికి తేకమునుపు-ఎట్టులాడినను ఆడవచ్చునుగాని, ఆమెను పెండ్లియాడి ఇక్కడికి తెచ్చుకొని ఆమెతో సుఖింపబోవుచుండగా, రాజును మీరిట్టి పాపపుమాట లాడవచ్చునా? పాఱెడునీళ్లకు కట్టవేయవచ్చునా?' అన్నది రుక్మాంగదునిభార్య - తన సవతులతో.

ఇందు అసాధ్యపుపని చేయఁబూనుట యేమున్నది? ఏమియును లేదు. 'పాపపుమాట లాడుదురె?' అంటే, ఆడగూడదని యర్థము. ఆ యర్థమును బలపరచునదే - 'పాఱెడునీళ్లకు కట్టవేతురే' అను లోకోక్తి. కట్టవేతురే? అనగా, కట్టవెయ్యగూడ దన్నమాట.

సూ.ని. ప్రకరణమును గుర్తించలేదు. రాజుయొక్క అభీష్టమున కడ్డపడుట తగదు-అని ప్రకరణార్థము.

నీళ్లకు పాఱుట స్వభావము. ఆ పాఱుదలకు అడ్డుగా కట్టవేయుట, ఆ స్వభావమును నిరోధించుట. కాబట్టి పాఱెడునీళ్లకు కట్టవేయుట-యనగా - స్వాతంత్ర్యభంగము చేయుట; స్వభావము నడ్డగించుట-యగునుగాని, "అసాధ్యమగు పనిచేయఁబూనుట" కాదు.

నీళ్లు పాఱుచున్నయెడల కట్టగట్టుట అసాధ్యముగదా-అని ఊహ చేసినది కాబోలు సూ.ని.! అట్టిఊహ పసిబిడ్డలు చేయదగినదికాని, లోకజ్ఞులైన పాండిత్యపండితులు చేయదగినది కాదు.

కట్టవేయుట పాఱెడునీళ్లకుగాక పాఱనినీళ్ల కెందుకు?

40. తెరువుపెసర

సూ.ని. "తెరువుపెసర=(తెరువు + పెసర) నడచుదారిలో మొలచు పెసర. (ఇది త్రొక్కుడుచే శీఘ్రముగా నశించును) అనిచెప్పి, అందు కీ క్రింది పద్యమును చూపినది:

"కాన నిక్కంపుఁగూరిమి గణికయందుఁ
బొరయ దిలఁబొర్సెనే నది తెరువుపెసర" (కవిక. ౪-౧౨౨)

"(ఇట అచిరస్థాయి, క్షణభంగురము అని భావము)" అనియు వ్రాసినది.

తెరువుపెసర-అన్న నుడికి, 'తెరువులో మొలచు పెసరమొక్క' అని యర్థము కాదు; అది త్రొక్కుడుచే శీఘ్రముగా నశించును—కావున, క్షణభంగురము-అని భావమును కాదు.

తెరువుపెసర-అనఁగా, తెరువులోనుండు పెసరచేను. ఆ చేనిపంట (= పెసరకాయలు) ఆ తెరువున వచ్చే-పోయే తెరువరులకే (ముప్పాతికి ముప్వీసము) చెల్లు. పోతే, చెనుగలవానికి దక్కునది ఒక్క పీసమే.

గణికకూరిమియు నట్టిదే. తెరువుపెసరవంటిదే నన్నమాట. గణిక కూరిమిని సందుసుళ్లి నెందరో పొందుచుందురనియు, ఆ కూరిమిలో అల్పాల్పమే-ఆ గణికను నమ్ముకొనియుండువానికి దక్కునని యు భావము.

41. చేతడియాఱు

సూ. ని. "ఆఱు = (స్వేదాదులు)పోవు" అని యర్థముచెప్పి అందు కుదాహరణఁగా,—

'చెలువ కుమారుని న్వడుగు చేసిన చేతడియాఱకుండఁగా.'
(హర. ౨-౧౦౩.)

"చెక్కుల దిగజాఱు చెమట యాఱఁగ..."(చంద్రా. ౨-౧౧౩.)
అను రచనలను చూపినది.

'చెమటయాఱఁగ' అన్నచోట నెట్లో, అట్లే, 'చేతడియాఱకుండఁగా' అన్నచోటను అర్థముచేసికొన్నది సూ.ని.; దానిమత్తున 'చేతడి' కర్త; 'ఆఱు' క్రియ. కాని, 'చేతడియాఱకుండఁగా' అన్నచోట 'తడియాఱుట'తో ప్రస క్తిలేదు. వడుగుచేయుటకును-చేయి తడియగుటకును సంబంధము లేదు.

'చేతడియాఱకుండఁగా' అను నానుడికి 'వెంటనే' అని సాముదాయి కార్థము.

"చెలువ, కుమారుని న్వడుగు సేసిన చేతడియాఅకుండఁగాఁ
బొలుపసలారఁగా నిరుగుపార్శ్వలవారల భాగ్యసంపదల్
కుల మభివృద్ధిఁజెంద మన కూరిమినందనుఁ బెండ్లిసేయఁగా
వలయు ననంతరక్షణమ వైభవమొప్పఁగ ముక్తికన్యతోఁ."

వడుగుచేసిన చేతడియాఅకుండఁగాఁ = వడుగుచేసినవెంటనే - అని ప్రకరణార్థము.

కాశఖండ స్మిమాహాత్మ్యములో, రాజు - ఒక దాసికి తలగొరిగింపగా, శివునికరుణచేత ఆ దాసికి మరల వెంటనే శిగోజములు మొలచినవి. అందు కచ్చెరువుపడుచూ, ఆ రాజిట్లన్నాడు:

"ఆజ్ఞ వెట్టించి చేతడియాఅ దిపుడు
దీని కెబ్బంగి మోహనంబైనవేణి, గలిగె" (1-54)

ఆజ్ఞ వెట్టించునపుడు చేయి తడియగునా? కాదుగదా; మరి రాజలా యనుటలో అర్థ మేమి?

ఆజ్ఞ వెట్టించి=దీనితల గొరిగించి, చేతడియాఅదు=ఒక్కనిమసమైనను కాలేదు. ఇంతలో దీనికింత చక్కనితలకట్టు ఎట్లువచ్చినది? అని యర్థము.

కాబట్టి, 'చేతడియాఅు' అను పలుకుబడికి,—చేతడి=చేతిలోనితడి, ఆఅు = ఆఱిపోవు, అని ముక్కకుముక్కగా అర్థము చెయ్యగూడదు. అది యొక జాతీయము. ఆ పలుకుబడిని మొత్తముగా అట్లే గ్రహించి అర్థము చెప్పవలెను.

*ఈ యర్థమును సూ.ని. గుర్తించలేదు. శ.ర. కర్తయు నెరుగడు.

42. గీయు

శ.ర. లో, "గీయు = గీతగీయు" అని యున్నది.

సూ. ని. "గీయు = గీచు గి. చివ్వు, చెక్కు" అని యర్థముచెప్పి, అందు కుదాహరణగా,—

---

* వా.ని. "చేతడియాఅు=చేయి యాఅునంత ఆసల్యమైన లేకుండు. స్వల్పకాలమగు" అని చక్కగా చెప్పినది.

*"గీసి గొజ్జఁగనీరుపోసి నూతినక్రొత్త
చిఱుబంతిపసుపులోచేవ నలఁది." (హర. ౩-౧౦౭)
"నలువ సన్నంబుగా దీని నడుముగీసి," (నైష. ౩-౧౯౧)
వ. "మఱియు నుత్తాలంబులగు తాలంబులం గిరాతజాలంబులు గీసి..."
(చంద్రా. ౩-౨౪)

అను రచనలను చూపినది.

కాని, తాటాకులు - వెదురుబద్దలు మొదలగువానిని కత్తితో వారి, సరిపరుచుటను, తాటిచెట్లు - ఈతచెట్లు మొదలగువానిని (కల్లుకై) కత్తితో చీరుటను, తెలుపుక్రియ-కీయు-పరుపాదిగాని, 'గీయు'అని సరళాది కాదు. పై పద్యములలోనిది ('కీయు') పరుపాదిక్రియయే. అందలి కీ-గీ, యగుట కళాకార్యము.

"కీసిన వెదురుసలాకల
నేసిన యిరుదలశిఖండి నిడుమంచమునం
దోసరిలి" (క్రీడాభిరామము)

ద్వి. "ఒసవుగా ముసుఁగిడ్డ యోరగొంగడియుఁ
గీసిన గుదియయు." (నవ-చరిత్ర. పు. 27)

మున్నగు రచనలను చూచునది.

చలుపు; చాగిలి; తోవ; తూఁటు మొదలగు పరుపాదిపదములు, కాల క్రమమున - వ్యవహారమున, సలుపు; సాగిలి; దోవ; దూఁటు, అని సరళాదులుగా మారినట్లే—కీయు-వ్యవహారమున, గీయు-గా మారినది.

బ్రౌను, వ్యావహారిక ప్రధానుడు గావున 'గీయు' అను సరళాది రూపమునే తీసికొని, అర్థము నిట్లు వివరించినాడు:

"గీయుట to scratch, or scrape. To strip off leaves: to tap a palm tree by cutting lines in it. ఆకులుగీసే కత్తి, a large knife for stripping off leaves; a pruning knife."

గీటు గీయుటలోని క్రియ సరళాది, (గీయు)
చెక్కుట, చీరుటయను నర్థమిచ్చు క్రియ పరుపాది, (కీయు)

---

* 'కీసి' అని, వే. ప్ర. శాస్త్రిగారి పాఠము.

గీయు-అను నర్థమున 'గీచు' అను రూపమున్ను కలదు; కాని, కీయు-అను నర్థమున 'కీచు' లేదు.

మరియు, 'గీయు' నకు - గీసి; గీచి, అని క్త్వార్థకరూపములు రెండున్నవి. కాని 'కీయు' నకు 'కీసి' అను రూప మొక్కటే; 'కీచి' అను క్త్వార్థకరూపము లేదు.

43. రేవంతుఁడు

శ.ర. లో—"రేవంతుఁడు. సం. వి. అ. పుం. అశ్వశిక్షకుఁడు" అని యున్నది. కాని, ప్రయోగము లేదు.

మనుచరిత్రలో—"ఆవల్గతురగబహువిధారోహకళా, రేవంతునకున్" అన్నచోట, జూలూరివారు,— "...రేవంతునకున్ = అశ్వమును శిక్షించి చక్కగా నడిపించేవాడైనటువంటిన్ని" అని టీక వ్రాసినారు.

ఇతరటీకలును, ఈయర్థమునే చెప్పినవి. బ్రౌను, తననిఘంటువులో- "రేవంతుడు - A horse-breaker. అశ్వశిక్షకుడు." అని యర్థము చెప్పి, "రేచి పట్టఁగ లేరు రేవంతులైన" అను ప్రయోగమునుగూడా ఇచ్చియున్నాడు.

అశ్వశిక్షకుడన్న-యర్థమున 'రేవంతు'డను తత్సమపద మొకటియున్నదేమో (సంస్కృతనిఘంటువులలో కనబడదు) కాని, అశ్వహృదయము నెరిగినవాడు, నలునికి బోధించినవాడు, రేవంతు డను పేరుగలవాడొక డున్నాడు.

అశ్వారోహణనైపుణ్యమున నలుని, రేవంతుని, ఉపమించిచెప్పుట కావ్యములలో పలుతావులలో కనబడుచున్నది.

(1) "వాహ్యాళిభూమి రేవంత నైపథులట్లు
హయరత్నములనెక్కి యూడనేర్చు" (భీమ. 1-66)

(2) "అంత జయంతుఁ డెంతయు రయంబున దేవహయంబునెక్కి రే
వంతునిరీతి చోదనలు వల్గనముల్ రవగాల్చెలంగ"(శశాం. 5-44)

(3) "వాహా, రోహణరేవంత! లలితరూపజయంతా!"
(కావ్యా. సం. 6-244)

(4) "అరుదే యల్లయదొడ్డభూవిభుఁడు వాహారోహరేవంతుఁ డిం,
పరుదారఁ." (శివలీలావిలాసము)

(5) "ధైర్యామర సానుమంతుండును, దురంగమ రేవంతుండును...నైన గణపతిదేవ మహీనాథునకు" (శాసన. మంజరి. పు. 79)

పై రచనలలోని, రేవంతుడు - ఆ పేరుగల ఒక ప్రత్యేకవ్యక్తిగాని, అశ్వశిక్షకుడు (=సాహిణి) కాడు.

'పురాణనామచంద్రిక' యనుగ్రంథములో,— "రేవంతుడు - ఒక గుహ్యకుడు' అనియున్నది.

కిట్టెల్ - కన్నడ నిఘంటువులో,— "రేవన్త Name of the fifth Manu of the present Kalpa; Name of a King." అనియున్నది.-

'రేవంతుఁడు = అశ్వశిక్షకుఁడు' అనుట కాధారమేమో ఇంకను చూడవలెను.

44. చాఁదుసేయు

నూ.ని.—'చాఁదు'క్రింద, హరవిలాసములోని,—

"మూల్గులెమ్ములతోడ ముదుకగాకుండఁగఁ
జాఁదు బాగున నల్లచారుగాఁచి" (౨-౧౨౧)

అను పద్యమును,—*"చాఁదుసేసిన నల్లఁజారుగాఁచి" అను పాఠముతో గ్రహించి,—"చాఁదుసేసిన = పలుచనచేసిన" అని యర్థముచెప్పినది.

చాదు, (చారుకంటెను) చిక్క్—గానుండునుగాని పలుచగా నుండదు. కావున 'చాదువలె పలుచనచేసి' అనుట సరికాదు.

నల్ల(=రక్తము)ను, ముందు (నీళ్లుకలిపి) పలుచనచేసి, పిమ్మట, చారు కాచినట్లు చెప్పుటయు సరికాదు.

---

* నూ.ని. లో, ఈయర్థ ముండుట చూడక, (22-వ పుటలో,)- "నూ.ని. తీసికొన్న "చాఁదుసేసిన నల్లక్" అను పాఠాని కర్థమేమో"అని వ్రాసియున్నాను. పొరపాటు.

♦'చాఁదుబాగున (=చాఁదువలె చిక్కఁగా), నల్ల చారుగాఁచి' అను పాఠమే సరియైనది.

45. చీములుగట్టు

సూ.ని.—"చీములుగట్టు = చెవులు - చీములుపట్టినట్లు బాధించు" అని యర్థముచెప్పి, అందు కీపద్యమును చూపినది.—

"పుడమి జనంబులెల్లనినుఁ బ్రువ్వఁగఁదిట్టఁగ వించునున్కి నొ
చ్చెడుమది యెప్పుడుం జెవులు చీములుగట్టెడుఁ గౌరవేశ్వరా."
(భా. ఉ. 2-10)

లోకులు నిన్నుతిట్టు తిట్లు వినుటచేత, మనసూ.. చెవులూ బాధపడు చున్నవి-అని పద్యభావము.

కాబట్టి, 'చెవులు...బాధించు' అని యర్థముచెప్పుట సరికాదు. *'చెవులు...బాధపడు' అని చెప్పవలెను.

46. ముట్లు ; ముట్లుఁబాలు

ఆం. భా. (2-258)లో,—"ముట్లు నాఁగఁ బీయూషనామంబు" అని యున్నది. (పీయూష మనగా - ఈనిన యేఁడుదివసములలోని యావు పాలు, జున్నుపాలు-అని, గురుబాల ప్రబోధిక.)

శ.ర. లో,—"ముట్లు = ముట్లుఁబాలు = ఆవులులోనగునవి యీనిన తర్వాతి మూఁడుదినములలోని పాలు" అని యున్నది.

కాని, 'ముట్లు'-ఈనిన యేడుదినములలోనిపాలూ కాదు; మూడు దినములలోనిపాలూ కాదు. అది పాలకు పూర్వరూపము. పసరమునకు చూడిముదిరినకొలదిని ముట్లేర్పడుచుండును. అది తొలుత పల్చగానుండి క్రమక్రమముగా చిక్కబడుచూ - జిగటలు సాగుచుండును. ఆసన్నప్రసవ

♦ వా.ని. లో,—సూ.ని. పాఠమే, సూ.ని. అర్థమే యున్నవి.

* వా.ని.—"చీములుగట్టు = (చీముపట్టినపుండుకలవానివలె) బాధ చెందు" అని చెప్పి, పైపద్యమునే చూపినది.

మైన పశువును పిదికిన వచ్చునది 'ముట్టు'. అది కొంచెము పసుపుదాళుగా నుండును.

ఆ ముట్టే ప్రసవానంతరము పాలుగా మారును. పశు వీనినపూట పిండినపాలు పచ్చగాను - చిక్కగాను ఉండును. అవ్వే ముట్టుఁబాలు.—(ముట్టుతోగూడినపాలు-అని ఆమాట కర్థము.)

ఆ మొదటిపూట పాలను పశువులతొట్టిలో పోయుదురుగాని కాచి యుపయోగించుకొనరు. ఎక్కువభాగము ముట్టుగా నుండుటయే దానికి కారణము. తరువాత ఆయిదారుగోజులలో (పూటకుపూటకు ముట్టుభాగము తగ్గుచూ) పరిశుద్ధమగు పాలు దేర్పడును. ముట్టుపాలు కాచినంతనే విరిగి గడ్డకట్టును. ఆగడ్డకే 'జున్ను' అని పేరు. ముట్టుపాలనే - జున్నుపాలందురు.

కాబట్టి, "ముట్టు నాఁగఁ బీయూషనామంబు" అనుటయు,—"ముట్టు = ముట్టుఁబాలు" అనుటయు పొరపాటు.

శ.ర.-"జున్ను=జున్నుఁబాలు, *పియ్యూష" మన్నది. ఆదియును పొరపాటే. 'జున్ను' - 'జున్నుఁబాలు' భిన్నపదార్థములు.

'జున్నుఁబా' లనగా—జున్ను కాదగిన పాలని యర్థము. ఆ పాలను కాచినపిమ్మట దేర్పడునది-జున్ను.

జున్ను, జున్నుపాలు-వేరువేరు పదార్థము లనుటకు,—

"కమ్మనిజున్ను, మంచిదెయి, గట్టిది మీఁగడతోఁ బెరుంగు, చొక్కమ్మగు జున్నుపాలు" (హంస. 2-111)

---

* 'పియ్యూషము' ఇది వ్యావహారికరూపము. —"త్రైయక్షపానీయ పీయూష...ప్రభృతులను గియ్యలు పెట్టరాదు" అని,-అప్పకవి హెచ్చరిక. (2-226). శ.ర. కర్త, మూలపదములలో 'పీయూష' మన్న రూపమునే చేర్చినాడు. అర్థవివరణాదులలో వ్యావహారిక పదములను వాడవచ్చునని తెలుపుటకు 'పియ్యూష' మన్నాడు.

47. చూఱకొరుఁడు

శ.ర. లో, "చూఱకొరుఁడు. మి.గ్రా.విణ. కొల్లపెట్టినవాఁడు. 'వ. అనవరతసుకవి నికరస్తోత్ర వచనరచనాసమయ నిర్వికారుండును, చెంచుమల చూఱకొరుండును' వి. పు. ౧ ఆ. (ఇది బిరుదుపేరు. బిరుదుపేళ్లు లక్షణమునకు కట్టుపడియుండవు.)" అని యుండగా,— సూ.ని. 'చెంచుమల చూఱకొరుఁడు' అను పదమును మొత్తముగా-మూలపదముగా-గ్రహించి "చెంచుదుర్గమును కొల్లగొట్టినవాఁడు. బిరుదవిశేషము" అని యర్థము చెప్పినది. పైగా, "మిశ్రము-విశేష్యము" అన్నది.

'చెంచుమల చూఱకొరుఁ' డని, శృం.నై. లో ఉన్నందున, సూ.ని. గ్రహించెనందురా? అలా అయితే,—

'చెంచూమల చూరకొర' అని కాశీఖండములోను,—

'చెంజిమల చూరకొర' అని హరివంశమునను,—

ఉన్నవే. ఆ పదములనుగూడా సూ.ని. గ్రహింపకపోవు చేలా?

మరియు, గ్రంథములలోను, శాసనములలోను—('చెంచుమల చూఱకొరుఁ' డొక్కఁడే కాడు) ఎన్నోరకముల చూఱకొరు లున్నారు. చూడండి :

1. 'పగమండల చూఱకొర' (శాసన పద్యమంజరి. పు. ౧౧)
2. 'కటకపురీచూరకారి-హరి' (మట్ల అనంతభూపాలుని శాసనము.)
3. 'వాణీమనో - భాండారోద్ధత చూఱకొర' (కవులసప్తమ)
4. *'సరస్వతీమనోభండార చూఱకొరుండును' (కావ్యా. సం.)

---

* వావిళ్లవారి ప్రతిలోను, శ్రీ సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రిగారి ప్రతిలోను,— 'భండారచౌర్యకారుండును' అని యున్నది. కాని, శత్రుదుర్గములను, భండారములను, చూఱగొనుట శూరలక్షణముగాని, చోరీచేయుట శూరలక్షణము కాదు. 'చూరకొర' అనునది బిరుదవిశేషము గాని, 'చౌర్యకార' అనునది కాదు. కావున కవిపాఠము 'భండార చూఱ కొరుండును' అనియే యుండుననియు, అందు సమాసము తప్పగునని పూర్వ

సూ.ని. ఈ 'చూఅ కొరసమాసముల నన్నిటిని-అచ్లే కైకొని అర్థములు వ్రాయునా? (క కొరము క్రింద - 'కటకపురీ చూఅ కొరుఁడు=కటకపురమును కొల్లగొట్టినవాఁడు'-అని వ్రాయకపోవు టేల?)

ఇక్కడ ఒక్క చిన్న మనవి :—

సూ.ని. లో 'చూఅ కొరుఁడు' అను పదమే లేదే; చూఅ కొరుఁడు - లేకుండానే, 'చెంచుమల చూఅ కొరుఁడు' ఎలా వచ్చాడు? చూఅ కొరుఁడు= కొల్లగొట్టువాఁడు, అని ఒకముక్క వ్రాసియుంటే,—

"చెంచుమల చూఅ కొరుఁడు = చెంచుమలను కొల్లగొట్టినవాఁడు."

"కోయమల చూఅ కొరుఁడు = కోయమలను కొల్లగొట్టినవాఁడు."

"వంకాయల చూఅ కొరుఁడు = వంకాయలను కొల్లగొట్టినవాఁడు."

"వల్లకోటి చూఅ కొరుఁడు = వల్లకోటిని కొల్లగొట్టినవాఁడు."

అని తా నర్థములు వ్రాయవలసిన అక్కరయుండదే. మరి తా* నా పదమును చెప్పక వదలివేయు టేల?

పరిష్కర్తలు 'చౌర్యకొరుండును' అని సవరించియుందురనియు నా యభిప్రాయము.

ఈ విషయమై శ్రీ శాస్త్రిగారికి వ్రాయగా, వారు 'చూర కొరుండును' అని యుండుటయే యుచితము. కాని, నా కట్టిపాఠము లభింపలే దన్నారు. వ్రాతప్రతులలో, పాఠము— 'చూఅ కొరుండును' అనియే యుండునని నా నమ్మిక.

* "చూఅ తెలుగు పదమును - కొర సంస్కృతమును నగుటచేత నిది గ్రామ్యమయి సమాసము నింద్యముగా నున్నది. అందుచే 'చూఅ కొరుడు' అను పదమును నేకవియు నుపయోగింపడు. కావున దీనిని సూ ని. మూల పదముగా దీసికొనలేదు. కాని; బిరుదరూపమున 'చెంచుమల చూఅ కొరుడు' అనునది యాక్షేపింప దగనిది. ఏలయన, బిరుదనామములును, శాసన లిఖితములును శాస్త్రనియమములకు గట్టుబడియుండ వందురు. గనుక నియ్యది యేకపదముగానే భావింపబడును. అందుచే నీ పదమును, సూ.ని. మూల

ఆది యట్లుండగా, 'చెంచుమలచూఅకొరుఁడెవడో, (అనగా ఆతని పేరేమో) తెలుపక, సూ.ని. ఆసమాసానికి ప్రతిపదార్థము వ్రాస్తుంది; యెందుకండీ?

ఎందుకంటే, యెన్ని పేర్లని వ్రాస్తుంది? చెంచుమలచూఅకొరుఁడు, అనమేమూగెడ్డి కావచ్చును; వీరభద్రాగెడ్డి కావచ్చును; విష్ణుపురాణపు రాఘవరెడ్డి కావచ్చును; మామిడి సింగనమంత్రి కావచ్చును; బెండపూడి అన్నయమంత్రి కావచ్చును. మరి యింకొకరును కావచ్చును. దానికి నిరుకేమున్నది? చెంచుమలను చూరగొనుటలో, ఏమాత్రము సంబంధము కలవాడైనను - చెంచుమల చూరకొరుఁడే. ఇట్టి పదమును నిఘంటువు గ్రహింపవచ్చునా? గ్రహించేయెడల, 'చెంచుమల చూఅకొరుఁడు = అనమేమూగెడ్డి ప్రభృతులు'; 'పరమండల చూఅకొనుఁడు=మహామండలికభీముడు'

పదముగా గ్రహించి యర్థమును జెప్పుట తప్పుగాదు"-అని వీ.బ్ర. గారి వ్రాత.

1. 'చూఅకొరుడు' గ్రామ్యమట! సమాసము నింద్యమట! అందువలన సూ. ని. గ్రహింపలేదట! అయితే, శ. ర. మూలపదముగానే గ్రహించినడే; తప్పేనా?

2. 'చూఅకొరుడు' అను పదము నేకవియు నుపయోగింపడట! 'పరమండల చూఅకొర'; 'కటకపురీ చూరకొర' అను ప్రయోగములను నేను చూపియే యుండగా, "ఏకవియును ప్రయోగింపడనుట తెలివితో కూడిన మాటయేనా?

3. 'చూఅకొరుడు' నింద్యమట! 'చెంచుమల చూఅకొరుడు' అనింద్యమట! అది యేలాగు?

నింద్యసమాసముతోకూడి యేర్పడు సమాస మనింద్యమగునా? 'అల్పదండు' అనునది దుష్ట (నింద్య) సమాసముగదా. 'ప్రసిద్ధాల్పదండు' అని గాని, 'మేటియల్పదండు' అనిగాని సమాసము చేయుచో సాధువగునా? వీ.బ్ర. గారి వ్యాకరణమున నగుసు కొబోలు!

4. 'చెంచుమల చూఅకొరుడు' ఏకపదమట! నిజమేనా? ఈ రీతి వ్రాతలు వ్రాయువారును పండితులేనా?

ఇత్యాదిగా పేరులువ్రాయవలసివచ్చును. వ్రాయవచ్చునా? ఎన్నటికిని వ్రాయఁగూడదు. నిఘంటువు తీసికొనవలసినది – 'చూఁఅ కొఁర'పదమునుగాని, చెంచుమల చూఁఅ కొఁరుఁడు; పరమండల చూఁఅ కొఁరుఁడు–వంటి పదములను కొదు. 'చూఁఅ కొఁరుఁడు' అనుపదమును (శ.ర. కర్తవలెనే) మూలపదముగా చూపి, దానిక్రింద, ఆపదముతోఁగూడిన పదములను చూపవలెను. అది నిఘంటుమర్యాద. సూ.ని. త్రొక్కి–నది తప్పుత్రోవ.

మరియు, 'చూఁఅ కొఁర'డన్నను,– చెంచుమల చూఁఅ కొఁర' డన్నను విశేషణమే అవుతుందిగాని, విశేష్యమేలా అవుతుంది. శ.ర. కర్త విశేషణ మంటే, "కాదు; అది విశేష్య"మన్నది, సూ.ని. *కారణమేమో!

---

* "ఈ ప్రశ్ననుబట్టియె వింతపడవలసివచ్చినది. ఏలయన: 'చూఁఅ కొఁరుఁడు' అనుపదము, సూ. ని. చెప్పినట్లు విశేష్యమె (Noun) కాని, శ.ర. కర్త చెప్పినట్లు విశేషణము (adj) కాదు. విశేషణములకు లింగవచన విభక్తు లుండవు. కాని, యీ 'చూఁఅ కొఁరుఁడు' పుంలింగము, ఏకవచనము, ప్రథమావిభక్తియు నయి యున్నదిగదా. కావున విశేష్యమే కాని విశేషణముగాదు. విశేషణమనిచెప్పుట ప్రమాదము" అని వీ.బ్ర.గారి వ్రాత.

చూఁఅ కొఁరుఁడు విశేషణమనుట ప్రమాదమగుచో, ఆ ప్రమాదము, శ.ర. కర్తదియగునేగాని, నాదికాదు. కావున నా ప్రశ్నకు వింతపడవలసివచ్చినదనుట తెలివితక్కువ.

చూఁఅ కొఁరుఁడు – పుంలింగమట! వారిపాండిత్యమున ఆది అకారాంత పుంలింగము కాబోలు! కాబోలు బోలు బోలు!!

లింగవిభక్తివచనములుండు శబ్దము లన్నియు–విశేష్యములేనట! అలా అయితే, లింగవిభక్తివచనములుగల,— శివంకరుఁడు; ప్రియంవదుఁడు; నాందీకరుఁడు; కృపాళుఁడు–మొదలగుపదములు, నిఘంటువులలో విశేషణములుగా చెప్పబడియున్నవే! వానిగతి యేమి? బ్రహ్మంగారి శాసనము ప్రకారము, నేటినుండియు, వాటిని విశేష్యములుగా భావింపవలసినదేనా? అట్లు భావించు 'యంబ్రమ్మలు'ను ఉందురా?

చూఁఅ కొఁరుఁడు (కొల్లగొట్టువాడు) గుణమును తెలుపుపదము గాని, సంజ్ఞావాచకము కాదు. కావున, విశేష్యము (Noun) అనుట తప్పు. అసలది బిరుదపదము. బిరుదులు విశేషణములుగాని విశేష్యములు కావు.

కారి (కారుడు) అను సంస్కృతశబ్దము చూఅ-అను వైకృతముతో సమసించుట వ్యాకరణవిరుద్ధము. అందువల్లనే, శ.ర. కర్త-(ఇది బిరుదు పేరు. బిరుదువేళ్లు లక్షణమునకు కట్టుపడి యుండవు) అని వివరించి యున్నాడు. సూ.ని. ఆవివరమునుచెప్పక, విడిచినది. అది యెందువల్ల?

మరియొకవిశేషము - చూఅకారుడన్న మిశ్రసమాసము కేవల సంస్కృతశబ్దములతోను కలసి-సమసించును. తప్పకాదు. ('పరమండల చూఅకారుడు'; 'కటకపురీ చూఅకారుడు'; 'సరస్వతీమనోభండార చూఅకారుడు' అను సమాసములను చూపియేయున్నాను గదా.) ఈ యంశమును, శ.ర. కర్త చెప్పలేదు. సూ.ని. యైనను చెప్పెనా? లేదే!

"లక్షణగ్రంథమైన కావ్యాలంకారసంగ్రహమున గల "సరస్వతీ మనోభండార చౌర్యకారం"డను పదములోగల సలక్షణమైన 'చౌర్యకారం'డను పదమును చూఅకారుడనిదిద్ది, విలక్షణమొనరించి, యీకవి కెనలేని కళంకమును మన దీ.పి. శాస్త్రిగారు గూర్చినారు గదా!" అని వీ.బ్ర. గారి మరియొక వ్రాత.

వీరు సామాన్యసమాసజ్ఞానముకూడా లేనివారు.—"నీర + ఆట = నీరాట, నీరాటము (స్నానము)—'నీరాటవనాటములకుం - బోరాటంబెట్లు గలిగె' (భార)."—"నీర + ఆమని = నీరామని (వర్షఋతువు). ఈ రెండును తప్పసమాసములు" అనియు,—

"పలరాజు. 'పల'యనునది లేలుగు. 'రాజు' అనునది మిశ్రమ సమాసము." అనియు,—

"రాజు + ఆజ్ఞ = రాజాజ్ఞ. ఇందలి 'జా' ఆకారముతోఁ గూడి యున్నను తత్సమశబ్దమగుటచే తాలవ్యమైనది." అనియు, – అన్నవారు. అట్టివారికి విశేషవిధుల బిరుదుసమాసముల తత్త్వ మెట్లాకళింపుకొగలదు?

'భండారచూఅకారుఁ' డనుటయే ఒప్పు. 'చౌర్యకారుఁ' డని దిద్దుటయే తప్పు.

తిక్కన, నిర్వ. రా. (2-102)లో,—"పాండిత్యసుభగుఁడిభువన, పెండేమి" అన్నాడు.

'త్రిభువన పెండేరుడు' అనుట తప్పని, దిద్దివేయవచ్చునా? దిద్దుచో, అది యవివేకమును - భాపాక్రోహమును అగును.

48. చేటపెయ్య

"చేటపెయ్య=దూడచచ్చిన ఆవు చేపుట్టకై చచ్చిన దూడచర్మమును కుట్టి దానిలో గడ్డిపెట్టి చేసినదూడ, కృత్రిమవత్సము" (నూ.ని.)

దూడచచ్చిన ఆవుచేపుటకే కాదు, దూడచచ్చిన బఱ్ఱెచేపుటకును - చేటపెయ్యను-తయారుచేయుట కలదు. కావున, *"చేటపెయ్య=చచ్చిన దూడచర్మమును కుట్టి - లోపల గడ్డిపెట్టి - చేసిన దూడ" అని చెప్పుట యుచితము.

చేటపెయ్య-యొక్క తొలిరూపము 'చేతపెయ్య' అయ్యుండు ననియు, అది, 'చేతగట్టు'వంటి పదమనియు, చేతపెయ్యయే-కాలక్రమమున 'చేటపెయ్య' అయినదనియు నా యభిప్రాయము. పెద్ద లేమంటారో!

శ.ర. లో "చేత = కృత్రిమము; చేతగట్టు = కృతకొద్రి"-అని యున్నది.

---

* వా.ని. "దూడపోయినవెనుక దాని చర్మముతోఁ జేయు కృత్రిమ వత్సము" అనియే చెప్పినది.

'చేటపెయ్య'ను గూర్చి, వీ.బ్ర. గారిట్లొక వ్యాఖ్యానము చేసినారు:-

"చేటుయొక్క విశేషణరూపమే చేట.— "చేటు. Ill, ruin, waste, spoiling, to be ruined or destroyed." (బ్రౌ.),— చేటు-అనగా, 'చెడు' అని యర్థము. చేటుచెందిన పెయ్య-అని భావము. ఇంగుల కొకటిరెండుదాహరణములు :—

'వారు పైపై నెత్తివచ్చినఁ బోరి కోప
మనిన ధృతిచేటు కొక పాందగునె చెపుమ.' (ఉద్యో. 2-215)

'చేటుగోరుచున్న చెనటివి నీవు' (సుగ్రీవ. పు. 15)

బ్రహ్మంగారివ్రాత నాకేమీ బోధపడలేదు. 'చేటపెయ్య'లోని 'చేట'కును, పైయుదాహరణలకును సంబంధమేమో తెలియలేదు.

'చేటు'కు 'చేట' విశేషణరూపమట! నిజమేనా?

వారిది 'చేటవ్రాత' యగునో! 'వ్రాతచేట' యగునో! విద్వాంసులు నిర్ణయింతురుగాక.

49. నిలువునీరు

సూ.ని. 'నిలువు' క్రింద, 'నిలువు నీరునఁబండినట్లు' అను నానుడినీ—"సమృద్ధమైన నీరునిలిచిన చేనిలో పండిన పైరురీతిగా" అన్న యర్థమునూ వ్రాసి, ఆ యర్థమునకు,—

"చెలఁగి యమ్మక్క—యొక్క— యొచ్చెమ్మలేక
నిలువు నీరునఁబండిన ట్లలరినాఁడు." (ఉ-శ-౨)

అను 'సారంగధర' పద్యమును చూపినది. పద్యమును-అర్థమునుగూడా, సూ.ని. వే. వే. శాస్త్రిగారి గ్రంథమునుండి గ్రహించినది.

"నిలువు...నట్లు = మానిసి ప్రమాణపు నీళ్లునిలిచినచేనిలో పైరు పండినరీతిగా" అని, శాస్త్రిగారి టీక.

'ఒకట నొచ్చెమ్మలేక'-అని, తంజావూరిప్రతి పాఠము. ఏయంశమునను లోపములేక, నిలువు = ఈశరీరము, నీరునఁబండినట్లు = నీటఁబెరిగినచో యన్నట్లుగా, (సారంగధరుడు) అలరినాఁడు=ఒప్పియున్నాడు-అని నేను వ్రాసిన టీక. (చూ. పుట. ౧౭౨)

(1) చెట్టునఁబుడికినట్లు, (2) పులుమొసవిబలిసినట్లు-అను నానుడు లెట్టివో,—'నీరునఁ బండినట్లు' అను నానుడియు నట్టిదే.

పైరుగాని, చెట్టుగాని పెనుగుటకు 'నిలివెడు' నీరక్కరలేదు. తగుమాత్రమున్న చాలును. నీరు మితిమీరియున్నచో నీరుచిచ్చుపడి చెట్లు చేమలు నశించును. కావున ఆ నానుడిలోని 'నిలువు'నకు,— శరీరము (ఆకృతి) అని యర్థముచెప్పుట యుచితముగాని, 'నిలివెడు' అని చెప్పుట యుచితముకాదనీ, చెప్పవలసిన అక్కరయులేదనీ నా యాశయము.

---

(1) "ఏవేషము ధరియించిన
నా వేషము తనకు నందమై యద్ధాత్రీ
దేవుఁడు చెట్టునఁబుడికిన
భావంబున నుండు రూపు ప్రాయము కలిమిన్." (కాశీ. 7-232)

(2) "పులుమొసవి బలిసినట్లుండు పుండరీకములు"
(పిడు. బస. పురా. 7-252)

వీరబ్రహ్మంగారి విపరీత పాండిత్యము

'నిలువు' అను పదాన్ని గురించి, వీ.బ్ర.గారు వ్రాసిన వ్రాతలు చిత్ర పిచిత్రములుగా నున్నవి. అందు వారి పాండిత్యము విపరీతముగా వెల్లి విరిసినది. గ్రంథవిస్తరభీతిచే, ఒక కొన్ని యంశములనుమాత్రమే యుదాహరించుచున్నాను.

1. నిలువు – అవయవార్థము

"నిలువు అను శబ్దము తన యవయవార్థమునే కాక, సందర్భోచితముగా నన్నే కార్థములను సూచించును" అని యొక వ్రాత.

తెనుగుమాట; ఏకపదము - అయిన 'నిలువు'కు అవయవమేమి? అర్థమేమి?

2. నిలువు – శబ్దపల్లవము

"నిలువు అనే కార్థములను సూచించునట్టిగ, శబ్దపల్లవము(Idiam)గా వ్యవహరింపబడుచుండును" అని యింకొక వ్రాత.

శబ్దపల్లవసంజ్ఞ క్రియలకేగాని,- నిలువు, నీరు, నిప్పు, నీటు మొదలగు విశేష్యములకు లేదు.

ఆ క్రియలలోను, ధాత్వాగుల కనుప్రయుక్తంబులై విలక్షణార్థాభిధాయకంబులగువానికేగాని,-వచ్చు, పోవు, తిను, వంటి యేకపదక్రియలకు శబ్దపల్లవ సంజ్ఞ చెల్లదు.

కావున, ఏకపదమును-విశేష్యమునైన 'నిలువు' శబ్దపల్లవ మనుట వ్యాకరణగంధమెరుగని దుబారా ప్రసంగము.

3. నిలువు (Idiam)

తమకు సంస్కృతాంధ్రములయందే కాక,ఆంగ్లమునందును పాండిత్యము కలదని తెలుపుకొనుటకు కాబోలు, నిలువు-శబ్దపల్లవ మని చెప్పుటతో తృప్తిపడక 'Idiam' అనికూడా సెలవిచ్చినారు.

శ్రీవారికి సంస్కృతాంధ్రములయందుగల పాండిత్య మేపాటిదో ఆంగ్లమునగల పాండిత్యమును ఆపాటిదిగనే యున్నది. అర్థమూహాట

ఆటుండగా 'ఇడియమ్' అనుమాట వ్రాయవలసినతీరు, అనగా గుణింతము (Spelling) కూడా వారు సరిగా నెరుగరు.

Idiam అని వ్రాసినారు; తప్ప.

Idiom అని వ్రాయవలెను. (ఇడియమ్ లోనిది 'ఒయమ్' గాని 'ఎయమ్' కాదు.)

ఆంగ్లమున నైనను ఒక్కపదము 'ఇడియమ్' అనిపించుకొనదు. విలక్షణార్థమునిచ్చు కొన్నిపదములకూడికకు 'ఇడియమ్' అని వ్యవహారము. ఆ పదమునకు ఆంగ్లభాషలో వివరణ మిట్లున్నది.

"Idiom—'One's language; the way of expression, natural to a language; an expression peculiar to it."

కాబట్టి, "నిలువు-శబ్దపల్లవ"మనుట యెట్టితప్పో, 'ఇడియమ్' అనుటయును అట్టితప్పేనని పర్యవసానము.

4. నిలువు-హృదయము

'నిలువు అనేకార్థముల నిచ్చు'ననుచూ వారిచ్చిన యుదాహరణములునూ, చెప్పిన అర్థములునూ ఇట్లున్నవి.—

"నిలువెల్ల కదయ - ఇట నిలువు అనగా శరీరమును కాదు. ఆకారమునుగాదు. దయకు స్థానభూతమైన హృదయమని యర్థము. 'దయార్ద్రహృదయ' అని కలదుగదా"-అని వారి వ్రాత.

'దయార్ద్రహృదయ' యనుట లోకమున కలదుగావున, 'నిలువెల్లకదయ' అంటే హృదయమంతయును దయ యని యర్థమట! ఇది శబ్దార్థము నెరిగిన వ్రాతయేనా? ఆయన నిఘంటువు నైనను చూచుకో గూడదూ?

(1) శ.ర.కర్త, నిలువు = ఆకృతి యని అర్థముచెప్పి, అందు కుదాహరణగా, "నిలువు దయామయంబు" అను రామాభ్యుదయ పద్యము నిచ్చినాడు.

(2) బ్రౌనుదొర, 'నిలువు' అను పదముక్రింద,—

"కమలంబు మోము కన్నులు
కమలంబులు కేలుఁగవయుఁ గమలము లడుగుల్
కమలంబులు నిలువెల్లను
కమలాకృతి మించెఁ బుడమికన్నియ బలికెన్" (రామా. 4-67)

ఆను పద్యమును చూపించి, "కమలంబులు నిలువెల్లను. She was lovely all over: her whole figure was roses" అని యర్థము చెప్పినాడు.

(3) "నిలువెల్లను గల్ల - కొమి నిజమరిగలఁడే" (భాగ. 9-571)

శ. ర. కర్త 'నిలువు = ఆకృతి' యని చెప్పియుండగా, బ్రౌను పండితుడు 'నిలువు = figure' అని తెలిపియుండగా, శ్రీ వీరబ్రహ్మముగారొకరు 'నిలువు = హృదయ'మనుట విపరీతముగా లేదా?

5. నిలువు = చూపులు, మాటలు, చేతలు.

"ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ. ఇందు, నిలువు అనగా శరీరమునుగాదు, విషమనగా...విషమునుగాదు. నిలువెల్ల విషమనగా, హృదయప్రేరితములై చూచు చూపులును, ఆడు మాటలును, చేయు చేతలును విషతుల్యములైన పాపభూయిష్ఠములని యర్థము. కావున ఇక్కడ నిలువు-అనగా, చూపులు; మాటలు; చేతలు." అని వారి యింకొక వ్రాత.

నూ ని. 'నిలువు = శరీరము' అని యర్థముచెప్పి, అందుకే 'సుమతి' పద్యమునే యుదాహరించినది.

బ్రౌను, 'వాని నిలువెల్లా విషము' అనేమాటకు "he is a villain from head to foot" అని యర్థముచెప్పి, అక్కడ 'సుమతి' పద్యమును గూడా సూచించినాడు.

అసలు 'ఖలునకు నిలువెల్ల విషము' అనేమాటకు "సర్వాంగం దుర్జనే విషమ్" అన్న సంస్కృతవాక్యం మూలము.

అది యట్లుండగా, సుమతిశతక పద్యమునకు,—

"శిరసి విషం స్యా త్ఫణి న
స్తిష్టే త్పుచ్ఛేతు వృశ్చికస్యాహో!
న శిరసి నహి పుచ్ఛేవా
వపుషి ఖల స్యాఖిలే విషం హి స్యాత్"

అని సంస్కృతానువాదము.

కొబట్టి వీ బ్ర.గారివి 'అస్తావిస్తు'పు వ్రాతలుగాని సరియైనవికావనీ, వారు సుమతిశతక పద్యమునకైనను సరిగా అర్థముచెప్పగలవారు కారనీ

అట్టివాని శబ్దార్థచర్చలకూ, పాఠనిర్ణయాలకూ పూనుకొనుట తప్పనీ అంటే, పెద్ద లంగీకరింపరాదా?

6. పునరుక్తి; ఛందస్సు

"నిలువు = శరీరము, అని యర్థముచెప్పేయెడల, శరీరవర్ణనము సీసచరణములలోను ఉన్నదిగావున పునరుక్తదోషము తటస్థించి ఛందశ్శాస్త్ర రీత్యాగూడా తప్పగుమన్నది" అని వారికొక ప్రసంగము.

పునరుక్తి వాక్యదోషముగాని, ఛందోదోషము కాదు. ఆ దోషము పద్యమునకేకాదు, ఛందస్సులో సంబంధములేని గద్యమునను ఉండవచ్చును. కావున "పునరుక్తటస్థించి ఛందశ్శాస్త్రరీత్యా తప్పగును" అనుట శకార సంశ్లేషణమును తలపునకు తెచ్చు అసంబద్ధ జల్పనము.

అదేమికర్మమోగాని ఆ బ్రహ్మకవిగారిబుద్ధికి - అగ్రగ్రహణమున - వక్రగమనమేగాని, ఋజుగమనము లేదు. చూడండి.—

"నెమ్మోని, మిసమిసల్‌గడు మిఱుమిట్లుగొనఁగ"

అని వేదం-వారి పాఠము.—"మిఱుమిట్లుగొలుప" అని నా సవరణ.

నా సవరణ నాక్షేపించుచూ వీ.బ్ర. గారు గిలికినవ్రాత యిదీ.—

"కొనఁగ అనుటయే సరి. 'కొలుప' అనుట సరికాదు. 'కొనఁగ' అను క్రియకు 'మిఱుమిట్లు' కర్మయు; 'మిసమిసలు' కర్తయునై యున్నవి. 'మిసమిసల్ - మిఱుమిట్లును-కొనఁగ', అని చక్కనియర్థము కనబడుచుండగా శ్రీ దీ.పి. శాస్త్రిగారు,— మిసమిసలే (పద్యమునలేని) కనులకు మిఱుమిట్లు గొలుపుచున్నవని వ్రాయుట యసంగతము కాదా?"

మిఱుమిట్లుగొనునవి కన్నులో - కొంతులో,—ఆయనకు తెలియదు. 'మిఱుమిట్లుగొను' అనునది అకర్మకక్రియయన్న జ్ఞానమూ-ఆయనకులేదు. మిసమిసలు-కర్తయట! మిఱుమిట్లు-కర్మయట! కొను-క్రియయట! ఆయనా పండితుడే! ఆయన వ్రాతలకును బదులు వ్రాయవలసినదే!! గ్రహచారము!!!

(1) ఆ సారంగధరలోనే.—

"నలుదెసల్ మిఱుమిట్లుగొలుపు దేహచ్ఛాయ
తలఁగఁ గ్రోయఁగరాని బలముగాఁగ" (అ-3)

అని యున్నది.

(2) భాగవతములో,—

"శ్వేతవ్రాత దీధితులు...వియచ్చరకోటి నేత్రంబులకు
మిఱుమిట్లుగొలుప" (10. ఉ. 401) అనియు,—

"మిక్కుటంబుగదృష్టి మిర్మిట్లుగొనఁగ" (,,-1306) అనియున్నది.—

(3) ఆంధ్రభాషార్ణవములో,—

"కనులు చెదఱుంగఁ జీకట్లు గ్రమ్మెననుట
కలరు మిఱుమిట్లుగొనె నన" (3-109) అని చెప్పబడియున్నది.

ఏదియునెరుగక,— పనికిమాలిన వ్రాతలతో భాషారాధకులను బాధించు వీఁబ్రఁ గారిని విద్వల్లోకము మందలింపవలదా?

50. నీరుకొలఁది తామర

సూ.ని. 'తామర' క్రింద నీరుకొలఁది 'తామర' అను సామెతనుచూపి, "చెఱువులోని నీరెంత హెచ్చుగానున్న తామరపూ వంతయెత్తుగాలేచును" అని యర్థమువ్రాసినది. ఆ యర్థమునకు,—

"తమవిద్య నెవ్వరేమా, త్రము గనఁజాలుదురు వారిదండను దన్నా
త్రమప్రకటింతురుబుధు లు, త్తములమహిమ నీరుకొలఁదితామరసుమ్మీ"

అను (కళా. 3-ర్ద) పద్యము నుదాహరించినది.

పై సామెతకు సూ.ని. చెప్పినదేనాయర్థము? ఆ యర్థము ఉదాహృత పద్యమున సరిపడినదా? 'ఉత్తములమహిమ నీరుకొలఁది తామర' అన్న మాటకు, 'చెఱువులోని నీరెంత హెచ్చుగానున్న తామరపూవంత యెత్తుగా లేచును' అని యర్థముచెప్పితే, ఏమితేలినట్లు? ఏమితెలిసినట్లు?

సూ.ని. చెప్పినది ఆ సామెతలోనిమాటల కర్థమగునేగాని, ఆ సామెతకుగల సంప్రదాయార్థము కాదు. ఎదుటి శక్తిసామర్థ్యములకు తగినట్లును, ఎదుటి హృదయమునకు సరిపోవునట్లును వర్తించుట-యను నర్థమున వాడబడునది యీ సామెత.

'ఉత్తములమహిమ నీరుకొలఁది తామర' యనగా,—తామర, నీటి హెచ్చుతగ్గులనుబట్టి, ఎత్తుగాలేచుచు-క్రిందకిదిగుచు నుండు విధమునసే, ఉత్తములయొక్క మహిమయు, ఎదుటివారి ప్రజ్ఞయొక్క న్యూనతాధిక్యతల ననుసరించి, ప్రకటమగుచుండునని భావము.

"మగఁడే కొలఁదిగ నడిపినఁ
దగ నల్లే నీరుకొలఁది తామరవై యే
పగిది న్నడచెదవో, నీ
దగునేరుపు చూతుమింక నలరుంబోఁడీ" (యయా. 4-129)

అన్నచోట, "నీరుకొలఁది తామరయై-నడచుట" యనగా, మగనిమనసు ననుసరించి మెలగుట, యని భావము.

సామెతలు భావప్రధానములు గాని - ప్రతిపదార్థ ప్రధానములు కావు. కావున సూ.ని. వ్రాసినఅర్థము సరియైనది కాదు.

నీరు హెచ్చుగా వచ్చినప్పుడు - ఎత్తుగాలేచునది తామర పువ్వొక్కటే కాదు, తామరఆకులు-కాడలుకూడా లేచును. కాబట్టి - 'నీరు కొలది తామర' అన్నచోట, 'తామర = తామరపువ్వు' అనుట సరికాదు.

51. కమ్మపంజు

శ.ర. లో,—"కమ్మపంజులు = పంజులకమ్మలు. "వ. కమ్మపంజుల వ్రజంపుఁజకచకల నకనకలు వీడుకొని (స్వా. 3. ఆ.)" అనియున్నది.

సూ.ని.,— "కమ్మపంజు = పంజులకమ్మ - రత్నములు కూర్చుటచే దివిటీవలె వెలిఁగెడికమ్మ" అన్నది.

ఆ రెండువ్రాతలును ప్రమాదమూలకములు.—

'కమ్మపంజు' అనగా, కమ్మయొక్క పంజుగాని, పంజులకమ్మకాదు. (పంజు = కమ్మలోపొదిగిన రత్నాల మొత్తము.) అందుకే క్రింది ప్రాచీన రచనలు ప్రమాణము.—

(1) "క్రొమ్మించు నిర్మించు కమ్మపంజుల తళ్కు-
లుదిరి చెక్కు-లతోడఁ జదురులాడ." (రా.వి. 3-125)

(2) "కలికి చెక్కు-లడాలు కమ్మపంజుల మేలు
తళుకుల కపరంజి బెళుకు గులుక" (,,-3-130)

(3) "వెలలేని నీరుకెంపుల కమ్మపంజు డాల్
తేటచెక్కు-లఁ బిల్లదీఁపులాడఁ." (పాంచా. పరి. 2-14)

(4) "చెలి యటు చూచి లేచి తన చేడియపై నొరగెం జలద్భుగం
చలములు గ్రమ్మి 'పంజు'ననుసానలఁదీర్చఁ, బదాఱువన్నెగం
టలమొలనూలు జాఱఁ." (రా.వి. 3-129)

ఈ పద్యమున 'పంజు', చూపులకు పదునుపెట్టు సానగా చెప్పబడినది.

'సాన'గా చెప్పబడిన 'పంజు' కమ్మలోపొదిగిన మణుల మొత్తమే ననుట నీ క్రిందిపద్యము స్పష్టముచేయుచున్నది.

"వెలఁదికి మణితాటంకము
లలరుఁ దిగ్విజయకొంక నతనుఁడు చూపు
న్మ్మలుకులు నిశాతములుగా
నలవడ వడిఁ దీడు శాణయంత్రము లనఁగఁ" (నరస. పుట. 333)

శ.ర. కర్త గమనింపలేదుగాని, ఆయనగా రుదాహరించిన 'స్వా. మను.' వచనములోను, 'కమ్మపంజుల = కమ్మలతాలూకు పంజులలోని - వజ్రంపు చకచకలు' అనియే అర్థము.

పంజు-గల కమ్మ 'పంజుకమ్మ'; అదే 'పంజులకమ్మ'యును.—

(1) "పంజులకమ్మ యనఁగ రత్నతాటంక మెసఁగు" (ఆం.భా.2-148)

(2) "చేర్చుక్కు- యమర్చి చెక్కు-లను జొక్కు-పు పంజుల కమ్మలుంచి"
(పాంచా. 2-7)

(3) "నునుపెక్కు- జిగిచెక్కు-లను మిక్కు-టపుఁ దెక్కు-
గ్రమ్మెడు పంజులకమ్మ లలర" (హంస. 2-4)

(4) "బంగరుఁదళ్కు-దెక్కు-లను బంజులకమ్మల డాలు చిందుద్రొ
క్కు-ంగ" (ఉ.రా. 3-81)

(5) "తమ్మికెంపుల పంజులకమ్మదోయి" (యయా. 4-90)

"పంజులకమ్మ - Large earrings worn by women" అని బ్రౌణ్యమునను, "పంజులకమ్మలు = రత్నములుచెక్కిన కమ్మలు" అని శ.ర.లోనుగూడా చెప్పబడియున్నది.

పంజులకమ్మను, ఊరక 'పంజు' అనుటయును కలదు.—

(a) "పంజు. A sort of earrings". (బ్రౌను)

(b) "పంజు = రత్నములు చెక్కిన తాటంకము". (ఆంధ్ర.పారి.)

కమ్మలో నుండు భాగములు మూడు.—

1. పంజు (రత్నాలు పొదిగిన భాగము). 2. గొట్టము. 3. చీల. కమ్మచీల; కమ్మగొట్టము - అనుమాట లెట్టివో 'కమ్మపంజు' అనుమాటయు నట్టిదే. అది, ష.తే. సమాసము.

(పంజు; దివిటీ)

'పంజు'కు 'దివిటి' యను నర్థముకూడా కలదు. దానిని చూచి, సూ.ని. 'కమ్మపంజు'కు "రత్నములు కూర్చుటచే దివిటీవలె వెలిఁగెడు కమ్మ" అని అర్థము చెప్పినది. పంజు (= దివిటి)వలె వెలిగెడి కమ్మ 'పంజుకమ్మ' కాక, 'కమ్మపంజు' ఎట్లయినదో సూ.ని. చెప్పలేదు.

అసలు, కమ్మతో దివిటీకి పొత్తు గలుపుట *పొరపాటు.

కమ్మలనుగూర్చిన ప్రస్తావనలో 'పంజు'కు దివిటీ యని యర్థము చెప్పుట - మజ్జిగన్నముతింటూ సైంధవము తెమ్మంటే గుఱ్ఱమును తోలుకొని వచ్చుటవంటి దగును.

కావున అట్లనుటకంటే, 'కమ్మపంజు'కు, కమ్మరూపమైన పంజు (= రత్నాలకట్టడము) అని విగ్రహముచేసి, రత్నతాటంకము అని యర్థము చెప్పుట యుచితమని నాకు తోచుచున్నది.

అప్పుడు, కమ్మపంజు = పంజులకమ్మ, అనుటయును సముచితమే యగును. అంతేగాని, కమ్మపంజు = పంజువలె వెలిఁగెడు కమ్మ, అనుట మాత్రము సరికాదు.

---

* ఈ పొరపాటుకు వేదం.వారి, 'సారంగధర' (3. ౧౪౪) లఘు టీక మూలము. (చూ. 'జితకాశి' పుట, ౪౫౭)

నూ.ని. 'పంజు' తత్త్వమును సరిగా విచారించ లేదు.

పంజుతత్త్వ మేమనగా:—'పంజు' అనుక్రియ యొకటి యున్నది. 'పంజుట' యనగా చెల్లాచెదరుగ పడియున్న గడ్డి, గాదము మొదలైన వానిని చక్కఁబరిచి, కొంచెముకొంచెముగా పోగుచేయుట. కిళ్లీములో ఎగ్గులచేత తొక్కిఁంచిన గడ్డిని, 'పంజి' పోగుచేయుదురు. ఒక్కమాటు 'పంజి' (=చక్కఁబరిచి) తీసిన కసవుమొత్తము ఒక 'పంజ' అనబడును. 'పంజ' - (మానము); పంజెఁడు - (పరిమాణార్థకము).

ఒక పంజ పచ్చిగడ్డి; ఒక పంజెడు ఎండుగడ్డి-ఇత్యాదిగా వ్యవహారము.

'పంజు' అనుక్రియయు; పంజ; పంజెడు; అను పదములును, గుంటూరు మండలములోని పల్లెలలో నేటికిని వాడుకలో నున్నవి. పంజి (=ఒకటిగా చేర్చి)న కసవుమొదలగునవి కట్టగా కట్టబడిన పిమ్మట 'పంజు' అనబడును.

కసవుకట్ట యగుచో—కసవుపంజు.

విడవలికట్ట (=గంట) యగుచో - విడవలిపంజు.

గుడ్డలకట్ట (=చుట్ట)యగుచో - గుడ్డపంజు. (ఇదే దివిటీ, కొగడా.)

రత్నములకట్ట (=కూర్పు)అగుచో-రత్నాలపంజు. (ఇదే కస్తుపంజు.)

N.B. రత నాలుపొదిగిన యే వస్తువైనను 'పంజు' అనబడును. ఉ॥ పాలకి పంజులు.

కాలక్రమమున 'పంజు' స్వతంత్రశబ్దమై కసవుకట్టకును; విడవలి గంటకును; గుడ్డలుచుట్టి చేయుబడు-దివిటీకిని; రతనములుకూర్చి కట్టబడు కమ్మకును; మణులుతాపిన పాలకీదండెకును; ప్రతినిధియై, ప్రాచీన కావ్య ప్రపంచమున విశృంఖలవిహారముచేసినది. తద్జ్ఞులు (వారే పండితులు) దానిని చూచినవెంటనే గుర్తించి ప్రకరణోచితమైన యర్థముతో గ్రహించెడివారు.

1. "నూరెల వెలుఁగు పంజులు శరీరస్థ
భూషామణిస్ఫూర్తిఁ బ్రోదిసేయ." (వే. పంచ. 4-345)

ఈ పద్యములోని పంజులు, దివిటీలు.—

2. "పంజుజాడల నేఁగు పదవి రోసినఁగల్గెఁ
బంజుజాడల నేఁగు పదవి యిచట." (రామా. 5-41)

ఇంగు, మొదటి పంజు - దివిటీ; రెండవ పంజు - విడువలి గంట.—

3. "వ్యగం, చలములు గ్రమ్మి 'పంజు' నునుసానలఁదీర."
(రా.వి. 3-129)

ఇక్కడ, పంజులు - కమ్మలోచెక్కిన రవ్వలు. (కమ్మపంజులు.)

4. "కడలియం దేకోదకమువేళఁ బుట్టిన
పవడంపుఁదీఁగల పంజుతోడ,
వేనవేల్ యోజనంబుల విరివినొప్ప
లక్షకోటిశతాకకాలం కృతంబు
తారకాస్తూలమూ కికస్తాపితంబు
విష్ణునకుఁబట్టె వెనకయ్య వెల్లగొడుగు." (కాశీ. 4-294)

ఇక్కడ, పంజు - అనగా పగడపుతీగెలతో (నవరత్నములతో)ను చేయబడిన నగిషీపని - యని యర్థము.

5. "పసిఁడితీఁగల కీలుపంజుల డాలు
పస్తనైన ముత్యాల పల్లకీ లేవి?" (గౌ. హరి. ఉ. 2232)

(కీలుపంజుల...పల్లకీలు, అని యీ రచనలో చిన్న శబ్దచిత్రము.)

ఇక్కడ పంజులు = రవ్వలుచెక్కిన పాలకీదండెలు.

'పంజు' ఇట్లు స్వతంత్రముగా - అనేకార్థముల నియ్యగల శబ్దమును గుర్తించి, మహానుభావుడు బ్రౌనుదొర, ఈ క్రింది విధముగా వివరించి, భాషారాధకుల కృతజ్ఞతకు పాత్రమైనాడు.

"పంజు-A torch, a sort of fire work. A sort of earring. పంజునేవ. The torch dance. Some times పాలకియొక్క పంజులు. the poles of a palankeen. (బ్రౌణ్యము.)

బహుజనపల్లివారు బ్రౌనుదొరగారి గ్రంథములోని పదములనన్నిటిని క్రొనలేరు. వే.వే. శాస్త్రిగారివలెనే నూ.ని. పండితులును బహుజనపల్లివారి వ్రాతలమీదనే ఆధారపడిరి. ఇక పంజుతత్త్వము తెలియు టెట్లు?

పంజుకమ్మ-వలెనే పంజుమంచమును కలదు.—

"మాటుగావైచిన మాంజిష్ఠతెర యెత్తి
పంజుమంచముడిగ్గి మంజుఘోష" (హర. 7-137)

పంజుమంచ మనగా రత్నాలుచెక్కిన మంచమని యర్థము.

పంజువాచూరులును గలవు.—

"రాజిల్లు నవపుష్యరాగరత్నముల
మొగడలు వైడూర్యముల మించు పంజు
పగడంపు వాచూరు." (నవనాథ. పు. 45) ముద్రితప్రతి.

'వైడూర్యములఁ = వైడూర్యములచేత, మించు = అతిశయించునట్టి, పంజు = చెక్కఁబడుపునగల, పగడపువాచూరు' (ఇంటిముంజూరు) అని యర్థము.

సూ.ని. 'పంజుకమ్మ-కమ్మపంజు' అనెగదా, అట్లే, పంజుమంచము = మంచము (పు) పంజు; పంజువాచూరు=వాచూరుపంజు, అనియుననునా?

రత్నములు పొదిగిన కమ్మలన్నియు 'పంజులకమ్మ'లే యనియు, ఆకృతిభేదమునుబట్టి, ఆటుకుల కమ్మలు; బలిదెకమ్మలు; తూర్పుకమ్మలు; దుగ్గుకమ్మలు; అని విపిధములనియు 'పంజు' పదము వానియం దెల్ల వర్తించుననియు సారాంశము.

బంగారుశేకుమీదనే ఆటుకులనుపోలు నొక్కులు మట్టునుకొట్టి నట్టనడుమ నొకరాయి (కెంపుగాని, పుష్యరాగముగాని) ఒగించి చేయుబడు కమ్మలు 'ఆటుకుల కమ్మలు'. (సూ.ని. యిటుగదు.) సూ.ని.లో తూర్పు కమ్మలును లేవు.

వస్తూకారముగా తయారుచేయుబడునది 'బలిదెకమ్మలు'. తామర దుద్దులవలె నిర్మింపబడు కమ్మలు, దుద్దుకమ్మలు. (సూ.ని. ఈ వస్తూకారమును చెప్పియుండవచ్చును. ఎందువల్లనో చెప్పలేదు.)

"కమలకర్ణికలు బంగారంపుదుగ్గుల
మురువుఁజూపఁగఁ గర్ణముల ఘటించి." (ఉద్భటా. 1-92)

'పంజు' అనుటచేతనే అది కనకపుపంపో, రత్నాలపంపో, ప్రకరణమునుబట్టి తెలియదగియున్నను - 'కనకపుపంజు' - 'వజ్రాలపంజు' - 'వైడూర్యాలపంజు' అని వ్యవహరించినను తప్పుకాదు.

1. "ఇల్లు గట్టెడుచోట జల్లులు కసవుపం
జులు సమానంబులు క్షోణిరమణ." (రా.వి. 3-40)

2. "తమ్మికెంపుల పంజుల కమ్మరోయి" (యయా. 4-90)

ఇట్లే తక్కినవియు నని గ్రహించునది.

ఈ విపులచర్చవలన తేలినదియేమనగా.— 'పంజులకమ్మ'కు — 'రత్నములు కూర్చుటచే దివిటీవలె వెలిఁగెడి కమ్మ' అని — యౌగికార్థమును చెప్పుట అనుచితమనియు.— 'రత్నాలకూర్పు (=కట్టడము)'నకు - 'పంజు' అని పేరు; అట్టి పంజుగలకమ్మలు - 'పంజు కమ్మలు' అని చెప్పుట యుచిత మనియును. —

('పంజుకమ్మ'లకు - 'కట్టడపుకమ్మ'లను వ్యవహారము లోకమున నున్నది. సూ.ని.లో లేదు).

52. ఖండించు

శ.ర. లో,— "ఖండించు = ఖండనముచేయు, నఱుకు" అనియు,— "ఖండితము = నఱుకఁబడినది" అనియు నున్నది.

సూ. ని. లో,-"ఖండించు = ఖండములుచేయు" అనియు, "ఖండి తము = ఖండింపబడినది. ౧. నఱుకఁబడినది. ౨. విఱువఁబడినది. 3. (యుక్తులచే) నిరాకరింపఁబడినది. (వాదము)" అనియు నున్నది.

మఱి, "కప్పిపుచ్చరాదు ఖండించియాడరాదు" (సారంగ. ఆ.౨౫౫) మొదలగు స్థలములలో,-'ఖండించి యాడరాదు = నఱికి, ఖండములుచేసి ఆడగూడదు' అనియేనా అర్థమా? కాగ.

ఖండించియాడరాదు-అనగా,- ఇది యిట్టిది యని నిష్కర్షగా చెప్ప వీలులేదు-అని అక్కడ అర్థము.

ఈ యర్థమును, శ.ర. ప్రభావశమున చెప్పకపోయెగాక. సూ.ని. చెప్పకపోవు లేలా? 'సాగంధర'ను గూడా సరిగా పరికింపలేదనియేగదా దానినల్ల వీర్పఁజనది?

సారంగధరను చూడకపోయిన పోయెఁగాక; బౌర్జ్యమునైనను చూచెనా? లేదు.

బౌరను,— "ఖండించుట- To decide, settle, determine.- ఖండింపు. Settlement, bargain.- ఖండింపుచేయుట.—To settle a bargain, to bargain, to appraise." అని వివరించియున్నాడు.

ఆటు బౌర్జ్యమునను, ఇటు వ్యవహారమునను, కావ్యములలోను ఉన్న, ఖండించు; ఖండింపు; అను పదములను-ఆర్థములను నూ.ని. చెప్పకుండుట పొరపాటు.

53. ఉల్ల

నూ.ని. "ఉల్ల = నాతిదూరము నాతిసమీపము కాని స్థలమందు" అని యర్థము చెప్పి, —

"ఉల్ల పదార్థకరము పొంతనుండి" (భా. ఆర. ౬-౧౫౬) అను ప్రయోగమును చూపినది.

ఉల్ల-అనగా, అదిగో ఆకసబడుచున్న-అని యర్థము. అంతదూరము కాని, అంతదగ్గరకాని స్థలమంచు-అన్న యర్థము రావలెనని ఆ 'ఉల్ల'కు అర్థము వ్రాసినవారి యుద్దేశము.

కాని వారువ్రాసిన వాక్యము, వారి యుద్దేశమునకు విరుద్ధమైన యర్థమునిచ్చునదిగా పరిణమించినది.

ఎట్లనగా: నాతిదూరము కానిదియు, నాతిసమీపము కానిదియునైన స్థలమందు-అని వారి వాక్యమున కర్థము.

నాతిదూరము (న + అతిదూరము) అనగా, అతిదూరము కానిది.

నాతిదూరము కానిది-అనగా, అతిదూరము కానిది కానిది.—అంటే, అతిదూరమైనది-అనియే యర్థము. (ద్వౌనఞౌ ప్రకృతమర్థం ద్రఢయతః.)

అట్లే, నాతిసమీపము కానిది-అను వాక్యమునకును, అతిసమీపమైనదనియే యర్థము.

కావున, అతిదూరము అతిసమీపమునైన స్థలమందు-అని వారి వాక్యమిచ్చే యర్థము.

ఆయర్థము పైపద్యమున సరిపడదు. అందలిభావమున కది విరుద్ధము. ఆది యట్లుండగా, ఒకవస్తువే, ఒక సమయమునసే అతిదూరమునను-అతిసమీపమునను ఉండుట అసంభవము.

ఎందుకింకను చర్చ? సూ.ని. వాక్యములో తప్పున్నది.—

ఉల్ల = నాతిదూరము నాతిసమీపము అయిన స్థలమందు - అనవలె; లేదా, అతిదూరము అతిసమీపము కాని స్థలమందు-అనవలె. అంతేగాని, 'నాతిదూరము నాతిసమీపము కాని స్థలమందు' అనగూడదు.

అసలు, 'ఉల్ల'ఆను తెనుగుమాట కర్థముచెప్పనప్పుడు-'నాతిదూరము నాతిసమీపము'-అని, అంత'గీర్వాణ' మెందుకు?

వావిళ్ళ నిఘంటువు,—"ఉల్ల = చాలదగ్గఱ చాలదూరముగాని స్థలమందు" అని లేటతెనుగుమాటలతో (సూ. ని. వాక్యములోని తప్పును తొలగించి) యెంతచక్కగా చెప్పినదో చూడండి.

54. తేసెతల

సూ.ని.—"తేసెతల = సస్యవిశేషము" అని యర్థముచెప్పి,—

"తేసెతలవడగండె ధాత్రీతలంబు
పొదలి దారుణ పోరకరు బుట్టెడయ్యె
సన్నివంకల దుర్భిక్ష మడగిపోయెఁ
బ్రస్తుతింపఁగదగు రామరాజ్యమందు." (జైమిని. ఓ.ఢ) అను పద్యము నిచ్చినది.

కాని, తేసెతల = సస్యవిశేష మని వ్యాఖ్యానమున లేదు; శ.ర. లోను లేదు. ఆ పదము లోకమున వాడుకలోను లేదు. సరిక్రొత్తపదము. ఆది సస్యవిశేషమని సూ. ని. యెట్లు తెలిసికొన్నది? ఎట్లో తెలిసికొన్నది; మంచిదే. మరి, అది మెట్టపైరో, పల్లపుపైరో; పురాణములలో చేరినదో, ఆపరాలలో చేరినదో తాను చెప్పవలదా? లోకానికి తెలియు టెట్లు?

ఒక క్రొత్తపదాని కర్థము వ్రాయునపుడు, ఆ యర్థమును స్పష్టపరచు మరియొక తెనుగుమాటనో, సంస్కృతపదమునో అక్కడ ఇయ్యవలె. అట్లీచ్చు ఆచారము సూ.ని. కి లేదా? ఉన్నదే!

"కొట్ట = సస్యవిశేషము. ప్రియంగువు"
"జొన్న = స.వి. యావనాళము"
"కంది = స.వి. తువరి."
"అలసందియ(దె)లు = (సం. అలసాంద్రకః) పెద్దబొబ్బరలు.—(అలచందలు. అని వ్యవహారము)"

అని వివరించియే యున్నది. ఆ విధముగానే, 'తేనెతల' యర్థమును తెలుపు మరియొక పదము నక్కడ చూపకపోవు టేల?

ఏలనగా : పద్యమున 'పండెఁ' అను క్రియ యుండుటను బట్టి, పండునది పైరుగదా, అని యూహచేసికొని, 'తేనెతల = సస్యవిశేషము' అన్నదేగాని, అదియేమి సస్యమో, ఏ దేశపు సస్యమో, యెట్టి సస్యమో సూ.ని. కిని - తెలియదు. నిజమింతే.

సరే; 'తేనెతల' సస్యవిశేషమే యగుగాక. అయితే రామరాజ్యమున ధాత్రీతలమంతయును-'తేనెతల' ఒక్కటే పండెనా? ఇతర సస్యములు పండనేలేదా? కవి యట్లే చెప్పియుండునా? అట్లుచెప్పుట సమంజసమగునా?

అది యట్లుండనిండు. పద్యములో, 'తేనెతల వడఁబండెఁ' అని గదా యున్నది? తేనెతల = 'సస్యవిశేష' మైతే, 'వడఁ' ఏమికావలె? వడఁ - పండెఁ - అనగా నర్థమేమి? అర్థ మేర్పడుటలేదని ఆ 'వడ'ను త్రోసివేయవచ్చునా?

ఎందుకింకను పెంపకము. 'తేనెతలవడఁ' అనునది జాతీయమైన నయ్యుండవలె. లేదా పాఠము మరియొక విధముగానైన నుండవలె. అంతే గాని, 'తేనెతల = సస్యవిశేషము' అనుటమాత్రము కుదురదు.

పదములను కైకొనుటలోను, అర్థములను చెప్పుటలోను, సూ.ని. ఇట్లు పొరపడిన తావులింకను - ఎన్నో యున్నవి. మచ్చుకు కొన్ని మాత్రమే చూపినాను.

తత్త్వ మిట్లుండగా, సూ.ని. పండితులలో నగ్రగణ్యులైన శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు,— "ప్రామాణికులగు పెక్కురు పండితు

లేకాభిప్రాయముగ నిర్ణయించిన పదపదార్థములనే పూర్వోత్తరవిరోధములు లేకుండ గ్రహించుట సూ.ని. పరిపాటి. నాటికి నేటికి నీ నిఘంటు నిర్మాణమున ఆసరణియే గ్రహింపఁబడుచున్నది'' అంటారు. మరియు వారు,- "సూ.ని.లో గ్రహింపఁబడిన పాఠములు పదపదార్థములు నవిరుద్ధములని పాఠకు లెఱుఁగుదురుగాక'' అనియు సెలవిచ్చియున్నారు.

సూ.ని. గ్రహించిన పాఠములలోని పూర్వోత్తర విరోధములను నేను నా పాఠపరామర్శలో తెలిపియే యున్నాను. అంతేకాదు పండితులచే పరామృష్టములైన పదపదార్థములు, పాఠములు సాధువులై యుండుటయు తదితరములు తద్విరుద్ధములై యుండుటయు పలుతావులలో ప్రస్ఫుట మొనరించియు నున్నాను.

శ్రీ సూర్యనారాయణశాస్త్రిగారి వాక్యములలోని సత్యాసత్యములను, నా పరామర్శలోని గుణాగుణములను, నిష్పాక్షికబుద్ధులును - భాషాసంప్రదాయాభిజ్ఞులును సగు పాఠకులు లోకమునకు తెలుపకపోరుగదా.

ఇప్పటికే గ్రంథము చాల పెరిగినది. ఇక, 'పొగరు' అను పదమును గూర్చి చెప్పవలసిన పరిశిష్ట మొక్కింత కలదు. అదిమాత్రము చెప్పి యీ ప్రకరణమును ముగింతును.

55. పొగరు

ఈ 'పొగరు'ను గురించి 111వ పుటలో కొంత చర్చించియున్నాను.

''అంబరశ్యామిక యంబుధి పొగరుగా
బ్రమసి యెక్కినొకాక బాడబాగ్ని'' (హరివంశము)

అన్న పద్యమున,- 'అంబుధి పొగరు' అనగా, సముద్రపు నీలకాంతి యని, యీ క్రింది మనుచరిత్రవచనమువలన నేర్పడుచున్నది.—

"అంతరంగంబున....పొంగి చింతాసాగరంబు...,వెల్లివోడిచెననం దుడిచిన నడంగక,...తారకల నీరికలెత్తు పొగ రన నిగనిగ లినుమడిగ నిగుడ ...తెప్పలం జిప్పిలుకొటుక లప్పళించి...దృక్కోణంబులం దిగువాయు కన్నీరు'' (3. వ. బ్రా.ప్ర.)

ఈ వచనమున కన్నీరు చింతాసాగరపు వెల్లువగను, *(తారకల) నిగనిగలు - ఆ సాగరపు పాగరు (నీలిమ)గను ఉత్ప్రేక్షింపబడినవి.

కొబట్టి, హరివంశపద్యమునను, 'అంబుధిపాగరు' అనగా,- 'సముద్రపు నీలిమ' యనియే అర్థము.

గరుత్మంతుఁడు,- ఆంబరశ్యామికను - అంబుధిపాగరుగా భ్రమించి (అనగా సముద్రజలమని భ్రమసి) యెక్కెన, బాడబాగ్ని యో - అన్నట్లున్నాడని, అక్కడ ఉత్ప్రేక్ష.

ఆకాశమును సముద్రముగా భ్రమించుట నీలవర్ణముచేతనే. ఆకాశమునకును, ఆ శ్లే అంబుధికిని నీలిమనుచెప్పుట కవిసమయము.--

"కృష్ణాని,-వి సాకాశ, మహీ పంక మ చాంభోధి యమునా
ఘూమ కోకిలాఃఁ" (కవికల్పలత)

పాగరు - అను పదానికి, భ్రాను,- "The shade or colour" అని యర్థము చెప్పి, యీ క్రింది ప్రయోగములు చూపియున్నాడు.—

(1) "కపురొందు, ఇంద్రనీలపు పాగరులాసంగు" (సత్య. 3-158)

---

* వావిళ్లవారి వ్యాఖ్యల్లో,— "తారకలక = నల్లగ్రుడ్లనుండి, ఈరికలు-ఎత్తు=మొలక లెత్తునట్టి, పాగరు=నల్లనయో (నల్లని వర్ణమేమో), అనక, నిగనిగలు=నిగనిగ కాంతులు, ఇనుమడిగనిగుడక" అని టీకయు,- "తెప్పల కాటుకను గలసి నల్లగ్రుడ్లకాంతులో యన నిగనిగలాడుచు... కన్నుల కొనలనుండి దిగువాఱు కన్నీరు" అని తాత్పర్యమును ఉన్నవి.

నల్లగ్రుడ్లకు నల్లని - నిగనిగలు సహజముగనే యుండును. కావున కాటుకను గలిసిన కన్నీళ్లను, 'నల్లగ్రుడ్లకాంతులో' యని ఊహచేయుట (ఉత్ప్రేక్షించుట) యుచితము కాదు.

తారకలక=నల్లగ్రుడ్లనుండి, ఈరికలెత్తు, పాగరు-అనక=సముద్రపు నీలకాంతియో - అన్నట్లు, నిగనిగలు = తారకల నీలకాంతులు, ఇనుమడిగనిగుడక,— అని అక్కడ అన్వయము.

సముద్రపు పాగరుగా, ఉత్ప్రేక్షింపబడినవి తారకల నిగనిగలే.

(2) "ఘనాఘనములో పొగరెక్కి కేవలాం, ధంకరణంబులై" (రామా. 6-23)

(3) "నీలంపుజడలకుఁ బీలిజల్లులుగావె
నిగుడు నిగ్గులలోని పొగరుదెగలు" (రామా. 2-76)

శ.ర. కర్త,— "పొగరు = 1. గర్వము; 2. ధైర్యము" అని అర్థములు చెప్పి, ధైర్యమునకు,—

"అగరుధూపపుఁబొగలో పొగరారు కురులుగా" (రామా. 6-103) అను ప్రయోగమును చూపినాడు.

కాని, 'పొగరారు'-అను పదానికి 'పొడుగైన' అని యర్థముకాదు. పొగరారు=నలుపారు (=నల్లని) అనియే యర్థము. పద్యమున, పొగలకును-కురులకును సామ్యము. ఆ సామ్యము ఆ రెంటికినిగల పొగరు (=నలుపు)ను బట్టిగాని, ధైర్యమునుబట్టికాదు.

శ.ర. కర్తయే - పొగరు=నలుపు, అన్న సంగతి తెలియలేదు. పద్యార్థమునుగూడా ఆయన సరిగా గమనింపలేదు.

ఇది అర్థపరామర్శ.

——:o:——

సాహిత్య సమీక్ష

— తెలుగు నిఘంటువులు —

శబ్దపరామర్శ

ఈ ప్రకరణమున సూ.ని. కెక్కని శబ్దములు కొన్ని చూపబడుచున్నవి.

౧. తూట్లకమ్మలు

ఇవతలినుండి ఆవతలికి రంధ్రముండు ఒకదినుసు కమ్మలు కలవు. వాటిని తూట్లకమ్మ లందురు. అవి గుంటూరుమండలమున ఇప్పటికి నున్నవి. దక్షిణదేశమునను కలవుగాని వాటి రంధ్రములు చాలా పెద్దవిగా నుండును. ఆ కమ్మలు పెట్టుకొను తెగను 'తొళ్ళ కొదులవాం' డ్లందురు.

తూట్లకమ్మలు కావ్యములలోను వర్ణితములై యున్నవి.—

1. "చిత్తజుఁ డను దొమ్మరి లాఁ
గొత్తి వడిం బూఁచనఁగ నిడిన కడానీ
బెత్తపు వలయములో యన
బిత్తరి తాటంకయుగము బెడఁగై తోఁచెన్"(చం.రా. 3-79)

2. "మగువ తాటంకయుగ్మంబు మన్మథునకు
లక్ష్యయుగ్మంబు గాఁబోలు లలిఁ దలంపఁ
గడఁగి సవ్యాపసవ్యమార్గణము లేయ
నైన రంధ్రంబుగాదె తదంతరంబు." (శృం.నై. 5-13)

2. దుద్దుకమ్మలు

"బలితంపు విచ్చుటాకుల దుద్దుగమ్మలు
నిద్దంపుఁ జెక్కులఁ నీడఁజూడ" (క్రీడా. పు. 32)

దుద్దుకమ్మలను 'దుద్దు' లనియు నందురు.—

"కమలకర్ణికలు బంగారపుముద్దల
మురువుఁజూపఁగఁ గర్ణముల ఘటించి" (ఉద్భటా. 1-92)

(నూ.ని. లో 'దుద్దు' మాత్రమే కలదు)

3. చేయార

మనసార; కడుపార; కన్నులార-అన్నట్లు, 'చేయార' అనుటయును కలదు.—

"ఈ యాపదలకు మూలం
బా యింద్రతనూజుఁ డతని నాహవభూమిం
జేయారఁ జంపి నామదిఁ
బాయని వగ పార్పుమన నృపాలుఁ డబలతో." (జై. 4-65)

చేయారఁజంపి-అనగా, నీ చేతితో బాగా చచ్చేట్లు కొట్టి-అని భావము. 'చేయార'కు బం.వ. రూపమే,— 'చేతులార'.

4. నాసికము

నూ.ని. లో 'నాసిక'యే కాని, 'నాసికము' లేదు. నాసికకు 'నాసికము' రూపాంతరము.

బా.వ్యా. లో, — "కంధరాదులు క్లీబతుల్యంబులు బహుళంబుగా నగు" (తత్స. 66) అన్న సూత్రముక్రింద,- "కంధరము-కంధర. కంధరా నాసికా భిక్షా దంష్ట్రా గ్రీవా పాదు కోల్కా- ప్రభృతులు కంధరాదులు" అని చెప్పబడియున్నది. అదియనుగాక, గౌ.హరి. (పుట. 137)లో,—

"సరస చంపకము మెచ్చని నాసికంబు"

అను ప్రయోగముకూడా ఉన్నది.

సూ.ని. కంధర; కంధరము - అను రెండు రూపములను చూపినది. 'నాసిక'ను మాత్రమే చూపి 'నాసికము'ను వదలినది. అందుకు కారణ మేమనగా :

శ.ర. లో "కంధర = మెడ (రూ. కంధరము)" అని యున్నది. కావున, సూ.ని. ఆ రెండు రూపములను చెప్పినది.

శ.ర. లో 'నాసిక'యే గాని 'నాసికము' లేదు. కావున తానును చెప్పలేదు.

౫. చెరవెట్టుకొను

1. "కేలఁ గ్రొమ్మించుటద్దంబు గీలుకొల్పి
'మంచి' తొడమీఁద నొప్పారె మదనరేఖ
ముద్దునెమ్మోము లావణ్యమున జయించి
కువలయాప్తునిఁ జెరవెట్టుకొన్నకరణి." (క్రీడా.)

చెరవెట్టుకొన్న కరణిఁ - అనగా తన యధీనమున నుంచుకొన్నట్లు - అని యర్థము.

2. "ఈయెడ నేనుఁ జెఱవెట్టుక
పోయెడి విభుఁ డిందులేమిఁ బురుహూతుం డ
న్యాయము నెన్నక మునులా
యనదను నన్నుఁ గావుఁడని మొఱయిడఁగఁ."
(దశా. చ. 4-56)

౬. ధర్మకాహళపట్టించు

"ఇత్తెఱంగున మాళవేంద్రు నింద్రుచెలిం జేసి తన చెలులు తదీయ తురంగరథంబులు రయంబునం బొదివితేరం గైకొని ధర్మకాహళపట్టించి - పదాతి పరుష వ్యాపారంబులు సాలించి విడిచి." (దశకు. 12-67)

ధర్మకాహళపట్టించుట - యనగా యుద్ధవిరామ సూచనగా - బాకా ఊదించుట. దీనినే 'ధర్మదారపట్టించుట' యనియు నందురు.

సూ.ని. 'ధర్మదారపట్టించు' అను క్రియను చెప్పక, ఆ క్రియతో గూడిన ప్రయోగముల నొక నాల్గింటిని 'ధర్మదార' క్రింద ఉదాహరించినది. అది పొరపాటు.

'ధర్మదారపట్టించు' అను క్రియ శబ్దపల్లవము. నిఘంటు వా క్రియ నట్లే చూపవలెను. లేనిచో ఆ క్రియాతత్త్వము తెలుగనివారు,-'ధర్మదారను బట్టించెను'; 'ధర్మదారఁ బట్టించెను' అని తప్పుగా వాడుదురు.

క్రియా ప్రయోగములను - విశేష్యములక్రింద చూపుట సరికాదు.

సూ.ని.లో 'దారపట్టించు' అను క్రియయును లేదు.

౭. తెరువుపెట్టు

తెరువుపెట్టు (శ.ప.క్రి.) = దారిచూపుచు ముందు నడచు.

(1) "మత్ప్రివాహావేగంబుసకుఁ దగ నీవు ముందటం దెరువుపెట్టకున్న నెటయేనియుం బోదు." (భోజ. 7-31)

(2) "ఆ ప్పశుపాలపుంగవుం డెక్క డెక్క డని యక్కొయి వచ్చినవారు తెరువువెట్ట నతిత్వరితంబుగ నరిగె"(హరి.పూ.7-29)

(3) "ఆవలనాక మాపయి మహర్జగ మావల్లకెక్కి వెండియుఁ బోవఁగ సత్యలోక మెటపోవలతేనియుఁ ద్రోవపెట్టెదఁ." (కకుత్. 2-53)

ఱ. అచ్చుపోయు

'అచ్చుపోయు' అను క్రియ కర్థమేమో సూ.ని.లో ఏర్పడదు.

'అచ్చు' క్రింద,-"ఱ. అచ్చునఁ బోసి తీసిన వస్తువు. ఉదా॥ బెల్లపు టచ్చు" అని వ్రాసి, దానిక్రింద,—

"(వ్యవ) అచ్చుపోసి విడిచిన యాఁబోతు."

అన్నది. మరి, 'అచ్చుపోసి విడిచిన యాఁబోతు' - 'అచ్చునఁ బోసితీసిన బెల్లపుటచ్చు' వంటిదే యగునా?

అచ్చుపోసి విడిచిన యాఁబోతు - అనగా, ఆఁబోతుగా అచ్చు (= ముద్ర) వేసి వదలిన వృషభము. అంతేగాని, అచ్చునఁబోసి తీసినది కాదు.

౯. అచ్చువేయు

ఈ క్రియయును సూ.ని. లో లేదు. ఆఁబోతులను అచ్చువేయుట లోకములో నున్నది.

బ్రౌను,-"అచ్చువేసుట to print. అచ్చువేసిన యెద్దు-a ('braminy') bull that is marked or stamped; it is allowed to wander at large as consecrated to the deity" అని చెప్పియున్నాడు.

౧౦. నెపమార్చు

నెపమార్చు = చంపు.

"ధనము హేరాళ మబ్బె నీతఁడు బళాయి
వీఁడు ప్రాణాన నరిగిన వెదకి వెదకి
మనల నెపమార్చుఁగా కేల మనఁగనిచ్చు
నితని వధియింత మని నిశ్చయింతు రపుడు." (కాశీ. 7-252)

౧౧. దంపతి

శ.ర. లోను, సూ.ని. లోనుకూడా "దంపతులు=(ద్వివచనాంతము) జాయాపతులు, ఆలుమగలు" అనియే యున్నది.

కాని ప్రౌఢకవుల రచనలలో 'దంపతి' అను ఏకవచనరూపము గూడా ప్రయుక్తమై యున్నది.

(1) "శంబరాంతక భుజాజయకీర్తి మహిమలు
కోకదంపతికి దృక్కూలశిఖలు" (కాశీ. 4-169)

(2) "ఆద్దంపతి ద్వాపరమున
మద్దులుగూల్చిన మహాత్వమహితుఁడ కలిలో
దిద్దగడ సల్పు నని జను
లద్దిరపడ వేంకటాద్రి యను సుతుఁ గనియెఁ."
(ములుగు పాపయారాధ్యుల, దేవీ.భా. 1-75)

౧౨. ఉపదర్శనము

"త్రిపురాంతకుఁ బిలిపింపక
యుపదర్శన మాచరించు టుచితమె హరికిన్." (కాశి. 7-58)

ఉపదర్శన మాచరించుట - అనగా, పెత్తనముచేయుట.

౧౩. నిలువుఁబతిమ

*"కని మదిఁ గలిగిన తీరున
నిను మగనిఁ బ్రాసికొన్న నిలువుఁ బతిమలఁ
గనుఁగొని" (యయా. 5-5)

నిలువుఁ బతిమ - నిలువుబడ్డము వంటి పదము.

౧౪. దిశ

"దిశలేని నాబోఁటి పశువులపాపంబు
లడఁచువానికి." (భాగ. 8-81)

దిశలేని = ప్రాపు(రక్షణము)లేని - అని యర్థము. సూ.ని. "దిశ = దిక్కు, కడ" అని మాత్రమే చెప్పినది. 'దిశ'కు ప్రాపు - అని యర్థము చెప్పి, ఈ యర్థము తెనుగునకే - అని వ్రాయవలెను.

౧౫. తపమువడు

"ఇడ్డ బొట్టువోలె నింటిలో నుండక
యాఁడదాన వంత యడలి పాస
నడవిలోనఁ దపమువడఁ బోదు నను నింత
జఱిభిలనము లెందుఁ గఱచి తీవు." (నన్నె.కు.సం. 6-16)

తపమువడఁ = తపస్సు చేయుటకు.—'తపమువడు' - శ.ప. క్రియ. అపురూపమైనది. నిఘంటువు తప్పక చెప్పవలసినది.

---

* "మనమునఁ గలిగిన తీరున" (శ.ర.పా. చూ. 'పతిమ')

౮౬. అండజంబుపాస్పు

అండజంబుపాస్పు = హంసతూలికాతల్పము.

(1) "చిగురులం దీర్చిన సెజ్జ యెంగుల కేఁగ
నీ యండజంబుపా స్పేలవచ్చె" (దశకు. 9-7)

(2) "సౌవర్ణ కీటజ పట్ట జాండజ శయ్యలను." (భా.సభా. 2-113)

౮౭. ఉల్లాభము

శ.ర.లో,— "ఉల్లాభము=సం.వి.అ.పుం. వితానము, మేలుకట్టు" అని యున్నది. సూ.ని.లో లేదు.

౮౮. ఆపేక్ష

ఆపేక్ష = అపేక్ష.—

"వానిఁ జూచు నా, పేక్ష మనంబునం గలిగె" (నానికే. 3-49)

'ఆపేక్ష' వ్యాకరణసమ్మతము కాకపోవుగాక. వాడుకలోనే కాక-ఒక ప్రామాణిక కావ్యములోను ఉన్నప్పుడు, నిఘంటు వా పదమును గ్రహింపవలదా?

'ఆక్షింతలు' అను పద మెట్టిదో 'ఆపేక్ష'యు నట్టిదే.—

'ఆక్షింతలు' శ.ర.లో నున్నది. - సూ.ని.లోను ఉన్నది.

'ఆపేక్ష' శ.ర.లో లేదు.-సూ.ని.లోను లేదు. కాని 'బ్రౌ'లో నున్నది.

౮౯. దునియు

దునియు = దున్ను.

సీ॥ "...అన్నరపతి దున్నంగ, నింద్రుండు సనుదెంచి యేల *యిచట,
దునియెద వనిన న మ్మనుజాధిపతి తనకోర్కి సెప్పిన."
(భా.శల్య. 2-215)

'దునియు' అపూర్వమయిన క్రియ. ప్రయోగించినవాడు - కవిబ్రహ్మ. సూ.ని. ఆ క్రియను వదలివేయవచ్చునా?

---

* వా.ని.లో, 'ఉల్లసమాడు' క్రింద, "యిచటఁ దునియెద వనిన" అని యున్నది. పొరపాటు కావచ్చును.

20. అవ్వలించు : అవ్వళికించు

దశకుమారచరిత్ర, 10-88 లో,—

"క్రొవ్వి భూమిని మొండితోఁ దనకోర్కి— తెల్పుడు సేయఁగా
నవ్వలించినఁ జూచి వాఁడును నంతరంగము లోపల—"

ఆనియు, 10-105 లో,—

"నేలపై, నిరుసవడ్లను బోసి యెండనెఱపి,
యొయ్యనొయ్యన క్రొసి యుముక నవ్వలికించి
కొని నేర్పు మై గర(?) కూరవిలిచి"

ఆనియు నున్నది.

సూ.ని. లో, అవ్వలించు, అవ్వలికించు—అను క్రియలు లేవు. (సూ.ని. లో చేరని పదములు దశ.చ. లో చాల ఉన్నవి.)

21. ఓడఁగట్టిన దూలము

ఇది, నిరంతర సంబంధము-అను నర్థము నిచ్చు జాతీయము. శ.ర. లో లేదు. అందువల్లనే సూ.ని.లోను లేదు.

పూర్వ కవు లెట్లు వాడియున్నారో చూడండి.—

(1) "ఓడఁగట్టిన దూలమై యుండవలయు
మీకు మాకును నెనరైన మిత్రభావ,ము" (ఉద్భటా. 2-211)

(2) "కరతలామలకంబు కైవల్యసంపద
యింటఁజేరిన పంట యీప్సితంబు,
ఓడఁగట్టిన దూల మీడులేని శుభంబు,
చేకొద్దికుంచ మశేషభూతి" (చంద్రా. 1-57)

(3) "ఈ లింగములోఁ బ్రాణము
కాలము గడదాఁక నోడఁగట్టిన దూలం
బై లంకె నుండఁజేసితి,
నేలా తుందుడుకు? పల్లె కేఁగుఁడు మీరల్" (కాశ. 8-80)

౨౨. గోలీ

గోరీ - అన్న యర్థమునఁ జే 'గోలీ' అను పదమున్ను ఉన్నది.

"ఘనభేరికాధ్వనుల్ విని గుండియలు ద్రిల
వ్రాలు మల్ల-లకు గోలీలుచేసె" (వసు. 1-47)

సూ.ని. ద్వి.సం. అనుబంధములో,— "గోరీ = తురకల సమాధి. (చి.ని., బ్రౌ.మిశ్ర.)" అని చెప్పి,— "ఘన...గోరీలు చేసె.— వసు. ౧-౪౭. (గోలీలు. ము.పా.)" అన్నది.

'గోలీలు' - అను పాఠము సరియైనదికాదని సూ.ని. భావించినట్లు ఆ సూచనవలన తెలియుచున్నదిగదా!

'గోలీలు' - అను పాఠము తప్పుకాదు; ఒప్పే. 'గోరీ'కి రూపాంతరమే 'గోలీ'. 'గోరీ'ని, గోలి - అను వాడుక హైదరాబాదుప్రాంతమున నున్నది.

సూ. ని. గమనించలేదుగాని, ఆ బ్రౌణ్యమునఁ జే — 'మిశ్రభాషా' భాగమునఁ జే,—

"గోలిదిబ్బ - A churchyard or burying ground. పాతచోటు" అని యున్నది.

కొబట్టి, సూ.ని., వసుచరిత్రలోని - 'గోలీలు' అను, ము.ప్ర.పా. తప్పనుకొనుటయు, 'గోలీ = తురకల సమాధి' అని చెప్పకపోవుటయు పొరపాటు.

౨౩. కల్లచ్చు

కల్లచ్చు-అనగా ఒరగల్లు.

బ్రౌణ్యములో ఇట్లున్నది:— "కల్లచ్చు. A touchstone or crucible.-*'యిచ్చుచో నెరిగి కల్లచ్చుల నూది, యచ్చుల నొరగొను యగసాలి యతడు.' B.D. 4-127."

కల్లచ్చు శ.ర. లో లేదు; సూ ని. లో ఎట్లుండును?

---

* "ఇచ్చుచో నెఱిఁగి కల్లచ్చుల నూఁకి, యచ్చుల నొరగొను నగసాలి యతఁడు" అని, శ్రీ ప్రభాకరశాస్త్రిగారిప్రతి పాఠము.

సమగ్రమైన నిఘంటువును సంతరింప సమకట్టువారు, ఆయా నిఘంటువులలోని, కావ్యములలోని ఒక కొన్ని పదములనుమాత్రమే పోగు చేసిన చాలదు. గ్రంథజాలమును గాలించి అన్ని పదములను అందుకొనవలె. అంగుకొనుటేకాదు, ప్రతిపదమును తాము స్వయముగా పరిశీలించి, పద స్వరూప స్వభావములను, సహజార్థ సంప్రదాయార్థ ప్రయోగవైవిధ్యాదులను తలస్పర్శముగా నవగతముచేసికొని, నిర్దుష్టముగా నిర్వచింపవలె. అంతేకాదు; దేశము నాలుగంచులును కలయదిరిగి (నిఘంటువులలో చేరని) పదములను, పదబంధములను, పలుకుబళ్లను, నానుడులను సేకరించవలె. దేశీయములైన ఆ నుడికారముల తీగుతిమ్యములను, వాటిని వాడుకచేయు జాడలను తెఱ్ఱులవలన చక్కగా తెల్సికొని, జిజ్ఞాసువునకు సుబోధమగు విధమున వివరింపవలె. అట్టిపనికి చాలిన ప్రకృష్టప్రజ్ఞల ప్రాజ్ఞులు భాషాధారైకదీక్షతో పరిశ్రమించినసేగాని, సమగ్రమైన నిఘంటువు రూపొందదు. అట్టి నిఘంటు వవతరించిన సేగాని భాషకుగల లోటు తీరదు.

సూర్యారాయనిఘంటువు-అట్టి బృహత్కృశమే. అందుకు సందేహము లేదు. కాని, అది యొక్కరిచేతిమీదుగా తయారయినది కాదు. బహుకర్తృకము. అందువల్ల పూర్వాపరవిరుద్ధసిద్ధాంతముల కొస్పదమయినది. నిఘంటువులనుండియు, కావ్యములనుండియు—పదములను, అనగములను, పాఠములను గ్రహించుటలో లోటుపాటులు వాటిల్లినవి; తాత్పర్యములు తటస్థించినవి. ఆయా విషయములను నా పాఠపరామర్శలోను, అనగపరామర్శలోను కొంతకుకొంత విశదముచేసి యున్నాను.

వ్రాణ్యాదినిఘంటువులలోని, భారతాదిగ్రంథములలోని పదములను పరికలించుటలోను పరిపూర్ణమయిన పరిశోధన జరగలేదనుటకు తార్కాణముగా ఒక కొన్నిశబ్దము లీ ప్రకరణమున చూపబడినవి.

ఇది శబ్దపరామర్శ

దీపాల పిచ్చయ్యశాస్త్రి కృత సాహిత్యసమీక్షలో
తెలుఁగు నిఘంటువులు - అను భాగము
సమాప్తము.

సాహిత్య సమీక్ష

— కావ్యములు ; వ్యాఖ్యానములు —

1. మేఘసందేశము

కాళిదాస మేఘసందేశమునకు, ఆంధ్రమల్లినాథులు శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు వ్రాసిన తెనుగువ్యాఖ్యాన ములో నాకుఁ గలిగిన కొన్ని సందేహములను నేను (1927) ప్రభవ-ఉగాదిసంచికలో ప్రకటించితిని. నా సందేహములకు, భారతి-భాద్రపద సంచికయందు శ్రీ బులుసు వెంకటరమణయ్య గారును, 1927 అక్టోబరు 30-వ తేది 'యుగంధర' పత్రిక యందు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేంకటాచార్యులవారును కొన్ని సమాధానములు వ్రాసిరి.

అందు, వెంకటరమణయ్యగారి యుపన్యాస మసమగ్ర మనియు, వారుపన్నిన యుక్తులు దుర్బలములనియు తెలుపుచు (శాస్త్రిగారి శిష్యులు) శ్రీమాన్ నేలటూరు రామదాసయ్యం గారు, (యం.ఏ., యల్.టి.) భారతి పుష్యసంచికలో, సుదీర్ఘ మైన ఒక యాక్షేపవ్యాసమును ప్రచురించినారు.

వారి యాక్షేపములకు, విభవ వైశాఖ భారతిలో నేను సమాధానములు చెప్పుటయు జరిగినది.

ఆ యాక్షేప సమాధానముల సారాంశ మిందు పొందు పఱుపఁబడుచున్నది.

౧. మేఘహంసమైత్రి

"కర్తుం యచ్చ ప్రభవతి మహీ ముచ్ఛిలీన్ధ్రాం మనస్వ్యాం
తచ్ఛ్రుత్వా తే శ్రవణసుభగం గర్జితం మానసోత్కాఃI
ఆకైలాసా ద్బిసకిసలయచ్ఛేదపాథేయవన్తఃI
సంపత్స్యన్తే నభసి భవతో రాజహంసా సహాయ్యాఃI" (పూ.మే. ౧౧)

ఈ శ్లోకములోని 'సహాయ్యాఃI' అను పదమునకు, శాస్త్రిగారు పద ప్రయోజనము నిట్లు వివరించినారు.—

"శ్రవణసుభగమ్ శ్రుత్వా సహాయ్యాఃI సంపత్స్యన్తే- అనఁగా లోకుల చెవులకు ఇంపయిన (నీయుఱుమును) విని నీకు సహవాసగాండ్రు అగుదురు - అనుటచేత ఉత్తములయిన యా మహానుభావులకు నీ లోకోపకారశీలతచేత నీయందు స్నేహము కలుగుననియు, వారికి అతిప్రియమైన మానససరస్సు ఇటుపై తమకు నివాసయోగ్యమని నీవు ఊహించి సూచింతువుగాన, వారికిని నీవు ఉపకారివి; ఆ కృతజ్ఞతచే వారికి నీయందు స్నేహము కలుగుననియు 'హంసరాజులు మానసమునకు పోవుదురు; వారితోఁగూడి నీవు పొమ్ము' అనక 'రాజహంసాఃI సహాయ్యాఃI సంపత్స్యన్తే' అనుటచేత పూర్వోక్తమయిన కృతజ్ఞతచేతను స్నేహముచేతను వారే నీ సాంగత్యమునుకోరి నీతో వత్తురు. నీవు ప్రార్థించవలసినదిలేదనియు.....భావము."—

నా ప్రశ్న

పదప్రయోజనము చెప్పుటలో శాస్త్రిగారు మేఘహంసలకు మైత్రి అతిమాత్రముగా ప్రతిపాదించినారు. సముజ్జసమగునాI మొద లా రెంటికిని మైత్రిసెప్పుటయే యొప్పగు. అందువల్ల నే, మల్లినాథుఁడు, *'సహాయ్యాఃI= సయాత్రాఃI' (తోడి బాటసారులు) అని యర్థము చెప్పి, 'సహాయ స్తు

---

* 'సహాయ్యాఃI' అను పదమునందు 'సయాత్రాఃI' అని నిఘంటు ప్రదర్శనపూర్వకముగా కష్టించి వ్యాఖ్యానము చేసిన మల్లినాథసూరి, స్నేహాభాస వచ్చునేమో యని భయముతో విరోధమునే స్థాపించినాఁడు. (న.చ. వేంకటాచార్యులుగారు.)

సయాత్రః స్యాత్' ఇతి శబ్దార్ణవే.— అని, నిఘంటుప్రమాణమునుగూడ చూపినాఁడు.

ఆ సయాత్రతను సమర్థించుటకే, ఇతర వ్యాఖ్యాతలు,— 'విరుద్ధానామపి సహాయతో క్తిః' అని ముందుగా వ్రాసియు,— 'హంసానాం పరుషం మేఘగర్జిత మితి ప్రసిద్ధమ్' అని యొప్పుకొనియు, నవల నెంతెంతో వ్రాయవలసివచ్చినది.

కవు లెల్లరును హంసమేఘములకు విరోధమునే చెప్పినారు.

ఉదాహరణములు.—

(1) అయ్యలరాజు రామభద్రకవి

"స్థిరమైత్రిఁ దనవారిలోఁ గలయికఁ క్షీరంబు లుండం బర
స్వరభేదం బొనరించు నంచుఁ గలహంసశ్రేణులం జండభీ
కరఘోషంబున ధిక్కరించి కడుఁగిన్కఁ బోలె వగ్గోపలో
త్కరపాతంబున బిట్టు పాఱనమచఁ గాలాభ్రసందర్భముల్.
(రామాభ్యుదయము ఆ. 6-9)

(2) సూచిమంచి తిమ్మకవి

"పరమహంసలఁ బోవఁదనుమని ఘనుఁడు నె
వ్వగ భంగ మొందని వాహినీశుఁడు" (రుక్మిణీపరిణయము)

అని, భీష్ముకుని వర్ణించుచో పరమహంసఘనశబ్దములకు శ్లేష కల్పించి హంసలకును మేఘమునకును గల విరోధమును వెల్లడించినాఁడు.

(3) సంకుసాల నృసింహకవి

కవికర్ణరసాయనములో,—"అపూర్వనిర్వహిత్రహంస ఘనాఘన" (ఆ. 5) అని తన గురువును సంబోధించియు,—

"నిర్భరగతిఁ గరకాసం
దర్భంబులు రాలె నంత ధరపై జలదా
విర్భావమగ్నహంసీ
గర్భస్రవ దండపిండఖండము లనఁగఁ" (ఆ. 6)

అని, వడగండ్లను వర్ణించియు హంసాభ్రములకుఁగల ప్రబలవిరోధమును ప్రస్ఫుట మొనరించినాఁడు.

(4) శ్రీకృష్ణదేవరాయలు

"ఊఱుముచిని యలకకైదివె
వెఱఁబఱచు మరాళపటలి విడిచినఁబడు న
క్కఱఁచిన బిసలవవిసరము
తెఱఁగున వడగండ్లు ధవళదీధితి రాలెన్." (ఆముక్త. ఆ. 4)

బిసకిసలయచ్ఛేద పాథేయవంతమై కైలాసమునకు బయలుదేరిన హంసలను, వానిని వెంబడించుచున్న మేఘమును - మేఘసందేశములోని వానిన్-మనసున నుంచుకొని రాయలు రచన చేసినట్లున్నది.

మరాళపటలి యూఱుముచిని యలకకైపఱచుట,- వెఱపు = భయము చేతఁగాని, మైత్రిచేతఁగాదని చెప్పుటయే కాక, ఆకవిరాయలు, "అరిహంస సంసదభ్రాగమంబు"అని యీశ్వరదేవరాయల శౌర్యోత్కర్షను వర్ణించియు హంసమేఘవిరోధమును విశదముచేసినాఁడు.

(5) మహాకవి భోజుఁడు

"రామాకర్ణనభగ్నకార్ముకభవాధ్వానేన గోదోరుధా
దృప్తక్షత్రియశస్సితచ్ఛదకులే జీమూతనాదాయితమ్."
(రామాయణచంపువు)

అను, ఈశ్లోకమున జీమూతనాదము సితచ్ఛదకులమునకు ఆపత్కరమని విశదముచేసినాఁడు.

ఇట్లు మేఘసందేశవ్యాఖ్యానములలోను, సంస్కృతాంధ్రకావ్యముల లోను, హంసమేఘములకు ఆరాతిత్వము నిరూపితమైయుండఁగా, హంస మేఘవిరోధము నించుకయు సూచింపక, ఆంధ్రమల్లినాథులు,-"మేఘుఁడా! వారికి నీవు ఉపకారివి. వారే నీ సాంగత్యముకోరి నీతో వత్తురు. నీవు వారిని ప్రార్థింపవలసినది లేదు" అని, అంతగా విశేషించివ్రాయుట యుచిత మగునా? అని నాప్రశ్న.

అయ్యంగారి యూహాక్షేపములు

(1) "హంసలు కావ్యలోకమునసే కాని లోకమున లేవు; అవి భాతులవంటివి. (2) అంచ, ఉఱుమున కులుకదు; జలదమునకు జడియదు; హంస, మేఘుమునకు జడిసి కాదు, పరుగెత్తుట. విక్రమోర్వశీయములో,— జలదావృతములయిన దిక్కులను గని మానసమునకు బయలువెడలెడు హంసలను జూచి, పురూరవుడు,—"మానసోత్సుకములైన యీ పక్షులు సరస్సునుండి ఎగిరిపోకమునుపే వీనిచలన ప్రియావృత్తాంతమును తెలిసికొన వలయు-ననుచు, 'క. నా కొమ్మనిమ్మ హంసము, క్కొంటి తదీయమైన కాంతగతంబున్.' అని యడిగెను. ఆతడడుగుచుండగనే ఆదివరకే పోవనుంచుచున్న ఆ హంస మెగిరిపోయినది. అప్పుడు పురూరవుడు,- 'ఇది, దొంగలను దండించువాడు రాజు అని భయముచేత ఎగిరిపోయినది' అనెను. పురూరవుడు, (హంస) తన దండనకు భయపడిపోయి నసేగాని మేఘుగర్జకు బెదరిపోయె ననలేదు. కాన హంస మేఘుగర్జకు జడియదు."

నా సమాధానములు

(1) హంసలు లోకమున నున్న నేమి? లేకున్న నేమి? ఉన్నట్లు కవులు భావించిరి. కాళిదాసు మేఘునిచేతఁబోలె, మఱియొక మహాకవి హంసచేత సందేశమునుగూడ పంపెఁగదా! అవి లోకమున నున్నను, లేకున్నను కవులు వర్ణించుసెడల వానికిని ప్రమోదములకును సైయ్యము చెప్పిరా - వేరమి చెప్పిరా - అన్నది మనకు ప్రకృతము. అవి భాతుల వంటివో, కోతులవంటివో పరిశీలించి నిర్ణయించుట కిదియేమి జంతు శాస్త్రమాఁ? కాదుగనుక - ఆ ప్రసంగ మప్రస్తుతము. (2) పురూరవుడు, ఉన్మత్తుడు. కావునసే, తన భార్యనడకను హంసదొంగిలించిన దనియు, ఆది తన దండనకు భయపడిపోయినదనియు అన్నాడు. ఉన్మత్తప్రలాపములను ప్రమాణముగాఁ గొనుటయు, ఒక తెఱఁగు ఉన్మాదమే యగును.

ఆ క్షేపము

"హంసమేఘువైర మందరు ఆయూ కవి యుత్ప్రేక్షితమ కాని, ప్రకృతసిద్ధమేనియు, దాటరాని కవిసమయసిద్ధమేనియు కాదు. ఆ రెంటికిని

మైత్రినిగూడఁ జెప్పవచ్చును. ఇది కవిసమయమే యైనచో సాహిత్యదర్పణమున నేల లేదు?"

సమాధానము

హంసమేఘములకు వైరమున్నందుననే కవులుత్ప్రేక్షించుట కవకాశము కలిగినది. లేనిచో ఉత్ప్రేక్షించు టెట్లు? ఇది ఉత్ప్రేక్షాతత్త్వమెఱుఁగని వ్రాత.

కవిసమయములన్నియు నే గ్రంథమునను సంపూర్ణముగా చెప్పఁబడలేదు. వానిని, సాకల్యముగా తెలిసికొనుటకు బహుకావ్యావలోడనమే సాధనము. సమయములు చెప్పుచోట కొన్ని గ్రంథములలో,—కవిలోకప్రసిద్ధము-కమలార్క-మైత్రియే చెప్పఁబడలేదు. తావన్మాత్రమున 'కమలార్క-లకు విరోధమునుగూడ చెప్పవచ్చు'-ననవచ్చునా? అయ్యంగారి వంటివా రెవరైన నన్నను చెల్లునా?

ఆక్షేపము

"హంసమేఘవైర నిర్ణాయకముగా, ఉదాహరింపఁబడిన,—

"నిర్భరగతిఁ గరకాసం
దర్భంబులు రాలె నంత ధరపై జలదా
విర్భవమగ్న హంసీ
గర్భస్రవదండపిండఖండము లనఁగన్."

అను పద్యములోని 'అనఁగన్' అను ఉత్ప్రేక్షావాచకము హంసమేఘవిరోధము లేమిని తెలుపుచున్నది."

సమాధానము

పద్యములోని 'అనఁగన్' అను ఉత్ప్రేక్షావాచకము, అండపిండఖండములకు సంబంధించినదిగాని, హంసమేఘవిరోధమునకు సంబంధించినది కాదు. అది, కరకలు, నిజముగా అండపిండఖండములు కావని తెలుపునే గాని, హంస మేఘ తద్విరోధాదికము లబద్ధములని తెలుపనే తెలుపదు. అలంకారస్వభావము, పద్యార్థముకూడ అయ్యంగారికి ఆకళింపు కాలేదు.

ఆక్షేపము

''కాళిదాసునకు హంసమేఘద్వేషమున తాత్పర్యము లేదు.''

సమాధానము

లేనియెడల,– 'కతిపయదినస్థాయిహంసా దశార్ణాఁ' అన్నచోట, ''కతిపయదిన – కొలఁది దినములే యుండుట మేఘమువలని ఉపద్రవము చేతను'' అనియు,– ''హంసలు పలాయనమగుట వర్షాకాలస్వభావ''మనియు పదప్రయోజనము తెలిపియున్నారే, శాస్త్రిగారు – (చూ. పు. 52, 53) అది యెట్లు సంగతపడును?

గురువులు ''హంసకు మేఘ ముపద్రవకారి'' యనుచుండఁగా, శిష్యులు 'కాదు; కాదు. ఉపకారి' యనుట తగునా?

ఆక్షేపము

''ఆషాఢమునఁ బొడము మేఘము తొలిమేఘము. నవజలధరము. కాళిదాసు, 'నవజలధరఃసన్నద్ధఃఁ' అని, 'నవ' మని విశేషించి రూఢిచేసినాఁడు. తొలిమేఘము (నవజలధరము) గావున హంసల కుపకారి'' అని అయ్యంగారి దొకయుక్తి.

సమాధానము

''మేఘము హంసకపకారి కానేకాదు.– ఆ రెంటికిని విరోధము లేనే లేదు'' అనుచువచ్చిన అయ్యంగారు, ఒకమెట్టు దిగి, ''మలిమేఘమే గాని, తొలిమేఘము హంసకపకారికా''దన్నారు. అనక యేమిచేయుదురు? వారు పన్నిన యుక్తియును నిరర్థకమే. తొలిమేఘముగూడ హంసలకు భయావహమే.—

(1) ''సలిలంపు వృద్ధ జలధర
ములు వూనిన యూఁతకోల మొత్తముల క్రియఁ
దొలువానకొళ్ళు లెసఁగెఁ
గలహంస కులంబులెల్లఁ గలఁగంబడఁగఁ'' (పాం.మా.)

తొలువానకొళ్ళను చూచి, కలహంసకులములు కలఁగఁబడినవఁట! తొలిమేఘ ముపకారి యగుచో కలహంసలు కలఁగఁబడనేల?

(2) "రాయంచల గుండెబెదరు,
చాయాగామంత్రము వియు క్తహానచ్యుతి, క
ళ్యాయత మయూరకర్ణర
సాయన, *మనఁ బ్రథమజలధరారవ మెఱఁగెఁ."
(హరి. పూ. ఉ. ఆ)

ప్రథమజలధర మన తొలిమేఘమేగగా! దాని యూరవము అంచల గుండె బెదరు కానేల?

(3) "నవజలధరరవభయనకిత కలహంసకుల కోలాహలకోమలో... భూషణనినాదఃి" (కాదంబరి)

'నవ'జలధరముకూడ హంసకులమునకు భయకారియేయనుటకు—ఈ భట్టబాణునివాక్యము చాలదా?

ఆక్షేపము

"వాల్మీకి, రామాయణమున, ఊరక 'సంప్రస్థితా మానసవాసలుబ్ధాఃి' అన్నాఁడేకాని రాయంచలకును, మేఘమునకును వైరమును చెప్పలేదు; అట్లే శ్రీనాథుఁడును, శృంగార నైషధమున-'శిఖికాధరస్థులగు పురుషులు...దమయంతి మనోవికారం బెఱింగి ప్రావృష్యేణ్యపయోవాహంబులు రాజహంసావలిం బల్వలాంతరంబులవలనం బాపి మానససరోవరంబునుం బోలె...ఆయ్యంగన భుజంగపుంగవుఁ గదియం గొనివచ్చిరి' అన్న పట్టున మేఘహంసవిరోధమును చెప్పలేదు. కాబట్టి ఆ రెంటికిని వైరమును చెప్పియేతీరవలె ననుట సరికాదు."

సమాధానము

వాల్మీకియు, శ్రీనాథుఁడును మేఘమరాళములకు విరోధమును చెప్పలేదు; సరే. మైత్రిని చెప్పిరాఁ లేదే. ప్రతి కవియు హంసమేఘ విద్వేషమును చెప్పియేతీరవలె నన్న నియమము లేదుగాని, చెప్పుచో, విద్వేషము నేగాని చెలిమిని చెప్పరాదన్న నియమముమాత్రము కలదు.

అయ్యంగారు, "ఆ రెంటికి మైత్రినిగూడ చెప్పవచ్చు" ననిరిగదా; అందుకు ప్రమాణముగా ఒక శాస్త్రవచనముగాని, ఒక కవిరచనముగాని

* 'మయి' అని యుండవచ్చును.

చూపఁగలిగిరా? లేదే! మఱి, నిరాధారపు ప్రసంగములతో పుటలు నెఱుచుట యెందుకు?

కాళిదాసునకు పూర్వులు-నవ్యులునైన కవులు హంసమేఘవిరోధము నెట్లెట్లు విస్పష్టపఱిచియున్నారో చూడుఁడు.—

(1) "ఆలోకితం గృహశిఖండిభి రుత్కలాపై
ర్హంసై ర్వియాసుభి రపాకృత మున్మనస్కైఃా,
ఆకాలికం సపది దుర్దిన మంతరిక్ష
ముత్కంఠితస్య హృదయంచ సమం రుణద్ధి."

మేఘాచ్ఛాదితమైన యా కాశమును నెమళ్లు పురులువిప్పి యాడుచు సంతోషముతో నవలోకించిన వనియు, హంసలు 'అయ్యో! ఉండరాములు వచ్చిన'వని దిగులుపడి చూచినవనియు ఈ శ్లోకమున చెప్పఁబడినది.

(2) "ఏత త్తద్ధృతరాష్ట్రవక్త్రసదృశం మేఘాంధకారం నభో
హృష్టో గర్జతి చాతిదర్పితబలో దుర్యోధనోవా శిఖీ,
అక్షుభ్యాతజితో యుధిష్ఠిర ఇవాఽధ్వానంగతఃకోకిలో
హంసాఃా సంప్రతి పాండవా ఇవ వనా దజ్ఞాతచర్యాంగతాఃా."

మేఘోదయమునకు సంతసించి నెమలి దుర్యోధనునివలె గర్వించిన దఁట! హంసలు పాండవులవలె అజ్ఞాతవాసము పోయినవఁట!

(3) "ఏ హ్యేహీతి శిఖండినాం పటుతరం కేకాభి రాక్రందితఃా
ప్రోడ్డీయేన బలాకయా సరభసం సోత్కంఠ మాలింగితఃా;
హంసై రుజ్ఝితపంకజై రతితరాం సోద్వేగముద్వీక్షితఃా
కుర్వ న్నంజనమేచకా ఇవ దిశో మేఘ స్సముత్తిష్ఠతి."

నెమళ్లు, 'రావయ్యా మేఘుఁడా! రా!' అని కేకలు వేసినవనియు, హంసలు, 'వీఁ డెక్కడ దాపరించెనా' యని మేఘునివంక కొందలపాటున వీక్షించినవనియు, ఈ శ్లోకమున వర్ణన.

ఈశ్లోకములు మూఁడును కాళిదాసునకు పూర్వుఁడైన శూద్రక మహాకవి రచించిన మృచ్ఛకటికా నాటకములోనివి. మూఁడింటియందును మేఘు వంసలకు విరోధమే చెప్పఁబడినది.

(4) ఘటకర్పరుఁడనుకవి,—"హంసా నదన్మేఘభయాత్ ద్రవంతి" (హంసలు మేఘగర్జకు జడిసి పరుగెత్తుచున్నవి) అని వర్ణించినాఁడు.

(5) "తతో ఘనావిర్భవనా ద్భియేవ
త త్రామలం మానస మస్య భేజే;
కర్ణాంతరక్రాంచపథేన శోభా
యశోమరాళో యదుకన్యకాయాఃఁ." (భాగవతచంపువు)

హంస, మేఘోదయమునకు భయపడి మానసమును చేరినట్లు, సుభద్రయొక్క (సౌందర్య) కీర్తి, శ్రీకృష్ణుని మానసమును చేరినదని వర్ణన. "తతఃఅనంతరం ఘనానాం మేఘానాం...ఆవిర్భవనా దుదయాత్ - భీయా భయే నేవే త్యుత్ప్రేక్షా.—వర్షాకాలే హంసా విహాయ భారతం వర్షం మానసం ప్రవిశంతీతి ప్రసిద్ధిః" వ్యాఖ్య.)

(6) "పృథ్వీతాపం సపది శమయ న్నేవకీదక్షిణస్యాఃఁ
ప్రాదుర్భూత స్సపది మురజి న్నీలమేఘో నిశీథే;
హర్షోత్కర్షం విబుధశిఖినాం వర్ధయ న్నాసురశ్రీ
హంసశ్రేణ్యాఃకిల కలయితుం దూరదేశప్రవాసమ్."

(చంపూభాగవతమ్ 1-29)

శ్రీకృష్ణుఁడను మేఘ ముదయించుటవలన విబుధశిఖులకు హర్షోత్కర్షమును, ఆసురశ్రీహంసశ్రేణికి దూరదేశప్రవాసమును కలిగినవఁట. వూర్వోక్తకవిసమయమే యిందు పాటింపఁబడినది.

మఱియొక మహాకవి, ఉఱుమునకు హంస భయపడుట నిట్లు చమత్కరించినాఁడు:

(7) "దయితోసి తత స్తతఃపృథివ్యా
మయి జీమూత! జనస్య జీవనేన;
విషయా దపి గచ్ఛతఃకి మేతా-
ధ్వనిభి ర్భీషయసీహ రాజహంసాన్."

అయ్యా, మేఘుఁడా, జీవనదానముచేత జగత్తునకు మేలుచేయు సత్పురుషుఁడవుగదా నీవు, ఆ హంసలు తమదేశమునకు పాఱిపోవుచున్నను వెనుకచేరి ఉఱిమి యేల భయపెట్టెదవయ్యా?- అని శ్లోకతాత్పర్యము. ఇందును మేఘహంసలకు విరోధమే చెప్పఁబడినది.

మేఘహంస నిగూఢ మెంత ప్రసిద్ధ మో, యీ క్రింది వేదాంతదేశికుల రచన చదివినవారికి వేఱుగా చెప్పనక్కఱలేదు.

(8) "లక్ష్మీనిద్యు ల్లలితవపుషం తత్ర కారుణ్యపూర్ణం
మా శ్లేషీ స్వం మరకతశిలా మేనకం వీక్ష్య మేఘమ్;
శుద్ధ్యై నిత్యం పరిచితపద స్వాదృశై ర్దేవహంసై
ర్హంసీభూత స్సఖిలు భవతా మన్వహా యాగ్రజన్మా"
—హంససందేశము.

హంసరాజా, వైకుంఠమున లక్ష్మీయను మెఱపుతీగతో కూడియుండు శ్రీమన్నారాయణుఁడను మేఘమును చూచి భయపడెదవేమో! అట్లు భయపడ నక్కఱలేదు. ఆతఁడు, భవాదృశులైన దేవహంసలచే నిత్యసేవితుఁడై, పరమహంసీభూతుఁడైనవాఁడు. అంగువలన మీ కులమునకు పెద్ద. నీ వాతనికడకు నిర్భయముగా పోవచ్చును—అని శ్లోకభావము.

మహాకవి, శ్లేషయమకచక్రవర్తి, వేంకటాధ్వరి యేమన్నాఁడో విన్నారా?

(9) "చిత్రం చిత్రం జృంభితే కృష్ణమేఘ
కాలం ప్రాప్తా ప్రాపయోపం సమృద్ధిం
ఆసే ద్యుక్తం హా నిదాఘప్రశాంతిం
హంసో హింసాం చూనయే కీర్తియుక్తా." (విశ్వగుణాదర్శము)

వ్యాఖ్యా:—హంసః పక్షీ; అసురశ్చ. హింసాం చూనయే ప్రాప్తవానితియుక్తం. వార్షి కావసరస్య హంసహింసాకరణత్వం ప్రసిద్ధమ్.

'వర్షాకాలము (మేఘము) హంసలను హింసించునది' యట! హంస మేఘములకు వైర మనుట కింతకంటెను బలవత్తరసాక్ష్య మేమికావలెను?

హంసమేఘద్వేషమును తెలుపు తెలుఁగురచనల నింతకుముందే కొన్ని చూపియున్నాను. ఇంకను కొన్ని, —

(1) "కంధరా, లోకనహృష్టభీతశిఖిలోకమరాళము
సోన దోచినఁ" (హంస. 5-54)

(2) "నిగతంబు రాజహంసలఁ
బరువెత్తఁగఁజేయు నౌర! పటుచటులభవ
త్ఖడ్గ కగవాల కరాళ
స్ఫురితాంభోదము నృసింహభూపాలమణీ."
(కావ్యాలంకార సంగ్రహము)

ఈ పద్యము ప్రతాపరుద్రీయమున శిష్టకేవలపరంపరితరూపకాలంకారోదాహరణమునకై రచింపఁబడిన,—

"ప్రతాపరుద్రదేవస్య - మండలాగ్రవిధుంతుదః
ఆగుండ నిక్రమోద్దామో - గ్రసతే రాజమండలమ్."

అను శ్లోకమునకు బదులుగా రచింపఁబడినది. శ్లోకమున విధుంతుదరాజమండలములు చెప్పఁబడఁగా, పద్యమున-తత్స్థానమున - 'అంభోదరాజహంసలు' చెప్పఁబడినవి. విధువిధుంతుదుల కెట్టిచెలిమియో రాజహంసాంభోదములకును అట్టి చెలిమియే - నన్న సంగతి యీ యాలంకారికరచనవలన నిస్సంశయముగా నేర్పడుటలేదా?

(3) "తన ధాటి కారట్పటహగర్జ కరాతి
పారివాహాళి హంసపటలి గాఁగ." (బహులాశ్వ. పీఠిక. 49)

(4) "మగఁడింతి నిగువపిండుం
గొగ లేర్పడి చిల్లులాడ దివి కెప్పరముల్
నెగసిపడు వారిధారల
నగుచెంచె నమేఘవృష్టి యంచలు నెదరన్." (కవిత్. 2-86)

వర్షము (మేఘము) అంచల కెంత భీత్యావహమో, హంసమేఘు వైర మెంత ప్రసిద్ధమో యీ రచన తెలుపుటలేదా?

ఆయ్యంగారు తిక్కనభారతమునెనను చదివియున్నచో, "మరాళమేఘములకు మైత్రిని చెప్పవచ్చు" ననియు, "ఆ రెంటికిని విరోధము చెప్పుట కవి సమయము కా" దనియు వ్రాసియుండరు.

ఈ క్రింది పద్యము, ద్రోణార్జునుల యుద్ధవర్ణన ఘట్టములోనిది.

(5) "గుహశరములు సితపక్ష
స్ఫురణంబున నంచపిండుపాలుపు వహించెఁ
గుబ్బొణతతి ఘనావళి
కరణి మిగులనొప్పె నల్లగఱుల చెలువునఁ." (విరాట. 5-139)

కవిబ్రహ్మ తిక్కన గురుశరములను ఆంధ్రీకరింపుగను, నగుశరములను ఘనావలిగను వర్ణించుటలో భావ మేమి? నగుశరములు గురుశరములను నిర్మించునవి - యనియే కదా! మఱి ఆ భావ మేర్పడుటకు ఆధారము, మేఘము హంసను హింసించునది యన్న ప్రసిద్ధకవిసమయముగాక వే ఱేమున్నది?

ఇంత యెందుకో? అంబ, జలదము (వర్ణము)నకు జడియునది - యన్న అగ్ని దాని నేపులోనే యున్నది.

తెనుగున, హంసకు,—తొలకరి గలగు గువ్వ; వానజాలిపులుఁగు; తొలకరి సూఁకు-అని పేరులు. (డా. లక్ష్మీనారాయణీయము)

కాబట్టి మేఘుఁడు హంసలకు విరోధిగాని మిత్రుఁడు కాఁడు. మయూరమేఘములకు మైత్రిని, మరాళమేఘములకు శత్రవమును చెప్ప వలయు నన్నది దాటరాని కవిసమయము. కావున ఆ రెంటికిని చెలికారము చెప్పుటయు, పైపెచ్చు మేఘుఁడు హంసల కుపకారి యనుటయు, కవి సమయమునకును, 'సహాయ్యా' అన్న కాళిదాసవచనకును విరుద్ధము.

ఆది యట్లుండఁగా శాస్త్రిగారు వ్రాసిన పదప్రయోజనములో పూర్వోత్తరవిప్రతిపత్తియు నున్నది.

ఆది యెట్లనఁగా: వారు ౧౧ వ శ్లోకముక్రింద,—"మేఘుఁడా, హంసరాజులు నీ సాంగత్యముకోరి నీతో వత్తురు." అన్నారు. అనఁగా నర్థమేమి? మేఘుఁడు ముందుపోవు ననియు, హంస లాతనివెనుక పోవు ననియును గదా!

మరల వారే, ౨౪ వ శ్లో. క్రింద,-"హంసలు, మేఘుఁడు ఎక్కడికి వచ్చిన అక్కడినుండి ఉత్తరముగా పోవుచుండు" ననియు, ౬౧ వ శ్లో. క్రింద,—"మేఘుఁడా, హంసలతోఁ గూడనే పోవుచున్నచో, క్రౌంచ రంధ్రము నీకును తెలియు" ననియు వ్రాసినారు.

ఒకచోట - మేఘుఁడు ముందుపోవు ననియు, మఱియొకచోట - హంసలే ముందుపోవు ననియు వ్యాఖ్యానించుట యెట్లు ప్రతిపన్నమగును?

పలుపలుకు లేల? శాస్త్రిగారు హంసమేఘములకు పాఠును చెప్పుట పొరపాటు. ఆ పొరపాటును నిరాధారపు వ్రాతలతోను, కుయుక్తులతోను సమర్థింప బెనగులాడుట తప్పు.

ఎ. ప్రక్షిప్తములు

"తస్యాందేశం జలధరమగో దివ్యవాచా చచక్షే
ప్రాణాంస్తస్యా జనపితరవో రక్షితుం యత్న వధ్వాః,
ప్రాపో్యదన్తం ప్రముదితమనాః సాపి తస్మా స్వభర్తుః
నోపాం న స్యా దభిమతఫలా ప్రార్థనా హ్యుత్తమానామ్."

—ఉ. మే. 56.

"శ్రుత్వా వార్తాం జలదకథితాం తాం ధనేశోఽపి సద్యఃశాపస్యాన్తం సదయహృదయఃసన్నిధా యాస్తకోపఃసంయోజ్యైతే విగళితభుజా దంపతీ మృష్టచిత్తేభోగా నిష్టా నభిమతసుఖాక్ ప్రాపయామాస భూయః."

—ఉ. మే. 57.

మేఘసందేశకావ్యాంతమున గనుపట్టుమన్న ఈ రెండుశ్లోకములను కథాశరీరమునఁ గ్రొత్తగా మొలచిన యెక్కువ అవయవములవలె నిష్ప్రయోజకము లగుటయే కాక సౌందర్యభంగకరములు నగుచున్నవి. ఆవిషయ మింకఁ విపులముగా విమర్శింతము.

సందేశకావ్యమునఁ గల ఇతివృత్తమేమి? ప్రోషితుఁడగు నొక యక్షుఁడు, భార్యావియోగదుఃఖమున మతిచెదరి, చేతనాచేతన జ్ఞానము లేక, అవుగామల విచారింపక, ప్రియురాలికిఁ దన కుశలవార్త తెలుప వలసినదని మేఘునిఁ బ్రార్థించుట. ఇట్టిప్రార్థన మొకవింతగాదు. ఏమన, విరహావ్యాకులతచే నున్మత్తులయినవారు ప్రపంచమును మఱచి, తమకుఁ గనఁబడు ప్రతివస్తువుతోడను మొఱవెట్టుకొనుటయు, సాయము చేయుమని కోరుటయు, వానితో సంభాషింపదొరఁకొనుటయు, వాని తూష్ణీంభావమును తమకనుకూలముగా సమర్థించుకొని తృప్తినందుటయు, కావ్యప్రపంచమున ఆచారముగా వచ్చుచున్నదే. చూడుఁడు: శ్రీమద్రామాయణమున శ్రీరామునంతటి మహాపురుషుఁడు తన ప్రియురాలింగానక కానలవెదకుచు-

ఆశోక,శోకాపనుద, శోకోపహతచేతసమ్
త్వన్నామానం కురు క్షిప్రం ప్రియాసందర్శనేన మామ్.

శార్దూల, యది సా దృష్టా ప్రియా సంద్రనిభాననా,
మైథిలీ మమవిస్రుం కథయస్వ నతే భయమ్. (షష్టితమస్సర్గం.)

ఇత్యాదిగా శాస్త్రాలాదిమృగములనే కాక అశోకాదివృక్షములనుగూడ తన ప్రియురాలిని గూర్చి పలువిధములుగా ప్రశ్నించుచు వెఱ్ఱివానివలె వనమెల్లఁ గ్రుమ్మరెను. ఇట్లే భారతమున నలునిం గూర్చి దమయంతియు, భాగవతమున కృష్ణునింగూర్చి గోపికలును చెట్లుచేమలను ప్రశ్నించిరి. మా ప్రియులను జూపుఁడని మఱియు మఱియుఁ బ్రార్థించిరి.

అట్లే యక్షుఁడును వలపు తలకెక్కి, లోకైకజీవనభూతుఁడై అచేతన మగు మేఘమును సందేశహరణార్థము గూర్చించెను. యక్షుని లోకైకజీవన శూన్యతఁ గూఁతగాఁగొని కాళిదాసమహాకవి (పూర్వమేఘమున) చిత్రసీమ మొదలు కైలాసపర్యంతమునుగల మనోహరప్రకృతిని భావనాదృష్టులచేత నాకర్షించి, కవితాశిల్పమున మఱింత రసపుష్టి యగుఁగాఁ గీర్చి మన కన్నుల యెదుట నిలుపఁగలిగెను. (ఉత్తరమేఘమున) విరహవిహ్వలహృదయమును ద్రవింపఁజేయు కరుణరసమును వెల్లికొలుపుటకును యక్షుని యవివేకతయే యీధారసము. యక్షుని యవివేకము పాఱకము చెడకుండఁ గాచుచుఁ మేఘుని యచేతనత పరమసాధకము. మేఘుఁడు వాస్తవముగా సచేతనుఁడగు నన్నంతవఱకే యక్షుని దూత్యాదమును - కాళిదాసుకావ్యమునకు గౌరవ మును-అనునది యిందలి రహస్యము.

కావ్యనిర్మాణమునకుఁ గథాపురుషుల విరుఁగోన్మాదతాచేతనతలే ప్రేరకములును, ముఖ్యాధారములును. కల్పనాశిల్పమున నా రెండు విషయములును పరస్పరసంబంధముగల మూలసూత్రములు. ఆ సూత్రములలోఁ నేది పుటిపిచ్చిసను, కావ్యము చిగురు వెట్టి, పగలువాఱి చిన్నఁ చిన్న మగును. కావ్యమూలసూత్రముల కేపాటి విచ్ఛిత్తియుఁ గలుగ కుండ కథాగ్రథనమును నడిపించుకొనవలసినది కవికిఁ దప్పనిసిధి. కాళిదాసు తనవిధి చక్కఁగా నేఱవేర్చుకొనెనాఁ?

దయితా జీవితాలంబనార్థియైన యక్షుఁడు, మేఘముచే సందేశము నంప సమకట్టినట్లు కావ్యప్రారంభ మొనర్చి, చేతనసాధ్యమగునని అచేతన

మైన మేఘముచేఁ జేయింపఁదలఁచినాఁ డేమి యక్షుఁడు? అను నాక్షేపమునకు—

"ధూమజ్యోతిస్సలిలమరుతాం సన్నిపాతః క్వ మేఘః
సందేశార్థాః క్వ పటుకరణైః ప్రాణిభిః ప్రాపణీయాః;
ఇత్యౌత్సుక్యాదపరిగణయన్ గుహ్యకస్తం యయాచే
కామార్తాహి ప్రకృతికృపణాశ్చేతనాచేతనేషు." (పూ. మే. 5.)

(పొగ, అగ్ని, నీరు, గాలి యనువాని కలయికయైన మబ్బెక్కడ? సమర్థములయిన యింద్రియములు గల ప్రాణులచేఁ బంపఁదగిన సందేశార్థము లెక్కడ? అను విషయమును ఉత్సుకుఁడు గావున యక్షుఁడు విచారింపక (సందేశహరణార్థము) మేఘుని యాచించెను. కామాంధులగు వారి కిది చేతనము, ఇది యచేతనము అను వివేకముండదు గదా?)

అని సాగఁజేసిన అర్థాంతరన్యాసముతో సముచిత సమాధానమును జెప్పినాఁడు. ఆక్షేపమును సమాధానమును లోకసమ్మతములై కావ్య నిర్మాణమునకు ఆత్యావశ్యకములై, కవితాశిల్పమునకు వన్నె వెట్టుచున్నవి. ఈ ఆక్షేపసమాధానముల భావమేమి? విరహపీడితుఁడైన యక్షుఁడు లోకజ్ఞానము లేక తనగోడును దాను వెళ్లఁబోసికొను నేకాని, మేఘునివలనఁ దా నేపాటి ప్రయోజనమును బడయఁజాలఁడు. అనగా సందేశకృత్యము జరుగ దనియేకదా? కావ్యప్రారంభ మిరీతి నుండఁగా, మేఘునికి అచేతనత ప్రకృతిసిద్ధమై యుండఁగా గవికులగురువు, కాళిదాసు కథా సంవిధానమునకును ప్రకృతికిని విరుద్ధముగా,—

"ఆ మేఘశ్రేష్ఠుఁడు యక్షసందేశమును ఆయక్షవధువుయొక్క ప్రాణములను రక్షించుటకై, జనహితమైన ధ్వనికలవాఁడై (దేవరూపమును దాల్చి) దివ్యవాక్కులతో ఆమెకుఁ జెప్పెను. ఆమెయు ఆవార్తవలన సంతోషించిన మనస్కులలై యుండెను. అట్లేకదా! గొప్పవారిని ప్రార్థించినయెడల నెవరికోరికలు సఫలములు కాకుండును!" అని కావ్యమును ఏల ముగింపునకుఁ దెచ్చును?

ఆకాలపు ప్రభావమునకో, యక్షుని యదృష్టమువలననో మబ్బు మాటాడనేర్చి సందేశము నందించియే యుండు ననుకొందము. ఇప్పు

జేమయినది? "జలధరవరః చచక్షే" అను వాక్యమువలన మేఘునికిఁ బ్రాణము వచ్చినది. మూలసూత్రములలో నొకటి విచ్ఛిన్నమైనది. వెంటనే యక్షున కున్మాదము కదలినది. రెండవసూత్రము తునియలైనది. కల్పనా కౌశలము కళంకితమయినది. కథాసౌందర్యము మందగించినది. స్వవచన వ్యాఘాతదోషము కావ్యకర్త కంటుకొన్నది. చక్కఁగా భాషింపఁ జేర్చిన మేఘుని నచేతనమనియు, ప్రాణియు - సర్వకార్యనిర్వహణ దక్షుఁడునగు మేఘుని యాచించిన యక్షుని ఉన్మాదియనియు చేసికొనుట నీకు న్యాయమగునటయ్యా? అని కాళిదాసుహాసకవిని ప్రశ్నించుట కవికౌశము డొరకినది. ఇంత యసందర్భముగా కావ్య పరిసమాప్తి గావింప నా కవీంద్రుని కేమి యక్కఱ అగలిగెనో? మేఘుఁడు సందేశమునందించె ననుకున్న —

"కేషాం నస్యా దనేనతథాలా ప్రార్థనా హ్యసంభావనామ."

అను తన యుక్తాంతరన్యాసమున కిక నవకాశము దొరకదని కాఁబోలు! పోనిండు 'సందేశం చచక్షే" అను వాక్యమునే నమ్మి మబ్బు మాటాడ జేర్చిన ప్రాణియే యనుకొందము. అట్లయిన యక్షుఁడు నోరునొచ్చునట్లు తన్ను స్తోత్రము చేయునపుడుగాని, చిత్తము చెమ్మగిల్లునట్లు ప్రియురాలి వియోగదురవస్థను విన్నవించునపుడుగాని మఱియొక సందర్భమునఁగాని మాఱుపలుకక మూగమొద్దువలె నూరకుండునా? ఊఁ కొట్టనయిన నూఁకొట్టఁడా? ఎదుటివాఁడు గంటలకొలఁది ప్రసంగించుచుండ హరీ - యనక, అచ్యుతా - యనక బెల్లముగొట్టిన రాయివలె నుండుట ప్రాణిధర్మమా? ప్రకృతిధర్మమా? పాపము! తా నెంత మొత్తుకొన్నను మబ్బు మాఱు పలుకమిని యక్షుఁ డిట్లు సమర్థించికొని తృప్తిపడుచున్నాఁడు.

"కచ్చి త్సౌమ్య, వ్యవసితమిదం బంధుకృత్యం త్వయా మే
ప్రత్యాదేశా న్నఖలు భవతో ధీరతాం కల్పయామి;
నిశ్శబ్దోపి ప్రదిశసి జలం యాచిత శ్చాతకేభ్యః
ప్రత్యుక్తంహి ప్రణయిషుసతామీప్సితార్థక్రియైవ." (ఉ. మే. 56)

(ఓయీ సాధూ! నాకొఱ కీ బంధుకార్యమును నీవంగీకరించితివని తలంచెదను. నీవు బదులుమాట చెప్పకుండుట అనంగీకార సూచకము

కాదు. మఱియేమనకి ఆది నీస్వభావము. బదులుమాటచెప్పుట నీగాంభీర్యమునకు లోపము. (ఉఱుమకయే) వాగ్దానములు పలుకకయే నీవు నిన్ను యాచించు చాతకములకు జలము నిచ్చుచున్నావు. నా విషయమునను అట్లే చేసెదవు. ఏలయనిన సత్పురుషులు యాచకుల కార్యమును చేయుదురుగాని చేసెదమని పలుకరు.) అని.

మేఘుని ప్రతినుణమును తన కనుకూలముగ సిద్ధాంతము చేసికొని సంతోషించుట వానికిఁ దప్పనివిధి. ఆ విధియే కావ్యప్రథవకారణమును, మన కానందదాయకమును గదా!

కావ్యప్రారంభమునుండి తుదివఱకును, అనఁగా బూర్వమేఘమున నఱువదియేడు శ్లోకములలోను, ఉత్తరమేఘమున నేబదియైదవ శ్లోకము వఱకును మేఘు మచేతనమనుచు వచ్చిన మహాకవి, యేబదియాఱవ శ్లోకమున "జలధరవరఃచనచ్ఛే" అనుట పొంది పొసఁగియున్నదా? ఇప్పట్టున పాఠకులకు సందేహము జనింపకుండు నట్లు వ్యాఖ్యాత లేమయిన విశేషించి వ్రాసిరా? తిలకింపుఁడు:—

సంస్కృతవ్యాఖ్యాత, "జలధరవరఃచచచ్ఛే ఉక్తవాన్" అని మాత్రము వ్రాసి "నచశోంకానచోత్తర" మన్నట్లు మిన్నకేగెను. మల్లినాథ పాదులవారివ్రాతయు నిట్లుండునా? ఇక ఆంధ్రవ్యాఖ్యాతలగు శ్రీశాస్త్రుల వారు తమ పదప్రయోజనమున 'జలధరవరఃవరుఁడు కావునసే ఉపకారము చేసినాఁడు—అనగా సందేశము చెప్పినాఁడు. అని వ్రాసి సందేహమునకే మఱింత చోటొసంగిరి.

ఇది యిట్లుండ, 'మొదలులేదు శ్రీరామా' యన్నట్లు "చచచ్ఛే" అనుటయే అసంభవమును, అసందర్భమునునై యుండఁగా మీఁదుమిక్కిలి "దివ్యవాచా" (దేవవాక్కులతో) నట మేఘుఁడు సందేశమును చెప్పుట! ఇందులకు సంస్కృతవ్యాఖ్యాత:—

"కామరూపం మఘోనఁ" ఇతి పూర్వంయచ్ఛే ణ్ణిచ్యుక్తత్వాత్ తదానీం మేఘఃదేవాకారీ భూత్వా తాదృగ్వాచా యక్షసందేశం యక్ష మధ్వా ఉవాచేత్యర్థఃఁ—(మేఘుఁడు కామరూపుఁడని యక్షునిచే నిరివఱకే పలుకఁబడియున్నందున, అప్పుడు మేఘుఁడు దేవాకారమును దాల్చి, దివ్యవాక్కులతో సందేశమును చెప్పెను.) అని వ్రాసెను.

ఇచ్చో వ్యాఖ్యాతృసమర్థనము మిక్కిలి యద్భుతమును కొలుపు చున్నది. కాళిదాసుయు, విరహోన్మాదియు నగు యక్షుఁడు తన యవ సరమునుబట్టి మేఘుని గొప్పచేసి పొగడుటలో నన్న 'కామరూప' మ్మన్న పలుకా తన సమర్థనమున కాధారము? శ్రీ శాస్త్రులవారో - 'దివ్యవాచా' వట్టి యుఱుములచేనన్న ప్రాయము తెలియదుగావున దివ్యవాక్కున చెప్పెను- అని వ్రాసిరి. ఎటులైనను యక్షుఁడంపిన సందేశమును మేఘుఁడు చెప్పియే తీరవలయునని శ్రీ శాస్త్రులవారును తలఁచిరి!

ఆల కాపురమున కరిగియో, అరుగకయో, తాను 'వరుఁడు' కావుననో మఱియొక కారణముననో మేఘుఁడు సందేశమును చెప్పినను చెప్పియుండ వచ్చునుగాక; పనిలేని పనిగా దేవాకారమును దాల్చుట యెందుకు? యక్షుఁ డైనను మొదట స్తోత్రసమయమున మాటవెంబడి మాటగా 'కామరూపమ్' అనెనేగాని నీవు దేవతవై - దేవవాక్కులతో నా రమణికడ భాషింపు మనెనా? లేదే. యక్షుఁడున్మత్తుఁడయ్యును మేఘుఁడు దేవత యగునని తలఁపలేదు. కావునసే, సందేశప్రారంభమున,—

"కలభతనుతాం గత్వా క్రీడాశైలే నిషణ్ణ స్సన్ విద్యు దున్మేష దృష్టిమ్ అంతర్భవనపతితామ్ కస్య మర్త్యా సే" (ఉ. మే. 20) (ఏనుఁగుపిల్లంత చిన్న యీ కారమును దాల్చి క్రీడాశైలమునఁ గూర్చున్న వాఁడవై నీ మెఱపు చూపును ఆ యింటిలోనికి నిగిడింపుము) అనియు,—

"తస్మిన్ కాలే సా లబ్ధనిద్రాసుఖా స్యాత్ యది స్తనితవిముఖస్సన్ యామమాత్రం సహస్వ" (ఉ. మే. 36) (నీవు పోయి చూచుసమయమున నామె నిద్రాసుఖ మనుభవించుచుండెనేని ఉఱుమక నిశ్శబ్దుఁడవై జాము నేపుమాత్రము కనిపెట్టుకొని యుండుము) అనియు,—

"తా ముత్థాప్య విద్యుద్గర్భస్సన్ స్తనితవచనైః వక్తుం ప్రక్రమేథాః" (ఉ. మే. 37)— 'విద్యుద్గర్భ ఆన్తర్లీనవిద్యుత్క ఇత్యర్థః. దృష్టి ప్రతి ఘాతేన వక్తుర్ముఖావలోకన ప్రతిబన్ధకత్వాన్న విద్యోతితవ్య మితి భావః. స్తనితవచనైః - స్తనితాన్యేవ వచనాని, తైర్వక్తుం ప్రక్రమేథాః - ఉపక్రమస్వ' (వ్యాఖ్య)— (ఆమెను మేలుకొలిపి, మెఱసినయెడల దృష్టి ప్రతిహతమై మూటలాడువారి ముఖము కనఁబడకపోవునుగాన నీ మెఱపును

నీలో నణఁచికొని నీ యుఱుములు అను మాటలచేత సంభాషింప మొదలు పెట్టుము) అనియు చెప్పినాఁడు.

ఇట్లు యక్షుఁడు డెప్పుడు చెప్పినను మేఘుని మేఘరూపమున నే సందేశకార్యము నెరవేర్పు మనెనుగాని, దేవాకారముదాల్చి దేవ వాక్కులతో భాషింపుమని కోరలేదు. యక్షుఁడు కోరినదానిని పూన రించుటకే సమర్థుఁడు కానట్టి (భూమ జ్యోతి స్సలిల మరుతాం సన్నిపాతః) మేఘుఁడు, యక్షుఁడు కోరకున్నను దేవాకారమును ధరించి, తత్కార్యమును నెరవేర్చె ననుటకంటె వింతకలదా!

దేవాకారమును దాల్చిన 'పెద్దమనిషి' మేఘుఁడు సందేశమును యక్షురమణికి నెమ్మదిగా వచింపక, నడికిరేయివేళ ఊరివారి కందఱికిని వినవచ్చునట్లు పెద్దగా అఱచి చెప్పినట! ఆ యఱపును విని (గాఢనిద్రలో నున్న) కుబేరుఁడు సైతము మేల్కొని సందేశమును వినెనట; కుబేరుఁడు మేఘుఁడు చెప్పిన వార్తను విని జాలిపడి తత్క్షణమే శాపావసానము ననుగ్రహించెనట! అట్లా దంపతులను దుఃఖముతీర్చి సంతుష్టులనుజేసి మఱలఁ గూర్చి కుబేరుఁడు కొంకీతభోగములను మునుపటివలెనే వారికిఁ గలుగఁ జేసెనట! అట్లు వారతని కరుణచే మఱల క్షేమమును బొందిరట! (ఇది 'శ్రుత్వావార్తామ్' అను శ్లోకమునకు శాస్త్రిగారు వ్రాసిన తాత్పర్యము.)

ఇందుపై వాయు 'సంయోజ్య-ప్రాపయామాస' అని ణిజంతప్రయో గముచేత కుబేరుఁడు కరుణించి తానే ప్రయత్నపూర్వకముగా వారిని గూర్చి సంతుష్టులంజేసి యిష్టభోగముల నొసఁగెనని యు, 'భోగా నిష్టా నభీమతసుఖాన్ ప్రాపయామాసభూయః' అనుట కావ్యంతమందు మిగుల మంగళశ్రుతిగా నున్నదని యు, ఇందువలనఁ గవి వ్యాఖ్యా ప్రధ్యాపయితృ పఠిత్రాదుల కెల్ల మంగళ ముద్దేశింపఁబడినదని యు లిఖించి, ఆ శ్లోకమున కొక పెద్ద గౌరవమును, ప్రాముఖ్యమును నొసంగిరి. కాని ఆ శ్లోకము మూలమునను, దాని పైశ్లోకమగు 'తత్సందేశ'ము మూలమునను కాళిదాస మహాకవి కవితాశిల్పము కళంకిత మగుటయు, పాఠకులకు సందేహములు పొడముటయు, ఇట్టి విమర్శనము వ్రాయవలయుటయుఁ దటస్థించినది.

ఇంతకును ఈ కావ్యమున మేఘుఁడు కామరూపి కావలసిన యవసరముగాని, వ్యాఖ్యాత లాతనిని కామరూపిం గావింపవలసిన యవసరముగాని, సందేశమును చెప్పవలసిన యవసరముగాని, చెప్పింపవలసిన యవసరముగాని - బొత్తిగా లేదు. అలోకసామాన్య ప్రతిభాశాలియు, లోకజ్ఞుఁడును నగు కాళిదాసమహాకవి స్వవచనవ్యాఘాతదోషభూయిష్ఠముగా కావ్యమును ముగింపను లేదు. ఏఁబదియైదవ శ్లోకమున,— 'మాభూ దేవం క్షణ మపిచ తే విద్యుతా విప్రయోగః' అను నాల్గవ చరణముతోనే ప్రౌఢముగా, కావ్యమును శుభాంతముగాఁ బరిసమాప్తి కావించినాఁడు.

కాళిదాసకవితామర్మవేది యగు మల్లినాథసూరియు, "ఏవం మద్వత్, క్షణ మపి స్వల్పకాల మపి, తే తవ, విద్యుతా కళత్రేణేతి శేషః, విప్రయోగః విరహః, మాభూత్ మాస్తు. 'అస్తే కావ్యస్య నిత్యత్వాత్తుర్యా దాశిష ముత్తమామ్. సర్వత్ర వ్యాప్తయే విద్యా న్నాయకేచ్ఛాను రూపిణీమ్.' ఇతి సారస్వతాలంకారే దర్శనా త్కావ్యాన్తే నాయకేచ్ఛాను రూపోఽయ మాశీర్వాదః ప్రయుక్త ఇత్యనుసంధేయమ్." అని తన వ్యాఖ్యానమును ముగించినాఁడు.

ఇచ్చట శ్రీ శాస్త్రులవారును "మంగళార్థము కావ్యాంతమందు ఆశీర్వాదము" అని వ్రాసిరి. ఇట్లు నిర్దిష్టముగను, సర్వలక్షణసంపన్నము గను కావ్యము ముగియుచుండఁగా, పూర్వోత్తరసందర్భ విప్రతిపన్నములగు నా శ్లోకముల కీక నవకాశ మెక్కడిది? అవి కాళిదాసకవికృతములు గావనుటకు జంకఁ బనిలేదు. మఱియు, తద్వ్యాఖ్యయు మల్లినాథకృతము కాదు. అగుచో 'మాభూదేవ'మునఁ గావ్యపరిసమాప్తి నూచించు టెట్లు? ఈ శ్లోకముల నా జోలి యెత్తకుండు టెట్లు? వేయేల : ఆ రెండు శ్లోకములును నిస్సంశయముగాఁ బ్రక్షిప్తములే. రెంటిలో నొకటియగు 'శ్రుత్వావార్తాం' ప్రక్షిప్తమనియు దానికి మల్లినాథసూరి వ్యాఖ్యానము లేనేలేదనియుఁ దెల్పి నందర్ది కారపండితులు, ఆ శ్లోకమును తమ ప్రతిలో ముద్రింపక విడిచిరని శ్రీ శాస్త్రులవారే వ్రాసియున్నారు.

కాని *"విడువ నిచ్చగింపక నేను ముద్రించితిని" అనియు వ్రాసిరి. నందర్గి కారపండితులైనను మల్లినాథవ్యాఖ్య లేదన్న కారణమున వదలినట్లున్నది గాని విమర్శించి కథావిరుద్ధమన్న హేతువున వదలినట్లులేదు. అట్లయినచో- 'తత్సందేశ'-మునుగూడ వదలియే యుండురని నా నమ్మకము.

ప్రక్షిప్తములగు నీ శ్లోకములను కావ్యమునుండి తొలగించితిమేని కవికి స్వవచన వ్యాఘాతదోషమును, మేఘునికి దేవతావేషము వేసికొని దివ్యవాక్కులతో భాషింపవలయు ననన్న ఇక్కట్టును దొలగుటయే కాక కావ్యమునకు మంగళాంతత్వమును గలుగును.

---

* "వ్యాఖ్యలో కథావిరుద్ధము లని తెలుపకున్న నేమి? వానికి ప్రాముఖ్యమిచ్చి, మూలకథతో జేర్చి, పదప్రయోజనాది సారస్యవివరణ మును వ్రాసిన నేమి? శ్రీ శాస్త్రులవారు శిష్యులకు మాకు ఇవి ప్రక్షిప్తము లని ముప్పదియేండ్లనుండి సోపపత్తికముగా నేర్పినారు"— అన్నారు అయ్యంగారు.

ముప్పదియేండ్లక్రిందనే యెఱిఁగియున్న శాస్త్రిగారు, ఇరువది యేఁడేండ్లక్రిందట ముద్రించిన గ్రంథములో వానిని చేర్పనేల? అవి ప్రక్షిప్తములని సూచింపకపోవు టేల? అని నేను ప్రశ్నించితిని.

కాని, అయ్యంగారు ప్రత్యుత్తర మియ్యలేదు.

మఱియు నయ్యంగారు,— "మఱి ప్రక్షిప్తములైనను కవనసౌభాగ్యము కలిగి వ్యాఖ్యయుఁ గలిగియున్న విడువ నిచ్చపడమకుండును. ముద్రింపఁబడును. అందుల కేమి?" అన్నారు.

కవితాశిల్పము నెఱిఁగినవా రెవ్వరును అట్లనరనియు, కథాస్వరూప మును చెఱుపని 'ధారాసి' క్తాదిప్రక్షిప్తము లెన్నియైన నుండవచ్చునుగాని, కథాప్రణాళికాభంగకారియగు శ్లోక మొకటియైనను కావ్యమున నుండరా దనియు, అట్టి శ్లోకముగాని, తుద కొక పదముగాని, యెట్లో కథాగర్భ మునఁ జొచ్చినను, ప్రమాదవశమున గర్భమునఁ జొచ్చు మక్షికాదులవలె- ఎప్పటికేని వెలువడవలసినవేగాని ఇముడునవి కావనియు, 'ఆషాఢస్య ప్రథమదివస' చర్చయే, అందుకు దృష్టాంతమనియు నేను బదులు చెప్పితిని.

మఱియు, నే నీ వ్యాసమును వ్రాసినపిమ్మట, చెన్న పురికిఁ బోవఁ దటస్థించెను. అప్పుడు 'సందేశ'మును గూర్చిన నా యీ యూహ లెంతవఱకు సత్యములో – ప్రత్యంతరములను జూచి నిర్ణయించుకొందమన్న తలఁపున, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున కరిగి, అందొక కొన్ని ప్రతులఁ బరిశీలించితిని.

(1) తెలుఁగు అచ్చుప్రతి. (2) నందర్గి కొరప్రతి, (3) ఈశ్వర చంద్రునిఎడిషను. (4) Parab's Edition. (5) Gildemistar's Edition. (6) నేమిదూత. వీనియందు 'తత్సందేశ' మున్నమాట నిజము.

కాని, (1) 1919 సంవత్సరమున తిరువాన్కూరు గవర్న్మెంటు సీరీసులో టి. గణపతి శాస్త్రులవారిచే – దక్షిణావర్తనాథవ్యాఖ్యా సహితముగాఁ బ్రకటింపఁబడిన ప్రతిలో ఈ శ్లోకము లేదు.

(2) 1911 సంవత్సరమున రాయల్ ఏషియాటిక్ సొసైటీపక్షమున ప్రొఫెసర్ E. Hultzsch గారు — శ్రీరాజాన కానందదేవ పరమాత్మ చిహ్నపరనామ వల్లభదేవ విరచిత మేఘదూత వృత్తితో బహుదేశకోశ వ్యాఖ్యాన పరిశోధన విమర్శపూర్వకముగా, సుపోద్ఘాతాదులను వ్రాసి ప్రకటించిన ప్రతిలో ఈ శ్లోకము లేదు.

వల్లభదేవుఁడు:— 'మాభూ దేవం' ఏవ మనేనప్రకారేణ మదృత్తవాపి నిమేషమపి తడిత్ప్రియయా విరహో మాభూ దితి భద్రం—అనియే ముగించినాఁడు.

(3) పూర్ణసరస్వతియు తన విద్వల్లతా వ్యాఖ్యానమున:— తయా సతత మవిరహశ్చభూయా దిత్యాశిషా శ్లేషశబ్దప్రయోగాచ్చ ఏతత్కావ్య శ్రోతృ వ్యాఖ్యాతృదీనామభంగురమంగలసంపత్తిరిత్యశేష మతిమంగలం— అనుటతోనే కావ్యపరిసమాప్తిఁ బొనర్చెను.

(4) ఆధునవభట్టబాణ బిరుదాంకితులగు పండిత. ఆర్. వి. కృష్ణాచార్యులవారు, పూర్ణసరస్వతిచే వదలఁబడి మల్లినాథునిచే వ్యాఖ్యానము చేయఁబడిన శ్లోకములనుచేర్చి ప్రచురించిరి. వాటిలో ఈ రెండు శ్లోకములును లేవు.

(5) 1813 సంవత్సరమున H. H. Wilson గారు కావించిన ఆంగ్ల భాషాంతరీకరణమునను 'తత్సందేశ'ము లేదు.

మఱియు, (6) మల్లినాథుని (రెండు) వ్యాఖ్యలలోను (7) జినసేనుని వ్యాఖ్యానమునను (8) తంజావూరి ప్రతిలోను (9) Panabokke పుస్తకమునను (10) Stenzler's ప్రతిలోను లేదు. 'మాధూదేవం'తోనే కావ్యము ముగింపఁబడియున్నది.

ఇట్లు పూర్వోత్తరసందర్భ పరామర్శముపలనను బహువ్యాఖ్యాన పరిశోధనములపలనను ప్రక్షిప్తమని నిర్వివాదముగాఁ దేలుచున్న 'తత్సందేశ' శ్లోకమును దమ ముద్రణమునఁ దొలఁగింపక పోవుటయే కాక శ్రీ శాస్త్రుల వారు "బొంబాయి ముద్రణమును మదరాసు తెలుఁగు ముద్రణమును బరికించి ఒకదాన లేనిదానిని మఱియొకదానినుండి గ్రహించి నా ముద్రణమును, ఆ రెంటికంటెను పుష్కలము గావించితి ననుచు 'శ్రుత్వావార్తా'మునుగూడఁ జేర్చిరి. కాని అప్రసక్తములను కథావిరుద్ధములు నగువానిని జేర్చుటవలన పుష్కలతకుమాఱు, వికృతి వాటిల్లినదని నా తలఁపు.

పుష్కలత యనఁగా గ్రంథభాహుళ్యము కాదుగదా? అగుచో నందర్థి కార్ ఎడిషన్‌లో నున్న,—

"ఇత్థంభూతం సురచితపదం మేఘసూతాభిధానం
కామక్రీడా విరహితజనే విప్రయోగే వినోదః;
మేఘస్యాస్మిన్ స్మృతి నిపుణతా బుద్ధిభావః కవీనాం
నత్వార్యాయా శ్చరణకమలం కాళిదాస శ్చకార"

అను శ్లోకము మేఘసందేశ కావ్యమునఁ జేర్పఁదగినది కాదో?

గౌరనహరిశ్చంద్ర - టిప్పణము

*గౌరనహరిశ్చంద్ర - ద్విపద - పేరెన్నిక కెక్కిన కమ్మని జాను తెనుగు కావ్యము. అందలి జాతీయములును,

* ఈ వ్యాసము 1942 జనవరి — ఆంధ్రవారపత్రికలో ప్రచురింపబడినది.

పలుకుబడుల తీరుతియ్యములును, తెనుగువారి కానంద దాయకములు. అట్టి యుత్తమకావ్యము ఆంధ్రుల భాగ్యనశ మున కే. శే. వేదం వెంకట్రాయశాస్త్రిగారిచే పరిష్కృతమై ముచ్చటగా ముద్రితమైనది. ఆ తేట తెలుగు కబ్బమునకు టీకతో అంతగా అనసరము లేకపోయినను పరిష్కర్తలు టిప్పణమునుగూడాచేర్చి, తెనుగుతో చాలినంత పరిచయము చాలని పాఠకులకు మహోపకారము చేసినారు. కాని, వారి టిప్పణము కొన్నిమాటలకు మాత్రమే. వివరింప బడవలసిన పదము లనేకము లుపేక్షితము లయినవి. వ్రాసిన కొద్ది టిప్పణములోను పొరపాటులు విరివిగా దొర్లినవి. పాఠ నిర్ణయమున సరియైన పరిశీలనమును జరుగ లేదు. పరిష్కరణములో సాహస మెక్కువగా వినియోగింపబడినది. చాల తావులలో పరిష్కర్తలు గ్రంథకర్తభాషను తొలగించి తమ సొంతభాషను ప్రవేశపెట్టినారు. అందునలన జాతీయము లనేకములు స్వరూపస్వభావములను కోలుపోయి వికృతము లయినవి. కవి యుద్దేశించిన యర్థములు వ్యర్థములయినవి. ఆ విషయములనెల్ల విపులముగా విమర్శించుచో గ్రంథము పెరుగును. కావున, ఈ వ్యాసమున మాదిరి కొక కొన్ని యర్థదోషములనుమాత్రము చూపుచున్నాను.

౧. బందిపోటు

'ఉరవడిఁ గుక్కల నుసికొల్పికొల్పి
సందుగొందులఁ దప్పి చనుమెకంబులను
బందిపోటులఁ బాటుపఱిచియు, మఱియు' (పుట. 31)

బందిపోటులన్ = దారి యడ్డగించుటలచేత' (టిప్ప.)

'బందిపోటు' - 'దారి యడ్డగింపు' అనునవి దొంగలక్రృత్యములుగాని వేటరుల పనులు కావు.—

"బందిపోటు - దొంగలు గుంపులుగా వచ్చి, యింటనున్న వారిపైబడి నిర్బంధించి చేయు దోపిడి. Gang robbery, predatory incursion." (బ్రౌను.)

వేటగాండ్లు మెకములను పాటుపఱిచినది 'పందిపోటులతో'గాని 'బందిపోటు'లతో కాదు. 'పందిపో' టనగా పందులనుపాడుచు ఈఁటె. పందిపోటు = పందీఁటె. (శ.ర.)

(1) ద్విపద:-"పసిఁడికామలనొప్ప బలుపందిపోట్లు, వెసఁబూని" (నవనాథచరిత్ర. పుట 37.)

(2) క. "...పందిపోటు లమ్ములు, వలలు తెరలు దీమములు సివంగులబోనుల్" (వరాహ 4-71).

'బందిపోటు' - 'దారి యడ్డగింపు' అనునవి భిన్న క్రృత్యములు కావున, "బందిపోటులక్ - దారియడ్డగించుటలచేత" అనుటయును తప్పే.

౨. ఇంగితము

"ఈరత్నభూషాదు లేటికి మాకు?
నీరువట్టాఱునే నెయిత్రావికొనిన
నింగితంబెఱుఁగని దే జ్ఞానతనము?" (పు. 48)

"ఇంగితము=మొగముజాడ." (టిప్ప)

ఇంగితమునకు, బాహ్యముడి లోనగు వికారము; అభిప్రాయము అని రెండర్థములు. (శ.ర.) ఇక్కడ చెప్పదగినది రెండవయర్థము. పైవాక్యములు, ఆటపాటలకుమెచ్చి హారిశ్చంద్రు డాభరణాదు లియ్యబోయినప్పుడు మతంగకన్య లన్నవి. తమ్మేలుకొనవలసినదని యాకన్నెలు కోరుకోరిక. 'మా మనసులోని కోరిక నెరుగజాలని నీ వేమి నేర్పరివి?' అని ఆయింతుల మాటల కర్థము. నిజానికి తెలిసికొనవలసినది యెదుటివాని హృదయములోని భావమునుగాని, వట్టి మొగముజాడను కాదు. మొగముజాడను బట్టియు నూహింపవలసినది హృద్గతభావమునే. అట్లూహింపగలవాడే నేర్పరి; వాడే పండితుడు.

(1) 'పరేంగితావగాహినైన బుద్ధి యొక్కటియె పండితునకు విశేషము. అది లేనివాఁడు పండితునికిఁ బామరునికంటె విశేషమేమి?'
(నీతి. మిత్రభేదము)

(2) 'ఎంగిలిముచ్చు గులాములు
సంగతిగాఁ గులముఁ జెఱుపఁ జనుదెంచిరయా
యింగిత మెఱిఁగిన ఘనుఁ డీ
మంగలి కొండోజి మేలు మంత్రులకంటెక్.'
—చాటు. రత్నాకరము.

(3) "ఇంగితము Hint, sign, symptom, gesture. Intention, purpose, inclination 'ఆకారైణైవ చతురా స్సర్కయంతి పరేంగితం, గర్భస్థం కేతకీపుష్ప మామోదైనైవ షట్పదాః'. ఇంగితజ్ఞుడు penetrating, skilful in reading a character. One who sees the heart." (బ్రౌను)

(4) "తస్యసంవృతమంత్రస్య గూఢాకారేంగితస్యచ" (రఘు. 1.20) 'శోకహర్షాది సూచకో భ్రుకుటీముఖరాగాది రాకారః. ఇంగితం చేష్టితం, హృద్గత వికారోవా; 'ఇంగితం హృద్గతోభావో బహిరాకార ఆకృతి' రితి సజ్జనః' (మల్లినాథుఁడు)

3. బడుగు

"నీవేమి చెప్పిన నీకొ నిచ్చకము
గా వినుతించుచుఁ గడుపుగూటికిని
బాయక నీయింట బడువనై పనులు
సేయుచునుండ వసిష్ఠుండఁ గాను" (పుట. 59)

'బడువను = అశక్తుఁడను.' (టిప్ప)

శ.ర.లో 'బడువు = బడుగు = అశక్తుఁడు,' అని యున్నది. ఆమాట మీదనే ఆధారపడి శాస్త్రిగారు 'బడువను = అశక్తుఁడను' అన్నారు. పొరపాటు. కడుపుకూటి కొకరియింట బడియుండు 'బడుగు' కూటిపేద యగునుగాని 'అశక్తు' డగునాఁ? అశక్తుడు పనులు సేయగలడాఁ? విస్తర

మెంగుకు: 'బడువవై = కూటిపేదవై'—'నీపెట్టుపోతల కాసపడి'-అ: ప్రకరణోచితమైన యర్థము.

"బడుగు Poor, necessitous" (బ్రౌను)

ఆ.వె. "సర్వధనము విష్ణు సంసర్జనముచేసి
బడుగుపగిది నెట్లు బ్రదికె దీవు?" (భాగ. 8–578)

ఈ యర్థమును గమనింపక 'వేదం'వారు శృం. సై.లోగూడ ఇచ్చే యనుచితార్థము వ్రాసినారు. (చూ. 'బడుగు')

౪. ఎరియు

"ఓపినరీతిఁ బ్రియోక్తుల నెదిరి
కోపము వర్ధలించి, కుశలంబుమీఱ,
నేచిన యాపద నెరియక, తన్నుఁ
గాచుకో దగు." (పుట. 61)

'ఎరియక = మండక.' (టిప్ప.)

'ఎరియు' అను క్రియకు, 'మండు', 'పరితపించు', అని రెండర్థము లున్నవి. (చూ. శ.ర.) ఇక్కడ రెండవ యర్థము ప్రకరణమునకు దగినది. ఆపదచేత 'పరితపించుట' స్వభావముగాని 'మండుట'—'కాలుట' స్వభావము కాదు. పైపెచ్చు బ్రౌను 'ఎరియుట = బాధపడుట' అని యర్థము చెప్పి, అందు కీ పద్యమునే చూపియున్నాడు. కనుక ఆ టిప్పణము సరికాదు.

౫. అదరంట

(1) "కరపల్లవము సాప, కలగొనరేగి
కడుదురు లదరంటఁ గఱవ." (పుట 79)

'అదరు అంటక = నిప్పురవ తగిలినట్లు' (టిప్ప.)

(2) "ఆలోన నడఁగిన యమ్మహాభుజగ
మా లోహితాస్యుని నదరంటఁ గఱచె". (పుట 205)

'అదరు అంటక = నిప్పుక యంటునట్లుగా-భగాలు మనునట్లుగా' (టిప్ప.)

ఇది భాషా సంప్రదాయమునకు చాలా దూరమైన టీక. 'నిప్పు' అనే యర్థమునిచ్చు పదము 'అదరులు' నిత్యబహువచనాంతము. అది 'అదరుటగ్గి' ఇత్యాదిగా వృత్తియందుమాత్రమే యేకవచనాంత మగును. (చూడు శ.ర.; ప్రౌ.వ్యా.శబ్ద. 36). కావున 'అదరు = నిప్పు' అనుట తప్పు. 'అంటక' అను క్రియకు 'తగిలినట్లు' అని యర్థముకాదు. 'పాము నిప్పు అంటునట్లుగా కఱచె' ననుట యర్థములేని మాట. 'పాము-అదరంట గరచినది' అంటే, 'అదరు = నిప్పు-అంటునట్లు భగ్గున కరచిన' దనియు, 'తేలు చిగురంట బొడిచినది' అంటే, 'చిగురు = చిగురాకు - అంటునట్లు (చల్లగా) కుట్టిన'దనియు లెను గాఱిగినవా రర్థము చెప్పరు. అదరంటక, చిగురంటక, అను పదములకు లెస్సగా అని యర్థము. అందుకు కవుల ప్రయోగములు ప్రమాణము. అట్టి ప్రయోగములు వందలకొలదిగా నున్నవి. మచ్చుకు కొన్ని —,

(1) గౌ. హరి. లోనే మరియొకచోట;—

'కుదికిలఁబడ రెట్ట గుదియించి తిగిచి,
అదరంట మొత్తి, నోరడఁగ జంకించి.' (పుట 164)

(ఇక్కడ 'అదరంట'కు టిప్పణిలేదు.)

(2) మంజరి:—

'శకటసమూహంబు చనియెడివేళఁ
జీల లూడఁగఁదీయుఁ, జేతులఁబట్టి
యూడెడి పాపల నదరంటఁగొట్టు.' (పల్నాటిచరిత్ర. పు. 45)

(3) లయగ్రాహి:—'అంతవడిఁ దాఁకి, యదరంటఁ బడ్రవేసి, పెను మంట లెగయం, జఱచి, దంటతన మొప్పక' (భాస్క.యుద్ధ. 1480)

(4) 'వత్త మదరంట వ్రేసిన వ్రాలె నతఁడు.' (ఉ.హరి. 1-46)

(5) 'కెంగేల నదరంట వాటువడు కొమకుల వెలవెలపాటు.' (మను. 3-42)

'ఆదరంట=చురుకు ముట్టేట్టుగా' అని జాలూరివారి టీక.

(6) ద్విపద:—

'అనినఁ గాలినమూఁడు లదరంటఁ జెవులఁ,
జొనిపినయట్లైన సురసుర క్రుక్కి.' (నవనాథ. పు. 47)

సూ.ని. 'ఆదరంట = మర్మస్థాన మంటునట్లుగా — గాఢముగా, తీవ్రముగా' అని యర్థము చెప్పి, పై గౌరన-ద్విపదనే యుదాహరించినది.

౬. కంటగించు

"నేనేడ? నీవేడ? నెలతుకయేడ?
పూని తపోవిఘ్నమున కిది త్రోవ
తరళాక్షు లన్న మా తల కంటగించు" (పుట. 86)

'కంటగించున్ = గగుర్పొడుచును' (టిప్ప)

'కంటగించున్' అనగా 'నొచ్చును' అని యర్థముగాని 'గగుర్పొడుచు' నని కాదు. ఆడవాండ్లంటే మాకు తలనొప్పి అని యర్థము. సరిపడదు అని భావము. (జాతీయము)

(1) కంటగించు = విరోధించు (శ. ర.)

(2) 'కంటగించుట-To hate, be intolerant, or outrageous. To rave or storm' (బ్రౌ)

ఒక కొన్ని ప్రయోగములు:—

(1) 'నిష్కారణంబు నా, పేరన్నన్ మదిఁ గంటగించెదరు పెంపే మీకు నన్నేచుటల్' (ఋక. 2-457)

'మదిక్ కంటగించెదరు = మనసులో గగుర్పొడిచెదరు' అని యర్థము చెప్పుట సరికాదుగదా?

(2) 'మేనమామలు బావలు కానివాఁ
గాఁగఁజూతురు, మా పాడకట్టువారు
కంటగింతురు నన్నంచె'. (హంసవింశతి. 3-150)

(3) 'బాకిమోమనఁగాదు పగసాటి బెదరించు, నొంటిప ల్లనరాదు కంటగించు' (శుక. 3-21)

(4) 'ననల క్రొందొడిమ యొత్తినఁ గంటగిలు మస్తకం బెట్లు లోర్చెనో కఱకు జడలు.' (పాండు. 4-3)

(5) 'కృహంబులోనికిఁ, దారఁదు కావరే యనఁడు తాపము నొందఁడు కంటగింపఁడుఁ' (భాగ. 7-194)

'కంటగింపఁడు = విరోధింపడు' అని యర్థముగాని 'గగుర్పాటుప' డని కాదు.

కంటగించుట యనగా 'కంటకిత మగుట' యనుకొనుట భ్రాంతి. శాస్త్రిగారు 'ఆముక్త' (5-106)లో 'ఒంటి కురువేరు పోచకుఁ గంటగింప నైరి' అన్నచోట 'కంటగించు'-ప్ర. కంటకము (తటాలునం గలిగిన యప్రీతికి గోమహర్షణము కలుగును) అని వ్రాసినారు. 'కంటగించు'కు 'కంటకము-ప్రకృతి' యనుటయును పొరపాటే. 'కంటకము' అను దేశ్య పద మున్నది. కంటకము (=కంటు) = విరోధము. కంటు + ఇంచు = కంటగించు. దేశ్యక్రియ. అప్రీతికి గగుర్పాటు కలుగుట నిజమేగాని, తల, మొల, పిరుదు, పిక్క - అప్రీతికిగాని ప్రీతికిగాని గగుర్పొడిచినట్లు చెప్పిరవా రెందును లేరు. కావున శా. టీ. అసాధువు.

౭. చిదుగు

(1) "మిష్టిఁ, జదిమియుఁ గటములు చదియలు గాఁగఁ, బడగ లొత్తియును." (పు. 93)

'చదియలు గాఁగఁ = చిదుగునట్లు.' (టిప్ప)

(2) "బలుకత్తి రాతికిఁ బాసిన గొంటు." (పుట. 153)

'రాతి...గొంటు = రాతిదెబ్బకు చిదుగని గొంటుపోక.' (టిప్ప)

క్రియ 'చిదుకు' గాని 'చిదుగు' కాదు. చిదుగు విశేష్యము. 'పడుచుల కొపురము-చిదుగులమంట' అని లోకోక్తి.

(1) "చిదుగు-A small stick or pin, or spillikin, fire wood. చిదుకుట-To be smashed" (బ్రౌణ్యము.)

(2) "చిదుగు = ఎండినపుల్ల; సమిధ.-చిదుకు = చిప్పిలు." (శ.ర.)

(3) వ. "వానికిం దేజస్వి యను ఋషిపుట్టి ఆపారంబైన యిధ్మ భారంబు వహించుటంజేసి యిధ్మవాహుం డనంబరగె." (భా. ఆర. 2-353) అన్న రచనకు,— 'ఇధ్మభారంబు = చిదుగులమోపు' అని శ్రీ పళ్లె పూర్ణ ప్రజ్ఞాచార్యులవారి టీక.

(4) "బగబగన మండు చిదుగుసొదమంటల కడ్డంబువట్టి."
(మను. 4-60)

ర. అసిఁబోవు

"అసికోఁతలుగఁ గోయ, నంత నవ్విభుని
యసికోఁత లసిఁబోవ, నప్పుశాచములు." (పు. 96)

'అసిఁబోవఁ = తప్పిపోఁగా.' (టిప్ప)

క్రియ (అసి + పోవు=) 'అసివోవు' గాని (అసిఁ + పోవు=) 'అసింబోవు' కాదు. *"ఆసివోవు టెట్లు నా యసి, వోవు మెకములఁ జించు నాయమ్మ నా చిలుకోటమ్మ" (రామాభ్యుదయము. 2-24) అని యమకబద్ధమయిన ప్రామాణిక ప్రయోగము. 'అసిపోవు', 'అసియాడు', ఆసియార్చు' అను క్రియలను 'అసింబోవు'; 'అసినాడు'; 'అసినార్చు' అని వాడుట సరికాదు.

---

* 'అసిఁబోవు టెట్లు నాయసిఁ బోవు మెకముల' అని శ.ర. పా.— (చూ. 'అసిఁబోవు'.) తప్పు. సూ. ని. 'ఆసివోవు'

౯. గుత్త

"పట్టి గుత్తని నిన్నుఁ బ్రజలు వీక్షింపఁ
జట్టు మోయించెద సర్వథా చూడు." (పు. 129)

'గుత్త అని = పైకము పెట్టి కొన్నట్టి దాసుఁడని' (టిప్ప)

*'గుత్త' యనగా 'ఫలప్రదమైన యొక సొత్తును ఆ సొత్తు గలవానికి తత్ఫలార్థము తగినధన మిచ్చి తన యనుభవమున నుంచుకొనుట.' (శ. ర.) గాని, పైకము పెట్టి కొనుట కాదు.

"గుత్త Rent, farm, contract గుత్తలంజ a kept-courtesan. ఆ వూరిని గుత్త చేసుకొన్నాడు; he took the village on rent." (బ్రౌను.)

"గుత్త = (గుప్తశబ్దభవము) మక్తా. (శ. ని.)

"గుడిసెవేటుల నిల్లాలు గుత్తలంజె." (వేణు. శతకము.)

పైకము పెట్టి కొన్నయెడల కొన్నవా డా వస్తువును దానాధమన వినిమయవిక్రయాదులపాలు చేయవచ్చును. గుత్తవస్తువును అట్లు అన్యా క్రాంతము చేయుటకు వీలులేదు.

౧౦. ముట్టఁ జిక్కు

"కంఠీరవంబు, ముదిసిన నాఁకొన్న ముట్టఁ జిక్కినను, బొదలు మాంసము డించి పులు మేయఁ జనునె?" (పు. 149)

'ముట్టక = పడఁద్రోయఁదగినట్లు, చిక్కినన్ = కృశించినప్పటికిని(టిప్ప)

'ముట్టక' అను క్రియకు 'పడద్రోయదగినట్లు' అని యర్థము చెప్పుట యొప్పదు. 'ముట్టక = కడముట్ట, చిక్కినను' అని సరియైన యర్థము. ఈ యర్థము నిఘంటువులలో ఎంత స్పష్టముగా చెప్పబడియున్నదో చూడండి.

---

* "పచ్చిబ్బిత్తో లబ్బెచ్చు చ్చాలమె ట్లందికొనఁ దాన యూరెల్ల గుత్తవట్టి" (ఆము క్త. 7-5)

"గుత్తపట్టి = తన కొక్కనికే ఇచ్చునట్లుగా అందఱను స్వాధీన పఱుచుకొని' అని సంజీవసీవ్యాఖ్య.

(1) "ముట్టు = కడముట్టు. "మ. మును మీచే విను రావణాదుల కథల్ ముట్టం బ్రజంసింపుఁడు. నిర్వ. రామా. 3. ఆ." (శ. ర.)

(2) "ముట్టుట, 'ముట్టగొల్చిన ఫలం బిట్టుండవలదె' బసవ; ముట్ట గొలిచిన = కట్టకడవెళ్ళా గొలిచిన To worship to the end or with unfailing devotion" (బ్రౌణ్యము)

౧౧. అట్టాడు

"ఆఁకటఁ జంటి కట్టాడుచునున్న
సుతు లోహితాస్యునిఁ జూచి" (పు. 155)

'అట్టాడుచు = మెడయెత్తుచు' (టిప్ప.)

'అట్టాడు' అను ఆకర్మకక్రియను అట్టు+ఆడు అని విభజించుటయు, అట్టు = మెడ, ఆడు = ఎత్తు-అని యర్థము కల్పించుటయు సరికాదు. అట్టాడు లోనిది 'అట్ట' కాని అట్టు కాదు. (చూ. శ. ర.) గ్రంథవిస్తర మెందుకు? అట్టాడుట యనగా తెమక పడుట; చుట్టిచుట్టి తిరుగుట. అంతే కాని మెడయెత్తుట కాదు.

"అట్రాడుట To hesitate, waver, roam about, wander about in great distrees తడమాడుట, అల్లాడుట, దేవులాడుట. ద్రౌపది యున్నయెడకుంజని యా సమీపమున నట్రాడుచున్న నమ్మానినితో నిట్లనియె. M. IV. 2-47" (బ్రౌణ్యము.)

సూ. ని. అట్టాడు = తమకించు, తహతహపడు - అని యర్థముచెప్పి, ఆ యర్థమునకు పై ద్విపదనే యుదాహరించినది.

కావున, 'మెడయెత్తుచు' అను టీక తప్పు.

౧౨. వెరవేఁకి

"నన్నెటుంగడుఁగాక! నాపేరు తెలియ
విన్న మిత్తికి నైన వెరవేఁకివచ్చు." (పుట 177)

'వెరవేఁకి=విపరీతజ్వరము.' (టిప్ప.)

'వెరవేకి' యనగా వెరవలనివేకి (వెర=భయము; వేకి=జ్వరము) =జడుపుజ్వరము. భయంకరములయిన విషయములను విన్నను, కన్నను జ్వరమువచ్చుట లోకమున కలదు. కావ్యలోకమునను కలదు.—

(1) 'తల్లడంబునఁ ద్రయోదశవిధ జ్వరునకు
విన్నమాత్రనె వెఱవేకి దాఁకె' (జై మి. 8-17)

(2) *"కయ్యంబునఁ బాఱఁబాఱఁగాయంబునేసి వెఱవేకిఁ గొలిపిన." (ఆము క్త. 6-86) 'వెఱవేకి - భయజ్వరము' అని వావిళ్ల - వేదంవారి టీకలు.

శ.ర. కర్త 'వెరవేకి = విరహతాపము' అని యర్థము చెప్పి, 'నా, కీ వెరవేకి మాన్పఁగమలేకుణ, యబ్బితివీవు వెజ్జవై.' (హరి. ఉ. 7 ఆ.) అను ప్రయోగమును చూపి వెరశబ్దము విరహార్థకమయి ప్రత్యేకముగా ప్రయోగములందు కానబడదు—అన్నాడు.

'వెర'కు 'విరహ'మనే యర్థము లేనిమాట నిజము. ఉండవలసిన యక్కరయూ లేదు. పద్యములోని 'వెరవేకి' జడుపుజ్వరమేగాని విరహజ్వరము కాదు. జడుపుజ్వరము కావునసే 'వెజ్జు'తో పనిపడినది. జడుపుజ్వరమునకు వెజ్జులు మంత్రించి విభూతిపెట్టుటయు, ఆది నిమ్మళించుటయు లోకమున నున్నది. కాని విరహజ్వరమునకు, అట్టి మందులు - మంత్రములు - వెజ్జులు లోకమున కనబడుట లేదు.

శ.ర. లో 'వెరవేకి' లఘురేఫముతో నున్నది. శాస్త్రిగారున్ను, 'హరిశ్చంద్ర' మూలమునను టిప్పణమునను గూడా లఘురేఫముతోనే ముద్రించినారు. కాని 'ఆముక్త' లో మాత్రము (వావిళ్ల వారి ప్రతినిబట్టి కాబోలు) గురురేఫముతో ముద్రించినారు.

౧౩. తఱలక

"వీను నిక్కమిది సుమ్ము వీడు నీసొమ్ము. గొను మన్న వాఁడు నిక్కుచుఁబల్కె: నీకు, ధనరాశి యిచ్చోటఁ దఱలకయిత్తు" (పుట 190)

'తఱలక = అవతలికిపోక.' (టిప్ప.)

---

* ఈ నాటి ముద్రితప్రతులు రెండింటను ఈ పాఠమే యున్నది. కాని ప్రౌఢ్యమున 'బారం బారం గాయంబునం గాయంబుజేసి' అనుపాఠ మున్నది.

'తఱలకయిత్తు' ననగా,—'తప్పకయిత్తు' నని యర్థముగాని, 'అవతలికి పోక యిత్తు' నని కాదు. అవతలికి పోవు; ప్రయాణముగు అను నర్థముల నిచ్చు 'తరలు' లఘురేఫము కలది. బ్రౌనుపండితుడు 'తరలు' అను పదము క్రింద ఈద్విపదనే యుదాహరించి 'తరలక నిత్తున్ = I will give it without fail' అని యర్థముకూడా చెప్పియున్నాడు.

౧౪. తన

"పీరబాహుఁడు తనవెంట నేతెంచు...
తన కింకరులఁ బంపి, ధనము తెప్పించి
పెనురాని పోయించి, ప్రియము రెట్టింప
మునికుమారునకిచ్చి, మ్రొక్కి పొమ్మనిన" (పు. 193)

'తన = నా' (టిప్ప.)

'నా' వెంటవచ్చు 'నా' కింకరులను బంపి పీరబాహుడు ధనము తెప్పించి నక్షత్రకున కిచ్చెను.—అని టీకాకర్తలు వ్రాయుట అక్రమము. పీరబాహుడు అతనివెంట వచ్చుచున్న అతని బంటులనే పంపి, ధనము తెప్పించుకొన్నాడుగాని టీకాకర్తల బంటుల నంపి తెప్పించుకొనలేదు.

'తన కింకరులఁ' అనగా 'పీరబాహుని కింకరులను' అని యర్థముగాని 'నా, కింకరుల' - నని కాదు. ప్రౌ.వ్యా. శబ్ద. 78 లో 'ఆత్మార్థం బాకానొకచో నామాస్మదర్థాభిధాయియు నగు' అని యున్నది. కావున 'తనకు 'నా' యన్న యర్థమును చెప్పవచ్చును. కాని ప్రకరణవిరుద్ధముగా 'అతనియొక్క' అని చెప్పవలసినచోట 'నా' (నాయొక్క) అని చెప్పుట తప్పు.

౧౫. పడఁగఱచు

"ఆహికులోత్తమ, లోహితాస్యకుమార
గహనంబులోఁ బడఁ గఱచిర మ్మనిన." (పు. 202)

'పడఁ = కూలునట్లు' (టిప్ప).

'పడఁగఱచుట' యనగా లెస్సగా కరచుటగాని, పడునట్లు కరచుట కాదు. పడదిట్టు; పడగిద్దు; పడవ్రాయు మొదలగు క్రియలవలెనే 'పడ గరచు' జాతీయము. ఆ జాతీయములోని 'పడ'ను వేర్పరచి 'పడక = పడునట్లు' అని యర్థముచెప్పుట తప్పు.

౧౬. కడపు

"ఎలమితో మున్నొక్కఁ డిచ్చిన దైనఁ
బొలుపొందఁ దా దారపోసిన దైన
నూదిమో పెడునంత చోటు నాభూమి
లేదని కడపిన, లెక్కింప-వాఁడు
ఘనతరమగు నరకమున వేయేండ్లు
మునుఁగుచుఁ గ్రిమిరూపమున వసియించు." (పు. 250)

'కడపినక = అపహరించినయెడల' (టిప్ప.)

కడపుట యనగా ఇయ్యక-పెట్టక పొమ్మనుటగాని, 'అపహరించుట' కాదు.

(1) 'కడపు = ఇయ్యక పొమ్మను. 'ఏపట్టున నర్థులం గడప' భో. 3 ఆ. (శ. ర.)

(2) సీ. "దుర్భిక్షదోషంబు దొరఁకొన్న *గడపనీ
కడపనీ గృహసూతకంబునందు,
మీఁదువోకున్నఁ గడపనీ మిన్న కెట్లు
గడపె నింటింట నీ కాశికా పురమునఁ
బుణ్యగేహినీ యిది మహాద్భుతము కాదె? (కాశి.7 ఆ. 139.)

---

*కడపనీ = కడపనిమ్ము-ఆని యర్థము.

వావిళ్ల వారి ప్రతిలో, పాఠము "కడపని, కడపని గృహసూతకమ్ము నందు" అని యున్నది.

గీ. మనము మనమనపూర్వజన్మములయందుఁ
గడపినారము మధ్యాహ్నకాలభిక్ష
యనుభవింపక పోవంగ నలవియగునె
కమలజునికైనఁ బ్రారబ్ధకర్మఫలము? (కాశీ. 7-148).

క. అడిగిన యప్పుడ చెచ్చెరఁ
గడపినఁ బోనవ్వ యేను? గడుదుర్మతివై
పడఁతి నను నిలిపి భిక్షం
బిడక కడునవజ్ఞచేసి తేల మదమునఁ?" (భా. ఆర. 5-13.)

శృంగారనైషధము

ఆంధ్రమల్లినాథులు శృంగారనైషధము పూర్వముద్రణములలోని అపపాఠములను దాదాపు రెండువేలు సవరించియు, సర్వంకష యను సార్థకాభిధగల విపుల వ్యాఖ్యానమును వ్రాసియు, ఆ గ్రంథమును సర్వాంగసుందరముగా తీర్చి ఆంధ్రావళికపార్మైన యుపకార మొనరించినాఁడు. నేఁడు పఠన పాఠనములలో నున్నది వారి ప్రతియే. వారి పరిష్కరణములోను, వ్యాఖ్యానములోను జాఱుపాటు లుప్పతిల్లినవి. *నా కగపడినవాటిలో కొన్నిటి నిక్కడ చూపుచున్నాను.

పాఠవిచారణ

౧. 'ఆనందంబునఁ బొందు'

"ఆనందంబునఁ బొందు మిందునిభవక్త్రా" (5-61)

---

*ఈ వ్యాసములోని కొన్ని విషయములు శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి షష్టిపూర్తి సంచిక (1941)లో అచ్చయినవి.

ఆనందంబునఁ = సంతోషముచేత - పొందుము = పొందిక గలిగి యుండుము. (సంతోషింపు మనుట. 'ఆనందంబును' అనియేని పా. అగుఁ గాక.) అని సం.వ్యా.

ఆనందంబునుబొందు - అన్న యర్థమున 'ఆనందంబునఁబొందు' అనుట ప్రాచీన సంప్రదాయము. భారతాదులను చక్కఁగా చదువనివారికి ఈ ప్రయోగము తప్పుగను-వింతగను కనుపట్టును.

భారత ప్రయోగములు

(1) "ఎవ్వరి యాంధ్రు రింకఁ, బరిభవంబునఁ బొందక బ్రదుకువారు." (విరా. 2-140)

(2) "ఇప్పు డిటు బ్రుంగుపాటునఁ బొందఁ జూచి" (,, 2-192)

(3) "ఈ యున్నవారెల్ల నా,చే దైన్యంబునఁ బొందు టొప్పదని" (ఉద్యో. 3-378)

(4) "నీ సుతుండు సహాయులుం దానును బుణ్యలోకసౌఖ్యంబునం బొందియున్నవాఁడు." (ఆశ్ర. 1-101)

(5) "రిపుకోటిచే నపజయంబునఁ బొంది" (ఆరణ్య. 7-225)

(6) "సంతాపభరం,బునఁ బొందును రింతకు"(,, 7-256)

భాస్కరరామాయణ ప్రయోగములు

(1) "అని కౌశికుఁ డలుఁగఁగఁ మే
దిని గంపించె సమస్తదేవతలు భయం
బునఁబొంది రఘుకు" (భాస్క. బాల. 201)

(2) "సంతస, మునఁబొందితి మేము నీవు మునివర" (,,-259)

(3) "దివ్యశస్త్రాస్త్రంబులు వడసి మహోత్సాహంబునం బొంది దర్పాతిశేకంబున." (,,-562)

ఇట్టి ప్రయోగములు పరశ్శతముగా కలవు. కులమువాఁడు-అనుటకు (ప్రౌ. వ్యా.సమా. 38) కులమునవాఁడు-అనుట యెట్టి ప్రయోగవిశేషమో, ఆనందమును బొందు-అనుటకు,-'ఆనందమునఁ బొందు' అనుటయు నట్టిదే.

కావున ''ఆనందంబును అనియేని పా. అగుఁగాక'' అని సవరణ సూచించుట అనవసరము; "ఆనందముచేత-పొందిక గలిగియుండుము" అని యర్థము చెప్పుట ఉచితము కాదు.

పొందు-అను క్రియకు 'పొందిక కలిగియుండు' అను నర్థము లేదు.

N.B. — శృం.నై. లోని కొన్ని పాఠదోషములు, అర్థదోషములు కూడా-నా 'జితకాశి' పీఠికలోను, ఇందే పాఠపరామర్శార్థపరామర్శలలోను చూపబడియున్నవి.

అర్థవిచారణ

౧. మృదుమధుర చిత్ర విస్తరములు

''మృదు మధుర చిత్ర విస్తర కవితావిలాస వాగీశ్వరులగు కవీశ్వరులును.'' (1-11)

'మృదు = నులువును, మధుర = ఇంపును, (అయిన), చిత్ర=శబ్ద చిత్రము - అర్థచిత్రము నను విరుదెఱఁగుల రచనయొక్క, విస్తర=విరివిగలిగినట్టి, కవితా = కవనముయొక్క, విలాస = క్రీడయందు, వాగీశ్వరులు = బ్రహ్మలు (రూపకము)' అని సర్వంకషవ్యాఖ్య.

మృదుమధుర చిత్ర విస్తరములు చతుర్విధ కవితలుగాని అవి కవితకు విశేషణములు కావు. చతుర్విధకవితలప్రస్తావము కావ్యములయందు పలు తావులఁ గలదు.

పెద్దన, భట్టుమూర్తి, కణాదపెద్దన సోమయాజి మొదలగు కవులు 'చతుర్విధకవితానిర్వాహకు' లయినట్లు వారి వారి గద్యములు తెలుపుచున్నవి.

విజయరాఘవభూపాలుఁడు, తన 'పూతనాపహరణ' నాటకమున, చతుర్విధకవితల నిట్లు తడవియున్నాఁడు.

'దక్షిణసింహాసనపట్టభద్ర, కలియుగరామభద్ర, చతుర్విధకవితా నిర్వాహకసార్వభౌమ .....విజయరాఘవనాయక, పరాకు;' (చూ. తంజావూరు సరస్వతి మహల్ లైబ్రరి కాటలాగు. పుట 227.)

చతుర్విధకవితలు

'బంధగర్భచిత్రాశువు' లనియు, 'చిత్రవిస్తరమధురాశువు' లనియు, 'మృదుమధురచిత్రవిస్తరము' లనియు, చతుర్విధకవితల విషయమున మత భేదము లున్నవి.

(1) 1832 లో,— మనుచరిత్రకు టీక వ్రాసిన జూలూరి అప్పయ్య శాస్త్రిగారు,— 'చతుర్విధ = నాలుగుప్రకారములు, అనగా బంధ కవిత్వ చిత్రకవిత్వ గర్భకవిత్వ ఆశుకవిత్వము లనేభేదములు కలిగినటువంటి కవిత.' అన్నారు.

(2) తారాశశాంకకర్త—చ॥ 'చిత్రవిస్తరమధురాశు' లీలగకవితల్ రచియింపగనేర్చె. (2-54). అని చతుర్విధకవితలను పేరొక్కొన్నాడు.

(3) కళాపూర్ణోదయకర్త,-'ఆశుమధుర చిత్రవిస్తారములు' (1-11) చతుర్విధకవిత లన్నాడు.

(4) మఱియు నాతడే, 'నెఱయమెచ్చిరి కవినృపుల యాశు విచిత్ర మృదుకవిత్వకృతియుఁ దదవగతియు' (కళా. 6-177) అని, ఆశువు-చిత్రము-మృదువు, అను కవితాభేదముల నొకరిముఖమున చెప్పించి తన కావ్యమున చొప్పించినాడు.

(5) 'పాండురంగ' కర్త, సీ. 'నలుదెఱంగులనెన్నఁగల కావ్యధారల ఘనుఁడ వాశువునంఁ గరముమీటి, వి' (1-23) అని, రాజు తన్నగ్గించి నట్లు వ్రాసికొన్నాడు.

(6) 'ఆశు మధుర చిత్ర విస్తార-కవిత్వ తత్త్వ కోవిదత్వ ప్రసక్తి.' (పరమయోగి విలాసము. పుట 206.)

(7) వారి వీరి మాటలెందుకు? ఆదికవి నన్నయభట్టు, శ్రీ రాజరాజ నరేంద్రుని విద్యావిలాసగోష్ఠిలో, 'మృదుమధుర చిత్రవిస్తర' నవరసభావ భాసుర కవితారచనా విశారదులైన మహాకవు లున్నట్లు, ఆదిపర్వము (1-8) లో చెప్పియున్నాడు. నన్నయ సమాసమును శ్రీనాథుడట్లే యనువదించినాడు. కావున కవితాప్రస్తావమున మృదుమధుర-చిత్రవిస్తర ములను విశేషణముల పట్టికగా భావించుట సంప్రదాయము కాదు. అది కవ్యభిప్రాయవిరుద్ధము.

సర్వంకషాకర్తలు 'చిత్ర...కవనముయొక్క క్రీడయందు, వాగీశ్వరులు = బ్రహ్మలు (రూపకము), అన్నారు. కాని బ్రహ్మదేవుఁడు 'చిత్ర... కవనముయొక్క క్రీడ' యందు నేర్పరి- అనుటకు ప్రమాణమేమో తెలుప లేదు.

శ.ర. కర్త, ఆశువు, గర్భము, బంధము, చిత్రము అను పదములలో నొకదాని క్రిందనైనను, చతుర్విధకవితలను తడవలేదు. ఒక్క 'బంధము' క్రింద 'కావ్యరచనావిశేషము' అనిమాత్ర మన్నాఁడు. బ్రౌను దొర,—"ఆశుకవిత్వము or ఆశుధారాకవిత్వం, Extempore poetry ఆశుకవిత్వము చెప్పుట To improvise. బంధము, బంధకవిత్వము A poem composed in a fantastic form; in the shape of a sword (ఖడ్గబంధము) a serpent (నాగబంధము) etc." అని వివరించియున్నాఁడు.

సూ.ని. కవి, కవిత, కవిత్వము, గర్భము, గర్భితము, ఆశువు, ఆశుకవి, అను పదములలో దేనిక్రిందనైనను, చతుర్విధ కవితలనుగూర్చి చెప్పి యుండవచ్చును. కాని చెప్పలేదు.

'చిత్రము' క్రింద,— 'శబ్దచిత్రముగాని అర్థచిత్రముగాని ఉభయ చిత్రముగాని యగు కావ్యము' అన్నది.

శబ్దచిత్రాదులు కవితాభేదములుగాని, కావ్యభేదములు కావు. కావున చిత్రమగు కావ్య మనుట సరికాదు.

౨. అంగుళము

"ధర నేకాంఘ్రి కనిష్ఠికాంగుళమ యాధారంబుగా నిల్చి ని,ర్భర లీలం గృతవేళ నెట్టన యధర్మంబుం దపస్వీత్వముం బారసెక" (1-55)

"ఏకా...య(?).-ఏక=ఒక, అంఘ్రి=పాదముయొక్క, కనిష్ఠికా = చిటికెన వ్రేలియొక్క, అంగుళము అ = ఎనిమిదియవల ప్రమాణము మాత్రమే ('యవోదరై ర్దశ్ఞుళ మష్టసంఖ్యైః' లీలావతి) ఆధారంబుగా - నిల్చి,—అధర్మము చిటికెనవ్రేల నంగుళప్రమాణభాగమునైనిమాత్రమే నిలిచిన దనుటచే కొంచెముకొంచెము అటనట నుండెడినని భా.—ఒంటికాలి కనిష్ఠికపై నిలుచుట కఠోరతరతపశ్చరణప్రకారము" అని స. వ్యా.

కఠోరతపస్సులను చెప్పు ఘట్టములలో, కవులు సాధారణముగా, *ఒంటికాలి బొటనవ్రేలిమీద నిలబడి తపముచేసినట్లుగా చెప్పుచుందురు. అధర్మముచేసిన తపస్సు కఠోరతరమని యేర్పడుటకు శ్రీనాథుడు, ఒంటికాలి బొటనవ్రేలిని చెప్పక—చిటికెనవ్రేలిని చెప్పినాడు. తపఃకఠోరతరతను తెలుపుటకు చిటికెనవ్రేలే చాలియుండగా, వ్యాఖ్యాతలు-చిటికెనవ్రేలిలోని అంగుళప్రమాణభాగమును చెప్పవలసిన యక్కర యేమి?

ఏమియును లేదు. అమరములో అంగుళీశబ్దమేగాని అంగుళశబ్దము లేదు; అందువల్ల వారా శబ్దాని కర్థము వెదకవలసివచ్చినది. ఆవెదకుటలో—'ఏనిమిదియవల ప్రమాణ'మన్న యర్థమొకటి లీలావతిలో చిక్కినది. ఆయర్థముతోనే వ్యాఖ్య సాగించినారు.

కాని, కనిష్ఠికలో అంగుళప్రమాణభాగమును 'కనిష్ఠికాంగుళము' అనుట పొసగదు. అసలు కాలి కనిష్ఠిక అంగుళముకంటె నెక్కువ యుండదు. కావున కనిష్ఠికలో అంగుళమాత్ర భాగమనుట యొప్పదు. కనిష్ఠికాంగుళము-అనగా చిటికెనవ్రే లనియే అర్థము. (కనిష్ఠికయైన అంగుళము - అని విగ్రహము.)

శ్రీనాథుడు, అంగుళి-యను నర్థమునే 'అంగుళ'మును వాడినాడు. వ్యాఖ్యాతలు గమనింపలేదు.

---

* (1) "ధర బొటవ్రేల నూని, రవిఁ దప్పక చూచుచు."
—తా. శ. 1-22

(2) "చెటచెటఁబేలుచు నలుగడఁ
బటుతరశిఖిశిఖలు నెగయఁ బదిలముగా నుం
గుటము ధర నూఁది సుస్థితిఁ
గుటిలాలక వదన మెత్తుకొని రవిఁ జూచున్."
—నన్నె. కు. సం. ౯. ౨౦౦.

(3) "అంగుష్ఠాగ్రము నేలమోపి తప మేకాబ్దంబు నిండంగఁ జేయంగ"
(భాస్క. బాల. 448)

"భువం య దేకాంఘ్రికనిష్ఠయా స్పృశత్" అనిమూలము. "ఏక పాదస్య కనిష్ఠయా కనిష్ఠాంగుళ్యా భువం స్పృశత్" అని మల్లినాథ వ్యాఖ్య.

కాబట్టి, "కనిష్ఠికయొక్క, అంగుళము=ఎనిమిదియవలప్రమాణము" అను అర్థ మనవసరము; మూలవిరుద్ధము కూడాను.

అంగుళశబ్దమునకు 'వ్రేలు'అన్నయర్థము సుప్రసిద్ధమే కాని అప్రసిద్ధము కాదు. చూడండి.

(1) "ముక్కుపయి నంగుళముం గదియించి" (భా. విరా. 2-356)

(2) "అంగుళాగ్రములో సిటికెనలందు మొదళు
లనఘు డేవర్షితీర్థము లనఁగఁ బరఁగు" (,,—ఆను. 4-113)

(3) "కగతలాంగుళములఁ గనుతెప్ప లెత్తి
నెర సున్నదని పాఱ నిష్ఠించి యూఁదు" (బస. పు. 3-763)

(4) "కొలుకులరెండు నంగుళముల నదుమ" (,,—3-768)

(5) "వినాయకు నుంగర మంగుళంబునఁ" (హంస. 4-156)

(6) "తనదగు బాహాం, గుళములు దక్కటి యంగం
బుల కెక్కటినేయ రాజపుత్రుఁడు మెఱసెఁ" (భోజ. 4-97)

'అంగుళము = వ్రేలు' అని నిఘంటువులలోను ఉన్నది.—

(1) "అంగుళము = వ్రేలు" (శ. ర.)

(2) "అంగుళము = A finger" (బ్రౌణ్యము)

(3) "అంగుల = A finger" (కన్నడ-నిఘంటువు)

3. మడవక

"మడవక ముష్టియోగ్యమగు మధ్యముతో నెలవంకయైన య
ప్పడఁతుక భ్రూలతాధనువు పట్టి మనోభవుఁ డింత నుండియున్
విడుచునకాని మానఁ, డిది నిక్కము, షట్పదకీటజుష్టమై
యుడుగక కమ్మఁగూళి నుసి యొల్కుచునున్న పురాణచాపమున్"
(5-12)

మనోభవుఁడు, ఇంతనుండియుఁ,—మడవక=(సహజముగా వంగియే యుండుటవలన) వంపనక్క—అలోకయే, ముష్టి.....తోఁ = పిడికిటికి తగినట్టి నడిమిభాగము కలదై, నెలవంకయైన,—ఈ తరుణియొక్క భ్రూమతీవ యనెడి వింటిని, పట్టి, (తన) పురాణ = ప్రాంత, చాపమును, విడిచిపైచుసే కాని విడువకుండఁడు—అని స. వ్యా.

విల్లు వంపదగినదికాని, చాకువలెను, ఆకువలెను మడవదగినది కాదు. వింటిని వంచుటను - 'మడచుట' యనరు. భాషలో విలువంపు-తలవంపు ఉన్నవిగాని, విలుమడత-తలమడత లేవు.

తొలుత ఋజువుగా నుండి, యెక్కు—పెట్టుటచేత వంగినవిల్లు శర ప్రయోగమునకు పనికివచ్చునుగాని, పుట్టుకతోనే వంగియుండు విల్లు పనికిరాదు. అది లక్క—బొమ్మచేతివింటివలె, వినోదముగా చూచుటకు మాత్రమే పనికివచ్చును.

కావున, 'బొమ-విల్లు' సహజముగానే వంగియుండుట నొక గుణముగా చెప్పుటయు, అట్టివింటి కాసపడి, మనోభవుఁడు తనచేతివింటిని పాఱవేయు - ననుటయు నుచితముకాదు.

అసలు, ఎక్కి—ఱుటచేత నెలవంకవలె వంగియుండు వింటితోనే పడతుకల కనుబొమలకు పోలిక. కనుబొమలను మోపెట్టిన చాపముగను, చూపులను తూపులుగను వర్ణించుట పరిపాటి.

ఉదాహరణములు.—

(1) "బొమవిలు చూపుతూపులను బూని మృగాంకునిగెల్చి."
—కసు. 2-71

గిరికయొక్క కనుబొమలు వంపఁబడిన విండ్లవలె నున్నవనియుఁ జూపులు బాణములవలె నున్నవనియు...ఫలితార్థము.—అని వ్యాఖ్య.

(2) "భ్రూచాపవల్లీం సుముఖీ, యావన్నయతి వక్రతాం
తావ త్క—టాక్షవిశిఖై, ర్భిద్యతే హృదయం మమ."

(మడవక)

'మడవక' అనునది 'మడఁచు' ధాతువుయొక్క వ్యతిరేకక్త్వార్థక రూపము కాదు. 'మడవు' ధాతువుయొక్క వ్య.క్త్వా. రూపము. (మడవు-అను క్రియకు ప్రయోగములు కనబడవు.)

'మిడవక' అనుక్రియకు,—కాదనక, తప్పక, వెనుదీయక ఇత్యాదిగా సందర్భమునుబట్టి అర్థములు.

(1) "ఏమి పంచినఁ, మడవక చేయుమీ" (భా. ఆది. 2-43)

ఇక్కడ,-మడవక = కాదనక-అని యర్థము.

(2) "మడవక కాశికా విభుని మస్తక ముద్ధతిఁ ద్రుంచి"
(భాగ. 10. ఉ. 524)

ఇక్కడ,-మడవక = వెనుదీయక-అని యర్థము.

(3) "మడవక భీమసేనుఁడును మాగధరాజు గడంగి" (,, ,,—736)

ఇందును, మడవక = వెనుదీయక-అనియే అర్థము.

శ.ర. కర్త,— 'మడవు=విముఖమగు' అని యర్థముచెప్పి,— "మడవక తనుమధ్య నిండు మనమున నుండెఁ" (భా. ఆది. 2 ఆ.) అను ప్రయోగము నిచ్చియున్నాడు.

ఒక్కొక్కయెడ, ఈ క్రియ,—గొనకొని, బలువిడి, కడుకొని-ప్రభృతులవలె-ఊతపదముగా మాత్రమే ప్రయుక్తమగుచుండును.

ఉదా:—"నీకుఁ, మడవక మాయట్టివారిమాటలు కొఅయే"
(భా. సభా. 2-190)

ఈ పద్యమున 'మడవక' అను పదమునకు ప్రయోజనము లేదు.—

ఇట్లే నైషధపద్యమునను 'మడవక' ఊతపదముమాత్రమేనని భావించుట యుచితము. కాదేని, మనోభవుఁడు ఆ పడఁతుక భ్రూలతాధనువును, మడవక = తప్పక, పట్టును (=గ్రహించును) అనియు, తన పురాణచాపమును విడుచునకొని-మానఁడనియు-నర్థము చెప్పికోవలెను.

అంతేగాని, 'మడవక=వంపనక్కు-అలేకయే' అని చెప్పుటమాత్రము తగదు.

౪. నెఱులు

"బలరామ కృష్ణ సంజ్ఞల
తెలుపు నలుపు నైన దివ్య తేజంబులతో
నిలమీఁద నవతరించిన
జలజాక్షుని నెఱులు శర్మసౌరభ మొసఁగుఁ." (8-137)

"ఇలమీఁదఁ - అవతరించిన - జలజాక్షుని = నారాయణునియొక్క నెఱులు = ప్రకారములు (విలాసములు,) శర్మసౌరభముఁ-బసఁగుఁ.— శ్రీహరికి కృతయుగమందు ధవళ వర్ణము, (కలియందు) కృష్ణవర్ణమును నియతములు. శ్వేతగణమందు 'బ్రాహ్మణానాం వర్ణో ధర్మ్మ పితర శ్చ కృతాచ్యుతః' అనియు, కృష్ణగణమందు 'కృష్ణానికేశవ సీరిచీర చంద్రాంక రాహవః' అనియు కా. క. ల."—అని స. వ్యా.

బలరామకృష్ణులు-తెలుపు, నలుపు రంగులతో పుట్టిన, నారాయణుని యొక్క నెఱులు=ప్రకారములు (విలాసములు)-అనుట సరికాదు. ఎందువల్లనగా:—'నెఱి'యను మాటకు ప్రకారము, విలాసము అను నర్థములు లేవు. ఉన్ననూ ప్రకారములకు విలాసములకు రంగు లుండవు.

శ్రీహరికి కృతయుగమందు ధవళవర్ణము, కలియందు కృష్ణవర్ణము నియతము అనిరిగదా; మరి, కలియందు - బలరామరూపహరికి ధవళవర్ణ మెట్లు కలిగెను?

ఎందు కెక్కువ చర్చ.— పై పద్యములోని 'నెఱులు' వెండ్రుకలు గాని, ప్రకారములు కావు; విలాసములును కావు.

తెలుపు నలుపు వర్ణములతో—బలరామ కృష్ణ సంజ్ఞలతో ఇలమీద నవతరించినవి - నారాయణుని తెలుపు-నలుపు వెండ్రుకలే. ఇది పురాణ ప్రసిద్ధవిషయము.

(1) "స చా పి కేశౌ బహి రుద్బబర్హ
శుక్ల మేక మపరం చాపి కృష్ణమ్,
తౌ చాపి కేశౌ నివిశేతాం యదూనాం
కులే స్త్రియా దేవకీం రోహిణీం చ,

తయో రేకో బలదేవో బభూవ
యో సౌ శ్వేత స్తస్య దేవస్య కేశః,
కృష్ణో ద్వితీయ: కేశవ స్సంబభూవ
కేశో యోసౌ వర్ణతః కృష్ణ ఉక్తః''
—భార. ఆది. 197. అధ్యా.

(2) ''యదా బ్రహ్మదయో దేవాః ప్రాగనాథం హరిం గతాః
హరిణాచ తదా దత్తౌ కేశౌ ఖలు సితాసితౌ
శ్యామవర్ణ స్తతః కృష్ణ శ్వేత స్సంకర్షణ స్తథా.''
—దేవీభాగ. 4 స్క్రం. 22 అ.

వ్యాఖ్య.— ''సితాసితావితి.—తథా చ కృష్ణ: పూర్వోక్త కేశాభ్యా నారాయణస్య అసితకేశ స్యావతార:; బలరామస్తు శేషస్య సితకేశ స్యావతార:.''

(3) సీ. ''నారాయణుండు, చెచ్చెర దన సితాసితకేశయుగమున బలరామకృష్ణరూపములఁ దనరి; యసురకులంబున *లీలమై నుదయమయ్యె.''
—భాగవతము. 2-173

పురాణములదాకా పో నక్కరలేదు. శ్రీనాథుని పద్యమునకు మూలమయిన శ్రీహర్షుని శ్లోకమును చూచినను, ఆ 'నెఱులు' కేశములే గాని, ప్రకారములు (విలాసములు) కావని తెలియఁగలదు. చూడుఁడు.

''తావ కాంపర తస్యా సితకేశ, స్త్వాం హాలీకిల స ఏవచ శేషః,
సాధ్వసా వవతర స్తవ ధత్తే,త జ్జర చ్ఛిరకాల విలాసం.''
(21-85)

౫. బడుగు - చిదిపి

''విశ్వరూప, భవ దుర్భరి విభవ మహిమ
నెంత వర్ణింపఁజాలు మీ యీ మనంబు?
ప్రాంత మ్మైనీర చెఱుగున బడుగువాఁడు
హేమశైలంబు చిదిపితా లెన్నినుడుము.'' (8-148)

---

* 'నీమై' అని వావిళ్ల-వారి ప్రతి.

"బడుగువాఁడు = ఆశకుఁడు (దుర్బలుఁడు), హేమశైలంబుఁ = మేరువును, చిదిపి = చిన్న చిన్న తొలుగా చిదియఁగొట్టి, ఎన్నితొలు ముడుచుఁ = కొంచెపాటియేని ముడిచికొని పోఁజాలఁడు" అని వ్యాఖ్య.

దుర్బలుఁడేమి? మేరుపర్వతమును చిన్న చిన్న రాలుగా చిదియఁగొట్టుట యేమి? కొండనే చిదుకగొట్టిన ఆదుర్బలుఁడు, వానిశక్తికి తగినట్లు, కొంచెమయినను ముడిచి కొనిపోఁజాలక పోవునే? అసలు, దుర్బలునికి పసిడికొండతో పనియేమి? సగర్వంకపావ్యాఖ్యసంగతము కాదు.

పద్యములోని 'బడుగు' దరిద్రుఁడుగాని, దుర్బలుఁడు కాఁడు. అందలి 'చిదిపి' (=గట్టి) విశేషణముగాని, క్రియ కాదు. అసలు పాఠము 'చిడిపి'గాని, 'చిదిపి' కాదు.

శ. ర. కర్త, 'చిడిపి = పరుషము' అని యర్థము చెప్పి, అందుకే పద్యమునే యుదాహరించియున్నాఁడు.

[మఱియు నక్కడనే, "కొన్ని జీవులు చిడిపిరాతాళ్ళకి బ్రదుకు" అను, (శృం. నై. 3-140) పద్యమునుకూడ నిచ్చియున్నాఁడు. స. వ్యా. లో 'చిడిపి'కి అర్థములేదు. 'జీవులు = ప్రాణులు, తొల్ = తొలను'— అని మాత్రమే యున్నది.]

కాఁబట్టి, 'హేమశైలంబుఁ = మేరువును, చిదిపి = చిదియఁగొట్టి' అని యర్థముచెప్పుట సరికాదు.

గట్టి పైగుడ్డయైనను లేని దరిద్రుఁడు ఆశకొలఁది బంగారుకొండకు పోయినను, ఆకొండబండ లెన్ని మూటగట్టుకొనిరాఁగలఁడు? మోయఁగలిగినన్ని కట్టుకొనివచ్చుటకైనను, వాని పైగుడ్డ ప్రొత్తది. చినుగుపట్టినది. ప్రొత్తది (గట్టిది) కాదు. అందువలన ఎక్కువరాళ్లు కట్టిన నది నిలువదు.— అని యర్థము. దరిద్రుఁడు బంగారుకొండకు పోయినను వాఁడు గ్రహింపఁగల్గునది అల్పాల్పమే; అట్లే, విశ్వరూపా, మా మనస్సు నీ భూరివిభవమహిమను వర్ణింపజాలునదియు అల్పాల్పమే—అని పద్యభావము. (చూడుఁడు 'జిత', పీఠి. పుట 29).

౬. చేపట్టు

"పట్టాంశుకములపై బన్నీరు చిలికించి
చేయూర్చి చేపట్లు సేయువారు" (6-108)

పట్టు అంశుకములపై = పట్టు వలువలమీద, ...చేయార్చి = చేతితో జాడించి తడియార్చి, చేపట్లు చేయువారు. (పిండిలు పెట్టి మడతలు పెట్టి) పిడికిటం బట్టుటకు తగినట్లుగా సిద్ధపఱుచుచున్నవారును; [ఇది మడికి పట్టు వస్త్రములను సిద్ధపఱుచుట; సీతారామాచార్యులవారు 'చేపట్లు' అనుచో 'చాఁపట్లు' అని పఠించి, చాఁపట్లు అనగా 'అప్పడములవంటి యొకవిధమయిన పిండివంటలు' అని యర్థముం జెలిపినారు. కాని, ఈ పద్యములోఁ జెప్పిన యితరములన్నియు భోజనార్థమయిన స్థలసంస్కారాదికముగా నున్నవి. — పట్టుతో చేసిన యాసనములమీఁద పన్నీరుచల్లి చేతితోతడవి చాఁపట్లవలె చదునుచేసినా రనియేని చెప్పవచ్చును. కాని, ఆసనప్రస్తావము గీతమందున్నది- కాన నీపాఠము తృప్తికరముగాదు.] అని సర్వంకషా వ్యాఖ్యా వివరణము.

(1) "పట్టాసనములపైఁ బన్నీరు ప్రోక్షించి, చెయ్యార్చి చాఁపట్లు చేయువారు" అని శ.ర. పా.

(2) "పట్టాంశుకములపై...చిలికించి...చేయార్చి చేపట్లు...వారు" అని శాస్త్రిగారి పాఠము.

రెండు పాఠములును సవరింపబడవలసినవే. ఏలనగా; —

కవి చెప్పదలచినది ఆసనశుద్ధిని; స్థలశుద్ధిని. కావున పద్యమున నుండవలసినవి 'పట్టాసనములు' గాని, 'పట్టాంశుకములు' కావు. 'చేపట్లు' గాని 'చాఁపట్లు' కావు.

చిలికించు-ప్రోక్షించు అను క్రియలు రెండును సమానార్థకములు కావున, ఏదయిన నుండవచ్చును. కవివాడిన క్రియయేదో మన మూహింప జాలముగదా! కావున, పాఠము, —

'పట్టాసనములపైఁ బన్నీరు చిలికించి, చేయార్చి చేపట్లు చేయువారు' అని యుండవలెను.

పట్టాసనము-లనగా పట్టపుపీటలు = చెక్కపీటలు.

(1) "పట్ట; ట్టం. A slab, tablet [for writing-upon] plate in general. శిలాపట్ట మధ్యయానా. S. 3" ఆప్టే.)

(2) "పట్టము=పీఁట" (శ.ర.)

చేపట్లుచేయుట-యనగా, స్థలశుద్ధిచేయుట = చేతితో అలికి ముగ్గు పెట్టుట. భోజనసమయమున పీటలపైఁ నీరు చిలికించి, తుడిచి-శుభ్రపరచి, పీటముందు చేపట్లు కావించి, దానిమీఁద విస్తరివేసి - వడ్డించుట వైదిక సంప్రదాయము.

(1) "కరగృహీతములైన పరిమళోదకములు
పలుచఁగాఁ జిలికించి-'పట్టుచేసి'
రమణీయ నవరత్న రచిత చామీకర
రచితంబులగు పళ్లెరములు పెట్టి" (నానికే. 2-218)

(2) "రారయ్యా యని శుద్ధివచ్చరణు గోత్రాదేవతాపుత్రు, వి
స్మేరాగ్నిప్రభుఁ గూర్చుండనిడి క్రమోల్ చేపట్లుగావించి, నీ
రారం బండిన ప్రాతఁరాజనపుదివ్యాన్నంబు నొక్కింత వా
ర్ధారాశాతముగుండ *మూర్చి యొసఁగెఁ రంభాపలాశంబునఁ.
—పాండు. 4-168 (శ.ర. పా.)

(3) "మాపట్టఁగ గోమయమునఁ, జేపట్టొనరించి" (శుక. 2-88)

చేపట్లు కావించుటను శ్రీనాథుడు హరవిలాసములోకూడా వాడి యున్నాడు.

(4) "చెలువ గొజ్జఁగినీటఁ జేపట్లుగావించి,
పాటించి రత్నకుబళము పఱచి" (హర. 2-213)

---

* 'యూడ్చి' అన్యప్రతి.

చేపట్టుకొవించుటనే 'పట్టుపెట్టుట' యందురు.

"పట్టుపెట్టుట-To prepare a spot for performing religious rites" (బ్రౌణ్యము.)

భోజనశాలయందు స్త్రీలుకొందరు, పట్టాసనములపైకి = పట్టపు పీటలమీద, పన్నీరు చిలికించి, చేయార్చి = చేయూడించి (= తుడిచి), ఆ పీటలముందు, చేపట్టుచేయువారు అయిరి - అని నైషధపద్యపాదమునకు సరియైన యర్థము.

పట్టుబట్టలను పన్నీట దడిపి మడతలుపెట్టుటతోగాని, చాపట్లు చేయుటతో గాని,అందు ప్రసక్తి లేదు. పట్టుబట్ట నెవ్వరును తడిపి కట్టుకొనరు.

చేయార్చి - అను మాటకు, చేయూడించి - అని యర్థమగునేగాని,- చేతితో జూడించి తడియార్చి - అనికాదు. కావున ఆటీక చెల్లదు.

౭. ఝంకారితము

"కలహంసంబు...ఝంకారిత పత్త్రి ధారా విహారంబుగ గోడి వడి డిగ్గునప్పుడు" (2-35)

ఝం...బుగాకి = 'ఝమ్' అనుశబ్దము చేయింపఁబడిన తెక్కలయంచులయొక్క లీల కలుగునట్లుగా (తెక్కల కొనలచేలీలగా 'ఝమ్' అని శబ్దము చేయించుచు)'అని స.వ్యా.

'శబ్దము చేయింపఁబడిన తెక్కలు'-- అను వాక్యము (కొబ్బరి మొక్కలు పాతిపెట్టింపఁబడిన తాతగారు--అన్నట్లు) తప్పు.

'ఝం = ఝమ్ అను శబ్దము, కృత = చేయింపఁబడిన, పత్త్రి = తెక్కలయొక్క' అని యర్థము చెప్పుట సరికాదు.

'త దస్య సంజాతం తారకాదిభ్య ఇతచ్' అను సూత్రముప్రకారము 'ఝంకార' శబ్దముమీఁద 'ఇత'(చ్) చేరి,యేర్పడినరూపము 'ఝంకారితము.' తారకిత కోరకితముల వంటిది.

"వ. వసంత సమయ సౌభాగ్య సంపదంకురిత పల్లవిత కోరకిత కుసుమిత ఫలిత లలిత విటప విటపి పీరు న్నివహాంకృతము" (భాగ.8-24)

పల్లవిత = చిగిర్చిన, కోరకిత = మొగ్గదొడిగిన—ఇత్యాదిగాఅర్థము.

అల్లే, గూంకారిత = గూంకారముగల (గూంకరించుచున్న) పత్రక = తొక్కలు' అని సరియైనయర్థము.

గూలశ్లోకవ్యాఖ్యానము చూచినవారి కీయర్థ మొకరుచెప్ప నక్కర లేదు.

"*స్యదగూంకారిత పత్ర పద్ధతిః —(2-70) స్యదేన పత్ర్రవేగేన గూంకారి గూమ్ ఇత్యాకారకశబ్దం కుర్వతీ పత్ర్రపద్ధతిః గూంకారితేతి తారకాదిత్వా దితచ్. (నారా. వ్యాఖ్య.)

ర. జ్యోత్స్న

తే॥ జ్యోత్స్న నాఁగఁ దమిస్ర నా నుభయభార్య
లుడుపతికి; నందు నొకతె చె,ల్వొర్తు నలుపు;
తాను వారికి మెచ్చుగాఁ దాల్పఁబోలుఁ
దెలుపు నలుపును నగు మేను నెలఁత, యితఁడు. (8-184)

"'ఓ నెలఁత, ఉడుపతికిఁ = చంద్రునికి, జ్యోత్స్న = వెన్నెల (చన్దికా కౌముదీ జ్యోత్స్నా' అమ.) నాఁగఁ = అనియు, తమిస్ర= చీకటి రాత్రి ('తమిస్రా తామసీ రాత్రిః' అమ.) నాఁ = అనియు... ఊహ్యోక్తి." అని సర్వంకషవ్యాఖ్య.

చంద్రునికి ఒకభార్య 'వెన్నెల' అనియు రెండవభార్య 'చీకటిరాత్రి' యనియు వ్యాఖ్యాతలుచేసిన అర్థము. ఒకభార్య 'వెన్నెల' అయినప్పుడు రెండవది 'చీకటి' కావలెగాని చీకటిరాత్రి యెట్లగును? చీకటిరాత్రికి సవతికాదగినది వెన్నెలరాత్రిగాని, వట్టి వెన్నెల యెట్లవును? మహాకవి యైన శ్రీహర్షుడు చీకటిరాత్రికీ, వెన్నెలకూ లంకె వేసి, విజ్ఞుడు

---

* 'స్యదగూంకారి పత్రిపద్ధతిః' అని తెనుగులిపి—'వావిళ్ల' వారి ప్రతి. 'స్యదేన వేగేన గూంకారిణీ గూ మితి శబ్దం కుర్వాణా పత్రతి పద్ధతిః పక్షిసరణిః'—అని మల్లినాథ వ్యాఖ్య.

సాపత్న్యమును కూర్చియుండునా? అని నా సందేహము. అయినను చూతమని మూలమును తీసి చూతునుగదా అందులో ఇట్లున్నది:

"గౌరే ప్రియే భాతి తమాం తమిస్రా
జ్యోత్స్నేచ నీలే దయితా యదస్మిన్,
శోభాప్రిలోభా గుభయోస్సయోర్వా
సితాసితాం మూర్తిమయం బిభర్తి" (22-97.)

చంద్రుని కొకభార్య 'తమిస్ర' యనియు, రెండవది 'జ్యోత్స్న' అనియు మూలమున సరిగానే యున్నది. 'జ్యోత్స్న' యనగా వెన్నెల రాత్రి. 'జ్యోత్స్న చంద్రికయాన్వితా-రాత్రిః' అని అమరము.

మరి తెనుగువ్యాఖ్యాతలు తప్పర్థము వ్రాయుటకు కారణమేమనగా.- శ్రీనాథుడు, జ్యోత్స్న (=వెన్నెలరాత్రి) యన్న యర్థమున, 'జ్యోత్స్న' అను పదమును వాడినాడు. జ్యోత్స్న-యను పదమునకును, వెన్నెల రాత్రి-యను నర్థమున్నది.

'జ్యోత్స్న చంద్రిక యాన్వితా' అన్న పంక్తిక్రిందనే, అమర కోశమున,—'జ్యోత్స్నే త్వాకాశాంత పాథో ప్యస్తి' అని తెలుపబడి యున్నది.—"జ్యోత్స్న-కు 'వెన్నెలరాత్రి' యన్న యర్థము శ.ర.లోను ఉన్నది.

శాస్త్రిగారు, పద్యభావమును, జ్యోత్స్నా శబ్దార్థమునుగూడ సరిగా గమనింపలేదు. అందువలన వారుచెప్పిన యర్థము తప్పయినది.

౯. ఉరి

"ఇందుముఖుల, కురులు మరుఁడను వేటకాఁ డురులనేసి" (3-90)
'ఉరులు = వలలుగా' అని శాస్త్రిగారి టీక.

'ఉరి' యనగా 'ఉచ్చు' (Noose) గాని, 'వల' (Net) కాదు.

"ఉచ్చునా నురి యన నొప్పుచుండుఁ, బక్షిబంధనసంజ్ఞ" (ఆం.భా. 2-293) లోకములో 'ఉరిశిక్ష' కలదుగాని 'వలశిక్ష' లేదు. కాబట్టి, 'ఉరులు = వలలు' అనుట పొరపాటు.

౧౦. కోపాగ్ని

"హరుని కోపాగ్నిఁ బొగమారి మరుని చూప
మసితకేసరపరివేష మైనవాఁడు." (3-161)

"హరుని (శివుని), కోప అగ్నిక్ = కోపముతోడి నిప్పచే" అని స.వ్యా.

'కోపాగ్ని' యనఁగా కోప మనెడి యగ్ని(రూపకము)గాని, కోపము తోడి యగ్ని (అని తృ. తత్పురుషము) కాదు.

కోపాగ్ని = కోపముతోడి యగ్ని; వియోగానలము = వియోగము తోడి యనలము; ముఖకమలము = ముఖముతోడి కమలము—అని యర్థము చెప్పుట యొప్పదు.

౧౧. మరుకీర్తి

"కిన్నరకంఠి యోర్తు మరుకీర్తియుఁబోని పటీరపంకముక్
విన్నను వొప్పఁగా నలఁదె." (6-50)

కిన్నరకంఠి = కిన్నరుల కంఠమువంటి కంఠముకలది.—మరు... ముక్ = (నలునియవయవములకు) "మదనసుందరుఁడను కీర్తియనఁదగినట్టి గంధపుఁబూఁతను,...అలఁదెక్ = పూసెను" అని స.వ్యా.

మరుకీర్తి = మరునియొక్క కీర్తి. ష.త.సమాసము.— కాబట్టి, మరుకీర్తి యనగా-'మదనసుందరుడనుకీర్తి' యనుటయు,-నలుని యంగములకు పూసిన గంధము—'ఈ నలుఁడు మదనసుందరుఁడు-అను-కీర్తి-అనఁదగినది' యనుటయు సరికాదు.

మన్మథుని కీర్తినిపోలిన, (పటీరపంకమును=)గంధమును, అలఁదెక్- అని యర్థము చెప్పవలెను. గంధము తెలుపు గావున కీర్తితో పోలిక. మన్మథోద్దీపకము గావున మరుకీర్తితో పోలిక.

పటీరపంకముక్ = గంధపుఁబూఁతను- అనుట తప్పు. 'పటీరపంక' మనగా గంధమేగాని 'పూఁత' కాదు.

శబ్దవిచారణ

౧. ఎడఁబాపు

(1) 'భవద్వియోగకలుషత = నీతోడి యెడఁబాపుచేతఁ గలిగిన చిత్తకాలుష్యము కారణంబుగా' (పు. 309)

(2) 'కొంగుముడి యనఁగా వధూవస్త్రాంతముతో వరవస్త్రాంతమును ముడివేయుట-ఎడఁబాపు కలుగకుండుటకై యీ కర్మాంగము' (పు. 522)

(3) 'తిమిర విరహ పాండూయమాన దిఙ్మండలంబును = నీఁకటి తోడి యెడఁబాపుచేత తెల్లనగుచున్న దిక్కులసమూహము కలదియు.' (పు. 651)

(4) 'తత్ వియోగమున = అంత యనుర క్తలయిన యీ భార్యల తోడి యెడఁబాపుచేత' (పుట. 657)

ఇట్లు వారు 'ఎడఁబాపు'ను విశేష్యముగా పలుమారు వాడి యున్నారు. విశేష్యము - 'ఎడఁబాటు' గాని, 'ఎడఁబాపు' కాదు. 'ఎడఁబాపు' ప్రేరణక్రియ. ఎడఁబాయఁజేయు-అని యర్థము.

(1) "ఎడబాపుట To cut off or dis-continue" (బ్రౌను.)

(2) "ఎడఁబాపు = ఎడఁబాయఁజేయు.—ఎడఁబాటు = వియోగము" (శ. ర.)

(3) "ఎడఁబాపు = తొలఁగించు, తీర్చు" (సూ. ని.)

'ఎడఁబాటు' అను విశేష్యరూప మున్నట్లు శాస్త్రిగారు గమనించి నట్లే లేదు. వారు తమవ్రాతలలో సర్వత్ర 'ఎడఁబాపు'నే వాడియున్నారు. చూడండి.

(1) "దార వియోగజ వహ్నిక. దార = భార్యతోడి, వియోగ = ఎడఁబాపువలన, జ = పుట్టిన, వహ్నిక = చిచ్చును" (ఆము. పు. 394)

(2) "నాతోడి యెడఁబాపు కలిగిన దినమందె" (మే.సం.పు. 192)

(3) "కూటమియే ఎడఁబాపు గలుగునని సూచించును." (హితోప. పు. 112)

శాస్త్రిగారు, 'మాయు'నకు 'మాపు'వలె,— 'ఎడఁబాయు'నకు, 'ఎడఁబాపు'-కృద్రూపమునుకొనిరేమో! బా. వ్యా. (క్రి. 8౬)లో- పాయు- అను క్రియకు, పాచు; పాపు - అనునవి ప్రేరణరూపములని చెప్పబడి యున్నది.

౨. తోఁటమాలియ

పు. 56 లో,-'దోహదము తోఁటమాలియలు చేసినంగున'--'తోఁట మాలెలు దాడిమవృక్షమునకు...పొగను పట్టింతురు' అన్నారు.

చెట్లకు దోహదముచేయువాడును, పొగను పట్టించువాడును 'తోఁట మాలి' గాని, 'తోఁట-మాలియ' కాడు; 'తోఁట-మాలె'యును కాడు.

"తోఁటమాలి రాముఁ డెంత పాటుపడునో చూడరా"

అని రెండవతరగతి వాచకపు స్తకమున నొకపాట. తోఁటమాలియ, తోఁట మాలె-అను రెండుపదములకును-ఆకులు పువ్వులు కూర్చి కట్టిన దండ, వన మాల-అనియర్థము. ఆ రెండుపదములకును, తోమాలియ-తోమాలె అనునవి రూపాంతరములు. (చూ. శ.ర.)

మాలి, మాలియ (=మాలె) అను పదములకుగల రూపసాదృశ్యము వలన సరిగా గుర్తింపలేక శాస్త్రిగారు పొరపడ్డారు.

వారిట్లు పొరపడిన తావు లింకను గలవు. ఒక కొన్ని ఉదాహరిస్తాను.

(1) దెప్పరము

(1) శృం.శై. పు. 234 లో,-"నీవు శ్రుతితో సమానురాలవా? అని దెప్పరము"—అన్నారు.

(2) 'ఆముక్త'లో,—"ముక్తా, రాట్కంఠీరవమై యొనర్చె వడి సోణాలంట భూణాచ్ఛిదక్" (5-50) అన్నచోట,—

"రాట్కంఠీరవము-ఇది దెప్పరము. ఆతని గొప్పతనమునకు ఆ పని యనుచితమని భావము" అన్నారు.

(3) ఆముక్తమాల్యద, పు. 108 లో,— "నీవు నీయందలి యితర సంభోగచిహ్నములను ఎట్లపలపించినను నీ మోవికొటులు...బయలుపెట్టుచున్నవి సుమా-అని డెప్పరము" అన్నారు.

'నీవు శ్రుతిలో సమానురాలవా?' అనుటయు,—అనుచితకార్యము చేసినవానిని 'రాట్కంఠీరవ' మనుటయు,—'నీ మోవికొటులు బయలుపెట్టుచున్నవి సుమా' అనుటయును 'డెప్పుట' యగును గాని 'డెప్పరము' కాదు.

డెప్పుట యనగా—ఎత్తిపొడుచుట.

డెప్పరము—అనగా ఆపద, కష్టము, కీడు, దుస్సహవాక్యము ఇత్యాదిగా అర్థములు.

(1) "డెప్పరమై మీఁదఁ గీడు డెచ్చుర సుమతీ" (సు. శ.)

(2) "ఉప్పరపీడికిఁ డెప్పరంబుగా నెగసి" (భాస్క. యు. 1946)

(3) "ఇమ్ముడెప్పరంబై (ఆము. 4-35)='తమ యొంటి నివాసస్థానము-ఆపత్ప్రాప్తమై'-అని వేదం-వారిదే టీక.

డెప్పుట; డెప్పరము-అను పదములకు బ్రౌను ఇట్లు అర్థము చెప్పియున్నాడు.

"డెప్పుట To taunt, quiz, gibe at, slander, డెప్పుడు మాటలు, Sarcasm." - "డెప్పరము-కీడు; కష్టము Difficulty, distress."

కాబట్టి డెప్పుటను - 'డెప్పర' మనుట తప్పు.

(2) మనికితము

హితోపదేశచంపువు (పు. 53)లో,—

"ఈ రహస్య మెఱిఁగి యెడలకే యుండును
మతిగలాఁడు తనదు మనికితంబు"—అన్నారు.

'ఇతి విజ్ఞాయ మతిమాఁ స్వస్థానం న పరిత్యజేత్' అని ఆ పద్య మునకు మూలము.

స్వస్థానమును 'తనదు-మనికిత' మనుట తప్పు. స్థానము-'మనికి' గాని, 'మనికితము' కాదు. 'మనికిత' మనగా దుఃఖము. (చూ. వివరములకు 'జిత కాశి' పీఠిక. పు. 40)

ఒక్క ప్రయోగము.—

"కనుసన్నల పరిజనములు
దనకుం బ్రియమైన సంవిధానము నడపన్
బెనుపొందిన దీ పిన్నది
మనికితపడనీకుఁ డమ్మ మనసున దీనిన్" (నాసి. 1-226)

(3) పురణించు

శాస్త్రిగారు,-పురుడించు (= పోలు) అను క్రియకు బదులుగా—పురణించు (వర్ధిల్లు) అను క్రియను అనేకపర్యాయములు వాడియున్నారు. తప్పు. (చూ. జి. పీ. పు. 43)

(4) కరుళ్లు

(1) శృం.నై. (ఆ-ఐ)లో—"కరుళ్లచప్పుళ్లు. కరుళ్ల=కరడముల యొక్క-చప్పుళ్లు" అని సం. వ్యా.

(2) ఆము క్త. (1-19)లో,—"గర్భపీచిమతల్లి.-పీచిమతల్లి=శ్రేష్ఠమైన కరుడు" అని సంజీవనీవ్యాఖ్య.

(3) 'విజ' (2-19)లో,—"తెరయెత్తన్=(ప్రేమ అను సముద్రము) పొంగి *కరుళ్లెత్తఁగా" అని శాస్త్రిగారి టీక.

అల-యను నగమునిచ్చు పదము 'కరడు' గాని 'కరుడు' కాదు. కరుడు అనగా, గట్టిపడినముద్ద.—

---

* బులుసువారును,-"తెరయెత్తన్=పొంగి కరుళ్లెత్తఁగా" అనియే అన్నారు.

ఇట్లు వేదంవారి టీకనుండి బులుసువారి టీకలో ప్రవేశించిన ప్రమాదము లనేక మున్నవి. వాని నన్నిటిని చూపబూనినచో, అది యొక పెద్ద గ్రంథమగును. కావున నూచించి వదలుచున్నాను.

"కలసి శుక్లశోణితములు కరుడుగట్టి" (భా. స్త్రీ. 1-36)

కాబట్టి, తరంగ పర్యాయముగ 'కరుడు; కరుళ్లు' అనుట తప్పు. ("కర డనఁ...దెరయనంగను పీచి పరఁగును" (ఆం.భా. 1-154)

(5) 'దొమ్మరిది'

శృం.నై. (పుట 425)లో 'లాసిక = దొమ్మరిది'. —'దొమ్మరిది ముందుగా నేలలో విత్తులు చూపి'; — 'కీర్తి యనెడి దొమ్మరిది' అని, దొమ్మరిదానిని 'దొమ్మరిది' అని ముమ్మా రన్నారు.

అట్లనరాదు. 'దొమ్మరది' అనవలెను.

'దొమ్మర'-జాతి. ఆ జాతి పురుషుడు దొమ్మరవాఁడు; దొమ్మరి; దొమ్మరీఁడు.—

"వెలయు దొమ్మరి యన లఘువిద్యవాఁడు" (ఆం.భా. 2-287)

శ.గ.లో,—"దొమ్మర = గడకట్టియాడి జీవనముచేసెడి యొకానొక జాతి. (దొమ్మరవాఁడు. దొమ్మరది.)—దొమ్మరి (దొమ్మర + ఇ)= దొమ్మరవాఁడు"—అని చెప్పబడియున్నది.

ఇట్లే, *కాఁపది (కాఁపు + ఆది) = కాఁపుజాతిస్త్రీ.—

"చొ,క్కటపు టొయారమారఁ గని కాఁపది మోహమునిల్పలేక"

హంస. 7. 148

---

* సూ.ని. కాఁపుది; కాఁపది—అను రెండుపదములకును, శూద్ర జాతిస్త్రీ -- అని యర్థముచెప్పి,—

"కాఁపది యనఁదగునా యది
కాపదియార్వన్నెలరు కనకముఁ బుటముల్
కాఁప దిగిన డాల్పరితిమ" (ఉ.హరిశ్చ. 4-33)

అను పద్యమునిచ్చి, 'ఆ కాఁపుది చాల యోగ్యురాలు (వ్యవ)'—అన్నది.

పద్యమననున్నది 'కాఁపది'గాని, 'కాఁపుది'కాదు. 'కాఁపుది' అను పదమున కా పద్యము ప్రమాణ మెట్లగును? విస్తర మెందుకు: కాఁపుది-

ఆ జాతి స్త్రీ-యన్న యర్థమున కమ్మరది; కుమ్మరది; ఉప్పరది; చాకలది; మంగలది;—అనవలెను. ఈ తత్వమును గమనింపనివారు,—కమ్మరిది; కుమ్మరిది; ఉప్పరిది; చాకలిది; మంగలిది అందురు.

(6) 'ఉప్పరలు'

ఆ శాస్త్రులవారే తమ గ్రామ్య భాషాప్రయోగనిబంధనము (పు.13)లో 'చెంచులు, గొల్లలు,...ఉప్పరలు' అన్నారు.

ఉప్పరలు-అనుట సరికాదు. 'ఉప్పర' జాతివాచకము. ఆ జాతి వాఁడు 'ఉప్పరి',

(1) "పరఁగుఁ గుడ్యాదికారి యుప్పరి యనంగ" (ఆం.భా. 2-285)

(2) "ఉప్పర = త్రవ్వియు గోడలు పెట్టియు బ్రదికెడు జాతి.—
ఉప్పరి = ఉప్పరవాఁడు, ఖనకుఁడు." (శ.ర.)

(3) "ఉప్పర The name of the mining caste: who are tank diggers and makers of wells. ఉప్పరవాఁడు, A man of this caste. ఉప్పరది, Female of the same. ఉప్పరవాండ్లు or ఉప్పరీలు." (బ్రౌను)

కాఁబట్టి 'ఉప్పరులు' అనవలెను.

సంస్కృతశబ్దములను గుర్తించుటలోను ఆంధ్రమల్లినాథులు ప్రమాదపడ్డ పట్లున్నవి.—

(1) 'కూర్చి'

శృం.నై. (పు. 372)లో,— 'పవిత్రములు కూర్చి లోనగు దర్భమయములం జేయునపుడు'-అన్నారు.

యనగా, కాఁపువానిది-యని యర్థముగాని-కాఁపుజాతి స్త్రీ-యని యర్థము కాదు.

ఆ చేను కాఁపుది. ఆ పిల్ల కాఁపది. అనుట గ్రాంథికమయిన భాష. 'ఆ కాఁపుది చాల యోగ్యురాలు' అని, సూ.ని. యుదాహరించిన 'వ్యవ' వ్యావహారికమేగాని గ్రాంథికము కాదు. ఆ వ్యవహారమును ప్రమాణముగా గ్రహించుట గ్రాంథికనిఘంటువయిన సూ.ని.కి చెల్లదు.

దర్భమయ మయినది 'కూర్చము'; 'కూర్చ' అగునేగాని 'కూర్చి' కాదు.

(1) "కూర్చము. (అ. పుం. న.) దర్భపిడికిలి" (శ.ర.)

(2) "కూర్చము=భ్రూమధ్యే, శ్మశ్రుణి, గడ్డము మీసాల వెంట్రుకలు, దెండాకుచ్చు, కుశే, కైతవే, పీఠే." (వైజయంతి)

(3) "కూర్చఃకూర్చమ్ A handful of kusa grass." (ఆప్టే)

(4) "కూర్చము (అ.పుం.న.) కుశముష్టి, పిడికెడు దర్భలు" (సూ.ని.)

(2) 'కరకా'

'యురి నచ్ఛాంబువుక్రింద జీర్ణకరకాంశ్రాతముల్ గానవొ.'
(నాగా. పు. 9)

'జీర్ణకరకా అంశ్రాతములు = పగిలిన కమండలువులయొక్క ముక్కల సమూహములు' అని వారిదే టీక.

కమండలువు అనే యర్థమున కరకశబ్దము పున్నపుంసకములలోనే కాని స్త్రీలింగమున లేదు.

(1) 'కమండలౌ చ కరకః' (అమరము)

(2) 'కరకః పక్షిభేదే స్యాత్ కమండలుకరంకయోః
కరకదాడిమయోః పుంసి స్త్రియాం మపి ఘనోపలే.'
(విశ్వప్రకాశము.)

(3) 'కరకః కరకం వా పానీయభాజనమ్' (హర్షవర్ధనుని లింగానుశాసనము.)

(4) 'కరకః కరకం. The water pot (of an ascetic). The shell of the cocoanut (used) as a pot.' (ఆప్టే.)

(5) 'ఉపానహౌ చ, వాసశ్చ, ధృతమన్యైర్న ధారయేత్,
ఉపవీత మలంకారం స్రజం కరక మేవ చ.' (మనుస్మృతి.)

కరకం = కమండలువును, అని యర్థము.

3. 'నాలిగింటిని'

'నాలుగింటిని' అను పదమును, ఆ శాస్త్రిగారు తను గ్రంథములలో పలుమారు—'నాలిగింటిని' అని వాడియున్నారు. చూడండి.—

(a) ఆంధ్రప్రసన్నరాఘవ విమర్శలో,—

(1) 'నాలిగింటిని నాలుగు స్వతంత్రవాక్యములుగా' (పు. 120)

(2) 'పీనిని నాలిగింటిని' (పు. 151)

(3) 'ఈ నాలిగింటిలో' (,,)

(4) 'కడమ నాలిగింటి వలెనే' (,,)

(b) భోజచరిత్రలో,—

(5) 'చతుష్టయమే = నాలిగింటిని' (పుట. 119)

(c) మేఘసందేశములో,—

(6) 'నాలిగింటిలో కడపటి మూఁడును' (పీఠిక, పుట. 20)

అసలు శబ్దము 'నాలుగు' గాని 'నాలిగు' కాదుగదా! "టి-తి-నరం బులు పరంబు లగునపుడు, వానికిముందున్న ఉత్వమున కిత్వ మగు" నన్న (బా.వ్యా. ఆచ్చిక. 36) సూత్రముప్రకారము 'నాలుగు' లోని 'గు' - 'గి' యగును. అంతేగాని, 'లు' - 'లి' కాదు. అందువల్ల, నాలుగిటిని; నాలుగింటిని—అను రూపములేగాని, 'నాలిగిటిని' - 'నాలిగింటిని' అను రూపములు పుట్టవు.

ప్రాచీన కావ్యములలోను, నిఘంటువులలోనుగూడా 'నాలుగిటిని' అను రూపమే కనబడుచున్నది.

(1) "అధిప యూపాషధముఖ్యంబులైన నెలలు
నాలుగింటను మాంసంబు నమల కుడుగు
టాయురారోగ్యబలకీర్తు లను ఫలములు
నాలుగింటిని నిచ్చు నన్నరుని కంద్రు" (భార. ఆను. 4-301)

(2) "ఘోటకమ్ముల నాలుగిట నోనేసి" (భీష్మ. 3-19)
(3) "తురగముల నాలుగిట్లు ను, ర్వరు నాఱిట" (విరా. 5-103)
(4) "నాలుగింటను వెండియు నాలుగింట" (శాంతి. 4-222)
(5) "నఱకె శితశరముల నాలుగింట" (కర్ణ. 2-356)
(6) "ఓలి విశ్రాంతి పద్నాలుగింట" ('గిడుగు'-ఆప్ప. 4-304)
(7) "నాలుగింటికి మిత్రేంద్ర నైనతాంబులు" (ఆప్ప. 2-285)
(8) "ఎనిమిదింటను పసునాలుగింట యతులు" (సుల.సా.పు. 42)
(9) "వదనములు నాలుగింటికి వరుసఁగలియ" (కళాపూ. 5-341)
(10) "కొనకొనంగోడి యేట్రింత కొంకసక్క
నమలి యీ నాలుగిటి దర్భనంబు లెస్స."
(వే.ప్ర.క్రీడా. పుట 17)
(11) "ఈ నాలుగింట నొక్కఁడేని" ('గిడుగు'-నీతిచంద్రిక.పు. 61)
(12) "బుద్ధి = అంతఃకరణపృష్ఠులు నాలుగింటిలో నొకటి.—
(13) ఆన్వీక్షకి = రాజవిద్యలు నాలుగింటిలో నొకటి." (శ.ర.)

ఇంతయేల? బొ.వ్యా.లో నే,— 'నాలుగు + టి = నాలుగిటి' యని చెప్పబడియున్నది. కొబట్టి 'నాలిగిటిని' అను రూపము లక్ష్యలక్షణ విరుద్ధము. కాని 'నాల్గిటిని'— 'నాల్గింటిని' అనవచ్చును.

ఆది యెట్లనగా:— బొ.వ్యా. ప్రకీ. 67 వ సూత్రము ప్రకారము నాలుగు-'నాల్గు' అగును. నాల్గు + టి = నాల్గిటి యగును. 'ల్గు'లోని లకార గకారములు వేరగుచో 'నాలుగు' అగునేగాని 'నాలిగు' కాదు. కనుక 'నాలిగిటి' అను రూపము పుట్టదు.

౪. 'ఉరిఁబోసికొనుట'

"అనలోద్బంధన వారిమజ్జన విధా వ్యాపార పారీణతన్" (పు. 327)

"అనల-ఉద్బంధన = అగ్ని (ప్రవేశము), ఉరిఁబోసికొనుట" అని సం.వ్యా.

'ఊరిపోయు' (ఊరివోయు) అనునది శబ్దప్రల్లవక్రియ. కావున 'ఊరింబోసికొనుట' అనుట తప్పు. (చూ. 'సమీక్ష' పు. 59)

''ఊహ్యపూర్వంబుల నురివోసిన ట్లవి'' (భా. శాంతి. 4-40)

ఒక్కొక్కచోట వారు ప్రయోగించుక్రియలు భాషా సంప్రదాయ విరుద్ధములుగనే గాక హాస్యభాజనములుగా కూడా ఉండును. మచ్చు కొక్కటి. —

'ఓండ్రరచించు'

హితో. చంపువు (పుట 95) లో 'గాడిద ఓండ్రను రచించిన' దన్నారు.

గాడిద ఓండ్రపెట్టుటయు, ఒక రచన యగునా? రచన యనగా నేమి? ప్రతిభతో ప్రయత్నపూర్వకముగా నేర్పుమెయి కావించు పని. (కావ్యరచన; చిత్రరచన; మాలారచన; - మొదలయినవి.) అంతేగాని, ఓండ్రపెట్టుట; మొఱుఁగుట; మ్యావ్-అనుట, రచనలు కావు.

'గాడిద ఓండ్రను రచించెను'
'కుక్క భౌభౌను రచించెను'
'పిల్లి మ్యావ్‌ను రచించెను'
'ఆవు అంబాను రచించెను'

అన్న కవులు పూర్వులలోగాని ఇప్పటివారిలోగాని కలరా? 'రచన'కు నిఘంటువులు చెప్పినయర్థము లిట్లున్నవి.

(1) ''రచన=మాల్యాదినిర్మాణము; రచనము=నిర్మాణము. (శ.ర.)

(2) ''రచన-Making, composing, arranging, preparing, decoration, dressing of the hair. Stringing flowers, weaving wreaths: the arrangement of troops. Literary composition. చేయుడము, పుష్పమకరికా పత్రాదిరచన, దండలుకట్టడము మొదలైనది. గద్యపద్యాదిరచన, కవిత్వముచెప్పడము.—'ధారుణినట్టి విచిత్రసభారచనలు వినగ జూడబడ దెవ్వరికిన్' భారతము.'' (బ్రౌను.)

అలంకార విచారణ

౧. విరోధాభాసము

"అనుచుఁ సారథి సార సారణికి నెయ్యంపుం జెలిం బోని తి
య్యని వాక్యంబున బోటి భీమసుత మా తై యేర్పడం బల్కినఁ
మన మాహ్లాదము బొందుచుండఁగను భూనాథుండు గంభీరతఁ
వినఁ డయ్యెఁ సురరాజకార్యఘటనా విఘ్నంబు వాటిల్లుటఁ."
—(4-102)

"అనుచుఁ-బోటి, దమయంతీ ప్రతినిధిగా, తేనెయొక్క-శ్రేష్ఠాం
శమయొక్క- చిటుతయేటికి-ప్రియసఖివంటిదైన—తియ్యని వాక్యంబు
నఁ,...పల్కినఁ = చెప్పఁగా,...పాటిల్లుటఁ = సంభవించుటచేత.—
[ఆహ్లాదకరమైనను వినమి విరోధము, సురకార్యవిఘ్నముచే సమాధానము,
విరోధాభాసము.] అని సర్వంకషావ్యాఖ్య.

దమయంతి వాక్యము ఆహ్లాదకరమైనను విన్నచో సురకార్యము
విఘ్నమగునన్న భావమున (నలుఁడు) వినలేదు.-అన్నప్పుడు, ఆ వినమికి,
సురకార్యము విఘ్నమగుటన్న భావము కారణముగాని 'సమాధానము'
కాదు. వినమి 'విరోధము'ను కాదు. ఈ వాక్యమున విరోధాభాసాలంకార
మున్నదనుట పొరపాటు.

ఆశాస్త్రిగారు, విరోధాభాసాలంకారమును వివరించుటలో, సారంగ
ధర - టీకలోను ప్రమాదపడియున్నారు. (చూ. 'జితకాశి' పు. ౧౪౪)

౨. యథాసంఖ్యము

"ఉపలములకంటెఁ గఠినమ్ము లొక్క- వేళఁ
గుసుమములకంటె నొకవేళఁ గోమలములు
గాన లజ్జాభయంబులు గలవొ? లేవొ?
పువ్వుఁబోఁడుల హృదయంబు లెవ్వఁ డెఱుఁగు" (7-162)

"కలవో లేవో-దీనికిపూర్వపాదములతో యథాసంఖ్యాలంకారము" అని, స.వ్యా.

"దీనికి పూర్వపాదములతో యథాసంఖ్యాలంకారము" అనఁగా అర్థమేమో నాకు తెలియలేదు. ఈ పద్యములో యథాసంఖ్యము లేనే లేదు. ఉన్నట్లు ఆంధ్రమల్లినాథులు భావించినారు.

3. విశేషోక్తి

"ఆమోదాశ్రుభరంబు వెల్లిగొన నెట్లాలించుఁ గర్ణంబులఁ..... పన్నగస్వామిని, యుద్ధామప్రౌఢిని వీనికీర్తి ఘణభృత్కాంతామణుల్ పాడఁగఁ." (5-137)

"నాగకాంతలు కౌలింగునికీర్తిని పాడినప్పుడు పన్నగస్వామి గాన రసజ్ఞుఁడయ్యును, కనులందు ఆనందపూరము వెల్లువ పొడువఁగా - చెవులతో - నెట్లాలించును? అనఁగా వినలేడనుట.—ఇట రసగ్రహణ రూప ప్రమ్మలకారణ మున్నను శ్రవణ...రూప కార్యము జనింపనందున విశేషోక్తి" అని వ్యాఖ్య.

కర్ణంబులఁ ఆమోదాశ్రుభరంబు వెల్లిగొన - నెట్లాలించుఁ- అను శ్రీనాథుని రచనకు,—ఆలింపఁజాలఁడు; కావున, ఆమోదాశ్రువులను వహింపఁడు.—అని యర్థము.

అంశేగాని 'వినఁడే వినఁడు' అని యర్థము కాదు. ఈ పద్యమున విశేషోక్తి-యను సలంకార మున్నదనుటయును పొరపాటే. (వివరములకు చూ. 'జీత.' పీ. పు. 37)

ఆముక్తమాల్యద ; వ్యాఖ్యానములు

*ఆముక్తమాల్యద ప్రతిభావంతులగు పండితులకు సైతము సులువుగా కొరుకుపడని గడుసు కావ్యము. ఆ

---

* ఈ వ్యాసములోని కొన్ని యంశములు 1942 లో శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారి జన్మదినోత్సవసన్మానసంపుటములో ప్రకటితమైనవి.

కావ్యమునకుగల వ్యాఖ్యానములు రెండు. వావిళ్ల రామస్వామిశాస్త్రిగారి 'రుచి' మొదటిది; వేదము వేంకట్రాయశాస్త్రిగారి 'సంజీవని' రెండవది:—'రుచి'కంటెను 'సంజీవని' ఆకారముచేత చాల పెద్దది. వావిళ్లవారి మూలమూ వ్యాఖ్యానముకూడా దోషభూయిష్ఠములుగా నున్నందున వేదమువారు 'సంజీవని'ని వెలయించినారట. ఆ విషయమును వారీ క్రిందివిధముగా వక్కాణించినారు:—

'గ్రంథమునకెల్ల జీర్ణోద్ధారమే కావలసివచ్చినది. అందులకై సమగ్రసంస్కరణ సాధుపాఠనిర్ధారణ కువ్యాఖ్యా విషహరణ సమంజసార్థావిష్కరణపూర్వక విపుల వ్యాఖ్యానమును వ్రాయ నుద్యమించితిని.' (ఉపోద్ఘాతము.)

వేదంవారు వావిళ్లవారి వ్యాఖ్యను 'కువ్యాఖ్య' అనుటయేకాక, ఆ 'కువ్యాఖ్య' యైనను వారి సొంతము కాదనియు, ఎనగో తయారుచేసి ప్రకటన కియ్యగా, దానిని తమపేర ప్రకటించుకొన్నారనియు, రామస్వామిశాస్త్రిగారి మీద ఒక సొద్దుగూడా వేసినారు. అది మనకు విచారణీయము కాదు. ఉభయ వ్యాఖ్యానములలోని గుణదోషములను పరామర్శించుటయే వ్యాసముయొక్క ముఖ్యోద్దేశము.

వావిళ్లవారివ్యాఖ్యలో కొన్ని ప్రమాదములున్నమాట నిజమేగాని, వేదంవారివ్యాఖ్యలో నున్న ప్రమాదము లంతకంటెను తక్కువకావు. ఆకారముచేత పెద్దది కావున తదనుగుణముగా ప్రమాదములును ఎక్కువగనే యున్నవి. మఱియొకవిశేష మేమనగా? వేదంవారు స్వయముగా టీక

వ్రాయుటకు ప్రాలుమాలికాబోలు, వావిళ్ల వారి టీకకే అక్క-డక్క-డ చిన్న చిన్న మార్పులుచేసి, కూర్పులుపోసి, రూపము మార్చి, 'సంజీవని' యని పేరు పెట్టినారు. అందువల్ల చాల తావులలో వావిళ్ల వారిగ్రంథములోని ప్రమాదములు వేదం వారి పుస్తకములోనికి యథాక్షరము ప్రవేశించినవి. సంజీవనీ కర్తలు, మార్చురానిస్థలములలో మార్చినందున 'రుచి'లోని గుణములు కొన్ని దోషములుగా పరివర్తనమును చెందినవి. వావిళ్ల వారిటీక చదువకయు, నిఘంటువులు చూడకయు, వేదంపండితులు పెక్కు పదముల కర్థములు తప్పుగా చెప్పినారు. సంజీవనిలో పెక్కు చోట్ల ఔచితికి విరుద్ధములయిన యన్వయములు చేయబడియున్నవి. పాఠమును నిర్ణయించుటలో వే. వేం. శాస్త్రిగారు 'ప్రమాణమంతఃకరణ ప్రవృత్తయః' అన్నట్లు వర్తించిరేగాని ప్రత్యంతరపరిశోధన పూర్వకముగా సాధుపాఠమును సంతరించినవారు కారు. వావిళ్ల వారిప్రతినుండి మూలమును, అర్థమును ఎత్తి వ్రాసి కొనుటలోనైనను మొలకువగలిగి మెలగలేదు. అందువల్ల అందలి అచ్చుతప్పులును ఇంకులోనికి చొచ్చుకొన్నవి. ఇన్ని మాట లెందుకు? 'సంజీవని', 'రుచి' నధిక్షేపింపదగిన ఉత్తమ వ్యాఖ్యానము కాలేదు. ఎల్లదోషములకును పుట్టినిల్లయినది. ఈ తత్త్వమును పలువురు పెద్దలు గమనించినట్లు లేదు. అందువల్లనే సామాన్యులమాట అటుండ, నిఘంటునిర్మాణమునకు పూనుకొన్న విద్వాంసులును, 'శాస్త్రిగారి వ్రాతలలో దోషము లుండవు' అన్న సమ్మకముమీద, సంజీవనిలోని

పాఠములను, అర్థములను అపరిశీలితములుగానే కైకొను చున్నారు. అందువల్ల శాశ్వతముగా నుండవలసిన కోశముల లోనికి ఒప్పులతోపాటు తప్పులును ఎక్కుచున్నవి. ఈ విధముగా భాషకు అపకారము జరుగుచున్నది. నా మనసునకు వచ్చిన యీ విషయమును లోకమునకు తెలుపకుండుట దోష మగుననియు, లోకమునకు తెలుపుట భాషకు గొప్ప సేవ చేయుట యగుననియు తోచి యీ వ్యాసమున వివరించు చున్నాను. ఇందలి గుణదోషములకు సహృదయులే ప్రమాణము.

పాఠవిచారణ

౧. ప్రసిద్ధరాయతి

*అప్పకవీయములో 'యతినియతి' అను శీర్షికక్రింద ఈ పద్యము లున్నవి.

క. "ఏకపదంబున విగతు ల
నేకంబులు గలిగియుండునేని పదాదిం
జేకొన్న లిపియె యన్నిటఁ
బ్రాకటముగ నిలుచు సీసపదములఁ దక్కన్." (3-110)

ఆ. "ఒక్కపదములోనఁ బెక్కు మిశ్రమములు
జఱుగుచోట మొదల జడ్డలున్న
నడుగు వెడలుదనుక నందొక్కటియెకాని
యుండ దొకట నదియు నొకట నిదియు." (3-111)

---

* ఈ వ్యాసము (1941) త్రిలిఙ్గ రజతోత్సవసంపుటములో 'యతినియతి' యను శీర్షికతో ప్రకటింపబడినది.

జయభద్రరగడ

"త్కొమ్మపుత్రికాలోల-కమనీయగుణజాల,
ఘనసీల యని చెప్పఁ-గా బహువిరుతు లొప్పు;
త్కొమ్మపాలకలలామ-కంధిగర్వవిరామ,
సంగ్రామభీమ యన-మహిని రెంటికిఁ దప్పు." (3-112)

తే. "ఒంటియడుగున బహుయుతు లుండునపుడు
నడుమ నొకదాన జమిలివర్ణంబు గదియ
నందుఁ జరణాదికి సవర్ణమయ్యె నెద్ది
దానికయ నిల్చు విరతి ముందరను గృతుల." (3-113)

విజయమంగళరగడ

"వైరిమదతమఃపతంగ-స్వజనపోషితాంతరంగ,
వ్రజవధూభుజంగ యనఁగ-వలయుఁ బెక్కు-వడులయెడల;
దారితక్షుమాకుమార-ద్వారకాపురీవిహార,
వ్యాసనున్నతప్రచార-యనఁగఁ దప్పుఁ గడకువెడల."
(3-114)

ఆముక్తమాల్యదలో, సంజీవనీకర్తలు 'ఏకపదంబున' అను పద్యమునుదాహరించి, పద్యోక్తలక్షణమునకు భిన్నముగా నున్నవన్న హేతువున, మూడు స్రగ్ధరలలో - నాలుగు తావులలో, (వావిళ్లవారి ప్రతిలోనున్న) ప్రాంతయతులను తొలఁగించి క్రొత్తయతులను ప్రవేశపెట్టినారు పరిశీలించి చూడఁగా, ఆ దిద్దుబాటు సరియైనది కాదని నాకుఁ దోచినది. పూర్వపాఠమును, 'సంజీవని' దిద్దుబాటును, నా యూహకుఁగల యుపపత్తులను వివరించుచున్నాను.

(1)

"ఈ రెండును దీనుల్లాంచు నమ్మ్క-డువులనె యడుగం-దోఁచు-"(1-58)

ఇందు 2-3 స్థానములలోని 'డు-ందో' లకు మైత్రి లేదుగనుక తప్పని శాస్త్రిగారు,—'ఈ రెండును దీను ల్లాంచు న'మ్మ్క-న్నుక-వ' లనె'.— అని పీఠిక (పు. 27)లో సవరణను చూపి, గ్రంథములో - 'డువులనె యడుగం-దోఁగు'.—అని ముద్రించినారు.

(2)

''చరదృష్టిక్ వైరిపక్షే-తృణము సచివము-ఖ్య''.— (4-28)

ఇందు 1-3, 'చ-ఖ'లకు చెలిమి చెల్లదని 'తృణము సచివ 'ష-ష్ఠ'.- అని మార్చినారు.

(3)

''ప్లవమానోత్పాతభూత-ప్రకరపటిమ హా-లాహాల''. — (7-11)

ఇందు, తొలుత గ్రహింపఁబడిన వర్ణము పకారము. దానితో తుదియతి యైన లకారమునకు మైత్రి లేదు. అందువలన వారు, 'ప్లవమానో త్పాతభూత-గ్లపన'.—అని లకారయతిగా మార్చినారు.

(4)

''ప్లవబృందంబుల్ వనిక్ న-ల్లడఁ బొడు పొడుమక్-పల్కులుక్.'' (7-11)

ఇందులో, 2-3 'ల్గ-ప'లకు మైత్రి కుదురదని, —'ప్లవబృందంబుల్ వనిక్, బ-ల్వడి'.—అని సవరించినారు.

ఆట్లు సవరించుట సరికాదు. ఎందువల్లనఁగా, అప్పకవీయపు 'యతినియతి' రగడలను గూర్చినదిగాని, ప్రసిద్ధరలను గూర్చినది కాదు. కావుననే ఆతఁ డానియతికి రగడలనే చూపినాఁడు. అప్పకవికి పూర్వుఁడయిన అనంతుఁడును, 'సంయుక్తయతి'నిగూర్చి చెప్పుచోట,—

క. 'ఒక్కడుగున విశ్రాంతులు
పెక్కగుచో సంయుతములు పెనుపకమును జ
డ్డక్కరమునఁ దానెత్తిన
యక్కరమే యనుపవలయు ననినిటఁ గృష్ణా.' (1-109)

క. 'వడిసెలవులలోఁ జేరువ
యెడ నొకసంయుతము నాలయెడ నొకటినిఁ దా
మిడిరేని కవులు తప్పుట
యెడఁబడదు పృథగ్యతిప్రయోగముల హరీ.' (1-110)

అని లక్షణముచెప్పి, అందుకు లక్ష్యముగా,

"శ్మావలయమంతయు వి,పాణమునకెత్తు కిటి,
మహీమ దలపోయ న,క్కొజ మనుచు నిట్లనక;
శ్మావలయ మంతయు వి,పాణమున కెత్తు కిటి,
సత్త్వ మరుదన నొప్పు,సంయుక్తయతి చెడక."

అను ద్విరదగతిరగడను, మఱియొకవిధమగు రగడను చూపినాఁడు. అంతే గాని ప్రగ్గరలను చూపలేదు.

కాఁబట్టి, అప్పకవి 'యతినియతి'యు, అనంతుని 'సంయుక్త యతి'యు రగడలనుగురించినవే కాని, ప్రగ్గరలను గురించినవి కావనుట నిజము. తాతంభట్టుమాత్రము (సులక్షణసారములో) 'ప్రగ్గరలలో సంయుక్త యతిని వాడరా'దని వ్రాసినాఁడు. కాని, ఆ వ్రాత యంతగా నాదరణీయము కాదు. ఎందువల్లనఁగా, ప్రాచీనకావ్యములలో పెక్కుతావులలో ప్రగ్గరావృత్తములలో 'సంయుక్తయతి' వాడఁబడియున్నది. ప్రగ్గరాయతులు మూఁడును పరస్పరము మైత్రి నెనసియుండ నక్కఱలేదు. ఆ మూఁటిలో నేరెండు మైత్రిని కలిగియున్నను చాలు ననుటకును ప్రాచీనులరచనలలో ప్రమాణము లున్నవి. కొన్ని యుదాహరణలు.

(1) "స్మా నాధీనుండుగా వైష్ణవసుఖుఁడుగా-నుత్కృపా"
(పాండు. 2-185.)

ఇందు, తొలియక్షరము 'స్మా' కావున, రెండవచోట నకార మునకును, మూడవచోట మకారమునకును యతి చెల్లింపఁబడినది. (2-3, 'ష్ణ-మ'లకు మైత్రిలేదు.)

(2) "శ్మామాత్మ స్వామిధామ-క్రమణకృశపిపూ-ర్ష్ణ ప్రవిశ్రాణితాతి"
(కళా. 7-177)

ఇందులో, తొలి 'శ్మా'లోని కకారమునకును - షకారమునకును (2-3 స్థానములలో) యతులు కూర్పఁబడినవి. (1-3, 'క-ష'లకు మాత్రము మైత్రి చెల్లదు.)

(3) "బాలవృద్ధా * ర్యస్త్రీశేషంబుగా నం-దఱుఁ బోలిసినవె-న్కఁ-జయంబేల నాకున్." (భాస్క. యుద్ధ. 884)

---

* ఇది ఆనందప్రతి పా. 'వావిళ్ల' ప్రతిలో, 'బాలవృద్ధాన్తస్త్రీ'అని పా.

ఇందు, తొలుత (1-2) తకార దకారములకును, పిమ్మట (2. 3) బిందుపూర్వ దకార నకారములకును మైత్రి చెల్లింపఁబడినది. (అంతేగాని, 1-3, 'ర్త', 'న్క'లకు మైత్రి చెల్లనే చెల్లదు.)

(4) "కీర్తిఁగూలఁ గోటిసంఖ్యల్-గెడయఁ గరివరా-శీతిసాహస్ర సంఖ్యల్" (ఉ. హరి. 6-135.)

ఇందును మొదటి 'క్ష' కారములోని కకార షకారములకు వరుసగా 2-3 యతులు చెల్లింపబడినవి. (కాని, 2-3, గె-శీలకు మైత్రి పొసఁగదు.)

ఇట్లు ప్రామాణికప్రయోగములు కనఁబడుచుండఁగా వావిళ్ల వారి 'ఆముక్త' ప్రతిలోని యతులు దుష్టములగుట యెట్లు? దిద్దవలసిన అక్కఁ అయేమి?

ఎందు కింకను విస్తరము. వేదంవారు, ప్రాచీనరచనలను పరిశీలింపకయు, అప్పకవి 'యతినియతి' రగడలకు సంబంధించినదిగాని వృత్తములకు సంబంధించినది కాదన్న సంగతి గమనింపకయు, 'ఆముక్త' స్రగ్ధరా యతులను మార్చివేసినారు. పొరపాటు.

అప్పకవి, క్రొంచపదవృత్తమున,—

"క్రొంచపదీవృత్తమ్మునఁ జెన్నా-రఁగఁ బలుకు దురిలఁ-గణివరు లెల్లఁ" (4. ఆ.) అని 'క్రౌ'లోని రేఫముతో నొకమారును, కకారముతో నొకమారును యతిమైత్రి కూర్చియున్నాడు. కావున ఆతని 'యతినియతి' వృత్తములను గుఱించి చెప్పలేదనుట స్పష్టము. ఒకవేళ చెప్పియున్నను ఆతని మాటనుబట్టి ఆముక్తమాల్యదరచనను మార్చుట మర్యాద కాదు. ఎందువల్లనగా 'ఆముక్త' కెన్నో తరాలివతలివాఁడైన అప్పకవి శాసనము ఆగ్రంథముమీఁద చెలామణి కానేరదు. అప్పకవీయమునుబట్టి ఆముక్తమాల్యదను, చిన్నయ్యసూరిని బట్టి నన్నయ్యభట్టును సవరించుట అక్రమము. అది యట్లుండఁగా, 'ఆముక్త' కవి, ఒకటికి నాలుగుతావుల పాటించిన యతివిధాన మాతని మతమగును గాని ప్రమాదము కాదు. కవి బుద్ధిపూర్వకముగాఁ గావించిన రచనను మార్చివేయుట తప్పు.

ఇంకొకమాట—అప్పకవిమతమున, కవిరాజవిరాజితమునకు యతులు మూఁడు. ('ఆలరినచో ద్విర, దాచలశైలము, లై త్రివిరామము, లంది నిర రళకవిరాజవిరాజితవృత్తము...వ్రాలు' - ఆ.ర.) ఆముక్త మాల్యదలో,- "జయజయదానవదారణకారణ - శార్ఙ్గధరథాంగగదాసిధరా" అని ఒక్క- యతితోనే యున్నది. అప్పకవివ్రాతనే ప్రమాణముగాఁ గొని ప్రస్తరా యతులను మార్చిన పెద్దలు, ఆ కవిరాజవిరాజితములో మరి రెండు యతులను ఏల చేర్చలేదో!

అక్కడ వారు,-'కవిరాజవిరాజితమున-ఁ, ఁ, ఁ. అక్షరములయందు యతులు. ఈ పద్యము మనుచరిత్రమందునుం గలదు. యతి ఒకటియే' అనిమాత్రము తెలిపి వదలినారు.

౨. చేఁగొను

చ. *'క్షితి దునఁ జేటికిఁ హలము చేఁగొని.' (4-28)

'హలము = నాఁగటినే, చేఁ = చేతియందు, కొని = గ్రహించి ('హలముచేకొని' పా.)' అని సంజీవని.

'చేకొని' అను పాఠమున్నను, ఆ పాఠమున 'చేఁ = చేతియందు, కొని = గ్రహించి' అనే యర్థము సిద్ధింపదని 'చేఁగొని' అని సవరించినారు; తప్పు. చేకొను; కైకొను; వాకొను; పైకొను అను క్రియలను, 'చేఁగొను; కైఁగొను; వాఁగొను; పైఁగొను' అని దిద్దుట సరికాదు.

"క్వచిన్నైవ వికార స్యాన్య ద్రూఢత్వాచ్ఛబ్దపల్లవః" (అథర్వణ. క్రి. 3.౨.)

తాత్పర్యము.—"శబ్దపల్లవము రూఢమైన దౌటవలనఁ బరుషములకు సరళాదేశ మొకానొకచో రాదు. ఉ.-చేకొని ఇత్యాదులు."

ఆది యట్లుండఁగా.—నాగటిని గ్రహించుట 'చేతితో' గాని 'చేతి యందు' కాదు. కావున 'చేఁ కొని = చేతియందు గ్రహించి' అని అర్థము చెప్పుటయు నుచితముకాదు.

---

* క్షితి దునఁ జేటికిఁ హలముచే మఱి' అని వావిళ్లవారి పాఠము.

౩. సున్నమెత్తుట

'సున్న మెత్తుటయుం బట్టుకొఱులం బట్టుటయు సౌధ సౌవర్ణ భూసాదినిర్మాణంబుల యంద... కొక, యితరస్థలంబుల లేకుండ రాజ్య పరిపాలనంబు సేయుచుండె.' (4-187.)

'సున్న మెత్తుటయుఁ = సుధాలేపమును'; (సున్నముఁ బూయుట మేడలకును...)' అని వావిళ్ల టీక.

'సున్నము ఎత్తుట, మోయించుట-దండ్యులకు ఒక శిక్ష. (మేడలకు సున్నము-అనఁగా గచ్చు-పూయుదురు) అని వేదమువారి టీక.

లోకములో శిక్షగా 'బండలెత్తి మోయించుట కలదుగాని, 'సున్న పుకుండనో-గంపనో యెత్తి మోయించుట లేదు. శరీరమునకు 'సున్నము-మెత్తుట' ఒకశిక్షగా లోకమున ప్రసిద్ధి.

గీ. 'మేన రాసున్న మెంతయుమెత్తి, నెత్తి
గొత్తిగి, నిమ్మపులుసు గంట్లఁగ్రమ్మి, లోని
కిముడ నేపాళము లూసంగి, యిట్లు శిశిర
కృత్యములు సేయ, నప్ప డక్కితవనిత.'

ఈ పద్యము చంద్రలేఖావిలాపములోనిది. అది హాస్యప్రబంధము కావున, బాధాకరములయిన కృత్యములు శీతలోపచారములుగా చెప్పబడినవి.

సున్నముమెత్తుట, వావిళ్లవారి ప్రతిలో 'సున్న మెత్తుట'అని ముద్రితమయినది. ముద్రణమున 'ము' జారిపోయినది. (అర్థము సరిగానే వ్రాయబడినది.) ఆ జారుపాటును గుర్తింపక, వేదమువారు 'సున్న మెత్తుట' అనియే ముద్రించి 'సున్నము + ఎత్తుట' అని విభజించి, 'సున్నము-ఎత్తుట ఒక శిక్ష' యనియు, 'సున్నము-ఎత్తుట = గచ్చు-పూయుట' యనియు, లోకములో లేని శిక్షను, భాషలో లేని యర్థమును చెప్పినారు.

వారి పాఠపరిశోధనపద్ధతి తెలియుట కీయుదాహరణములు చాలవా? వారు ఒకటికి రెండుమూఁడు తాళపత్రప్రతులను పరీక్షించి సాధుపాఠములను గ్రహింపలేదు, సరిగదా వావిళ్లవారి ప్రతినుండి యెత్తి వ్రాసికొనుటలో

నైనను మెలకువగలిగి వర్తింపలేరు. అందువల్ల ఆ ప్రతిలోని అర్థానుస్వార ప్రమాదములుగూడా వీరి ప్రతిలోనికి అట్లే దిగుమతియైనవి. చూడండి.—

1. 'కొండవీడు.' (పు. 41)
2. 'డున్ని' (పు. 47)
3. 'డిగువు' (పు. 60)
4. 'డిగురుగండె' (పు. 301)
5. 'ఆడు (=నృత్యముచేయుచున్న) వారిపై' (పు. 301)
6. 'డరుపు' (పు. 525)
7. 'డగుత్తవట్టి.' (పు. 677)

సంస్కృతకృతుల ననువదించునప్పుడును, వ్యాఖ్యానించునప్పుడును కూడా ఆంధ్రమల్లి నాథులు, పాఠమును సరిగా పరిశీలింపమి కలదు.

ఒకటి రెండు ఉదాహరణలు.—

(1) కొమరయ్య

"జనయంతి సుతాం గావః సర్వా నేవ గవాకృతీం;
విషాణోల్లిఖితస్కంధం కాంచి దేవ గవాంపతిమ్."

(హితో. విగ్ర. 147)

అను శ్లోకానికి, వాయు (1914-లో)— "ఆవు లన్నియు ఎద్దురూపు కోడెలను ఈనవే యీనును. కాని కొమ్ములతో కుమారస్వామిని గ్రోడుకొనట్టి (శివుని) యాలఁబోతును ఈనునది ఏదో ఒక్క యావే" అని తాత్పర్యము వ్రాసినారు. తరువాత (1932-లో) ఆ తాత్పర్యమునే,—

"ఆలుఁ గోడెల నీను వృషాకృతులనె
అందు భేదంబుగలుగ దావంత యేని
కొమ్ములతోఁ గొమరయ్యను గ్రోడు వృషభుఁ
గనెడు నా గోమతల్లి యొక్కఁ తెయ గాదె"

అని పద్యములో నిక్షేపించినారు. కాని వా రా శ్లోకమునకు చేసిన ఆ యర్థము నాకేమో చాలా విపరీతముగా కనుపట్టినది.

శివుని యాలపో తేమి? కొమరయ్యను కొమ్ములతో గ్రోడుటయేమి? శివలోకములో కుమారస్వామిని కొమ్ములతో గ్రోడు శివుని యాలపోతును,

ఈ లోకములో-ఈ నాఁడు-ఎక్కడనో-ఏదో ఒక యావు ఈనుటయేమి? అనుకొని, సంస్కృతవ్యాఖ్యానము నెత్తి చూచితిని. అందులో,—

"విషాణ-విషాణాభ్యా ముల్లిఖితో స్కంధో యస్య"-అని యున్నది. అంతట (Kale) ఆంగ్లానువాదమును తీసిచూచితిని. అం దిట్లున్నది.—

"All cows bring forth calves that have the shape of the cowkind: but some one alone produces one, the master of a herd (the best of bulls), having stout and muscular shoulders (lit., having shoulders that are rubbed against by his horns)."—

"లోకములో ఎన్నో ఆవు లున్నవి. అన్నియు కోడెల నీనుచునే యున్నవి. ఆ కోడెలన్నియు వృషభాకారముకలవే (అనగా - పేరుకు అన్నియు నెద్దులే) కాని, మూఁపులకు తాఁకునట్లు పెరిగిన పెద్దకొమ్ములు గలిగి - ఆఁబోతు కాఁదగిన కోడెనీనునది యేదో ఒక యావే" అని యాశ్లోక తాత్పర్యము. అంతేగాని, అందులో 'కొమరయ్య' లేఁడు. ఆ కొమరయ్యను కొమ్ములతో గ్రోఁకు శివుని యాలఁబోతూ లేదు.

ఆ శ్లోకములో, అటు సంస్కృతవ్యాఖ్యాతకూ, ఇటు ఆంగ్లానువాదకునకూ కనబడని 'కొమరయ్య'; 'శివుని ఆలఁబోతు' శాస్త్రిగారికి కనబడుటకు కారణ మేమో!

నా కిట్లు తోచినది. వారు చదివిన పుస్తకములో 'స్కందం' అని యున్నది. (లేదా, స్కంధం-అనియున్నను, వారు 'స్కందం'అని చదువు కొనియైన నుందురు) స్కందం = కుమారస్వామిని-అని యర్థముచేసికొని, ఆ యర్థము సరిపడుటకు 'గవాంపతి'ని —'శివుని ఆలఁబోతు' అన్నారు.

అంతేగాని, ఆ యర్థమునగల యనౌచిత్యమును వారు గమనించలేదు. గమనించియే యున్నచో 'స్కంధ' పాఠమును గ్రహించియే యుందురు.

(2) జీర్ణోద్యానము

ఆ గ్రంథములోనే,—"అస్తి జీర్ణోద్యానే మందవిషో నామ సర్పః" అన్న సంస్కృతవాక్యమునకు—'వల్లకోటిలో మందవిషమని పాముకటి యుండెను' అని తెనుగు వ్రాసియున్నారు.

జీర్ణోద్యాన మనఁగా పాడుపడిన తోఁట గాని 'వల్లకాడు' కాదు. శాస్త్రిగారి అనువాద మెప్పుకాదు. (చూ. 'జిత కాశి' పీఠిక. పు. 25)

(3) 'కిమంగ'

ఆ గ్రంథములోనే,—

"తృష్ణేన కార్యం భవ తీశ్వరాణాం
కిమంగ వాగ్ హ స్తవతా నరేణ"—అను శ్లోకమునకు,—

క. "పూరి పుడుకచేఁ, గలదుపని యీశులకుఁ గయి, పలు, కంగంబులు
గలానిఁ బలుకవలయునే"-అని వారి తెనిఁగింపు.

శ్లోకములోని 'కిమంగ'ను తెంచి, వారు 'కిం-అంగ వాక్పాణిమతా' అని యన్వయముచేసి తెనిగించినారు. అది తప్పుదారి.

(1) ఆట్టి 'అంగ Used with 'కిం' in the sense of 'how much less' or 'how much more'—అని వివరించి - ఆక్కడ పైశ్లోకమునే యుదాహరించి యున్నాఁడు.

(2) "అంగ - ఇది మఱియు ననుసర్గమందు వర్తించును. ఉ.— 'మూర్ఖస్తు నావమంతవ్యః కిమంగ విద్వాఁ"[1]. (గురు. ప్రభో.)

(3) "శ క్తిరస్తి కస్యచి ద్విదేహ రాజస్యచ్ఛాయామప్యవస్కందితుం కిమంగ జామాతరమ్" (మహావీరచరిత్ర.)

(4) "అవశ్యంకృత కార్యస్య - వాక్యం హనుమతోమయా
అకార్యమపి కర్తవ్యం, కిమంగ పున రీదృశమ్" (సుందర. ౬౩-౪.)

(5) "ఆలోకనంచ వచనంచ నిగూహనంచ
యాసాంస్మరన్నమృతవత్సరసం కృశ స్త్వమ్,
తాసాం కిమంగ! పిశితాశ్ర పురీషపాత్రం
గాత్రంవిచింత్య సుదృశాం నవిరాకులోసి."
—వాగ్భటుని అలంకారగ్రంథము.

ఆంధ్రమల్లి నాథులు 'కిమంగ' తత్త్వమును గుర్తింపలేదన్నది యిక్కడ సారాంశము.

N.B:—శ్రీ శాస్త్రిగారి శాకుంతలా ద్యనువాదములలోను ఇట్టి ప్రమాదములు విరివిగా దొరలియున్నవి. అందు కొన్ని, 'ఓదార్పు' - అను గ్రంథమున చూపబడినవి.

౪. పాటిపాటి

'వావిళ్ల'వారి ప్రతి (4-35)లో, — "గంధకొరులు పాటిపాటి పద్యంపు ప్రొక్కులతో"అను పాఠము, "పాటిపాటి=కొంచెకొంచెపు,..." అను టీకయు నున్నవి.

వేదం-వారు ఆ పాఠమును - అర్థమును అట్లే గ్రహించినారు.

'కొంచెముకొంచెము' అను నర్థమునిచ్చు పలుకుబడి—'పాటపాట' గాని, పాటిపాటి కాదు. చూ. శ.ర.

(1) "...చిటపాటమని పాటపాట చినుకులు వడఁజొ,
చ్చుట యూదిగాఁగ" (కళా. ౪. ఆ.)

(2) "వేనలి పాటపాట నరవెండ్రుకతోఁ దిలతండు లాన్వయ
శ్రీనటియింప." (కాశీఖండము 7-160)

అర్థవిచారణ

౯. ఒకఁడుచెప్పక

ఆ. 'పాత్రభూతు లెస్స బరికించి యతఁడడు
గకయు నొకఁడు సెప్పకయు మునుపుగఁ
బనసపండ్లు దిగినపరిగ, స్వప్నము గన్న
నెఱిగ, నొనఁగి వెఱఁగుపఱుచు టొప్పు.' (4-274)

అతఁడు అడుగకయుఁ = అడుగుటకును, ఒకఁడు సెప్పకయు = మఱియొక్కఁ డతనికి దానమిమ్మని తనతోఁ జెప్పుటకును, మునుపుగఁ. ఇచ్చి వెఱఁగుపఱుచు టొప్పును.' అని వావిళ్లవారి టీక.

'చెప్పకయుఁ మునుపు=రాజు నీకు సత్కారముచేయ నున్నాఁడని ఆతనితో ఎవ్వఁడును చెప్పక, ముందే, ఇచ్చి ఆశ్చర్యపెట్టుట ఒప్పుఁ' అని వేదమువారి టీక.

రాజు నీకు సత్కారము చేయునున్నాడని ఎవడోపోయి చెప్పక ముందే రాజు ఇవ్వవలె నని-యర్థము చెప్పుట కేపల మనుచితము.

వావిళ్లవారి వ్యాఖ్య సరిగాదని-వేదంవారు చేసిన యీ సవరణ తప్పు.

౨. పనసపండ్లు దిగిన పరిగ

'పనసపండ్లు దిగినపరిగ = మొత్తములుగా పనసపండ్లొకసారి దిగిన చందముగా' అని వావిళ్లవారు.

"పనస . రిగ = ఉన్నట్లేఉండి ఒకక్షణములో పనసచెట్లునిండ పనసపండ్లే దిగబడిన చెట్లుండునో ఆ విధముగాను, అభూతోపమ' అని వేదంవారు.

'అభూతోపమ' అనగా, సహజముకానట్టి (=కవికల్పితమైన)ఉపమ. ఉదా.—'ఆ యేనుఁగు నడగొండవలె నున్నది' అన్నప్పుడు, నడగొండ (=నడచుచున్న కొండ) కవికల్పితము కావున 'అభూతోపమ.' అట్లే ప్రకృతమున వేదమువారు 'పనసపండ్లు' అను పదానికి 'పండిన పనస కాయలు' అని యర్థముచేసికొని, పచ్చికాయలుగాక, పండ్లు-పండ్లుగానే చెట్టున దిగబడుట సహజముకాదు గావున, పండ్లు దిగబడినట్లు చెప్పుట - 'అభూతోపమ' అన్నారు. పొరపాటు.

పనసపండ్లు దిగుట-యనగా, పనసపిందెలు పుట్టుట అని సంప్రదాయార్థము. "దిగుట-To come forth as fruit from the bud" (బ్రౌను.)

'పనస'-వనస్పతి. అనగా పూతలేకయే కాయలుకాయుచెట్లు. ఉదా—మేడి. వనస్పతి ఫలోత్పత్తికి ముందెట్టి సూచనయు నుండదు. ఉన్నట్లేఉండి చెట్టు ఆపాదమస్తకము పిందెలు పుట్టి కూర్చుండును.

'పనస ఉన్నట్లేఉండి తటాలున సమృద్ధిగా ఫలించి ఆశ్చర్యమును కలిగించునట్లు, రాజును ఉన్నట్లేఉండి తటాలున సమృద్ధిగా సత్కరించి ఆశ్చర్యమును కొలుపవలెను'-అని చక్కని ఉపమ.

వావిళ్లవారి టీకయే సరియైనది.

కాచిన మేడిచెట్టును శ్రీనాథుడు వర్ణించినాడు.—

గీ. 'కమియ నామూలచూడంబుగా ఫలించి
యంబరము మోచియున్న యుదుంబరములు
నీల బ్రహ్మాండభాండమాలికలభూష
లవధరించిన వృషభాంకు ననుకరించె.' (కాశి. 1-91)

ఫలించి యనగా కాయలుకాచి-అని యర్థము. మేడిపంట యెట్టిదో పనసపంటయు నట్టిదే.

3. కసీసము

"ఇంగిలికమ్మునం దడిపి యెత్తు కసీసపు రెంటెమో యనఁ
నింగి గరు త్పరంపరల నిగ్గున లేఁ దొగరెక్కి—" (4-10)

"కసీసపు రెంటెమో = నల్లని జంట నేత వస్త్రమో.— *కసీసము అనఁగా నల్లనిది, దీనికి ప్రకృతి 'కాసీసము.' కాసీసమనఁగా మైలు తుత్తము; అది నలుపుగాన దీనికి ఈ యర్థము వచ్చినది" అని సంజీవనీ వ్యాఖ్య.

---

* వావిళ్ల నిఘంటువు, "కసీసము = 1. అన్నభేది. 2. నల్లచాయ గల తెల్లబట్ట." అని యర్థములు చెప్పి, రెండవ యర్థమునకు,-"సీ...కలధౌత వస్త్రముల్ చెలఁగుచుండు నవి నల్లచాయచే నలరుచున్నను గసీసం బనఁగాఁదగు"నను, ఆం. భా. (ద్వి. ౧౫౭) పద్యము నుదాహరించినది.

ఆం. భా. పద్యమును గ్రహించుటలో ఆ నిఘంటువు పొరపడినది.

'జరబాజు నేరాజు బుసపా తగటి యనఁ, గలధౌత వస్త్రముల్ చెలఁగుచుండును'; —'అవి నల్లచాయచే నలరుచున్నను గసీసం బనఁగాఁ దగును'-అని పద్యార్థము.

'కలధౌతవస్త్ర' మనగా బంగారు—వెండి సరిగగల వస్త్రముగాని 'తెల్లబట్ట' కాదు. కావున 'నల్లచాయగల తెల్లబట్ట' అనుట సరికాదు.

నలుపు తెలుపులకు సామానాధికరణ్యము కుదురదు.

శ.ర. లో, 'కాసీసము = మైలుతుత్తము' అని యున్నది. సంజీవనీ కర్త లా వ్రాత నక్కే గ్రహించినారు. పొరపాటు.

కాసీసము-అనగా 'అన్నభేది' గాని 'మైలుతుత్తము' కాదు.

కాసీసము, ఇసుమునుండి పుట్టునది.—మైలుతుత్తము, ఇత్తడినుండి పుట్టునది.

(a) "కాసీసము Green vitriol, green sulphate of iron.-మయూరతుత్థము Blue vitriol or sulphate of copper" (ఆప్టే.)

(b) "అన్నభేది Green vitriol, sulphate of iron. ఒక మందు దినుసు.— మైలతుత్తము Blue vitriol or sulphate of copper. తుత్థము." (బ్రౌను.)

కాబట్టి శ.ర. కర్తయు, సంజీవనికర్తయును,— 'కాసీసము=మైలుతుత్తము' అనుట పొరపాటు. మైలుతుత్తురంగు-నీలము (Blue) గాని కేవలము నలుపు కాదు. కావున 'మైలుతుత్తము నలుపు' అనుటయును సరి కాదు. ఆకాశవర్ణమును నీలమే గాని కేవలము నలుపు (Black) కాదు. అందువల్లనే వావిళ్ళవారు,— "కసీ...అనగా=నీలవస్త్రమో అనునట్లుగా" అన్నారు. అదే యుచితమైన అర్థము.

౪. చట్టలు

'తను యెక్కి-రింతలు ... నవీన సవిధ కేదారంబులం బ్రెళ్లిచట్టలు దిగంబడి వెడలలేకుండం దారు దిగ నిమ్ముకలేక పిమ్మటఁ గొని.' (4-85.)

'చట్టలు దిగంబడి = చంకలవఱకుఁ గ్రుంగిపోయి.' అని, వా. వ్యా.

'(కర్త . ఎక్కి-రింతలు) చెంగటి వరిపొలములో పడి, చట్టలు = పిఱుఁదులు, దిగంబడి = పూడిపోయి, వెడలలేకుండఁ = పైకి లేచిరాలేని వారై' అని వే-వ్యా.

మూగానిబురదలో దిగబడినవి, గుఱ్ఱముల 'జబ్బలు' గాని 'పిఱుఁదులు' కావు. 'చట్టలు = పిఱుఁదులు' అనుట సరి కాదు.

(1) "భుజసమాఖ్యయను, జబ్బ-చట్ట-బుజంబన." (ఆం. భా. 2-138)

(2) "చట్ట The outside of the thigh." (బ్రౌను.)

(3) "చట్ట = తొడకు వెలుపలిభాగము. (శ.ర.)

'పిఱుఁదు' లనగా పిఱ్ఱలు. ('The buttocks or posteriors.'–బ్రౌను.) కావున 'చట్టలు దిగంబడి' యనగా 'తొడలవరకు దిగబడి' యని యర్థము కాని, 'పిఱుఁదులు పూడిపోయి' అని యర్థము కాదు.

దిగఁబడుట అనగా, బురదలోనికి దిగిపోవుట. కాబట్టి, దిగఁబడి=పూడిపోయి-అనుట చెల్లును.

'పైకి రాలేనివాఁడై' అనుటయును ప్రమాదమే. బురదలో దిగబడి పైకిలేచి రాలేకున్నవి గుఱ్ఱములు; ఆమహత్తులు. కావున, 'పైకి...రాలేనివై' అనవలెను.

'పిమ్మటగొను' శ.ప. క్రియ. కావున 'పిమ్మటఁగొని' అనగూడదు. (చూ. సమీక్ష. పు. 29)

౫. చెల్క-

ఉ. 'అంటలుగట్టి *చెల్క-లకు నాండ్రును బిడ్డలుఁ గూరఁగోయఁబోఁ
గంటకముల్ పదాబ్జములఁ గాఁడ.' (3-33.)

'చెల్క-లకుఁ = చెలికలకుఁ = బీటినేలలకు' - అని సంజీవని.

ఈ పాఠమూ - అర్థమూ శ.ర. ననుసరించినవి. 'చేలకును' అని వావిళ్ల-ప్రతి పాఠము. అదే సాధువు. ఎందువల్లననగా : చెలిక-యనగా 'చేను'గాని బీడుకాదు.

''చేనఁ జెలిక నా క్షేత్రంబు విలసిల్లు" అని ఆం.భా.(2-230) చెప్పుచున్నది. కావున,—'చెలికలకుఁ = బీటినేలలకు' అనుటీక తప్పు.

తరువాత, అసలుపదము 'చెలికి' అని ఇకారాంతమగుచో, బౌ. వ్యా. ప్రకీ. ౧౨. సూ. ప్రకారము-'చెల్క-' అగునేగాని, ఆకారాంతమైన 'చెలిక' 'చెల్క-' కాదు. కావున 'చెల్క-లకుఁ' అను పాఠముకంటె 'చేలకును' అను పాఠమే మేలయినది.

౬. అంతలు - ఇంతలు

ఉ. 'ఎం, తేరుష ద్రొబ్బ నంతలును నింతలునై పడుతన్నభశ్చ్యుతాం
గారశిశుప్రతానముల కైవడి రాలె సురేంద్రగోపముల్.' (4-107)

'అంతలు నింతలునై = ఇంతంతతునియలై.' (వావిళ్ల టీక.)

'అంతలును = పెద్ద గుంపులును, ఇంతలును = చిన్న గుంపులును, ఐ–సురేంద్రగోపముల్ = ఆరుద్రపురుగులు (ఇంతలును అంతలును ఐ=చిన్న మొత్తములును పెద్ద మొత్తములునుంగా) రాలెక్ = నేలకు రాలినవి.' (వేదం. టీక.)

వావిళ్ల వారిదే సరియైన టీక. వేదంవారిటీక కేవల మనుచితము.

క. ''ఇంతలు నంతలునగు తన, సంతానము.'' (పాండు. 8-29)

ఇంతవాండ్లును - అంతవాండ్లును అయిన బిడ్డ-లని యర్థము.

2. అక్క–వాడ

గీ. 'దర్భపోటులు తిని, లేని తఱుల మైత్రి
నంటి పితృశేషము భుజించి, యదియు నెడల
నక్క–వాడల నరకూళ్లు మెక్కి–, మీఁద
వీని శేఖర మొకతులా ర్హిత్వ్యము కొని.' (7-5)

''అక్క–వాడలక్ = అమ్మలక్క–ల వీధులయందు.'' (వా. వ్యా.)

''అక్క–వాడలక్ = అమ్మలక్క–ల వీధులయందు (అనఁగా వీధివీధి కేఁగి అమ్మా అక్కా అని స్త్రీలను మంచిమాటలాడి స్నేహముచేసికొని ఆదాక్షిణ్యముచేత వారియింట), అరకూళ్లు = సగము కడుపునకు తిని" (వే. వ్యా.)

'అక్క–వాడ' యనగా పూటకూలి యిండ్లుండు వీథిగాని 'అమ్మలక్కల వీథి' కాదు. ఏ పట్టణములోఁగాని 'అమ్మలక్క–లవీథి' యని ఒకవీథియున్న శ్లే కావ్యములోను కనబడదు. శ.ర. కర్త 'అక్క–= వంటలక్క–' అని యర్థముచెప్పి, అందు కుదాహరణగా ఈ పద్యమునే చూపినాడు; లక్ష్మీ నారాయణీయములో 'అక్కలవాడ=వంటలక్క–లుండువీథి' అని స్పష్టముగా చెప్పబడియున్నది; బ్రౌనుపండితుడు ''అక్కలవాడ Slut's alley, a street in which cook maids live వంటచేసే ఆణంగులు వుండేవీథి'' అని వివరించి అక్కడ 'అక్క–వాడల నరకూళ్లుమెక్కి–' అని యీ పద్య పాదమునే ఉదాహరించినాడు.

క్రీడాభిరామమున ఈ పదము పలుమారుప్రయుక్తమై యున్నది.—

(1) "ఎక్కడికి వార్వఁబోయెద రెఱుఁగఁ జెప్పుఁ
డక్కవాడకు మేము బ్రాహ్మణుల మగుట." (పుట. 60)

(2) "సన్మతినుండఁగావలయుఁ జక్కనివాఁడవ యక్కవాడలోఁ." (పుట. 63)

(3) "క్రొమ్మెఱుంగుతో, నుక్కవమాడుమేని పస యొడ్లకుఁ గల్గునె యోరుగంటియం, దక్కల వాడలోని వెలయాండ్రకుఁ దక్కఁ గిరాట టిట్టిభా." (పుట. 87)

(4) "గర్భమాదిగ నోరుగంటి యక్కలవాడ
వలఁతియై తిరుగాడు వాఁడు వీఁడు." (పీఠిక. పుట. 88)

ఘ. తనుయాత్ర

గీ. "అలన మృదుబాహు యుగబిసలతలు గడఁగి
బిసలతా శ్రీలనెల్లను వెస హరించె
మఱి హరింపంగ నవి నెఱివిఱిగికాదె
సారెఁ దనుయాత్రఁ దంతుల జరుపుచుండు." (5-19)

'తనుయాత్రక్ = దేహయాత్రను, (శరీరపోషణము ననుట.) తంతుల = నూలిపోఁగులచేతను, జరుపుచుండుక్ = కడపుచుండును.—ఆయమయొక్క కోమలములగు బాహువులనియెడు తామరతూఁడులు చెలఁగి యెల్ల తూఁడుల కాంతిసంపదల నపహరింపఁగా నవి గుంపుచెదరి మఱియొక విధముచే బ్రదుకఁజాలక నూలిపోఁగులు వడికికొని శరీరయాత్ర గడుపు ననియును, దామరతూఁడులు విఱిగినేని వానిలో నూలిపోఁగు లుండునని యును భావము.' (వావిళ్లవారి వ్యాఖ్య)

"తనుయాత్రక్ = దేహధారణము, తంతులక్ = నూలువడుకుటచేత (సన్నపోఁగులను ధరించి) జరుపుచుండుక్.—ఆమె బాహువులు తామర తూండ్ల సిరిని హరించినవి. ఆకారణంబున తామరతూండ్లు నూలువడుకుకొని జీవించుచున్నవి. ఆదే వానిని విఱిచినచో సన్నపాటిదారములు వచ్చుట."

(వేదమువారి వ్యాఖ్య.)

'తంతువులతో తనుయాత్ర జరుపుట=నూలిపోగులు వడికికొని శరీర యాత్ర గడపుట' యన్న వావిళ్లవారి యర్థమునే మాటలుమార్చి వేదము వారు అనువదించినారు.

తంతువులతో తనుయాత్ర జరుపుట-యనగా, తంతువులే ఆహారముగా కాలము గడపుటగాని 'నూలువడికి-ఆమ్ముకొని తన్మూలమున జీవించుట' కాదు.

గాంధి వేరుసెనగపప్పుతో శరీరయాత్ర జరిపెడివాడు— అంటే, వేరుసెనగపప్పును అమ్ముకొని తన్మూలమున జీవించెడివా డని యర్థము కాదు. ఆ పప్పును తిని శరీరమును నిల్పుకొనెడివాడని యర్థము. అట్లే ప్రకృతమునను.

మరియు,—'తామరతూండ్లు నూలువడుకుకొని జీవించునవి అయి నందువల్లనే వానిని విఱిచినచో సన్నపాటి దారములు వచ్చుట' అని ఆంధ్రమల్లినాథులు వ్రాయుట మిక్కిలి వింత. నూలును తినువారి కడుపులో నూలుండవచ్చునుగాని, నూలువడికి అమ్మి జీవించువారి కడుపులో నూలుండు టెట్లు?

ఎందుకు గ్రంథవిస్తరము. దేహయాత్ర, శరీరయాత్ర.అను పదములకు భుజించుట - అని యర్థము. అందు కీక్రింది గ్రంథములు ప్రమాణము.

(1) దేహయాత్ర = మెసవుట, భుజించుట (శబ్దార్థకల్పతరువు)

(2) ,, = Nourishment, food. (ఆప్టే)

(3) ,, = తిండి. (శ.ర.)

(4) "యాత్రాస్యాద్యాపనేగతౌ. (అమరము) యాత్రాశబ్దము భోజనము మొదలైన వర్తనములకును గమనమునకును పేరు. ఉదా:—శరీర యాత్రా. ప్రాణయాత్రా." (గురుబాల ప్రబోధిక)

(5) శృం. నైషధమున—(హంసవాక్యము) 'ఫలకుసుమ మూలమాత్రం బున శరీరయాత్ర నడపుచు మునులుంబోలె...ఉన్నవారము.' (1-108)

(6) గీ. "పుష్ప ఫల పత్ర జల మాత్రముల శరీర
యాత్ర గడపుచు సన్మార్గమధిగమించి
యెసఁగు నివియెల్ల నీకేల యెన్గొనర్చు" (వసు. 3-128)

(7) నీతిచంద్రిక.—(మిత్రభేదమున కొంగవాక్యము.) 'జలశ్వేవాలాదులతో దేహధారణంబు చేయుము ముముక్షుత్వంబు బూని మునివృత్తినున్న వాఁడను."

(8) సీ. "అనుదినంబును దేహయాత్ర కొయితమూనె
నీవార శాకాది పూవుఁబోణి" (హర. 4-18)

(9) క. "తనుయాత్రకుఁగా నశనము
గొనుఁ బూర్ణముగా" (శాంతి. 5-321)

౯. 'తొడిఁబడి'; 'విషయాతురు'

వేదంవారి పాఠము

క. 'తొడిఁబడి, విషయాతురు నవి
విడు మనియెడుకంటెఁ గలదె వేఱేపగ? నే
ర్పడరఁ గథాదుల నొకవెం
బడి దోఁపంబలికి మైత్రిఁ బాపుట యొప్పున్.' (4-191)

'బడి' అను పదముక్రింద, శ.ర.లోను, వావిళ్ల - ప్రతిలోను పాఠ మిట్లున్నది.—

"తొడిఁబడ...*విడువు మనియెడికంటె...గథాదుల నొకటం,బడి దోఁపఁ బలికి మైత్రి వాపుటయొప్పున్."

"తొడిఁబడి = తొట్రుపడి, విషయ ఆతురుల్ = శబ్దాదులయిన యింద్రియార్థములచేత, ఆతురుల్ = రోగియైనవానిని (అనఁగా - ఆవి లేని యెడ దుఃఖపడువానిని - విషయాసక్తుననుట).—అవి ..కంటెన్ = ఆ విషయ ములను వదలుమని యుపదేశించుటకంటె, ఒకవెంబడిన్ = ఒక క్రమమున,

---

* 'విడువు మనుటకంటె' అని వావిళ్లవారి పా.

తోఁపక=ఆతనికే తెలివి వచ్చునట్లు, పలికి=వచించి, మైత్రిక=విషయము మీఁది ఆసక్తిని, పాపుట=తొలఁగించుట, ఒప్పక=తగును" అని వేదం వారి వ్యాఖ్య.

(1)

ఉపదేశించువాఁడు తొట్రుపడుట స్వభావము కాదు. కావున 'తొట్రుపడి యుపదేశించుటకంటె' అని అర్థముచెప్పుట సరికాదు.

తొడిఁబడి = తొందరపడి-అని చెప్పుట యుచితము.

'తొడిఁబడక = త్వరపడి' అని వావిళ్ల వారి టీక.

(2)

'విషయ-ఆతురుక = ...ఇంద్రియార్థములచేత - రోగియైనవానిని' అని యర్థముచెప్పుటయు సరికాదు.

శ.ర.లో, 'ఆతురుఁడు = వ్యాధిగ్రస్తుఁడు; తెవులుగొంటు' అని యున్నది. అందువలన సంజీవని పండితులు,— 'విషయములచేత రోగియైన వానిని' అని యర్థము చెప్పినారు. కాని అది సరియైనమార్గము కాదు. 'విషయ ఆతురుఁడు = విషయములు లేనియెడ దుఃఖపడువాఁడు = విషయాసక్తుఁడు' అని డొంకతిరుగుడుగా వ్రాయ నక్కరలేదు. 'ఆతుర' శబ్దమునకు- 'ఆసక్తుఁడు' అన్న యర్థము నిఘంటువులలో నున్నది. —

(1) "ఆతుర-Eager, Over-anxious-" (ఆప్టే.)

(2) ఆతురము Hurry, eagerness, affection, ఆతురచిత్తయె Being afflicted. ఆర్భాతురము Famishing hunger. క్షుధాతురుఁడై the same. కామాతురుఁడై eager with lust." (బ్రౌణ్యము)

(3) విషయాతురుక = స్రక్చందనాది విషయములయం దాసక్తుఁడైనవానిని" అని వావిళ్ల వారి టీక.

విషయాతురుఁడు - అనగా విషయాసక్తుఁడని సరియైన అర్థము.

విషయాతురుఁడు=విషయములచేత రోగియైనవాఁడు. విద్యాతురుఁడు= విద్యచేత రోగియైనవాఁడు. అర్థాతురుఁడు = అర్థము (=ధనము)చేత రోగియైనవాఁడు. అని యర్థములు వ్రాయుట యుచితము కాదు.

(3)

'మైత్రి=విషయములయందున్న స్నేహమును' అని వావిళ్ల వారును,— "మైత్రిక్ = విషయముమీఁది ఆసక్తిని" అని వేదం వారును అర్థము చెప్పినారు. కాని అట్లు చెప్పుట సరి కాదు.

ఆ విషయాసక్తిని—మైత్రిక్ = మైత్రితో-మంచిమాటలచేత, పాపుట యొప్పుక్-అని చెప్పుట యుచితము.

కావున 'మైత్రివాపుట' అను పాఠముకంటె 'మైత్రీభావపుట' అను శాస్త్రిగారి పాఠమే గ్రహింపదగినది. కాని వారుచెప్పిన అర్థమాత్రము గ్రహింపదగినది కాదు.

(తొడిఁబడ)

తొడిఁబడ-అను పాఠమున,-తొడిఁబడక్-విడు మనియెడుకంటెక్ = (విషయములను) పూర్తిగా విడిచిపెట్టుమని (బకమాటుగా) చెప్పుట కంటెను, వేఱే పగగలదే?-అని యన్వయము.

తొడిఁబడక్ = పూర్తిగా-అనుటకు,—

"తొడిఁబడఁ జేతికి దొరకిన ధనము
విడిచి మీఁదటఁగొను వెంగలి గలఁడెకో?) (గౌ. హరి. పు. 181)

'తొడిఁబడ'ను ఊతపదముగానైనను గ్రహింపవచ్చును. అందు కొక ప్రయోగము.—

"తొడిఁబడఁ బరుసంబుతో నిన్ను సోఁకి
కడువడి మేల్మిబంగార మైనట్లు." (గౌ. హరి. పు. 251)

౧౦. జపయజ్ఞశీలురు

చ. 'చిరసముపార్జితాగ్ని తడిఁజెంది నశించునటంచునో, కృతా
ధ్వరతఁ దదగ్ని మైనునికి దాన నొకంగము తాచుచేతనో
పురధరణీసురుల్ నిగమభూధరముల్ జపయజ్ఞశీలు, రా
హరిధనదాదులైన వలహస్తము సాఁపరు దానధారకున్. (2-33)

"జపయజ్ఞశీలురు=జపయజ్ఞపరులై" అని వావిళ్లవారి టీక.

"జపయజ్ఞశీలురు = మంత్రావర్తనములు, యజ్ఞములు చేయించుట స్వభావముగాఁ గలవారు" అని వేదంవారివ్యాఖ్య.

జపయజ్ఞశీలు రనగా, జపయజ్ఞపరులే (= జపయజ్ఞములు చేయుట స్వభావముగా గలవారే) కాని 'చేయించుట స్వభావముగా గలవారు' కారు.

'జపశీలుడు = జపము చేయించుట స్వభావముగా గలవాఁడు.' — 'యజ్ఞశీలుడు=యజ్ఞము చేయించుట స్వభావముగా గలవాడు.' 'భయశీలుఁడు =భయపెట్టుట స్వభావముగా గలవాడు.' 'దానశీలుఁడు = ఇప్పించుట స్వభావముగా గలవాడు.'—అని యర్థము చెప్పుట తప్పు.

శీలశబ్దార్థమును నిఘంటువు లిట్లు చెప్పుచున్నవి.

(1) "శీలుడు He who is possessed of, or endowed with; practising, versed in; స్వభావముగలవాడు. స్నానశీలుడు he who is addicted to bathing. భయశీలుడు he who fears." (మోనా.)

(2) "శీలః - Disposition, nature; frequently at the end of comp. in the sense of disposed or habituated to, indulging in, prone to, addicted to; attached to &c.—as కలహశీల disposed to quarrel, quarrel-some, భావనశీల disposed or apt to think, so దానశీల; మృగయాశీల, దయాశీల; పుణ్యశీల; ఆశ్వాసనశీల. etc" (ఆప్టే)

'యజ్ఞపరుడు = యజ్ఞము చేయువాడు' - అనుటకు—

(1) అగ్ని కార్యముఁ దీర్పు మభవుఁ బూజింపుము
పంచమహాయజ్ఞపరుఁడ వగుము.' (కాశీ. 4-105)

(2) "వలయునేని యధిప వాసవుచాడ్పునఁ, క్రతుపరుండ వగుము." (భా. శాంతి. 1-289)

౧౧. చేవెలుఁగు

సీ. 'తమ్రమోలనుండు నందలముఁ గానక దాఁటి
చేవెలుం గిడి బెస్తఁ జీరువారు.' (4-7)-పాఠాంతరము

''చేవెలుంగిడి = (చేవ + ఎలుంగు) పటిమగల కంఠస్వరముచేసికొని (పా. 'చేయెలుం గిడి = చేతితో కూడుకొన్న యెలుఁగు కావించి, చేయెత్తి కూకవేసి అనుట') మఱియు లక్ష్యము.—క. 'దీవించి యతనివదనము, చేవెలుఁ గిడి చూచి'— హరవిలాసము'' (సంజీవని.)

చేవెలుఁ గిడుట-చూచుటయందుగాని 'చీరుటయందు' కాదు. కావున 'చేవెలుఁగిడి-చీరువారు' అనుపాఠ మసాధువు. మఱియు వారు,—'అతని వదనము చేవెలుఁగిడి చూచి' యన్న లక్ష్యపద్యమునకును,—పటిమగల కంఠస్వరము చేసికొని చూచి-అనియు, చేతితోఁగూడుకొన్న యెలుఁగు కావించి, చేయెత్తి కూకవేసి చూచి - అనియు అనుచితార్థమునే భావించినారు.

అసలు, చేవ + ఎలుఁగు=చేవెలుఁగు-అను సంధికార్య మప్రశస్తము.

'చేయెలుఁగు'-అను పదమూ, 'చేతితో గూడుకొన్న కంఠస్వరము'-'చేయెత్తివేయు కూక' అను నర్థములును అప్రశస్తములే.

చేవెలుఁ గిడుట చూచుటయందే ననుటకు ఒక కొన్నిప్రయోగములు.-

(1) సీ. 'పెద్దవిన్నపము చెప్పినఁగాని వినరాదు
చేవెలుం గిడకున్నఁ జెడును దృష్టి' (విష్ణుపురాణము.)

(2) వ. 'కంబంబుమఱుంగునం గదలమెదల వెఱచియున్న యమ్మహాను భావుం జేవెలుంగునం గనుంగొని' (మల్ల. విప్ర. 4-24)

(3) సీ. 'కంటికిఁ జేయోరగానిల్వి కర్ణాని
యన్నన్న యెంతదవ్వనెడువారు.' (సారంగ. ౧ ౧౩౩.)

(4) 'రంజప్రాద్దు చెలుంగునకుఁ గరంబు మఱుంగుపెట్టుకొని, కనుమేగ దూరంబు చూపు సారించి' (మిత్రభేదము.)

౧౨. పచ్చికస్తూరి

(పు. 521) 'పచ్చికస్తూరి = తడియాఱని కస్తూరి.— కస్తూరికి ఆఱక ముందు పరిమళము హెచ్చు.' వే. వ్యా.

ఇది కస్తూరియొక్క పుట్టుపూర్వము లెరుగని వ్యాఖ్య. అందు కీ క్రింది వ్యాసపంక్తులే తారాక్ష్యము.—

(యువ. ఆషాఢభారతి. 'కస్తూరి మృగము')

I. "కస్తూరి పచ్చిగనుండగ అసహ్యమగు కారువాసనయున్ను మూత్రపువాసనయున్ను కలిగియుండును. నిజమగు కస్తూరి సౌరభపరిమళ ములు ఈ స్రావము ఎండినకొలదిని కలుగుచుండును. అట్టి సువాసన గలిగిన పిదపనే దీనికి గొప్ప విలువ గలుగుచున్నది." (వ్యాసకర్త, బంగోలు వెంకటరంగయ్యపంతులుగారు.)

Harmsworth's popular Science. Group 5. Animal life.

II. "The gland in adult male contains about an ounce of a secretion of a powerful musky odour.

When first obtained it is overwhelmingly strong to the human nose, but it rapidly dries, and lo, it is the musk of commerce which scents charms and amulets beyond number—"(Page 1416.)

కస్తూరికి ఆఱకముందు పరిమళము మోచ్చు అనుట సరికాదని పై పంక్తులవలన తేలినదిగదా? ఇక 'పచ్చికస్తూరి' యను నుడి తత్త్వ మేమనగా: ఆది యొక జాతీయమైన పలుకుబడి. పచ్చివిషము. పచ్చి నెత్తురు. పచ్చితేనె. పచ్చిబోగముది. పచ్చిపలువ. పచ్చిపోదా - ఇత్యాదుల వంటిది.—పచ్చితేనె = తడితేనె; పచ్చితురక = తడియూఅని మహామ్మ దీయుడు-అనురీతి టీకలు అసమంజసములు.

'పచ్చితేనె' అనుట కొకటి-రెండు ప్రయోగములు.—

సీ. 'చిలుకపోటులచేతఁ జిరిగిన సహకార
ఫలములఁ దొరఁగెడి పచ్చితేనె.' (పాండు. 1-117)

క. 'పుట్టకుఁ బుట్టెడివేళం
దిట్టపు నునుపచ్చి పుట్టతేనియ చవితోఁ
బుట్టె నన నమృతముట్టెడు
పుట్టనిసువు సత్కవిత్వములు వర్ణింతుఁ' (పాండు. 1-10)

గీ. 'డాంబికులచేతఁ బచ్చిబండగులచేతఁ
గల్లరులచేత దర్పించుఁ గలియుగంబు.' (జైమిని. 8-112)

బండగుఁడు = ఆతతాయి, దుర్మార్గుడు. పచ్చిబండగు దనఁగా, కడుంగడు దుర్మార్గుడని యర్థము. అంతేగాని, 'తడియూఅని దుర్మార్గ'డని కాదు.

ఇట్లే 'పచ్చి'కి సందర్భానుసారముగా-క్రొత్త, మేలైన, నికరమైన-ఇత్యాదిగా నర్థములు చెప్పికోవలెను.

౧౩. అశ్లీలము

(పు. 521) "కస్తూరి ఒకజాతిలేడియొక్క యండకోశమందు జనించును. దానిని అశ్లీలతాపరిహారార్థము నాభిజ మందురు." అని సంజీవనీ వ్యాఖ్య.

ఇదియును ఉజ్జాయింపు సిద్ధాంతమేగాని, వస్తుతత్త్వము నెరిగిన సిద్ధాంతము కాదు.

కస్తూరి, కస్తూరిమృగములయొక్క-* అండమునుండి పుట్టునని కొందరనుకొన్నారు. వారు 'అండజ' యన్నారు. నాభినుండి పుట్టునని కొందరి మతము. ఆమతమువారు 'నాభిజ' యన్నారు. అంతేగాని అశ్లీలతాపరిహారార్థము 'అండజ'ను-'నాభిజ'గా ఎవరును మార్చలేదు. అట్లు మార్చి రనుటకు ప్రమాణమును 'సంజీవని'వారు చూపను లేదు. 'అండ' పదమే అశ్లీలమైతే 'అండజయూనలు' అధ్యోగతిపాలు కారాఁ? 'బ్రహ్మాండము' మునిగిపోదా?

కస్తూరియొక్క పుట్టుకనుగూర్చి పరిశోధించిన పండితులు అది నాభినుండి పుట్టునదేగాని అండమునుండి పుట్టునది కాదని స్పష్టముగా చెప్పినారు. ఈ క్రింది పంక్తులు పఠింపదగినవి.

---

* "కస్తూరికామృగాణామండా ద్గంధగుణమఖిల మాదాయ
యది పునరహం విధిస్యాం ఖలజిహ్వాకాయాం నివేశయిష్యామి."
—అలంకార చంద్రిక.

బంగోలు వెంకటరంగయ్యపంతులుగారి వ్యాసమునుండి,—

(a) "పుసుగుపిల్లి కివలనే దీనికిని ఆసనభాగమున నొక మాంస గ్రంథి (కోశ) గలదు. ఈ గ్రంథినుండి యూరుచుండు నొక ద్రవ్యము తోకపొడవున నేర్పడియుండిన ఒక కొలువవంటి గాడిగుండ స్రవించుచుండును. కస్తూరియూ రే గ్రంథి ఇది కొదు. కస్తూరియూ నే గ్రంథి మొగ జాతికిమాత్రమే యుండును. తెలుగువారు 'కస్తూరి' యను ద్రవ్యమును ఇంగ్లీషున మస్కు (Musk) అనియు, ఉర్దూభాషయందు 'మిష్కు' లేక 'మష్కు' అనియు అందురు. కస్తూరికి కస్తురి యను హ్రస్వరూపమును గలదు. ఇంగ్లీషు ఉర్దూపర్యాయముల వ్యుత్పత్తిని విచారింప సంస్కృతము లోని ముష్క-శబ్దభవమయినట్లు తెలియుచున్నది. బహుశ: ఈ ద్రవ్యోత్పత్తి ముష్క-గ్రంథులనుండి వెడలునటుల వారు భ్రమపడి యుందురు. మన పూర్వీకులుమాత్రము ఇట్టి పొరపాటు పడలేదు. నాభిప్రదేశమే దీనికి యుత్పత్తిస్థానమని ఆర్యపరిజ్ఞానము. అందుచేత నే దీనికి మృగనాభియనియు పేరు గలిగినది." (భారతి.)

Harmsworth's popular Science Group 5. Animal life.

(b) 'To catalogue the nature and purposes of the many external glands which distinguish the various species of deer would task the most expert student of the subject, but the glandular abdominal pouch from which this deer gets its name must not be passed without notice.'

(c) 'కస్తూరి, కస్తూరి యను లేడివంటి మృగముయొక్క నాభినుండి పుట్టును. ఆ మృగమును జంపి దానియొక్క నాభిని గోయుదురు. ఆ నాభిని చీల్చి కస్తూరిని తీయుదురు.' (భావప్రకాశ.)

(d) పండితరాయలు—

'కస్తూరికాం తృణభుజా మటవీచరాణాం
విన్యస్య నాభిషు వధాయ వృథా నకార;
మూఢో విధిస్న కిల దుర్జనలోలజిహ్వా
మూలేషు నిక్షిపతి చేత్ సకలోపకారం' (భామినీవిలాసమ్.)

(e) కాళిదాసు.— "ఆసీనానాం సురభితశిలం నాభిగంధై ర్మృగాణాం" (మే. సం. 1-56)

"నాభిగంధైః కస్తూరీగంధైః తేషాం తదుద్భవత్వాత్ - అత ఏవ మృగనాభిసంజ్ఞా చ. 'మృగనాభిర్మృగమదః కస్తూరీ చ' ఇత్యమరః" అని మల్లినాథ వ్యాఖ్య.

(f) శ్రీ వేటూరి శంకరశాస్త్రిగారు,—'కస్తూరి, మృగముయొక్క అండములనుండి జనించునని కొందరు తలంచిరి' అన్నారు. (చూ. యువ. ఆశ్వయుజ-భారతి. 'కస్తూరి.')

నాభిజము ; అండజము

సండీవనీకర్తలు 'నాభిజము' 'అండజము'-అన్నారు. కాని కస్తూరీ పర్యాయములైన, నాభిజా-అండజా శబ్దములు నిఘంటువులలో ఆకారాంత స్త్రీలింగములుగానే కనబడుచున్నవి. పుంలింగములుగాగాని నపుంసక లింగములుగాగాని కనబడుటలేదు.

(1) 'గంధగులిశ్చ కస్తూరీ మదాహ్వో మృగనాభిజా
కస్తూరికాండజా నాభిర్మృత్రా యోజనగంధికా'
(శాలిగ్రామ నిఘంటువు.)

(2) 'అండజా మృగనాభేః స్యాత్' (మేదిని.)

౧౪. ఖురాసానిపుచ్చలు

(వావిళ్లవారి పాఠము; వ్యాఖ్యానము)

"అలుక నోటక ధట్టికా ఖురపుటీహాల్య స్థురాసానిపుచ్చలు వోఁదున్ని" (1-42).—"కురా...చ్చలు - కురాసాని = కురాసానిదేశములగు మ్లేచ్ఛ లనియెడు, పుచ్చలు = పుచ్చెట్లు, పోఁదున్ని = చెడఁదున్ని."—

(వేదంవారి పాఠము; వ్యాఖ్యానము)

"... హాల్యస్థురాసాని పుచ్చలు *వోఁదున్ని".— "ఖురాసాని పుచ్చలు = ఖురాసాక్-దేశపు పుచ్చకాయలవంటి వగు సశిరస్త్రమ్లేచ్ఛ

---

* వావిళ్లవారి ప్రతిలో, 'వోఁదున్ని' అని పద్యమునను, 'పోఁదున్ని = చెడఁగన్ని' అని టీకలోనుగూడా, 'దు'కు ముందు అరసున్న యున్నది. అది ప్రమాదమూలకము. ఆప్రమాద మల్లే శ్రీ వేదంవారి ప్రతిలోనికిని వచ్చినది.

శిరస్సులను, పోక = పాడగునట్లు, దున్ని.—తురకల శిరములను, పుచ్చ తోఁటలనుంబోలె...దున్నివైచి".—

(1) పద్యమున, కృష్ణరాయడు - ఖురాసాని దేశీయులైన (ఏదిల ఖానుని) సైనికులను తన గుఱ్ఱపుదళములచేత త్రొక్కించి అంత మొందించుట వర్ణ్యము; ఆ సేనల నట్లు ధ్వంసముచేయుట, పుచ్చలుదున్ని పొలము బాగుచేయుటగా చెప్పుట అలంకారము.

యుద్ధపీరుడు ప్రతిభటుల శిరములను నఱుకునుగాని దున్నడు. — పొలమును బాగుపరచ బూనినవాడు, ఆ పొలములోనున్న పుచ్చలు-వెంపలులు మొదలగు చెట్లుచేమలను దున్ని వేయునుగాని, (సశిరస్త్రమ్లేచ్ఛ) 'శిరస్సులను' దున్నడు.

కావున, వేపంవారు ఇటు యుద్ధపక్షమునను, ఇటు వ్యవసాయ పక్షముననుగూడా- (సశిరస్త్రమ్లేచ్ఛ) శిరస్సులను-దున్నినట్లే వ్యాఖ్యానించుట సమంజసము కాదు.

'మ్లేచ్ఛులనియెడి పుచ్చచెట్లు పోదున్ని' అన్న వావిళ్ల వ్యాఖ్యయే సరియైనది. (ఖురాసానిదేశస్థులనుటమాత్రము సరికాదు.)

(2) ఖురాసానిపుచ్చలు - అను రూపకసమాసమునకు, ఖురాసాను లనెడి పుచ్చలు-అని యర్థమగునేగాని, 'ఖురాసానిదేశపు పుచ్చకాయల వంటి వగు సశిరస్త్రమ్లేచ్ఛ శిరస్సులు-అని యర్థము కాదు. కావున వేదం వారు చేసిన అర్థకల్పనము సరియైనది కాదు.

(3) పుచ్చలు-అనగా పుచ్చచెట్లేగాని, పుచ్చకాయలు కావు.— పుచ్చలు, నిమ్మలు, తుమ్మలు, వేపలు-మొదలగు బహువచనాంత శబ్దము లన్నియు వృక్షబోధకములుగాని ఫలబోధకములు కావు.

(i) 'బాపలు తప్పినను వేపలు తప్పవు'—

(ii) 'తుమ్మలలో పొద్దుపొడిచినట్లు' అని లోకోక్తులు.

(iii) 'గౌడపతి సేనయుఁ దా, నుం గలఁగి పాఱె రేఁగులు, దంగేళ్లుగఁ ద్రొక్కికొనుచుఁ దద్దయుభీతిఁ" (కళా. 8-72.)

(iv) "కదలికాచయముఁ దుంగతతులుఁ నా,రంగములు నాదిగ ధరంగలుగునట్టి హృదయంగమ బహుద్రుమ కుడుంగములు పెంచెఁ" (కళా. 4-79)

ఇత్యాదిగా కవిప్రయోగములు. కాబట్టి 'పుచ్చలు=పుచ్చకాయలు' అనుట భాషాసంప్రదాయ విరుద్ధము.

ఇక్కడ ఒక్కమాట.— 'ఆముక్త'లోనే, (6-13) దొగ్గళ్ళు. *గుండిగలు అను బహువచనాంతపదములు, దొగ్గలిచెట్లు-దుండిగపుచెట్లు అన్న యర్థమునకే వాడబడియున్నవి. వేదంవారి టీకగూడా అట్టి యర్థముతోనే నడచినది. కాని, దొగ్గళ్ళు=దొగ్గలిచెట్లు-అని వ్రాసియు, పుచ్చలు=పుచ్చచెట్లు అన్న యర్థము నూహింపలేక పోయినారు.

(4) 'పుచ్చతోఁటలనుంబోలె దున్నివైచి' అనుటయును తప్పే. ఎందువల్లనగా.— వెట్టిపుచ్చ-మంచిపుచ్చ అని పుచ్చ రెండువిధములు. వెట్టిపుచ్చకాయలు కటికిచేదు. మానవులు తినరు. పశువులును తినవు. వెట్టిపుచ్చలు పాలములో తమంతనే మొలచును. ఎవరును పెంచరు. మంచి పుచ్చకాయలు (పండ్లు) తినదగినవి. గ్రైతులు ఫలాభిలాషచే, మంచి పుచ్చవిత్తనములు చల్లి, నీరుకట్టి, ఆ చెట్లను పెంచుదురు. అట్లు పెంప బడునదే పున్నతోట. శ్రమపడి పెంచుకొన్న అట్టి తోటను, ఎట్టి యవివేకియు దున్ని పాడుచేసికొనడు. కావున—'పుచ్చతోఁటలనుంబోలె దున్నివైచి'-అనుట అసంగతము.

౧౫. నాభి; నిర్విషము

"స్వనిదానోగ్రనిదాఘవైఖరినె యూష్మక్ మల్లికల్ కొమ్మనీ
కన దానీల కిచాగ్రపంక్తి నెలయేయల్లాఁ బాపఁగాఁ, బాటలల్
ఘనతం దీయసోనఁ గూర్చె; నడియూఁగాఁ; నాభియుఁ నిర్విషం
బును దోఁయిట్టువులయ్యె వేర్పడ గుణంబిల్లూపఁగాఁ జూడమే?"
---2-67

---

* 'గుండుగలు'-అని ఆయిపువుర పాఠమున్నది. చెట్లు 'దుండిగ' (ము) గాని 'దుండుగ' కాదు. కావున 'గుండుగలు'అనుట సరికాదు. 'దుండిగలు' అనవలెను.

'గుండుగలు=కలుపు మొలకలు' అని వేదంవారి టీక.—దుండుగలు=దుండిగపుఁచెట్లు-అని వావిళ్ళవారి టీక. వావిళ్ళవారిదే సరియైన టీక.

"నాభియుక్=విషమును ('నా మైకదేశ గ్రహణే నామగ్రహణ' మ్మను న్యాయంబున, నాభియే వత్సనాభి), నిర్విషంబును=అమృతంబును, తోఁబుట్టువు అయ్యు=సాగరోత్పన్నము లగుటచేత అన్నదమ్ము లయ్యును, వేర్పడక=భేదపడునట్లు, గుణంబుల్=ఒకటి చంపెడుగుణమును రెండవది ప్రాణమిచ్చు గుణమును, చూపవే = చూపుచున్న విగదా.—గ్రీష్మర్తువులో ఊవిదలు మల్లెలను పాటలములను కొప్పులోఁ దాల్తురు. అందు మల్లెలు... ప్రమదల తలవెండ్రుకల యగ్రములను చీల్పందొడంగుడు,...పాటలలు తామను గ్రీష్మ కారణములే యయ్యును,...ఆ చీలికలను మరల కూర్చినవి. ఇది సరియే. తోఁబుట్టువుల కిట్లు విరుద్ధగుణము లుండునా? యనిన ఉండును. సాగరోత్పన్నము లగుటచేత తోఁబుట్టువులయిన కాలకూటామృతములయందు విరుద్ధగుణములు ప్రసిద్ధములేగదా." అని *సంజీవనీ వ్యాఖ్య.

నాభి, నిర్విషము-అను పదములకు 'సాగరోత్పన్నములయిన కాలకూటము, అమృతము-అని యర్థముచెప్పుట తప్పు. కాలకూటామృతములు భిన్నగుణముల నిచ్చుచుండుట మనము చూచుచున్నాముగదా! అనుట అనుభవమూర్ఖమను మాట. సాగరోత్పన్న కాలకూటమును 'నాభి' యనియు, అమృతమును 'నిర్విష' మనియు పేర్కొన్నకవి ఒక్కడును నాకు కనబడలేదు. ఆ పదముల కట్టివాడుక భాషాలోకమున లేదు.

తత్త్వమేమనగా: 'నాభి' - 'నిర్విషము' అనునవి అంగడిదినుసులుగాని కాలకూటామృతములు కావు. భూమినుండిపుట్టు ఓషధులుగాని సాగరోత్పన్న విషామృతములు కావు. (వత్స) నాభి; కాలకూటము అనునవి రెండును రెండురకములయిన స్థావర విషములు.—

"ప్రుంసి క్లీబే చ కాకోల కాలకూట హలాహలాః
పౌరాణ్ట్రిక శ్చాక్లీకేయో బ్రహ్మపుత్ర ప్రదీపనః
దారదో వత్సనాభశ్చ విషభేదా అమీ నవ." (అమరము)

కాబట్టి, "నాభి = కాలకూట" మనుట సరికాదు.

---

* ఈ వ్యాఖ్య వావిళ్లవారి వ్యాఖ్య ననుసరించి వ్రాయబడినదే.

వత్సనాభము (=నాభి), నిర్విష (=నిర్విషము; అనునవి చెట్లపేళ్లని నిఘంటువులలో స్పష్టముగా చెప్పబడి యున్నది.

(వత్సనాభి)

(1) "వత్సస్యేవ నాభి రస్య వత్సనాభః. వత్సముయొక్క నాభి వలె నుండునది. సింగువార సమ పత్ర వృక్షవిశేష భవః తత్సంబంధివాయు ర్జ్వరప్రదః-వావిలాకువంటి ఆకులుగలిగిన వృక్షమందు పుట్టునది. దీనియందుఁ బుట్టిన వాయువుయొక్క స్పర్శముచేత జ్వరము పుట్టును." (గురు. ప్రభో.)

(2) "వత్సనాభము. An active poison, also called Mith zeher the root of the Aconitum ferox brought from Nepal. వసనాభి." (బ్రౌణ్యము)

(నిర్విష)

(1) "నిర్విషా, నిర్విషి-తృణవిశేషః" (శబ్దకల్పద్రుమము)

(2) "నిర్విషాఽపవిషా చైవ, వివిషా విషహా పరా
విషమంత్రీ విషాభావా, హ్యవిషా విషవైరిణీ.
సం. నిర్విషీ.-సింధీ. నిర్విషీఘాసా." (శాలిగ్రామ నిఘంటువు)

(3) "నిర్విష Kyllingia Monocephala delphinenne denuatum. సం. నిర్విషా. నిర్బిషీ. దీనిని ఫార్సీ భాషలో 'జద్వార్' అందురు. ఇది కొరముగ చేసుగా నుండును. శీతవీర్యము కలది. దీనిదుంప 'నాభి' కొమ్మను బోలి యుండును. మిక్కిలి కఠినముగా నుండును. విషములను హరించును. తేలు, పాము మొదలగువాని విషములను హరించు శక్తిగల దగుటచేత దీనికి నిర్విష మని పేరు." (వస్తుగుణదీపిక.)

నాభీ-నిర్విషమూ, రెండును ఉద్భిజ్జములే. అందువలన నవి తోఁబుట్టువులు. అందు *నాభి (=వత్సనాభము) నిలువున ప్రాణముతీయు కటికివిషము; నిర్విషము-విషహరము.

"అనేన వత్సనాభనామ్నా మహావిషేణ సన్నిధాతోయం, తత్ర మూలాం మజ్జయిత్వా, తయా స వత్సనిం ముఖే చ హన్తవ్యః" (దశకుమార చరితము)

తోఁబుట్టువు లయ్యును, అవి యిట్టి పరస్పరవిరుద్ధగుణములు కలవియై యున్నవి. ఆ రెంటిని వైద్యులు వాడుట కలదు. అందువలన వాటిగుణములు లోకవిశ్రుతములు.

కావున నేకవిరాయలు, తోఁబుట్టువులయ్యును విరుద్ధగుణములుచూపు మ్లేపాటిలల కుదాహరణంగా- అట్టి గుణముల నేచూపు నాభిని-నిర్విషమును చూపినాడు; వాటిగుణములు లోకులెల్ల నెఱిఁగినవే కావున,-"నాభియుఁ నిర్విషంబును దోఁబుట్టువు లయ్యు వేర్వడ గుణంబుల్ నూపఁగాఁ జూడమే" అన్నాఁడు.

కాబట్టి, "నాభి = సాగరోత్పన్న కాలకూటము.— నిర్విషము = ఆమృతము" అని యర్థము చెప్పుట తప్పు.

౧౬. భల్లాతకి

"పల్లచీమల వక్రభల్లాతకియుఁ బోలె
నెల్లగుప్పటి నొప్పు కల్గెవాని" (౬. ౧౯)

"వక్రభల్లాతకియుఁ బోలెఁ = వంపుగింజల జీడిచెట్టువలె (ముంత మామిడిచెట్టు = మొక్క-జీడిచెట్టువలె)" అని సంజీవనీ.

(1) 'వక్ర=పంపుగింజల' అనుట తప్పు. వక్ర=వంకరయైన, భల్లాతకి = జీడిచెట్టు అనుట ఒప్పు.— "వక్ర...బోలెఁ = వంకర జీడిచెట్టువలె" అనియే వావిళ్ళవారి టీక.

(2) 'భల్లాతకి = ముంతమామిడిచెట్టు = మొక్క-జీడిచెట్టు'-అనుట యును తప్పే.

భల్లాతకి (=జీడిచెట్టు), ముంతమామిడిచెట్టు-భిన్న జాతివృక్షములు.- బ్రౌనును, "జీడిచెట్టు-The marking nut plant. ముంతమామిడి (*జీడి మామిడి) చెట్టు-The cushoo nut tree" అని చెప్పియున్నాడు.

ముంతమామిడిపప్పు (Cushoo nuts) తినదగినవి. జీడిగింజలను మానవులు తినరు. పశువులును తినవు. మందులలో వాడుదురు. వాటి రసము సోకినచో శరీరము పెట్టి పుండగును.

---

* శ.ర.కర్త 'జీడిమామిడి = మోరటి (దీని కాయలయందలిదే చాఅపప్పు" అన్నాడు. తప్పు. (మా. ఈ గ్రంథమునసే, పు. 142)

జీడిగింజను సంస్కృతమున 'అరుష్కర' మందురు.— 'అరూంషి వ్రణాఁ కరో తీతి అరుష్కరః. అరుస్సు లనగా వ్రణములు. వానిని చేయునది అని ఆ పదమున కర్థము. (చూ. గురు. ప్రభో.)

కావున వేదంవారి టీక గ్రాహ్యము కాదు.

౧౭. పాడబము

"నానావిధ పాడబముల
నాను నృపాహార మెపుడు నపరాహ్ణమునం
గాని మఖి శుద్ధకోష్ఠతఁ
గాని తమిఁ భుక్తి యెపుడుఁ గడుఁ బథ్యమగుఁ" (4-281)

"నానావిధపాడబములఁ = పలుదెఱంగుల రుచులతో, ♦ఆనునృప ఆహారము=భుజింపఁబడు రాజభోజనము, ఎపుడుఁ=ఎప్పుడును, ఆనుఁ=కూడియుండును. అపరాహ్ణమునఁ = మధ్యాహ్నమున కనంతర మేగాని, మఖి=మఖియు, శుద్ధకోష్ఠతఁ గాని=ఆమాశయపక్వాశయశుద్ధి గొందిగాని, తమిఁ=ఆఁకటితో, భుక్తి=తినుట, ఎపుడుఁ=సదా, కడుఁ=మిక్కిలి, పథ్యమగుఁ = హితమునకు హితమగును"-అని సంజీవనీవ్యాఖ్య.

నే నీ పద్యమును, టీకను పరామర్శించుచూ, ఆంధ్రవారపత్రిక - బహుధాన్య (1918) దసరాసంచికలో, ఇట్లు వివరించియున్నాను.

---

* పాడబశబ్ద పరిశీలనము-అను శీర్షికతో (1952 అక్టోబరు-నవంబరు-డిసెంబరు) త్రిలిఙ్గలో నొక పెద్దవ్యాసము ప్రచురించితిని. ఆ వ్యాసమున కిది సంగ్రహము.

♦ "ఆను నృపాహారము = భుజింపఁబడు రాజభోజనము, ఆనుఁ=కూడియుండును" అని రెండు "ఆను"లతోనున్న టీకయు, 'శుద్ధకోష్ఠతఁ' అన్న మాటకు "ఆమాశయ పక్వాశయ శుద్ధిఁ జెంది" అన్న వివరణమును, "నృపాహార మెపుడు..... "భుక్తి యెపుడు" అని రెండు "ఎపుడు"లతోనున్న పాఠమున్నూ సరియైనవి కావనికూడా నే నా పరామర్శలో తెలిసియున్నాను.

"రాజుల భోజనము పలుతెఱగుల రుచులతో కూడియుండును. కనుక అపరాహ్ణమునసే తినవలయును-అని యర్థముచెప్పుట యుచితము కాదు. రాజులభోజనమే కాదు; ఎవరిభోజనమైనను పలురుచులతో కూడియే యుండునుగాని - ఒక్కరుచితో నుండనే యుండదు.

'పాడబ' మనునది ఒక పానీయవిశేషముగాని రుచి కాదు. అది ఉపహారములలో చేరినది. ఉపాహారములు అపరాహ్ణమున (అనగా 'టిఫిన్' సమయమున)గాని, ఖర్జకోష్ణతక్=పరగడుపునగాని తీసికొనుట మంచిది.

రసాలా రాగ ఖాండవ పాడబము లని పానీయములు వివిధములు. రాగపాడబములను వాల్మీకి, రామాయణమున వాడియున్నాడు.

"తథామ్ల లవణో త్తంసైః వివిధై రాగపాడబైః." (సుందర. 11-15)

వ్యాఖ్య.—"తథేతి.- రాగపాడబైః శర్క-రా క్షౌద్ర ద్రాక్షా దాడిమ మధుర ద్రవ్యాణాం వికారాః విరళరసాః త ఏవవస్త్రగళితాః సాంద్రాః పాడబాః.—తదుక్తమ్ "సితా మధ్వాదిమధురాః రాగాస్తే స్వచ్ఛతాం గతాః; తే సాంద్రాః పాడబా లేహ్యాః తే వస్త్రగళితా ఇతి."— "సితా మధ్వాది మధురో ద్రాక్షా దాడిమజోరసః, విరళశ్చేత్ కృతోరాగః సాంద్రశ్చేత్ పాడబః స్మృతః."

మరియు, బ్రౌను తన నిఘంటువులో పాడబమునకు 'పుడ్డస నిర్మిత భోజనము" అని యర్థముచెప్పి, అందుకు పై 'ఆముక' పద్యమునే యుదాహరించి యున్నాడు. 'పాండురంగ' టీకలో, 'పాడబ=ఆజ్యరసములతో గూడిన పదార్థము' లని యున్నది. అందువల్ల "పాడబ" శబ్దానికి "రుచి" యని యర్థము చెప్పుట యుచితము కాదు. 'నృపాహార' మను పాఠమున్నూ సరియైనది కాదు. 'ఉపాహార'మని యుండనగును".—(ఇది నా వ్యాసములోని సారాంశము.)

ఈ నా వ్యాసమును విమర్శించుచూ,—శ్రీ బులుసు వేంకట రమణయ్యగారు తారణ ఆషాఢ (1944 జూలై) భారతిలో, "పాడబానికి 'రుచి' అనే అర్థము కుదురనప్పుడు పానీయరూపమైన 'ఉపాహార'మనే అర్థముకూడా కుదరదు.—పాడబాలంటే పులుసు" అన్నారు.

తరువాత తారణ ఆశ్వయుజ (1944-అక్టోబరు) భారతిలో, డాక్టరు, చిలుకూరి నారాయణరావుగారు, "పాడబము = పులుసు - అనగూడదు. కుడుము-అనవలె" నన్నారు.

ఆపైని, తారణకారిక (1944-నవంబరు) భారతిలో, శ్రీ నేలటూరి వేంకటరమణయ్యగారు,—శ్రీ వేంకటరాయశాస్త్రిగారు - ''పాడబము = రుచి'' అనుట లోపమే అనుకొనినను ఊని చెప్పదగినది కాదు. 'ప్రాచీను లెవ్వరును శ్రీ బులుసు వేంకటరమణయ్యగారివలె 'పులు' సనియు, శ్రీ నారాయణరావుగారివలె 'కుడు'మనియు చెప్పలేదు. శ్రీ గోవిందరాజుక్కడుదక్క ఇది భక్ష్యమని చెప్పినవా రెవ్వరును లేరు. లేహ్యమని కొందఱు నిర్ణయించిరి. కొని సర్వసామాన్యముగా నందఱును దీనిని పానీయముగనే గ్రహించిరి" అన్నారు.

నా సమాధానము

పాడబము = పులుసు-అనగూడదు గాని, కుడుము-అని చెప్పుటలో తప్పులేదు.

'పాడబాः షడ్రససంయోగకృతా భక్ష్యవిశేషాः' అని చెప్పిన రామాయణవ్యాఖ్యాత శ్రీ గోవిందరాజపండితునిమాట గీటునబుచ్చుట పాటికాదు.

వైద్యనిఘంటుకర్త యగు శివదాసపండితుడును,—''ఖాండవः మధురామ్లలవణ నానానుగంధి ద్రవ్యకృతఖాద్య విశేషే, ఖాండవాः-ఫల మధురామ్ల లవణాः సుస్నిగ్ధద్రవ్యజాः నానావిధాः'' అని చెప్పియున్నాడు.

కాబట్టి, ''గోవిందరాజుక్కడు దక్క ఇది భక్ష్యమని చెప్పినవా రెవ్వరును లేరు'' అనుట పొరపాటు.

పాడబము=కుడుము-అనవచ్చు ననుచు శ్రీ నారాయణరావుగారు,—''పాడబము ఒక తీయని భక్ష్యము; పిండివంట. మిఠాయివస్తువు. పాడవ శబ్దానికి విల్సన్ పండితుడు తన సంస్కృత నిఘంటువులో ''Confectionery, Sweet Meats'' అని యర్థముచ్చాసి, రామాయణ మహాభారతములలో ఈదాహరణము లున్నవని నిరూపించినాడు. పాడవశబ్దమునకు ప్రయోగము సుశ్రుతములో భక్ష్యార్థమున నున్నట్లు తెలిపినాడు....." అని సప్రమాణముగా నిరూపించి యున్నారు.

కాబట్టి, 'పాడబము = భక్ష్యము' అని చెప్పగూడ దనుట తప్పు.

పాడబత్వము

పాడబము లనునవి ఆమ్లలవణాదులును, శక్కర తేనె మొదలగు మధుర ద్రవ్యములునుచేర్చి ద్రవరూపమునను, లేహ్యపాకమునను, భక్ష్య రూపమునను, తుదకు చూర్ణముగను తయారుచేయబడు పదార్థములు. అందుకి క్రిందిగ్రంథములు ప్రమాణము.

రాగఖాండవములు (మోరాబే, మురబ్బా).

"ఆమమాత్రం త్వచాహీనం ద్విస్త్రిర్వా ఖండితం తతః
భృష్ట మాజ్యేనాగ స్తం ఖండపాకేథ యుక్తితః
సుపక్వంచ సముత్తీర్య మరీచై లేందువాసితం
స్థాపితం స్నిగ్ధమృద్భాండే రాగఖాండవ సంజ్ఞితమ్.
పుష్టిదో బలదః పిత్త వా తాస్రారుచి నాశనః
స్నిగ్ధో గురు స్తర్పణశ్చ సుస్వాదూ రాగఖాండవః."

లేహ్యము

"సితా రుచక సింధూత్థైః స వృక్షామ్ల పరూషకైః
జంబూఫలరసై ర్యుక్తో రాగో రాజికయూ కృతః."

"ఖాండవా మధురామ్లాదిరస సంయోగ సంభవాః,
దీపనా బృంహణా రుచ్యా స్త్రీణాం హృద్యా శ్చ్యవాపహాః."

ఇతి నానాఖాండవాః (యోగరత్నాకరము.)

చూర్ణము

"కోమలామలకజం చూర్ణం ఖండ్యేలా శర్కరాన్వితమ్,
మాతులుంగ సమే నాత్తం శోషితం సూర్యరశ్మిభిః."

"ఏవంతు బహుశోభ్యక్తం శోషితంచ పునఃపునః
ఈషల్లవణ సంయుక్తం చూర్ణం ఖాడవ ముచ్యతే."

(క్షేమకాతూహలమ్.)

పానీయము

పాడవము (=ఖాండవము) తాపశాంతికై గ్రీష్మర్తువున సేవింపదగిన పానీయ మని వాగ్భట సూత్రస్థానమున ఈ క్రింది శ్లోకరూపమున చెప్పబడి యున్నది.

"పిబే ద్రసం నాతిఘనం రసాణాం రాగఖాండవకౌ
పానకం పంచసారం వా నవమృద్భాజన స్థితమ్."

(గ్రీష్మర్తుచర్య)

పాడబము పానీయరూపమున తగురాయచేయబమటయు కలదు. కావున "పరిశీలించిచూస్తే పాడబానికి 'రుచి' అనే అర్థము కుదరనట్లే, పానీయ (రూపమైన 'ఉపాహార') మనే అర్థముకూడా కుదరదు. పాడబ మనగా పులుసు" అన్న 'బులుసు'వారి వాదము నిరాకరము; నీరసమున్నూ.

శబ్దవిచారణ

౧. ఉప్పుదనము

(పు. 141) 'లావణ్యకలనక.—లావణ్య = ఉప్పుదనముయొక్క' అని సంజీవనీవ్యాఖ్య.

ఆ శాస్త్రిగారు, ఆమరుకము (అనుబంధము)లోగూడా, —'లావణ్య మనగా కాంతి; ఉప్పుదనము' అనియే అన్నారు.

'ఉప్పుదనము' అనవలెగాని 'ఉప్పుదనము' అనగూడదు.

ఉప్పు=లవణము. ఉప్పుయొక్క గుణము 'ఉప్పన'(రసము). ఉప్ప-గుణవాచకము. ఉప్ప + తనము = ఉప్పుదనము.

ఉప్పనీరు; ఉప్పనినీరు; ఉప్పనిది; ఆ బావినీళ్లు ఉప్పగా నుండును-ఇత్యాదిగా వాడుక. "ఉప్పదనము or ఉప్పన saltness."— 'వుప్పని మాట చప్పనిమాటచెప్పి-By fair means or foul" అని శ్రౌణ్యము.

ఉ. 'ఊరును బేరు లేని యొక యుప్పని చప్పని కావ్యమల్లు సిం
గారపుగైతగాండ్రు' (శ్రీతిరుపతికవుల బుద్ధచరిత్ర. 1-12)

౨. కరటము

2-41 క్రింద 'లహరి = పెద్దయలల (పెద్ద కరటముల)యొక్క' అన్నారు.

'అల' యను అర్థమిచ్చుపదము 'కెరటము'గాని 'కరటము' కాదు.

కరటము (సంస్కృతము) = కాకి. కెరటము (దేశ్యము) = అల. 'కెరట్టము', పూర్వ నిఘంటువులలోనేకాదు నేటి నిఘంటువయిన నూ.ని. లోను లేదు; కాని, ఉత్తరసర్కారులలో వ్యవహారమునను, ఈనాటి రచనలలోను విరివిగా ఉన్నది.

1. ప్రభవశ్రావణ-భారతి.—"కమ్మతెమ్మెర కెరటాల కలతలోన." (పూడిపెద్ది వెంకటరమణయ్యగారు.)

2. ఆంధ్రి-(పత్రిక) ప్రమాధికారికి.—"ముతికిదొరువులలోని బురద నీటి కెరటములపై నీద ముతియునట్లు." (కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు.)

3. విభవభాద్రపద-భారతి; 'భావకవిత్వము.'— "గంగాపదము తాగగ. ఆది నాలో గొల్లగూడెము, ఉండదో-ఉండదో అని కెరటములచే ఘోషించును." (వేలూరి శివరామశాస్త్రిగారు.)

4. చిత్రాశ్వీయము.—(పీఠిక. పు. VI.) "పైకి, లేచి విరిసిన కెరటాల లేతగాడ్పు." (కోట వీరాంజనేయ శర్మగారు.)

5. విష్ణుధనువు (కావ్యము.) పుట 16— "అలలై-లయల కెరటాల రీతి ఎగురుచు." (ఉమావిజయ మహేశ్వరంగారు)

6. ఈశ్వర ఉగాదిసంచిక—'కుంతీకుమారి',—

'ఏటి కెరటాలలో పెట్టె యేగుచుండ
సుదతి కనుచూపు మేరకు చూచి చూచి.'

(జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు.)

వేదంవారు తమ కథాసరిత్సాగరము ప్రథమ ముద్రణము (1892సం.) పీఠికలోకూడా—"రెనాల్డు మొదలగువారి నావెల్సు,...బృహత్కథ యను మహాసముద్రములో ఒక 'కరట'మైనను గానేరవు" అని వ్రాసియున్నారు.

3. అడ్డుకొయ్య

౨-౧౦ క్రింద,- "గందపట్టెలు = కవాట తిర్యగ్గారవిశేషములు" అన్నాగు వాఁ నిర్ణీవారు.— "గందపట్టెలు = తలుపుమీఁద నమర్చిన యడ్డు కొయ్యలు" అన్నారు వేదంవారు.

శ.గ.లో,-"గందపట్టె = తలుపుమీఁద నమర్చెడి యడ్డుకొయ్య" అని యున్నది. * ఆ మాటలనే తీసికొన్నారు వేదంవారు.

కాని 'అడ్డుకొయ్య'-అనుట తప్పు. గందపట్టె, తలుపుమీఁద అడ్డముగా నమర్పబడునుగాని 'అడ్డు'గా నమర్పబడదు.

(a) ♦"గందపట్టెలు Cross pieces of wood, at the back of a door" (గ్రాంథ్యము.)

(b) "ఆ ధాత్రీశు వక్షఃకవాటముపై నెపాకొ గందపట్టెగతి నుండఁ నాఁగు కే ల్సెస్సుటల్." (కళా. 7-110)

అడ్డముగా అమర్పబడు కొయ్య 'అడ్డకొయ్య' అగునుగాని 'అడ్డు కొయ్య' కాదు. అడ్డము; అడ్డు-అను పదముల కర్థములో భేదమున్నది.

అడ్డము = వెడలుపు (నిలువునకు వ్యతిరేకము), తిర్యక్కు.

అడ్డు = నిరోధము.

కొయ్యటి, అడ్డకొయ్య; అడ్డబొట్టు; అడ్డకమ్మి మున్నగు పదములను అడ్డుకొయ్య, అడ్డుబొట్టు, అడ్డుకమ్మి-అనగూడదు.

అడ్డము = తిర్యక్కు, అనుటకు,—

(1) "అడ్డంబు నిడుపు నా పడ్డలగతి" (మను. 2-7)

(2) "నా మడ్డంబు గదల్చి" (హర. 2-58)

మోము అడ్డంబుగదల్చి-అనగా, తల యీ ప్రక్కకును-ఆ ప్రక్కకును అడ్డముగా ఆడించి-యని యర్థము. — †అడ్డుగా కదలించి-యనరాదు.

---

* వే. వేం. శాస్త్రిగారివలెనే, నూ. ని.యును-గందపట్టె=తలుపు మీఁద నమర్చెడి యడ్డుకొయ్య' అని శ.ర.లోని మాటలనే గ్రహించుకొన్నది.

♦గందపట్టెలు-at the front-అని యుండనగును.

† నూ.ని. 'అడ్డముగా=అడ్డుగా-కదల్చి" అనియే అర్థము చెప్పినది. సరికాదు.

(3) "పిశితఖండంబులు బగబగనమండు చిదుగు సాదమంటల కడ్డంబువట్టి" (మను. 4-60)

"అడ్డంబువట్టి=అడ్డముగా ప్రవేలబట్టి" అని జగ్గాలారివారి లీక.
నుంటల కడ్డుగా ప్రవేలబట్టి—అని చెప్పగూడదు.

(4) "అడ్డ మానుమూళ్లు, నిలువు తొన్మిదిమూళ్లు" (సూర్యనారాయణులు)

అడ్డు = నిరోధము-అనుటకు, —

(1) "పొర నేత్రముల కడ్డుచొరక మున్న" (కాశీ. 1-వ.)

'అడ్డుచొచ్చు=అడ్డుగా చొచ్చు'-అని సూ.ని. వివరణము.

(2) 'వాడి మాట కడ్డులేదు' అని వ్యవహారము.

కాబట్టి 'అడ్డము' అన్న యర్థమున 'అడ్డు' అను పదమును వాడరాదనియు, అడ్డకొయ్యను—అడ్డుకొయ్య-అనగూడదని కూ సూర్యనారాయణ.

వేదంవారు, శృం.నై.లో కూడా,— "అంగాహారగత్వే తీర్థ ప్రసితయు గోపురద్వారకవాటగుర్వర్థ తిరశ్ప్రసారితయు" (1-59) అన్నచోట,— 'తిరశ్ = అడ్డుగా, ప్రసారితయును = విస్తరిల్లినవై యుండుటను' అన్నారు.

కవాటము, తిరశ్ప్రసారిత = అడ్డము(వెడలుపు)గా ప్రసరించినది కలదిగాని, అడ్డుగా ప్రసరించుటకలది కాదు. కావున, 'అడ్డుగా-విస్తరిల్లిన' దనుట సరికాదు.

'తిర' శ్శబ్దమునకు 'అడ్డముగా' ననియే అర్థము.—

"తిర్యగర్థే సాచి తిరోపి. సాచి, తిరశ్ ఈ రెంటిని అడ్డముగా ననునర్థమునందు వర్ణించును." అని గురు. ప్రభో. వివరణము.

కాబట్టి, 'తిరశ్ = అడ్డుగా' అని చెప్పుట తప్పు.

మరియు, వారు (5-62) క్రింద,—"పాముకొళ్లు దేహముపార్శ్వమును నను అడ్డుగా తగడులవలె నుండును" అన్నారు.

పాముకొళ్లు దానిదేహము పార్శ్వమునను-అడ్డముగా నుండును గాని అడ్డుగా (నిరోధముగా) నుండవు. కావున, ఆ టీక యొప్పదు.

ఒక విశేషము: అడ్డు (నిరోధము) అన్న యర్థమున 'అడ్డము'ను వాడవచ్చునుగాని, అడ్డము (తిర్యక్కు) అను నర్థమున 'అడ్డు'ను వాడరాదు.

అలంకారవిచారణ

సర్వంకషా వ్యాఖ్యలోవలెనే సంజీవనీ వ్యాఖ్యలోను అలంకారనిర్ణయమున పొరపాటులు జరిగియున్నవి. గ్రంథ విస్తర భయముచే మచ్చున కొక్కటిమాత్ర మిందు చూపు చున్నాను.

౧. ఉపమ

గీ. "మంత్రభృత్య, భూతభూతా త్త శాంభవ భూమికుండు." (2-39)

"మంత్రములచేత సేవకు లయినట్టి బూచులచేత (బూచులమూల ముగా) పొందఁబడిన శివసంబంధియైన వేషముకలవాఁడు—(భూతములను పనిగొనుచు అపరశివుఁడో యన నున్నాఁడనుట.-ఉపమ." (సంజీవని.)

(బూచులమూలముగా పొందఁబడిన) శివసంబంధియైన వేషము కల వాఁడు-అన్న వాక్యమున నిజముగా అలంకారము లేదు. 'ఉపమ' యఁట! అది యెక్కఁడ? పద్యములోనా? వివరణ వాక్యములోనా?

'అపరశివుఁడో యన నున్నాఁడు' అంటే ఉపమయగునా? ఉపమకు-అపరశివు డొక డుండవలెగదా! ఉన్నాడా? ఆతడే లేనప్పుడు ఉపమించు టెట్లు?

ఎందుకు విస్తరము.—'అపరశివుఁడో యన నున్నాఁడు' అనునది, ఒక ఊహ. ఊహ ఉత్ప్రేక్ష యగునుగాని 'ఉపమ' కాదు.

ఆయుత్ప్రేక్షయైనను - శాస్త్రిగారి వివరణ వాక్యములోనేగాని - పద్యములో లేదు. వ్యాఖ్యాత అలంకారమును చెప్పవలసినది మూలమునకు గాని తన సొంతవాక్యమునకు కాదు.

దీపాల పిచ్చయ్యశాస్త్రికృత సాహిత్యసమీక్షలో
కావ్యములు ; వ్యాఖ్యానములు
అను భాగము సమాప్తము.

కూర్పులు, మార్పులు

పుట 156లో,-చనవరి = కొలువుకొండు, సేవకుఁడు - అనుటకు,— మడికిసింగన సకలనీతిసమ్మతమున రాజనీతిలో,—

(1) ''జనటాయుగాంధ్రును జనవరిలెంకలు-రాష్ట్రికంటకులు పీరల నృపాలుఁ, డెపుడు మాన్పక సాగనిచ్చిన.....అల్పుల నదలించి తినియు, లంచములుగొన్న ధరయెల్లఁ బాడుగాదె?'' (పద్యసంఖ్య 196)

చనవరిలెంకలు-అనగా 'చనవరు' లనబడు సేవకు లన్నమాట.

(2) ''క్షత్రియుఁ గోపింప ఖడ్గముఁజూపుఁ జు
ట్టముఁ జనవరియు నోడరు భజింప,...
కాన నిట్టివిధము మానవులకు నధి
కార మిగి చెరవుకలిమి గాదు.'' (ప.సం. 215)

పుట 58లో,—పండ్లుకొఱుకుట-కోపలక్షణ మనుటకు,—
''పాఱు తెంచికీరంబులు పండ్లుగఱువ'' (శృం. నై. 1-96)

'పండ్లుగఱువ = ఫలములను కొట్టఁగా (కోపముచే పటపట పండ్లు కొఱుకఁగా-అనియు)' వేదంవారి వ్యాఖ్య. 'పండ్లుకొఱుకుట అసూయా లక్షణ' మన్న వా రీయుదాహరణమును చిత్తగింతురుగాక.

పుట 66 లో ''కడలేని... ..ముసుఁగుదన్న'' అన్నచోట, అర్థ మిట్లు చెప్పికోవలెను.

పీడ్యంబు కప్పు = విడెమువల్ల కలిగిన నలుపు, చందురకొవిమోవి పల్లాతులన్ = ఎఱ్ఱని మోవియందలి పలుసొక్కులను, ముసుఁగుదన్న = కప్పిపెట్టఁగా.

విడెపురంగును నలుపుగాచెప్పుట కలదు.—

(1) ''మృగమదము మించు తమలంపు టిరులు మోవి, దళముగా'' (ఆము క్త. ౪-౧౩౫)

(2) ''దరహాసములఁ దోఁచు తాంబూలసేవాంధ
కారితాధరరదక్షతుల యొఱపు'' (మను. 6-44)

తాంబూలసేవా = తాంబూల సేవనముచేత (=తాంబూలపు కప్పు చేత) ఆంధ్రకారిత=కనబడకుండా చేయబడిన, అధర దంతక్షతుల యొఱపు-అని యర్థము.

పుట. 92-'ఆనలువెట్టు' అనుటకు.—(కళా. ౬. ౬౬)

"పలికిన నేను నీతలఁపుపద్ధతిగా కిపుడేమి మాఱి వ
ర్తిలితిఁ *దొడింబడక నిను వధింపఁగవచ్చెదనో యటంచు నా
కలఁగుచు రాకమానుమని యానలువెట్టఁగ." శ.ర. పా.

పుట. 100 లో,—వలరాచవారు = మన్మథుడు-అనుటకు.—

"అతివ తొడలును, జఘనంబు లరసిచూడఁ
గొమరుమీఱెడు జమిలితొండమువ శిరసు
తోడి వలరాచవారి యద్భుతపుహస్తి
యగ్రభాగంబు చూపఁ కొత్తఁ దోఁప." (కళా. 7-133)

పుట. 166 లో,-కుట్టిమములు మేడమీది ప్రదేశము లనుటకు,—

"అధఃకృ తాంభోధర మండలానాంయస్యాం శతాంకోపలకుట్టిమానామ్;
జ్యోత్స్నానిపాతాత్ క్షుభితాం పయోభిఃకేలీపదం వృద్ధి మురీకరోతి."

కుట్టిమ-శబ్దము,—రత్నాలుచెక్కిన కిరీటప్రదేశమునందును వర్తించు నని యీక్రింది పద్యము చెప్పుచున్నది.

"కిటభరిపునకు సురవర
కోటీర తటాగ్ర రత్నకుట్టిమ కిరణం
బాటోప కిరణరంజిత
పాటలిత విరాజమానపదపద్మునకున్."
(సకలనీతిసమ్మతము-ప. సం. 288)

కాఁబట్టి, 'కుట్టిమము = తాతికట్టినపు నేల' అనుటయు,—'శిలా రత్నాది నిబద్ధభూమి' అనుటయు సరికాదు.

---

*తొడింబడిక-అని వావిళ్ల పా.

పుట 111, 266.—పొగరు = నీలకాంతి - యనుటకు,—

క. "కరము పొగరెక్కి నంబర
మురువిద్యుద్దీపకళిక లుమిసిన ధూమ
స్ఫురణం బొగచూరె ననఁగా
హరిమణిజంబూఫలాసితామలరుచులక్" ('ఆము'-4-138)

పుట 240.—రేవంతుఁడు = గుహ్యకు డనుటకు,—

"రేవంతప్రముఖ గుహ్యకులను,...నలకూబరుండు రావించె" (మను. 5-55)

పుట 276లో,—'అవ్వలించు' అను క్రియను, సూ.ని.-ద్వి.సం.లో,-ప్ర.సం. అనుబంధములో చూపియున్నది. (నే నిట్టివల చూచినాను.)

పుట. 256-"కమ్మపంజుల వజ్రపుం జకచకల" అన్న 'మను' వచన వాక్యము,—

"కమ్మపంజుల=దివిటీలవలె వెలుఁగుచున్న కమ్మలయందలి, వజ్రపుం జకచకల = మగరాల కాంతులచేత" అని 'వావిళ్ల'వారి టీక. 'ఆనంద' వారి టీకయు నిదే.

కాని, 'కమ్మపంజు' అను పదములోని 'పంజు'కు 'దివిటీ' యని అర్థము చెప్పుచో, ఆ కమ్మ, పంజువలె వెలుగు వట్టి 'కమ్మ' యగునే గాని రత్నాలకమ్మ కానేరదు. అప్పుడు, అందు మగరాలున్నట్లు వర్ణించుట పొసగదు.

కావున ఆ కమ్మను రత్నతాటంకముగానే చెప్పవలెను. అట్లు చెప్పుటకు 'పంజు'కు మగరాలకట్టుబడి యనియే అర్థము చెప్పవలెను.

అందువల్లనే 'జూలూరి' వారు, దివిటీప్రస్తావమే యెత్తలేదు.—"కమ్మపంజుల...చకల=పంజులతాటంకములయందలి హీరమణులయొక్క—" అని మాత్రమే టీక వ్రాసినారు.

ఈ క్రింది పదములు పుట 277 లో చేర్పదగినవి :

1ర. అగ్రపుస్తకము

భారతములో,— "అగ్రపుస్తకంబు లర్చించి చూచుచు" అని (ద్రోణ. 2-345) యున్నది.

నూ.ని.లో, 'అగ్రపుస్తకము' లేదు.

1ళ. కరూశము

భాస్కర రామాయణములో,- "మలకలితమైన దేశము, మలదంబు కరూశయుక్త మహిగలదేశం, బలవడఁ గరూశము" (బాల. 33) అని యున్నది.

శ.ర., నూ.ని., వా.ని. కూడా "కరూశము = ఒక దేశము" అని మాత్రమే చెప్పినవి. ఒక దేశము - అను నర్థము పైపద్యమున సరిపడునా?

పుట 317లో,— '...బునంబొందు' అనుటకు, నన్నె. కు. సం. ప్రయోగము.—

"దివ్యశక్తు లెంతశేషంబులయ్యును...అతికోమలంబైన కామశక్తికి లోనై మృగుభావంబునం బొందు" (4-78)